# కోర్టు తీర్పులు సామాజిక న్యాయం

కె. బాలగోపాల్



HRF



# కోర్టు తీర్పులు - సామాజిక న్యాయం

కె. బాలగోపాల్

మానవహక్కుల వేదిక ప్రచురణ

"భారతదేశమంతటి వైవిధ్యము, సంక్లిష్టత ఉన్న దేశ పాలన గురించి ఆలోచించేటప్పుడు ఉండవలసిన విశాల దృక్పథం ఈ తరం న్యాయమూర్తులలో చాలా అరుదు. ప్రత్యేకించి సమానత, సామాజిక న్యాయం అనే భావాల పట్ల వ్యతిరేక వైఖరి – రాజ్యాంగంలో వాటికింకా చోటు ఉంది కాబట్టి అప్పుడప్పుడు వాటి దిశగా ఒక నమస్కారం పారేయడం తప్పనిసరైనప్పటికీ – న్యాయస్థానాలలో చాలా మామూలు విషయం అయిపోయింది.

....

ఒక నేరాన్ని విచారించే జడ్జి తాను దేశాన్ని కాపాడే పోరాటంలో పాల్గొంటున్నానని అనుభూతి చెందుతూ ఆ పనిచేస్తే, బోనులో నిలబడ్డ వ్యక్తికి న్యాయం చేస్తాడన్న భరోసా లేదు. ఆ నేరం జరిగిన సందర్భం భయానకమైనదే కావచ్చు. నేరం ఘోరమైనదే కావచ్చు. అయినప్పటికీ న్యాయమూర్తి చేయవలసింది ఆ ఘోరానికి జవాబు చెప్పడం కాదు, తన ఎదుట నిలబడ్డ వ్యక్తి పాత్ర ఏమిటో నిర్ధారించి సముచితంగా శిక్షించడం మాత్రమే. ఇదేదో టెక్నికల్ విషయం అనుకోవడం చాలా పొరబాటవుతుంది. ఈ దృష్టితో పని చేయకుంటే వ్యక్తి స్వేచ్ఛకూ ప్రాణానికీ భరోసా ఉండదు.

....

న్యాయస్థానాల ప్రతిష్ఠను దిగజార్చే విధంగా మాట్లాడితే అది కోర్టు ధిక్కారం అవుతుందని శాస్త్రం చెప్తుంది. దానికి శిక్ష అవసరం అంటుంది. న్యాయస్థానాలకు ఉండే సున్నితమైన స్థానం దృష్ట్యా వేరే ఏ వ్యవస్థకూ లేని అధికారం న్యాయస్థానాలకు ఉండాలన్న వాదనలో కొంత పస లేకపోలేదు గానీ న్యాయస్థానాలు తమ ప్రతిష్ఠకు భంగం కలగకుండా వ్యవహరించడమే వాటి ప్రతిష్ఠను కాపాడుకోవడానికి తగిన మార్గం తప్ప విమర్శను కోర్టు ధిక్కారంగా పరిగణించే అధికారం వాటికి కట్టబెట్టడం కాదు. న్యాయస్థానాల ఆదేశాలను అతిక్రమించే చర్యలకు మాత్రమే కోర్టు ధిక్కార నేరాన్ని పరిమితం చేయాలి తప్ప విమర్శకూ, న్యాయసిద్ధాంత సంవాదానికీ దానిని వర్తింపచేయకూడదు."

**కె. బాలగోపాల్**

# కోర్టు తీర్పులు - సామాజిక న్యాయం

మానవహక్కుల వేదిక ప్రచురణ

**Human Rights Forum Publication**

కవర్ : అనంతు

ప్రచురణ సంఖ్య: 53

ప్రచురణ కాలం : అక్టోబర్ 2022

వెల : 250 రూపాయలు

**ముద్రణ :**

అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ,

126 శాంతినగర్, హైదరాబాద్ - 28

ఫోన్ : 23391364, 233041941

Email: anupamaprinters@yahoo.co.in

**ప్రతులకు:**

వి. వసంతలక్ష్మి

Email: vasantha.aj@gmail.com

**నవోదయ 9000413413, నవ తెలంగాణ 9490099378,**

**ప్రజాశక్తి బుక్‌హౌస్ 9490099057**

మా వెబ్‌సైట్: www.humanrightsforum.org

బాలగోపాల్ రచనల కోసం : www.balagopal.org

# మా మాట

చట్టాల్లోనే కాదు, తీర్పుల్లోను న్యాయం కోసం వెతికే 'న్యాయ'వాది బాలగోపాల్.

మరీ ముఖ్యంగా ప్రజల్ని పెద్దఎత్తున ప్రభావితం చేయగల తీర్పుల్ని ఆయన నిశితంగా పరిశీలించకుండా ఎప్పుడూ వదిలిపెట్టలేదు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ప్రజలు అనే మూడు గీటురాళ్ళ మీద వాటిని పరీక్షించి అవి మేలు చేసేవా, కీడు చేసేవా అని నిగ్గుదేల్చడం హక్కుల కార్యక్షేత్రంలో ఆయనకు అలవాటైన పని. రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధమైన వాటిని విమర్శిస్తూ ప్రజాహితమైన వాటిని స్వాగతిస్తూ ఆయన రాసిన అనేక వ్యాసాల సంపుటి ఇది. దురదృష్టవశాత్తూ మొదటి కోవకు చెందిన తీర్పులే మన దేశంలో ఎక్కువ ఉన్నాయని ఈ వ్యాసాలు చదివితే అర్థమవుతుంది.

కోర్టు తీర్పుల్ని విమర్శించడానికి చాలామంది భయపడతారు. అది కోర్టు ధిక్కారమవుతుందని జంకుతారు. కాని కోర్టులు చెప్పిన తీర్పులే అంతిమ తీర్పులు కాదని, వాటిలోని న్యాయాన్యాయాల గురించి చర్చించే హక్కు, అవసరమైతే ఒత్తిడి పెట్టి మార్పించే హక్కు ప్రజాభిప్రాయానికి ఉందని బాలగోపాల్ ప్రగాఢ నమ్మకం. "న్యాయస్థానానికి ఇవ్వాల్సిన గౌరవం ఇయ్యవలసిందే గానీ అది ఒకానొక చారిత్రక దశలో మనుషులు తమ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసుకొన్న ఒకానొక వ్యవస్థ మాత్రమేనని గుర్తించక సత్యానికీ, న్యాయానికీ దానిని ఒక అంతిమ ప్రమాణంగా భావించడం విజ్ఞులకు తగదు" అని న్యాయవ్యవస్థ పట్ల నిష్కర్షగానే తన అభిప్రాయం చెప్పారు.

ఒకటి రెండు మినహా ఈ వ్యాసాలన్నీ ప్రధానంగా 1999 – 2009 మధ్య రాసినవి. వీటిని మేము రెండు సెక్షన్ లుగా విడదీసి ఒక దాన్లో కోర్టు తీర్పుల మీద రాసిన వ్యాసాలను, రెండో దాన్లో వకీళ్ళ మీద, జడ్జిల మీద రాసిన వ్యాసాలను చేర్చాం. ఒక అంశం మీద ఎక్కువ వ్యాసాలున్నపుడు పాఠకుల సౌలభ్యం కోసం వాటిని ప్రత్యేక విభాగాలు చేశాం. ఇప్పటికే బాలగోపాల్ గారి పుస్తకాలు కొన్నవాళ్ళకు,

ముఖ్యంగా 'రిజర్వేషన్స్: ప్రజాస్వామిక దృక్పథం' పుస్తకం కొన్నవాళ్ళకు ఇందులో కొన్ని వ్యాసాలు పునరావృతం అయినట్టు అనిపించొచ్చు. కాని వాటిని తీసేస్తే సామాజిక న్యాయ దృష్టికోణం నుండి కోర్టు తీర్పుల మీద బాలగోపాల్ చేసిన పరిశీలనలు, వెల్లడించిన అభిప్రాయాలు సమగ్రంగా ఉండవన్న ఉద్దేశంతో ఉంచేశాం.

ఈ పుస్తకానికి మూడు ముందుమాటలు ఎందుకు ఉన్నాయో కూడా మీకు చెప్పాలి. దానికి కారణం లాయర్‌గా బాలగోపాల్‌ను న్యాయమూర్తులు, ఇతర లాయర్లు ఎలా చూసారో తెలుసుకోవడం కోసం. హక్కుల చిరునామాగా, లెక్కల మేధావిగా, సాహిత్యకారుడిగా, విశ్లేషకుడిగా, ప్రజాహితుడిగా ఆయన చాలామందికి తెలుసు. కాని న్యాయవాదిగా ఆయన్ని ఎరిగిన వాళ్ళు కోర్టులో ఆయన పనిని ఎలా బేరీజు వేస్తారో మనలో చాలామందికి తెలియదు. అలా తెలుసుకునే అవకాశం జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారి వ్యాసం వల్ల, లాయర్ వసుధ నాగరాజ్ గతంలో ఇచ్చిన ఒక ఉపన్యాసం వల్ల కలిగింది. అందుకే రెండోది కొంచం పెద్దదైనప్పటికీ ఈ పుస్తకంలో ఉండడమే సరైనదని భావించి చేర్చాం. మా సభ్యుడు, సీనియర్ లాయర్ అయిన గొర్రెపాటి మాధవరావు సామాజిక న్యాయభావన నేపథ్యాన్ని వివరిస్తూ చేసిన విశ్లేషణ మూడోది.

ఈ వ్యాసాలలోని ప్రజా దృష్టికోణం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు కాని న్యాయస్థానాల వైఖరి గురించి, జడ్జిల వైఖరి గురించి బాలగోపాల్ చేసిన విమర్శలు కొందరికి కటువుగా అనిపించవచ్చు. అయితే దాని వెనక ప్రజాస్వామ్య మూలస్తంభాలలో అతి ముఖ్యమైనదే కాక, ప్రజలకు చివరి ఆశగా నిలుస్తున్న న్యాయస్థానాలు తమ బాధ్యతలను సక్రమంగా నెరవేర్చడం లేదన్న బాధే ఎక్కువ ఉంది. "ఒక జీవోలో ఉండవలసిన వివరాలన్నీ రాజ్యాంగంలోనే రాసుకోవలసిన అగత్యం ఏర్పడడానికి రాజ్యాంగ విలువల స్ఫూర్తి సమాజంలోనూ, పాలనా యంత్రాంగంలోనే కాదు, న్యాయస్థానాలలోనూ కొరవడడం తప్ప వేరే కారణం లేదు" అనడంలో ఆ బాధ వ్యక్తమవుతుంది. బాలగోపాల్ విమర్శల స్ఫూర్తి అందరికీ అర్థమవుతుందని ఆశిస్తాం.

**మానవహక్కుల వేదిక**

16.9.2022

# ఇందులో...


కాలం చెల్లని ఆదర్శవాది ........................................ 9
ఒక ఎకరా 30 సెంట్ల ప్రజల లాయర్ ........................................ 14
ప్రజాస్వామ్య పరిణతితోనే సాధ్యం ........................................ 30


## సెక్షన్ 1


1. కన్యాశుల్కం–రాజ్యం–రాజ్యాంగయంత్రం ........................................ 39
2. బంద్‌లు, కోర్టులు, ప్రజాస్వామ్యం ........................................ 42
3. రాజ్‌కుమార్ కిడ్నాప్: సుప్రీంకోర్టు నష్టం చేయకుంటే ఉద్ధరించినట్లే..... 46
4. మనుషులు లేని పర్యావరణం ........................................ 50
5. కోర్టు తీర్పులు–సామాజిక న్యాయం ........................................ 53
6. విద్యుత్ చార్జీల తీర్పు: కోర్టు పరిధికి సంకుచిత వ్యాఖ్య ........................................ 58
7. న్యాయానికివి రోజులు కావు ........................................ 85
8. ఎన్నికలలో పోటీ చేయడానికి నేరస్తులందరూ అనర్హులేనా? ........................................ 89
9. సమ్మె హక్కు: న్యాయమూర్తుల అధిక ప్రసంగం, ఉద్యోగ సంఘాల నిర్వ్యాపకత్వం ........................................ 93
10. విజ్ఞత కోల్పోతున్న కోర్టులు ........................................ 104
11. న్యాయమూర్తులూ ఆలోచించండి... అన్నీ మీరే పరిష్కరించగలరా! ..... 108
12. అగ్రకుల దురహంకారాన్ని హైకోర్టు మన్నించటం లజ్జాకరం ........................................ 115
13. వాకపల్లి–కోర్టులు ........................................ 120
14. రోగులకు సమాచార హక్కు ........................................ 130
15. భావజాల శృంఖలాలలో న్యాయవ్యవస్థ ........................................ 135
16. 377 సెక్షన్ : ఢిల్లీ హైకోర్టు మంచి పని చేసింది ........................................ 139


## ఎన్‌కౌంటర్లు


17. ఎన్‌కౌంటర్లు: ప్రజల నిస్సహాయత, న్యాయవ్యవస్థ అనాసక్తి ........................................ 143
18. హత్య చేసి ఎదురు కాల్పులంటే సరిపోతుందా? ........................................ 157
19. సహజ న్యాయమా... పోలీసు న్యాయమా? ........................................ 163

**నర్మదా బచావో ఆందోళన్**


20. చర్చ కూడ కోర్టు ధిక్కారమేనా? ........................................ 168
21. సర్దార్ సరోవర్ ప్రాజెక్ట్: సుప్రీంకోర్టు కళ్ళకు ‘అభివృద్ధి’ గంతలు ....... 173
22. నర్మదా ఆందోళనను సుప్రీంకోర్టు పరిష్కరించగలదా? .................. 191


**ఉరిశిక్ష**


23. ‘జుడీషియల్ మర్డర్’ .......................................................... 196
24. డిసెంబర్ 13: దానికి ప్రతీకారం ........................................... 215
25. ఎవరికి సంకేతాలు పంపడానికి అఫ్జల్‌ను ఉరి తీయాలి? ................ 218


**రిజర్వేషన్లు**


26. రిజర్వేషన్లు దళితుల ప్రజాస్వామిక హక్కు .................................. 224
27. రిజర్వేషన్లు: సుప్రీంకోర్టు రాజకీయాలు ...................................... 248
28. విద్యా సంస్థలలో రిజర్వేషన్లు కాపాడుకుందాం ................................ 251
29. ABCD పైన సుప్రీంకోర్టు తీర్పు: విజ్ఞత లేదు, తర్కమూ లేదు ........... 255
30. సమాన విద్యావకాశాలకు సుప్రీంకోర్టు కూడ ఆటంకమైతే ఎలా? ...... 264
31. ముస్లింలు, బి.సి.లు, రిజర్వేషన్లు ............................................. 271
32. ముస్లిం రిజర్వేషన్‌ను అడ్డుకోవడమంటే
సామాజిక న్యాయాన్ని బలహీనపర్చడమే ........................................ 276
33. రిజర్వేషన్లు: న్యాయస్థానాల వైఖరే అసలు సమస్య ........................ 282
34. ఈ తీర్పుతోనూ సమస్యలున్నాయి ................................................ 295
35. ఒ.బి.సి.ల కోటా అగ్ర కులాలకు! ............................................... 299


**సెక్షన్ 2**


36. సి.పి.సి. సవరణలు అన్యాయమైనవే కానీ వకీళ్ళ నిర్వాకం సంగతేమిటి? .... 303
37. న్యాయవాదులకు వేరే న్యాయమా? ............................................... 307
38. న్యాయమూర్తులలో అవినీతి: బహిరంగ చర్చే ఈ పురుగుకు మందు .... 308
39. మినహాయింపుగా నిలబడ్డ మనిషి................................................. 314
40. న్యాయమూర్తులకిన్ని సదుపాయాలు న్యాయనిర్ణయానికి శ్రేయస్కరమా? 318

# కాలం చెల్లని ఆదర్శవాది

కె. బాలగోపాల్ గారి గురించి నాలుగు మాటలు రాసే అవకాశం లభించడం నాకు దక్కిన ఒక అపూర్వ గౌరవంగా భావిస్తున్నాను. న్యాయశాస్త్ర రంగంలో దాదాపు 5 దశాబ్దాల పాటు మొదట న్యాయవాదిగా, తర్వాత న్యాయమూర్తిగా బాలగోపాల్ గారితో సహా వేల మంది న్యాయవాదులతో కలిసి ప్రయాణం చేసిన వ్యక్తిగా ఒక మాట చెప్పి తీరాలి. అతి కొద్దిమంది మాత్రమే బాలగోపాల్ గారిలా అపారమైన ఆరాధనా భావనను మనలో రేకెత్తించగలుగుతారు. ప్రతి న్యాయశాస్త్ర విద్యార్థి, న్యాయవాది ఏ న్యాయమైన సమాజం కోసం కృషి చేయాలని ఆశిస్తూ ఈ రంగంలోకి వస్తారో ఆ ఆదర్శవాదానికి అనేక విధాలుగా బలమైన ప్రతీక బాలగోపాల్ గారు. మనలో చాలామంది ధనార్జనకో, వృత్తిపరమైన ఉన్నతి వంటి ప్రలోభాలకో లొంగిపోతాం కాని బాలగోపాల్ గారు అలా కాదు. ఆయన దృష్టిలో న్యాయవాద వృత్తికి అర్థం ఒక్కటే – బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేకూర్చడానికి అహర్నిశలూ చేయవలసిన కృషి. లౌక్యంగా బతకడం తప్పదని అనుకునేవాళ్ళు ఆయన ఆలోచనలను కాలం చెల్లిన ఆదర్శవాదంగా భావించి నవ్వుకోవచ్చు. కాని బాలగోపాల్ గారి విషయంలో ఈ ఆదర్శవాదం ప్రపంచ పోకడలకు తగ్గట్టుగా ఎదగని ఒక యువకుడి మనస్తత్వం కాదు; నిరాశావాదానికి, నిరుత్సాహానికి ఏ మాత్రం తావు ఇవ్వకూడదన్న కృతనిశ్చయంతో రూపు దిద్దుకున్న ఆదర్శవాదం అది. చివరివరకు తన ఆదర్శవాద నియమాల ప్రకారమే బతికిన మనిషి ఆయన.

దేనికీ ఉత్సాహపడకుండా నిర్లిప్తంగా ఉండే న్యాయవాదులు సైతం బాలగోపాల్ గారి గురించి, ఆయన రాత్రి పగలు కూడా బస్సుల్లో, రైళ్ళలో, రిక్షాల్లో, కాలినడకన మారుమూల గ్రామాలకు, పట్టణాలకు ఏవిధంగా ప్రయాణిస్తుంటారో ఆ విషయాల గురించి ఎంతో విస్మయంగా – ఇంకా చెప్పాలంటే ఒకింత గర్వంగా చెప్పుకుంటుంటారు. ఆ ప్రయాణాలలో ఆయన తనను కలిసిన బాధితులందరికీ, బహుశా ఒక వైద్యుడు రోగికి ఇచ్చే లాంటి ఆశను, చట్టం ద్వారా న్యాయం పొందవచ్చన్న ఆశను ఇచ్చి ఉంటారు.

అంతే ముఖ్యంగా చెప్పుకోవాల్సిన మరో విషయం ఏమిటంటే తన అపారమైన మేధస్సుతో కొన్ని చట్టపరమైన వాదనలను ఆయన ఎంతగానో సంపద్వంతం చేశారు. బడుగు, బలహీన ప్రజల పట్ల ఆయనకున్న గాఢమైన సహానుభూతి తన పనిని నిరంతరం కొనసాగించే శక్తినిస్తే, అమోఘమైన విశ్లేషణా పటిమ ఎటువంటి న్యాయమూర్తులనైనా తప్పనిసరిగా శ్రద్ధగా వినేలా చేసేవి. ప్రజల పట్ల కంటే రాజ్య వ్యవస్థలు, రాజ్య ప్రతినిధుల పట్ల ఎక్కువ సానుకూలంగా ఉండే జడ్జీలు సైతం ఆయన వాదనలను వినడానికి ఆసక్తి చూపేవారని చెప్పగలను. తనకున్న గణితశాస్త్ర నేపథ్యాన్ని – అంటే గణితశాస్త్రం నుండి వచ్చిన ఖచ్చితత్వం, పదునైన తర్కం, స్పష్టతను; దానితో పాటు సరళమైన భాషలో సూటిగా ఒప్పించేలా చెప్పగలిగే వాక్పటిమను బాలగోపాల్‌గారు లీగల్ అంశాల విశ్లేషణకు ఉపయోగించుకోవడం గురించి నేను తరచూ నా వ్యక్తిగత సంభాషణలలో చెపుతుండేవాడిని. బాలగోపాల్ గారి వాదనా విధానంలో నాటకీయత గాని, వాగాడంబరం గాని ఏ మాత్రం ఉండవు. అంతే కాదు, కోర్టులో వాదనలు వినిపించేటపుడు తన సైద్ధాంతిక విశ్వాసాలను అందులోకి చొప్పించకుండా, అంటే చట్టపరిధులను అతిక్రమించకుండా జాగ్రత్త పడేవారు. ఆయన క్రమశిక్షణ, కష్టపడే తత్వం – న్యాయ సంస్థల నుండి ఏ మాత్రం సహాయం అందని వర్గాలకు అందుబాటులో ఉండడంలో ప్రతిఫలిస్తే, ఆయన మేధో క్రమశిక్షణ, అద్భుతమైన విశ్లేషణా సామర్థ్యం ఆయన్ని కోర్టులో గొప్ప న్యాయవాదిగా నిలబెట్టాయి. ఒక కేసు వాస్తవాలను, సంబంధిత చట్టాన్ని క్షుణ్ణంగా తెలుసుకోకుండా ఆయన ఏ రోజూ కోర్టులో అడుగుపెట్ట లేదనుకుంటాను. ఆ విషయంలో ప్రజల పట్ల ఆయన నిబద్ధత సంపూర్ణం అని చెప్పాలి.

బాలగోపాల్ గారు ఒక గొప్ప మేధావి; ఈ విషయం ఆయన రాసిన ఎన్నో రచనల నుండి, చేసిన ఎన్నో ప్రసంగాల నుండి మనకు స్పష్టంగానే అర్థమవుతుంది. ప్రజలకు చట్టబద్ధ పాలన నిరాటంకంగా, సంపూర్ణంగా అందాలని కోరుకునేవాళ్ళు ముందుగా రాజ్యసంస్థలు ఏ విధంగా విఫలమవుతున్నాయనే విషయంపై విస్తృత అవగాహనను, దానితో పాటు రాజీ లేని పోరాటం ద్వారానే న్యాయం సాధించగలమనే అవగాహన నుండి పుట్టే క్రియాశీలతను – రెండిటినీ అర్థం చేసుకుని తమ ఆలోచనలను మెరుగుపెట్టుకోవడం చాలా అవసరం. బాలగోపాల్ గారి రచనలలో ఈ రెండూ కనిపిస్తాయి. తన మేధస్సును, తన బోధనా ప్రవృత్తిని జోడించి రచనలు చేసిన వ్యక్తి ఆయన. సంపన్నుల సేవలో రాజ్యం ఏజెంట్లు చట్టాలనూ, మానవ హక్కులనూ అతిక్రమించడమే కాక రోజురోజుకు మరిన్ని చట్టవ్యతిరేక చర్యలతో ఆ అతిక్రమణలను

అతి సాధారణ విషయంగా ఎలా మార్చేస్తున్నారనే దాని గురించి బాలగోపాల్ గారు లోతైన అవగాహనతో రాసే వ్యాసాలు ఆయనను ఒక అత్యున్నతమైన ప్రజా మేధావిగా నిలబెట్టాయి.

మన రాజకీయార్థిక వ్యవస్థ పదేపదే ఏ దిశలో ముందుకు తీసుకుపోబడుతున్నదో గమనిస్తే, సమాజం పట్ల బాధ్యత ఉన్న ఎవరైనా తీవ్ర నిస్పృహకు లోనవుతారని నా నమ్మకం. 20వ శతాబ్దం మధ్యకాలంలో కొంతకాలం పాటు ప్రపంచం దోపిడీరహిత సమ సమాజ నిర్మాణ దిశగా, జాతి రాజ్యాల (Nation States) ఏర్పాటు దిశగా ప్రయాణిస్తున్న సూచనలు కొద్దిగానైనా కనిపించాయి. రాజ్యం తొలుత ప్రజల సమిష్టి కార్య వేదికగా ఆవిర్భవించిందన్న విషయం తెలిసిందే. ప్రజల నుండి వచ్చే ప్రజాస్వామిక ఒత్తిడుల కారణంగా, రాజ్యాంగం చెప్పే విలువలు, విధించే పరిధుల కారణంగా రాజ్యం వర్తమానంలో కూడా అదే విధంగా ప్రజల సమిష్టి వనరులకు, అధికారాలకు, ఆకాంక్షలకు చిత్తశుద్ధి గల ఒక పబ్లిక్ ట్రస్టీగా పని చేయగలదనే ఆశ ఉండింది. బాలగోపాల్ గారు గతంలో రాసిన 'అణచివేత – అణచివేత చట్టాలు' పుస్తకాన్ని మరోసారి చదువుతుంటే, నయా ఉదారవాద వ్యవస్థకు ఆద్యులైన వారిని విమర్శిస్తూ సుప్రసిద్ధ పార్లమెంటు సభ్యుడైన నా ప్రియ మిత్రుడు ఒకరు అన్న మాటలు గుర్తొచ్చాయి. "రాజ్యం మార్కెట్ లాగా, మార్కెట్ రాజ్యం లాగా ప్రవర్తిస్తే కలిగే దుష్పరిణామాల గురించి మీకు తెలుసని నమ్ముతున్నాను" అన్నారాయన. 'మార్కెట్ రాజ్యం లాగా వ్యవహరిస్తుండడం' వల్లనే రాజ్యాంగబద్ధమైన ప్రతి ప్రజాస్వామ్య వ్యవస్థను ధ్వంసం చేయడానికి సిద్ధపడే నిరంకుశ ప్రభుత్వాలు పుట్టుకొచ్చాయని చాలామంది మేధావులు ఇప్పటికే ఆందోళన చెందుతున్నారు.

ఈ పరిణామాలను బాలగోపాల్ గారు ముందే ఊహించి, గత కొన్ని దశాబ్దాలుగా హెచ్చరిస్తూనే వచ్చారు. న్యాయం జరుగుతుందనే ఆశను అణగారిన వర్గాలలో కలిగించాలంటే అందుకోసం మనం కలిసికట్టుగా ప్రయత్నిస్తున్న దాఖలాలు వారికి చూపించాల్సిన అవసరం ఉందని ఆయన 1991 లోనే 'తుపాకి రాజ్యం: నిర్బంధంపై నివేదిక' అనే వ్యాసంలో రాశారు. దానికన్నా ముందే డా. అంబేద్కర్ సరిగ్గా ఈ ఆశే, దాని సత్వర కార్యరూపమే కొత్తగా ఆవిర్భవించిన మన జాతి రాష్ట్రానికి (Nation State) పునాదిరాయిగా ఉండాలని చెప్పారు. అంతే కాదు, సామాజిక, ఆర్థిక అసమానతలు ఎక్కువకాలం పెద్దఎత్తున కొనసాగితే, రాజకీయ సమానత్వ భావనలు (అవి ఎక్కువ భాగం ఎలాగూ ప్రతీకాత్మకమే) ఎన్నిటిని ప్రచారంలో పెట్టినా చివరికి

ప్రజలే తిరగబడి రాజ్యాంగ ప్రజాస్వామ్య ఆలయాన్ని ధ్వంసం చేయొచ్చని కూడా ఆయన హెచ్చరించారు. అంబేద్కర్ మాటలను ప్రతిధ్వనిస్తూ "మనకు సామాజిక శాంతి కావాలంటే, సామాజిక న్యాయం అనివార్యం" అని బాలగోపాల్ గారు రాశారు. 1991లో ఉన్న రాజకీయ పరిస్థితుల గురించి రాస్తూ – సామాజిక అశాంతికి, సామాజిక–ఆర్థిక అసమానతలకు మధ్య ఉన్న సంబంధం తమకు అర్థమైనట్లుగా రాజకీయ నాయకులు, కొందరు మేధావులు మాట్లాడుతున్నారు కాని అవన్నీ పైపై మాటలేననీ, వాళ్ళ అవగాహనలో చిత్తశుద్ధి లేదని అన్నారు. రాజకీయ రంగంలో ప్రజాస్వామ్య విలువలు పూర్తిగా క్షీణించాయనేది ఇవ్వాళ అందరికీ అర్థమైన ఒక చేదు నిజమని, ఏ రాజకీయ పార్టీ కూడా రిగ్గింగ్ చేయకుండా, వోటర్లను భయపెట్టడానికి పెద్దఎత్తున హింస చేయకుండా, గూండాలను ఉపయోగించకుండా, మత విద్వేషాలను రెచ్చగొట్టే అజెండాలను తీసుకురాకుండా ఎన్నికలలో గెలిచే పరిస్థితులు లేవని బాలగోపాల్ గారు  చెప్పారు.

ప్రజాస్వామ్యం ఆత్మ ప్రజల సమిష్టి స్వరంలో ఉంటుంది. ప్రజల మధ్య పరస్పర చర్చలే కాక తమకు ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వంతో కూడా వారు చర్చలు జరపగలగాలి; ఎన్నికైన ప్రభుత్వాలు చేసే తప్పులను కూడా వారు నిరంతరం ప్రశ్నించగలగాలి. ప్రజాస్వామ్య ఆత్మ ఆ ప్రక్రియలోనే ఉంది. ప్రజల ప్రశ్నించే స్వేచ్ఛను, అణగదొక్కే ఏ ప్రయత్నాన్నైనా భారతదేశ ప్రజాస్వామ్య పునాదిని ధ్వంసం చేసే చర్యగా పరిగణించాలి. ప్రశ్నించే, నిరసించే తమ హక్కుకు శాసన వ్యవస్థ ద్వారా, ఉదాహరణకు POTO/POTA వంటి చట్టాల ద్వారా, ఎదురయ్యే ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాలగోపాల్ గారు పదేపదే రాశారు. ప్రభుత్వాలు ఈ చట్టాలను ఉగ్రవాదుల విచక్షణారహిత హింసను అరికట్టడానికి కాకుండా, సామాన్య ప్రజల అభిప్రాయ స్వేచ్ఛను, వాక్స్వాతంత్రాన్ని  హరించడానికి ఉపయోగిస్తాయని, సామాజిక అశాంతికి దారి తీసే అన్ని రకాల పరిస్థితుల గురించి బహిరంగ చర్చలను, విశ్లేషణలను అసాధ్యం చేస్తాయని బాలగోపాల్ గారు ఎప్పుడోనే హెచ్చరించారు. కాని ఆ నాటికి ఆయనది దాదాపు ఒంటరి గొంతని చెప్పాలి. ప్రపంచవ్యాప్తంగా ప్రశ్నించే గొంతుకలపై నిందలు మోపే రాజకీయమే నడుస్తున్నపుడు, రాజకీయ పార్టీలన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థకు కొమ్ము కాస్తూ, సామాజిక న్యాయం, శాంతి, అహింసల గురించి మాట్లాడే వారందరినీ దేశద్రోహులుగా ముద్ర వేస్తున్న ప్రస్తుత తరుణంలో బాలగోపాల్ గార్ని పట్టించుకోనందుకు బాధపడి ఊరుకోవడం కాక, మనకు ఇంకేదైనా ఆశ మిగిలి ఉందని ఆశిద్దాం.

బాలగోపాల్ గారి రచనలన్నిటినీ ఈ ముందుమాటలో ప్రస్తావించడం సాధ్యం కాదు. కాని ఒక మాట చెప్పాలి. ఆయన రాసిన వందలాది వ్యాసాలను పుస్తకాలుగా తీసుకువస్తూ ప్రచురణకర్తలు సమాజానికి గొప్ప సమయోచిత సేవ చేస్తున్నారు. ఈ వ్యాసాలలో కొన్ని 2–3 దశాబ్దాల క్రితానివి అయినప్పటికీ, పాఠకులు అవి స్థల కాల పరిమితులను అధిగమించే వ్యాసాలని, లోతైన విశ్లేషణ, వివేకం కలగలిసిన నిధి నిక్షేపాలని గ్రహించగలుగుతారు. సంపన్న వర్గాల – మరీ ముఖ్యంగా నిత్య లాభాల వేటలో ఉండే నయా ఉదారవాద శక్తుల – సాంఘిక ఆర్థిక బలానికి, నిఘా శక్తులన్నిటినీ తన అధీనంలో ఉంచుకునే రాజకీయ వ్యవస్థ అధికార బలానికి మధ్యనున్న అపవిత్ర సంబంధాన్ని తేటతెల్లం చేసిన వ్యాసాలని కూడా గ్రహించగలుగుతారు.

చివరగా, ఒక సూచన చేయాలనుకుంటున్నాను. బాలగోపాల్ గారు వివిధ కేసుల్లో వాదోపవాదాల కోసం రాసుకున్న నోట్సు నుంచి కూడా మనం నేర్చుకోగలిగింది చాలా ఉండవచ్చని నా అభిప్రాయం. రోజువారీ కేసులతో తలమునకలుగా ఉండే బాలగోపాల్ గారికి తాను చేపట్టిన వందలాది కేసులలో వాస్తవాల వడబోత, న్యాయ సూత్రాల అన్వయం తను ఏ విధంగా చేస్తూ వచ్చాడో వివరంగా రాయగల తీరుబడి ఉండే అవకాశం లేదు. పైగా మన పనిని మనం విమర్శనాత్మకంగా పరిశీలించుకునే వయస్సు రాకముందే ఆయన మరణించడం ఇంకా బాధాకరం. అందుచేత న్యాయ నిపుణుల సహాయంతో ఆయన నోట్సును క్షుణ్ణంగా పరిశీలించి, విశ్లేషించి, వీలైన మేరకు ఆయన పని విధానాన్ని, ఆయన ఆలోచనల క్రమాన్ని తెలుసుకునే ప్రయత్నం చేసి భావితరాల న్యాయవాదులకు అందజేయాలని నా కోరిక. వాటి నుండి వాళ్ళు నేర్చుకోగలిగేది చాలా ఉంటుందని నా నమ్మకం. ఆయన తన జీవితకాలంలో చేసిన సేవ చిరస్మరణీయం. ఎప్పటికీ గుర్తు పెట్టుకోదగ్గ అతి కొద్దిమంది వ్యక్తుల్లో బాలగోపాల్ ఒకరు. సన్నిహితుల జ్ఞాపకాలకు మించి ఆయన గురించి మనం తెలుసుకోవలసిన విషయాలు చాలా ఉంటాయి; ముఖ్యంగా ఆయన ఆలోచనల గురించి మనం మరింత విపులంగా తెలుసుకోవాలి. గొప్ప భౌతికవాది, వాస్తవికవాది అయిన ఆయనకు నేను ఇప్పుడు అనబోయే మాట నచ్చదని నాకు తెలుసు: ఇప్పటికీ ఆయన బుద్ధి, ఆత్మలు బహుశా ఆ కేసు కట్టల మధ్యే ఉండి ఉండొచ్చు. భావితరాల కోసం ఆయన ఆలోచనలను సజీవంగా నిలపడం మనందరి సామాజిక కర్తవ్యం.

**జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి**

రిటైర్డ్ జడ్జి, భారత సుప్రీంకోర్టు

# ఒక ఎకరా 30 సెంట్ల ప్రజల లాయర్

**ఒ**క న్యాయవాదిగా బాలగోపాల్ కోర్టుల్లో చేసిన పని గురించి చాలా తక్కువ మందికే తెలుసనుకుంటున్నాను. బాలగోపాల్ హక్కుల లాయర్ అని చాలామందికి తెలుసు కాని వాస్తవంగా ఆయన కోర్టుల్లో చేసిన పని ఏమిటో వారికి తెలియకపోవచ్చు. నేను ఇప్పుడు వరంగల్‌లో, అదీ కాకతీయ యూనివర్సిటీలో మాట్లాడుతున్నాను కాబట్టి బాలగోపాల్ ఎంతగానో కృషి చేసిన ఒక హక్కుల అంశం – ఎన్‌కౌంటర్ల గురించి మాట్లాడడంతో మొదలుపెడతాను. ఇక్కడ ఉన్న యువతీయువకులలో ఎంతమందికి ఎన్‌కౌంటర్ మరణాల గురించి, ఆ పదానికి ఇవ్వాళ దేశంలో ఉన్న అర్థం గురించి తెలుసో నాకు తెలియదు. దాని అర్థం హత్యలే. ఎన్‌కౌంటర్ మరణాలన్నీ పోలీసులు చేసిన హత్యలే అని గుర్తింప చేయించడానికి కన్నబిరాన్, తారకం, బాలగోపాల్, హరగోపాల్, మరెందరో చాలా పోరాడాల్సి వచ్చింది. నిజనిర్ధారణ కమిటీ, నిజనిర్ధారణ నివేదిక, హెబియస్ కార్పస్, ఎన్‌కౌంటర్ మరణాలను హైకోర్టులో సవాలు చేయడం వంటి పదాలు, చర్యలు వాడుకలోకి వచ్చింది ఈ జిల్లా నుండే. నిజానికి ఇవాల్టి ప్రసంగం ఒక్క బాలగోపాల్ గురించే కాదు, కన్నబిరాన్, తారకం గార్ల గురించి కూడా.

ఈ అంశాలపై కోర్టుల్లో సవాలు చేయడమంటే ఏమిటి? నిజానికి చాలామంది హక్కుల లాయర్లకు చట్టాన్ని సవాలు చేయడమనేది ఎన్‌కౌంటర్ల అంశంతోనే మొదలయ్యేది. బాలగోపాల్ ఒప్పుకోకపోవచ్చు గాని హక్కుల రిజిస్టర్‌లో ఇప్పటికీ మొదటి అంశం ఎన్‌కౌంటర్ మరణాలే. ఒక నేరస్తుడిని లేదా మావోయిస్టును లేదా టెర్రరిస్టును పట్టుకున్నపుడు పోలీసులు ఏం చేయాలి? భారత శిక్షా స్మృతి కింద, నేర శిక్షా స్మృతి కింద కేసు పెట్టాలి. అంతే గాని వారిని చంపాల్సిన అవసరం ఏమిటి? కాని ఈ మాట వారికి ఏ విధంగా చెప్పాలి? ఎక్కడికెళ్ళి చెప్పాలి? కోర్టులకెళ్ళే చెప్పాలి. నిజమే, ఈ అంశంపై చాలా పెద్ద పెద్ద రాజకీయ ఉద్యమాలే నడిచాయి. కాని కోర్టు నుండే కదా చివరికి న్యాయం పొందాలి.

మీ అందరికీ తెలుసు మనకు శాసనాలు చేయడానికి, పరిపాలన సాగించడానికి, న్యాయం అందించడానికి వేరు వేరు శాఖలు ఉన్నాయి. పరిపాలనా, కార్యనిర్వాహక శాఖలు చేసే పనులు, చేయవలసిన బాధ్యత ఉండి కూడా చేయని పనులు – వీటి మీద చెక్ పెట్టాల్సింది న్యాయ శాఖ అని కూడా మీకు తెలుసు. కాబట్టి పోలీసు స్టేషన్‌లో ఒక వ్యక్తి చిత్రహింసలకు గురైతే, లేదా మాయమైతే, లేదా ఒక మండల రెవెన్యూ అధికారి తను చేయాల్సిన పని చేయకపోతే ప్రజలు ఎక్కడికి వెళ్ళాలి? ఈ సమస్యల్ని పట్టించుకునే ప్రజా ఉద్యమాలు ఉండొచ్చు కాని కోర్టులు కూడా ఉన్నాయి. ఎన్‌కౌంటర్ల విషయానికి వచ్చినపుడు వాటిని సవాలు చేస్తూ హక్కుల లాయర్లు మొదట వెళ్ళింది హైకోర్టుకే. 'చట్టం మౌనంగా ఎలా ఉండగలుగుతుంది? పోలీసులు చేసిన పనిని మీరు ఎలా ఆమోదించగలుగుతారు? ఆ ఘటన మీద కోర్టులో విచారణ జరపండి' అని వాదించారు. మిస్సింగ్ కేసుల విషయానికి వస్తే కన్నబిరాన్, బాలగోపాల్ మొదట కోర్టులకే వెళ్ళి హెబియస్ కార్పస్ పిటిషన్‌లు వేశారు. ఒక హెబియస్ కార్పస్ పిటిషన్ వేసినపుడు ఏమవుతుంది? సంబంధిత పోలీసు స్టేషన్‌కి, కమిషనర్‌కు, మరి కొందరికి నోటీసులు వెళతాయి. ఫలితంగా అరెస్టయిన వ్యక్తిని జుడీషియల్ రిమాండ్‌కి పంపిస్తారు. అంటే అతను జైలుకు వెళతాడు; అది తక్కువ ప్రమాదం, పోలీసు కస్టడీలో ఉండకపోతే చాలు. హక్కుల యాక్టివిజంలో, జుడీషియల్ యాక్టివిజంలో ఇది ఒక ముఖ్యమైన సూత్రం. ఈ విషయాలన్నీ హక్కుల యాక్టివిస్టుల దగ్గర నుండే తెలుసుకున్నాను నేను.

పోలీసు స్టేషన్‌లలో జరిగే చిత్రహింసలకు బాధ్యులు ఎవరు? ఒక కేసు నమోదైనపుడు విచారణ జరపమని నేర శిక్షా స్మృతి చెబుతుంది. కాని దాని అర్థం పోలీసులు చిత్రహింసలు పెట్టొచ్చని కాదు కదా! అలాగే అరెస్టయిన వ్యక్తి పది మందిని చంపిన మావోయిస్టు కాబట్టి పోలీసులు అతని పట్ల ఎలాగైనా ప్రవర్తించవచ్చన్న అర్థం కూడా కాదు కదా! ఈ అంశాలన్నిటి మీదా 1970 లలో, 1980 లలో, 1990 లలో కూడా హక్కుల లాయర్‌లు, ముఖ్యంగా బాలగోపాల్ లాంటి వాళ్ళు ఎంక్వయిరీ కమిషన్ల ముందు, హైకోర్టు ముందు నిరంతరం మాట్లాడుతూనే వచ్చారు. ఇప్పుడున్న హక్కుల లాయర్లు కూడా ఈ విషయాల మీద ధైర్యంగా కేసులు వేస్తున్నారు నిజమే కాని ఇప్పుడు ఈ కేసులు వేయడం అంత ప్రమాదకరమేమీ కాదు. కాని 1980 లలో, 1990 లలో కోర్టుకెళ్ళి హెబియస్ కార్పస్ పిటిషన్ వేయడమన్నా, ఒక ఎన్‌కౌంటర్ మరణాన్ని సవాలు చేయడమన్నా చాలా ప్రమాదకరమైన పనిగా

భావించబడేది. అదృష్టవశాత్తూ ఇవ్వాళ, కనీసం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో పరిస్థితి అలా లేదు. మిగతా రాష్ట్రాలలో పరిస్థితి ఎలా ఉందో నాకు సరిగ్గా తెలియదు కాని ఇక్కడ మాత్రం కన్నబిరాన్, బాలగోపాల్ లాంటి వాళ్ళు చేసిన కృషి వల్ల అది మరీ అంత కష్టమైన పనిగా లేదు. (అయితే గత రెండేళ్లలో పరిస్థితులు మారాయి. ఇప్పుడు ప్రజల పక్షాన వాదించే లాయర్లందరినీ ప్రభుత్వం చాలా ఇబ్బంది పెడుతోంది – వక్త)

అప్పట్లో హక్కుల లాయర్ల కోర్టు కేసులు ఎన్‌కౌంటర్ మరణాలు, అక్రమ నిర్బంధాలు, టాడా కేసులతో మొదలయ్యేవి. ఇక్కడున్న సీనియర్లందరికీ ఈ విషయాలు తెలుసు. ఈ అంశాలతో పరిచయం లేని వారి కోసం నేను ఇవన్నీ చెబుతున్నాను. టాడా కేసులైనా, దొంగతనం కేసులైనా, బందిపోటు దొంగతనం కేసులైనా ఎక్కువ భాగం బూటకపు కేసులే ఉండేవి లేదా ఏ మాత్రం సాక్ష్యాధారాలు లేని కేసులై ఉండేవి. అందువల్ల మళ్ళీ హక్కుల లాయర్లే క్రిమినల్ కోర్టులకెళ్ళి వారి తరఫున వాదించాల్సి వచ్చేది. ముఖ్యంగా మావోయిస్టుల కేసులను, ఇప్పుడైతే టెర్రరిస్టుల కేసులను కూడా. హక్కుల లాయర్ల పని ముఖ్యంగా రెండు విధాల ఉండేది. ఒకటి – పోలీసుల చర్యలకు జవాబుదారీ వహించమని హైకోర్టు ద్వారా ప్రభుత్వాన్ని ఆదేశించడం; రెండు – క్రిమినల్ కోర్టుల్లో వాదించి నిందితులను విడుదల చేయించడం. ఇదే వారి ముఖ్యమైన పని అయిపోయింది. యాక్టివిస్టులలో ఎక్కువమంది బాలగోపాల్‌ను ఎన్‌కౌంటర్ మరణాలు, అక్రమ అరెస్టులను సవాలు చేసే లాయర్‌గా చూస్తారు కాని నిజానికి వాటికంటే ఇతర అంశాలపైనే ఎక్కువ కేసులు చేశారు.

## ఒక్క లేబర్ కేసులే 400

బాలగోపాల్ చనిపోయాక ఆయన ఆఫీసు కెళ్ళి ఆయన చేస్తున్న కేసుల గురించి తెలుసుకునే ప్రయత్నం చేశాం. అది చాలా చిన్న గది. ఎక్కడ చూసినా ఫైళ్లు పడేసి ఉన్నాయి. లెక్క పెట్టడం మొదలుపెట్టాం. దేనికి సంబంధించిన కేసులివి? ఈయన క్లయింట్లు ఎవరు? ఎంతమంది ఉన్నారు అని చూస్తే ఆ రోజున మేము 756 కేసుల్ని లెక్క పెట్టాం. వాటిని వివిధ కేటగిరీల కింద విభజిస్తే అందులో 400 కేసులు కేవలం లేబర్ కేసులే ఉన్నాయి. నేనైతే షాక్ అయ్యాను. ఇంకో పెద్ద కేటగిరీ భూమి సంబంధిత కేసులు. అవి 300 దాకా ఉన్నాయి. స్త్రీలకు సంబంధించి ఒక 20 (గృహ హింస, మనోవర్తి మొదలైన కేసులు), ఎన్‌కౌంటర్ కేసులు ఒక 5 కనిపించాయి. అమ్మో... ఏమిటిది? లేబర్ కేసులే నాలుగు వందలా! అంటే ఆయన వాస్తవానికి లేబర్ లాయరా! రాష్ట్రం మొత్తం నుండి ఆయనకు కేసులు వచ్చేవి. హైదరాబాద్‌లో ఆయన లేబర్

కోర్టులకు వెళ్ళేవాడు, ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్స్‌కి వెళ్ళేవాడు, అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్స్‌కి వెళ్ళేవాడు.

లేబర్ కేసుల విషయానికి వస్తే యూనియన్లు పెట్టీ పెట్టగానే వాళ్ళ మీద కేసులు మొదలయ్యేవి. టెర్మినేషన్లు, రెట్రెంచ్‌మెంట్లు, అన్ని రకాల అక్రమ పద్ధతులూ మొదలవుతాయి. అక్రమ పద్ధతులంటే ఏమిటి? యూనియన్ పెట్టగానే నీ ఇంక్రిమెంట్ ఆపేస్తారు. నీ బోనస్ ఆపేస్తారు. లేదా ఉద్యోగం నుండి పీకి పారేస్తారు. కాబట్టి వాటన్నిటినీ సవాలు చేస్తూ కోర్టుల్లో కేసులు వేయాల్సి వస్తుంది. మొత్తం రాష్ట్రం సంగతి నాకు తెలియదు గాని ఒక్క హైదరాబాద్ నగరంలోనే బాలగోపాల్ లేబర్ చట్టాలను పాటించని అనేక హోటల్ కార్మికుల కేసులు వాదించారు. ఎన్‌కౌంటర్ మరణాలపై ప్రభుత్వంతో పోరాడడం ఒక ఎత్తు అయితే, లేబర్ కేసులపై పోరాడడం మరో ఎత్తు.

నిజానికి మొదటిదే తేలిక, రెండోదే ఎక్కువ కష్టం అని బాలగోపాల్ అనుకుని ఉండొచ్చని నా అభిప్రాయం. ఎందుకంటే యజమానులు, మేనేజ్‌మెంట్ల తరఫున కేసులు వాదించడానికి వచ్చే లాయర్లతో వేగడం చాలా కష్టం. అయినా అలాంటి కేసులు ఆయన 400 దాకా చేశాడు. పైగా హైకోర్టులో కూడా కాదు. అక్కడ పరిస్థితి కాస్తయినా మెరుగ్గా ఉంటుంది. ఆయన ఈ కేసులన్నీ లేబర్ కోర్టులలో, ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్స్‌లో చేశాడు. సగం టైం ఈ కోర్టులు అసలు పని చేయవు. అడిగీ అడగక ముందే వాయిదాలు ఇచ్చేస్తారు.. ఇవాళ్టి పరిస్థితుల్లో లేబర్ లా కేసులు చేయడం చాలా కష్టం. కోర్టుకొచ్చి ఎవరూ న్యాయాన్ని నేరుగా చంపనక్కరలేదు. వాయిదాలు తీసుకుంటూ పోతే చాలు, అదే న్యాయాన్ని చంపేస్తుంది. వాయిదా తర్వాత వాయిదా, వాయిదా తర్వాత వాయిదా తీసుకుంటూ పోతారు. కేసు కట్ట తీసి చూస్తే ప్రతి కేసులో కనీసం 50 హాజర్లు ఉంటాయి. ప్రతి వాయిదాకూ వెళ్ళాల్సిందే. పొరపాటున ఏ వాయిదాకైనా మేము వెళ్ళకపోతే జడ్జి ఆ రోజే ఏదైనా ఆర్డర్ ఇచ్చేయొచ్చు. అందువల్ల మేము వెళ్ళక తప్పదు. కాబట్టి ఊహించండి బాలగోపాల్ లేబర్ కోర్టుల్లో ఎంత సమయం వెచ్చించి ఉంటారో.

ప్రతి కంపెనీలో యూనియన్ పెట్టగానే యూనియన్ ఏర్పాటు మీదే కేసు వేస్తారు. ఆ తర్వాత అది సక్రమంగా ఏర్పాటు కాలేదని ఇంకొక కేసు వేస్తారు. ఆ తర్వాత సుమారు ఓ 20 మందిని ఉద్యోగాల నుండి బర్తరఫ్ చేస్తారు. వాళ్ళు కేసులు వేస్తారు. నేను అన్ని రకాల సంస్థల గురించి మాట్లాడుతున్నాను. కొందరు కార్మికులకు

ఇంక్రిమెంట్లో మరొకటో కట్ చేస్తారు. వాళ్ళందరూ కోర్టుకు వెళతారు. వెరసి ప్రతి సంస్థకు సంబంధించి 30, 40 కేసులు దాఖలవుతాయి. వేరే ఎన్నో పనులు చేస్తూ బాలగోపాల్ ఈ కేసులన్నీ చూసేవారు. పైగా లేబర్ కోర్టులన్నీ ఒక చోట ఉండవు. సిటీ అంతటా ఉంటాయి.

## సర్వీస్ లా కేసులూ తక్కువేం కాదు

ఇదొక పార్శ్వమైతే నేను ఆశ్చర్యపోయిన మరొక విషయం ఏమిటంటే ఆయన చేసిన సర్వీస్ లా కేసుల సంఖ్య. క్రిమినల్ కేసులు, ఎన్‌కౌంటర్ మరణాల కేసులు మాత్రమే కనిపిస్తాయనుకుని వెళ్ళిన దాన్ని కదా! సర్వీస్ లా లో కూడా ఆయన అనేక రకాల ఉద్యోగ సంబంధిత కేసులను చేశారు. అవన్నీ ఒక్క హైకోర్టులో చేసిన కేసులు కూడా కావు; ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌కు వెళ్ళి చేసినవీ చాలా ఉన్నాయి. చాలామంది దళిత, ఆదివాసీ ఉద్యోగులకు సకాలంలో ప్రమోషన్లు రావు. లేదా ఇంకేదో అన్యాయం జరుగుతుంది. ఉద్యోగం దొరికాక కూడా పై మెట్లు ఎక్కే క్రమంలో వారు ఎన్నో రకాల వివక్షను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆ కేసులన్నీ ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌కి వెళతాయి. మొదట నేను చెప్పిన 756 కేసులు కాక ఇవి మరో 200, 300 ఉంటాయి. ఇవి కాక కేంద్ర ప్రభుత్వ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో కూడా కేసులున్నాయి. బాలగోపాల్ సంవత్సరానికి ఎన్ని కేసులు చేసేవాడా అని ఒక్కొకసారి ఆలోచిస్తుంటా. హైకోర్టులో కనీసం వంద కేసులు, లేబర్ కోర్టులు, రాష్ట్ర అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, కేంద్ర ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ వాటన్నిట్లోను కలిపి మరికొన్ని వందల కేసులు. హైకోర్టులో కూడా ఆయనకు లేబర్ కేసులు ఉండేవి.

## ఆదివాసుల భూమి కేసులు

లేబర్ తర్వాత ఆయన చేసిన ఎక్కువ కేసులు, భూమికి సంబంధించిన కేసులు. అవన్నీ ఆదివాసులకు, దళితులకు సంబంధించిన కేసులే. అందులో మళ్ళీ ఎన్నో రకాలు. సింహ భాగం LTR (భూమి బదలాయింపు క్రమబద్ధీకరణ చట్టం) కేసులు అయినప్పటికీ వాటి గురించి తర్వాత మాట్లాడతాను. మొదట గొత్తికోయల కేసుల గురించి చెబుతాను. వాళ్ళు ఛత్తీస్‌గఢ్ నుండి వచ్చి ఇక్కడ, అంటే ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఇళ్ళు కట్టుకోవడానికి ప్రయత్నిస్తే ప్రభుత్వం వారి ఇళ్ళను తగలబెట్టించింది. గొత్తికోయల ఇళ్ళని తెలిస్తే చాలు, వెళ్ళి తగలబెట్టేస్తున్నారు. ఇంకో రకమైన భూమి సమస్య మన రాష్ట్రానికే చెందిన ఆదివాసీ తెగలది. ముఖ్యంగా కోయలది. వారు

తాతల, తండ్రుల కాలం నుండి ఇక్కడి అటవీ భూముల్లోనే బతుకుతున్నామని చెపుతారు కాని వాళ్ళ దగ్గర సాక్ష్యంగా ఒక్క కాగితం కూడా ఉండదు. వాళ్ళ గురించి కోర్టులో ఎలా వాదించాలి? మూడో రకం కేసులు ప్రభుత్వ భూముల 'ఆక్రమణ'లకు సంబంధించినవి. చాలామంది దళితులు, ఆదివాసులు ఆ భూముల్లో వ్యవసాయం చేసుకోవడమో, ఇళ్ళు కట్టుకోవడమో, గొర్రెలనో బర్రెలనో మేపుకోవడమో చేస్తుంటారు.

ఇప్పుడు మొదట ప్రస్తావించిన LTR కేసుల గురించి చెబుతాను. ఆయన చేసిన భూమి సంబంధ కేసుల్లో ఇవే అత్యధికం అని చెప్పా కదా! ఒక ఎకరా 30 సెంట్ల భూమి ఉండే ఒక ఆదివాసీ, దళిత రైతు కోసం బాలగోపాల్ కనీసం 20 సార్లు కోర్టుకు వెళ్ళి ఉంటారు. అంత చిన్న రైతు కోసం కూడా ఆయన అంత గట్టి ప్రయత్నం చేసేవారు. ఏజెన్సీ ప్రాంతాలను ఏర్పరచింది రాజ్యాంగమే; ఆదివాసుల ప్రయోజనాల పరిరక్షణ కోసం LTR చట్టం తీసుకొచ్చింది ప్రభుత్వమే. అయినా ఆదివాసులకు ఆ భూములు దక్కడం లేదు. గత ఏడాది ఇదే వేదిక నుండి బాలగోపాల్ గారి స్మారకోపన్యాసం చేసిన లాయర్ త్రినాథరావు గారు ఈ కేసుల గురించి చెప్పే ఉంటారు. LTR చట్టం ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో ఒక ఆదివాసి భూమిని ఒక ఆదివాసేతరుడికి బదిలీ చేయడానికి వీలులేదు. అది చెల్లదు. కాని ఏం జరుగుతుందంటే ఒక ఆదివాసి తన భూమి కోసం సుదీర్ఘ న్యాయ పోరాటం జరిపి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నుండి అనుకూల ఉత్తర్వు పొందిన తర్వాత కూడా ఆ భూమి అతనికి దక్కడం లేదు. ఆ భూమి తనదని వాదించే ఆదివాసేతరుడు హైకోర్టుకు వెళ్ళి వెంటనే స్టే తెచ్చేసుకుంటున్నాడు. కాబట్టి స్థానిక ఏజెన్సీ కోర్టులలోనే కాక, ఆ స్టే ఉత్తర్వులను ఎత్తేయించడానికి కూడా మనకు హైకోర్టులో లాయర్లు కావాలి. ఆదివాసి పిటిషనర్ వాదనకు అవకాశం ఇవ్వకుండా హైకోర్టు చాలా సులభంగా అడ్మిషన్ స్థాయిలోనే స్టేలు ఇచ్చేస్తుంటుంది. ఆ ఆదివాసి పిటిషనర్ సమస్యను కోర్టు పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఈ కేసులు ఏజెన్సీ ప్రాంతానికి సంబంధించినవని, అది ఒక ప్రత్యేక చట్టం కింద వారికి లభించిన రక్షణ అని కోర్టు మరిచిపోకూడదు కదా! ఈ కేసుల్లో బాలగోపాల్ ప్రధాన వాదన ఏమిటంటే హైకోర్టు వాటిని ప్రైవేటు ప్రాపర్టీ కేసుల్లాగా చూడకూడదని. ప్రైవేటు ప్రాపర్టీ కేసుల్లో క్లయింట్లు 'ఆస్తి నా స్వాధీనంలో ఉంది, దానికి సంబంధించిన కాగితాలు కూడా నా పేరుతోనే ఉన్నాయి కాబట్టి నాకు స్టే ఇవ్వండి' అని వాదిస్తారు. కాని రాజ్యాంగం ఆ ప్రాంతాన్ని ఏజెన్సీ ప్రాంతాలుగా ప్రకటించిన తర్వాత అక్కడి కేసులకు ప్రైవేటు ప్రాపర్టీ సూత్రాలను

ఎలా అన్వయిస్తారు అనేది బాలగోపాల్ వాదన. అసంఖ్యాక కేసుల్లో బాలగోపాల్ వ్యక్తిగత ఆస్తి కేసులకు వర్తించే ఆ సూత్రం ఈ కేసులకు వర్తించదని హైకోర్టుకు చెప్పడానికి ప్రయత్నించారు. చివరిక్షణం వరకు ఆ ప్రయత్నం చేస్తూనే ఉన్నారు.

చనిపోయే రోజున కూడా ఆయన కార్మికులకు సంబంధించిన ఒక కేసులో హైకోర్టులో వాదించారు. కార్మికులు రాజీకి ఒప్పుకున్నారని బాలగోపాల్ ఆ రోజు కోర్టులో అన్నట్టు ఆ కేసులోని అవతలి పక్షం లాయరు ఆయన చనిపోయిన తర్వాత నాతో అన్నారు. అలా జరగనే జరగదు అని చెప్పా నేను. కార్మికులు గాని, ఆదివాసులు గాని రాజీకి వస్తారని ఆయన ఛస్తే చెప్పరని నేను అన్నాను. అంటే చనిపోయే రోజున కూడా ఆయన ఈ కేసుల కోసమే హైకోర్టుకు వచ్చారు.

## కుల వివక్ష కేసులు

ఇప్పటిదాకా మూడు రకాల కేసులు చెప్పాను. ఒకటి లేబర్, రెండు సర్వీస్, మూడు భూమి. ఇంకా స్త్రీల కేసులు, కుల వివక్ష కేసులు వంటి ఇతర రకాల కేసులు చాలా ఉన్నాయి. కుల వివక్ష కేసుల్లో ఏం జరుగుతుందో చూద్దాం. ఒక దళితుడు అత్యాచారం కేసు పెట్టగానే అవతలి వ్యక్తి అంటే దళితేతరుడు హైకోర్టుకు వెళ్ళి తనకు అనుకూలమైన ఆర్డర్ ఏదో తెచ్చుకుంటాడు. అదేమిటో గాని ఆదివాసేతరులకు, దళితేతరులకు హైకోర్టులో ఎప్పుడూ మంచి నెట్‌వర్క్‌లు ఉంటాయి. అందువల్లే ఏదైనా జరిగితే వెంటనే హైకోర్టుకు వచ్చి కేసు మీద స్టే ఆర్డర్ గాని, అరెస్టు మీద స్టే ఆర్డర్ గాని సులభంగా తెచ్చేసుకుంటారు. ఇలాంటి దళిత అత్యాచారాల కేసులెన్నో బాలగోపాల్ ఆఫీస్‌లో ఉన్నాయి. చుండూరు దళిత హత్యల కేసులో ఆయన చాలా పని చేశారు. మీకందరికీ చుండూరు కేసు గురించి తెలిసే ఉంటుంది. అక్కడ 8 మంది దళితులను అగ్రకులస్తులు చంపారు. హతుల కుటుంబాలు చుండూరులోనే విచారణ జరగాలని పట్టు పట్టి ప్రత్యేక కోర్టును సాధించుకున్నారు. కాని అగ్ర కులస్తులు చీటికీమాటికీ ఏదో ఒక నెపం మీద హైకోర్టుకెళ్ళి విచారణ జరగకుండా అడ్డుకోవడానికి ప్రయత్నించారు.

అగ్ర కుల, అగ్ర వర్ణ మనుషులకు హైకోర్టుకు వెళ్ళడం చాలా తేలిక, ఆ ఖర్చును వాళ్ళు పెట్టుకోగలరు. కాని దళితులకు, ఆదివాసులకు, స్త్రీలకు అది చాలా కష్టమైన పని. హైకోర్టుకు వెళ్ళలేకే చాలామంది అపీలు వేసుకోకుండా కేసును వదిలేసుకుంటారు. ఖర్చులు ఎక్కువనే కాకుండా అన్ని సార్లు తిరిగే శక్తి కూడా వాళ్లకు ఉండదు. లాయర్ గురించి టెన్షన్ ఉండనే ఉంటుంది. కేసు సరిగ్గా చేస్తున్నాడా

లేక అవతలి పక్షం వాళ్ళతో కుమ్మక్కై పోయాడా అని భయపడుతూ ఉండాలి. హైదరాబాద్ లో బతుకుతున్న మాబోటి వాళ్ళం కూడా సుప్రీంకోర్టు గురించి అలాగే భయపడుతుంటాం. అమ్మో...సుప్రీంకోర్టుకు వెళ్ళడమే, ఫీజులు భరించలేం, అక్కడి లాయర్లు ఎవరూ మనకు తెలియదు అనుకుంటాం. అలాగే జిల్లాల క్లయింట్లు కూడా హైదరాబాద్ రావడానికి భయపడుతుంటారు. హక్కుల లాయర్లు ఉన్నపుడే వాళ్ళు ధైర్యంగా రాగలుగుతారు. లేదా హక్కుల లాయర్ అనే ముద్ర లేకపోయినా ఆ కేసులను నిజాయితీగా చేసే లాయర్లు ఉన్నపుడు రాగలుగుతారు. అయితే వారి సంఖ్య చాలా తక్కువ. ప్రధానంగా హక్కుల లాయర్లే ఈ కేసుల్ని వాదించాల్సి ఉంటుంది.

## 'అదృశ్య' క్లయింట్‌లు

ఇప్పుడు ఒక లాయర్‌గా బాలగోపాల్‌ను, ఆయన పనిని పరిశీలించే ప్రయత్నం చేస్తా. బాలగోపాల్ వారానికి ఐదు రోజులు, అంటే సోమవారం నుండి శుక్రవారం వరకు ఒక్క రోజు కూడా మిస్ కాకుండా కోర్టుకు వచ్చేవాడు. అయితే ప్రతి శుక్రవారం సాయంత్రం రైలో, బస్సో ఎక్కి ఏదో ఒక ఊరికి వెళ్ళి మళ్ళీ సోమవారం పొద్దున దాకా హైదరాబాద్ తిరిగి వచ్చేవాడు కాదు. బాలగోపాల్ ప్రయాణాల గురించి ఎందుకు మాట్లాడుతున్నానంటే ఆయన చనిపోయాక మేము లెక్కపెట్టిన 756 కేసులలో ఇరవయ్యో, ముప్పయ్యో కేసుల్ని మాత్రమే క్లయింట్లు వచ్చి తీసుకెళ్ళారు. మిగతా కేసుల కట్టలన్నీ ఆఫీస్‌లో ఉండిపోయాయి. ఇప్పటికీ అక్కడే ఉన్నాయి. అరె...ఎందుకు ఎవరూ వచ్చి తీసికెళ్ళడం లేదని నేను ఆశ్చర్యపోతుండేదాన్ని. ఫోన్ చేసి అడుగుదామంటే వాళ్ళ ఫోన్ నెంబర్లు కూడా లేవు. అంతమంది క్లయింట్లు అంత నిర్లక్ష్యంగా ఎలా ఉంటారా అనుకునేదాన్ని. ఈ కేసులలో కొన్ని నేను ఇంతకు ముందు చెప్పిన ఒక ఎకరా 30 సెంట్ల వాళ్ళ కేసులు. కాని కొన్ని పెద్ద కేసులు. అన్నీ మా దగ్గరే అలా ఉండిపోయాయి. ఒక కేసు అయితే పశ్చిమ గోదావరి జిల్లా బుట్టాయగూడెంకు చెందిన 80 ఎకరాల భూమికి సంబంధించిన కేసు. కొన్నిసార్లు వాళ్ళ నిర్లక్ష్యానికి భలే కోపం కూడా వచ్చేది. అయితే క్రమేణా నాకు అర్థమైనదేమిటంటే ఈ ఆఫీస్ పూర్తిగా వేరే రకమైన ఆఫీసని. ఈ కేసులన్నీ ఆయన దగ్గరకు రాలేదు, క్లయింట్లు బస్సో, రైలో ఎక్కి ఆయన దగ్గరకు వచ్చి ఇచ్చిన కేసులు కావివి. బాలగోపాల్ తన వారాంతపు ప్రయాణాలలో కనుగొన్న కేసులివి. ఈ క్లయింట్లు పేదలు, బలహీనులు మాత్రమే కాదు, వారు ఎవరికీ కనబడని 'అదృశ్య' క్లయింట్లు కూడా.

బాలగోపాల్ ఆ మారుమూల గ్రామాలకు వెళ్లకపోయి ఉంటే ఈ కేసులు హైకోర్టు దాకా వచ్చి ఉండేవే కావు. మనకు హైకోర్టులో, సెషన్స్ కోర్టులలో, సిటీలో, జిల్లాలలో అనేకమంది లాయర్లున్నా బాలగోపాల్ లాగా ఇలా ఊర్లకు వెళ్ళి బాధితుల్లోని చిట్టచివరి వాడిని కూడా వెతికి పెట్టుకుని కేసులు వేసిన లాయర్లు అతి కొద్ది మంది మాత్రమే. ఇది అన్యాయాలను రికార్డు చేయడం మాత్రమే కాదు, ఒక నిజ నిర్ధారణ నివేదిక రూపంలో నిజాలాను బయటి ప్రపంచానికి తెలియజేయడం మాత్రమే కాదు; ఒక హక్కును న్యాయపోరాటంగా ముందుకు తీసుకుపోవడం, కోర్టులో పిటిషన్‌గా మార్చడం. తర్వాత ఆ క్లయింట్లతో మాట్లాడితే నాకు అర్థమైంది ఆ కేసులు కోర్టు దాకా ఎలా వచ్చాయో. "ఆ సార్ వచ్చి మా దగ్గర సంతకాలు తీసికెళ్ళాడు. ఆ తర్వాత ఏమైందో మాకేమీ తెలియదు" అన్నారు వాళ్ళు. ఆ లాయర్ తన కోసం ఒక స్టే ఆర్డర్ తెచ్చాడని కూడా క్లయింటుకు తెలియదు. అయితే ఆ అత్యంత పేద, బలహీన, అదృశ్య క్లయింటుకు ఒకటి మాత్రం తెలుసు తన భూమి నుండి తనను ఎవరూ గెంటేయడం లేదని. మరి వాళ్ళు కేసు ఫైళ్ళు వెనక్కి తీసుకోలేదంటే ఆశ్చర్యమేముంది? ఇటువంటి క్లయింట్‌లు ఇంకెక్కడా కనబడరు బాలగోపాల్ ఆఫీసులో తప్ప.

## నేపథ్య వివరణే ఆయన బలం

లాయర్‌గా బాలగోపాల్ గురించి చెప్పాల్సిన విషయం ఇంకోటుంది. పేదలు, స్త్రీలు, దళితులు, ఆదివాసులు, కార్మికుల కోసం కేసులు చేసే లాయర్లు చాలామందే ఉంటారు. అయితే వాళ్ళ వాదనలు ఎక్కువగా - యువర్ లార్డ్ షిప్...అతను చాలా పేదవాడు, ఆదివాసి - అంతే, వాక్యం అక్కడితో ఆగిపోతుంది. పేదవాడు, ఆదివాసి అదొక్కటే వాళ్ళకుండే వాదన. కాని పాపం ఆ పేదవాడి, ఆ ఆదివాసి, ఆ దళితుడి, ఆ స్త్రీ జీవితంలో ఇంకేదో ఉంటుంది కదా! వారు కోర్టుకు వచ్చి కేసు వేయడానికి ఒక నేపథ్యం ఉంటుంది కదా! అది చెప్పకుండా చాలాసార్లు ఏదో దయాబిక్ష అడిగినట్టు అడుగుతారు. కాని బాలగోపాల్ ఎప్పుడూ ఆ విధంగా వాదించలేదు. ప్రతి పిటిషనర్ వేసే కేసుకు ఆయన ఎంతో వివరమైన, అవసరమైన, జ్ఞానవంతమైన నేపథ్యాన్ని సమకూర్చేవారు. ఇంకా చెప్పాలంటే ఆయన వాదనల్లో పేద అనే పదం ఎప్పుడూ 'పేద' అనే అర్థంలో ధ్వనించదు; ఎంతో విలువైన, పదునైన వాదన వినిపించేందుకు ఒక సాధనంగా ఆయన దాన్ని వాడతారు. నేను ఆయన పుస్తకాలు ఎక్కువ చదవలేదు కాని అది నాకు ఎప్పుడూ లోటుగా అనిపించలేదు ఎందుకంటే వాటి సారమంతా నేను ఆయన కేసు ఫైళ్ళలో చదివాను. ఉదాహరణకు మళ్ళీ గొత్తికోయల ఇళ్ళ దహనం

కేసులన్నే తీసుకుందాం. అటవీ శాఖ వారి ఇళ్ళను ఎందుకు తగలబెడుతున్నారో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాన్ని ఆపాల్సిన అవసరం ఏమిటో, మొత్తం ఛత్తీస్‌గఢ్ కల్లోలం, సల్వాజుడుం ఆవిర్భావం, అన్ని విషయాలూ ఆ పిటిషన్‌లో ఉంటాయి. గొత్తికోయలు దంతేవాడ నుండి ఖమ్మం జిల్లాకు ఎందుకు రావాల్సి వచ్చిందీ, ఎందుకు సరిహద్దులు దాటాల్సి వచ్చిందీ, ఇక్కడ బిచ్చగాళ్ళలా ఎందుకు బతకాల్సి వస్తున్నదీ ఆ విషయాలన్నీ అందులో ఉంటాయి.

ఇంకో ఉదాహరణ కూడా చెబుతాను. కరీంనగర్ జిల్లా మల్హార్ రావు మండలంలో ఒక పెద్ద ప్రభుత్వ జాగా ఉంది. ఇప్పుడు అది ఏ జిల్లాలో ఉందో నాకు సరిగ్గా గుర్తు లేదు. వేరే జిల్లాలో కూడా ఉండొచ్చు. ఎప్పుడో చాలా ఏళ్ళ కిందట 600 మంది దళితులు, ఆదివాసులు కలిసి ఆ భూమిని ఆక్రమించుకుని పంటలు పండించుకుంటున్నారు. ఆక్రమణకు కారణం? 50 సంవత్సరాల క్రితం తమ ఊరి చుట్టుపక్కల గ్రామాలలో కలరా మహమ్మారి వ్యాపించడంతో వాళ్ళు ఇల్లు, పొలాలు, ఊర్లు వదిలి ఇక్కడికి వచ్చి స్థిరపడ్డారు. వాళ్ళ వారసులే ఇప్పుడు అందులో వ్యవసాయం చేసుకుంటున్నారు. బాలగోపాల్ తయారు చేసిన కేసు ఫైల్‌లో ఆ ప్రాంత చరిత్ర, వలస రావాల్సిన పరిస్థితులు మొదలైన వివరాలన్నీ ఉన్నాయి. అలాగే వంశధార ప్రాజెక్ట్ మీద ఆయన కేసు ఫైల్ చూస్తే నిర్వాసితుల సమాచారమే కాదు, ప్రాజెక్ట్ గురించి కూడా చాలా విషయాలు తెలుస్తాయి. ఒరిస్సా నుండి శ్రీకాకుళం వరకు కాలువ ఎడమవైపు ఉందా, కుడి వైపు ఉందా; ఎడమ వైపు ఎంతమంది నిర్వాసితులయ్యారు, కుడి వైపు ఎంతమంది నిర్వాసితులయ్యారు; మొత్తం వంశధార ప్రాజెక్ట్ చరిత్ర అంతా ఆ ఫైల్‌లో చదువుకోవచ్చు మనం. నేను ఈ విషయం ఎందుకు చెపుతున్నానంటే ఒక కేసుకు నేపథ్యం సమకూర్చడం బాలగోపాల్‌కు అకడమిక్ వ్యవహారం కాదు. కేవలం అకడమిక్ కారణాల కోసమైతే ఆయన ఏ కేసుకైనా చాలా సునాయాసంగా దాని నేపథ్యాన్ని సమకూర్చగలరు కాని ఒకటి గుర్తు పెట్టుకోండి. ఈ క్లయింట్లలో చాలామంది ఎటువంటి కాగితాలూ లేకుండా ఆయన దగ్గరకు వస్తారని. కాగితాలు లేకుండా హక్కులు సాధించుకుందామని కోర్టుకొస్తే ఏమవుతుందో తెలుసా! ఏ కోర్టూ వారి వాదనను అంగీకరించదు. కాని వాస్తవం ఏమిటంటే ఈ దేశంలోని పేదల వద్ద, దళితుల వద్ద, ఆదివాసుల వద్ద ఎలాంటి కాగితాలూ ఉండవు. రాజ్యం వాళ్ళ దగ్గర అటువంటి కాగితాలు ఏమీ లేకుండా జాగ్రత్త పడుతుంది. అందువల్ల ఇలాంటి కేసులలో వారిని రక్షించగలిగేది ఆ నేపథ్య వివరణే, సందర్భం అర్థమయ్యేలా

జడ్జిలకు వివరించగలిగే సమాచారమే. అలా చేస్తేనే జడ్జిలు ఒక ఇంటిని కూలగొట్టకుండా ఆపేందుకు, లేదా ఒక పొలం నుండి వారిని వెళ్ళగొట్టకుండా ఆపేందుకు స్టే ఆర్డర్లు ఇవ్వగలుగుతారు. కాగితాల లేమిని ఎదుర్కొనేందుకు అదొక్కటే మార్గం. బాలగోపాల్ ఆ మార్గాన్నే అనుసరించాడు. ఆయన ప్రతి పిటిషన్‌లోను ఆయా గ్రామాలు, క్లయింట్లకు సంబంధించి ఎంతో విలువైన సమాచారం ఉంది.

ఒక ఎన్‌కౌంటర్ కేసులో హతుడి భార్య న్యాయమైన, నిష్పక్షపాతమైన విచారణ జరపమని కోర్టును కోరింది. అందులో ఒక చిన్న వివరం ఉంది. భర్తను పోలీసులు తీసికెళ్ళేటపుడు ఆమె జీపు వెనకాల పరిగెత్తి, మావోయిస్టుగా అనుమానించబడుతున్న తన భర్తకు 5 రూపాయలు, కేవలం 5 రూపాయలు, రాత్రి భోజనానికని ఇస్తుంది. తర్వాత ఆమెకు తెలుస్తుంది ఆ రాత్రే అతన్ని ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపేశారని. బాలగోపాల్ ఎన్‌కౌంటర్‌లపై వేసిన కేసుల్లో ఇలాంటి వివరాలు ఎన్నో ఉంటాయి. బాలగోపాల్ రచనలు పుస్తకాలుగా వేస్తే వంద దాకా అవొచ్చంటారు, ఆయన కేసు ఫైల్స్ కూడా అచ్చు వేస్తే ఇంకెన్ని పుస్తకాలు అవుతాయో! పైగా వాటిలో పునరావృతాలు గాని, అతిశయోక్తులు గాని, సెంటిమెంట్లు గాని ఏమీ ఉండవు. కొందరు లాయర్లు ఎక్కువ చక్కెర వేసి టీ తయారు చేసినట్లు ప్రతి కేసునూ చాలా ఎక్కువ సెంటిమెంట్‌తో నింపేస్తారు. బాలగోపాల్ ఆ పని ఎప్పుడూ చేయలేదు. ఆయన పిటిషన్లన్నీ గట్టి వాదనతో ఉంటాయి.

## 'పవర్'కు బహు దూరం

ఇప్పుడు చెప్పబోయే అంశం నాకు అత్యంత ఇష్టమైన విషయం – ఒక లాయర్‌గా ఆయన కోర్టులో ఎలా నడుచుకున్నాడనేది. అందరి దృష్టీ తన వైపు ఉండాలని కోరుకోని వ్యక్తి బాలగోపాల్. కేసుకు అవసరమైనంత మేరకే మాట్లాడతాడు. గొత్తికోయలు, స్త్రీలు, ఎన్‌కౌంటర్ మరణాల వంటి కేసుల్ని వాదించేటపుడు మా బోటి లాయర్లు అనుకూల ఆర్డర్ల కోసం జడ్జిల కాళ్ళా వేళ్ళా పడుతుంటాం. ప్లీజ్ యువర్ లార్డ్ షిప్స్ ప్లీజ్, దయచేసి ఆ విషయాన్ని మరోసారి పరిశీలించండి...ఇలా బతిమిలాడుతుంటాం. కేసులోని ముఖ్యమైన విషయాలు చెప్పేశాక అందరం చేసేది అదే. ఏదో ఒక రకంగా కాస్త దయ చూపించి ఆర్డర్ ఇవ్వండి అనేదే మా అభిమతం. కాని బాలగోపాల్ ఆ పని ఎప్పుడూ చేసేవాడు కాదు. నేను చెప్పాల్సింది చెప్పాను, ఇవీ నిజాలు, ఇదీ చట్టం, ఇవీ జడ్జీలు గతంలో ఇచ్చిన తీర్పులు, ఇదీ ఈ విషయమై

గతంలో సుప్రీంకోర్టు చెప్పిన విషయాలు; ఇస్తే ఇవ్వండి, లేకపోతే లేదు, నేను పోతున్నాను అన్నట్టు ఉండేది ఆయన వైఖరి. ఆయన వాదనకున్న బలం అది.

ఒక లాయర్‌గా ఆయన సుగుణాలలో చెప్పాల్సింది ఇంకొకటుంది. కోర్టుల్లో చాలా పెత్తనం/అధికారం నడుస్తుంటుంది. జడ్జిలకు, లాయర్‌లకే కాదు, అటెండర్‌లకు కూడా చాలా పవర్ ఉంటుంది. నల్ల గౌన్లు వేసుకుని తిరగడాన్ని లాయర్లందరూ ఎంజాయ్ చేస్తుంటారు. హక్కుల కేసులు వాదించేటపుడు మేము కూడా కొంత పవర్‌ను చూపిస్తుంటాం. ఉదాహరణకు ఒక మావోయిస్టు కేసులో అతన్ని చిత్రహింసలు పెట్టిన ఒక పోలీసతను క్రాస్ ఎగ్జామినేషన్ కోసం సెషన్స్ కోర్టుకు వచ్చాడనుకోండి లాయర్ల పవర్ అంతా పూర్తిగా బయటకు వస్తుంది. ఇప్పుడు నేను క్రాస్ ఎగ్జామిన్ చేసి అతన్ని బాగా ఏడిపించాలి, బోనులోనే అతను కన్నీళ్లు పెట్టుకోవాలి అని అనుకుంటాం. అంత కోపం ఉంటుంది వాళ్ళ మీద. వాళ్లకు శిక్ష పడేలా చేయలేకపోయినా కనీసం ఈ మాత్రం న్యాయమైనా జరగాలి కదా అనుకుంటాం. కాని బాలగోపాల్ ఆ పని ఎప్పుడూ చేసేవాడు కాదు. ప్రదర్శన, నాటకీయతలకు ఆయన చాలా దూరం. ఆయన సాక్షిని ఒక 10 ప్రశ్నలు అడిగి వదిలేస్తాడు. అతగాడిని వీలైనంత సిగ్గు పడేలా చేయాలన్న ఆలోచన ఆయనకు ఉండదు. ఆ వ్యక్తి పది మందిని చంపిన పోలీస్ ఆఫీసర్ అయ్యుండొచ్చు. పదిమందిని ఎన్‌కౌంటర్ చేసిన వాడై ఉండొచ్చు, రేపిస్టు అయ్యుండొచ్చు, ఎవరైనా సరే సాక్షిని గౌరవించాలి అనేది ఆయన విశ్వాసం. తను అడగదలచుకున్న 10 ప్రశ్నలు అడిగేసి కూర్చుంటాడు. లాయర్లుగా మేము ఎంజాయ్ చేసే పవర్‌ను ఆయన ఎప్పుడూ ఎంజాయ్ చేయలేదు. పవర్ గేమ్‌లో ఆయన ఎన్నడూ భాగం కాలేదు.

లాయర్లకు ఇంకో పెద్ద కోరిక ఏముంటుందంటే ఎప్పటికైనా ఒక ఫుల్ బెంచ్ ముందు వాదించాలనేసి. ఒకసారి ఎన్‌కౌంటర్ల మీద వాదనలు వినడానికి ఐదుగురు జడ్జిలతో కూడిన ఫుల్ బెంచ్ ఏర్పాటైంది. చాలామంది లాయర్లు వెళ్ళి దాని ముందు వాదించారు. ఎన్‌కౌంటర్ అని చెప్పి కేసును మూసేయడానికి లేదని, అది నిజమైన ఎన్‌కౌంటరా లేక బూటకపు ఎన్‌కౌంటరా అని తేల్చడానికి ప్రతి ఎన్‌కౌంటర్ మీదా FIR నమోదు చేయాలని, విచారణ జరపాలని ఒకరి తర్వాత ఒకరు వాదనలు వినిపించారు. ఐదుగురు హైకోర్టు జడ్జిలు, అందునా సీనియర్ జడ్జిలు ఈ కేసును వినడమనేది హక్కుల లాయర్లకు, కార్యకర్తలకు అందరికీ చరిత్రాత్మక దినం లాంటిది. నిస్సందేహంగా వారి వృత్తి జీవితాల్లో అవి చాలా గొప్ప క్షణాలు. లాయర్లు ఢిల్లీ

నుండి వచ్చారు, చెన్నై నుండి వచ్చారు. హైదరాబాద్‌లోని హక్కుల లాయర్లు అందరూ మాట్లాడారు. మరి బాలగోపాల్ ఏం చేశాడు? ఆయన వాదించలేదు. ఇంతమంది వాదించాక ఇంక వాదించడానికి ఏముంది అనుకున్నాడు. తన వాదనలను లిఖితపూర్వకంగా ఇచ్చి వెళ్ళిపోయాడు.

బాలగోపాల్ ఎన్‌కౌంటర్ల గురించి దాదాపు 30 ఏళ్ళుగా మాట్లాడుతున్నాడు, అయినా ఫుల్ బెంచ్ ముందుకు వెళ్ళి మాట్లాడడం అవసరం అని అనుకోలేదు. “అందరూ తమ వాదనలు వినిపించారు కదా, నేను నా వాదనలను లిఖితపూర్వకంగా ఇస్తాను చాలు” అనుకున్నాడు. ఇది నా దృష్టిలో చాలా గొప్ప సుగుణం. దీన్ని ఎలా వివరించాలో నాకు తెలియడం లేదు, కాని పవర్‌లో భాగం కాకపోవడం ఆయన్ని ఈ రోజుకీ మహోన్నత వ్యక్తిగా నిలబెట్టింది. కోర్టుల్లో ప్రదర్శన ఉంటుంది, పవర్ ఉంటుంది, కాని ఆయన అందులో భాగం కాకుండా ఉండిపోగలిగాడు. మౌఖికంగా వాదించకపోయినా తీర్పు ఇచ్చేటపుడు కోర్టు ఆయన లిఖిత వాదనలకు ప్రాముఖ్యం ఇచ్చింది. ప్రతి కేసునూ తనే వాదించాలని, అన్ని చోట్లా తనే కనిపించాలని ఆయనకు ఉండేది కాదు. అలాంటి వ్యక్తి కాదాయన.

## ఒకే ఒక్కడుగా పని చేసుకుపోయాడు

ఆయన ఆఫీస్ గురించి చెప్పాలంటే, ఇక్కడ కొంతమందికి తెలిసి ఉండొచ్చు, ఇంట్లోనే ఒక చిన్న గదిలో ఉండేది ఆయన ఆఫీస్. కారు, డ్రైవర్ లాంటి సౌకర్యాలేమీ లేవు. నాతో సహా ఇద్దరు, ముగ్గురు జూనియర్‌లు ఉండేవారు కాని మా వల్ల ఆయనకు ఒరిగిందేమీ లేదు, మేము ఆయనకు పెద్దగా సహాయపడిందేమీ లేదు. ఆయనకు టైపిస్ట్ కూడా లేడు. ఆయన స్థాయి లాయర్ ఇంకెవరైనా, ఆయన ఫైల్ చేసే కేసుల సంఖ్యను బట్టి చూస్తే కనీసం ఇద్దరు టైపిస్టులను, ఒక అటెండర్‌ను పెట్టుకునేవారు. కాని ఆయనకు ఎవరూ లేరు. వెస్పా స్కూటర్ మీద ఒక కోర్టు నుండి ఇంకొక కోర్టుకు తిరుగుతూ కోర్టు పనులు చూసుకునేవాడు. తనే అన్ని డాక్యుమెంట్‌లూ టైప్ చేసుకునేవాడు. ఒక్క అఫిడవిట్‌లను మాత్రమే కాదు, తెలుగులో ఉన్న అన్ని మెటీరియల్ పేపర్‌లనీ తనే ఇంగ్లీష్‌లోకి తర్జుమా చేసి టైప్ చేసుకునేవాడు. స్పష్టంగా కనిపించని పత్రాలన్నిటినీ మళ్ళీ టైప్ చేసి కోర్టుకు ఇవ్వాల్సి వచ్చేది. అవన్నీ కూడా ఆయనే టైప్ చేసుకునేవాడు. ఒకసారి నేను అడిగాను ఎందుకు అన్ని డాక్యుమెంట్లూ మీరే టైప్ చేసుకుంటారు అని. టైప్ చేస్తే విషయం బాగా గుర్తుంటుందని, విచారణ సమయంలో

మెటీరియల్ పేపర్‌లను మళ్ళీ చదువుకోవాల్సిన అవసరం ఉండదని అన్నాడు. ఆయన నిజానికి టైప్ వచ్చినవాడు కూడా కాదు, రెండు వేళ్ళతో చేసేవాడు. ఒక రకంగా ఆయనది ఒంటి చేతితో నడిచిన ఆఫీస్, పెద్దగా ఎవరి దృష్టినీ ఆకర్షించకుండా నిశ్శబ్దంగా పని చేసుకుపోయిన ఆఫీస్. వీటన్నిటి కంటే కూడా ఇందాక చెప్పినట్లు కోర్టుకుండే పవర్‌లో, చట్టానికుండే పవర్‌లో భాగం కాకుండా ఆయన పని చేసుకు పోయిన పద్ధతి నాకు చాలా ఆదర్శప్రాయమైనది.

## చట్టం పరిమితులు ఆయనకు బాగా తెలుసు

చివరిగా చట్టాన్ని ఆయన ఎలా అర్థం చేసుకున్నారన్నది చూద్దాం. ఆయన చట్టానికి అమ్ముడుపోయాడనే విమర్శ ఒకటుందని మీకు తెలుసు. అయితే 8 ఏళ్ళుగా ఆయన ఫైల్స్ చదువుతున్న వ్యక్తిగా ఆ విమర్శతో నేను పూర్తిగా విభేదిస్తున్నాను. ఆయన ఎప్పుడూ అమ్ముడుపోలేదు. నిజం చెప్పాలంటే ఆయన చట్టం విషయంలో అత్యంత జాగరూకతతో ఉండేవాడు. చట్టానికి ఉండే పరిమితులు ఆయనకు తెలుసు, బాగా తెలుసు. ఆ విషయంలో ఆయన ఎప్పుడూ పొరబడలేదు. చట్టం నుండి ఏమి కోరాలనే విషయంలో ఆయనకు చాలా స్పష్టత ఉంది. చాలామంది లాయర్లకు అది ఉండదు. మా న్యాయవాదులు ప్రతి కేసులోనూ ప్రెయర్స్ (విన్నపాలు) అని ఒకటి తయారు చేస్తాం. దేవుడికి చేసే ప్రెయర్స్ కాదు, జడ్జిలకు నివేదించే ప్రెయర్స్ ఇవి. వీటిని ఎలా రాయాలో మాకు స్పష్టత ఉండాలి. చిన్న తప్పు దొర్లినా కేసు ఓడిపోతాం. ఈ విషయంలో బాలగోపాల్‌కి ఉండే స్పష్టత చూస్తే ఆశ్చర్యపోతాం. చట్టం పరిమితులు తెలుసు కాబట్టి ఏ విషయాల్లో కేసు వేయాలి, ఏ విషయాల్లో వేయకూడదు అని ఆయనకు అవగాహన ఉండేది. ఎవరైనా కేసు వెయ్యాల్సిన తరుణం కంటే ముందే వేస్తే ఆయనకు చాలా చిరాకొచ్చేది. ఒకటి రెండుసార్లు ఆ చిరాకును నేను ప్రత్యక్షంగా చూశాను కూడా. ముఖ్యంగా ఆ సమస్యపై ఒక సామాజిక ఉద్యమం లేదా రాజకీయ ఉద్యమం జరుగుతుంటే దాని మీద కోర్టుకు వెళ్ళడం ఆయనకు ఏ మాత్రం ఇష్టముండేది కాదు. ఆయన తన రచనల్లో రాశారో లేదో నాకు తెలియదు గాని కోర్టు ఆర్డర్ ద్వారా పొందే దాని కన్నా రాజకీయ ఉద్యమం ద్వారా పొందగలిగేదే ఎక్కువని, అదే స్థిరంగా ఉంటుందని ఆయన తరచూ అనేవారు. చట్టం పట్ల ఎంతో వివేకంతో వ్యవహరించే వారాయన.

ప్రజా ప్రయోజన వ్యాజ్యాల (PIL) విషయానికి వస్తే బాలగోపాల్ చాలా తక్కువ PIL కేసులే వేశారు. ఆయన కేసుల్లో అవే అన్నిటి కన్నా తక్కువ. అంటే ఆయనకు

చట్టం పట్ల ఆ మెలకువ, ఆ జాగ్రత్త ఉండేది. ఇవ్వాళ ఆయన లేని లోటును నేను ఇంతగా అనుభవిస్తున్నానంటే అది ప్రధానంగా చట్టం గురించిన ఆయన వివేకాన్ని మిస్ అవడమే; ఆయన జాగ్రత్తలను మిస్ అవడమే. చట్టం కొన్నిసార్లు మనల్ని ఎటెటో తీసికెళ్ళి పోతుంటుంది. అలాంటప్పుడు మనం అడిగిన దానికి పూర్తి భిన్నమైన ఫలితం వస్తుంటుంది. అది చాలా ప్రమాదకరం. మౌలికంగా చట్టం ఉన్నది శాంతి భద్రతలను కాపాడడానికే. అందువల్ల చట్టం ద్వారా న్యాయం పొందడానికి మనం ప్రయత్నించేటపుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. బాలగోపాల్‌కు ఆ వివేకం ఉంది. ఇవ్వాళ మనం మిస్ అవుతున్నది ఆ వివేకాన్నే.

## అన్నీ 'లో ప్రొఫైల్' కేసులే!

ముగింపుగా ఒక మాట చెప్పాలి. ఈ ఉపన్యాసం ఇవ్వడానికి నిజానికి నేను కొంచెం భయపడ్డాను. నేను రోజూ ఆయన కేసులే చేస్తున్నప్పటికీ ఆయన గురించి మాట్లాడడం వేరే కదా! బ్యానర్ మీద బాలగోపాల్ ఫోటో పక్కన నా పేరు కనబడేసరికి చాలా కంగారు అనిపించింది. టెన్షన్ వచ్చేసింది. సామాన్యంగా మేము లాయర్లం ఇంకో లాయర్ గురించి లేదా జడ్జి గురించి మాట్లాడాల్సి వస్తే వారికి బాగా పేరు తెచ్చిన కేసుల గురించి, లా జర్నల్స్‌లో రిపోర్ట్ అయిన వారి కేసుల గురించి; అంటే హై ప్రొఫైల్ కేసులు అంటారే అలాంటి వాటి గురించి మాట్లాడతాం. కాని బాలగోపాల్ విషయానికి వస్తే ఆయనకు అలాంటి కేసులు తక్కువే ఉన్నాయి. ఆయన కేసుల్లో ఎక్కువ భాగం ఒక ఎకరా 30 సెంట్ల ఆదివాసి రైతులవి లేదా 50 వేల రూపాయల బకాయిల కోసం కోర్టుకు వచ్చిన కార్మికులవి ఉంటాయి. బాలగోపాల్ స్థాయికి చేరుకున్న న్యాయవాదులెవరూ నిజానికి ఒక ఎకరా 30 సెంట్ల కేసులను తీసుకోరు. జూనియర్లకో, వేరే లాయర్లకో ఇచ్చేస్తారు. కాని ఆయన తన చివరి రోజు వరకు తన న్యాయశాస్త్ర పాండిత్యాన్ని ఆ ఎకరా 30 సెంట్ల వారి కోసం ఇస్తూనే వచ్చాడు. ఆయనలోని అత్యుత్తమ గుణం అది. మనందరం దాన్ని ఆయన నుండి నేర్చుకోవాలి.

ఇంకొక్క మాట. ఇక్కడున్న ఫోటోలో ఏ చొక్కా అయితే వేసుకున్నాడో అదే చొక్కాతో, అదే చిరునవ్వుతో ఆయన ఒకప్పుడు ఫిలిం మేకర్ దీపా ధనరాజ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో – మొండితనం, మొండిపట్టుదల అనేవి వాటంతటవే సుగుణాలు కాదు కాని ఉద్యమాలలో పాల్గొనేటపుడు అవి చాలా ఉపయోగపడతాయని అన్నాడు. కోర్టుల విషయంలోనూ ఆయన చెప్పింది అక్షరాలా నిజం. ఎప్పటి కంటే ఎక్కువగా

ఇవి ఇప్పుడు అవసరమవుతున్నాయి. లేకపోతే వాయిదాలలోనే న్యాయమంతా ఆవిరి అయ్యే ప్రమాదం ఉంది. బాలగోపాల్ చట్టాన్ని ఎప్పుడూ తక్కువ అంచనా వేయలేదు. చట్టం విషయంలో చాలా శ్రద్ధగా, జాగ్రత్తగా ఉండేవాడు. బాలగోపాల్ లాయర్ మాత్రమే కాదు, లా స్కాలర్ కూడా. ఆయన వాదనలు కోర్టుకే పరిమితం కాదు, కమిషన్‌లకు సమర్పించే పత్రాలలో కూడా ఆయన చట్టానికి సంబంధించి అనేక విలువైన సూచనలు చేశారు. వెనకబడిన తరగతుల కమిషన్‌కు ఇచ్చిన 10 పేజీల పత్రంలో ఇతర రాష్ట్రాలలో ఆ కమిషన్‌లు ఎలాంటి విచారణ జరిపాయో, ఆ అంశం మీద సుప్రీంకోర్టు గతంలో ఏం చెప్పిందో ఆ విషయాలన్నీ చాలా వివరంగా రాశారు.[1]

మేము కూడా ఆయన లాంటి లాయర్లు కాగలిగితే ఎంత బాగుంటుంది కదా అనిపిస్తుంది. పవర్‌లో భాగం కాకుండా ఉండే ఆయన లాంటి గుణాలున్న లాయర్లు మనకు మరెంతో మంది ఉంటే బాగుంటుంది కదా అని కూడా అనిపిస్తుంది. లా కున్న పవర్‌లో భాగం కాకుండానే మంచి లాయర్ కావడానికి మనమంతా ప్రయత్నించాలి. శెలవ్.

**వసుధ నాగరాజ్**

అడ్వకేట్

(2017 లో వరంగల్ లోని కాకతీయ యూనివర్సిటీలో ఇంగ్లీష్‌లో ఇచ్చిన బాలగోపాల్ స్మారకోపన్యాసానికి తెలుగు అనువాదం. స్పష్టత కోసం అక్కడక్కడ కొద్దిగా ఎడిట్ చేశాం.)

---

1. ఒక్క వెనకబడిన తరగతుల కమిషన్‌కే కాక బాలగోపాల్ అనేక కమిషన్‌లకు మెమొరాండంలు, సూచనలు రాత పూర్వకంగా ఇచ్చారు. ఎన్‌కౌంటర్ల మీద, లాకప్ హత్యల మీద జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు చాలా వివరమైన కంప్లైంట్స్ ఇచ్చారు. దళితుల, ఆదివాసుల సమస్యల పరిష్కారానికి ఏమేమి చెయ్యవచ్చో చెబుతూ పున్నయ్య కమిషన్‌కు ఒక మెమొరాండం ఇచ్చారు. విశాఖ హెచ్.పి.సి.ఎల్ ప్రమాదం మీద వేసిన జైన్ కమిషన్‌కు, సింగరేణి గని ప్రమాదం మీద వేసిన కమిషన్‌కు, లా కమిషన్‌కు, ప్లానింగ్ కమిషన్‌కు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేసిన ల్యాండ్ కమిషన్‌కు, విద్యుత్ రెగ్యులేటరీ బోర్డు లాంటి చాలా వాటికి ఆయన సూచనలు, నివేదికలు ఇచ్చారు. ఆయా కమిషన్లు, కమిటీలు తమ నివేదికలు ఇచ్చిన తరువాత కూడా వాటి మంచిచెడ్డలను ప్రజల హక్కుల కోణం నుంచి పరిశీలిస్తూ, విమర్శిస్తూ వివరమైన వ్యాసాలు రాసారు. ఇవన్నీ మరో పుస్తకంగా వేస్తున్నాం. దాని పేరు 'కమిషన్ నివేదికలు: సామాజిక న్యాయం' – మానవ హక్కుల వేదిక.

# ప్రజాస్వామ్య పరిణతితోనే సాధ్యం

సామాజిక న్యాయం అనేది 19వ శతాబ్దపు తొలిరోజుల్లో పారిశ్రామిక విప్లవ కాలంలో తలెత్తిన భావన. మానవ శ్రమను విపరీతంగా దోచేస్తూ పెట్టుబడి సంచయాన్ని పెంచేసుకుంటున్న కాలంలో మానవ శ్రమను కొల్లగొట్టడానికి విరుగుడుగా ఈ భావన తలెత్తింది. అందువల్లనే ఆ ప్రారంభ దినాల్లో సామాజిక న్యాయ భావనను ప్రతిపాదించినవారు, ప్రచారం చేసిన వారు, వారి మద్దతుదారులు పెట్టుబడి – శ్రమలు సృష్టించిన సంపద పునఃపంపిణీ మీదనే ప్రధానంగా దృష్టి పెట్టారు.

పెట్టుబడికి, శ్రమకి మధ్య గల అసమాన సంబంధాలు శ్రమ శక్తిని కొల్లగొట్టడానికి తోవ ఏర్పరుస్తున్నాయనీ, ఈ సంబంధాలు అన్యాయపూరితంగా ఉన్నాయనీ చెబుతూ సామాజిక న్యాయం అనే భావనను ముందుకు తీసుకొచ్చి ఈ సంబంధాలలోని అసమానత్వాన్నీ, అప్రజాస్వామికతనూ చెరిపివేయటానికి ప్రయత్నించారు.

ఇరవయ్యో శతాబ్దపు మధ్య కాలానికి ఈ భావనలో అదనపు అంశాలు వచ్చి చేరాయి. సంపద పంపిణీ సక్రమంగా జరిగితే సామాజిక న్యాయం జరిగినట్లేనని అనుకొన్న వారిలో కాలక్రమంలో పెట్టుబడి ప్రతాపంతో సమాజంలో ఇతర రంగాలలో సంభవిస్తున్న మార్పులు కనువిప్పు కలిగించాయి. సంపద పునఃపంపిణీ మాత్రమే జరిగితే సామాజిక న్యాయం కొంతవరకు జరగొచ్చు కాని అది పాక్షికమేననీ, ఆ భావన ఇంకా విస్తృతిని సంతరించుకోవాలనీ వారికి అర్థమైంది.

ఈ అవగాహన ఫలితమే జాతి వివక్ష, లింగ వివక్ష, పర్యావరణ విధ్వంసం మొదలైన ఇతర అసమాన అభివ్యక్తులు సామాజిక న్యాయం అనే భావనలో వచ్చి చేరాయి. శరీరపు రంగు కారణంగా ఒక జాతి ఎడల పాటించే వివక్ష, స్త్రీల,

ట్రాన్స్ జెండర్స్ ఎడల అనుసరించే వివక్షలు సామాజిక న్యాయరాహిత్య ఫలితమే. పర్యావరణ విధ్వంసం జరిగినా అది సామాజిక న్యాయానికి విఘాతం జరిగినట్లే.

మన దేశానికి వస్తే అనుసూచిత కులాల, తెగల వారు ఎదుర్కొనే భయంకర వివక్ష, సామూహిక జీవనంలోనూ అధికారంలోనూ వారికి ప్రాతినిధ్యం లేకపోవడం వంటి అంశాలు సామాజిక న్యాయం అనే భావనలో అంతర్భాగమే. ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు మాత్రమే కాదు, ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేసే పలు చర్యలు సైతం సామాజిక న్యాయంలో భాగమే. అసమ్మతిని అణచివేయడం అంటే సామాజిక న్యాయాన్ని తిరస్కరించడమే.

సమాన హక్కులు, సమాన అవకాశాలు, సమాన పరిగణింపు లాంటివి అందరికీ ఉండే స్థితి ఉండాలి. ఒక్క మాటలో చెప్పాలంటే ఓ మనిషి నిండైన మనిషిగా ఎదిగేందుకు ఎలాంటి ఆంక్షలూ ఉండకూడదు. తనలో గల శక్తి సామర్థ్యాలను సమాజ బాగు కోసం వినియోగించడానికి ఆటంకాల రూపంలో ఎలాంటి వివక్షలూ అడ్డు రాకూడదు. అలాంటి స్థితి ఉండే సమాజాన్ని సామాజిక న్యాయం అమలు అవుతున్న సమాజంగా అర్థం చేసుకోవచ్చునేమో.

వర్ణధర్మాలను సంకరం చెందనీయకుండా కాపాడడమే భారత ఫ్యూడల్ రాజ్య విధి. వివక్షను పాటించడమే ఆనాడు రాజధర్మం. వర్ణ ధర్మాన్ని అతిక్రమించి తపస్సు చేసినందుకే శంబుకుడిని క్షత్రియ రాజైన రాముడితో చంపించారు బ్రాహ్మణులు... అదే...ఋషులు. వర్ణ ధర్మాన్ని అతిక్రమించి తన బొమ్మనే గురువుగా భావించి విలువిద్య నేర్చుకున్నందుకు ఏకలవ్యుడి బొటనవేలును అతని చేతే నరికించాడు ఆచార్య ద్రోణుడు. ఆనాడు వివక్ష లేని పాలన అంటే అది ధర్మాతిక్రమణే! ఈ ధర్మాతిక్రమణకు పాల్పడినందుకే వేనుడు బ్రాహ్మణాగ్రహానికి గురయ్యాడు; వాళ్ల చేతుల్లో హతుడయ్యాడు.

వేనుడి కుడి భుజాన్ని ఋషులు మధిస్తే పుట్టిన పృథువు అందుకే పుట్టీ పుట్టడంతోనే బ్రాహ్మణులకు విధేయుడు అయిపోయాడు. రాజ ధర్మాన్ని పాటిస్తానని అన్నాడో లేదో...సమస్త సుగుణాలు అతనిని ఆవహించాయి. దైవాంశ అతనిలో ప్రవేశించింది. శస్త్రాస్త్రాలు అతనికి దాసోహం అన్నాయి. అతను అతిలోక సుందరుడు. జగదేకవీరుడు అయిపోయాడు! అతని పరిపాలనలో రాజకీయ న్యాయమూ లేదు; ఆర్థిక న్యాయమూ లేదు; సామాజిక న్యాయమూ లేదు. అలా రాజధర్మం సజావుగా అమలయిపోయింది.

ఆ తర్వాత కాలంలో రాజు సమధర్మాన్ని పాటిస్తూ పౌరులందరికీ న్యాయం జరిగేలా పాలన జరపాలని సైద్ధాంతిక స్థాయిలో చెప్పుకున్నా ఆచరణలో ఈ వివక్షాపూరిత రాచరిక పరిపాలనే రాజధర్మంగా బహుకాలం సాగింది. భారత స్వాతంత్ర్యోద్యమకారులు స్వప్నించిన నవ భారతంలో వివక్షకు చోటు లేదు కాబట్టే భారత సంవిధానంలోని 14వ అధికరణం చట్టం ముందు సమానత్వాన్నీ, చట్టపు సమాన రక్షణనూ రాజ్యం ఏ వ్యక్తికీ నిరాకరించరాదు అని ప్రకటిస్తుంది. అప్పటికే పడమటి దేశాలలో పుట్టి అభివృద్ధి అవుతున్న రాజకీయ–ఆర్థిక–సామాజిక న్యాయ భావనలు భారత ప్రజల జీవనంలో కూడా అంతర్భాగం కావాలని వారు కోరుకున్నారు. వారి ఆకాంక్షల ప్రకారమే భారత రాజ్యం భూస్వామ్య రాజ ధర్మాన్ని తోసిపుచ్చి, ప్రజాస్వామిక రాజ్యాంగ ధర్మాన్ని స్వీకరించింది. పౌరులందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని చేకూర్చడమే రాజ్యాంగ లక్ష్యం అని ప్రకటించుకున్నాం.

ఎన్నెన్నో హక్కులు, స్వేచ్ఛలు పొందుపరచబడ్డ మన రాజ్యాంగ అధికరణాలను చూసి మైమరచిపోయిన గ్రాన్ విల్లీ ఆస్టిన్ అనే రాజ్యాంగ పండితుడు భారత రాజ్యాంగం సామ్యవాద సమాజాన్ని సాకారం చేసే పత్రం అని పొగిడాడు. ఇంత గొప్ప రాజ్యాంగాన్ని తాను ఎక్కడా, ఎన్నడూ చూడలేదు అంటూ తన్మయుడైపోయాడు.

నిజమే...అమూర్త స్థాయిలో చూసినప్పుడు రాజ్యాంగంలోని మూడవ, నాలుగవ భాగాలు గొప్పగానే కనిపిస్తాయి. కాని నాలుగో భాగంలోని మార్గదర్శక సూత్రాలను అమలు చేయమని ఎవరూ కోర్టును అడగడానికి వీలు లేదు! పైగా ప్రభుత్వ విధానాలను కోర్టులలో ప్రశ్నిస్తే అది పాలసీ విషయం కదా, మేము ఎలా జోక్యం చేసుకోగలం అంటూ కోర్టులు తిరస్కరిస్తూ పోయాయి.

ఆస్టినూ అనుకున్నాడు; రాజ్యాంగ పరిషత్తులోని కొందరు సభ్యులూ ఆశించారు: భారత రాజ్యాంగం దేశంలో సమూల మార్పుకు, అదీ సామ్యవాద, లౌకిక సమాజ ఏర్పాటుకు దోహదం చేసే సాధనంగా పనికొస్తుందని. అయితే రాజ్యాంగం ఒక భ్రమ అని అప్పుడే కొందరు విమర్శించారు. ఆ విమర్శను అబద్ధం చేయడం ఎందుకు అనుకున్నారో ఏమో కానీ సంపద కేంద్రీకరణకు దోహదం చేసేలా పాలకులు ప్రభుత్వ విధానాలను రూపొందించారు. అప్పుడే తలెత్తింది ఒక ప్రశ్న – ప్రభుత్వ విధానాలు రాజ్యాంగ లక్ష్యాలను వక్రీకరిస్తుంటే సుప్రీంకోర్టు, హైకోర్టులు ఎందుకు పట్టించుకోవడం లేదు అనే ప్రశ్న.

మరి కోర్టులు కూడా రాజ్యంలో భాగమేనా ? రాజ్యం ఆడే తైతక్కలాటలకు అవి దరువు వేయాల్సిందేనా?

హక్కుల అధ్యాయానికి సంబంధించి కోర్టులు రాజ్యంలో భాగం కాదు అనే విధంగానే పన్నెండవ అధికరణం రాజ్యం అనే భావనను వివరించింది.

రాజ్యాంగంలో పేర్కొన్న హక్కులన్నీ ఉదాత్తమైనవే. రాజ్యాంగ పీఠిక ప్రకటించిన లక్ష్యాలూ ఉదాత్తమైనవే. మూడవ భాగంలో ప్రకటించిన హక్కులను మరింత అర్థవంతం చేయాలంటే చట్టసభలు వాటికి నిర్దేశించిన అంశాల్లో, పద్ధతుల్లో చట్టాలు చేయాలి. చట్టాలను అమలు చేసే బాధ్యత ప్రభుత్వాలది. చట్టసభల, ప్రభుత్వాల ఉమ్మడి కృషితోనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లగలుగుతుంది. ఆ వికాసం జరిగేలా చట్టాలు ఉన్నాయా, ప్రభుత్వ చర్యలు అందుకు దోహదం చేస్తున్నాయా అని సమీక్షించే అధికారం సుప్రీంకోర్టుది, హైకోర్టులదీను.

* * *

హక్కుల అతిక్రమణకు శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలలో ఏది పాల్పడినా దాన్ని సరిదిద్ది సామాజిక న్యాయం కల్పించేలా చూడాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థది. మన రాజ్యాంగమూ, చట్టాలూ ఉదాత్తమైనవని అమూర్త స్థాయిలో ఊదరగొట్టే పని మానుకుని వాటిని అమలు చేయకపోవడం వల్ల సామాజిక న్యాయానికి కలుగుతున్న హానిని కోర్టులు పట్టించుకోవాలి. బాలగోపాల్ రాసిన ఈ వ్యాసాలలో మనకు ఆ తపన, ఆర్తి కనిపిస్తాయి. సామాజిక న్యాయాన్ని ప్రజలకు అందించే 'పవిత్ర కృషి'లో సుప్రీంకోర్టు, రాష్ట్రాల హైకోర్టులు ఏ మేరకు సఫలమయ్యాయో వివేచించడమే ఈ వ్యాసాలు చేసే పని.

రాజ్యాంగంలో నిక్షిప్తమైన సంక్షేమ తాత్విక భావనలను అర్థం చేసుకోవటంలో సుప్రీంకోర్టు, హైకోర్టులు నిర్దిష్ట సందర్భాల్లో ఎలా విఫలమయ్యాయో, ఆ వైఫల్యానికి కారణం ఏమిటో ఈ వ్యాసాలు పట్టి చూపుతాయి. సామాజిక న్యాయం చేయవలసిన సందర్భాలు కోర్టులకు ప్రతి కేసులోనూ ఎదురుకావు. కానీ సందర్భం వచ్చినప్పుడు కోర్టులు ఈ విషయంపై చూపవలసిన శ్రద్ధ చూపకపోవడానికి అసలు కారణం తీర్పులు ఇవ్వవలసిన వారిలో రాజ్యాంగ స్ఫూర్తి కొరవడడమేనని బాలగోపాల్ విమర్శిస్తారు. కోర్టులు కుల జాడ్యం నించి బయట పడలేదని చెప్పడానికి చుండూరు కేసును వివరిస్తాడు బాలగోపాల్. కోర్టులు తిరోగమన భావజాల సంకెళ్లలో, గ్లోబలైజేషన్

మాయలో ఇరుక్కుపోయాయని ఆయన చేసిన ఆక్షేపణ న్యాయపాలనలోని ప్రతి వ్యక్తినీ అంతర్మథనానికి గురి చేయాలి. ఈ వ్యాసాలకు ఆ శక్తి ఉంది.

భారీ ప్రాజెక్టుల వల్ల అందరికన్నా ఎక్కువ నష్టపోయేది ఆదివాసులే. వారి జీవనం ధ్వంసమవుతుంది. వైవిధ్య భరిత జీవనం అంతరిస్తుంది. జీవవైవిధ్యం నాశనమవుతుంది. ఇదేమీ 'అభివృద్ధి' గంతలు కట్టుకున్నవారికి పట్టదు. జడ్జీలు కూడా ఆ జాబితాలో చోటు కోసం ప్రయత్నించడం క్షమించరానిది అంటాడు బాలగోపాల్ సర్దార్ సరోవర్, నర్మదా ప్రాజెక్టుపై రాసిన వ్యాసాల్లో.

సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిల అభిప్రాయాలు ఒక్కోసారి మామూలు మనిషి అభిప్రాయాల స్థాయిని దాటక పోవడాన్ని బాలగోపాల్ తప్పుపడతాడు. రాజీవ్ గాంధీ హత్య కేసులో ముద్దాయి అయిన నళిని మురుగన్ ప్రేయసే తప్ప నేరం చేయాలనే ఆలోచన ఆమెకు ఉండి ఉండకపోవచ్చునని, పైగా ఆమె స్త్రీ కాబట్టి ఆమెకు మరణశిక్ష సమంజసం కాదు అని జస్టిస్ థామస్ అభిప్రాయపడగా, అదెలా కుదురుతుందీ మానవ బాంబుగా మారిన థాను ఆడది కాదా అని ప్రశ్నిస్తూ నేరంలో స్త్రీ–పురుష అంతరాన్ని చూడకూడదు అంటూ మెజారిటీ తీర్పు రాసిన జస్టిస్ వాధ్వాను బాలగోపాల్ తీవ్రంగా విమర్శించడం చూస్తాం. నళిని–మురుగన్ ల బిడ్డ అనాథ అయిపోతుంది అనే అభిప్రాయానికి ప్రతిగా ఈ హత్యాకాండ వల్ల కోకిల అనే బాలిక, ఆమె తల్లి కూడా చనిపోయారని, అందువల్ల వారిపై కరుణ చూపాల్సిన అవసరం లేదని చెప్పే జస్టిస్ వాధ్వా తీర్పులో మామూలు మనిషికి ఉండే ప్రతీకారేచ్ఛ కనిపిస్తోంది అని బాలగోపాల్ అంటాడు.

రిజర్వేషన్లు ప్రజాస్వామిక ఆచరణకు ఒక తార్కాణం. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తొలి రోజుల్లోనే రిజర్వేషన్లకు పెద్ద దెబ్బ తగిలింది. మద్రాసు హైకోర్టు, పాట్నా హైకోర్టు రిజర్వేషన్లను తప్పు పట్టాయి. రిజర్వేషన్లు ఇవ్వడానికి వీలు కల్పించే అధికరణాలు స్పష్టంగా లేవని ప్రకటించి సమానత్వ సిద్ధాంతానికి రిజర్వేషన్లు వ్యతిరేకం అని వ్యాఖ్యానించాయి. దాంతో రిజర్వేషన్ల రాజ్యాంగబద్ధత పైనే ప్రశ్న ఉదయించింది. రాజ్యాంగ పరిషత్తు ఆశించిన సామాజిక న్యాయం కోర్టుల్లో ఇలా భంగపాటుకు గురయ్యేసరికి నెహ్రూ ప్రభుత్వం హతాశురాలైంది. దీన్ని సరిదిద్దడానికి రాజ్యాంగం అమలులోకి వచ్చిన 16 నెలల్లోనే మొదటి రాజ్యాంగ సవరణ చట్టాన్ని నెహ్రూ ప్రభుత్వం పార్లమెంటుతో ఆమోదింపచేసుకుంది. ఈ సవరణ జనవరి 26, 1950 నుంచి అమల్లోకి వచ్చినట్లు భావించాలని కూడా ప్రకటించింది. ఇది అసాధారణ రాజ్యాంగ

సవరణ. దాంతో రిజర్వేషన్లకు లైన్ క్లియర్ అయింది. అయితే సవరణ తర్వాత అయినా అవి ఒప్పుకున్నాయా?

రిజర్వేషన్ల గురించి "సుప్రీంకోర్టు ఇప్పటికీ రెండు సందేహాలతో కొట్టుమిట్టాడుతోంది. సామాజికంగానూ, విద్యాపరంగానూ వెనకబడ్డ వర్గాలు ఏవని గుర్తించడానికి కులం ఏకైక లేదా ప్రధాన ప్రాతిపదిక కాగలదా అనేది ఒక సందేహం. మొత్తం రిజర్వేషన్లకు ఒక గరిష్ట పరిమితి ఉండనవసరం లేదా అనేది రెండో సందేహం" అని చెబుతూ ఈ సందేహాల కంటే 'న్యాయస్థానాల వైఖరే అసలు సమస్య' అని బాలగోపాల్ నిర్మొహమాటంగా విమర్శిస్తాడు. "1950 ల నుంచి 1970 ల దాకా ప్రైవేటు ఆస్తిని ప్రభుత్వపరం చేసే చట్టాలకు, ప్రభుత్వ ఆదేశాలకు సుప్రీంకోర్టు అడ్డం పడడం, ఆ అడ్డంకిని తొలగించుకోవడానికి ప్రభుత్వం ఒకటికి నాలుగుసార్లు రాజ్యాంగాన్ని సవరించడం జరిగింది. ఇప్పుడు ప్రైవేటు ఆస్తులను పెంచే పనే తప్ప స్వాధీనం చేసుకునే ఆలోచన ప్రభుత్వాలు చేయడం లేదు కాబట్టి ఆ విషయంలో ప్రభుత్వానికీ, న్యాయస్థానాలకూ ఘర్షణ పాత చరిత్ర అయిపోయింది. దాని స్థానాన్ని రిజర్వేషన్స్ ఆక్రమించుకున్నాయి. మెట్టుమెట్టుగా సుప్రీంకోర్టు అడ్డుపడడం, ప్రభుత్వం రాజ్యాంగాన్ని సవరించి సామాజిక న్యాయ లక్ష్యాన్ని కాపాడడం జరుగుతున్నది" అని కోర్టును తీవ్రంగా విమర్శిస్తాడు బాలగోపాల్.

ఎన్కౌంటర్ మరణాల దర్యాప్తు విషయంలో ఏమేమి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయమై జాతీయ మానవ హక్కుల కమిషన్ గతంలో కొన్ని సూచనలు చేసింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో వేసిన కేసులలో కూడా ఈ సూచనలను అమలు పరచడం లేదనేది ఒక ఫిర్యాదు. ప్రధాన వాదన మాత్రం "ప్రతి ఎన్కౌంటర్ మరణమూ శిక్షార్హమైన బలవన్మరణమే (Every encounter is a culpable homicide)" అనేది. అంటే ఒక రకంగా అది హత్యే అని అర్థం. ఒక హత్య కేసు పోలీసుస్టేషన్లలో రిపోర్టు అయితే పోలీసులు ఎలా అయితే ప్రాథమిక సమాచార నివేదిక జారీ చేసి దర్యాప్తు చేస్తారో, ఎన్కౌంటర్ రిపోర్టు అయినప్పుడు కూడా అలానే ఎఫ్ఐఆర్ కట్టి దర్యాప్తు చేసి ఎన్కౌంటర్ మరణానికి పాల్పడిన వ్యక్తులపై హత్య కేసు కింద ఛార్జిషీటు దాఖలు చేయాలి అని లాయర్లు సి. పద్మనాభరెడ్డి, కె.జి. కన్నబిరాన్, తారకం, బాలగోపాల్లు వాదించారు. ఈ వాదనలతో జస్టిస్ బిలాల్ నజ్కీ ఒక్కరే అంగీకరించారు. ధర్మాసనంలోని తక్కిన ఇద్దరు జడ్జీలు 'ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే ఎఫ్ఐఆర్ జారీ

చేయాలని' 13.7.2007న తీర్పు చెప్పారు. అయితే ఆ తర్వాత విస్తృత ధర్మాసనం తరఫున జస్టిస్ గోడ రఘురామ్ 6.2.2009 నాడు ప్రకటించిన తీర్పులో బిలాల్ నజ్కీ అభిప్రాయాన్నే బలపరిచారు. ఎన్‌కౌంటర్‌ల పట్ల కోర్టుల వైఖరి గురించి ఈ పుస్తకంలో ఉన్న బాలగోపాల్ వ్యాసాలు మూడూ మన అవగాహనకు ఎంతో తోడ్పడతాయి.

కొన్ని సందర్భాలలో కోర్టులు చేసుకునే అనవసరపు జోక్యం మీద బాలగోపాల్ చాలా చిరాకు పడతాడు. జూనియర్ డాక్టర్‌ల సమ్మె మీద రాసిన వ్యాసంలోనూ, కన్నడ సినిమా నటుడు రాజ్‌కుమార్ కిడ్నాప్ విషయంపై రాసిన వ్యాసంలోనూ అది మనకు కనిపిస్తుంది.

ప్రజాస్వామిక ఆచరణ నిరంతర ప్రక్రియ. దాన్ని ఎన్నికలకు మాత్రమే కుదించకూడదు. హక్కుల ఉల్లంఘనలపై కోర్టులో వేసిన ఫిర్యాదులు, వాటిపై వాదనలకు మాత్రమే ఈ ప్రక్రియ పరిమితం కాకూడదు. ప్రజాభిప్రాయ ప్రకటనకు వేదికలు రోడ్లే. అంటే సభలు–సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, పికెటింగులూ. ఈ సాధనాలను నియంత్రించడానికి పూనుకున్న కోర్టులపై విరుచుకు పడతాడు బాలగోపాల్. కార్మికులు సమ్మెలు చేయకుండా ఇన్ని రకాల హక్కులను సాధించుకోగలిగే వారా? ఓ వైపు హక్కుల కోసం కోర్టులో పిటిషన్లు దాఖలు చేస్తూ, కోర్టు బయట ఉద్యమాలు చేస్తారా, వాటిమీద ప్రచారం చేస్తారా అని ఆగ్రహించే కొంతమంది జడ్జిలకు బాలగోపాల్ తగిన జవాబు చెప్పారు. రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించాలని ఇటీవల రైతులు చేసిన మహోద్యమం సందర్భంలో కూడా రైతులకు అదే సూచన చేయబోయింది సుప్రీంకోర్టు ధర్మాసనం. ఓ నిపుణుల కమిటీని వేస్తున్నాం, దాని రిపోర్టు వచ్చేంత వరకు ఆగండి అని రైతులకో సూచన చేయబోయారు న్యాయపీఠం మీద ఉన్న జడ్జిలు. ఆ కమిటీని తాము గుర్తించనే గుర్తించం అని రైతులు తమ ఉద్యమాన్ని ఉధృతం చేశారు. మోడీ ప్రభుత్వ మెడలు వంచారు. రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకొనేలా చేయగలిగారు. ధర్మాసనం మాట మన్నించి ఉద్యమాన్ని విరమించి ఉంటే రైతులు ఏ నట్టేట మునిగి ఉండేవారో!!

కోర్టులు మంచి తీర్పులను అసలు ఇవ్వనే లేదా అంటే ఇచ్చిన సందర్భాలలో బాలగోపాల్ వాటిని ప్రశంసిస్తూనే రాశాడు. రోగులకు సమాచార హక్కు ఉందని ఇచ్చిన తీర్పు పైనా, స్వలింగ సంపర్కాన్ని నేరంగా చూపే భారత శిక్షా స్మృతిలోని

సెక్షన్ 377 ను రాజ్యాంగ విరుద్ధం అని కొట్టివేస్తూ ఇచ్చిన తీర్పుపైనా బాలగోపాల్ సానుకూలంగానే స్పందించాడు.

సామాజిక న్యాయం పొందడం ప్రతి భారతీయుడి హక్కు. పాలకులు పౌరులకు దాన్ని దూరం చేసినట్లయితే కోర్టులు వారికి న్యాయం చేయాలి. అందుకు రాజ్యాంగ పీఠికను ఆవాహన చేసుకోవాలి. అసమ్మతి ప్రజాస్వామ్యానికి గుండెకాయ అనే గుర్తింపు, స్పృహ కలిగి ఉండాలి. ప్రజాస్వామ్యం ప్రజల నిత్యజీవితంలో అంతర్భాగం కావాలనే తపన ఉండాలి. హక్కుల అధ్యాయాన్ని అవి ఎలాంటి మినహాయింపులూ లేకుండా అమలు చేయాలి. ప్రభుత్వాలు తమ విధానాలను రూపొందించేప్పుడు నాలుగవ భాగంలో పేర్కొన్న మార్గదర్శక సూత్రాలను పాటించాలని వారికి చెప్పగలగాలి. మూడవ భాగంలో పేర్కొన్న హక్కులను, నాలుగో భాగంలో పేర్కొన్న మార్గదర్శక సూత్రాలను జమిలిగా అమలు జరిపితేనే రాజ్యాంగ లక్ష్యాలను సాధించగలం అనే ఆలోచనను పెంపొందింపజేయాలి. అప్పుడే కోర్టులు 'సామాజిక న్యాయానికి' న్యాయం చేయగలుగుతాయి.

కాని "పాలకుల ప్రయోజనాలకు ఇబ్బందికరమైన తీర్పులు, రాజ్యాంగ ఆదేశాలు అమలు కావనేది మన నిత్య జీవితంలో అనుభవం" అని బాలగోపాల్ ఒక చోట అంటారు. అది నిజమే అయినా మనం కోర్టు తలుపులు తడుతూ ఉండక తప్పదు, సామాజిక న్యాయ వాదనలను వినిపిస్తూ ఉండక తప్పదు. హక్కుల పరిరక్షణ మీ బాధ్యతే అని వారికి మనం పదేపదే చెబుతూ ఉండాల్సిందే. మానవ హక్కుల న్యాయసిద్ధాంతం (Human Rights Jurisprudence) ఇండియాలో పరిణతి చెంది, లాయర్ల, జడ్జీల అంతఃచేతనలోకి అది ఇంకి పోయేంత వరకూ ఈ కృషి సాగాల్సిందే. అందుకు ఈ సంకలనం తోడ్పడుతుందని ఆశిస్తాను.

**గొర్రెపాటి మాధవరావు**

అడ్వకేట్

# కన్యాశుల్కం
# రాజ్యం-రాజ్యాంగయంత్రం

బ్రిటిష్ వాళ్ల కోర్టులు వాళ్ల దేశంలో ఎట్లా పని చేస్తాయో గానీ ఇక్కడ మట్టుకు వాటిని నెలకొల్పిన నాటి నుండి ఈనాటిదాకా ఒకే రకంగా భ్రష్టుపట్టి ఉన్నాయి. ఒక్క కోర్టు సంగతే ఎందుకు, రాజ్యాంగయంత్రమంతా అంతే. రాశిలో నానాటికీ పతనం లేకపోలేదు గానీ గుణం మట్టుకు ఆనాడూ ఈనాడూ ఒక్కటే. 'మా చట్టాలు మంచివేగానీ మీ రామప్పపంతుళ్ళ నియోగపు తెలివితేటలు వాటిని భ్రష్టుపట్టించా'యని తెల్లవాళ్లంటారేమో! కాని నిష్పాక్షికంగా మాట్లాడుకుంటే ఆ చట్టాలకూ ఈ కరణీకపు తెలివితేటలకూ సరిగ్గా అతికింది. దాని కోసం ఇదీ, దీని కోసం అదీ అన్నట్లు సరిపోయాయి రెండూ. అగ్నిహోత్రావధాన్లుకు మెకాలే గురించి తెలీదు గానీ తెలిసి వుంటే 'అతగాడు కూడ కరణమేనష' అని వుండేవాడేమో. (మ్లేచ్ఛ కరణమయితేనేం!) బూర్జువా ప్రజాతంత్ర సాంప్రదాయం నుండి పుట్టిన సంస్థలు ఫ్యూడల్ ప్రభువుల వ్యవహార రీతులకు ఇంత బాగా అతికాయంటే ఆ 'ప్రజాతంత్ర సంప్రదాయం వలసలో తీసుకున్న రూపం అటువంటిది.' భూస్వామ్య పెత్తనాన్ని ఎంతమాత్రం ఇబ్బంది పెట్టకుండ, రాజకీయ స్వేచ్ఛ కల్పించకుండ 'నిష్పాక్షికమయిన నియంతృత్వాన్ని' (ఇంపార్షియల్ డెస్పాటిజం అనేది మెకాలే ప్రయోగించిన మాట) ఈ భూస్వామ్య సమాజం మీద నెలకొల్పాలన్న బ్రిటిష్ సంకల్పం ఈ స్థితికి దారి తీసింది.

న్యాయవ్యవస్థ ఈ మధ్యనే మరీ పాడయిపోయిందనీ, ఒకప్పుడు – ముఖ్యంగా తెల్లవాళ్ళ పాలనలో – చాలా బాగుండిందనీ

మనల్ని నమ్మించడానికి పెద్దలు ప్రయత్నం చేస్తుంటారు. నానాటికీ పాతాళానికి చేరువ అవుతున్న ఈ అధోగమనాన్ని కాదనాల్సిన అవసరం లేదుగానీ ఈ చెట్టుకు చీడ విత్తనం నాడే పట్టిందని గుర్తించకపోతే మాత్రం చరిత్ర గమనాన్ని మనం తప్పుగా అర్థం చేసుకున్న వాళ్లమవుతాం. "పెద్ద పెద్ద వకీళ్లు కూడా సిగ్గుమాలి బరిపెట్టి దొంగ సాక్ష్యాలు పాఠం చెబుతారు. కొందరు మృదువరులు తిరగేసి కొట్టమంటారు. నా వంటి చాదస్తులం ఇంకొక కొందరం అట్టి పాపానికి ఒడిగట్టుకోం గాని, మా పార్టీల తరపు సాక్షులు కూడా అబద్ధం చెబుతున్నారని యెరిగిన్నీ ఊరుకుంటాం", "నిజమయిన సాక్ష్యం! ఏం సత్యకాలం! నిజమాడేవాడు సాక్ష్యానికి రాడు, సాక్ష్యానికొచ్చేవాడు నిజమాడలేడు....", "వాదిని బాధించే నిజం వాది తరపు వకీలుకి అక్కరలేదు. ప్రతివాదిని బాధించే నిజం ప్రతివాది వకీలుకీ అక్కరలేదు. క్రాసెగ్జామినేషన్ ఆరంభించేసరికి ఎంతటి సాక్షీ కవిత్వం ఆరంభిస్తాడు....", "వకీళ్లు అబద్ధాలాడిస్తే న్యాయం కనుక్కోవడానికి జీతం పుచ్చుకునే జడ్జి ఏం జేస్తాడండి?" అని అడిగితే "ఉభయ పార్టీల వకీళ్లు ఆడించే అబద్ధాలు చేయి పీకేటట్టు రాసుకుంటాడు." ఈ మాటలు ఇవ్వాళ కొత్తగా వృత్తిలోకి దిగి ఆదర్శాలు ఇంకా చెడని యువ న్యాయవాది అంటున్నవి కావు. 100 ఏళ్ల క్రితం సౌజన్యారావు పంతులనే సత్యసంధుడయిన వకీలు చేత గురజాడ చెప్పించినవి. ఇవ్వాళ అదనంగా ఏమనగలం? జడ్జిగారు ఇరు పార్టీ అబద్ధాలను చేయి పీకేటట్టు రాసుకోవడమే కాక 'ఆ రెండు అబద్ధాలలో దేనిని తాను సత్యంగా గుర్తించదలచుకుంటాడో నిర్ణయించుకోవడానికి చేయి తడుపుకుంటాడు కూడా' అని ఈనాటి వకీళ్లు అంటారేమో. ఆనాడు మట్టుకు ఇది లేదనా?

* * *

బ్రిటిష్ వాళ్ల కోర్టులు భారత న్యాయవ్యవస్థలో పైకి చూడడానికి సరికొత్త మార్పు. వాటికి మూలమయిన బూర్జువా చట్టం మనుధర్మశాస్త్రం కంటే చాలా భిన్నమయినది. అది ప్రపంచ చరిత్రలోని ప్రప్రథమ ప్రజాస్వామ్య విప్లవం నుండి పుట్టింది. మను ధర్మశాస్త్రంలో ప్రజాస్వామ్యం లేశమంతయినా లేదు. అయినా ఏ మాత్రం ఇబ్బంది లేకుండా ఈ దేశంలోని భూస్వామ్య పెత్తందారీ వర్గాలు ఆ చట్టంతో ఆ న్యాయవ్యవస్థతో సర్దుకు పోగలిగారు. తమ పెత్తనాన్ని కొనసాగించడానికి నిరభ్యంతరంగా వాడుకున్నారు. ప్రజాతంత్ర వ్యవస్థను నెలకొల్పే ఉద్దేశ్యం ఎంతమాత్రం లేకుండా వలస పాలకులు ప్రజాతంత్ర రూపం ఉన్న సంస్థలను మీది నుండి నెలకొల్పేసరికి అవి భూస్వామ్యపు ఊడలు వేసాయి. అగ్నిహోత్రావధాన్లు లాంటి కోర్టు

పక్షులకు, రామప్పపంతులు లాంటి – వాళ్లకూ వీళ్లకూ జుట్లు ముడేసి జీవనం చేసే జిత్తులమారికి – ఈ కోర్టుల వ్యవహారం కొట్టిన పిండి అయింది. ఇంగ్లీష్ ముక్కలు రాకపోవడం ఇబ్బందే. అయితే నాలుగు బొట్లేరు ముక్కలు నేర్చిన గిరీశాలు ఎంతమంది లేరు! గ్రామంలో పెత్తందార్లుగా ప్రజల జీవితాలను శాసించినవారు కొత్త రాజ్యంలో కోర్టు పక్షులయ్యారు. వకీళ్ళకు బ్రోకర్లయ్యారు. చెట్టుకింద ప్లీడర్లయ్యారు. వకీళ్ళే అయ్యారు. వీడి భూమి వాడికీ, వాడి భూమి వీడికీ రాసిన కరణాలూ, కర్రపెత్తనంతో గ్రామ జీవితాన్ని శాసించిన పెద్దలూ కొత్త రాజ్యంలో 'లిటిగేషన్' అనే ఆయుధాన్ని పదును పెట్టుకుని మరీ వాడుకున్నారు. రామప్పపంతులు తన్ను గూర్చి తాను చెప్పుకున్నట్టు ఈ తాలూకాలో సివిల్ మేజిస్ట్రేటు ఎవరొచ్చినా రామప్పపంతులు పప్పులేని పులగం లేదు. కోర్టు వ్యాజ్యాలకూ, తాంబూలం ఇచ్చేసాను ఇక తన్నుకు చావండి అనే సంస్కృతికీ చక్కగా అతికింది.

ఇది పూర్తి వ్యాసం కాదు. కన్యాశుల్కం రచనకు నూరేళ్ళు పూర్తయిన సందర్భంగా 1992లో రాసిన వ్యాసంలో నుండి కొంత భాగం. పూర్తి వ్యాసం కోసం 'నూరేళ్ళ కన్యాశుల్కం' (వెలుగు ప్రచురణ, 1997), 'సాహిత్యంపై బాలగోపాల్' (హెచ్‌బిటి ప్రచురణ, 2011) చూడండి.

# బంద్‌లు, కోర్టులు, ప్రజాస్వామ్యం

అప్పుడెప్పుడో కేరళ హైకోర్టు బంద్ పిలుపు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని ప్రకటిస్తే దానిని జోక్‌గా తీసుకున్నాము. నిజానికి 'హర్తాళ్' అనేది గాంధీ ఉపయోగించిన బలమైన నిరసన సాధనాలలో ఒకటి. బ్రిటిష్ హయాంలోనూ పోలీసులు బలవంతంగా దుకాణాలు తెరిపించిన ఘటనలు, బంద్ నిర్వాహకులను తన్నిన ఘటనలూ ఉన్నాయి గానీ బంద్ నిర్వహించడాన్ని నేరంగా ప్రకటిస్తూ బ్రిటిష్ పాలకులు చట్టమెన్నడూ చేయలేదు. కాంగ్రెస్ వారి మాటకొస్తే, హర్తాళ్ నిర్వహించడం తమ హక్కుగానే వారు భావించారు. అది 'రాజ్యాంగ విరుద్ధం' అని ప్రకటించడానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 50 ఏళ్లు పట్టింది.

కేరళ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు ఆమోదించింది. ఇప్పుడు దానిని అనుసరించి పాట్నా హైకోర్టు మొన్నటి 11వ తేదీనాటి దేశవ్యాప్త బంద్‌ను రాజ్యాంగ విరుద్ధం అని ప్రకటించింది. బీహార్ పోలీసులు వెనువెంటనే 'ఎవరయినా దుకాణాలు మూయిస్తే మేము బలవంతంగా తెరిపిస్తాం' అని ప్రకటించారు. అక్కడికి కోర్టు తీర్పు లేకపోతే వాళ్లు ఆ పని చేయనట్టు.

ఈ న్యాయమూర్తుల ఆలోచనలు అర్థం చేసుకోవడం సహితం కష్టంగా ఉంది. బంద్ పాటించమని నిర్వాహకులు ఎవరినయినా బలవంతం చేస్తే అది నేరం అవుతుంది. ఆ సంగతి కొత్తగా న్యాయస్థానాలు చెప్పనవసరం లేదు. దానికి రాజ్యాంగ వ్యాఖ్యానమూ అవసరం లేదు. అది ఐపీసీలోని పలు సెక్షన్ల కింద నేరం అవుతుంది. కానీ బంద్ పిలుపు ఇవ్వడమే 'రాజ్యాంగ విరుద్ధం'

అంటే అర్థమేమిటి? గాంధీ నిర్వహించిన హర్తాళ్‌ల మాటేమిటి? (అప్పుడు దేశానికొక రాజ్యాంగమే లేదు కాబట్టి అది రాజ్యాంగ విరుద్ధం కాదంటారేమో! అట్లాగయితే మనకొక రాజ్యాంగం వచ్చినందుకు ప్రజలు బాధపడవలసి ఉంటుంది.)

నిజమే, బంద్‌ను స్వచ్ఛందంగా పాటించడానికీ, భయపడి పాటించడానికీ అన్ని సందర్భాలలోనూ కచ్చితమైన తేడా ఉండదు. జనబలం గానీ కండబలం గానీ (తూటా బలం అని కూడ అనాలేమో) ఉన్నవాళ్లు బంద్ పిలుపు ఇస్తే, పాటించకపోతే ఏం నష్టపోవలసి వస్తుందోనని 'ముందు జాగ్రత్తగా' జనం పాటిస్తుంటారు. స్కూళ్లకు సెలవులిచ్చేస్తారు. బస్ సర్వీసులు రద్దు చేసేస్తారు. దుకాణదారులు తమంతట తామే అంగళ్లు మూసేస్తారు. ఇదేదీ జరగకపోతే బంద్ నిర్వాహకులు ఒక బస్సు అద్దాలు పగలగొట్టినా లేక ఒక దుకాణాన్ని బలవంతంగా మూయించినా చాలు, మిగిలినవన్నీ 'స్వచ్ఛందంగా' మూతపడి పోతాయి. ఈ పరిస్థితిలో ఏది బలవంతం, ఏది స్వచ్ఛందం అని తేల్చి చెప్పటం కష్టం.

కానీ దీనికి పరిష్కారం బంద్ పిలుపునే రాజ్యాంగ విరుద్ధం అని ప్రకటించడం కాదు. ప్రజలలో అత్యధికులు స్వచ్ఛందంగా పాల్గొన్న బంద్‌లను అందరం ఎరుగుదుము. అందరినీ కదిలించే ఒక దౌర్జన్యానికి వ్యతిరేకంగా బంద్ పిలుపు ఇచ్చినప్పుడు, ఒక ప్రాంతం మొత్తానికి సంబంధించిన సమస్యపైన బంద్ పిలుపు ఇచ్చినప్పుడు మెజారిటీ ప్రజలు ఇష్టపూర్వకంగానే బంద్‌లో పాల్గొంటుంటారు. అటువంటి పిలుపు సహితం 'రాజ్యాంగ విరుద్ధం' అనడంలో అర్థమేమయినా ఉందా?

బంద్‌ను ఒక నిరసన సాధనంగా ఉపయోగించే విషయంలో రాజకీయ ఉద్యమాలు నిగ్రహం పాటించక పోవడం వల్ల తరచుగా బంద్‌ల పట్ల ప్రజలలో వ్యతిరేకత వ్యక్తమయ్యే విషయం సత్యమే. ప్రజల నిరసన కంటే బంద్ పిలుపు ఇచ్చిన వారి ఆధిపత్య ప్రదర్శన తరచుగా ప్రచారం అవుతుంది. ఆ మధ్య హైదరాబాద్ నగరంలో ఒక బిజెపి నాయకుడు గుండెపోటుతో మరణించినప్పుడు ఆ పార్టీ బంద్ నిర్వహించింది. 'వాడి గుండె ఆగిపోయి వాడు చచ్చిపోతే మేమంతా బంద్ ఎందుకు పాటించాలి' అని విసుక్కుంటూనే నగరవాసులు బంద్ పాటించారు. బిజెపికి నగరంలో ఉన్న కండ బలానికి భయపడే పాటించారు. జార్ఖండ్, గూర్ఖాలాండ్ తదితర ఉద్యమకారులు 48 గంటల బంద్‌లు, 72 గంటల బంద్‌లు నిర్వహిస్తుంటారు. (మన రాష్ట్రంలో పీపుల్స్ వార్ కూడ 48 గంటల బంద్ పిలుపు ఇచ్చిన సందర్భాలున్నాయి.) దేనికి బంద్ పిలుపు ఇవ్వాలో, ఏ రూపంలో బంద్‌ల నిర్వహించాలో

అర్థం చేసుకోలేని రాజకీయ పార్టీలు, ఉద్యమాలు ప్రజలలో బంద్ పట్ల వ్యతిరేక భావం నెలకొనడానికి కారణమయ్యాయి. కోర్టులు 'బంద్‌లు రాజ్యాంగ విరుద్ధం' అని ప్రకటిస్తే, దాని వల్ల తమ హక్కు పోయిందని ప్రజలు గుర్తించక, ఇతరులను ఇబ్బంది పెట్టే రాజకీయ పార్టీల హక్కు పోయిందని సంతోషించే స్థితి వచ్చింది. ఇది రాజకీయ పార్టీల, ఉద్యమాల స్వయంకృతాపరాధం.

కానీ పౌర సమాజంలో నిగ్రహం లేమికి, క్రమశిక్షణ లేమికి, ముందుచూపు లేమికి సమాధానం నిర్బంధ చట్టాలు కాదు, నిర్బంధం పెంచే కోర్టు తీర్పులు కాదు. ప్రజాస్వామ్య అవకాశాల దుర్వినియోగానికి జవాబు ఆ అవకాశాలను తొలగించటం కాదు. క్రమశిక్షణ, ముందు చూపు, నిగ్రహం పెంపొందించటం.

దీనికి న్యాయస్థానాలు చేయగలగింది కొంచెమే. వారు దానికే పరిమితమైతే గంభీరంగా ఉండేది. బంద్ పిలుపు ఇచ్చేటప్పుడు దాని వల్ల దినకూలి మీద బతికే వాళ్లకు, ఏ రోజుకారోజు పొట్టపోసుకునే వ్యాపారాలు చేసుకునే వాళ్లకు, రోగ గ్రస్తులయి అర్జెంటుగా ఆస్పత్రికి పోవలసిన వాళ్లకు, దూరప్రాంతాల నుండి వచ్చి రైల్వే స్టేషన్లోనూ, బస్టాండ్‌లోనూ ఇరుక్కుపోయే వాళ్లకు కలిగే కష్టనష్టాల గురించి ఆలోచించాలనీ, బాధ్యతతో పిలుపు ఇవ్వాలనీ రాజకీయ ఉద్యమకారులను హెచ్చరించడం ఉచితంగా ఉంటుంది గానీ ఈ కారణాలు చూపించి బంద్‌లు రాజ్యాంగ విరుద్ధం అని ప్రకటించడం ఉచితమెట్లా అవుతుంది? ప్రజాస్వామ్యానికి అవసరమైన బాధ్యతాయుతమైన వైఖరి అందరూ పెంపొందించుకున్నప్పుడు ప్రజాస్వామ్యం మెరుగవుతుంది గానీ బాధ్యత కొరవడిందని చెప్పి నిర్బంధం పెంచితే మెరుగవుతుందా?

ఉద్యమాలకు ఈ హెచ్చరికలు చేయడంతో పాటు న్యాయస్థానాలు ప్రభుత్వానికి కొన్ని ఆదేశాలు ఇచ్చి ఉండవచ్చును. బంద్ వల్ల కూలి చేసుకునే అవకాశం కోల్పోయిన వారికి ప్రభుత్వం ఏమీ చేయలేకపోవచ్చును గానీ, ఆస్పత్రులకు అర్జెంట్‌గా పోవలసి ఉన్న వారి కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించవచ్చు. వాటిని వాడుకునే పద్ధతిని ప్రజలకు ముందుగానే తెలియచేయవచ్చు. దీనికి సంబంధించిన ఆదేశాలు న్యాయస్థానాలు ప్రభుత్వానికి జారీ చేసి ఉంటే బాగుండేది. బంద్‌ను ప్రజాస్వామ్యానికి విఘాతంగా కాక ప్రజాస్వామ్యంలో భాగంగా చూడగలిగితే న్యాయస్థానాలకు ఈ విషయం తోచి ఉండేది. ఆ దృష్టి లేకపోవడం దురదృష్టకరం.

ప్రజలు తమ ప్రజాస్వామ్య అవకాశాలను ఏ విధంగా ఉపయోగించుకోవాలో చెప్పే నిర్ణేతలు తామేనన్న అహంభావం న్యాయమూర్తులలో పెరగటం ప్రజాస్వామ్యానికి

మంచిది కాదు. ఈ మధ్య శివసేన గుండాలు దాడి చేసిన 'ఫైర్' సినిమా నిర్మాత సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేసినప్పుడు, ఆ కేసును విచారణకు స్వీకరించిన న్యాయమూర్తులు కేసు వేసిన వారికి జారీ చేసిన ఆదేశం దీనికొక ఉదాహరణ. 'కేసు వేసారు కాబట్టి ఇంక ఈ విషయం గురించి బయట మాట్లాడడం మానేయండి' అన్నారు. 'మీకు ఏ వేదిక కావాలో ఎంచుకోండి. కోర్టు కావాలా, పత్రికలు కావాలా?' అన్నారు. రెండూ కావాలనకూడదా? అంటే తప్పేముంది. న్యాయస్థానాలు ప్రజాస్వామ్యంలో భాగమైనట్టే పత్రికలు కూడ భాగమే. ఉన్న చట్టాల ప్రకారం న్యాయ నిర్ణయం చేసి హక్కులు నిలబెట్టడానికి న్యాయస్థానాలు ఉపయోగపడితే, హక్కుల గురించి చర్చ జరపడానికీ ప్రజలను చైతన్యవంతులు చేయడానికీ పత్రికలు ఉపయోగపడతాయి. రెండింటినీ ఒకేసారి ఎందుకు ఉపయోగించుకోకూడదు? 'న్యాయం కోసం నా దగ్గరి కొచ్చావు కాబట్టి వాడి దగ్గరికి పోవద్దు' అనే పద్ధతిలో న్యాయమూర్తులు హెచ్చరికలెందుకు జారీ చేయాలి?

ఇది మంచి పోకడ కాదు. ప్రజాస్వామ్యానికీ, ప్రజాస్వామ్య హక్కులకూ ఆరోగ్యకరం కాదు.

*ప్రజాతంత్ర వారపత్రిక*

*27 డిసెంబర్ 1998*

# రాజ్‌కుమార్ కిడ్నాప్: సుప్రీంకోర్టు నష్టం చేయకుంటే ఉద్ధరించినట్టే

వీరప్పన్ వ్యవహారం అకస్మాత్తుగా వార్తలలో వెనక్కి వెళ్లిపోయింది. నేడో రేపో రాజ్‌కుమార్ కిడ్నాప్ కథ సుఖాంతం అవుతుందనుకుంటున్న దశలో సుప్రీంకోర్టు అడ్డుకట్ట వేసింది. పైగా, 'తొందరగా ఏదో ఒకటి తేల్చండి' అని కర్ణాటక ప్రభుత్వం కోరగా, 'ముందు నువ్వు చెప్పే జవాబేదో వివరంగా చెప్పు. తేల్చే సంగతి తరువాత చూసుకుందాం' అని సుప్రీంకోర్టు జడ్జిలు అన్నారు.

కొంపలు మునిగిపోయే తొందరేమీ లేదన్నట్టు సుప్రీంకోర్టు వ్యవహరించడంతో అందరి చేతులూ కట్టేసినట్టయింది. 'నా కోరికలు తీర్చకపోతే రాజ్‌కుమార్‌ను చంపేస్తాన'ని వీరప్పన్ బెదిరించలేదు. సుప్రీంకోర్టు విడుదల మీద 'స్టే' ఇచ్చింది కాబట్టి వీరప్పన్ ఎంత అల్లరిపెట్టినా కర్ణాటక ప్రభుత్వం ఏమీ చేయలేదు. ప్రభుత్వం ఏమీ చేయలేదని అలిగి వీరప్పన్ రాజ్‌కుమార్‌ను ఏమీ చేయనూ లేదు. చేస్తే తన ఆటకట్టయిపోతుంది.

రాజ్‌కుమార్ అభిమానులు అని పిలవబడే వాళ్ళకు అతనంటే నిజంగా ఎంత అభిమానం ఉందో తెలీదు కాబట్టి ఈ సందిగ్ధ స్థితి ఆ అభిమానులలో ఎంతమందిని నిజంగా బాధపెడుతుందో తెలీదు. తక్కిన జనానికది వాడిపోయిన వార్త. రాజ్‌కుమార్‌కు ఆదుర్దాగానే ఉండి ఉండాలిగానీ అతను జీవితంలో ఇప్పటికి చాలా సుఖమే అనుభవించాడు కాబట్టి ఇప్పుడొక జీవితకాలం కష్టం అనుభవించినా అందులో అన్యాయమేమంత

లేదని అనుకోవడం అసహజం కాదు. వీరప్పన్ తనకూ ఒక రాజకీయ ముద్ర కావాలన్న కోరికతో కాబోలు తనవారిగా ఎంచి విడుదల కోరిన తమిళ మిలిటెంట్లకూ ఆదుర్దాగానే ఉండాలిగానీ వాళ్ళీవాళ బయటికి పోయినా రేపు రాజ్‌కుమార్ భద్రంగా బెంగుళూరు చేరిన తరువాత పోలీసులు వాళ్లను తిరిగి ఇంకా పెద్ద కేసులలో ఇరికించగలరు. 'ఎన్‌కౌంటర్' జరిగిందంటూ కాల్చిపారేయగలరు. ఆ మిలిటెంట్ సంస్థలకు తమిళనాడులో ఉన్న మద్దతు స్వల్పమే కాబట్టి ఏం జరిగినా పెద్దగా బాధపడేవారు కొద్దిమందే ఉంటారు.

మరిక ఈ ఉదంతాన్ని అందరం మరిచిపోవచ్చునా అంటే ఈ గొడవలో నిజంగా సానుభూతి చూపించగలవాళ్లు 51 మంది ఉన్నారు. వీళ్లు వీరప్పన్ ముఠా ద్వారా జరిగిన నేరాలలో ముద్దాయిలు. చాలా ఏళ్లుగా విచారణకు నోచుకోకుండా టాడా ఖైదీలుగా ఉన్నారు. వీళ్ల విడుదల వీరప్పన్ కోరిన కోరికలలో ఒకటి. సుప్రీంకోర్టు 'స్టే' చేయకపోతే ఈ పాటికి వీళ్లు విడుదలై ఉందురు.

వీళ్లు మైసూర్ ప్రాంత అడవులకు చెందినవారు. 'అమాయకులు' కాకపోవచ్చు. అంటే కలప దొంగ రవాణాలోనూ ఏనుగుదంతాల విక్రయంలోనూ వీరికి ప్రమేయం ఉండి ఉండవచ్చు. కాకపోయినా వీరప్పన్ ముఠాకు ఆశ్రయం, ఆహారం ఇచ్చి ఉండవచ్చు. కానీ వీరు ఏ అర్థంలోనూ టెర్రరిస్టులు కారు. అయినప్పటికీ వీరిపైన టాడా కేసులు పెట్టారు కాబట్టి కొందరు ఏడేళ్లుగా, కొందరు ఎనిమిదేళ్లుగా విచారణ లేకుండా జైలులో ఉన్నారు.

వీరిపైన కేసులు ఎత్తి వేసి సాధారణ చట్టాల కింద విచారణ జరపాలని కోరుతూ పియుసిఎల్ గత సంవత్సరం కర్ణాటక హైకోర్టులో కేసు వేసింది. పియుసిఎల్ జాతీయ అధ్యక్షులు కన్నబిరాన్ ఈ కేసు స్వయంగా వాదించారు. వీరప్పన్ చేసినవి తీవ్రమైన నేరాలే కావచ్చును గాని అవి 'ప్రభుత్వాన్ని బలప్రయోగంతో లోబరుచుకోవడం' లేక 'సమాజంలో ఒక వర్గాన్ని భయోత్పాతానికి గురి చేయడం' అనే నిర్వచనం కిందికి రావు కాబట్టి వాటికి టాడా వర్తించదని ఆయన వాదించారు. రాజీవ్‌గాంధీ హత్య చాలా క్రూరమైన నేరమే అయినప్పటికీ అది 'టెర్రరిస్టు' నేరం కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన విషయాన్ని, అందుకోసం సుప్రీంకోర్టు ప్రయోగించిన వాదననూ ఆయన ఆధారం చేసుకొని వాదించారు. కానీ కర్ణాటక హైకోర్టు ఒప్పుకోలేదు.

రాజ్‌కుమార్‌ను కిడ్నాప్ చేసిన తరువాత వీరప్పన్ పెట్టిన మొదటి డిమాండ్లలో ఈ ఖైదీల విడుదల ఒకటి. వారిపైన టాడా కేసులు ఎత్తివేయాలని కాదు, మొత్తంగా విడుదల చేయాలనే వీరప్పన్ డిమాండ్ చేసాడు. ఇదే ఖైదీల గురించి కర్ణాటక హైకోర్టులో పియుసిఎల్ వేసిన కేసు గురించి తెలిసిన వారికి, వీరప్పన్ డిమాండ్‌ను కర్ణాటక ప్రభుత్వం ఆమోదించిందని తెలియగానే ఒక ఆసక్తికరమయిన సందేహం వచ్చింది. ఈ ఖైదీలపైన కేసు పెట్టినా, అరెస్టు చేసినా, బెయిలు నిరాకరించినా వారిని వీరప్పన్ వంటి నేరస్తుల నుండి దూరం చేయడానికి, వారిలో చట్టం పట్ల గౌరవం పెంచడానికి చేస్తున్నామని ప్రభుత్వమయినా, కోర్టులయినా అంటుంటాయి. కానీ చట్టాన్ని ప్రమాణం చేసుకొని వాదించిన కన్నబిరాన్ విఫలమైన చోట వీరప్పన్ ఒక సినీ హీరోను కిడ్నాప్ చేసి సాధిస్తే ఆ ఖైదీలకు చట్టం పట్ల గౌరవం పెరుగుతుందా లేక వీరప్పన్ పట్ల గౌరవం పెరుగుతుందా?

దీని అర్థం ఇప్పుడు సుప్రీంకోర్టు అంటున్నట్టు – వీరప్పన్ డిమాండ్లకు లొంగి ఉండకూడదని కాదు. చట్టాన్ని ప్రజలు గౌరవించగలిగే పరిస్థితి ఉండాలని. వీరప్పన్ చర్యలు టెర్రరిజం అని వాదన కోసం ఒప్పుకున్నా అతని గుంపులో భాగమైన ప్రతీ వ్యక్తీ, అతని గుంపుకు అన్నం పెట్టిన ప్రతీ వ్యక్తీ టెర్రరిజానికి పాల్పడినట్టేనా? ఆ విచక్షణ చట్టం పాటించినప్పుడే కదా ప్రజలకు చట్టమంటే గౌరవముంటుంది! ఒకవేళ వారు చేసినది టెర్రరిజమయితే మాత్రం ఏడెనిమిది సంవత్సరాలు బెయిలు ఇవ్వకుండ, విచారణ జరపకుండ జైలులో ఉంచడం సబబా? పోలీసులు ఆ పని చేసినా కోర్టులు వారిని చక్కదిద్దినప్పుడే కదా చట్టమంటే గౌరవం పెరుగుతుంది! 'ఒక బందిపోటును పట్టుకోవడం చేతకాకపోతే దిగిపొమ్మ'ని సుప్రీంకోర్టు కర్ణాటక ముఖ్యమంత్రి పైన కోపం చేసుకుంది. ఆ కోపం చట్టాన్ని దుర్వినియోగం చేసి జనాన్ని ఏళ్లతరబడి ఊరికే జైళ్ళలో పెట్టినప్పుడు కూడ న్యాయస్థానాలు ప్రదర్శిస్తేనే కదా చట్టమంటే ప్రజలలో గౌరవం పెరుగుతుంది.

ఇప్పుడు సుప్రీంకోర్టు ఏం చేయబోతుంది అని కొంచెం ఆదుర్దాగా ఉన్నమాట సత్యం. 'ఎవరిని కిడ్నాప్ చేసినా, చంపుతామని బెదిరించినా, ఖైదీలను విడుదల చేయడానికి వీలులేదు' అని సూత్రీకరించబోతుందా? రాజ్‌కుమార్ పోతే పోయాడు లెమ్మనుకోవచ్చు గానీ రేపు ఇంకొకరు ఒక బస్సునిండా స్కూలు పిల్లలను కిడ్నాప్ చేస్తారనుకోండి – అప్పుడు కూడ సుప్రీంకోర్టు ఇట్లాగే మాట్లాడుతుందా?

దేశాన్ని ఎట్లా పరిపాలించాలో రాజకీయ నాయకులకు నేర్పించాలని జడ్జీలు ఆరాటపడుతుంటారు. రాజకీయ జీవుల పట్ల సమాజంలో ఏవగింపు పెరిగే కొద్దీ ఈ కోరిక పెరుగుతున్నది, దాని పట్ల సమాజంలో ఆమోదమూ పెరుగుతున్నది. ఒక్కొక్క సందర్భంలో దీని వల్ల మేలు జరగవచ్చును గానీ మొత్తం మీద ఈ ఆరాటం ప్రమాదకరమైనది. పరిపాలనకు కొంచెం వినయం, కొంచెం లోకజ్ఞానం అవసరం. ఇవి రెండూ అతితక్కువ ఉన్న జాతి న్యాయమూర్తులు. ఎంత చెడ్డా రాజకీయ నాయకులకు వాస్తవాలెక్కువ తెలుసు, వోట్ల అవసరం తీసుకొచ్చే వినయమూ వారిలో కొంచెం ఎక్కువే. కొన్ని నిర్ణయాలు వారికి వదిలేయడమే మంచిది.

*ప్రజాతంత్ర వారపత్రిక*

*17 సెప్టెంబర్ 2000*

# మనుషులు లేని 'పర్యావరణం'

పర్యావరణాన్ని ప్రజల కోసం కాపాడాలనుకునేవారు, పర్యావరణాన్ని ప్రజల నుండి కాపాడాలనుకునే వారు అని పర్యావరణ ఉద్యమకారులలో రెండు రకాలు. ప్రజల కోసమే కాపాడాలనుకున్నా తెలిసో తెలియకో పర్యావరణాన్ని ధ్వంసం చేసే చర్యల గురించి వారికి హితవు చెప్పవలసిన అవసరం రావచ్చు. అది వేరే సంగతి. కానీ పర్యావరణాన్ని ప్రజల కోసం కాక ప్రజల నుండి కాపాడాలనుకునే వారికి ప్రజలు వట్టి 'న్యూసెన్స్'గా మాత్రమే కనిపిస్తారు.

అటువంటి 'పర్యావరణ ఉద్యమకారులు' కోర్టుకెక్కడం, పార్కులనూ రోడ్లనూ గాలినీ వెల్తురునూ మురికివాడల ప్రజల నుండి కాపాడమని 'ప్రజా ప్రయోజన వ్యాజ్యం' నడపడం, కోర్టులు అదే ధోరణితో స్పందించి తీర్పులివ్వడం ఈ మధ్య బొంబాయిలోనూ, ఢిల్లీలోనూ జరిగింది. ఉద్యమాలూ న్యాయస్థానాలూ ప్రజాస్వామ్యంలో భాగం కాబట్టి ఈ పెడధోరణుల గురించి మాట్లాడుకోవడం అవసరం. మనుషుల బాగోగుల కంటే వేరే ఏది ముఖ్యమన్నా అనుమానించ వలసిందే. అందమయిన నగరాలు, విదేశీ పర్యాటకుల మెప్పు పొందే నగర అభివృద్ధి ఇందుకు మినహాయింపు కాదు. కానీ పర్యావరణ పరిరక్షణను ఈ కళ్లతో చూసే ఉద్యమకారులూ ఉన్నారు. న్యాయమూర్తులూ ఉన్నారు. సుప్రీంకోర్టయితే ఈ మధ్య ఒక తీర్పులో 'అక్రమ చొరబాటుదారులకు' (గుడిసెవాసులకు ఇదొక అందహీనమైన పేరు) పునరావాసం కల్పించడమంటే జేబు దొంగలను సత్కరించడమేననింది.

బొంబాయి మహానగరం వెలుపల సంజయ్ గాంధీ జాతీయ ఉద్యానవనం అనే 117 చ.కి.మీల వైశాల్యం గల అడవిలాంటిది ఉంది. అందులో ఒకటి రెండు పులులూ, సింహాలూ కూడ ఉన్నాయంట. ఊపిరాడని బొంబాయి నగరవాసులకు అక్కడ అప్పుడప్పుడు 'సఫారీలు' ఏర్పాటు చేస్తారు.

అంతవరకు అభ్యంతరం లేదు. కానీ ఆ నగరంలో నిలువనీడ లేని పేదలు ఆ అభయారణ్యం అంచులో గుడిసెలు వేసుకోసాగారు. వాళ్లు 'జేబు దొంగలు' కాదు. (జేబు దొంగలకు మాత్రం ఒక గూడు అక్కరలేదా అన్నది వేరే ప్రశ్న) బొంబాయిని ఒక మహానగరంగా తయారు చేసిన శ్రామికులు, అదొక నగరంగా మనగలగడానికి శ్రమ చేస్తున్న శ్రామికులు, ఫ్యాక్టరీలలో పని చేసేవాళ్లు, ఆటోలు నడిపేవాళ్లు, అంట్లు తోమేవాళ్లు, ఇళ్ళు కట్టే వాళ్లు, ఇళ్లు ఊడ్చేవాళ్లు.

కాలక్రమంలో దాదాపు 4 లక్షల జనాభా అక్కడ చేరారు. గుడిసెలు వేసుకున్నారు. రోడ్లు, నీళ్లూ, కరెంటూ, స్కూళ్లూ అడిగారు. కొంత పొందారు. 117 చ.కి.మీ.ల విస్తీర్ణంలో 11.7 చ.కి.మీ.లు (మాత్రమే) వారి పాలయ్యాయనేది ప్రభుత్వ అంచనాయే.

వీరి ఉనికి వల్ల సఫారీ సౌందర్యం దెబ్బ తినిందనుకున్నారో ఏమో, బొంబాయిలోని ఒక పర్యావరణ సంస్థ వారందరినీ అక్కడి నుండి తొలగించాలంటూ హైకోర్టులో 'ప్రజా ప్రయోజన వ్యాజ్యం' వేసింది. ఆ గుడిసెవాసులే తమకందరికీ శాశ్వతంగా పట్టాలివ్వాలని అదే కోర్టులో కేసు వేసి ఉంటే, అది ప్రభుత్వ విచక్షణకు సంబంధించిన విషయమనీ అందులో కోర్టులు జోక్యం చేసుకోజాలవనీ విచక్షణాయుతమైన పాలనా నిర్వహణకూ చట్టాన్ని అమలు చేయించే న్యాయస్థానాల విధులకూ మధ్య కచ్చితమైన విభజనరేఖ ఉందనీ దానిని అతిక్రమించడం ప్రజాస్వామ్యానికి అపచారమనీ ఆ కోర్టు అని ఉండేదనడానికి సందేహించనక్కరలేదు.

కానీ వాళ్లను తొలగించడం మాత్రం ప్రభుత్వ విచక్షణకు సంబంధించిన విషయమని బొంబాయి హైకోర్టు అనుకోలేదు. వారినందరినీ – దాదాపు 4 లక్షల మందిని – నిర్ణీత గడువు లోపల తొలగించమని ప్రభుత్వానికి ఆదేశం ఇచ్చింది. వారికి పునరావాసం కల్పించడానికి చోటు కోసం వెతుకుతున్నామని ప్రభుత్వం కొంచెం మొహమాటపడుతూ విన్నవించుకోగా, 'వారి గెంటివేత అప్పటి దాకా ఆగనక్కరలేదు. ముందు ఆ చొరబాటుదారులను అక్కడి నుండి తొలగించి ఆ తరువాత వారికెక్కడ జాగా చూపిస్తారో ఆలోచించుకోండి' అనింది. వారిని తొలగించడానికి పోలీసు

బలగాలు చాలకపోతే సైన్యాన్ని ప్రయోగించమనింది. ఏ విధంగా తొలగించాలో ఎంత కాలం లోపల తొలగించాలో వివరిస్తూ ఒక ప్రణాళిక తయారు చేసి తన తీర్పులో భాగంగా జారీ చేసింది. కేసు వేసిన 'పర్యావరణ వాదులు' సహితం ఇంత గొప్ప తీర్పు వస్తుందని ఆశించి ఉండరు.

ఢిల్లీలోనయితే ఇటువంటి పని సుప్రీంకోర్టే చేసింది. ఆ నగరంలో గాలి కాలుష్యం తీవ్రంగా ఉన్నమాట వాస్తవమే. అది ప్రజలందరి ఆయురారోగ్యాలకు హానికరమన్నది కూడ వాస్తవమే. అయితే అందుకోసం సుప్రీంకోర్టు వెనకా ముందూ చూడకుండా జారీ చేస్తున్న ఆర్డర్లే చాలా ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రత్యామ్నాయం గురించి ఏమీ ఆలోచించకుండ, పాతబడిన సిటీ బస్సులన్నిటినీ రేపు పొద్దున్నే షెడ్లలోకి పంపించేయాలని ఒక రోజు ఆర్డర్ జారీ చేసింది. అసలే రవాణా సౌకర్యాలు అంతంత మాత్రంగా ఉన్న దేశ రాజధాని ప్రజలు ఆ తరువాత అనుభవించిన యాతన వర్ణనాతీతం.

ఆపైన మరొక ప్రజా ప్రయోజన వ్యాజ్యానికి స్పందిస్తూ, నగరం మధ్యలో ఉన్న ఫ్యాక్టరీలన్నీ తక్షణం నగరం నుండి బయటకు వెళ్లిపోవాలని సుప్రీంకోర్టు ఆర్డర్ జారీ చేసింది. అది ఆర్థికంగా సాధ్యం కాని యాజమాన్యాలు ఫ్యాక్టరీలను మూసేయాలని ఆదేశించింది. డజన్ల సంఖ్యలో ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. వేల సంఖ్యలో కార్మికులు నిరుద్యోగులయ్యారు. అంతకు ముందెన్నడూ జరగని విధంగా ఢిల్లీ నగర వీధులలో సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ధర్నాలు, ఊరేగింపులు జరిగాయి.

నిజానికి ఈ రెండు ఆదేశాలూ తక్షణమే అమలు కావాలన్న పద్ధతిలో కాకుండ ప్రజల కష్టనష్టాలను లెక్కలోకి తీసుకొని ఒక టైం టేబుల్ ప్రకారం అమలు కావాలని సుప్రీంకోర్టు అని ఉండవచ్చు. కానీ మనుషుల బాగోగుల కంటే 'పర్యావరణం' ముఖ్యమయిపోయినప్పుడు అటువంటి ఆలోచనలు రావు. అసలు పర్యావరణాన్ని మనుషుల అవసరాల నుండి వేరు చేసి చూడడంలోనే తప్పుంది. ఆ అవసరాల వల్ల పర్యావరణానికి హాని ఉండనే ఉండదని కాదు. ఒక్కొకసారి ఉంటుంది. ఒక్కొకసారి తీవ్రంగానూ ఉంటుంది. అయినప్పటికీ ఆ అవసరాల నుండి వేరుచేసి 'పర్యావరణాన్ని' అమానవీయంగా నిర్వచించుకొని కాపాడాలనుకోవడం అమానుషమైన ఆదేశాలకు దారి తీస్తుంది.

*మొదటి ముద్రణ : ప్రజాతంత్ర వారపత్రిక, 15 అక్టోబర్ 2000*
*రెండవ ముద్రణ : 'అభివృద్ధి – విధ్వంసం' 2015* (HRF ప్రచురణ)

# కోర్టు తీర్పులు-సామాజిక న్యాయం

రెండు కోర్టు తీర్పుల గురించి ఇవ్వాళ మాట్లాడుకుంటున్నాం.

ఒకటి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, మరొకటి మన రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు. న్యాయస్థానాలు తీర్పులిచ్చేటప్పుడు వ్యాజ్యం లేవదీసినవారు పరీక్షకు నిలబడతారని మామూలుగా అనుకుంటాము.

ఒక్కొక్కసారి న్యాయస్థానాలు కూడ పరీక్షకు నిలబడతాయి.

ఈ రోజు మన దేశంలో న్యాయస్థానాలు ఎదుర్కొంటున్న పరీక్ష ఒకటి ఉంది. ప్రభుత్వాలు రాజ్యాంగ ఆదేశిక సూత్రాలకూ రాజ్యాంగం పీఠికకూ విరుద్ధమైన పాలనా విధానాలను శరవేగంగా ప్రవేశపెడుతున్నాయి. రాజకీయ పార్టీలేవీ వీటిని ప్రవేశ పెట్టబోతామని ప్రజలకు చెప్పి ఓట్లు అడగలేదుగానీ గెలిచి ప్రభుత్వం ఏర్పరచిన తరువాత ప్రపంచ బ్యాంకు చెప్పిందనీ, ప్రపంచ వాణిజ్య సంస్థ ఆదేశించిందనీ, లేకపోతే దీనిని మించిన విజ్ఞత లేదనీ చెప్పి ఈ మార్పులు ప్రవేశపెడుతున్నాయి.

అప్పుడు న్యాయస్థానాలు ప్రభుత్వానికి ఉండే విధానరచన చేసే అధికారంలో ఏ మేరకు జోక్యం చేసుకోవచ్చు? ప్రభుత్వ విధానరచన రాజ్యాంగ మౌలిక సూత్రాలకు లోబడి ఉన్నంతకాలం కోర్టు జోక్యం చేసుకోవడానికి వీలులేదనీ, ఆ పరిధిలో ప్రభుత్వమే రాజనీ మన రాజ్యాంగం అంటుంది.

దీనితో పేచీ లేదు. ఎంత చెడ్డా ప్రజలకు ఏదో ఒక మేరకు జవాబుదారీ వహించక తప్పని రాజకీయ పాలకులు విధానరచన చేయడమే మేలు. ఆ అధికారం న్యాయస్థానాలకు ఇయ్యడం మంచిది కాదు.

కానీ ప్రభుత్వ విధానాలు 'రాజ్యాంగ మౌలికసూత్రాలకు' లోబడి ఉండేటట్టు చూసే బాధ్యతను నిర్వర్తించే న్యాయస్థానాలు తమ కర్తవ్యాన్ని సంకుచితంగా అర్థం చేసుకుంటాయా లేక రాజ్యాంగానికి ఉన్న చారిత్రక పూర్వరంగాన్ని దృష్టిలో పెట్టుకుని దానికి అనుగుణంగా వ్యవహరిస్తాయా అన్నది ఒక ముఖ్యమైన ప్రశ్న.

కేవలం రాజ్యాంగంలోని ఫలానా ఆర్టికల్‌లోని ఫలానా నియమాన్ని ప్రత్యక్షంగా అతిక్రమించినప్పుడు మాత్రమే కోర్టులు జోక్యం చేసుకుంటాయా, లేక రాజ్యాంగం పీఠికనూ ఆదేశిక సూత్రాలనూ దృష్టిలో పెట్టుకుని తమ కర్తవ్యాన్ని అర్థం చేసుకుంటాయా అన్నది ఈ ప్రశ్న. ఆ పీఠిక, ఆ సూత్రాలు జాతీయ ఉద్యమస్ఫూర్తిని దేశ భవితవ్యానికి గమ్యంగా నిలబెట్టాయని గుర్తించినట్టయితే న్యాయస్థానాలు తమ కర్తవ్యాన్ని ఈ విధంగా అర్థం చేసుకోవడంలో గల చారిత్రక ప్రాముఖ్యాన్ని గ్రహించగలుగుతాం.

ఈ విషయంలో మన దేశ న్యాయవ్యవస్థ యాభై ఏళ్లుగా ఊగిసలాట ప్రదర్శిస్తూనే ఉంది. తన కర్తవ్యాన్ని ఒకసారి విశాలంగా, ఒకసారి సంకుచితంగా అర్థం చేసుకుంటున్నది. 'మేమున్నది చట్టాన్ని అమలు చేయడానికే తప్ప సంఘసంస్కరణ చేయడానికి కాదు' అని ఒక రోజు, 'రాజ్యాంగంలోని సంక్షేమరాజ్య స్ఫూర్తిని ప్రతీ చట్టంలోనూ చదువుతాం' అని మరుసటి రోజు అంటూ వస్తున్నది.

రెండవ వైఖరి చాలా అవసరమయిన ఈ రోజున మొదటి వైఖరే పైచేయి అవుతున్నదా అని అనుమానించడానికి ఆస్కారం కలిగించే రెండు తీర్పులు ఈ రోజు మన ముందున్నాయి.

ఒకటి, నర్మదా నదిపైన గుజరాత్ ప్రభుత్వం తలపెట్టిన సర్దార్ సరోవర్ ప్రాజెక్టుకు ఆమోదం తెలియజేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు. రెండు, చంద్రబాబు ప్రభుత్వం చేపట్టిన విద్యుత్ సంస్కరణలకు పూర్తి ఆమోదం తెలియజేస్తూ మన హైకోర్టు ఇచ్చిన తీర్పు. విషయంలో చాలా తేడా ఉన్నప్పటికీ రెండు తీర్పులలోనూ ఆయా న్యాయస్థానాలు ప్రకటించిన సూత్రమేమిటంటే ప్రభుత్వ విధాన నిర్ణయాలలో కోర్టులు చాలా పరిమితంగా మాత్రమే జోక్యం చేసుకోగలవని.

'పాలనా వ్యవస్థ తన పని తాను సక్రమంగానే చేస్తుందని న్యాయస్థానాలు నమ్ముతాయి' అన్న పురాతన సూత్రమొకటి ఉంది. నర్మదా కేసులో సుప్రీంకోర్టు దానిని పునరుద్ఘాటించింది. ఈ యాభై ఏళ్లలో తానే ఆ సూత్రాన్ని బాగా కుదించి వేసిన సంగతి సుప్రీంకోర్టు మరిచిపోయింది. పాలనా వ్యవస్థ తన పని సక్రమంగా

చేయడం లేదని కోర్టులో వ్యాజ్యం వేసేవారు కొన్ని ప్రాథమిక ఆధారాలు చూపించాలే తప్ప కేవలం అనుమానం మీద కోర్టుకు రావడానికి వీలు లేదన్న సూత్రానికి దానిని సుప్రీంకోర్టు గడచిన రెండు మూడు దశాబ్దాల కాలంలో కుదించింది.

## నమ్మకాల ఆధారంగా నర్మదా తీర్పు

సుప్రీంకోర్టులో కేసు వేసిన నర్మదా బచావో ఆందోళన్ వారు కొన్నేమిటి, చాలా ఆధారాలే చూపించారు. అయినప్పటికీ సుప్రీంకోర్టు తన విశ్వాసాన్ని వదులుకోలేదు. డ్యాం ఎత్తు 85 మీటర్లు ఉంటే ఎంత ప్రాంతం ముంపుకు గురికాగలదో ఆ ప్రజల పునరావాసమే ఇంకా సంతృప్తికరంగా జరగలేదన్న విషయం తన ముందు రికార్డయి ఉండగా, 90 మీటర్ల దాకా ఎత్తు పెంచుకొమ్మని అనుమతి ఇచ్చేసింది. ఏమంటే పునరావాస వ్యవస్థ సంతృప్తికరంగానే ఉందని తాను భావిస్తున్నట్టు ప్రకటించింది. ఆచరణ ఏ విధంగా ఉందో చూడకుండా, వ్యవస్థ సరిగ్గానే ఉందని తాను నమ్ముతున్నాను కాబట్టి కట్టుకొమ్మని ఆదేశం ఇచ్చేసింది.

అంటే ఇక మీదట ప్రభుత్వం అందమయిన ప్రణాళికలు తయారు చేసి న్యాయస్థానాలకు చూపిస్తే చాలునా? ప్రశ్నించే పిటిషనర్లు ఇంటి ముఖం పట్టవలసిందేనా?

ప్రభుత్వ విధానరచనలో కోర్టులు జోక్యం చేసుకోవు అంటూనే పెద్ద డ్యాంలను సుప్రీంకోర్టు చాలా పొగిడింది. ఈ 40 సంవత్సరాలలో వాటి వల్ల నష్టం కంటే ప్రయోజనమే ఎక్కువని తేలిందని ఏ ఆధారాలూ లేకుండా ప్రకటించింది. వాటి వల్ల పర్యావరణం ధ్వంసం కాకపోగా, మరింత బాగు పడిందనింది. అక్కడ బతికిన ప్రజలు పునరావాస స్థలాలలో మరింత మెరుగయిన జీవితం అనుభవిస్తున్నారనింది. దీనికి ఏ ఆధారమూ లేకపోగా, అధిక భాగం నిర్వాసితులు గతంలో కంటే మరింత అధ్వాన్నమైన స్థితిలో బతుకుతున్నారని తెలిపే పరిశోధనలు అనేకం ఉన్నాయి.

సుప్రీంకోర్టు నర్మదా కేసులోని బాధితులకు అన్యాయం చేయడమేకాక, రాబోయే రోజులలో ప్రభుత్వాల నూతన అభివృద్ధి విధానం ఫలితాల పైన ప్రజలు వేయగల కేసులను ఆదిలోనే బలహీనపరిచే సూత్రీకరణలు అనేకం చేసింది.

## ఏ ప్రశ్నకూ సమాధానం యివ్వని విద్యుత్ చార్జీల తీర్పు

మన హైకోర్టు విద్యుత్ చార్జీల కేసులో ఇచ్చిన తీర్పు కూడ ఇందుకు తీసిపోలేదు.

ప్రపంచబ్యాంకు ఇచ్చే అప్పు కోసం ప్రభుత్వం ప్రజలకు నష్టకరమైన షరతులకు అంగీకరించిందని అంటే 'ప్రపంచబ్యాంకు పెట్టిన షరతులలో అంతటి కుట్ర

చూడలేము' అనింది. ఎందుకు? షరతులను పరిశీలించిన మీదట వాటిలో అభ్యంతరం చెప్పవలసిందేమీ లేదని న్యాయమూర్తులు భావించారా? అదేమీ లేదు. 'ప్రపంచబ్యాంకు ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలలో ఒకటి. భారతదేశానికి ప్రపంచబ్యాంకులోనూ ఐక్యరాజ్యసమితిలోనూ సభ్యత్వం ఉంది. అటువంటప్పుడు ప్రపంచబ్యాంకు అప్పు ఇస్తూ కొన్ని షరతులు పెట్టినంత మాత్రాన అందులో దుర్బుద్ధిపూర్వకమైన కుట్ర ఉందని భావించజాలమ'నింది హైకోర్టు.

నిజానికి ప్రపంచబ్యాంకుకూ ఐక్యరాజ్యసమితికీ సంబంధం ఏమీ లేదు. అదట్లాగుంచి అధికారం చట్టంలో ఉంటే చాలు, దానిని సక్రమంగా నిర్వర్తించినట్టేననే సూత్రం ఇది. న్యాయస్థానాలు ఈ సూత్రాన్ని విడనాడి చాలా కాలం అయిందిగానీ 'విద్యుత్ కేసు'లో అది తిరిగి దర్శనమిచ్చింది.

అన్ని రకాల సబ్సిడీలూ ఎత్తివేయాలని ప్రపంచబ్యాంకు పెట్టిన షరతును మన ప్రభుత్వం ఆమోదించడం రాజ్యాంగ ఆదేశిక సూత్రాలకు విరుద్ధమన్న వాదనకు వాస్తవాలలోగానీ చట్టంలోగానీ ఆధారం లేదని హైకోర్టు చాలా ఆశ్చర్యకరంగా కొట్టి పారేసింది. అభివృద్ధి ఫలితమైన సంపద కొద్దిమంది చేతిలో కేంద్రీకృతం కాకూడదన్నది రాజ్యాంగ ఆదేశిక సూత్రం కాదా? సబ్సిడీలు దానిని నివారించే ఒక మార్గం కాదా?

విద్యుత్ సంస్కరణల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తన సార్వభౌమత్వాన్ని త్యజించి ప్రపంచబ్యాంకు చెప్పినట్టు నడుచుకోవడం రాజ్యాంగ విరుద్ధమన్న వాదనను హైకోర్టు విచిత్రమైన తర్కంతో తోసిపుచ్చింది. ఈ విమర్శను కేవలం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్కరణల చట్టానికి పరిమితం చేసి, ఒక చట్టాన్ని చట్టసభ ఏ కారణంగా చేయదలచుకుందన్న మీమాంస కోర్టులు చేపట్టలేవనీ, అందువల్ల ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు ఆ చట్టం చేసిందా లేదా అన్నది న్యాయస్థానాలు తీర్పు చెప్పగల విషయం కాదని హైకోర్టు అనింది.

అంటే రేపు ప్రపంచవాణిజ్య సంస్థ పెట్టే ఒత్తిడికి తట్టుకోలేక మన పార్లమెంటుగానీ అసెంబ్లీగానీ మనం సంప్రదాయకంగా వాడుకుంటున్న వేప, పసుపు వంటి వస్తువుల పైన పేటెంట్లు విదేశీ సంస్థలకు ఇయ్యవలసిందేనని చట్టం చేసినా మనం దానిని మన దేశ సార్వభౌమత్వం పైన దాడి అంటూ కోర్టులో ప్రశ్నించడానికి వీలు లేదని మన హైకోర్టు అభిప్రాయం.

అదట్లాగుంచి, సార్వభౌమత్వాన్ని వదులుకున్నారని ప్రభుత్వం పైన ఆరోపణ పెట్టింది కేవలం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్కరణల చట్టం విషయంలోనే కాదు,

మొత్తంగానే ప్రభుత్వం చేపట్టిన విద్యుత్ సంస్కరణలన్నీ ప్రపంచబ్యాంకు ఆదేశాల మేరకే చేపట్టిందని అభియోగం. చట్టసభల మనోగతాన్ని పరిశీలించే అధికారం కోర్టులకు లేకపోవచ్చునుగానీ ప్రభుత్వమొక పనిని తప్పుడు ఉద్దేశ్యంతో చేసిందన్న అభియోగం వచ్చినప్పుడు దాని పైన తీర్పు చెప్పే అధికారం కోర్టులకు ఉంది. వేసింది ఈ అభియోగమైతే దానిని చట్టసభపైన ఆరోపణకు కుదించి 'ఆ విషయంలోకి మేము పోలేము' అనింది హైకోర్టు.

పైగా విద్యుత్ టారిఫ్‌ను నిర్ణయించిన రెగ్యులేటరీ కమిషన్ తన పని చాలా బాగా నిర్వహించిందని హైకోర్టు అనింది. ట్రాన్స్‌కో ప్రైవేట్ విద్యుదుత్పత్తిదారుల నుండి విపరీతమైన ధరకు కొనుగోలు ఒప్పందాలు చేసుకుందన్న విషయాన్ని ఈ కమిషన్ పట్టించుకోలేదు. ఆ కొనుగోలు ఒప్పందాలను అసలు పరిశీలించనే లేదు. ఇది పిటిషనర్లు వేసిన ముఖ్యమైన అభియోగాలలో ఒకటి. దానిని హైకోర్టు తన తీర్పులో ప్రస్తావించనే లేదు. చాలా స్వతంత్రంగా, ఒక న్యాయనిర్ణేతలాగా వ్యవహరించినట్టు కనిపించే కమిషన్ నిజానికి రాష్ట్ర ప్రభుత్వం అంతకు ముందే ప్రపంచబ్యాంకుకు ఇచ్చిన హామీలకు ఒక తీర్పురూపం ఇచ్చిందన్న అభియోగానికి కూడ హైకోర్టు తీర్పులో చోటు దొరకలేదు. కాగా, ప్రభుత్వ విధానాల తప్పొప్పులు నిర్ణయించడం మా పని కాదంటూనే విద్యుత్ రంగ సంక్షోభానికి ప్రభుత్వం చెప్పిన కారణాలన్నిటినీ ఆమోదపూర్వకంగా ఏకరవు పెట్టడం ద్వారా ప్రభుత్వ విధానం సరయినదేనన్న అభిప్రాయాన్ని హైకోర్టు కలిగించింది.

మొత్తానికి 'ప్రభుత్వం తన వ్యవహారాలు ఏ విధంగా నడుపుతుందన్న విషయంలో కోర్టులు సులభంగా తలదూర్చకూడదు. ఏదైనా ఒక నిర్దిష్టమైన చట్టాన్ని కచ్చితంగా అతిక్రమించినట్టు చూపిస్తేనే కోర్టులు జోక్యం చేసుకోవాలి' అనే వైఖరి రెండు తీర్పులలోనూ కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఇది మన కోర్టులు అన్ని సందర్భాలలోనూ ప్రదర్శించిన వైఖరి కాదు. రాజ్యాంగ ఆదేశికసూత్రాలు, అంతర్జాతీయ మానవహక్కుల ఒడంబడికల వెలుగులో ప్రభుత్వ చర్యలను పరిశీలించవచ్చునన్నది కూడ భారత న్యాయవ్యవస్థ గతంలో వ్యక్తం చేసిన అభిప్రాయమే.

దానిని కాపాడుకొని మరింత ముందుకు తీసుకుపోవడం మారుతున్న పరిస్థితులలో చాలా అవసరం కాబట్టి ఈ రెండు తీర్పులనూ చర్చించటం కోసం ఈ సభ పెడుతున్నాం.

*మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది*

*15 డిసెంబర్ 2000*

# విద్యుత్ చార్జీల తీర్పు:
# కోర్టు పరిధికి సంకుచిత వ్యాఖ్య

విద్యుత్ చార్జీలను పెంచుతూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (Electricity Regulatory Commission) ఏప్రిల్ 27, 2000 నాడు జారీ చేసిన ఆర్డర్ చెల్లదంటూ వివిధ సంస్థలూ, వ్యక్తులూ హైకోర్టులో వేసిన రిట్ పిటిషన్లను జస్టిస్ వెంకట్రామిరెడ్డి, ఎస్.ఆర్.నాయక్‌ల బెంచి అక్టోబర్ 16న కొట్టేసింది. ఆ తీర్పును పరిశీలించడం ఈ వ్యాసం ఉద్దేశ్యం.

ప్రభుత్వం, లేక ప్రభుత్వం నియమించిన ఏదైనా సంస్థ తీసుకున్న నిర్ణయం అన్యాయమనుకుంటే బాధితులు కోర్టుకు పోతారు. ప్రభుత్వం చేయని న్యాయం కోర్టు చేస్తుందని ఆశిస్తారు. ప్రభుత్వ చర్యలపైన అప్పీల్ చేసుకునే వేదికగా ప్రజలు కోర్టును భావిస్తారు. ప్రభుత్వ చర్యల మంచి చెడులను పరిశీలించేటప్పుడు న్యాయస్థానాలకు ఏ హద్దులు లేవని సాధారణంగా ప్రజలు అనుకుంటారు.

భారత రాజ్యాంగం ప్రభుత్వ చర్యలనూ విధానపరమైన నిర్ణయాలనూ సమీక్షించే అధికారం న్యాయస్థానాలకు ఇచ్చిందిగానీ ఆ సమీక్ష ఏ పరిధిలో చేయవచ్చుననేది వివాదాస్పదంగా ఉంది. చట్టంలో కచ్చితంగా పేర్కొన్న ఒక హక్కును ప్రభుత్వ చర్య స్పష్టంగా అతిక్రమించినట్టయితే న్యాయస్థానాలు జోక్యం చేసుకుంటాయి. అంతకు మించి ప్రభుత్వాల చర్యలలో కోర్టులు జోక్యం చేసుకోవనీ, ప్రభుత్వాలు ఎవరికి ఏమిస్తాయి, ఏ పని ఏ విధంగా చేస్తాయి,

దేశపాలనలో ఏ విధానాలు అనుసరిస్తాయి అనేది ప్రభుత్వాల ఇష్టమనీ సంప్రదాయక న్యాయసిద్ధాంతం చెప్తుంది.

ఉదాహరణకు సముద్రం ఒడ్డున ఉన్న జాలర్ల ఇళ్లను ప్రభుత్వం తొలగించి మోటార్ బోట్లతో రొయ్యల వేట సాగించే పరిశ్రమ కోసం అక్కడ రేవు నిర్మించాలని నిర్ణయిస్తుంది అనుకోండి. ఆ నిర్ణయం తప్పా? ఒప్పా? అని కోర్టులు చూడజాలవు. అప్పటి వరకు అక్కడ ఉన్న జాలర్లకు ఆ ఇళ్ల స్థలాల మీద చట్టపరమైన హక్కు ఉంటే నష్ట పరిహారం ఇవ్వనిదే వారిని తొలగించడానికి వీలులేదని అంటుంది, చట్టపరమైన హక్కు లేకపోతే నేనేం చేయలేనంటుంది అంతే.

సంప్రదాయకమైన ఈ అవగాహనను ఆ తరువాత న్యాయస్థానాలు కొంత సవరించాయి. ప్రభుత్వం తప్పుడు కారణాల వల్ల (ఉదాహరణకు బోట్ ఓనర్ల దగ్గర లంచం తీసుకోవడం వల్ల) గానీ, మత్స్య పరిశ్రమ అభివృద్ధితో ఏమీ సంబంధం లేని కారణాల వల్ల (ఉదాహరణకు బోట్ ఓనర్ల సంఘం అధ్యక్షుడు ముఖ్యమంత్రి బావమరిది కావడం వల్ల) గానీ ఆ నిర్ణయం తీసుకొని ఉంటే కోర్టులు జోక్యం చేసుకుంటాయి. అంతేకాదు, ఏ కారణాలు చెప్పి ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకుందో ఆ కారణాలకు అసలు ఏ ఆధారం లేకపోయినా, అందుకు విరుద్ధమైన ఆధారాలను లెక్కలోకి తీసుకోకుండా నిర్ణయం చేసినా, చెప్పిన కారణాలకూ చేసిన నిర్ణయానికీ పొంతన ఏమీ లేకపోయినా కోర్టులు జోక్యం చేసుకుంటాయి. ఉదాహరణకు అక్కడ సముద్రంలో రొయ్యలే లేవనుకోండి, లేకపోతే అక్కడ సముద్రంలో అప్పటికే కాలుష్యం ఎక్కువ ఉండడం వల్ల డీజల్ లేక పెట్రోల్ ఉపయోగించే మోటార్ బోట్లు ఆ నీటిలో తిరగడం హానికరమనుకోండి, అటువంటప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకుంటాయి.

ఇంకొక రకంగా చెప్పాలంటే, ప్రభుత్వ నిర్ణయాలు ఏ చట్టానికీ విరుద్ధంగా ఉండకుండా చూడడం, నిర్ణయాలు తీసుకునే పద్ధతి సక్రమంగా ఉండేటట్లు చూడడం న్యాయస్థానాల బాధ్యత. ఆ రెండు హద్దులకూ లోబడి ఉన్నంత కాలం ఆ నిర్ణయాల వల్ల ఎవరికి మేలు జరుగుతుంది, ఎవరికి నష్టం జరుగుతుంది అని కోర్టులు చూడవు. విధాన నిర్ణయాలు చట్టబద్ధమైనవేనా, వాటిని సక్రమంగా తీసుకున్నారా అని కోర్టులు చూస్తాయే తప్ప ఆ నిర్ణయాల దిశ ఏమిటి, వాటి సామాజిక స్వభావం ఏమిటి అని కోర్టులు చూడలేవు.

ఒక రకంగా ఇది సహేతుకమైన అవగాహనే. విధాన నిర్ణయాలు న్యాయస్థానాలు చేయడం కంటే ప్రభుత్వాలు చేయడమే మేలు. న్యాయస్థానాలు ప్రజావ్యతిరేక నిర్ణయాలు

చేయడం మొదలుపెడితే ప్రజలేమీ చేయలేరు. ప్రభుత్వాలనైతే ఎన్నికలలో ఓడించవచ్చు. ఆందోళనల ద్వారా ఒత్తిడి పెట్టవచ్చు.

అయినప్పటికీ మన రాజ్యాంగం ఇంకొంత విశాలమైన బాధ్యతను న్యాయస్థానాల పైన పెట్టింది. మన రాజ్యాంగంలో ప్రభుత్వ బాధ్యతలు, ప్రజల హక్కులు మాత్రమేకాక దేశానికొక గమ్యాన్నీ ప్రభుత్వ విధానాలకొక దిశనూ నిర్దేశించే ఆదేశాలున్నాయి, పీఠిక ఉంది. అవి హక్కుల రూపంలో లేవు కాబట్టి న్యాయస్థానాలు వాటిని లెక్కలోకి తీసుకోలేవని ఒకప్పుడు సుప్రీంకోర్టు అనిందిగానీ ఆ తరువాత తన అభిప్రాయం కొంత మార్చుకుని, ఆదేశికసూత్రాలను ప్రాథమిక హక్కులతో జోడించి అర్థం చేసుకోవాలని అభిప్రాయపడింది. అంటే ఆదేశిక సూత్రాలను విడిగా తీసుకున్నప్పుడు వాటిని కోర్టులు అమలు చేయించజాలవుగానీ, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు ఆదేశిక సూత్రాల వెలుగులో విస్తృతమైన అర్థం ఇచ్చుకోవడం సాధ్యమైనప్పుడు న్యాయస్థానాలు ఆ విస్తృత అర్థంలో ప్రాథమిక హక్కులను అమలు చేస్తాయి.

అంతర్జాతీయ ప్రకటనలు, ఒడంబడికలలోని హక్కుల విషయం కూడ ఇంతే. ఆ ఒడంబడికపైన భారత ప్రభుత్వం సంతకం చేసినప్పటికీ కోర్టులు వాటిని అమలు చేయమని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయజాలవని అంటూనే, ఆ ఒడంబడికల వెలుగులో మన రాజ్యాంగంలోని హక్కులకు విస్తృతమైన అర్థం ఇచ్చుకోవడం సాధ్యమైనప్పుడు కోర్టులు ఈ హక్కులను ఆ విస్తృతమైన అర్థంలో అమలు చేస్తాయని మూడునాలుగేళ్ళుగా సుప్రీంకోర్టు అంటున్నది.

ఉదాహరణకు ఆర్టికల్ 14 ప్రకారం చట్టం ముందు అందరూ సమానమనేది ఒక ప్రాథమిక హక్కు. ఆర్టికల్ 39(డి) ప్రకారం సమాన పనికి సమాన వేతనం దక్కేటట్టు చూడడం ఒక ఆదేశిక సూత్రం. ఈ వెలుగులో ఆర్టికల్ 14ను వ్యాఖ్యానించి, ఒకే పని చేస్తున్నా తక్కువ వేతనాలిస్తున్నారని కోర్టుకు వచ్చిన వారికి కోర్టు సమాన వేతనాలు ఇప్పించవచ్చునని సుప్రీంకోర్టు అనింది. అదే విధంగా, పిల్లలందరికీ ప్రాథమిక విద్య ఉచితంగా కల్పించాలనేది ఆర్టికల్ 45లోని ఆదేశిక సూత్రం. ఆర్టికల్ 21లోని జీవించే హక్కును సుప్రీంకోర్టు ఈ వెలుగులో వ్యాఖ్యానించి కనీసం ప్రాథమిక విద్య లేని జీవితం జీవితమే కాదు కాబట్టి ప్రాథమిక విద్య కూడ ఆర్టికల్ 21లోని జీవించే హక్కులో భాగమేననింది.

## వెనక్కి వెళుతున్న కోర్టులు

1980ల తరువాత సుప్రీంకోర్టు ప్రారంభించిన ఈ వరవడికి ఇప్పటికింకా ఒక స్పష్టమైన రూపం రాలేదు. విధానరచన ప్రభుత్వాల పనే తప్ప కోర్టుల పని కాదని ఒప్పుకుంటూ కూడ ఆ విధానరచన చట్టబద్ధంగా ఉందా లేదా అని చూసేటప్పుడూ, ఆ నిర్ణయం సరయిన పద్ధతిలో తీసుకున్నారా లేదా అని చూసేటప్పుడూ రాజ్యాంగ ఆదేశికసూత్రాల వెలుగులో ఆ పరిశీలన జరపాలన్న కచ్చితమైన సూత్రీకరణ ఇప్పటివరకు సుప్రీంకోర్టు చేయలేదు. ఒకసారి అవునని, ఒకసారి కాదని ఊగిసలాట ప్రదర్శిస్తున్నది. ముఖ్యంగా గ్లోబలైజేషన్ విధానాలు మొదలయిన తరువాత 'విధానరచన ప్రభుత్వం పనే తప్ప మా పని కాదు. మేము కేవలం ప్రభుత్వ నిర్ణయం చట్టబద్ధమా కాదా, సక్రమంగా జరిగిందా లేదా అని చూస్తాం' అనే పాత అభిప్రాయానికి కోర్టులు వెనక్కి పోతున్నాయి.

దురదృష్టమేమిటంటే మన న్యాయస్థానాలు న్యాయ సిద్ధాంత సూత్రీకరణలు చేసేటప్పుడు పాశ్చాత్య న్యాయస్థానాల సూత్రీకరణలను అనుసరిస్తున్నాయి. వాటిని అసలే పట్టించుకోవద్దని కాదు. అందులో విలువైనదేమీ లేదని కూడ కాదు. కానీ భారత రాజ్యాంగానికి ఏ పాశ్చాత్య రాజ్యాంగానికి లేని ఒక లక్షణం ఉంది. అది కేవలం అధికారాలనూ హక్కులనూ క్రోడీకరించి ఊరుకోకుండా దేశపాలనకు ఒక దిశనూ గమ్యాన్నీ నిర్దేశించింది. దీనికి చోటు కల్పించే రాజ్యాంగ న్యాయశాస్త్రాన్ని అభివృద్ధి చేయవలసిన బాధ్యత భారత న్యాయస్థానాల మీద ఉండింది. 'చట్టంలోని ప్రతీ ఒక్క మాటకూ అర్థం కల్పించాలి' అనేది అందరూ ఆమోదించే ఒక మౌలిక న్యాయసిద్ధాంత సూత్రమే. ఎందుకంటే 'చట్టసభలు చట్టాలు చేసేటప్పుడు మాటలను వృథాగా ప్రయోగించవు' కాబట్టి. మరి భారత రాజ్యాంగం నాలుగవ అధ్యాయంలోనూ, పీఠికలోనూ నిర్దేశించిన గమ్యానికి మన న్యాయవ్యవస్థ ఏ మాత్రం అర్థం కల్పించినట్టు? సమగ్రమైన అర్థం కల్పించకపోవడం వైఫల్యం కాదా?

## విద్యుత్ కేసు పూర్వాపరాలు

ఇంక 'విద్యుత్ చార్జీల పెంపుదల' కేసు తీర్పును పరిశీలిద్దాం.

మొన్నటిదాకా రాష్ట్ర విద్యుత్ బోర్డు విద్యుత్ రంగానికి ఏకచ్ఛత్రాధిపతి. విద్యుత్తు ఉత్పత్తి చేసేది, సరఫరా చేసేది, పంపిణి చేసేది బోర్డే. కరెంటు చార్జీల ధర నిర్ణయించేదీ బోర్డే. అయితే బోర్డుకు ఈ విషయంలో ఆదేశాలు ఇచ్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి

ఉండేది. ఇప్పుడు చేపట్టిన విద్యుత్ సంస్కరణలలో భాగంగా ఉత్పత్తిని, సరఫరాను, పంపిణీని వేరు చేశారు. ఉత్పత్తి రంగంలోకి ప్రైవేట్ రంగాన్ని ఆహ్వానించి వారి ప్రవేశానికి కావలసిన సదుపాయాలు కల్పించాలని ప్రపంచబ్యాంకు మన ప్రభుత్వాన్ని ఆదేశించినప్పటికీ ప్రభుత్వరంగం అసలే ఉండకూడదని చెప్పలేదు. కాబట్టే విద్యుత్ ఉత్పత్తి రంగంలో ఇప్పటికే ఉన్న ప్రభుత్వ సంస్థలు కొనసాగుతున్నాయి. వాటిని ఎ.పి.జెన్‌కో అనే కార్పొరేషన్ కిందికి తీసుకొచ్చారు. విద్యుత్ సరఫరాలో లాభాలేమీ రావు కాబట్టి దానిని ప్రభుత్వ రంగంలోనే ఉండనిమ్మని ప్రపంచబ్యాంకు అనింది. విద్యుత్ సరఫరాను ఎ.పి ట్రాన్స్‌కో అనే కార్పొరేషన్ కిందికి తెచ్చారు. విద్యుత్ పంపిణీని నూటికి నూరుశాతం ప్రైవేటుపరం చేయాలని ప్రపంచబ్యాంకు ఆదేశం. అయితే దానికి టైం పడుతుంది. కాబట్టి ఈ కథ మొదలయ్యేనాటికి దానిని ఎ.పి ట్రాన్స్‌కో చేతిలోనే పెట్టారు. ఆ తరువాత నాలుగు ప్రాంతాలకు నాలుగు డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు (డిస్కాంలు) ఏర్పాటు చేశారు.

విద్యుత్ ధర నిర్ణయించే బాధ్యత మాత్రం ట్రాన్స్‌కో చేతిలోగానీ డిస్కాంల చేతిలోగానీ ప్రభుత్వం చేతిలోగానీ పెట్టవద్దనీ, ఒక స్వతంత్రమైన విద్యుత్ నియంత్రణ కమిషన్ (రెగ్యులేటరీ కమిషన్) ఆ పని చేయాలనీ ప్రపంచబ్యాంకు షరతు పెట్టింది. దీని కోసం ఒక చట్టం చేయాలని ఆదేశించింది. ఈ ఆదేశాన్ని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్కరణల చట్టం చేసింది. దాని కింద విద్యుత్ నియంత్రణ కమిషన్‌ను నెలకొల్పింది.

2000 సంవత్సరం ఏప్రిల్ 6వ తేదీన ఎ.పి ట్రాన్స్‌కో తన ఆదాయవ్యయాల పద్దును రెగ్యులేటరీ కమిషన్‌కు సమర్పించి, విద్యుత్ చార్జీలు నిర్ణయించమని అడిగింది. నిజానికి అప్పటికే (ఏప్రిల్ 1 వ తేదీననే) విద్యుత్ పంపిణీ కోసం డిస్కాంలు ఏర్పడ్డాయి. పంపిణీకి సంబంధించిన ఆస్తులన్నీ ట్రాన్స్‌కో నుండి డిస్కాంలకు బదలాయించబడ్డాయి. కాబట్టి విద్యుత్ చార్జీలు నిర్ణయించమని రెగ్యులేటరీ కమిషన్‌కు అప్లికేషన్ పెట్టవలసింది ఆయా ప్రాంతాలలో పంపిణీ బాధ్యత చేపట్టిన డిస్కాంలే తప్ప ట్రాన్స్‌కో కాదు. కోర్టు ముందు పిటిషనర్లు లేవదీసిన అభ్యంతరాలలో ఈ సాంకేతిక అభ్యంతరం కూడ ఒకటి.

ఏమయితేనేం, ఎ.పి ట్రాన్స్‌కో నుండి ప్రతిపాదనలు స్వీకరించిన కమిషన్ ప్రజల నుండి అభ్యంతరాలు కోరింది. బహిరంగ విచారణ జరిపి విద్యుత్ చార్జీలను ఏ మేరకు పెంచాలో నిర్ణయించి ఏప్రిల్ 27న ఆర్డర్ జారీ చేసింది.

ఈ ఆర్డర్‌ను సవాలు చేస్తూ హైకోర్టులో కేసు వేసిన వారు తమ సవాలుకు కొన్ని నిర్దిష్టమైన కారణాలు చూపించారు.

(అ) ట్రాన్స్‌కో ప్రతిపాదనలనూ ఇతరుల అభ్యంతరాలనూ స్వతంత్రంగా పరిశీలించినట్లు అభిప్రాయం కలిగిస్తూ రెగ్యులేటరీ కమిషన్ జారీ చేసిన ఆర్డర్ నిజానికి 1999 జనవరి 31న రాష్ట్ర ప్రభుత్వానికీ ప్రపంచబ్యాంకుకూ జరిగిన ఒప్పందానికి నకలే. చట్టం ప్రకారం స్వతంత్రంగా వ్యవహరించి న్యాయ సమ్మతంగా నిర్ణయం చేయవలసిన రెగ్యులేటరీ కమిషన్, అంతకు ముందే జరిగిన ఒప్పందానికి తనే చేసిన ఒక నిర్ణయంగా రూపం ఇవ్వడం చట్టవిరుద్ధమే కాక చట్టాన్ని అపహాస్యం చేయడం కూడ.

(ఆ) రెగ్యులేటరీ కమిషన్‌కు విద్యుత్ కొనుగోలు నుండి పంపిణీ దాకా అన్ని విషయాలనూ నియంత్రించే అధికారం ఉంది. కరెంటు సరఫరా చేసే కంపెనీలకు లైసెన్స్ ఈ కమిషనే ఇస్తుంది. సరఫరా చేసే పద్ధతినీ అదే పర్యవేక్షిస్తుంది. సరఫరా చేసే లైసెన్స్ పొందిన కంపెనీలు విద్యుదుత్పత్తి కంపెనీల వద్ద చేసే కొనుగోలును కూడ పర్యవేక్షించే హక్కు కమిషన్‌కు ఉంది. ఆ కొనుగోలులో పొదుపు పాటించాలని, కొనుగోలు ఒప్పందాలు పారదర్శకంగా ఉండాలని ఆదేశించే అధికారం కమిషన్‌కు ఉంది. ఆ సరఫరా కంపెనీ, లేక దాని నుండి కరెంటు కొనుక్కునే పంపిణీ కంపెనీ, వినియోగదారులకు ఏ రేటుకు కరెంటు అమ్మవచ్చునో నిర్ణయించే అధికారమూ ఉంది. ఈ అధికారాలను విడివిడిగా చూడడానికి వీలులేదు. అన్నిటినీ కలిపి నిర్వర్తించినప్పుడే కమిషన్ తన విధి చట్టబద్ధంగా నిర్వర్తించినట్టు. అయితే ఎ.పి ట్రాన్స్‌కో ప్రైవేట్ విద్యుదుత్పత్తి సంస్థలతో చేసుకున్న కొనుగోలు ఒప్పందాలను కమిషన్ అసలే పరిశీలించకుండా ట్రాన్స్‌కో మనకు కరెంటు విక్రయించే ధరను మాత్రం నిర్ణయించింది. అది చట్టవిరుద్ధం.

కొనుగోలు ఒప్పందాలను పరిశీలించకపోవడం వల్ల ట్రాన్స్‌కో ఎంత అహేతుకమైన ధరలకు కరెంటు కొనుక్కోవడానికి ఒప్పందం చేసుకుందో కమిషన్ చూడలేదు. ఒక యూనిట్ కరెంటు జెన్‌కో నుండి రూ. 1.42 పైసలకు, కేంద్రప్రభుత్వ సంస్థల నుండి రూ. 1.64 పైసలకు, పొరుగు రాష్ట్రాల విద్యుత్ బోర్డుల నుండి రూ. 2.05 పైసలకు కొనుగోలు చేస్తుండగా, ప్రైవేట్ విద్యుదుత్పత్తి సంస్థల నుండి సగటున యూనిట్ రూ. 3.05 పైసలకు కొనడానికి ఒప్పందాలు చేసుకోవడమే కాక వాళ్లు ఎంత ఉత్పత్తి చేస్తే అంతా కొంటామని 'కౌంటర్ గ్యారంటీ' ఇచ్చింది.

(ఇ) 1 బిలియన్ డాలర్ల అప్పు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచబ్యాంకుతో చేసుకున్న ఈ ఒప్పందం ద్వారా తన సార్వభౌమ అధికారాన్ని ఒక పరాయిశక్తికి అప్పగించింది. అది రాజ్యాంగ విరుద్ధం, చట్ట విరుద్ధం.

(ఈ) ప్రపంచబ్యాంకుతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కరెంటు పంపిణీలో సబ్సిడీనీ, క్రాస్-సబ్సిడీనీ పూర్తిగా తొలగించడానికి అంగీకరించింది. ఒక్కొక్క సందర్భంలో సబ్సిడీ ఇవ్వడం, ఇవ్వకపోవడం ప్రభుత్వ విచక్షణకు సంబంధించిన విషయమే కావచ్చుగానీ అసలే సబ్సిడీ ఇవ్వబోమని ఒప్పందం చేసుకోవడం రాజ్యాంగ విరుద్ధం. అభివృద్ధి ఫలితమైన సంపద కొద్దిమంది చేతిలో కేంద్రీకృతమై సమాజం సమిష్టి ప్రయోజనాలు దెబ్బతినకుండా చూసుకోవాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 39 అంటుంది. ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం దానికి విరుద్ధం.

(ఉ) రెగ్యులేటరీ కమిషన్‌ను నెలకొల్పింది ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్కరణల చట్టం కింద. రాష్ట్ర అసెంబ్లీ చేసిన ఈ చట్టాన్ని 26.10.1998న గెజెట్‌లో ప్రచురించారు. అప్పటికే అదే విషయంపైన కేంద్రం (పార్లమెంటు) 1998 జూలై నెలలో జారీ చేసిన విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ల చట్టం అమలులో ఉంది కాబట్టి రాష్ట్రపతి అనుమతి పొందితే తప్ప అదే విషయం పైన చేసిన రాష్ట్ర చట్టం చెల్లుబాటు కాదు. ఆ అనుమతిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రపతి నుండి పొందిందిగానీ, పొందేటప్పుడు ప్రపంచబ్యాంకుతో తాను అప్పటికే ఒక ఒప్పందం చేసుకొని ఉన్నాననీ అందుకే ఈ చట్టం చేయవలసి వచ్చిందనీ రాష్ట్రపతికి తెలియజేయలేదు. అందువల్ల రాష్ట్ర చట్టం చెల్లదు, దాని కింద జారీ చేసిన రెగ్యులేటరీ కమిషన్ ఆర్డరూ చెల్లదు.

(ఊ) అధికారం ఉన్నవాళ్లు చేసే ఏ నిర్ణయమైనా కచ్చితమైన సమాచారం పైన ఆధారపడి ఉండాలి. కచ్చితమైన సమాచారం ఉన్నట్టయితే ఆ సమాచారం ఆధారంగా వారు ఏ నిర్ణయం తీసుకుంటారనేది వారి విచక్షణకు సంబంధించిన విషయం కావచ్చు. దానిలో కోర్టులు జోక్యం చేసుకోకపోవచ్చు. కానీ కచ్చితమైన సమాచారం లేకుండా తీసుకున్న నిర్ణయాన్ని కోర్టులు తప్పుపట్టవలసి ఉంటుంది.

విద్యుత్ నియంత్రణ కమిషన్ ముందు ఎ.పి ట్రాన్స్‌కో పెట్టిన సమాచారం చాలా లోపభూయిష్టమయినది. ట్రాన్స్‌కో సరఫరా చేసే కరెంటులో ఎంతభాగం ఏ రకమైన వినియోగదారులు వాడుకుంటున్నారు, ఎంతభాగం దొంగతనానికి గురి

అవుతున్నది అనే విషయాలు తెలియకుండా కరెంటు చార్జీల గురించి కమిషన్ సరయిన నిర్ణయం చేయజాలదు. మరి ఆ గణాంకాలు ట్రాన్స్‌కో కచ్చితంగా చెప్పగలిగిందా? ట్రాన్స్‌కో సరఫరా చేసే కరెంటులో 41 శాతం మాత్రమే మీటర్ల గుండా పోతుంది. అందులో ఎంత భాగం ఏ వర్గానికి చెందిన వినియోగదారులు వాడుకుంటున్నారో ట్రాన్స్‌కో చెప్పగలదు. తక్కిన 59 శాతం గురించి ఏమీ చెప్పలేకపోగా, అసంబద్ధమైన సమాచారం అందిచ్చింది. నాలుగేళ్ల కిందటి వరకు మీటర్లకు అందని కరెంటులో దాదాపు 43 శాతం వ్యవసాయరంగానికి పోతున్నదనీ, మిగిలినది మాత్రమే సరఫరా పంపిణీల నష్టం వాటా అనీ అనేవారు. 1995-96 తరువాత ఈ గణాంకాలు అకస్మాత్తుగా తారుమారయ్యాయి. వ్యవసాయరంగం వాటాను అకస్మాత్తుగా తక్కువ చేసి చూపించడం, సరఫరా పంపిణీల నష్టం వాటాను బాగా ఎక్కువ చేసి చూపించడం మొదలయింది. 1991-92లో సరఫరా, పంపిణీ నష్టం వాటా 19.3 శాతం అన్నారు. 1992-93లో 19.16 శాతం, 1993-94లో 19.05 శాతం, 1994-95లో 18.94 శాతం, 1995-96లో 18.9 శాతం అన్నారు. కానీ 1996-97లో దానిని అకస్మాత్తుగా 32.04 శాతంకు పెంచారు. 1998-99లో 38 శాతం అన్నారు. సరఫరా, పంపిణీల నష్టం 1996-97 నుండి అకస్మాత్తుగా ఎక్కువ చూపించారంటే అర్థం అదే సంవత్సరం నుండి వ్యవసాయరంగానికి సరఫరా చేసే కరెంటు వాటాను అదే మోతాదులో తగ్గించి చూపించడం మొదలుపెట్టారని. (40 శాతం పై చిలుకు నుండి 20 శాతం లోపు).

ఇంత అసంగతంగా ఉన్న గణాంకాలను ఆధారం చేసుకున్న విద్యుత్ నియంత్రణ కమిషన్ హేతుబద్ధమైన నిర్ణయం ఏదైనా చేయగలదా? చేసిన నిర్ణయాన్ని హేతుబద్ధమైనదిగా ఆమోదించవచ్చునా?

(ఎ) ధరలు నిర్ణయించే అధికారం ఉన్న అధికారిగానీ కమిషన్‌గానీ ధర ఎంత నిర్ణయిస్తుందనే విషయంలో కోర్టులు జోక్యం చేసుకోలేకపోవచ్చునుగానీ, నిర్ణయించిన ధర మరీ అన్యాయంగా ఉంటే ఆ నిర్ణయం మరలా చేయమని పురమాయించవచ్చును. ట్రాన్స్‌కో ఒప్పుకోలు ప్రకారమే తన ద్వారా సరఫరా అయ్యే కరెంటులో 38 శాతం మీటర్లకు అందకుండా (అంటే బిల్లులకు అందకుండా) సరఫరా, పంపిణీల క్రమంలో నష్టమవుతున్నది. ఈ అసమర్థతను పోగొట్టుకునే ప్రయత్నమేదీ ట్రాన్స్‌కో చేస్తున్న దాఖలాలు లేవు. కాగా, ఈ నష్టాన్నంతా తన ఖర్చులో చూపించి, బిల్లులు చెల్లించే పౌరులపైన ఆ భారాన్ని వేయమంటే కిమ్మనకుండా రెగ్యులేటరీ కమిషన్ ఆ పని చేసింది. ఇంత అన్యాయమైన రేట్ల నిర్ణయాన్ని కోర్టు ఒప్పుకుంటుందా?

ఇంకా చాలా విషయాలు కేసు విచారణ సందర్భంగా చర్చకు వచ్చాయి కానీ ముఖ్యమైనవి ఇవే.

ఈ అభ్యంతరాలకు ప్రాతిపదిక 1999 జనవరి 31న ప్రపంచబ్యాంకు వెలువరించిన 'ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగ సంస్కరణ ప్రాజెక్ట్' అనే విధానపత్రం. అది ఒక ఒప్పందం, లేక ఒడంబడిక రూపంలో ఉంది. 'ఈ ప్రాజెక్టులోని సంస్కరణలు, పునర్వ్యవస్థీకరణ కార్యక్రమం రెండేళ్ల నాడు మొదలయింది. ఒక సంవత్సర కాలంగా వేగం పుంజుకుంది' అనీ, 'ఈ ప్రాజెక్టుకు వర్తించే ప్రపంచబ్యాంకు విధానాలన్నిటికీ ఇది లోబడి ఉంది' అనీ ఈ పత్రం చివరి నాలుగు వాక్యాలు చెప్తాయి. అంటే లిఖితరూపంలో ఒప్పందం లేక విధానపత్రం రాసుకున్నది 1999 జనవరి 31వ తేదీన కాగా 1997 నుండే ఇరుపక్షాల సమ్మతితో అది అమలవుతున్నది.

ఆ విధానపత్రంలోని ప్రధాన అంశం ప్రపంచబ్యాంకు మన రాష్ట్ర ప్రభుత్వానికి విద్యుత్ సంస్కరణల నిమిత్తం 1 బిలియన్ డాలర్లు (అప్పటి మారకపు విలువలో 4300 కోట్ల రూపాయలు) అప్పుగా ఇవ్వడానికి అంగీకరించడం. ఆ అప్పు 5 వాయిదాలలో ఇవ్వడం జరుగుతుంది. ఆ అప్పుకు ప్రపంచబ్యాంకు విధించిన షరతులను పత్రంలో వివరంగా రాశారు. ఈ షరతుల అమలుకు ఒక టైంటేబుల్ కూడ నిర్దేశించారు. ఎప్పటికప్పుడు ఆ టైంటేబుల్ ప్రకారం షరతులను అమలు చేస్తేనే మిగిలిన అప్పు లభిస్తుంది.

## ఆ షరతులేమిటి?

1. రాష్ట్ర విద్యుత్ బోర్డును మూడుగా విడగొట్టాలి. ఉత్పత్తి, సరఫరా, పంపిణీ అనే మూడు రంగాలు వేరువేరుగా ఉండాలి. ఈ రంగాలలో ప్రభుత్వం ఒకవేళ కొనసాగినా అది ప్రభుత్వ శాఖగా కాక ఒక పబ్లిక్ సెక్టర్ కార్పొరేషన్ రూపంలో ఉండాలి. ట్రాన్స్‌కో, జెన్‌కోల ఏర్పాటుతో ఇది అప్పటికే మొదలయిందని ప్రపంచబ్యాంకు గుర్తించింది.

2. విద్యుత్తును ఉత్పత్తిదార్ల నుండి కొనుగోలు చేసే ప్రక్రియను, సరఫరాను, పంపిణీనీ నియంత్రించే ఒక స్వతంత్రమైన నియంత్రణ వ్యవస్థను నెలకొల్పాలి. అది ఒక చట్టం ద్వారా జరగాలి. ఈ పని కూడ విద్యుత్ నియంత్రణ కమిషన్‌ను నెలకొల్పడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అప్పటికే చేసేసిందని ప్రపంచబ్యాంకు గుర్తించింది.

నిజానికి రాష్ట్రం ఆ చట్టాన్ని (ఆం.ప్ర. విద్యుత్ సంస్కరణల చట్టం) చేయకముందే కేంద్రం (పార్లమెంటు) విద్యుత్ నియంత్రణ కమిషన్ల (రెగ్యులేటరీ కమిషన్స్) చట్టం చేసిందని పైన చూశాము. అందులోనే ప్రతీ రాష్ట్రమూ ఒక రాష్ట్రస్థాయి నియంత్రణ కమిషన్‌ను నెలకొల్పవచ్చునని అన్నారు. ఆ అవకాశాన్ని వినియోగించుకొని రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టమేదీ అవసరం లేకుండానే నియంత్రణ కమిషన్‌ను ఏర్పాటు చేసి ఉండవచ్చును. అయినప్పటికి ఒక ప్రత్యేక చట్టం చేయడం వెనుక ప్రపంచబ్యాంకు సలహా లేక సూచన ఉందనేది స్పష్టమే. కానీ పార్లమెంటు ఒక విషయంలో చట్టం చేసి ఉన్నప్పుడు అదే విషయంలో ఒక రాష్ట్ర అసెంబ్లీ కూడ చట్టం చేసినట్టయితే, ఆర్టికల్ 254(2) కింద దానికి రాష్ట్రపతి ఆమోదం పొందితే తప్ప అసెంబ్లీ చేసిన చట్టం చెల్లదు. ఆ ఆమోదం మన ప్రభుత్వం పొందింది గానీ, ప్రపంచబ్యాంకుతో తాను చేసుకున్న ఒప్పందాన్ని రాష్ట్రపతికి చెప్పి ఆమోదం పొందిందా? హైకోర్టులో పిటిషనర్లు వేసిన ప్రశ్నలలో ఇదొకటని పైన చూశాము.

3. విద్యుత్ చార్జీలను నిర్ణయించే బాధ్యత విద్యుత్ నియంత్రణ కమిషన్ చేపడుతుంది. విద్యుత్ పంపిణీ చేసే కంపెనీలు తమ ఆదాయ అవసరాలను (revenue requirements) కమిషన్‌కు సకాలంలో సమర్పించి అందుకు తగిన చార్జీల పెంపుదలను కోరాలి. వారి ప్రతిపాదన ఈ పునర్వ్యవస్థీకరణ పత్రంలో సూచించిన దానికంటే తక్కువ ఉండడానికి వీలులేదు. అంతేకాక అది ప్రపంచబ్యాంకుకు సంతృప్తికరంగా ఉండాలి.

ఈ పునర్వ్యవస్థీకరణ పత్రం సూచించే పెంపుదల ఎంత? 2001లోనూ 2002లోనూ 15 శాతం, ఆపైన 2007 దాకా ప్రతీ సంవత్సరం 12 శాతం. ఇంతగానీ ఇంతకంటే ఎక్కువగానీ పెంపుదల కోరుతూ ఎ.పి. ట్రాన్స్‌కో (రాబోయే రోజులలో డిస్కాంలు) నియంత్రణ కమిషన్ ముందు ప్రతిపాదనలు పెట్టాలి. ప్రతిపాదనలు ఈ కనీస పరిమాణాన్ని పాటించడమేకాక ప్రపంచబ్యాంకుకు సంతృప్తినిచ్చేవిగా ఉండాలి.

కానీ ఆం. ప్ర. విద్యుత్ సంస్కరణల చట్టం సెక్షన్ 26 (1)లో ఏముంటుందంటే పంపిణీ కంపెనీలు తమ ఆదాయ అవసరాలను నియంత్రణ కమిషన్ ప్రకటించే నియమాల ననుసరించి అంచనా వేయాలని. మరి ఈ రెండు ఆదేశాలలో దేనిని పాటించాలి? చట్టం చెప్పినట్టు నియంత్రణ కమిషన్ జారీ చేసిన నియమాలను అనుసరించాలా? ప్రపంచబ్యాంకుతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని అనుసరించాలా?

మొదటిది చేస్తున్నట్టు కనిపిస్తూ రెండవది చేశారనీ, స్వతంత్రంగా చార్జీల నిర్ణయం చేస్తున్నట్టు చూపిస్తూ అప్పటికే ప్రపంచబ్యాంకుతో చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేశారనీ పిటిషనర్ల అభియోగం. ఇది చట్టాన్ని అపహాస్యం చేయడమేనని వారి ఆరోపణ.

4. ప్రపంచబ్యాంకు తను ఇచ్చే 1 బిలియన్ డాలర్ల (4300 కోట్ల రూపాయల) అప్పును ఒకేసారి ముట్టజెప్పదు. వాయిదాల పద్ధతిలో ఇస్తుంది. ఎప్పటికప్పుడు సంస్కరణల అమలును పరిశీలించి ఇస్తుంది. దానికి కొన్ని మైలురాళ్లను ఈ ఒప్పందంలో రాసుకున్నారు. ఆ తేదీకి ఆ మైలురాయిని అందుకున్నట్టయితేనే మిగిలిన అప్పు ముడుతుంది. అందులో ముఖ్యమైనవి.

| | **1999** | **2002** | **2007** |
|---|---|---|---|
| కరెంటు తలసరి వినియోగం (యూనిట్లు) | 410 | 640 | 890 |
| జెన్‌కో, ట్రాన్స్‌కోల లాభాల రేటు | - | 16% | 16% |
| పంపిణీ, సరఫరా నష్టాలు | 32.7% | 26.4% | 17.7% |
| విద్యుత్ ఉత్పత్తిలో ప్రైవేట్ రంగం వాటా | 6% | 12% | 35% |
| విద్యుత్ పంపిణీలో ప్రైవేట్ రంగం వాటా | 0 | 30% | 90-100% |
| విద్యుత్ రంగంలో సబ్సిడీల వాటా | 35% | 11% | 0 |
| విద్యుత్ అందుబాట్లో ఉండే జనాభా | 50% | 55% | 62% |

కరెంటు చార్జీలు 2001, 2002 లలో 15 శాతం చొప్పున పెరగాలనీ, ఆ తరువాత 2007 దాకా 12 శాతం చొప్పున పెరగాలనీ మరొక నియమం ఉందని పైన చూశాము. ఆ నియమాన్ని కూడ ఈ మైలురాళ్లలో భాగంగా చూడాలి.

ఈ నియమాలలో తారీఖులు, అంకెలు చాలా కచ్చితంగా ఉండడం గమనించాలి. ఆం.ప్ర. విద్యుత్ సంస్కరణల చట్టం రెగ్యులేటరీ (నియంత్రణ) కమిషన్‌కు, ప్రభుత్వానికీ ఇచ్చిన అధికారాలకు ఇంక చోటేమీ మిగలదు. అయినప్పటికీ నియంత్రణ కమిషన్ స్వతంత్రమైన పారదర్శకమైన విచారణ జరిపినట్టు చూపించి ఈ ఒప్పందానికి లోబడి ఆర్డర్లు జారీ చేయడం చట్టాన్ని అపహాస్యం చేయడం కాదా అన్న ప్రశ్న ఇప్పటికే వేసుకున్నాం.

ఈ షరతుల పర్యవసానాన్ని కూడ చూడాలి. ఉత్పత్తి, సరఫరా, పంపిణీ అనే మూడు పనులలో మూడవదాన్ని 2007 నాటికి పూర్తిగా ప్రైవేటీకరణ చేయాలన్న నియమాన్ని తీసుకుందాం. మన ఇళ్లకు (అంగళ్లకు, బావులకు, కార్ఖానాలకు) కరెంటును చేరవేసేది ఈ పంపిణీ వ్యవస్థే. సమీపంలో ట్రాన్స్‌కో వారు నెలకొల్పిన సబ్‌స్టేషన్ నుండి కరెంటు తీసుకుని మన ఇంటిదాకా లైన్ వేసి మనకు కరెంటు అమ్మి ఆ డబ్బుతో అది లాభాలు సంపాదించుకోవాలి. మనం ఆదివాసులమైతే, ఎక్కడో అడవిలో 10 ఇళ్ల గుంపులో బతుకుతున్నట్టయితే, మనకు కరెంటు పంపిణీ చేయడం ఏ ప్రైవేట్ కంపెనీకి లాభదాయకంగా ఉంటుంది? ఆదివాసులదాకా పోనక్కరలేదు అనంతపురం, మహబూబ్‌నగర్ వంటి కరువు జిల్లాలలో విసిరేసినట్టు దూరదూరాన పడి ఉన్న చిన్న చిన్న గ్రామాలుంటాయి. వారికి దూరం నుండి కరెంటు తీసుకుపోయి పంపిణీ చేయడం ఏ ప్రైవేట్ సంస్థకు లాభదాయకంగా ఉంటుంది?

ప్రభుత్వం సబ్సిడీ ఇస్తే ఉంటుందేమోగానీ 1999లో 35% ఉన్న సబ్సిడీ 2002 నాటికి 11%కు తగ్గాలని, 2007 నాటికి మొత్తంగా తీసెయ్యాలని ఈ షరతులే చెపుతున్నాయి. అంటే ఆ ప్రజలు కరెంటు లేకుండా బతకవలసిందే కదా?

ఇదంతా నిజమే కావచ్చునుగానీ కోర్టులు ఏం చేయగలవు అంటారేమో. ఇది ప్రభుత్వ విధానాలకు సంబంధించిన విషయం కాబట్టి కోర్టులేం చేయలేవు అనవచ్చు.

## అవకాశం ఉండీ జోక్యం చేసుకోని కోర్టులు

రెండు కోణాల నుండి కోర్టులు జోక్యం చేసుకునే అవకాశం ఉంది. ప్రపంచబ్యాంకు నిర్దేశించిన 'మైలురాళ్ల'లోనే అసంబద్ధత ఉంది. ఒక పక్క మారుమూల బతికే ప్రజలకింక కరెంటు దక్కే అవకాశం లేకుండా చేసే నియమాలు పెడుతూ ఇంకొక పక్క కరెంటు అందుబాట్లో ఉండే జనాభా నిష్పత్తి 50% నుండి 55%కు, ఆపైన 62%కు పెరగాలని అనడం అహేతుకం. అహేతుకమైన లక్ష్యాలతో రూపొందించుకున్న ప్రభుత్వ విధానాలనుగానీ చర్యలనుగానీ కోర్టులు కొట్టేయవచ్చు.

రెండవదేమిటంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 లో చెప్పే 'జీవించే హక్కు'కు సుప్రీంకోర్టు ఇప్పటికే చాలా విస్తృతమైన అర్థాన్ని కల్పించి ఉంది. శుభ్రమైన పర్యావరణం, జీవనాధారమైన ఆదాయవనరులు, ప్రాథమిక విద్య, కనీస వైద్య సదుపాయం మొదలయినవి జీవించే హక్కులో భాగమనింది. విద్యుత్ సదుపాయం

కూడ ఈనాటి పరిస్థితులలో 'జీవితం'లో భాగమేనని సూత్రీకరించడంలో ఇబ్బందేమీ ఉండకూడదు. ఎవరు ఎంత కరెంటు వాడుకోగలరనేది వారి ఆర్థిక సామర్థ్యాన్ని బట్టి ఉండవచ్చు. రోజుకు ఎన్ని గంటల కరెంటు లభిస్తుందనేది విద్యుత్ పరిశ్రమ సామర్థ్యాన్ని బట్టి ఉండవచ్చు. ఈ విషయాలలో కోర్టులు ఏ మేరకు జోక్యం చేసుకోగలవన్నది వివాదాస్పదం కావచ్చు. కానీ మారుమూలన ఉన్న కారణంగా కొన్ని ఆవాసాలకు మొత్తంగానే విద్యుత్ వ్యవస్థే చేరని పరిస్థితి కల్పిస్తే అది జీవించే హక్కుకు భంగకరమని సూత్రీకరించడంలో ఇబ్బందేమీ ఉండకూడదు.

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని 2007 నాటికి పూర్తిగా తొలగించాలన్న షరతును చూశాము. అదేకాదు, 'క్రాస్ సబ్సిడీ'ని కూడ క్రమంగా తొలగించి వేయాలన్నది ప్రపంచబ్యాంకు నియమం.

సబ్సిడీలలో రెండు రకాలుంటాయి. ఒకటి, ప్రభుత్వం తన ఖజానా నుండి ఇచ్చేది. రెండు, వినియోగదారులలో ధనవంతులైన వారి నుండి ఎక్కువ వసూలు చేసి పేదల దగ్గర తక్కువ వసూలు చేయడం ద్వారా కల్పించే సబ్సిడీ. ఇది ధనవంతులైన వినియోగదారుల నుండి పేదలకు సబ్సిడీ ఇప్పించే పద్ధతి. దీనిని క్రాస్ సబ్సిడీ అంటారు. అభివృద్ధి ఫలితమైన సంపద కొద్దిమంది చేతిలో కేంద్రీకృతం కాకూడదని చెప్పే ఆర్టికల్ 39(సి)లోని ఆదేశిక సూత్రానికి అనుగుణ్యమైన పద్ధతి ఇది.

అది ఆదేశిక సూత్రమే కాబట్టి క్రాస్ సబ్సిడీ ఇయ్యవలసిందేనని న్యాయస్థానాలు ప్రభుత్వానికి ఆదేశం జారీ చేయలేకపోవచ్చు. కానీ ఇస్తున్న క్రాస్ సబ్సిడీని తీసెయ్యాలన్న నిర్ణయం తీసుకున్నట్టయితే దానికి హేతుబద్ధమైన కారణం చూపించవలసి ఉంటుంది. న్యాయస్థానాలు చూపించమని అడగవలసి ఉంటుంది.

నిజానికి ఈ అభ్యంతరం మొత్తంగానే విద్యుత్ సంస్కరణలకు వర్తిస్తుంది. ఇప్పటి దాకా ఉన్న విద్యుత్ వ్యవస్థలో ఎన్ని లోపాలున్నా అది పేదవర్గాలకు రైతాంగానికి చవకగా కరెంటు ఇచ్చేది, కరెంటు పంపిణీ లాభదాయకం కాని మారుమూల ఆవాసాలకు కూడ సరఫరా చేసేది. ఆ వ్యవస్థ ఆ మేరకు రాజ్యాంగ ఆదేశిక సూత్రాలకు అనుగుణమైన వ్యవస్థ. దాని నుండి వైదొలగడానికి సహేతుకమైన కారణం చూపించకపోతే అది చెల్లదని న్యాయస్థానాలు ప్రకటించవలసి ఉంటుంది.

చంద్రబాబు ప్రభుత్వం చూపించిన కారణమేమిటి? 1997లోనే ఈ కారణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అదేమిటంటే రాబోయే రోజులలో రాష్ట్రం ఆర్థికంగా

చాలా అభివృద్ధి చెందబోతుంది. దానికి తగినంత కరెంటు మనం ఉత్పత్తి చేసుకోవాలి. అప్పటికి రాష్ట్రంలో నెలకొల్పిన విద్యుదుత్పత్తి సామర్థ్యం 6110 మెగావాట్లు కాగా, రాబోయే అయిదేళ్లలో ఇంకొక 8500 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని నెలకొల్పవలసి ఉంటుంది. అయితే దానికి చాలా పెట్టుబడి (దాదాపు 35 వేల కోట్ల రూపాయలు) కావలసి ఉంటుంది. అంత పెట్టుబడి రాష్ట్ర విద్యుత్ బోర్డు దగ్గర లేదు కాబట్టి ప్రైవేట్ పెట్టుబడిని పెద్దమొత్తంలో (దాదాపు 25 వేల కోట్ల రూపాయలు) రాష్ట్ర విద్యుత్ రంగంలోకి ఆహ్వానించవలసి ఉంటుంది. ప్రపంచబ్యాంకు నుండి కూడ పెద్ద మొత్తంలో (దాదాపు 7 వేల కోట్లు రూపాయలు) అప్పు తీసుకోవలసి ఉంటుంది. కానీ ప్రైవేటు పెట్టుబడి అంత మొత్తంలో రావాలంటే సబ్సిడీలు, క్రాస్ సబ్సిడీలు, లాభదాయకం కాని సరఫరాలు మానుకోక తప్పదు. ప్రపంచబ్యాంకు అప్పియ్యాలంటే వారు చెప్పినట్టు నడుచుకోక తప్పదు.

ఇదీ రాష్ట్ర ప్రభుత్వం చూపించిన కారణం. కానీ మూడేళ్లు తిరిగేసరికి రాష్ట్ర ప్రభుత్వం తన అంచనా తప్పని ఒప్పుకుంది. 1997లో తాము ఊహించినంత వేగంగా రాష్ట్ర ఆర్థికవ్యవస్థ పెరగడం లేదనీ, ఇప్పటి అంచనాల ప్రకారం 2002 నాటికి 8500 మెగావాట్ల అదనపు సామర్థ్యం అవసరముండదనీ, 1500 మెగావాట్లయితే సరిపోతుందని అనింది. అంటే విద్యుదుత్పత్తి సామర్థ్యం 125 శాతం పెరగవలసి ఉంటుందన్న అంచనా పోయి 25 శాతం పెరిగితే చాలునన్న నిర్ణయానికి వచ్చింది.

ఇదే నిజమైతే సబ్సిడీలు మొత్తంగా తొలగించడం వగైరా నిర్ణయాలకు చూపించిన కారణాలేవీ సరయినవి కావు కదా. ఈ మాత్రం పెట్టుబడి బహుశా మనమే సేకరించగలిగి ఉందుము. అటువంటప్పుడు రాజ్యాంగ ఆదేశిక సూత్రాలకు అనుగుణ్యమైన విధానం నుండి పక్కకు తొలగడాన్ని కోర్టులు తప్పుపట్టలేవా?

## హైకోర్టు ఏమనింది?

పిటిషనర్లు వేసిన ప్రశ్నలు, వాటికి గల ఆధారాలు ఏకరవు పెట్టాను. ఇంక హైకోర్టు చెప్పిన జవాబేమిటో చూద్దాం.

ఈ మధ్య మన కోర్టులకు ఒకటి అలవాటయింది. 'కోర్టులను రాజకీయ వేదికలుగా వాడుకోవద్దు' అంటారు. 'మమ్మల్ని రాజకీయ నిర్ణయాలు చేయమనవద్దు' అంటారు. కానీ సమస్య నేపథ్యం, లేక పూర్వరంగాన్ని వివరించే పేరు మీద ప్రభుత్వం

అభిప్రాయాలను మాత్రం నిర్విమర్శగా ఏకరవు పెడతారు. ప్రభుత్వం అభిప్రాయాలు కూడ ఒక 'రాజకీయమే'నని మన న్యాయమూర్తులకు తోస్తున్నట్టు లేదు.

విద్యుత్ సంస్కరణల విషయంలో మన హైకోర్టు అదే పని చేసింది. పిటిషనర్ల వాదనలలోని నిజానిజాలు తేల్చడానికి విద్యుత్ చార్జీల పెంపుదల వెనకున్న చారిత్రక నేపథ్యాన్ని చూడవలసిన అవసరం ఉందంటూ ఆ నేపథ్యాన్ని గురించి ప్రభుత్వ న్యాయవాదులు చెప్పిన విషయాలనూ, ప్రభుత్వం చెప్పగా పత్రికలు రాసిన విషయాలనూ, 'సంస్కరణల'కు అనుకూలంగా వ్యాసకర్తలు, సంపాదకులు రాసిన విషయాలనూ జడ్జిలు తమ మాటలుగా వివరించారు. మొన్నటిదాకా ఉన్న విద్యుత్ వ్యవస్థలో విద్యుత్ బోర్డుకు చార్జీలు నిర్ణయించడంలో చాలా స్వేచ్ఛ ఉండడం, బోర్డుకు ఈ విషయంలో ఆదేశాలిచ్చే అధికారం ప్రభుత్వం చేతిలో ఉండడం నిర్హేతుకమైన నిర్ణయాలకు దారి తీసిందన్నారు. రాజకీయ పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం సమాజంలో కొన్ని వర్గాలకు విద్యుత్తును నిర్విచక్షణగా దానం చేశాయన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కొన్ని వర్గాలకు ఈ రాయితీలు ఇయ్యగా ఆ వర్గాలు దానికి అలవాటుపడి పోయాయన్నారు. మరికొన్ని వర్గాల మీద క్రాస్ సబ్సిడీ భారం పడిందన్నారు. ఈ సబ్సిడీ భారం ఆర్థిక వ్యవస్థలోకి ద్రవ్యోల్బణం రూపంలో ప్రవేశించి అనేక వస్తువుల ధరలు పెరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బోర్డుకు ఇస్తానన్న సబ్సిడీ సకాలంలో ఇవ్వకపోవడం వల్ల బోర్డు నష్టాలలో పడి దాని అభివృద్ధి కుంటుపడిందన్నారు. దీనితోబాటు విద్యుత్ చౌర్యం భయానకమైన మోతాదును చేరుకోవడం వలన విద్యుత్ సరఫరా గుణాత్మకంగా దెబ్బతినిందన్నారు. విద్యుత్ కొరత ఏర్పడిందన్నారు. అనేక పరిశ్రమలు స్వంత విద్యుత్ ఉత్పత్తి చేపట్టాయన్నారు. ముగింపుగా ఎ.పి. ట్రాన్స్‌కోనే ఉటంకిస్తూ, 'అన్ని ప్రభుత్వ సంస్థలలాగా పోను పోను మరింత అసమర్థంగా తయారయింది విద్యుత్ బోర్డు' అన్నారు. (ప్రభుత్వరంగ సంస్థలు చాలా 'నిజాయితీ'గా తమ చేతకానితనాన్ని ఒప్పేసుకునే ముచ్చటయిన సంస్కృతి మొదలయి కొన్నేళ్లయింది.)

ఈ తీర్పు క్రమంలో హైకోర్టు పిటిషనర్లకు సంప్రదాయక న్యాయశాస్త్ర పాఠాలు అనేకం నేర్పింది కాబట్టి చాలా సంప్రదాయకమైన నియమమొకటి జస్టిస్ వెంకట్రామిరెడ్డి, నాయక్‌గార్లకు గుర్తుచేయడం అధిక ప్రసంగం కాబోదు. వాదికీ ప్రతివాదికీ మధ్య జరిగిన సంవాదంలో చోటు చేసుకోని విషయమేదీ తీర్పులో ప్రస్తావించడానికి వీలులేదు. ఎందుకంటే సంప్రదాయక న్యాయశాస్త్రం ప్రకారం వాది,

ప్రతివాదులలో ఒకరు లేవదీసి ఎదుటి వారి నుండి సమాధానం కోరిన విషయాల మీద మాత్రమే న్యాయస్థానం తీర్పు చెప్తుంది.

మరి పైన పేర్కొన్న 'నేపథ్యం' ఎవరి వాదనలోనూ లేదు. ఏ పరిస్థితులలో ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలు చేపట్టిందనే విషయం వ్యాజ్యంలో భాగం కాదు. దానిపైన హైకోర్టు ఒక అభిప్రాయానికెట్లా వచ్చింది? ఎందుకు వచ్చింది?

అది వ్యాజ్యంలో భాగమయి ఉంటే పిటిషనర్లు చాలా విషయాలు కోర్టు దృష్టికి తీసుకువద్దురు. విద్యుత్ బోర్డుకు లాభదాయకం కాకపోయినా 'రాజకీయ లబ్ధి కోసం' కరెంటు సరఫరా అయిన మారుమూల కుగ్రామాలలో పగలంతా గొడ్లు కాసి ఇంటాబయటా చాకిరీ చేసి రాత్రి రెండు ముక్కలు చదివి పరీక్షలు పాసయి తెల్లబట్టలు తొడుక్కున్న దళిత, ఆదివాసీ పిల్లల గురించి చెప్పుదురు. జీవితం మధ్య భాగంలో 'వయోజన విద్య' అభ్యసించిన వారి తల్లిదండ్రుల గురించి చెప్పుదురు. 'రాజకీయ లబ్ధి కోసం' వ్యవసాయబావులకు కరెంటు సబ్సిడీ ఇవ్వబట్టే రాష్ట్రంలో సాగునీటి లభ్యత ఉన్న సేద్యపు భూమి గడచిన 15 సంవత్సరాలలో కొంత విస్తరించిందనీ, కొత్తగా దాదాపు 45 లక్షల ఎకరాలు కరెంటు సదుపాయం ఉన్న బావుల కింద సాగయ్యాయని, దీని వల్ల ఎంత లేదన్నా 15 లక్షల కుటుంబాలు రెండు పూటలా అన్నం తినగలిగాయనీ చెప్పుదురు.

ఈ ఒక్క విషయం తప్ప తక్కిన అన్ని విషయాలలోనూ హైకోర్టు పూర్తిగా సంప్రదాయబద్ధంగా వివేచించింది. 'కోర్టులు అన్ని హక్కులను కాపాడవు. రాజ్యాంగంలో కచ్చితంగా రాసి ఉన్న హక్కులను మాత్రమే కాపాడతాయి' అనింది. అది నిజమే కానీ కచ్చితంగా రాసి ఉన్న హక్కులకు ఆదేశిక సూత్రాల వెలుగులోనూ, మన ప్రభుత్వం సంతకం చేసిన అంతర్జాతీయ హక్కుల ఒడంబడికల వెలుగులోనూ విస్తృతమైన వ్యాఖ్యానం ఇచ్చుకోవచ్చునని గతంలో మన సుప్రీంకోర్టే చాలాసార్లు అనింది. దాని ప్రస్తావన ఎక్కడా ఈ తీర్పులో మన హైకోర్టు చేయలేదు. న్యాయస్థానాల పాత్రను సంకుచితం చేసే న్యాయసిద్ధాంత సూత్రాలను మాత్రం పదేపదే ఉటంకించారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచబ్యాంకుకు తన సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టిందన్న వాదనలో ఒక పార్శ్వాన్ని మాత్రమే హైకోర్టు పట్టించుకుంది. మొత్తంగా విద్యుత్ సంస్కరణలకు సంబంధించిన అన్ని నిర్ణయాలూ ప్రపంచబ్యాంకు ఆదేశాలననుసరించి తీసుకున్నారని పిటిషనర్ల అభియోగం. 1 బిలియన్ డాలర్ల అప్పు కోసం తన

సార్వభౌమ అధికారాన్ని ఒక పరాయి శక్తికి అప్పగించి వారు ఆదేశించిన పద్ధతిలో విద్యుత్ రంగాన్ని సంస్కరించడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్లు వాదించారు.

హైకోర్టు ఈ అభియోగాన్ని ఆం.ప్ర. విద్యుత్ సంస్కరణల చట్టానికి మాత్రమే పరిమితం చేసింది. ఈ చట్టం కూడ ప్రపంచబ్యాంకు షరతులననుసరించి రూపొందించినదే. అప్పటికే ఒక కేంద్ర చట్టం ఉన్నప్పటికీ ప్రపంచబ్యాంకు చెప్పిందని రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని చేసింది. ఇది సక్రమమేనా అంటే, చట్టసభలు చట్టాలు ఎందుకు చేస్తాయన్న మీమాంస న్యాయస్థానాలు చేపట్టడానికి వీలులేదని జవాబు చెప్పింది మన హైకోర్టు. ఈ సూత్రీకరణ ముందు నుండి ఉన్నదే. ఏ వర్గానికి చెందిన ప్రజల సమస్యలకు ఎటువంటి పరిష్కారం చూపించాలనేది చట్టసభల ఇష్టం. ఆ నిర్ణయం చట్టసభలలోని మెజారిటీలు చేస్తాయి. న్యాయవ్యవస్థ దానిపైన తీర్పు చెప్పజాలదు. పాలనా వ్యవస్థ, చట్టసభలు, కోర్టులు అనే మూడు వ్యవస్థలకు దేని అధికారాలు దానికున్నాయి. దేని పరిధి దానికుంది. చట్టసభలకు ఒక విషయం పైన చట్టం చేసే అధికారం రాజ్యాంగంలో ఉందా, చేసిన చట్టం రాజ్యాంగ ప్రాథమిక హక్కులకూ రాజ్యాంగంలోని ఇతర అంశాలకూ లోబడి ఉందా అని మాత్రమే కోర్టులు చూడగలవు. ఇదీ కోర్టు అభిప్రాయం.

ఇది ముందు నుండి ఉన్న పరిమితే. ఇక్కడ కూడ రాజ్యాంగ ప్రాథమిక హక్కులకు విస్తృత అర్థం ఇచ్చుకోవడం సాధ్యం కాదా అన్న ప్రశ్న వేసుకోవచ్చు. అదట్లాగుంచి, ఈ సూత్రీకరణ వెనక ఉన్న తర్కమేమిటన్న విషయం మరచిపోయి దానిని యాంత్రికంగా అన్వయించడంలో అర్థం లేదు. న్యాయశాఖ, పాలనా వ్యవస్థ, చట్టసభల మధ్యన ఉండే అధికార విభజనకు ప్రాతిపదిక దేశ సార్వభౌమత్వం. ఒక సార్వభౌమదేశంగా తన వ్యవహారాలను తానే నిర్వహించుకునే సర్వసత్తాక అధికారం ఉన్న ఈ దేశం ఆ అధికార నిర్వహణ కోసం మూడు పరస్పర స్వతంత్రమైన వ్యవస్థలను రూపొందించుకుని వాటి పరిధులను నిర్ణయించే రాజ్యాంగాన్ని రాసుకుంది. ఈ ప్రాతిపదిక మీద చట్టసభల పరిధి ఏమిటి, న్యాయవ్యవస్థ పరిధి ఏమిటి అనే విభజన రేఖను నిర్ణయించిన కోర్టు తీర్పులు ఆ ప్రాతిపదికనే కాదనడమంటే రాజ్యాంగం పునాదినే తిరస్కరించడం. రాజ్యాంగం పునాది దేశ సార్వభౌమత్వం. దానిని తిరస్కరించే ఏ చర్యనయినా న్యాయస్థానాలు సహించడానికి వీలులేదు.

ఒక ఉదాహరణ తీసుకుంటే మన హైకోర్టు అభిప్రాయం ఏ పరిణామాలకు దారితీయగలదో అర్థమవుతుంది. మనం ఎప్పటి నుండో వాడుకుంటున్న వేప, నిమ్మ

వంటి ప్రకృతిసిద్ధమైన వస్తువులకు పేటెంటు తీసుకోవాలని ప్రయత్నం చేస్తున్న పాశ్చాత్య క్రిమిసంహారక మందుల కంపెనీలకు వ్యతిరేకంగా మనం ఆందోళన చేస్తున్నాం. రేపు ప్రపంచ వాణిజ్య సంస్థ ఒత్తిడి వల్ల వారి 'హక్కు'ను ఆమోదిస్తూ పార్లమెంటు చట్టం చేసిందనుకోండి. పార్లమెంటుకు పేటెంట్ల విషయంలో చట్టం చేసే అధికారం ఉంది కాబట్టి, అటువంటి చట్టం చేయడానికి వీలులేదని రాజ్యాంగంలోని 395 ఆర్టికల్స్‌లోనూ 12 షెడ్యూల్స్‌లోనూ ఎక్కడా చెప్పలేదు కాబట్టి అందులో తప్పేమీ లేదని కోర్టులంటాయా?

రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు ఉందని ఒప్పుకుంటూ కూడ ఆ సవరణ 'రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని మార్చడానికి వీలులేద'ని రాజ్యాంగంలో ఎక్కడా లేని షరతు సుప్రీంకోర్టు గతంలో పెట్టలేదా? ఎందుకు పెట్టింది? మనం ఏ అధికారం గురించి మాట్లాడుకున్నా రాజ్యాంగం పరిధిలో మాట్లాడుకుంటున్నాం, రాజ్యాంగం ప్రాతిపదికగా మాట్లాడుకుంటున్నాం. ఎవరికి ఏ అధికారమున్నా అది ఆ ప్రాతిపదికనే ధ్వంసం చేసే అధికారం కావడానికి వీలు లేదు. అందుకే రాజ్యాంగాన్ని సవరించే అధికారం కూడ దాని మౌలిక స్వరూపాన్ని మార్చేది కాకూడదన్నారు. దేశ సార్వభౌమత్వం ఆ మౌలిక స్వరూపంలో భాగం కాదా? అంటే పాలనా వ్యవస్థ, చట్టసభలు చేసే ఏ పనులైనా ఏ చట్టాలయినా ఈ దేశపౌరుల అవసరాలు, ప్రయోజనాలు, కోరికలు, ఒత్తిడుల కారణంగా చేయాలి (మంచికైనా చెడుకైనా). అంతేకానీ పరాయి వారి నిర్బంధ షరతులకు లొంగి చేసేవి చెల్లవు అననక్కర లేదా?

దీనినే ఇంకొక కోణం నుండి చూడవచ్చు. 'రెప్రజెంటేటివ్ డెమోక్రసీ' భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలలో ఒకటని సుప్రీంకోర్టు అనింది. అంటే ప్రజలలో మెజారిటీ మద్దతు సంపాదించినవారు ప్రజల ప్రతినిధులుగా పరిపాలన చేసే ప్రజాస్వామ్యం రాజ్యాంగ మౌలిక సూత్రాలలో ఒకటని అర్థం. ఈ దేశ ప్రజలు ఎన్నుకోని ప్రపంచబ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థల వంటి వ్యవస్థలు బలవంతంగా వారి విధాన నిర్ణయాలు మనపైన రుద్దితే వాటిని మన చట్టసభలు ఆమోదించి తదనుగుణంగా చట్టాలు చేయడం ఆ మౌలిక సూత్రానికి విరుద్ధం కాదా?

ఇవి మన న్యాయస్థానాలకు కొత్త ప్రశ్నలు. కానీ ప్రస్తుత పరిస్థితులలో చాలా కీలకమైన ప్రశ్నలు. ఈ ప్రశ్నలకు చాలా బాధ్యతగా జవాబు చెప్పవలసి ఉండింది. ఆ సంగతి గుర్తించకుండా, ఇవి పాత ప్రశ్నలే అయినట్టు హైకోర్టు పాత సమాధానాలే చెప్పి సంతృప్తి చెందడం బాధాకరం. 'ఒక చట్టం రాజ్యాంగబద్ధమా కాదా అని

అడుగుతున్నామంటే ఆ చట్టసభకు ఆ విషయంలో చట్టం చేసే అధికారం రాజ్యాంగం ఇచ్చిందా లేదా అని మాత్రమే'ననే ఒక పాశ్చాత్య న్యాయసిద్ధాంతవేత్త అభిప్రాయాన్ని మన హైకోర్టు తన తీర్పులో ఒకటికి రెండుసార్లు ఉటంకించి అదే కరెక్టనింది. రాజ్యాంగాన్ని సవరించే అధికారం రాజ్యాంగమే పార్లమెంటుకు ఇచ్చినప్పటికీ అది రాజ్యాంగం స్వరూప స్వభావాలను మార్చే అధికారం కాదని కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఈ పాశ్చాత్య మేధావి అభిప్రాయంతో జస్టిస్ వెంకట్రామిరెడ్డిగారు ఏ విధంగా సమన్వయపరుస్తారో!

కాగా, ప్రభుత్వం సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టిందని పిటిషనర్లు అభ్యంతరం తెలిపింది కేవలం విద్యుత్ సంస్కరణల చట్టం విషయంలోనే కాదు. మొత్తంగా విద్యుత్ రంగ సంస్కరణలలో భాగమైన అన్ని కీలక నిర్ణయాలను ప్రభుత్వం ప్రపంచబ్యాంకు ఒత్తిడికి లోనయి తీసుకుందని. 2007 నాటికి సబ్సిడీలు మొత్తం తొలగిస్తామనీ, క్రాస్ సబ్సిడీ కూడ తొలగిస్తామనీ, విద్యుత్ పంపిణీని పూర్తిగా ప్రైవేట్‌పరం చేస్తామనీ, విద్యుత్ చార్జీలు 2001 లోనూ 2002 లోనూ 15 శాతం, ఆపైన ప్రతి సంవత్సరం 12 శాతం పెంచుతామనీ, విద్యుత్ పంపిణీని పూర్తిగా ప్రైవేట్‌పరం చేస్తామనీ చేసుకున్న ఒప్పందాన్నే సార్వభౌమత్వాన్ని అతిక్రమించిన చర్యగా పిటిషనర్లు వర్ణించారు. అది రాజ్యాంగ విరుద్ధం అవునో కాదో కోర్టు తేల్చాలని అడిగారు.

అది రాజ్యాంగ విరుద్ధం అనడానికి రెండు న్యాయ సిద్ధాంతసమ్మతమైన వాదనలను పిటిషనర్లు కోర్టు ముందు ఉంచారు. ఒక నిర్ణయం తీసుకునేటప్పుడు అప్రస్తుతమైన, అసందర్భమైన కారణాలను లెక్కలోకి తీసుకున్నట్టయితే ఆ నిర్ణయం చట్టబద్ధం కాదు. విద్యుత్ సంస్కరణలకు సంబంధించిన నిర్ణయానికి కారణాలు విద్యుత్ రంగం బాగోగులతో ముడిపడినవై ఉండాలి. అప్పిచ్చిన వాడు షరతులు పెట్టాడన్న కారణంగా ఏ నిర్ణయమైనా చేయడం అసందర్భమైన, అప్రస్తుతమైన కారణమవుతుంది. రెండు – ప్రజలెన్నుకున్న ప్రజా ప్రతినిధులు ప్రజల బాగోగుల గురించి తమకున్న అవగాహనను అనుసరించి (ఆ అవగాహన మంచిదా చెడ్డదా అన్నది వేరే విషయం) నిర్ణయాలు చేయడం ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం (రెప్రెజెంటేటివ్ డెమోక్రసీ) లక్షణం. అది భారత రాజ్యాంగం మౌలిక స్వరూపంలో భాగమని సుప్రీంకోర్టు చాలాసార్లు అనింది. ప్రజలెన్నుకోని పరాయి దేశస్తులు విధాన నిర్ణయాలు చేయడం, దానిని మన వాళ్లు అమలు చేయడం రాజ్యాంగ విరుద్ధం.

దీనికి హైకోర్టు ఏ జవాబూ చెప్పలేదు. జవాబు చెప్పకుండానే తుది తీర్పు ఇచ్చేసింది.

హైకోర్టు జవాబు చెప్పని మరొక ముఖ్యమైన అభ్యంతరం ఉంది.

## చట్టం లక్ష్యాలకు అర్థం కల్పించని కోర్టు

కరెంటు చార్జీలు నిర్ణయించిన విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు ఆం.ప్ర. విద్యుత్ సంస్కరణల చట్టం విస్తృతమైన అధికారాలిచ్చింది. ఆ అధికారాల నిర్వహణకు విశాలమైన ప్రాతిపదికను కూడ నిర్దేశించింది. 'విద్యుత్ పరిశ్రమను వ్యాపారసరళి'లో నడపాలన్నదొక్కటే ఆ చట్టం ఆదేశం కాదు. విభిన్న అవసరాలనూ ప్రయోజనాలనూ ప్రమాణాలనూ దృష్టిలో పెట్టుకొని కమిషన్ తన విధులు నిర్వర్తించాలి.

కరెంటు సరఫరా, పంపిణీ 'సమర్థంగా, పొదుపుగా, న్యాయబద్ధంగా' జరిగేటట్టు చూడాలి. అమ్మకందారుకు విద్యుత్ వ్యాపారం గిట్టుబాటయ్యేటట్టు చూడడమే కాక, కొనుగోలుదార్ల ప్రయోజనాలను కూడ కాపాడాలి. విద్యుత్ పరిశ్రమలో ప్రైవేట్ రంగం ప్రవేశానికి మార్గం సుగమం చేస్తూ అదే సమయంలో వినియోగదారులకు న్యాయం జరిగేటట్టు చూడాలి. సరఫరా కంపెనీలు విద్యుదుత్పత్తి కంపెనీల నుండి చేసే కరెంటు కొనుగోలు పొదుపుగా, పారదర్శకంగా ఉండేటట్టు చూడాలి – ఇవన్నీ విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు ప్రామాణికమైన నియమాలు.

ప్రైవేటీకరణకు శాసన ప్రాతిపదిక కల్పించడం కోసం తయారు చేసిన ఈ చట్టంలో ఇన్ని విషయాలు ఎందుకు చేర్చారన్నది కొంచెం ఆశ్చర్యం కలిగించే విషయమే. ఇవి ప్రభుత్వానికి తలనొప్పిగా పరిణమించగలవని గుర్తించిన అడ్వకేట్ జనరల్ గారు కేసు వాదనల సందర్భంలో 'ఏవేవో అక్కరకురాని ఆదర్శాలన్నీ రాశారు దీనిలో' అని బాహాటంగానే విసుక్కున్నారు కూడ.

అక్కరకొచ్చేవో అక్కరకు రానివో ఆయనగారి నుంచి నేర్చుకోనక్కరలేదుగానీ, ఈ లక్ష్యాలన్నిటికీ అర్థం కల్పించవలసిన బాధ్యత హైకోర్టు మీద ఉండింది. ధరల నిర్ణయం ఈ లక్ష్యాల వెలుగులో జరిగిందా లేదా అని పరిశీలించవలసిన బాధ్యత ఉండింది. ఒక కొత్త చట్టం మొదటిసారి కోర్టుముందుకొచ్చినప్పుడు దానిని సమగ్రంగా వ్యాఖ్యానించి దానిని ఏ విధంగా అర్థం చేసుకోవాలో విడమరిచి చెప్పే సత్సంప్రదాయమొకటి మన న్యాయవ్యవస్థకు ఉండింది. ఈ కేసులో మన హైకోర్టు ఆ పనేమీ చేయలేదు. విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు విద్యుత్ సంస్కరణల చట్టం

నిర్దేశించిన విశాలమైన లక్ష్యాలకు ఏ అర్థమూ కల్పించకుండానే తన పరిశీలన ముగించింది.

అందులో భాగంగా విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు చట్టం నిర్దేశించిన బాధ్యతలన్నిటినీ కలిపి అర్థం చేసుకోవాలనీ, మిగిలిన బాధ్యతల నుండి అమ్మకపు ధరను నిర్ణయించే బాధ్యతను వేరు చేసి వ్యవహరించడం చట్టవిరుద్ధమనీ పిటిషనర్లు లేవదీసిన వాదనకు హైకోర్టు ఏ జవాబూ చెప్పలేదు. అసలు ఈ విషయాన్ని తన తీర్పులో ప్రస్తావించనే లేదు.

విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీలలో ఒక్క ఉత్పత్తి మీద మాత్రమే విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు అధికారం లేదు. సరఫరా, పంపిణీల పైన అజమాయిషీ కమిషన్‌దే. ఆ రెండు రంగాలలోని కంపెనీలకు లైసెన్స్ ఇచ్చేది నియంత్రణ కమిషనే. 'సమర్థత, పొదుపు, న్యాయబద్ధత', 'వ్యాపారి ప్రయోజనాలనూ, వినియోగదారుల ప్రయోజనాలనూ కాపాడుతూ విద్యుత్ పరిశ్రమలో పోటీతత్వం పెంచడం' అనే లక్ష్యాలకు తగిన షరతులను ఆ లైసెన్స్‌లోనే కమిషన్ నిర్దేశించవచ్చు. ప్రత్యేకించి, సరఫరా కంపెనీ ఉత్పత్తి కంపెనీల నుండి విద్యుత్తును కొనుగోలు చేసే విషయంలో పొదుపు, పారదర్శకత పాటించాలన్న నియమం లైసెన్స్‌లోనే పొందుపరిచే అధికారం కమిషన్‌కు ఉంది.

చట్టంలో ఈ విధంగా ఉండగా, జరిగిందేమిటంటే రాష్ట్రంలోని ఏకైక సరఫరా కంపెనీ అయిన ఎ.పి. ట్రాన్స్‌కో విద్యుత్ నియంత్రణ కమిషన్ ఉనికిలోకి రాకముందే అనేక ఉత్పత్తి కంపెనీలతో కొనుగోలు ఒప్పందాలు చేసేసుకుంది. ఆ ఒప్పందాలే దాని ఆదాయ అవసరాలను నిర్ణయించాయి. ఆ ఆదాయ అవసరాల పద్దే టారిఫ్ పెంపుదలకు ప్రాతిపదిక. ఈ పెంపుదల మాత్రం విద్యుత్ నియంత్రణ కమిషన్ ద్వారా జరిగింది.

విద్యుత్ నియంత్రణ కమిషన్ ఉనికిలోకి వచ్చిన తరువాత ఎ.పి. ట్రాన్స్‌కో తన సరఫరా లైసెన్స్‌ను పునరుద్ధరించమని కమిషన్‌కు అప్లికేషన్ పెట్టుకుంది. కొత్తగా సరఫరా లైసెన్స్ కోసం అర్జీ పెట్టుకొని ఉంటే ఆ అర్జీదారు చేసే విద్యుత్ కొనుగోలు పైన పొదుపు, పారదర్శకతలకు సంబంధించిన షరతులు పెట్టే అధికారం ఉన్న కమిషన్, పాత లైసెన్స్ పునరుద్ధరణ కోసం ట్రాన్స్‌కో అర్జీ పెట్టుకున్నప్పుడు కూడ అప్పటికి ట్రాన్స్‌కో చేసుకున్న కొనుగోలు ఒప్పందాలను పరిశీలించి ఆ ఒప్పందాలు

ఎంత పొదుపుగా, ఎంత పారదర్శకంగా చేసుకునిందో పరిశీలించి ఉండవలసింది. ఆ ప్రమాణాలకు అనుగుణంగా లేని ఒప్పందాలను రద్దు చేసి తిరిగి ఒప్పందాలు చేసుకోవలసిందిగా ఆదేశించవలసి ఉండింది. ఇది పిటిషనర్ల వాదన.

అయితే విద్యుత్ నియంత్రణ కమిషన్ ఆ పని చేయలేదు. ఎ.పి. ట్రాన్స్కో అప్పటికే చేసుకున్న కొనుగోలు ఒప్పందాలను కనీసం తెరిచి చూడకుండానే ట్రాన్స్కో లైసెన్స్‌ను పునరుద్ధరించేసింది. తాను పరిశీలించని కొనుగోలు ఒప్పందాల పర్యవసానమైన ట్రాన్స్కో ఆదాయ అవసరాలను ప్రాతిపదిక చేసుకుని ప్రజలు చెల్లించవలసిన కరెంటు చార్జీలను నిర్ణయించింది. ఇది ప్రాథమికంగానే అభ్యంతరకరమని పిటిషనర్లు వాదించారు.

పోనీ కమిషన్ పరిశీలించినా పరిశీలించకపోయినా ఆ కొనుగోలు ఒప్పందాలు పొదుపుగా, పారదర్శకంగా ఉండి ఉంటే ధరల నిర్ణయానికి వచ్చిన తేడా ఏమీ లేదు కదా అనవచ్చును. కానీ వాటిలో పొదుపు లేదు, పారదర్శకత లేదు. ప్రభుత్వరంగ విద్యుదుత్పత్తి సంస్థల నుండి కొనుగోలు చేసిన ధర కంటే 100 నుండి 150 శాతం ఎక్కువకు (అంటే రెండు నుండి రెండున్నర రెట్ల ధరకు) ప్రైవేట్ విద్యుదుత్పత్తి కంపెనీలతో ట్రాన్స్కో కొనుగోలు ఒప్పందాలు చేసుకుంది. అంతేకాక, వాళ్లు ఎంత ఉత్పత్తి చేస్తే అంతా కొంటామని 'కౌంటర్ గ్యారంటీ' కూడ ఇచ్చింది.

ఈ కొనుగోలు ఒప్పందాలను గుడ్డిగా ఆమోదించి ఆ ప్రాతిపదికన మనం ట్రాన్స్కోకు చెల్లించవలసిన ధరను నిర్ణయించిన విద్యుత్ నియంత్రణ కమిషన్ చర్య చట్టవిరుద్ధమన్న వాదనను హైకోర్టు పట్టించుకోలేదు. తన తీర్పులో ఎక్కడా ప్రస్తావించనే లేదు.

## ఆదేశిక సూత్రాల గతీ అంతే

సబ్సిడీ తొలగింపు గురించి కూడ పిటిషనర్ల వాదనను హైకోర్టు తేలికగా కొట్టి పారేసింది. రెండు ముఖ్యమైన ఆదేశిక సూత్రాలు ఈ సందర్భంలో చర్చకు వచ్చాయి.

**ఆర్టికల్ 38(2):** వ్యక్తుల మధ్యనే కాక భిన్నవృత్తులు అనుసరించే వారి మధ్య, భిన్న ప్రాంతాలలో నివసించేవారి మధ్య ఆదాయాలలోని అసమానతలను, స్థితిగతులలోనూ అవకాశాలలోనూ సదుపాయాలలోనూ ఉన్న అసమానతలను తగ్గించడానికి ప్రభుత్వం కృషి చేయాలి.

**ఆర్టికల్ 39(బి):** సమాజం యొక్క భౌతిక వనరుల యాజమాన్యము, నిర్వహణ సమష్టి యోగక్షేమాలకు తగిన పద్ధతిలో పంపిణీ అయ్యేటట్టు చూడాలి.

**ఆర్టికల్ 39 (సి)** ఆర్థిక వ్యవస్థ పనితీరు ఫలితంగా సంపద, ఉత్పత్తి సాధనాలు కొద్దిమంది చేతిలో కేంద్రీకృతమై సమష్టి ప్రయోజనాలు దెబ్బతినే పరిస్థితి రాకుండా ఉండేటట్టు ప్రభుత్వం తన విధానరచనను చేపట్టాలి.

ఇవి ఆదేశిక సూత్రాలు కాబట్టి వీటిని అమలు చేయమని కోర్టులు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయలేకపోవచ్చు. ఏ సందర్భంలో వీటి అమలుకు ప్రభుత్వం ఏ మేరకు చర్యలు చేపట్టేదీ తన విచక్షణకు వదిలేయాలని ప్రభుత్వం అంటే తప్పుపట్టలేకపోవచ్చు. కానీ ఆ ఆదేశిక సూత్రాల అమలుకు సాధనాలుగా ఉన్న సబ్సిడీల వంటి విధానాలను 2007 తరువాత ఇంకెప్పుడూ చేపట్టబోమని ప్రపంచబ్యాంకుతో ఒప్పందం చేసుకోవడాన్ని కోర్టులు తప్పుపట్టలేవా?

రాజ్యాంగ నిర్మాతలు ఆదేశిక సూత్రాలను హక్కులుగా ఎందుకు రాయలేదు? ప్రభుత్వ విధానాలకు రాజ్యాంగం సూచించే గమ్యంగా మాత్రమే ఎందుకు రాశారు? ఇప్పటికిప్పుడే వాటిని అమలు చేయడం సాధ్యం కాదనుకున్నారు కాబట్టి; అయినా ఎప్పటికయినా ఆ సూత్రాలలోని హక్కులను ప్రజలకు అందియ్యాలని భావించారు కాబట్టి. అందువల్ల ఈ రోజే ఈ ఆదేశిక సూత్రాన్ని అమలు చేయమని కోర్టులు ప్రభుత్వానికి ఆదేశం జారీ చేయలేకపోవచ్చును గానీ ఆదేశిక సూత్రాలను అమలు చేయబోమని చట్టం చేసినా, విధాన ప్రకటన చేసినా కోర్టులు ఊరుకోవడానికి వీలులేదని పిటిషనర్ల వాదన. ఇది ఇప్పటివరకు మన న్యాయవ్యవస్థ ముందు చర్చకు రాని ప్రతిపాదన. కానీ గ్లోబలైజేషన్ నేపథ్యంలో పదే పదే చర్చకు రాబోతుంది. దీనికి న్యాయవ్యవస్థ ఏదో ఒక రోజు జవాబు చెప్పవలసి ఉంటుంది. ఆ పని మన హైకోర్టు మొదలుపెట్టి ఉంటే ఉపయోగకరంగా ఉండేది.

దురదృష్టవశాత్తు మన హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వ సంస్కరణలు ఆదేశిక సూత్రాలను అతిక్రమిస్తాయనడం సత్యదూరమని చెప్పి కొట్టి పారేసింది.

## నిర్ణయం అహేతుకమైనా చూడదలచుకోని కోర్టు

కచ్చితమైన సమాచారం లేకుండా అరకొర సమాచారం ఆధారంగా తీసుకున్న నిర్ణయం అహేతుకమైనదని కొట్టివేయడానికి కొత్త సూత్రీకరణ ఏదీ చేయనవసరం లేదు. ట్రాన్స్‌కో సరఫరా చేసే కరెంటులో 41% గురించి మాత్రమే వారి వద్ద కచ్చితమైన

సమాచారం (ఏ కోవకు చెందిన వినియోగదారులు అందులో ఎంత భాగాన్ని వాడుకుంటున్నారన్న సమాచారం) ఉంది. ఎందుకంటే 41% మాత్రమే కరెంటు మీటర్ల గుండా సరఫరా అవుతుంది. మిగిలిన 59% మీటర్లకు అందదు. అందులో వ్యవసాయరంగం వాడుకునే కరెంటు ఉంది. ఇది విధానపరంగానే మీటర్లకెక్కదు. దొంగతనంగా వాడుకునే కరెంటు ఉంది. ఇది దొంగకరెంటు కాబట్టి మీటర్లకెక్కదు. 'సరఫరా నష్టాలు' – అంటే సరఫరాక్రమంలో జరిగే సాంకేతిక నష్టం – ఉంది. ఇదంతా కలిపి మొత్తం కరెంటులో 59%. ఇందులో సరఫరా నష్టాలు 4.5% ఉండవచ్చునని అంచనా. వ్యవసాయరంగానికిచ్చేది, పంపిణీనష్టం అని పిలవబడే కరెంటు దొంగతనం కలిసి మిగిలిన 54.5%. ఈ రెండింటిలో ఏది ఎంత అనేది తెలియదనేది ట్రాన్స్‌కో సహితం ఒప్పుకునే విషయమే. అంటే సరయిన ఆధారం లేని అంచనాలతో ట్రాన్స్‌కో తన ప్రతిపాదనలు రూపొందించుకుంది. ఆ అంచనాలు సైతం స్థిరంగా లేవు.

1995–96 దాకా తమ అంచనాలలో వ్యవసాయరంగం వినియోగాన్ని ఎక్కువగానూ పంపిణీ నష్టాన్ని తక్కువగానూ చూపించారు. 1996–97 నుండి అకస్మాత్తుగా దానిని తారుమారు చేసి వ్యవసాయ వినియోగాన్ని తక్కువగానూ కరెంటు చౌర్యాన్ని ఎక్కువగానూ చేసి చూపించడం మొదలుపెట్టారు. 1998–99లో దొంగకరెంటు మొత్తం కరెంటులో 38% ఉందన్నారు.

ఇక్కడ రెండు అభ్యంతరాలు పిటిషనర్లు కోర్టు ముందు ఉంచారు. ఇంత అస్పష్టమైన సమాచారాన్ని ఆధారం చేసుకొని విద్యుత్ నియంత్రణ కమిషన్ చేసిన నిర్ణయం అహేతుకమైనది కాబట్టి అది చెల్లదన్నది ఒకటి. కరెంటు చౌర్యం 38% ఉందని ట్రాన్స్‌కోయే ఒప్పుకుంటున్నప్పుడు ఆ భారమంతా నిజాయితీగా బిల్లులు చెల్లించేవారిపైన పెట్టి చార్జీలు నిర్ణయించడం అన్యాయమన్నది రెండవది.

ఇందులో మొదటి అభ్యంతరానికి హైకోర్టు ఏ జవాబు చెప్పలేదు. రెండవ అభ్యంతరం గురించి ఏమనిందంటే సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా తన ఖర్చు 500 కోట్ల మేరకు తగ్గించుకుంటానని ట్రాన్స్‌కోయే కమిషన్ ముందు ఒప్పుకున్న విషయాన్నీ, కమిషన్ ఆ అంగీకారాన్ని లెక్కలోకి తీసుకొని వినియోగదారులు చెల్లించవలసిన మొత్తం నుండి 500 కోట్లు మినహాయించిన విషయాన్నీ ప్రస్తావించి అదే ఈ అభ్యంతరానికి జవాబు అనింది.

కానీ 500 కోట్లే ఎందుకు? 1000 కోట్లు ఎందుకు కాకూడదు? ఈ ప్రశ్న జడ్జిలే వాదనల క్రమంలో ట్రాన్స్‌కో న్యాయవాదినీ, కమిషన్ న్యాయవాదినీ అడిగారు. వాళ్లు ఎంతో కొంత ఆదా చేస్తామని ఒప్పుకుంటే వీళ్లు మంచిదే అనడం హేతుబద్ధమైన నిర్ణయమయిపోతుందా? కోర్టులో జడ్జిలడిగిన ప్రశ్నకు ఆ న్యాయవాదులిద్దరూ ఏ జవాబూ చెప్పలేదు. అయినప్పటికీ జడ్జిలు సంతృప్తి చెందిపోయారు. పంపిణీనష్టం 14 లేక 15 శాతం దాదాపు అన్ని దేశాలలోనూ ఉంటుందనీ, ఆ మేరకు చౌర్యాన్ని భరించక తప్పదనీ నిపుణులు అంటారు. అటువంటప్పుడు ప్రస్తుతం ఉందని (లెక్కలకు ఆధారాలేవీ చూపకుండా) చెప్తున్న 38 శాతాన్ని 15 కు దించడానికి ట్రాన్స్‌కోకు ఒక హేతుబద్ధమైన గడువు పెట్టి, ఒక్కొక్క సంవత్సరం ఆ దిశగా ఎంత అభివృద్ధి సాధించాలో నిర్దేశించి ఆ షరతు మీద విద్యుత్ చార్జీల పెంపుదలను ఆదేశించి ఉన్నా ఒక రకం. కమిషన్ ఆ పని చేయలేదు, అది తప్పని హైకోర్టూ భావించలేదు.

## అసలా చట్టమే చెల్లుతుందా?

విద్యుత్ సంస్కరణలలో కీలకమైన పాత్ర నిర్వహించే నియంత్రణ కమిషన్ ఏర్పాటుకు చట్టరూపం ఇస్తూ కేంద్రప్రభుత్వం అప్పటికే ఒక చట్టం చేసి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం వేరొక చట్టం చేయడానికి ప్రపంచబ్యాంకుతో చేసుకున్న ఒప్పందమే కారణమనీ, రాష్ట్ర చట్టానికి ఆర్టికల్ 254 (2) కింద రాష్ట్రపతి నుండి ఆమోదం పొందేటప్పుడు ఈ సంగతి చెప్పలేదు కాబట్టి రాష్ట్రపతి ఇచ్చిన ఆమోదం చెల్లదని పిటిషనర్లు వాదించారు. వాదనల సమయంలో జడ్జిలు దీనిని సీరియస్‌గానే తీసుకున్నారు. రాష్ట్రపతి ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన మెమొరాండంను కోర్టులో ప్రవేశపెట్టమని అడ్వకేట్ జనరల్‌ను కోరారు. రెండుసార్లు వారు అడిగినప్పటికీ అడ్వకేట్ జనరల్ ఆ పని చేయలేదు. దానిని బట్టి పిటిషనర్ల అభియోగం వాస్తవమేనన్న నిర్ణయానికి కోర్టు రావలసి ఉండింది. కాని కోర్టు ఆ పనేమీ చేయకుండా, ఆర్టికల్ 254 (2) కింద రాష్ట్రపతి ఇచ్చే ఆమోదం కోర్టుల పర్యవేక్షణ పరిధిలోకి రాదని ప్రకటించింది. ఇది న్యాయసిద్ధాంతం రీత్యా కూడ చాలా సందేహాస్పదమైన అభిప్రాయం. రాజ్యాంగం ఎవరికిచ్చిన ఏ అధికారమైనా సక్రమంగానే నిర్వర్తించాలనేది ఒక సాధారణసూత్రం. అన్ని నిర్ణయాల తప్పొప్పుల పైన కోర్టులు తీర్పు చెప్పలేకపోవచ్చును గానీ నిర్ణయం సక్రమంగా తీసుకున్నారా లేదా అని పర్యవేక్షించవచ్చును. నిర్ణయం సక్రమంగా తీసుకునే ప్రక్రియలో ఒక

ముఖ్య విషయమేమిటంటే ఆ నిర్ణయానికి సంబంధించిన మొత్తం సమాచారాన్ని లెక్కలోకి తీసుకోవడం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచబ్యాంకుతో చేసుకున్న ఒప్పందాన్నీ, ఒప్పుకున్న షరతులనూ లెక్కలోకి తీసుకోకుండా ఆ ఒప్పందంలో భాగమైన చట్టానికి ఆర్టికల్ 254(2) కింద రాష్ట్రపతి ఇచ్చిన ఆమోదం చెల్లదు. కాబట్టి ఆ చట్టమూ చెల్లదు, దాని కింద చేసిన ధరల నిర్ణయమూ చెల్లదు.

## ముగింపు

సామాజిక ప్రాముఖ్యం ఉన్న విషయాల పైన న్యాయవ్యవస్థ ఇచ్చే తీర్పులను విమర్శిస్తే 'మమ్మల్ని మీ రాజకీయాలలో భాగం కమ్మనవద్దు' అనీ, 'మమ్మల్ని విధాన నిర్ణయాలు చేయమనవద్దు' అనీ జడ్జిలు అంటారు. 'మేము రాజ్యాంగాన్ని, చట్టాలను అమలు చేయించే పని మాత్రమే చేస్తాం' అంటారు. ఆ పని చేయమనే అడుగుతున్నాం. ఎటొచ్చీ రాజ్యాంగాన్ని, చట్టాన్ని సంకుచితంగా అర్థం చేసుకోకుండా సరయిన స్ఫూర్తితో అర్థం చేసుకొమ్మంటున్నాం. అంతకు మించి ఎవరైనా ఆవేశంలో కోర్టులు విధాన నిర్ణయాలు చేయడం లేదని విమర్శిస్తే బాధ్యతగల వ్యక్తులుగా మేమే వద్దంటున్నాం. ఆ బాధ్యత కోర్టుల పట్ల బాధ్యత కాదు, ప్రజల పట్ల బాధ్యత. ప్రజలకూ ప్రజాభిప్రాయానికీ ఏ రకంగానూ బాధ్యులుగాని న్యాయమూర్తుల చేతిలో విధాన నిర్ణయాలు చేసే అధికారం పెట్టడం ప్రజలకు మంచిది కాదు. ఎంత చెడ్డా ఆ పనిని ప్రజాభిప్రాయానికి ఏదో ఒక రూపంలో జవాబుదారు కాక తప్పని రాజకీయ వ్యవస్థ చేయడమే మంచిది.

కానీ రాజ్యాంగాన్నీ, చట్టాన్నీ అమలు చేయించే బాధ్యతను సంకుచితంగా కాక విశాల దృక్పథంతో చేయాలని అంటున్నాం. ఆ విశాల దృక్పథాన్ని కూడ ఎవరి 'రాజకీయాల' నుండీ అరువు తెచ్చుకొమ్మనడం లేదు. రాజ్యాంగంలోనే దానికి కావలసిన రాజకీయ స్ఫూర్తి ఉంది, న్యాయశాస్త్రంలోనే కొన్ని ప్రామాణిక సూత్రాలు ఉన్నాయి. ఇప్పటికింకా లేనివాటిని అభివృద్ధి చేసే అవకాశమూ ఉంది.

భారత రాజ్యాంగానికొక రాజకీయ నేపథ్యం ఉంది. సామాజిక జీవితంలోని అన్ని పార్శ్వాలనూ ఏదో ఒక మేరకు స్పృశించిన పోరాటాలు రాజ్యాంగానికి స్ఫూర్తినిచ్చాయి. ఎన్ని లోపాలతోనయినప్పటికీ ఆ స్ఫూర్తి రాజ్యాంగంలో కనిపిస్తుంది. మన న్యాయవ్యవస్థ దానికి నిండయిన అర్థం ఇవ్వడంలో విఫలమయిందనే చెప్పాలి. రాజ్యాంగ పీఠిక, ఆదేశిక సూత్రాలు దేశం గమ్యాన్ని సూచిస్తాయనీ, రాజ్యాంగంలోని

హక్కులు, ప్రజాస్వామ్య వ్యవస్థ దానికి సాధనమనీ రాజ్యాంగకర్తలే అన్నారు. ఆ స్ఫూర్తితో రాజ్యాంగానికీ, చట్టాలకూ అర్థం కల్పించే న్యాయసిద్ధాంతాన్ని భారత న్యాయవ్యవస్థ అభివృద్ధి చేయలేకపోయింది. ఈ వైఫల్యాన్ని కొంత మేరకైనా అధిగమించడానికి 1980లలో జరిగిన ప్రయత్నానికి గండికొట్టడం 1990లలో మొదలయింది. 'గ్లోబలైజేషన్' ప్రభావం పెరిగే కొద్దీ ఈ తిరోగమనం కూడ బలం పుంజుకుంటున్నది.

ఇది కాకతాళీయం కాదు. 'గ్లోబలైజేషన్' పట్ల మన సమాజంలో కులమూ డబ్బూ గలవాళ్లలో అధికభాగం అనుకూలంగా ఉన్నారు. న్యాయమూర్తులు అందులో భాగమే. రాజ్యాంగానికి స్ఫూర్తినిచ్చిన సమతా సంక్షేమ ఆకాంక్షలను ఈ కోవకు చెందినవారంతా ఈ రోజొక బరువుగా భావిస్తున్నారు. ఆ బరువును ఎంత తొందరగా దించుకుంటే అంత వేగంగా దేశం 'అభివృద్ధి' వైపు ప్రయాణిస్తుందని నమ్ముతున్నారు.

ఈ వైఖరి ప్రతిఫలనం 'విద్యుత్ చార్జీల' తీర్పులో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. అయితే వారికక్కరలేని సమతా సంక్షేమాల స్ఫూర్తి ప్రజలకవసరం కాబట్టి రాజ్యాంగం కింద బాధ్యతలు నిర్వర్తించే ప్రతీ ఒక్కరినీ ప్రజల తరపున నిలదీయవలసిందే.

*మానవహక్కుల వేదిక బులెటిన్ 3*

*మార్చి 2001*

# న్యాయానికివి రోజులు కావు

పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీ మండలాలలో కొన్నేళ్ళుగా సాగుతున్న అలజడుల చరిత్ర రాసే రోజు వచ్చినప్పుడు మన రాష్ట్ర హైకోర్టుకు కొన్ని అక్షింతలు తప్పక పడతాయి.

ఏజెన్సీ ప్రాంతాలకు సంబంధించి మన హైకోర్టు ఇచ్చిన తీర్పులన్నీ ఒకే రకంగా లేవుగానీ, మొత్తం మీద ఐదవ షెడ్యూలులోని విస్తృతమైన సంక్షేమ లక్ష్యాల వెలుగులో కాక సంప్రదాయక ఆస్తి చట్టాల వెలుగులో ఏజెన్సీనీ, ఏజెన్సీ చట్టాలనూ చూసిన సందర్భాలే ఎక్కువ అని చెప్పుకోవచ్చు. అయితే సంప్రదాయక బూర్జువా సివిల్ చట్టాలకు సంబంధించిన న్యాయ సిద్ధాంతాన్ని సహితం తృణీకరించి అందులో ఉన్న నియమాల పరిధిలో కూడ ఆమోదనీయం కాని ఆర్డర్లు మన హైకోర్టు జడ్జీలు జారీ చేసిన సందర్భాలున్నాయని గుర్తించినప్పుడు ఇక్కడున్నది కేవలం న్యాయ సిద్ధాంత సంబంధమైన సంప్రదాయకత కాదనీ, అంతకంటే గర్హనీయమైన తక్షణ కారణాలు ఉన్నాయనీ అర్థమవుతుంది.

కోర్టులిచ్చే 'స్టే' ఆర్డర్ల గురించి అందరికీ అంతో యింతో తెలుసును. కేసులో తుది నిర్ణయం ఇచ్చే లోపల తక్షణ నష్టం జరగకుండా ఉండేందుకు కోర్టులు 'స్టే' ఆర్డర్లు ఇస్తుంటాయి. 'ఇప్పటి దాకా ఉన్న పరిస్థితిని మార్చవద్దు' అనేది స్టే ఆర్డర్లలో ఎక్కువ భాగం దర్శనమిచ్చే తాఖీదు. ఒక్కొక్కసారి కొద్దికాలం క్రితం అమలులోకి వచ్చిన మార్పును పక్కకు తొలగించి దానికి ముందు ఉన్న పరిస్థితిని 'స్టే' ద్వారా పునరుద్ధరించడం జరుగుతుంది. కానీ చాలా కాలంగా ఉనికిలో ఉన్న విషయాలను 'స్టే' ద్వారా పక్కన

పెట్టకూడదనేది సంప్రదాయక సిద్ధాంతంలోని నియమాలలో ఒకటి. తుది నిర్ణయం చేసేటప్పుడు ఎంత పాత వాడుకయినా, ఆచారమయినా చెల్లదని తేలితే దానిని కొట్టేయవచ్చు. కానీ మధ్యంతర ఆర్డర్లలో అప్పటికి స్థిరపడి ఉన్న విషయాలను 'స్టే' చేయకూడదని సంప్రదాయక న్యాయ సిద్ధాంతం చెప్తుంది.

అయితే మన హైకోర్టు ఏం చేసిందో చూడండి. ఏజెన్సీ రూపురేఖల నిర్ణయం బ్రిటిష్ హయాంలోనే ఏనాడో జరిగింది. ఏజెన్సీ గ్రామాల జాబితా ఆనాడే నిర్ణయం అయింది. 1950లో స్వతంత్ర భారత రాజ్యాంగం ఉనికిలోకి వచ్చిన తరువాత దాదాపు అదే జాబితాను రాష్ట్రపతి ఏజెన్సీ గ్రామాల జాబితాగా జారీ చేశారు. ఆ గ్రామాలలో ఏజెన్సీ చట్టాలు ఆనాటి నుండి అమలవుతూనే ఉన్నాయి.

అటువంటిది, 1980ల చివరి సంవత్సరాలలో పశ్చిమ గోదావరి జిల్లాలోని కొన్ని ఏజెన్సీ గ్రామాల రైతులు 'మా గ్రామాన్ని ఏజెన్సీలో చేర్చడమే తప్పు' అంటూ హైకోర్టులో రిట్ పిటిషన్లు వేయగా హైకోర్టు వాటిని అడ్మిట్ చేసుకోవడమే కాక దశాబ్దాలుగా అన్ని ఏజెన్సీ చట్టాలు అమలయిన ఆ గ్రామాలకు ఎల్‌టిఆర్ చట్టం నుండి 'విముక్తి' కలిగించే స్టే ఇచ్చింది. జీలుగుమిల్లి ఏజెన్సీలో గిరిజన – గిరిజనేతర ఘర్షణలు మొదలయిన తరువాత ఈ ఘర్షణకు మూలమేమిటని వెతికితే హైకోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్లని తేలింది. అయితే అక్రమమైన 'స్టే' ఆర్డర్లను ఎట్లా ఇచ్చామన్న ప్రశ్న వేసుకున్న పాపానికి హైకోర్టు పోలేదు కాని, అప్పటికి ఆ స్టే ఆర్డర్లను తొలగించింది.

దానితో ఆ గ్రామాలలో ఎల్‌టిఆర్ చట్టాన్ని అమలు చేసి ఆదివాసులకు భూమి ఇప్పించే అవకాశం ప్రభుత్వానికి కలిగింది. అయితే ఎప్పటి లాగా ఈ పని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తన కార్యాలయంలో కూర్చొని 'ఎవరి కాయితాలు వాళ్లు తీసుకొచ్చి వాదించుకోండి' అనే పద్ధతిలో చేస్తే ఆదివాసులకు న్యాయం జరగదని ఆదివాసీ ఉద్యమ సంస్థలూ హక్కుల సంఘాలూ అభ్యంతరం తెలిపేసరికి ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ శాఖ ఎల్‌టిఆర్ చట్టం అమలు గురించి వివరమైన నియమావళి ఒకటి జారీ చేసింది. రెవెన్యూ అధికారులు గ్రామాలలోనే కూర్చొని భూమి సంబంధమైన రికార్డు ప్రజల సమక్షంలో బిగ్గరగా చదివి దానిని పరిశీలించే అవకాశం ఇరు పక్షాలకూ ఇవ్వాలని ఆ నియమావళి అంటుంది. ఒక కేసు విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నియమావళి జారీ చేసిన విషయం హైకోర్టు దృష్టికి తేగా, జస్టిస్ బి.ఎస్.ఎ.స్వామి

ఆ నియమావళి అమలును తన తీర్పులో భాగం చేశారు. బుట్టాయగూడెం మండలంలోని ఒకే ఒక్క గ్రామంలో అది ఒక మోస్తరుగా అమలయింది. అంతకుముందు గిరిజనేతరులు ఒప్పుకున్న దానికంటే కొన్ని వందల ఎకరాలు ఎక్కువ వారి అక్రమ ఆక్రమణలో ఉన్నట్టు తేలింది. అందువల్ల ఇంక ఏ గ్రామంలోను దానిని అమలు కానియ్యకూడదని గిరిజనేతరులు నిర్ణయించుకున్నారు. అధికార యంత్రాంగాన్ని అదిలించి బెదిరించి కోటగిరి విద్యాధరరావు వంటి నాయకులను వాడుకొని దానిని అమలు కాకుండా చూశారు.

అప్పటికే ఆ నియమావళి జస్టిస్ స్వామి జారీ చేసిన ఒక తీర్పులో భాగమయింది కాబట్టి, దానిని అమలు చేయకపోవడం కోర్టు ధిక్కారం అవుతుంది అని 'శక్తి' అనే సంస్థ మళ్లీ కోర్టుకెక్కింది. ఈసారి జస్టిస్ స్వామి తన తీర్పును పునరుద్ఘాటించడమే కాక, ప్రభుత్వం జారీ చేసిన నియమావళి అమలును పర్యవేక్షించడానికి ఒక రిటైర్డు జిల్లా జడ్జిని నియమించారు.

ఈ నియమాకాన్ని ప్రశ్నిస్తూ గిరిజనేతరులు అప్పటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి బెంచి ముందు రిట్ అప్పీల్ వేసి దానిని 'స్టే' చేయించారు. కేవలం పర్యవేక్షక అధికారి నియామకాన్ని 'స్టే' చేసినప్పటికీ మొత్తంగా ప్రభుత్వం ప్రకటించిన నియమావళి అమలునే స్టే చేయడం జరిగిందని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరు, ఇతర అధికారులు అనసాగారు.

ఇది వాస్తవం కాదని ఆదివాసీ సంఘాలూ వారి శ్రేయోభిలాషులూ ఆందోళన చేయగా, రాష్ట్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి బిస్వాల్‌గారు విషయాన్ని పరిశీలించి ఇది సత్యమేనని గ్రహించి, ఎల్‌టిఆర్ చట్టం అమలుకోసం ప్రభుత్వం గతంలో ప్రకటించిన నియమావళి అమలుకు హైకోర్టు ఇచ్చిన స్టే ఆటంకం కాదనీ ఆ నియమావళి అమలు కొనసాగవచ్చునీ సర్క్యులర్ జారీ చేశారు.

బిస్వాల్ గారికి హైకోర్టు చేతనే మొట్టికాయ వేయించాలని గిరిజనేతరులు నిర్ణయించుకున్నారు. జస్టిస్ సుభాషణ్ రెడ్డి, భిక్షపతి గార్ల బెంచి ముందు విచారణ జరుగుతున్న ఒక కేసులో బిస్వాల్ గారికి కోర్టుకు రమ్మన్న తాఖీదు వచ్చింది. హైకోర్టు ఇచ్చిన 'స్టే' మొత్తం నియమావళికీ వర్తిస్తుందని, కేవలం జస్టిస్ స్వామి దాని అమలు పర్యవేక్షణ కోసం నియమించిన రిటైర్డ్ జడ్జి నియామకానికి కాదని జస్టిస్ సుభాషణ్ రెడ్డి ప్రకటించి, 'ఈ సాయంత్రంలోగా సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి జారీ చేసిన

సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోకపోతే అతను కోర్టు ధిక్కారానికి పాల్పడినట్టు భావిస్తాం' అన్నారు. ముఖంలో నెత్తురు చుక్క లేకుండా కోర్టు నుండి బయటికి పోయిన బిస్వాల్ గారు ఆ సాయంత్రం 4 గంటల లోపల తన సర్క్యులర్‌ను వెనక్కి తీసుకుంటూ ఇంకొక సర్క్యులర్ జారీ చేశారు. ఎల్‌టిఆర్ చట్టం అమలు తిరిగి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల కార్యాలయాలలోకి వెళ్లిపోయింది.

జస్టిస్ సుభాషణ్ రెడ్డి కోర్టు నుండి బయటకు పోతున్న బిస్వాల్ గారి ముఖం చూసిన వారందరికీ ఇవి ఆదివాసులకే కాదు, హైకోర్టుకు కూడ మంచి రోజులు కావనిపించింది. ఈ విషయం హైకోర్టు గుర్తించే లోపల ఇంకెంత మంది ఆదివాసులు పోలీసు లాఠీ దెబ్బలూ గిరిజనేతర గుండా గుంపుల దాడులూ రుచి చూడవలసి వస్తుందో!

*మొదటి ముద్రణ : ప్రజాతంత్ర వారపత్రిక, 31 మార్చి 2001*
*రెండవ ముద్రణ : 'ఆదివాసులు : చట్టాలు–అభివృద్ధి', 2016*
*(పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ)*

# ఎన్నికలలో పోటీ చేయడానికి నేరస్తులందరూ అనర్హులేనా?

సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఆదేశాలను వమ్ము చేయడానికి సకల రాజకీయ పార్టీలూ ఒకటై శరవేగంగా ఒక చట్టం రూపొందించడం వెక్కిరింతకూ అపహాస్యానికీ గురి కావడం సహజం.

సుప్రీంకోర్టు గొప్ప బుద్ధితో సంస్కరణలు ప్రవేశపెట్టాలని ప్రయత్నించగా, క్షుద్రమైన రాజకీయ శక్తులు దానిని వమ్ము చేస్తున్నాయని అభిశంసించడం జరుగుతున్నది. కానీ ఒక విషయంలో మాత్రమే ఇది సత్యం. ఎన్నికలలో నిలబడేవారు ముందుగానే తమ ఆస్తిపాస్తుల లెక్కలు ప్రమాణపత్రం మీద రాసి ఎన్నికల కమిషన్‌కు ఇవ్వాలన్న ఆదేశాన్ని రాజకీయ పార్టీలు తిరస్కరించడం వారి ప్రయోజనాలకు అవసరమే కావచ్చును గానీ ప్రజలకూ ప్రజాస్వామ్యానికీ కాదు. రాసి ఇచ్చినంత మాత్రాన వాళ్లకొచ్చే నష్టమేమీ లేనప్పుడు ఇంత గట్టిగా ఎందుకు వ్యతిరేకిస్తున్నారా అని మనం ఆశ్చర్యపోవచ్చు. కానీ అఫిడవిట్ మీద రాసి ఇవ్వాలన్న నియమాన్ని ఆమోదిస్తే 'ఎటుపోయి ఎటు వస్తుందో'నని ఆందోళన చెందడం ముందుచూపు గల వారికి సహజమే కాబట్టి ఆశ్చర్యపోయేవాళ్లే అమాయకులు.

అయినప్పటికీ వామపక్ష పార్టీలు సహితం ఇతర పార్టీలతో ఈ విషయంలో గొంతు కలపడం విచిత్రమే. వామపక్ష పార్టీలు తాము చెప్పుకునేంత పరిశుద్ధంగా లేవని అందరికీ తెలుసును గానీ

అభ్యర్థులు తమ ఆస్తిపాస్తుల వివరాలు ముందుగా ప్రకటించాలన్న నియమానికి భయపడే స్థితిలో ఉన్నాయనుకోలేదు. లేక ఈ అభ్యంతరానికి ఏదో నిగూఢమైన గతితార్కిక కారణం ఉందా?

అయితే అభ్యర్థులు తమ విద్యార్హతలను కూడ ఎన్నికకు ముందు ప్రమాణ పత్రంలో ప్రకటించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాన్ని రాజకీయ పార్టీలు తిరస్కరించడం సబబే. అది సబబేనని చాలామందే గుర్తించారు కానీ, ఆస్తులకు సంబంధించిన ఆదేశాన్ని తిరస్కరించినందుకు రాజకీయ పార్టీలను విమర్శించినంత ఘాటుగా కాదు సరికదా, అందులో నూరవ వంతు తీవ్రత కూడ సుప్రీంకోర్టు చేసిన ఈ ప్రతిపాదన పైన వచ్చిన విమర్శలో ధ్వనించడం లేదు. కానీ నిజానికి ఈ ప్రతిపాదన కేవలం తప్పు కాదు. అవమానకరమైనది. తక్కువ చదువుకున్న వారి కంటే ఎక్కువ చదువుకున్న వారు మెరుగైన ప్రజా ప్రతినిధులవుతారని ఎవరైనా అనగలరా? చదువుకునే అవకాశాలు కుదించివేస్తూ, నువ్వెంత చదువుకున్నావో చెప్పు అని అడగడం పేదలను అవమానపర్చడం కాదా? సుప్రీంకోర్టు ఈ రకమైన అభిప్రాయం వ్యక్తం చేయడం యాదృచ్ఛికం కాదు. ఈ మధ్య కాలంలో దేశంలోని శిష్టవర్గాలు 'ఎన్నికల సంస్కరణల' గురించి ఎప్పుడు మాట్లాడినా ప్రజల నుండి రాజకీయ వ్యవస్థను ఎట్లా కాపాడాలన్నది వారి ప్రధాన లక్ష్యంగా ఉంటున్నది. జాతీయ లా కమిషన్ జస్టిస్ జీవన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో రూపొందించిన ఎన్నికల సంస్కరణల రిపోర్టు స్వభావం కూడ అదే. ప్రభుత్వాలు స్థిరంగా ఉండాలి, 'ప్రజాకర్షక' పథకాలు అమలు చేయాలన్న ఒత్తిడికి ప్రభుత్వాలు లొంగకూడదు, సంక్షేమం స్థానంలో 'అభివృద్ధి'కి పెద్దపీట వేసే రాజకీయార్థిక 'సంస్కరణల'లో చట్టసభలు భాగం కావాలి – ఇత్యాది ఆలోచనల ప్రేరణ ఇక్కడ ప్రధానంగా పనిచేస్తున్నది. సుప్రీంకోర్టు చేసిన ఈ సూచన ఈ కోవకు చెందినదే.

చదువుకున్న వాళ్ళకు మాత్రమే ఓటు హక్కు ఉండాలనీ లేదా పోటీ చేసే అర్హత వారికే పరిమితం కావాలనీ గతంలోనూ కొందరు వాదించారు. రాజ్యాంగకర్తలు దానిని నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. సమర్థమైన ప్రాతినిధ్యానికి అది తప్పనిసరి కాదని గుర్తించి తిరస్కరించారు. ఇప్పుడు ప్రజలలో చదువులు పెరిగాయే తప్ప తగ్గలేదు. అయినప్పటికీ పాత వాదన ముందుకు తీసుకురావడం ఇప్పుడు వీస్తున్న ప్రజావ్యతిరేకమైన కొత్తగాలుల వల్లనే తప్ప వేరే ఏమీ కాదు. ఇక నేరాలు, నేర

చరిత్రలు గురించి ఇద్దరి ప్రతిపాదనలూ అసంతృప్తికరమైనవే. అభ్యర్థులు తమ నేర చరిత్రను కూడ ఎన్నికలకు పూర్వమే ప్రమాణపత్రంలో ఎన్నికల కమిషన్‌కు తెలియజేయాలని సుప్రీంకోర్టు అనింది. రాజకీయ పార్టీలు దానికి అంగీకరించలేదు గానీ, రెండు కేసులలో కోర్టు ఒక అభ్యర్థిపైన అభియోగాలను ప్రకటించినట్టయితే, అవి 'తీవ్రమైన' నేర అభియోగాలైతే, ఆ అభ్యర్థిని అనర్హునిగా ప్రకటించాలని చట్టమే చేయబోతున్నారు.

'తీవ్ర అభియోగం' అంటే ఏమిటి? పత్రికలో వచ్చిన వార్తలను బట్టి, శిక్ష తీవ్రతను బట్టి నేరాన్ని తీవ్రమైనదిగా భావించాలని రాజకీయ పార్టీలు భావిస్తున్నట్టున్నాయి. ఇది చాలా అసంతృప్తికర అభిప్రాయం. సుప్రీంకోర్టు తీర్పును మొదట చర్చించినప్పుడు, 'రాజకీయ నేరాలను' మినహాయించాలని వామపక్ష పార్టీలు అన్నాయి. రాజకీయ నేరాలను నిర్వచించడంలో ఇబ్బందులున్నప్పటికీ, ఇది సరైన దిశలో సాగిన ఆలోచనే.

కాని నిజానికి వేటిని మినహాయించాలి అని చర్చించడం కంటే ఏ నేరాలకు ఎన్నికల చట్టంలోని నిషేధాన్ని పరిమితం చేయాలి అని చర్చించడం సబబుగాను ఫలప్రదంగాను ఉంటుంది. ఒక వ్యక్తి ప్రజా ప్రతినిధిగా ఉండడానికి తగడు అనే అభిప్రాయానికి రాగల నేరాలకు ఆ జాబితాను పరిమితం చేయాలి. రేప్ చేసిన వ్యక్తి, అంటరానితనం పాటించిన వ్యక్తి, వ్యాపార లావాదేవీలలో మోసం చేసి వేరొకరి ఆస్తిని కాజేసిన వ్యక్తి, ప్రజాధనాన్ని స్వంతం చేసుకున్న వ్యక్తి ఇత్యాది నేరాలకు పాల్పడిన వ్యక్తులు ప్రజాప్రతినిధులు కావడానికి అనర్హులంటే అర్థం ఉంది. ఇవన్నీ శిక్ష పరిమాణం రీత్యా 'తీవ్రమైన' నేరాలు కాకపోవచ్చు. కాని నైతికంగా తీవ్రమైన నేరాలు.

విచిత్రంగా అనిపించవచ్చును గానీ హత్యా నేరాన్ని మొత్తంగా ఈ కోవలో వేయలేము. కారణాన్ని బట్టి, ఉద్దేశ్యాన్ని బట్టి, పరిస్థితులను బట్టి ఒక హత్య ఈ కోవలోకి రావచ్చు, రాకపోవచ్చు. చట్టం తీవ్రమైనదిగా భావించే బందిపోటు చర్య అయినా అంతే. రాజద్రోహం, ప్రభుత్వంపైన యుద్ధం చేయడం మొదలైన నేరాలు కూడ అంతే. ఇవి శిక్షరీత్యా తీవ్రమైన నేరాలే. కానీ ఈ కోవకు చెందిన నేరాలు రెండింటిలో అభియోగ పత్రాన్ని కోర్టు స్వీకరించినట్టయితే ఇంక ఆ వ్యక్తి ఎన్నికలకు అర్హత కోల్పోవాలనడం ప్రజా ప్రాతినిధ్య ప్రమాణం దృష్ట్యా అవసరం కాదు. న్యాయమూ

కాదు. బందిపోటుగా ఉండిన పూలన్‌దేవి బలహీన వర్గాల ప్రతినిధిగా రాజకీయాలలోకి ప్రవేశించడం హర్షించదగ్గ పరిణామంగా చాలామంది భావించారు. ఈ కొత్త చట్టం అప్పుడు ఉన్నట్టయితే అది సాధ్యం అయ్యేదా?

కాశ్మీరులో మిలిటెంట్లందరినీ సాయుధ పోరాటం విడిచిపెట్టి ఎన్నికలలో పాల్గొనవలసిందిగా పెద్దలంతా ఆహ్వానిస్తున్నారు. అది కాశ్మీరీల ప్రయోజనాల రీత్యా సరైన నిర్ణయమవుతుందా కాదా అన్నది మన దృష్టిని బట్టి ఉంటుంది. అయితే రేపు పార్లమెంటులో ఈ ప్రతిపాదిత చట్టాన్ని చేసినట్టయితే కాశ్మీరీ మిలిటెంట్లెవ్వరూ ఎన్నికలలో పాల్గొన లేకపోవచ్చు. ఎందుకంటే వారెవ్వరిపైనా రెండు కంటే తక్కువ అభియోగ పత్రాలు ఉండవు. మరి అది ప్రజాస్వామ్యానికి మంచిదా?

*మొదటి ముద్రణ : ప్రజాతంత్ర వారపత్రిక, 21 జూలై 2002*

*రెండవ ముద్రణ : 'ఎన్నికలు – ప్రజాస్వామ్యం', 2017* **(***HRF ప్రచురణ)*

# న్యాయమూర్తుల అధిక ప్రసంగం ఉద్యోగ సంఘాల నిర్వ్యాపకత్వం

కార్మికులకూ ఉద్యోగులకూ సమ్మె చేసే హక్కు లేదని సుప్రీంకోర్టు తమిళనాడు ఉద్యోగుల సమ్మె కేసులో చెప్పిందని దేశంలో చాలా ఆందోళన చెలరేగుతున్నది. ఆ తీర్పులో సుప్రీంకోర్టు అనవసర ప్రసంగం చాలా చేసిందిగానీ కార్మికులకు సమ్మె హక్కు లేదనలేదు. ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే లేదనింది. అది కూడ సుప్రీంకోర్టు సొంతగా వెలిబుచ్చిన అభిప్రాయం కాదు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళులలోనే సమ్మెలో పాల్గొనడం శాఖాపరమయిన నేరం అని ఉంది. అలా ఉండడం రాజ్యాంగ విరుద్ధం కాదని – అంటే సమ్మెలో పాల్గొనే ప్రాథమిక హక్కేదీ ఉద్యోగులకు రాజ్యాంగం ఇవ్వలేదని – నలభై ఏళ్ల కిందనే సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం (కాన్‌స్టిట్యూషన్ బెంచి) ప్రకటించింది.

మరయితే తమిళనాడు ఉద్యోగుల కేసు విషయంలో దేశంలో జరుగుతున్న అలజడి అనవసరమయినదా? కాదు. ఒక్కొక్కసారి అపోహల వల్ల కూడ మేలు జరగగలదనడానికి ఈ అలజడి ఒక తార్కాణం. అయితే దాని పూర్వాపరాల గురించి సరయిన అవగాహన అవసరం.

సుప్రీంకోర్టు మొన్న ఇచ్చిన తీర్పులోని అభ్యంతరకర లక్షణాలలో ఒకటేమిటంటే, అసలు తమిళనాడు ఉద్యోగులు ఎందుకోసం సమ్మె చేశారని ఎక్కడా చర్చించకపోవడం. ఆ తీర్పులో సమ్మెకు గల కారణం గురించిన కనీస ప్రస్తావన సహితం లేదు.

తమిళనాడు ఉద్యోగులు ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని కొత్త కోరికలేవీ కోరలేదు. ఆర్థిక భారం వేసే డిమాండ్లేవీ పెట్టలేదు. (ఈ రెండు పనులూ చేయకూడదని కాదు – చేయలేదనేది వాస్తవం.) గతంలో చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయమన్నారు, రిటైరయిన ఉద్యోగుల తదనంతర హక్కులపైన పెట్టిన ఆంక్షలను తొలగించమన్నారు. ఈ కోరికలతో కూడ వాళ్లు వెంటనే సమ్మెకు దిగలేదు. చాలా దఫాలు చర్చలూ, సంప్రదింపులూ జరిపారు. ఆ ప్రయత్నం ఫలించకపోయేసరికి సమ్మె నోటీసు ఇచ్చి సమ్మెకు దిగారు.

తమిళనాడు ప్రభుత్వం ఈ సమ్మెను ఎదుర్కొనడానికి 'ఎస్మా' ప్రయోగించింది. అంతేకాదు, రాష్ట్ర ప్రభుత్వంలోని సకల శాఖలనూ 'అత్యవసర సర్వీసులు'గా ప్రకటించి సమ్మెను నిషేధించింది.

అయినప్పటికీ ఉద్యోగులు సమ్మెకు ఉపక్రమించారు. ఒకరూ ఇద్దరూ కాదు, లక్షల సంఖ్యలో సమ్మెకు దిగారు. అప్పుడు తమిళనాడు ప్రభుత్వం ఎస్మాకు ఆర్డినెన్స్ ద్వారా ఒక సవరణ తీసుకొచ్చింది. ఈ సవరణ సారాంశం ఏమిటంటే ఎస్మా కింద నిషేధించిన సమ్మెలో పాల్గొన్న వారిని విచారణ లేకుండా శిక్షించవచ్చునని. దాన్ని ఉపయోగించి జయలలిత ప్రభుత్వం వెంటనే లక్షల మంది ఉద్యోగులను బర్తరఫ్ చేసింది. ఈ చర్య చెల్లుతుందా అన్నదే తమిళనాడు ఉద్యోగులు కోర్టు ముందుకు తెచ్చిన సమస్య. ఏ నేరానికైనా తప్పిదానికైనా విచారణ లేకుండా ఎవ్వరినీ శిక్షించడానికి వీలులేదనేది ప్రాథమిక సహజ న్యాయసూత్రం. దీనికి ఎంతో అరుదుగా తప్ప కోర్టులు మినహాయింపులు ఇవ్వలేదు, ఇవ్వజాలవు. అటువంటప్పుడు నిషిద్ధ సమ్మెలో పాల్గొన్న పాపానికి నిర్విచారణగా లక్షలాది ఉద్యోగులను బర్తరఫ్ చేయొచ్చునని చెప్పే చట్టం చెల్లుతుందా?

ఉద్యోగులకు సమ్మె చేసే హక్కు లేదనే అనుకుందాం. ఎస్మా ప్రయోగించినప్పుడే కాదు, ప్రయోగించనప్పుడు కూడ లేదనుకుందాం. అయినప్పటికీ సమ్మె చేసినట్టయితే ఏ విచారణా జరపకుండా, ఎవరు బుద్ధెరిగి సమ్మెలో పాల్గొన్నారో, ఎవరు నలుగురిలో నారాయణా అంటూ పాల్గొన్నారో, ఎవరు సమ్మెకారులు కొడతారేమోనన్న భయంతో పాల్గొన్నారో, ఎవరు సమ్మె జరగకున్నా ఆ పూట వేరే కారణాల వల్ల డ్యూటీకి పోలేదో – ఇదేదీ విచారించకుండా అందరినీ టోకుగా శిక్షించడం న్యాయ సమ్మతమేనా? అట్లా శిక్షించే అధికారం ఇచ్చే చట్టం రాజ్యాంగ సమ్మతమేనా?

తమిళనాడు ఉద్యోగులు న్యాయస్థానాలను తేల్చమన్నది ఈ ప్రశ్నలను. కానీ న్యాయస్థానాలు చాలా విచిత్రంగా వ్యవహరించాయి. మొదట వారి కేసును విచారణకు తీసుకున్న మద్రాసు హైకోర్టు జడ్జి ఆ ఆర్డినెన్స్‌నూ, దానికింద జరిగిన బర్తరఫ్‌లనూ వెంటనే 'స్టే' చేశాడు. నాగరిక సమాజాలలో అమలులో ఉన్న న్యాయసూత్రాలతో ఏ కొంచెం పరిచయం ఉన్న జడ్జి అయినా చేయవలసిన పని అదే. అయితే ఆ మధ్యాహ్నమే ఆ 'స్టే' మీద తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ జస్టిస్ బెంచి ముందు అప్పీల్ వేసింది. పొద్దున జారీ చేసిన ఆర్డర్ మీద మధ్యాహ్నం అప్పీలు స్వీకరించడం సాధారణంగా జరిగే విషయం కాదు. కానీ, జయలలిత పాలన సాధారణమైనది కాదు కదా!

'ఉద్యోగుల సర్వీస్‌కు సంబంధించిన విషయాలను విచారించవలసింది అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునలే తప్ప హైకోర్టు కాదు' అంటూ చీఫ్ జస్టిస్ సుభాషణ్‌రెడ్డిగారు తమిళనాడు ప్రభుత్వం అప్పీల్‌ను అనుమతించారు. అసలు తమిళనాడు రాష్ట్ర అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో ఒకటి తప్ప అన్ని పోస్టులూ ఖాళీగా ఉన్నాయట. అక్కడ కేసులు విచారించడమూ, తీర్పులు ఇవ్వడమూ జరగడం లేదంట. ఒక వేళ ట్రిబ్యునల్ సక్రమంగా నడుస్తూ ఉండినా, ఉద్యోగుల సర్వీస్‌కు సంబంధించిన కేసులు వినే బాధ్యత దానిదే అయినప్పటికీ అత్యవసర పరిస్థితులలో 'స్టే' ఇచ్చే అధికారాన్ని హైకోర్టు చలాయించకపోలేదు. సుభాషణ్‌రెడ్డిగారు గతంలో మన రాష్ట్ర హైకోర్టు జడ్జిగా ఉన్నప్పుడూ అదే వైఖరి అవలంబించారు. వారికి ముందూ వారి తరువాతా మన హైకోర్టే కాక అన్ని హైకోర్టులూ అదే వైఖరి అవలంబించాయి, అవలంబిస్తున్నాయి. లక్షల మంది ఉద్యోగుల ఆకస్మిక బర్తరఫ్ ఒక అత్యవసర సందర్భం కాదని ఎవ్వరూ అనలేరు.

దీనిమీద తమిళనాడు ఉద్యోగులు సుప్రీంకోర్టుకు అప్పీల్ చేశారు. సుప్రీంకోర్టు వ్యవహరించిన తీరును విచిత్రం అని కాక వేరే ఏమీ అనలేము. ఉద్యోగుల బర్తరఫ్ విషయంలో సుప్రీంకోర్టు ప్రాథమికంగా సరయిన వైఖరే తీసుకుంది. చట్ట విరుద్ధమయిన సమ్మెలో పాల్గొన్న వారందరినీ ఒకే గాటన కట్టడానికి వీలులేదనీ, గుంపులో ఒకరిగా పాల్గొన్న వారిని బర్తరఫ్ చేయడానికి వీలులేదనీ (ఏదయినా చిన్న శిక్ష వేస్తే వేసుకోవచ్చుననీ), సమ్మె చట్టవిరుద్ధం అని తెలిసీ దానిని నిర్వహించిన వారిపై, సమ్మె చేయించడానికి బలప్రయోగం చేసిన వారిపైన మాత్రం కఠిన చర్యలు తీసుకోవచ్చుననీ, అయితే అది కూడ తొలగింపే కానక్కరలేదనీ, ఏ శిక్ష ఉచితం

అనేది పరిస్థితులను బట్టి ఉంటుందనీ కనీసం ఒక డజను కేసులలో సుప్రీంకోర్టు గతంలో ప్రకటించి ఉంది. ఆ అభిప్రాయాన్ని కాదనడం ప్రస్తుత జడ్జిలకు సాధ్యమూ కాదు, వారు ఆ సాహసమూ చేయలేదు. అందువల్ల సమ్మె సందర్భంగా హింసకు పాల్పడినట్టు ఎఫ్ఐఆర్‌లో నమోదయిన వారిని మినహాయించి మిగిలిన వారందరినీ తమిళనాడు ప్రభుత్వం తిరిగి పనిలోకి తీసుకోవాలని సూచించారు. ఎఫ్ఐఆర్ నమోదయిన వారికి ఏ శిక్ష వేయడం ఉచితంగా ఉంటుందో నిర్ణయించడానికి ముగ్గురు రిటైర్డు న్యాయమూర్తులతో ఒక కమిటీ వేసి, వారి నుంచి వివరణ స్వీకరించి నిర్ణయించాలన్నారు.

ఇప్పటివరకు దేశంలో అమలులో ఉన్న న్యాయ సిద్ధాంతానికి ఇది అనుగుణంగానే ఉంది. అయితే సుప్రీంకోర్టు దీనిని తన ఆదేశంగా జారీ చేయకుండా, తమిళనాడు ప్రభుత్వానికి సూచనగా అందజేసి వారి ఒప్పుకోలును నమోదు చేసింది. ఇదెక్కడి న్యాయనిర్ణయం? న్యాయబద్ధమైన తీర్పును ఆదేశంగా జారీ చేయకుండా దానిని దోషికి సూచించి వారి ఒప్పుకోలును ఆదరపూర్వకంగా నమోదు చేయడం ఏ రకమైన ధర్మం? గ్రామాలలో పెత్తందార్ల దురాగతాల మీద పంచాయితీలు చేసే పెద్దమనుషులు పెత్తందారు మనసు నొప్పించే పద్ధతిలో తీర్పు చెప్పకుండ, అనునయంగా నచ్చచెప్పి ఒప్పిస్తుంటారు. సుప్రీంకోర్టు అదే పని చేస్తే ఏమనాలి?

గ్రామాలలో జరిగే పంచాయితీలతో పోలిక అక్కడితో ఆగిపోలేదు. తిరిగి పనిలోకి చేరే సిబ్బంది తమిళనాడు ప్రభుత్వాన్ని క్షమాభిక్ష కోరుతూ ఇంకెప్పుడూ సమ్మెలో పాల్గొనమని చెప్తూ కాగితం మీద రాసిచ్చి పనిలోకి పోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇది చాలా అభ్యంతరకరమైన విషయం. బర్తరఫ్ చట్టబద్ధమయితే కోర్టు ఆ విషయాన్ని ప్రకటించి ఉద్యోగులను ఇంటికి పంపించవచ్చు. చట్ట విరుద్ధమైతే తిరిగి పనిలోకి తీసుకొమ్మని ఆదేశించవచ్చు. అంతే తప్ప 'కాల్మొక్కురా – దొర మంచోడు, నేన్ జెప్తే పనిలోకి దీస్కుంటడు' అనేది ఒక తీర్పా, ఒక న్యాయ నిర్ణయమా, ఒక న్యాయస్థానం అనుసరించదగ్గ వైఖరా?

రెండవది, కోర్టు తీర్పు రూపంలో ప్రకటించినా, రచ్చబండ పంచాయతీ రూపంలో చెప్పినా చట్టవిరుద్ధమైన సమ్మెలో పాల్గొన్న వారినందరినీ డిస్మిస్ చేయడం సరయినది కాదని సుప్రీంకోర్టు భావించిన తరువాత, ఇంక తమిళనాడు ప్రభుత్వ ఆర్డినెన్స్ చెల్లనట్టే కదా? ఆ విషయం ప్రకటించవలసి ఉండింది కదా? సుప్రీంకోర్టు

ఆ పని చేయలేదు. పంచాయతీ చేసి తమిళనాడు ప్రభుత్వాన్ని అనునయంగా ఒప్పించి 'ఆర్డినెన్స్ గురించి మేము ఏమీ చెప్పడం లేదని స్పష్టం చేస్తున్నాం. ఆ విషయం మద్రాసు హైకోర్టుకు వదిలేస్తున్నాం' అనింది. ఒకవేళ రేపు మద్రాసు హైకోర్టు ఆర్డినెన్స్ సక్రమమయినదే అనే నిర్ణయానికి వచ్చిందనుకోండి. అప్పుడు సుప్రీంకోర్టు చేసిన పంచాయతీ చట్ట విరుద్ధం కాదా? ఆ విషయం మద్రాసు హైకోర్టు అనగలదా?

ఇక్కడితో ఆగిపోయినా పోనీలే అనుకుందుమేమో. కానీ సుప్రీంకోర్టు ఇక్కడితో ఆగిపోలేదు. అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పకుండ, అడగని ప్రశ్న గురించి అధిక ప్రసంగం చేసింది. ఇదే ఎక్కువ మందికి కోపం తెప్పించింది. న్యాయస్థానాల తీర్పులు ఆయా కేసులలో లేవదీసిన ప్రశ్నలకు పరిమితం కావాలనేది న్యాయవ్యవస్థ క్రమశిక్షణకు సంబంధించిన ఒక ప్రాథమిక సూత్రం. ఒక మంచి కోసం దానిని కొంచెం అతిక్రమించమని మనమెప్పుడయినా కోరితే న్యాయమూర్తులు ససేమిరా అంటారు. కానీ ప్రజాస్వామ్యానికీ ప్రజాస్వామ్య హక్కులకూ నష్టం చేసేందుకు మాత్రం దానిని అతిక్రమించడానికి వారే ఈ మధ్య కాలంలో ఆరాటం ప్రదర్శిస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు సమ్మె చేసే హక్కు ఉందా లేదా అని కోర్టుకెక్కిన తమిళనాడు ఉద్యోగులు అడగలేదు. చట్టం నిషేధించిన సమ్మెలో పాల్గొన్న వారందరినీ నిర్విచారణగా బర్తరఫ్ చేసే అధికారం ఇచ్చే ఆర్డినెన్స్ చెల్లుతుందా లేదా చెప్పమని మాత్రమే అడిగారు. వాళ్లు అడిగిన ప్రశ్నను మద్రాసు హైకోర్టుకు వదిలేసి, అడగని ప్రశ్న గురించి సుప్రీంకోర్టు సుదీర్ఘంగా వ్యాఖ్యానించింది.

అందులో మొదటిది – సమ్మె హక్కు ఎప్పుడూ దుర్వినియోగం అవుతుందనింది. దీనికి ఆధారాలేమున్నాయి? ఈ దేశంలో గడచిన యాభై సంవత్సరాలలో జరిగిన సమ్మెలన్నింటినీ ఎవరయినా విశ్లేషించి అందులో ఎంత దుర్వినియోగం ఉందో వివరిస్తూ ఒక నివేదిక ఏదయినా సుప్రీంకోర్టుకు సమర్పించారా? అదేం లేదే! అది జడ్జిల అభిప్రాయమే తప్ప ఆధారాలతో వారి ముందు ఎవరూ వాదించిన విషయం కాదు. మనకందరికీ ఉన్నట్టు వారికి కూడ అభిప్రాయాలు ఉండే హక్కు ఉంది గానీ తమ అభిప్రాయాలను రుజువయిన సత్యాలుగా ప్రకటించే అధికారం లేదు. ఈ తీర్పు ఇచ్చిన జస్టిస్ ఎం.బి.షా గారికి బంద్‌లు, సమ్మెలు, ఊరేగింపులు మొదలయిన కార్యకలాపాలంటే ఇష్టం లేదని గ్రహించడానికి చాలా దాఖలాలున్నాయి. బంద్ పిలుపు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధం అంటూ కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును సి.పి.ఐ (ఎం)

సుప్రీంకోర్టులో సవాలుచేస్తూ, బంద్ నిర్వహణ కోసం బలప్రయోగం చేస్తేనూ, బెదరింపులకు పాల్పడితేనూ తప్పవుతుందిగానీ శాంతియుతంగా నిర్వహించే ఉద్దేశ్యంతో బంద్ పిలుపు ఇచ్చినా రాజ్యాంగ విరుద్ధం ఎట్లా అవుతుందని వాదించగా, 'అవును, అవుతుంది. అదంతే'నని కేరళ హైకోర్టు తీర్పును ఏ వివేచనా లేకుండా ముక్తసరిగా సమర్థిస్తూ సుప్రీంకోర్టు తరఫున తీర్పు జారీచేసిన పెద్దమనిషి ఎం.బి.షా గారు.

లాయర్లు సమ్మె చేయడానికి వీలులేదంటూ అయిదుగురు జడ్జిల సుప్రీంకోర్టు బెంచి ఇచ్చిన తీర్పులో కూడ ఎం.బి.షా గారి భాగస్వామ్యం ఉంది. ఎప్పుడయినా చాలా ప్రత్యేకమైన పరిస్థితులలో చేయవచ్చునన్న చిన్న మినహాయింపు తక్కిన నలుగురూ ఇచ్చారుగానీ, ఏ మినహాయింపూ లేదనీ, ఎట్టి పరిస్థితులలోనూ లాయర్లు సమ్మె చేయడానికి వీలులేదనీ ఎం.బి.షా గారు ఒక్కరే అన్నారు.

కాబట్టి జస్టిస్ ఎం.బి.షా గారికి సమ్మెలు బంద్‌లు ఊరేగింపులు మొదలయిన విషయాలంటే ఇష్టం లేదనేది స్పష్టమే. కానీ దాని నుంచి ఆయన 'సమ్మె హక్కు ఎప్పుడూ దుర్వినియోగం అవుతుంది' అన్న నిర్ధారణకు వస్తే అది మనందరికీ ఎందుకు శిరోధార్యం కావాలి?

తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం పెట్టే ఖర్చులో 90 శాతం ఉద్యోగుల జీతభత్యాలకే పోతున్నది కాబట్టి ఉద్యోగులకు సమ్మె చేసే నైతిక హక్కు లేదని కూడ సుప్రీంకోర్టు అనింది. ఈ మాట అనే ముందు ఆ ఉద్యోగులు దేనికోసం సమ్మె చేశారో ఒకసారి చూడవలసి ఉండింది. వాళ్లు గతకాలపు హక్కులను కాపాడుకోవడానికి తప్ప కొత్త హక్కుల కోసం సమ్మె చేయనప్పుడు ఈ ప్రస్తావన ఎందుకవసరమయింది?

సమస్యల పరిష్కారానికి అందుబాట్లో ఉన్న అన్ని మార్గాలనూ అన్వేషించకుండా సమ్మె చేయకూడదని కూడ సుప్రీంకోర్టు అనింది. సూత్రప్రాయంగా దీనికెవ్వరూ అభ్యంతరం చెప్పరుగానీ ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్ని ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాట్లో ఉన్నాయి? మినిస్టర్ల చుట్టూ తిరిగి న్యాయం చేయమని అడుక్కోవడాన్నీ పైరవీ చేసుకోవడాన్నీ పరిష్కార మార్గాలుగా గుర్తించదలచుకుంటే చెప్పలేము గానీ అవి కాక వేరే ఏ పరిష్కారమార్గాలూ లేవు. ఇక్కడ కూడ సుప్రీంకోర్టు తమిళనాడు ఉద్యోగులు సమ్మెకు దిగక ముందు ఎంతకాలం ఎన్ని రూపాలలో ప్రయత్నం చేశారో తెలుసుకునే ప్రయత్నమేదీ చేయలేదు. ఆ ప్రస్తావన తీర్పులో ఎక్కడా లేదు. అయినప్పటికీ ప్రత్యామ్నాయ ప్రయత్నాలు చేయకుండ నేరుగా సమ్మెకు దిగుతున్నారు

అనే నింద మొత్తంగానే ఉద్యోగ వర్గాల మీద వేసి అసలు సమ్మె హక్కు మీకు లేదు పొమ్మనింది.

హక్కుల గురించీ అధికారాల గురించీ సుప్రీంకోర్టు చేసే వ్యాఖ్యానం చట్టంతో సమానమని రాజ్యాంగం అంటుంది. ఎటొచ్చీ ఆ వ్యాఖ్యానం అప్పుడున్న చట్టాలకూ, రాజ్యాంగానికీ లోబడి ఉండాలి. 1980 తరువాత కొంతకాలం పాటు సుప్రీంకోర్టు ఈ అధికారాన్ని మంచి కోసం – అంటే ప్రజల హక్కులను పెంపొందించడం కోసం – వాడుకునింది. ఈ మధ్య కాలంలో దానికి వ్యతిరేక దిశగా వాడుకోవడం మొదలయింది. సమ్మెల గురించి, బంద్‌ల గురించి ఎం.బి.షా గారు ఇచ్చిన తీర్పులు దీనికొక తార్కాణం.

ఇక సుప్రీంకోర్టు సంగతి కొంచెం సేపు పక్కనపెట్టి ఉద్యోగ సంఘాల గురించి కొంచెం సేపు ముచ్చటించుకుందాం. మొదట్లోనే చెప్పినట్టు ఉద్యోగులకు సమ్మె హక్కు లేదనేది సుప్రీంకోర్టు కొత్తగా చెప్పిన విషయం కాదు. అది ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళిలోనే ఉంది. ఆ ప్రవర్తనా నియమావళులలో సమ్మె హక్కు మీదనే కాదు, భావ ప్రకటనా స్వేచ్ఛ మీద కూడ తీవ్రమయిన ఆంక్షలున్నాయి. అవి– కళ, సాహిత్యం, సంస్కృతుల గురించి తప్ప ఇతర విషయాల గురించి ప్రభుత్వ ఉద్యోగులు తమ పైవారి అనుమతి లేకుండా రాయకూడదు, మాట్లాడకూడదు, ఏ విధమైన బహిరంగ వ్యక్తీకరణకూ పాల్పడకూడదు వగైరా.

ఈ ప్రవర్తనా నియమావళులు (బహువచనం ఎందుకు వాడుతున్నామంటే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకొకటి, ఒక్కొక్క రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి – అయితే హక్కుల లేమి అన్నిటా సామాన్యమే) రాజ్యాంగం రాసుకున్న తరువాత పుట్టినవి కావు. అప్పుడప్పుడు కొన్ని సవరణలు చేస్తున్నా ఇవి మౌలికంగా వలస పాలన కాలానివి.

రాజ్యాంగ ప్రాథమిక హక్కులకు విరుద్ధమైన చట్టాలు, నియమాలు, నిబంధనలు చెల్లవని రాజ్యాంగం అంటుంది కాబట్టి ఉద్యోగుల ప్రవర్తనా నియమావళులలోని ఈ నిషేధాలు, నిర్బంధాలు చెల్లవంటూ రాజ్యాంగం అమలులోకి వచ్చిన మొదటి పది సంవత్సరాలలోనే ప్రభుత్వ ఉద్యోగులు కోర్టుకెక్కారు. ఆ సవాలు చివరికి సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం వద్దకు పోయింది. సుప్రీంకోర్టు ఉద్యోగుల వాదనలో సగభాగాన్ని ఆమోదించి సగభాగాన్ని తిరస్కరించింది. భావప్రకటనా స్వేచ్ఛ రాజ్యాంగ ప్రాథమిక

హక్కులలో భాగం కాబట్టి దానిని అహేతుకంగా నిర్బంధించే నియమాలు చెల్లవనీ, దానిపైన హేతుబద్ధమైన పరిమితులు మాత్రమే పెట్టవచ్చుననీ అనింది. అయితే సమ్మె చేసే హక్కు రాజ్యాంగ ప్రాథమిక హక్కు కాదు కాబట్టి దానిని పూర్తిగా నిషేధించే నిబంధనలో తప్పేమీ లేదనింది. ఈ తీర్పు 1962లో అయిదుగురు జడ్జిలు ఇచ్చారు. ఆ కేసు పేరు కామేశ్వర్ ప్రసాద్ వర్సస్ స్టేట్ ఆఫ్ బీహార్.

అందువల్లనే, మొన్నటి తీర్పులో సుప్రీంకోర్టు కొత్తగా అన్నదేమీ లేదన్నాము (అధిక ప్రసంగాన్ని పక్కనపెడితే). అయినప్పటికీ రెండు విషయాలు చెప్పుకోవాలి. 40 ఏళ్ల కింద ఇదే అభిప్రాయం ప్రకటించినప్పుడు కోర్టు సమ్మె హక్కును తేలికగా తీసిపారేయలేదు. దానినొక అర్థవంతమైన హక్కుగా గుర్తిస్తూ, ఉద్యోగుల వాదనలను సవివరంగా ఉటంకిస్తూ, ఏది ఏమయినా రాజ్యాంగంలో ఆ హక్కు ఇవ్వనప్పుడు దానిని పూర్తిగా నిషేధించే చట్టాలు చేసినా, నియమ నిబంధనలు ప్రకటించినా మేమేం చేయలేం అని తమ అవగాహన మేరకు అన్నారు. ఇప్పటి తీర్పు ధ్వనే వేరు.

రెండవది, 40 ఏళ్ల నాటికీ నేటికీ సుప్రీంకోర్టు తన పర్యవేక్షణాధికారాన్ని అర్థం చేసుకున్న తీరులో మార్పు వచ్చింది. రాజ్యాంగం ఇచ్చిన అధికారంతో చట్ట సభలు, ప్రభుత్వము ఏ చట్టాన్నయినా ఏ నియమాన్నైనా రూపొందించవచ్చుననీ, అది రాజ్యాంగంలోని ఏదయినా నిర్దిష్టమైన అంశానికి వ్యతిరేకమయితే తప్ప కోర్టులు జోక్యం చేసుకోజాలవనీ అప్పట్లో సుప్రీంకోర్టు భావించేది. 1970ల తరువాత ఈ అవగాహనలో మార్పు వచ్చింది. రాజ్యాంగంలోని నిర్దిష్టమైన అంశాలే కాక మరికొన్ని ప్రమాణాల ఆధారంగా కూడ చట్టాలనూ చట్ట సంబంధమైన నియమాలనూ న్యాయస్థానాలు చెల్లవని ప్రకటించవచ్చునని ఇప్పుడు కోర్టులు భావిస్తున్నాయి. సహజ న్యాయసూత్రాల వంటి మౌలిక విలువలకు వ్యతిరేకమైనా, చెప్పుకున్న లక్ష్యానికీ చేసిన చట్టానికీ (లేక నియమానికీ) అసలే పొంతన లేకున్నా, ప్రాథమిక సహేతుకత లోపించినా ఆ చట్టాన్నీ లేక చట్ట సంబంధమైన నియమాన్నీ కొట్టేయవచ్చునని ఇప్పుడు కోర్టులు భావిస్తున్నాయి. అందువల్ల ప్రభుత్వ ఉద్యోగులెవ్వరూ ఏ పరిస్థితులలోనూ సమ్మె చేయడానికి వీలులేదని చెప్పే నియమం క్రమశిక్షణ అనే లక్ష్యంతో రూపొందిన పొంతన లేని శాసనం అనీ, ప్రాథమిక సహేతుకత లోపించిన నిబంధన అనీ వాదించే అవకాశం ఇప్పుడు ఉంది. అంతేకాక భారత ప్రభుత్వం సంతకం చేసిన అంతర్జాతీయ ఒడంబడికలనూ, ప్రకటనలనూ కూడ కోర్టులు ఒక మేరకు లెక్కలోకి తీసుకోవచ్చునని

1990 తరువాత కోర్టులు భావిస్తున్నాయి. (అంతకు ముందు పార్లమెంటు వాటికి శాసన రూపం ఇస్తే తప్ప అవి కోర్టుల పరిగణనలోకి రావని భావించేవారు.) భారత దేశానికి కూడ సభ్యత్వం ఉన్న అంతర్జాతీయ కార్మిక సంస్థ తీర్మానాలలో కార్మికులకు, ఉద్యోగులకు హేతుబద్ధమైన పరిమితులకు లోబడి సమ్మె హక్కు ఉండాలన్నది కూడ ఒకటి. ఈ మార్పులను సుప్రీంకోర్టు లెక్కలోకి తీసుకుని ఉంటే నలభై ఏళ్లనాటి తీర్పును సమీక్షించే ప్రక్రియ మొదలయి ఉండవచ్చు. అయితే ఆ పని చేయలేదు సరికదా, నలభై ఏళ్లనాడు సమ్మె అనే హక్కుకు ఇచ్చిన గౌరవం సహితం వీళ్లు ఇవ్వలేదు.

అదట్లాగుంచి, ఈ నలభై ఏళ్లలో ఆనాటి తీర్పును మార్చుకునేందుకు ఉద్యోగ నియమాలను సవరించాలన్న డిమాండుతో ఉద్యోగ సంఘాలు ఏనాడూ ఉద్యమించక పోవడం విశేషం. ఒక చట్టం, లేక రూలు రాజ్యాంగ విరుద్ధం కాదనీ, సక్రమమైనదేననీ సుప్రీంకోర్టు ప్రకటించిన తరువాత, దానిని తొలగించుకోవాలంటే మళ్లీ శాసనాధికారాన్ని ఆశ్రయించవలసిందే. ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళిని సవరించి, ఉద్యోగులకు సమ్మె హక్కు ఇమ్మన్న డిమాండుతో (సహేతుకమైన పరిమితులు పెట్టుకుంటే పెట్టుకోవచ్చు) ఒక్క ఆందోళన కూడ ఇన్నేళ్లుగా ఉద్యోగ సంఘాలు చేపట్టలేదు. సుప్రీంకోర్టు మొన్న చేసిన అధిక ప్రసంగం ఆ విషయాన్ని గుర్తుచేసినందుకా వాళ్లు ఇప్పుడింతగా గగ్గోలు పెడుతున్నారు?

సుప్రీంకోర్టు నిరాకరించిన సమ్మె హక్కు విషయంలోనే కాదు, సుప్రీంకోర్టు ఆమోదించిన భావప్రకటనా స్వేచ్ఛ విషయంలోనూ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళు లను తదనుగుణంగా సవరింపజేసే ప్రయత్నమేదీ ఉద్యోగ సంఘాలు చేయలేదు. 1962లో సుప్రీంకోర్టు చెల్లవని ప్రకటించిన నిషేధాలన్నీ చెక్కుచెదరకుండా ఉద్యోగుల ప్రవర్తనా నియమావళులలో అట్లాగే కొనసాగుతున్నాయి. వాటిని సవరించే ప్రయత్నం ప్రభుత్వాలూ చేయలేదు, సవరించాలన్న ఒత్తిడి ఉద్యోగ సంఘాలూ పెట్టలేదు. అవి చెల్లవని సుప్రీంకోర్టు చెప్పింది కదా, అవి కాయితాల మీద కొనసాగడం వల్ల వచ్చిన నష్టమేమిటని అడుగుతారేమో! నష్టమేమిటంటే అవి కాయితాలు మీద ఉన్నంత కాలం వాటిని వాడుకొని ఉద్యోగులను అధికారులు సతాయించే అవకాశం ఉంటుంది. సతాయింపుకు గురయిన ఒక్కొక్క ఉద్యోగి కోర్టుకు పోయి సుప్రీంకోర్టు తీర్పును ఉటంకించి న్యాయం పొందవచ్చునుగానీ ఈ లోపల ఏ మూడేళ్లో నాలుగేళ్లో సస్పెన్షన్‌లోనో, పూర్తి నిరుద్యోగంలోనో గడపవలసి ఉంటుంది. సుప్రీంకోర్టు

తీర్పుననుసరించి కనీసం భావప్రకటనా స్వేచ్ఛ మేరకయినా ఉద్యోగుల ప్రవర్తనా నియమావళిని తిరగరాయించుకొని ఉంటే ఈ అవస్థ ఉండదు కదా! ఉద్యోగ సంఘాలు ఈ ప్రయత్నం సహితం ఎందుకు చేయలేదు?

ఆసక్తి లేదు కనుక.

సమ్మె హక్కు, భావప్రకటనా స్వేచ్ఛలు ఉద్యమాలు చేయదలచుకున్న వారికి కావాలి. ఎం.ఎల్.ఏతో చెప్పించి, మంత్రితో ఫోన్ చేయించి, ముఖ్యమంత్రికి నచ్చిన మనిషిని సంఘం అధ్యక్షునిగా పెట్టుకొని – ఏదీ నడవకపోతే పైసలిచ్చి – పనులు చేయించుకునే సంస్కృతికి అలవాటు పడ్డ వారికి భావప్రకటనా స్వేచ్ఛ ఎందుకు, సమ్మె హక్కు ఎందుకు?

ఇప్పుడేమయిందంటే ఈ పైరవీలు కూడ హక్కులను కాపాడలేకపోతున్నాయి. ప్రభుత్వమే అక్కరలేదని ప్రపంచ బ్యాంకు అంటుంటే ఇంక ప్రభుత్వ ఉద్యోగుల గోడు, వారి హక్కుల గోడు వినేవారెవరు? పైరవీ సాగకపోతే ఉద్యమాలు అవసరం కాబట్టి ఉద్యోగ సంఘాలిప్పుడు సమ్మె హక్కో అంటూ గగ్గోలు పెడుతున్నాయి. అయితే ఇప్పుడు కూడ ఉద్యమించి ప్రవర్తనా నియమావళులను సవరించుకుంటామనడం లేదు. ముగ్గురు జడ్జిలో అయిదుగురు జడ్జిలో ఏడుగురు జడ్జిలో కూర్చొని ఉద్యోగులకు సమ్మె హక్కు లేదన్న ఇద్దరు జడ్జిల తీర్పు తప్పని ప్రకటించాలని మాత్రమే కోరుకుంటున్నారు. మళ్లీ ఉద్యోగ సంఘాలన్నీ వామపక్ష దృక్పథమున్న సంఘాలే – మార్క్సిస్టు వామపక్షం, కాకపోతే నెహ్రూవాద వామపక్షం.

నిజానికి సమ్మె హక్కు గురించి మొన్నటి తీర్పులో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తాయని అందరికీ అర్థం అయివుంటే ఇంత అలజడి, ఆందోళన జరిగి ఉండేవి కావు. అవి ప్రభుత్వ ఉద్యోగులకే కాక పారిశ్రామిక కార్మికులకు కూడ వర్తిస్తాయనుకోవడం వల్ల ఇంత స్పందన వచ్చింది. కార్మిక సంఘాలకు సహితం ఈ విషయంలో స్పష్టత లేదు కాబట్టి ఆ తీర్పు పారిశ్రామిక కార్మికులకు వర్తించదని చెప్పడం అవసరం. పారిశ్రామిక కార్మికులకు ఐ.డి చట్టం (పారిశ్రామిక వివాదాల చట్టం) ఒక పరిమితమైన సమ్మె హక్కు కల్పించింది. అది పరిమితమైన హక్కే అయినప్పటికీ అది చట్టం గుర్తించిన హక్కే. దానికి భిన్నంగా తీర్పు జారీచేసే అధికారం సుప్రీంకోర్టుకు లేదు, చేసినా అది చెల్లదు.

ప్రభుత్వ ఉద్యోగాలలోనూ కొందరు పారిశ్రామిక కార్మికుల నిర్వచనం కిందికి వస్తారు. వారి సమ్మె హక్కును కూడ ఈ తీర్పు తీసేయదు. పోస్టల్, టెలికాం, రైల్వే, పోర్టు, బ్యాంకుల సిబ్బందిలోని కార్మికులు ఈ కోవకు చెందుతారు. పారిశ్రామిక కార్మికులు కాని ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే ఈ తీర్పు వర్తిస్తుంది.

ఈ వర్గమంటే ప్రజలలో ఎవ్వరికీ పెద్దగా సానుభూతి లేదు. లేకపోవడానికి ప్రజల కారణాలు ప్రజలకున్నాయి. అయితే వారి పట్ల ప్రజలలో ఉన్న వ్యతిరేకత కారణంగా సమ్మె హక్కును మొత్తంగా తీసేసే నిబంధనలను, వాటిని ఆమోదించే కోర్టు తీర్పులను ఉపేక్షిస్తే చాలా నష్టం జరగగలదు. రేపు ఐ.డి చట్టం పారిశ్రామిక కార్మికులకిచ్చే పరిమితమైన సమ్మె హక్కును సహితం పార్లమెంటు తీసేస్తే దానిని కోర్టులో సవాలు చేయడానికి ఈ తీర్పులు అడ్డం రాగలవు. అంతేకాక, ప్రభుత్వ అధికారులలోనూ గుమాస్తాలలోనూ ఎన్ని లోపాలున్నా వారికి సమస్యలు లేవనలేము, ఆ సమస్యల పరిష్కారానికి సమ్మె చేసే పరిస్థితి రాదనలేము.

అపోహ వల్లనయితేనేం, ఎందువల్లనయితేనేం పారిశ్రామిక కార్మికులు, గని కార్మికులు, సాధారణ ప్రజలు అనేకమంది ఈ తీర్పుకు వ్యతిరేకంగా స్పందించడంలో ఉన్న ఔదార్యాన్ని ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించి తామూ ఇతరుల హక్కుల విషయంలో అంతే ఉదారంగా స్పందించడం ఇప్పుడయినా నేర్చుకుంటారా? ఉద్యమాలలోనే కాక నిత్య జీవితంలో ప్రజలతో వ్యవహరించేటప్పుడు కూడ ఈ వైఖరిని ప్రభుత్వ ఉద్యోగులు ప్రదర్శించడం దానంతటది అవసరమే కాక, ప్రపంచీకరణలో భాగంగా అందరి హక్కులు మీదా ఉమ్మడిగా జరుగుతున్న దాడిని ఎదుర్కొనడానికి కూడ ఇది చాలా ఉపయోగపడుతుంది. ఇంకా ఎక్కువమంది జడ్జిలతో కూడిన ధర్మాసనం కూర్చొని తమకు సమ్మె హక్కు ప్రసాదిస్తుందన్న ఆశకు ఇస్తున్న విలువ ఉద్యోగ సంఘాలు ఈ అవసరానికి ఇస్తే బాగుండేది.

*మొదటి ముద్రణ : మానవహక్కుల వేదిక బులెటిన్ 6, ఫిబ్రవరి 2004*
*రెండవ ముద్రణ : 'సరళీకరణ – విధ్వంసం', 2017 (HRF ప్రచురణ)*

# విజ్ఞత కోల్పోతున్న కోర్టులు

సమ్మెలలో కోర్టులు జోక్యం చేసుకోవడం తగునా అన్న చర్చ మన దేశంలో జోరుగా సాగుతున్నది. జూనియర్ డాక్టర్ల సమ్మె విషయంలోనూ ఆర్.టి.సి. సమ్మె విషయంలోనూ హైకోర్టు జోక్యం చేసుకున్న వైనం ఈ చర్చకు దారి తీసింది.

కోర్టులు జోక్యం చేసుకోవచ్చునా అనేది ప్రశ్న కాదు. ఏ దశలో చేసుకోవచ్చు, ఏ రూపంలో చేసుకోవచ్చు అనేది ప్రశ్న. ప్రజా జీవితం మీద తీవ్ర ప్రభావం వేయగల రంగంలో సమ్మె చాలా కాలం కొనసాగుతూ వుంటే ఇటు సమ్మెకారులుగానీ, అటు యాజమాన్యం లేక ప్రభుత్వం ఇద్దరూ పట్టు విడుపు లేకుండా నడుచుకుంటూ వుంటే, ఇద్దరినీ ఒక దగ్గరకు తేవడం కోసం, పరిష్కారం దిశగా వారిపైన ఒత్తిడి పెట్టడం కోసం కోర్టులు జోక్యం చేసుకోవచ్చు. అది పారిశ్రామిక రంగం అయితే చట్టమే వివాద పరిష్కార బాధ్యత కోర్టుపైన పెడుతుంది. ప్రభుత్వం ఆ బాధ్యతను కోర్టుకు అప్పగించి వివాదాన్ని కోర్టు పరిధిలోకి తేవచ్చు.

కానీ ఇప్పుడు జరుగుతున్నది అది కాదు. సమ్మె మొదలయిన వెంటనే హైకోర్టు రంగంలోకి దిగుతున్నది. సమస్య పరిష్కారం అయితే అవుతుంది, కాకపోతే పోతుంది – కానీ సమ్మె మాత్రం చేయడానికి వీల్లేదు అంటున్నది. ఇది సబబేనా అన్నది ఈ రోజు చర్చకొస్తున్న ప్రశ్న.

ఇది మన హైకోర్టులో మాత్రమే జరుగుతున్న ప్రహసనం కాదు. కలకత్తా హైకోర్టు జడ్జి ఒకాయన ఆ మధ్య కోర్టుకో, మరెక్కడికో

కారులో పోతూ ఊరేగింపులో చిక్కుకుని చికాకు పడి 'బెంచి' ఎక్కిన తదుపరి తానే కేసు కల్పించుకొని నగరంలో ఊరేగింపులను నిషేధించిన వైనం చూశాం. కేరళ హైకోర్టు ఒకసారి కాదు పలుమార్లు రాజకీయ పార్టీలు ఇచ్చే బంద్‌లు నిషిద్ధం అంటూ ఆర్డర్లు జారీ చేసిన వైనాన్నీ చూశాం.

ఈపాటి అసహనం చాలా మందిలో లేకపోలేదు గానీ దానికి తాఖీదుల రూపం ఇచ్చే అధికారం అందరికీ లేదు. తమకు వుంది కదా అని జడ్జీలు ఆర్డర్లు జారీ చేస్తున్నారు. వీటిలో కొన్ని అమలు కావు. కలకత్తాలో ఊరేగింపులు నిషేధించడం బ్రహ్మదేవుడి తరం కూడ కాదు. కోపం వస్తే పదిమందిని కూడగట్టి నినాదాలిచ్చుకుంటూ రోడ్డెక్కటం బెంగాలీల రాజకీయ నైజం. భారత్ లోని బెంగాలీలు నిరవధిక 'వామపక్ష' పాలనలో కొంచెం మెత్తబడ్డారు గానీ పొరుగున వున్న బంగ్లాదేశ్‌ను చూస్తే ఈ విషయం ఇంకా స్పష్టంగా అర్థం అవుతుంది.

ఇక బంద్‌ల మాటకొస్తే, బంద్ ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధమని కోర్టులు ప్రకటించడం మొదలుపెట్టి దశాబ్దం కావస్తున్నా బంద్‌లు జరుగుతూనే వున్నాయి. వేరే దేని గురించి కాకున్నా తమ పరువు గురించి కోర్టుకు ఖయాల్ వున్నా ఆచరణయోగ్యం కాని ఇటువంటి జోక్యానికి దూరం ఉందురు. సమ్మెల విషయంలో మన హైకోర్టు జోక్యం కథ కూడ ఇంతకంటే భిన్నంగా వుండబోదు. భద్రమైన ఉద్యోగాలు చేసి భద్రంగా బతకవలసిన డాక్టర్లు కొంచెం భయపడ్డారేమోగానీ, ఆర్.టి.సి. కార్మికుల విషయం అంత సులభంగా వుండబోదు. ఇక రేపు ఆటో రిక్షా డ్రైవర్లో, సింగరేణి కార్మికులో సమ్మె చేసినప్పుడు హైకోర్టు ఇదే రకంగా వ్యవహరించినట్టయితే 'ఏం చేసుకుంటావో చేసుకోపో' అనే అవకాశం ఉంది.

అయినప్పటికీ కోర్టు వైఖరిలోని విజ్ఞత గురించి మాట్లాడుకోవడం అవసరం. కోర్టు రాజ్యాంగానికి లోబడి నడుచుకోవాలి కాబట్టి రాజ్యాంగం పరిధిలోనే మాట్లాడుకుందాం. భారత రాజ్యాంగం పాశ్చాత్య నమూనా లిబరల్ డెమోక్రసీని దేశ రాజకీయ వ్యవస్థగా నిర్దేశించింది. ఈ వ్యవస్థలో ప్రజలు ఓట్లేసి మెజారిటీగా ఎన్నుకున్న పార్టీ రాజ్యాంగానికి లోబడి చట్టాల పరిధిలో పరిపాలిస్తుంది. ఆ పాలన చట్టాన్నీ, రాజ్యాంగాన్నీ అతిక్రమించినట్లయితే కోర్టులు నిలువరిస్తాయి. అయితే ఆ పరిధిలో ప్రభుత్వాలకు విధాన నిర్ణయంలో స్వేచ్ఛ వుంటుంది. అలాగే ఆ విధానాలను ప్రభావితం చేయడానికి విమర్శ పెట్టే స్వేచ్ఛ, ప్రత్యామ్నాయాలను ప్రచారంలో పెట్టే స్వేచ్ఛ ప్రజలు కూడ కలిగి వుంటారు.

వివిధ రూపాల ఆందోళనలు ఈ స్వేచ్ఛలో భాగమేనని లిబరల్ డెమోక్రసీ గుర్తించింది. ప్రజల జోక్యాన్ని ఓట్లకూ, కోర్టులో కేసులకూ, పత్రికలలో వ్యాసాలకూ, మీటింగులలో ఉపన్యాసాలకూ పరిమితం చేయజాలమనీ, ప్రభుత్వం పైన ఒత్తిడి పెట్టే ఆందోళనలు కూడ అందులో భాగమేననీ పాశ్చాత్య ప్రజాస్వామ్య భావన ఎన్నడో గుర్తించింది. సమ్మెలు, ఊరేగింపులు, బంద్‌లు, రాస్తారోకోలు, ధర్నాలు దీని వివిధ రూపాలు. రాజ్యాంగానికి లోబడి విషయ నిర్ణయం చేయవలసిన న్యాయస్థానాలు వీటిని నిషిద్ధమని భావించడానికి వీలు లేదు.

సామాజిక, రాజకీయ విషయాలలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోదలచుకున్నప్పుడు దానికి తగిన విషయ పరిజ్ఞానం పొందడం అవసరం. అది న్యాయమూర్తులకు వృత్తిరీత్యా వచ్చేది కాదు. ప్రయత్న పూర్వకంగా నేర్చుకోవాలి. ఆ ప్రయత్నం పెద్దగా చేయకుండా అనేక సామాజిక, రాజకీయ విషయాలలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడం జరుగుతున్నది. ఉదాహరణకు నర్మదా కేసు తీర్పులో భారీ ప్రాజెక్టుల మంచిచెడుల గురించి, నిర్వాసితుల స్థితిగతుల గురించి సుప్రీంకోర్టు చాలా నేలబారు వ్యాఖ్యలు చేసింది. ఆ విషయంలో జరిగిన పరిశోధన గురించి గానీ చర్చ గురించి గానీ ఏమీ తెలియకుండా అభిప్రాయాలు ప్రకటించేసింది.

అజ్ఞానానికి అసహనం కూడ తరచుగా తోడవుతున్నది. ముఖ్యంగా, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నామంటూనే ప్రజాస్వామ్యం పట్ల అసహనం ప్రదర్శించే వైఖరి బాగా ప్రబలింది. ఇది అంతటా వున్నదిగానీ న్యాయస్థానాలలో వుండడం ప్రమాదకరం. ఎందుకంటే తాఖీదులు జారీ చేసి, వాటిని పాటించకపోతే ఖైదు చేసే అధికారం న్యాయస్థానాలకు వుంది కాబట్టి. చేతిలో దండనాధికారం వున్నవారిలో సహనం ఎక్కువ వుండాలి. సమగ్ర దృష్టి, విషయ పరిజ్ఞానం వుండాలి.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వంపైన ఒత్తిడి పెట్టడానికి వివిధ వర్గాలు ఒక హక్కులాగా ప్రయోగించే ఆందోళన రూపాలు తరచుగా ఇతరులలో అసహనాన్ని కలిగిస్తాయి. మనం ఒక పని మీద అర్జంటుగా వెళ్తున్నప్పుడు ఎవరైనా రోడ్డు మీద రాస్తారోకో చేస్తుంటే కోపం వస్తుంది. మనం ఊరికి పోవలసి వున్న రోజునే ఆర్.టి.సి. వాళ్లు సమ్మె చేస్తేనూ కోపం వస్తుంది. ఇది సహజమే కానీ, ఈ కోపం, లేక అసహనమే ఆ ఆందోళనకు సంబంధించిన తప్పొప్పుల నిర్ణయానికి ప్రాతిపదిక కావడం న్యాయం కాదు. ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే వారందరూ ఒకరి హక్కుల వినియోగం వల్ల

మరొకరికి రాగల ఇబ్బందుల విషయంలో సహనం నేర్చుకోవడం అవసరం. దానిని ప్రజాస్వామ్య భావనలో అంతర్భాగమైన విషయంగా గుర్తించడం అవసరం.

న్యాయస్థానాలు ఈ విషయాన్ని గ్రహిస్తున్నాయా? లేకపోతే రోడ్డున పోయే సగటు పాదచారి రాస్తారోకో పట్ల ప్రదర్శించే అసహనాన్నే న్యాయ నిర్ణయానికి ప్రాతిపదిక చేసుకుంటున్నాయా? రెండవదే జరుగుతున్నది. ఇది ప్రజాస్వామ్యానికి ఎంత మాత్రం మేలు చేసే వైఖరి కాదు.

దీని అర్థం ఆందోళన చేసే హక్కుకు ఏ పరిధీ, పరిమితీ ఉండవని కాదు. ఆందోళన రూపాల న్యాయబద్ధతను గుర్తిస్తూ, వాటివల్ల ఇతరుల హక్కులకు కలగగల హానిని దృష్టిలో వుంచుకొని హేతుబద్ధమైన పరిమితులు పెట్టడంలో తప్పు లేదు. చట్టంలో ఇప్పటికే అటువంటి పరిమితులున్నాయి. అవన్నీ హేతుబద్ధమైనవేనా అనే చర్చలోకి ఇప్పుడు పోవద్దుగానీ, చట్టం కొన్ని పరిమితులను గుర్తించిన మాట వాస్తవం. చట్టంతో నిమిత్తం లేకుండా ఆందోళనకారులే నూటికి తొంబై సందర్భాలలో స్వీయ క్రమశిక్షణ పాటిస్తుంటారు. పాటించని సందర్భాలలో ఆ తప్పంతా వారిదేనా లేక న్యాయబద్ధమైన డిమాండ్లకు స్పందించని వైరిపక్షానిదా అనేది కూడ చూడవలసి వుంటుంది.

తాను జోక్యం చేసుకోక తప్పని స్థితి వచ్చిందని కోర్టు భావించినప్పుడు ఇవన్నీ చూసి ఆందోళనను నిషేధించే పద్ధతిలో కాకుండా సమస్యను పరిష్కరించే పద్ధతిలో వ్యవహరించాలి. ప్రజల హక్కులను కాపాడే పేరిట మొదలయ్యే జోక్యం, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే రూపం తీసుకోకూడదు.

*ప్రజాపంథా*

*1 ఆగస్టు 2005*

# న్యాయమూర్తులూ ఆలోచించండి!
# అన్నీ మీరే పరిష్కరించగలరా...

**జూ**నియర్ డాక్టర్ల సమ్మె విషయంలో రాష్ట్ర హైకోర్టు అనుసరించిన వైఖరి చాలా చర్చకు దారితీసింది. డాక్టర్లను సమ్మె చేయకుండా ఆపి హైకోర్టు రోగుల ప్రాణాలు కాపాడిందని మెచ్చుకున్నవారు ఉన్నారు. సమ్మె హక్కు అనే దానిని మొత్తంగా నిరాకరించే వైఖరి హైకోర్టు అనుసరించడం ప్రజాస్వామ్యానికి నష్టకరం అని విమర్శించిన వారూ ఉన్నారు.

హక్కుల సంఘాలు రెండవ వాదన వైపే మొగ్గు చూపించాయి. మరయితే రోగుల ప్రాణం – వారి జీవించే హక్కు – మా దృష్టిలో విలువ లేనిదని అర్థమా? సమ్మె హక్కుకు అనుకూలంగా మాట్లాడిన వారిని హైకోర్టు ఇదే ప్రశ్న అడిగింది. వైద్యుల సమ్మె హక్కు కంటే రోగుల జీవించే హక్కు ముఖ్యమనింది.

ఇప్పుడు జూనియర్ డాక్టర్ల కేసులో హైకోర్టు తన తుది తీర్పు ఇచ్చేసింది. ఏ సమస్యల పరిష్కారం కోసమయితే జూనియర్ డాక్టర్లు సమ్మెకు దిగారో వాటి విషయంలో హైకోర్టు ఎంతమేరకు న్యాయం చేయగలిగిందీ ఇప్పుడు స్పష్టంగా చూడగలుగుతున్నాం. ఈ నేపథ్యంలో సమ్మె హక్కు విషయంలో హైకోర్టు వైఖరిని విమర్శనాత్మకంగా పరిశీలించడం మన మనుగడకూ మన హక్కుల మనుగడకూ చాలా అవసరం.

ఒక్క సమ్మె విషయంలోనే కాదు. సమ్మె అనేది ఒకానొక ఆందోళన రూపం. అది ఎదుటి వారిపైన ఒత్తిడి పెట్టడం ద్వారా

మన కోరికలను వినేటట్టు చేస్తుంది. పరిష్కరించేటట్టు కూడ చేయగలదు. అయితే అటువంటి ఆందోళన రూపాలు ఇంకా కూడ ఉన్నాయి. బంద్, రాస్తారోకో, నిరాహారదీక్ష, పికెటింగ్, ప్రదర్శన, ఊరేగింపు మొదలయినవన్నీ ఈ లక్షణాన్ని కలిగి వున్నాయి. సమ్మె విషయంలోనే కాక వీటన్నిటి విషయంలోనూ న్యాయస్థానాలు అనుసరిస్తున్న వైఖరిని పరిశీలించవలసి ఉంది.

ఎందుకు?

ఇవి ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ విధానాలు లేక నడవడిక పట్ల బాధిత ప్రజావర్గాల నిరసనను సమర్థవంతంగా తెలియజేసే సాధనాలు కాబట్టి. ఇవే లేకపోతే ప్రజాస్వామ్యంలో ప్రజల చొరవ రెండు సందర్భాలకే కుదించబడుతుంది. ఒకటి వోటు వేసేటప్పుడు, రెండవది కోర్టులో కేసు వేసేటప్పుడు.

జూనియర్ డాక్టర్లను హైకోర్టు ఇందులో రెండవ ప్రక్రియలోకి ఆహ్వానించి వారి చేత సమ్మె విరమింపజేసింది కాబట్టి ఆ ప్రక్రియ ఏపాటి ప్రత్యామ్నాయం అనేది ఇప్పుడు చూడగలం. హైకోర్టు తీర్పులో ఏమీ లేదని కాదు, కొంత ఉంది. కానీ ఏది లేదో చూస్తే తప్ప ఉద్యమించే హక్కు అక్కరలేదు, కోర్టుకు రండి అనే వైఖరి ఏ మేరకు న్యాయం చేయగలగుతుందో అర్థం కాదు.

ప్రైవేట్ వైద్య విద్యా సంస్థలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తున్నారనీ, వాటిలో చదివే విద్యార్థులకు పాఠాలు చెప్పే పంతుళ్లు లేరనీ, వారు వైద్య విద్యను అభ్యసించడానికి అవసరమయిన అనుబంధ ఆస్పత్రులు ఉన్నట్టు చూపించడానికి అరువు డాక్టర్లనూ, అరువు పేషంట్లనూ అప్పటికప్పుడు యాజమాన్యాలు సమకూర్చుకుంటున్నాయి తప్ప నిజంగా ఆస్పత్రులేవీ లేవనీ జూనియర్ డాక్టర్లు అన్నారు. ఈ విషయంలో ఇన్‌స్పెక్షన్ చేసే అధికారం ఉన్న మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుడ్డిగా వ్యవహరిస్తున్నది తప్ప నిజాన్ని చూడడం లేదన్నారు. రాష్ట్రంలోని 21 ప్రైవేట్ మెడికల్ కాలేజీలు, 16 ప్రైవేట్ డెంటల్ కాలేజీలలో నిజంగా అధ్యాపకులు ఉన్నారా, నిజంగా వాటికి ఉండవలసిన అనుబంధ ఆస్పత్రులు ఉన్నాయా అన్న విషయం పరిశీలించడానికి ఒక స్వతంత్ర కమిటీని నియమించమని కోర్టును కోరారు. అసలు వైద్య విద్య ఇంతగా ప్రైవేట్ రంగంలో ఎందుకుండాలి, ప్రభుత్వమే ఈ కాలేజీలు నడపవచ్చు కదా అన్నారు.

## ఓటు ఒక్కటే మార్గమా...

ఇందులో చివరి ప్రశ్న ప్రభుత్వ విధాన నిర్ణయాలకు సంబంధించినది కాబట్టి తాను జోక్యం చేసుకోలేననీ, విద్యా వ్యవస్థలో ప్రైవేటీకరణ ఏ మేరకు ఉండవచ్చుననే

చర్చ కోర్టులో చేయవద్దనీ హైకోర్టు అనింది. కరెక్టే. మరయితే ప్రజలు ఏం చేయాలి? సాధారణ ప్రజలు ఆందోళన చేస్తే అడిగే దిక్కు ఉండదు. సమ్మె చేసి ప్రభుత్వం పైన ఒత్తిడి పెట్టే స్థితిలో ఉన్నవారిని కోర్టు సమ్మె చేయనివ్వదు. కోర్టునే జోక్యం చేసుకొమ్మంటే అది నా పరిధిలో లేని విషయం అంటుంది. అయిదేళ్లకొకసారి వేసే వోటే దీనికి పరిష్కారమా? అది సరిపోతుందా?

పోనీ, ప్రైవేట్ వైద్య కళాశాలల 'అద్దె టీచర్లు – అద్దె పేషంట్లు' వ్యవహారం పైన విచారణ కమిటీ వేయండి అని అడిగితే దానికయినా కోర్టు ఒప్పుకుందా అంటే లేదు. ఆ సంస్థలను పరిశీలించి వారికి అనుమతి ఇచ్చే అధికారం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఉంది; మెడికల్ కౌన్సిల్ ఆ పని చేసేసింది; చట్టబద్ధమైన అధికారం ఉన్న సంస్థ తన పని సక్రమంగా చేయలేదని దారిన పోయేవాళ్లెవరో అంటే కోర్టు ఆ సంస్థను శంకించనవసరం లేదు; కాబట్టి ప్రైవేట్ మెడికల్ కాలేజీలను కేసులో ప్రతివాదులుగా చేర్చడానికి సహితం హైకోర్టు ఒప్పుకోలేదు. అరడజను కాలేజీల విషయంలో వారు చెప్పుకుంటున్న అధ్యాపకుల సంఖ్య ఎంత, నిజంగా ఉన్నదెందరు అన్న సమాచారం కోర్టు ముందు ఉంచినా కూడ ఒప్పుకోలేదు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇంకొంచెం సమర్థంగా, పారదర్శకంగా పనిచేయాలి అనీ, ఢిల్లీలో ఒక కార్యాలయం ఉంటే చాలదు, ప్రైవేట్ వైద్య విద్యా సంస్థలు ఈ రాష్ట్రంలో చాలా వెలిశాయి కాబట్టి వీలయితే హైదరాబాద్‌లో కూడ ఒక కార్యాలయం నెలకొల్పాలి అనీ మాత్రం సూచన కోర్టు ఇచ్చింది. దానితో పరిస్థితి చక్కబడకపోతే? వైద్య విద్యా వ్యవస్థ తమ కళ్ల ముందు నాశనం అవుతూ వుంటే దగ్గరి నుండి అన్ని విషయాలూ గమనిస్తున్న జూనియర్ డాక్టర్లు నిస్సహాయంగా చూస్తూ ఉండవలసిందేనా? ఈ వ్యవస్థను చక్కబెట్టే చట్టబద్ధమైన అధికారం ఉన్న సంస్థ ఒకటి ఉంది అనీ, దానిని పర్యవేక్షించడానికి కోర్టు పూనుకోజాలదనీ హైకోర్టు ప్రకటించిన అభిప్రాయం న్యాయస్థానాల అధికారాల పరిధులకు సంబంధించిన సంప్రదాయక ఆలోచనా రీతికి లోబడిన అభిప్రాయమే కావచ్చును. మరి న్యాయస్థానం ఈ కారణంగా జోక్యం చేసుకోలేని పక్షంలో ప్రజలు వేరే ఏ విధంగా జోక్యం చేసుకోవాలి? వైద్యులు సమ్మె చేసి వైద్య వ్యవస్థను తాత్కాలికంగా స్తంభింపజేస్తేనో, ప్రజా సంఘాలు భారీ ప్రదర్శన చేపట్టి రాజధానిని కొంతకాలం పాటు స్తంభింపజేస్తేనో, వైద్యశాఖామాత్యుడిని ఘెరావ్ చేసి ఒక పూట తిండీ, నీళ్లు లేకుండ చేస్తేనో పరిష్కారం దొరకొచ్చునేమో. కానీ

సమ్మెలూ, ప్రదర్శనలూ, ఘెరావ్‌లూ చెల్లవనీ, రాజ్యాంగ విరుద్ధమనీ న్యాయస్థానాలు ప్రకటించి వాటిని సాగనివ్వని పక్షంలో ప్రజలకు వేరే మార్గం ఏముంది?

## ఏ ఆందోళనా వద్దంటే ఎలా?

న్యాయస్థానాలు తమ పరిమితుల రీత్యా అన్ని విషయాలలోనూ న్యాయం చేయలేవు. ఆ పరిమితులను కొంత సరళంగా వ్యాఖ్యానించడం ద్వారా కొంచెం ఎక్కువ న్యాయం చేసే ప్రయత్నమైనా చేస్తారా అంటే ఇరవై ఏళ్లనాడు ఈ విషయంలో న్యాయమూర్తులు కొంత సంసిద్ధత చూపారు గానీ ఇప్పుడు ససేమిరా అంటున్నారు. మరి ప్రజలకు అయిదేళ్లకొకసారి వేసే వోటే దిక్కా? దానితో అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయా? ఎన్నికలలో ఇచ్చిన హామీలను అధికారానికి వచ్చిన తరువాత నిలబెట్టుకోవాలన్న నియమమేదీ లేనిచోట వోటు హక్కు బలహీనమైన సాధనమేనని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాం. మరీ దుర్మార్గంగా పరిపాలిస్తున్న ప్రభుత్వాన్ని దించడానికది పనికొస్తుందే తప్ప ప్రభుత్వ విధానాలను బలంగా ప్రభావితం చేయడానికి అది సరిపోదు.

అందుకే ప్రదర్శనలు, బంద్‌లు, రాస్తారోకోలు, సమ్మెలు, ఆమరణ నిరాహార దీక్షలు మొదలయిన ఆందోళన రూపాలు ప్రజాస్వామ్యంలో భాగంగా ఎదిగాయి. చట్టంలోని హక్కులను ప్రభుత్వం హరిస్తే కోర్టును ఆశ్రయించవచ్చును గానీ, కోర్టు జోక్యం చేసుకోజాలని ప్రభుత్వ విధాన నిర్ణయాలు ప్రజల హక్కులకూ బాగోగులకూ భంగకరమయినట్టయితే వాటిని ఎదుర్కొనడానికి ఇటువంటి ఆందోళన రూపాలు చాలా అవసరం. వాటిని ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసేవిగా కాక పెంపొందించేవిగా చూడాలి.

ఈ ఆందోళన రూపాల వల్ల ప్రజా జీవితానికి ఏ సమస్యలూ రావా అంటే వస్తాయి. ఒక్క నిరాహారదీక్ష తప్ప తక్కినవన్నీ ప్రజా జీవితాన్ని ఏదో ఒక మేరకు ఆటంకపరుస్తాయి, ప్రజలను ఏదో ఒక మేరకు ఇబ్బందికి గురిచేస్తాయి. అయితే ఆ కారణంగానే అవి ప్రభుత్వం పైన ఒత్తిడి పెట్టగలుగుతాయి. 'వాళ్లు సమ్మె చేసి ప్రజలను ఇంత ఇబ్బందికి గురిచేస్తుంటే ఈ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోదు?', 'వాళ్లు ఇన్ని గంటల సేపు రాస్తారోకో చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు స్పందించదు?' అన్న నిరసన ప్రజలలో రాగలదు కాబట్టే ఈ ఆందోళన రూపాలు పనిచేస్తాయి. అది ప్రజలకు ఇబ్బందికరమే. అయినప్పటికీ, ఇటువంటి ఆందోళన రూపాలు లేనట్టయితే ప్రజా

వ్యతిరేకమైన ప్రభుత్వ విధానాలను నిలువరించడం సాధ్యం కాదని గుర్తించినట్టయితే – ఇటువంటి ఆందోళనలు చేపట్టేవారిని బాధ్యతగా వ్యవహరించాలని అడగగలము తప్ప – వీటిని పూర్తిగా నిషేధించడం ప్రజాస్వామ్యానికి శ్రేయస్కరం కాదని అర్థం అవుతుంది.

ప్రజా జీవితాన్ని ఇబ్బందులకు గురిచేసే ఆందోళనలు చేపట్టే నిర్వాహకులను తాము దేనికోసం ఆందోళన చేస్తున్నారు, దాని తక్షణ సాధ్యాసాధ్యాలు ఏమిటి, ప్రభుత్వం ఎంత హేతుబద్ధంగా స్పందిస్తున్నది, ప్రజలకు ఎంత ఇబ్బంది కలుగుతున్నది మొదలయిన విషయాలను దృష్టిలో ఉంచుకొని బాధ్యతగా వ్యవహరించాలని అడగగలము. అడగాలి కూడ. న్యాయస్థానాలు ఇటువంటి ఆందోళనల విషయంలో జోక్యమంటూ చేసుకుంటే, అది ప్రభుత్వానికి ఆందోళనకు స్పందించవలసిన బాధ్యతనూ, ఆందోళనకారులకు ప్రజలకు కలుగుతున్న అసౌకర్యం పట్ల తాము అనుసరించవలసిన బాధ్యతాయుత వైఖరినీ జ్ఞాపకం చేయడానికే తప్ప ఆందోళనలను నిషేధించడానికి కాకూడదు. సరయిన ప్రజాస్వామ్య స్పృహ ఉన్నట్టయితే న్యాయస్థానాలు ఈ విషయాన్ని గ్రహించగలిగి వుండేవి.

## ఏది ప్రజాస్వామ్యానికి నిజమైన నష్టం?

కానీ అదే లోపించింది. ఇది కేవలం మన హైకోర్టు విషయమో లేక కేవలం జూనియర్ డాక్టర్ల విషయమో కాదు. మొత్తంగానే ఉద్యమించే హక్కు పట్ల న్యాయస్థానాలు తిరస్కార వైఖరిని అవలంబిస్తున్నాయి. దానిని ప్రజాస్వామ్యంలో భాగంగా కాక, ప్రజాస్వామ్యానికి నష్టకరమైన విషయంగా చూసే వైఖరి న్యాయస్థానాలలో ప్రబలింది. బంద్ పిలుపు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధం, పికెటింగ్ రాజ్యాంగ విరుద్ధం, ఘెరావ్ నేరం, ప్రభుత్వ ఉద్యోగులు సమ్మె చేయడం తప్పు లాంటి తీర్పులు మాత్రమే కాదు, వారిని విచారణ లేకుండ ఉద్యోగం నుండి తీసేయవచ్చు వంటి తీర్పులు కూడ ఒకదాని తరువాత ఒకటి వస్తున్నాయి. ఇప్పుడు డాక్టర్లు ఎట్టి పరిస్థితిలోనూ సమ్మె చేయడానికి వీలులేదనీ, సమ్మె చేస్తే వైద్యులుగా వారు పొందిన రిజిస్ట్రేషన్‌ను సహితం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రద్దు చేయవచ్చుననీ మన హైకోర్టు ప్రకటించింది. రోగికి వైద్యం చేయడానికి వైద్యుడు నిరాకరించడం నేరమని చెప్పే మెడికల్ కౌన్సిల్ నియమం నుండి హైకోర్టు ఈ నిర్ధారణకు వచ్చింది. డ్యూటీలో ఉండి వైద్యం చేయడానికి నిరాకరించడమూ, ఒక

న్యాయమైన లక్ష్యం కోసం సమ్మెలో ఉన్న కారణంగా విధులకు హాజరు కాకపోవడమూ ఒకటేనా? అటువంటి సమ్మెను చట్టవిరుద్ధం అని నిషేధించే కంటే అది త్వరగా ముగింపుకు రావడం కోసం ఇరువర్గాల పైనా ఒత్తిడి పెట్టడం న్యాయస్థానాలకు ఉచితమైన వైఖరి కాదా? వైద్యులు కేవలం తమ హక్కుల కోసమే సమ్మె చేసి ఉన్నా ఇది వర్తిస్తుంది. కానీ జూనియర్ డాక్టర్లు సమ్మె చేసింది ఒక ప్రజా ప్రయోజనం కోసం. వైద్య వ్యవస్థ, వైద్య విద్యా వ్యవస్థ వ్యాపార ప్రక్రియగా మారిపోవడాన్ని నిరసిస్తూ వారు సమ్మె చేశారు. అటువంటి సమ్మెకు ఇది మరింత ఎక్కువ వర్తించదా?

16 సంవత్సరాల క్రితం ఒక కేసులో సుప్రీంకోర్టు పారిశ్రామిక కార్మికుల సమ్మె హక్కు గురించి ఇచ్చిన తీర్పును ఇక్కడ ఉటంకించడం ఉచితంగా ఉంటుంది. ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో ఎప్పుడూ ఏవో పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శనలు జరుగుతుంటాయి. దేశ పారిశ్రామిక పురోగతికి చిహ్నంగా ఆ ప్రదర్శనలను భావిస్తారు. అక్కడ పనిచేసే కార్మికులు తమ కోర్కెల సాధన కోసం సమ్మె చేయగా, యాజమాన్యం దానిని దేశానికి అప్రతిష్ఠ తెచ్చే చర్యగా భావించింది. ఈ వివాదం సుప్రీంకోర్టు దాకా పోగా, జస్టిస్ అహ్మదీ ఈ విధంగా అన్నారు:

## అహ్మదీ తీర్పు

> "సంఘాలు పెట్టుకొని వాటిని రిజిస్టర్ చేసుకునే హక్కును చట్టం గుర్తించింది. కార్మిక సంఘాలకు కొన్ని హక్కులు ఇవ్వడమే ఈ గుర్తింపు లక్ష్యం. కార్మికుల కష్టాల గురించి చెప్పుకోవడానికి, హక్కులు అడగడానికి కార్మిక సంఘాలు అవసరం అయ్యాయి. కార్మిక సంఘాలు కార్మికుల ప్రతినిధులు. కార్మిక సంఘం బలం దాని సభ్యత్వాన్ని బట్టి ఉంటుంది. ఎక్కువ సభ్యత్వం ఉన్న కార్మిక సంఘాలు యాజమాన్యంతో ఎక్కువ సమర్థతతో సంప్రదింపులు చేయగలుగుతాయి. కార్మిక సంఘాలకు ప్రదర్శనలు చేపట్టే హక్కును నిరాకరిస్తే ఈ సామర్థ్యం బలహీన పడుతుంది. సమ్మె అనేది ఒక రకమైన ప్రదర్శన మాత్రమే. వేరే ప్రదర్శన రూపాలు కూడ ఉన్నాయి. గో-స్లో, సిట్-ఇన్, వర్క్ టు రూల్, గైర్హాజరు కావడం మొదలయినవి. అటువంటి ప్రదర్శనా రూపాలలో సమ్మె ఒకటి. ప్రదర్శన జరిపే హక్కు, అందులో భాగంగా సమ్మె చేసే హక్కు కార్మికులకు అందుబాట్లో ఉండే ఒక ముఖ్య సాధనం. అన్ని ప్రజాస్వామిక దేశాలూ ఈ హక్కును గుర్తించాయి. ....అయితే

పారిశ్రామిక న్యాయశాస్త్రంలో సమ్మె చేసే హక్కు అపరిమితమైనది కాదు. దానిని నియంత్రించే నియమాలున్నాయి... సిబ్బంది జీతాలు పెంచి కార్మికులవి మాత్రం పెంచని యాజమాన్య వైఖరికి ఆగ్రహించిన కార్మిక ప్రతినిధులు సమ్మె చేయడం ద్వారా ఒత్తిడి పెట్టాలని నిర్ణయించుకున్నారు. సమ్మె సందర్భంగా కొన్ని అవాంఛనీయ ఘటనలు జరిగిన మాట వాస్తవమే. అయితే విధ్వంసమేమీ జరగలేదు... ఘాటయిన మాటలు అనుకోవడం జరిగింది. దానిని యాజమాన్యం 'బెదిరింపు'గా అభివర్ణించింది... ఇరువర్గాల ప్రవర్తనను మేము అప్పటి పరిస్థితుల నేపథ్యంలో చూస్తున్నాం... తప్పొప్పులు ఎంచి విద్వేషాలను ఇంకింత పెంచే బదులు సంస్థ దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సంక్షోభాన్ని పరిష్కరించదలచుకున్నాం.."

## ఇప్పుడే మరింత రక్షణ అవసరం

ఆందోళనలలో న్యాయస్థానాలు జోక్యం అంటూ చేసుకుంటే ఈ వైఖరితో చేసుకోవడం ఉచితంగా ఉంటుంది. లేకపోతే జోక్యమే చేసుకోకుండా ఉండడం మేలు. అంతే తప్ప సమ్మె చేయొద్దు, రాస్తారోకో చేయొద్దు, బంద్ నిర్వహించవద్దు, ఏవయినా సమస్యలుంటే కోర్టుకు రండి అని చెప్పి, కోర్టుకు వచ్చిన తరువాత మా పరిధి ఇంతే మేమింత కంటే ఎక్కువ చేయలేం పొండి అంటే ప్రజల సమస్యలు ఏ విధంగా పరిష్కారం కావాలి?

ఇది ఎప్పుడయినా ఉండే విషయమే గానీ, ప్రభుత్వ విధానాలు ప్రజానుకూలంగా ఉండనక్కర లేదని దేశ పాలకులు బహిరంగంగా ప్రకటించుకుని తిరుగుతున్న తరుణంలో ఉద్యమించే హక్కుకు రక్షణ మరింత అవసరం. ఈ మధ్య మన హైకోర్టు జోక్యం చేసుకున్న రెండు సమ్మెలూ – జూనియర్ డాక్టర్లదీ, ఆర్టీసీ కార్మికులదీ – ప్రజా ప్రయోజనాల పరిరక్షణ కోసం జరిగిన సమ్మెలే తప్ప వారి కోసం వారు చేసుకున్న సమ్మెలు కావు. ఇటువంటి ఆందోళనలు ఇంకా చాలా జరగబోతాయి కాబట్టే ఉద్యమించే హక్కు పట్ల కోర్టులు అనుసరిస్తున్న వైఖరి గురించి మాట్లాడుకోవడం అవసరం.

*మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది*

*29 ఆగస్టు 2005*

# అగ్రకుల దురహంకారాన్ని హైకోర్టు మన్నించడం లజ్జాకరం

**చుం**డూరు కేసు విచారిస్తున్న జడ్జి డా॥ ప్రభాకర్‌రావుగారిని ముద్దాయిల కోరిక మేరకు ఒంగోలుకు బదిలీ చేసిన సంగతి అందరికీ ఈపాటికి తెలిసే ఉంటుంది.

ఆ బదిలీ ఎంతటి లజ్జాకరమైన పరిస్థితులలో జరిగిందో ప్రజలకు తెలియజెప్పడం అవసరం అని మేము భావిస్తున్నాము. బదిలీ చేసింది హైకోర్టే అయినప్పటికీ మేము ఆ మాట అంటున్నాము.

ప్రభాకర్‌రావుగారు కులం రీత్యా దళితుడు. దళిత కులస్థుడైన న్యాయమూర్తి కేసు విచారిస్తే తమకు న్యాయం జరగదని అగ్ర కులస్తులైన చుండూరు కేసు ముద్దాయిలు భావించారు. దాదాపు అదే మాట ఆయనతోనూ అన్నారు. హైకోర్టుకు చెప్పారు. బదిలీ అయి వెళ్ళిపోవడం తన మనశ్శాంతికి క్షేమకరం అని ఆయనకే అనిపించేటట్టు చేశారు. ఆయనను బదిలీ చేయకపోతే తమ తరఫున కేసు నిర్వహించడానికి లాయర్లే దొరకరని బెదిరించారు. కేసు చేస్తున్న లాయర్లంతా పక్కకు తప్పుకుంటారని ముద్దాయిలు బెదిరించడమే కాదు, వారి లాయర్లూ బెదిరించారు. తమ ప్రమేయం లేకుండా ఏకపక్షంగా కేసును నడుపుకుంటారో లేక జడ్జిని బదిలీ చేస్తారో నిర్ణయించుకోండని సవాలు విసిరారు.

ఇదంతా చేసి తమ కోరిక సాధించుకున్నారు. జడ్జిని హైకోర్టు బదిలీ చేసేసింది. అందుకే ఈ బదిలీని 'లజ్జాకరం' అంటున్నాం. చేసింది హైకోర్టే కావచ్చు. అయినప్పటికీ అంటున్నాం.

చుండూరు మారణకాండ గురించి మేము ప్రజలకు కొత్తగా జ్ఞాపకం చేయవలసిన పని లేదు. 1991 ఆగస్టు 6వ తేదీన చుండూరు, పరిసర గ్రామాలకు చెందిన అగ్రకులస్తుల గుంపు ఆ ఊరి దళితవాడ పైన పట్టపగలు దాడి చేసి ప్రజలను తరిమారు, కొట్టారు, నరికారు, చంపారు.

14 సంవత్సరాలైనా కేసు విచారణ పూర్తికాకపోవడానికి హత్య చేసిన దుండగులే ప్రధాన కారణం. హతులు దళితులు కారనీ, క్రైస్తవులనీ, అందువల్ల వారికి ఎస్.సి., ఎస్.టి చట్టం వర్తించదని ఒకసారి కోర్టుకెక్కారు. ఆ కేసు ఓడిపోయిన తరువాత ఎస్.సి., ఎస్.టి ప్రత్యేక కోర్టు చుండూరులోనే కూర్చుంటుందన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఒకసారి కాదు, రెండుసార్లు కోర్టుకెక్కారు. ఎక్కువ మంది సాక్షులు, ముద్దాయిలు చుండూరుకు, దాని పరిసర గ్రామాలకు చెందినవారు కాబట్టి కేసు విచారణ చుండూరులో జరపడం చట్టరీత్యా తప్పు కాదు. సాధారణ న్యాయదృష్టి లోను తప్పు కాదు. అయినప్పటికీ దానిపై వ్యాజ్యం నడిపారు.

ఆ వ్యాజ్యం ఓడిపోయిన తరువాత చుండూరు కేసు నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించడాన్ని సవాలుచేస్తూ మళ్ళీ వాళ్ళే కోర్టు కెక్కారు.

ఎస్.సి., ఎస్.టి. అత్యాచారాల నిరోధక చట్టంలోనే బాధితులను సంప్రదించి వారికి విశ్వాసం ఉన్న న్యాయవాదిని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించే అవకాశం ఉన్నప్పటికీ దళితులు కోరిన వ్యక్తిని ఎట్లా నియమిస్తారు అంటూ కోర్టుకెక్కారు. సింగిల్ జడ్జి వారి కేసును కొట్టేయగా డివిజన్ బెంచికి అప్పీలు కూడ చేసుకున్నారు.

అది కూడ వీగిపోయిన తరువాతే చుండూరు మారణకాండపైన విచారణ మొదలయింది. ప్రత్యక్ష సాక్షుల విచారణ దాదాపు పూర్తయిపోయిన దశలో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తిని బదిలీ చేయడం జరిగింది. ఇది ఏ ప్రత్యేక కారణం వల్లా జరిగిన బదిలీ కాదు. ఆనవాయితీగా న్యాయవ్యవస్థలో జరిగే బదిలీలలో భాగంగా గుంటూరులో చాలామంది బదిలీ అయ్యారు. ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కూడ బదిలీ అయి డా॥ ప్రభాకర్‌రావుగారు నియమితులయ్యారు.

క్రిమినల్ కేసును ఆద్యంతం ఒకే న్యాయమూర్తి విచారించాలన్న నియమమేదీ లేదు. కాబట్టి కొత్త న్యాయమూర్తి నియామకానికి ముద్దాయిలు అభ్యంతరం చెప్పే

అవకాశం లేదు. అయినప్పటికీ చుండూరు ముద్దాయిలు వెంటనే హైకోర్టుకు నిరసన తెలుపుతూ ఉత్తరం రాశారు. పాత న్యాయమూర్తినే కొనసాగించమని కోరారు. ఆయనేమైనా వారికి అనుకూలంగా వ్యవహరించాడా అంటే అదేం లేదు. ఆయన తన వృత్తి ధర్మం ప్రకారం చేశాడు. మరి అటువంటప్పుడు బదిలీని నిలిపివేసి పాత న్యాయమూర్తినే కొనసాగించాలని ముద్దాయిలు ఎందుకు కోరారన్న ప్రశ్నకు ముద్దాయిల నుండి జవాబు లేదు.

వాళ్ళు జవాబు చెప్పకున్నా కారణం ఊహించడం కష్టం కాదు. కొత్త జడ్జి దళితుడని తెలిసి పాత జడ్జినే కొనసాగించాలని వారు హైకోర్టును కోరారు. కొత్త జడ్జి వ్యవహారశైలిని వారప్పటికి చూడలేదు. ఆయన న్యాయబుద్ధి కలవాడో కాదో నిర్ణయించడానికి వారి వద్ద అప్పటికి ఏ ఆధారాలు లేవు. అయినప్పటికీ పాత జడ్జినే కొనసాగించమని హైకోర్టును వారు కోరారంటే, కొత్తాయన కులంరీత్యా దళితుడు కావడమొక్కటే దానికి కారణం కాగలదు.

అప్పుడే హైకోర్టు వారి అభ్యర్థన పట్ల తగిన రీతిలో స్పందించవలసి ఉండింది. దళితుల పైన దాడి చేసిన కేసులో అగ్రకులస్తులను విచారించడానికి దళిత కులస్తుడైన వ్యక్తి ఎంతటి న్యాయకోవిదుడైనా, నిష్ణాతుడైనా అనర్హుడనే కదా వారు చెప్పదలచు కున్నది? అది కోర్టు ధిక్కారం కాదా? న్యాయవ్యవస్థ అన్యాయమైన తీర్పు ఇచ్చిందని విమర్శించిన వారిని సైతం కోర్టు ధిక్కారానికి శిక్షిస్తారే, ఏ తీర్పు ఇంకా ఇవ్వకముందే ఈ న్యాయమూర్తి దళితుడు కాబట్టి మాకు న్యాయం జరగదని భావిస్తున్నామని ప్రకటించే వారిని ఉపేక్షించడం భావ్యమా?

అప్పుడు హైకోర్టు వారిని అభిశంసించలేదు గానీ వారి కోరికను మన్నించనూ లేదు. ఊరకుండిపోయింది. కొత్త జడ్జి డా॥ ప్రభాకర్‌రావుగారి ఆధ్వర్యంలో చుండూరు కేసు విచారణ కొనసాగింది. 22 మంది సాక్షులను విచారించారు. వీరిలో ఎక్కువ భాగం పంచనామా మధ్యవర్తులు, పోలీసులు, డాక్టర్లు మొదలైన 'అధికారిక' సాక్షులు. వీరి సాక్ష్యానికి ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలానికి ఉండే ప్రాముఖ్యం ఉండదు. అయినప్పటికీ ఈ సాక్ష్యాలు నమోదు చేయడంలో న్యాయమూర్తి పక్షపాత బుద్ధితో వ్యవహరిస్తున్నారని ముద్దాయిలు ఆరోపించసాగారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, న్యాయమూర్తి కుమ్మక్కయి ప్రాసిక్యూషన్ కథనానికి అనుకూలించే పద్ధతిలో సాక్ష్యం నమోదు చేస్తున్నారనీ, అందుకోసం సాక్షుల పైన ఒత్తిడి పెట్టి వారిచేత అనుకూలంగా చెప్పిస్తున్నారనీ నిందవేశారు. ఈ నిందా పత్రాన్ని ఆగస్టు నెలలో న్యాయమూర్తి చేతికే

ఇచ్చి "ఈ కేసు మీరు విచారించిన యెడల ఏ విధంగాను న్యాయమైన తీర్పు వస్తుందని నమ్మకం లేదు. కనుక అన్యధా భావించక, మీ అధికారం మాపై చూపక వేరే జడ్జిగారి ద్వారా విచారణ జరిపించగలందులకు తగు చర్యలు తీసుకొనవలసిందిగా ప్రార్థించుచున్నాము" అని కోరారు.

ఈ వాక్యాలలోని వెక్కిరింత ధ్వని సాధారణంగా కోర్టులో ముద్దాయిల నోట వినిపించేది కాదు. న్యాయమూర్తి దళితుడనే చులకన భావమే లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదు.

ఈ నిందా పత్రాన్ని ముద్దాయిలు న్యాయమూర్తికి ఇవ్వడమేకాక హైకోర్టుకు కూడ పంపారు. చుండూరు కేసును ఆ కోర్టు నుంచి పొరుగు జిల్లాకు బదిలీ చేయమని హైకోర్టులో కేసు వేశారు. న్యాయమూర్తిని బదిలీ చేయమన్న అర్జీ కూడ పెట్టుకున్నారు. కేసును బదిలీ చేయడం హైకోర్టు న్యాయపరమైన అధికారం పరిధిలోని విషయం కాబట్టి కేసు వేశారు. జడ్జిని బదిలీ చేయడం హైకోర్టు పాలనాధికారం పరిధిలోని విషయం కాబట్టి అర్జీ పెట్టుకున్నారు. రెండూ ఒకేసారి చేశారు. రెండింటికి ఆధారం ఆగస్టు నెలలో న్యాయమూర్తికి సమర్పించిన నిందా పత్రమే. దాని ముగింపు వాక్యాలను పైన ఉటంకించాము. అందులోని 15వ పేరాను కూడ ఉటంకించాలి.

"మీరు ఎస్.సి. కులమునకు చెందినవారని తెలియుచున్నది. ఔనో/కాదో మాకు తెలియదు. కానీ, జరిగిన పై విషయములు మరియు ఇతర విషయముల దృష్ట్యా, మమ్ములను ఇబ్బంది పెట్టుట గురించి సాక్ష్యములు సరిగా నమోదు చేయకపోవడాన్ని బట్టి, జరుగుతున్న అన్యాయాన్ని బట్టి నిజమేనేమో అనిపిస్తుంది. అందువలన కూడ మాకు ఈ కేసులో న్యాయము జరగదని విశ్వసించుచున్నాము. కులప్రాతిపదికగా ఏర్పడిన న్యాయస్థానము కనుక అనుమానించుచున్నాము."

అంటే న్యాయమూర్తి కులాన్ని బట్టి ఆయన నిష్పాక్షికతను శంకించవచ్చు. న్యాయమూర్తి దళిత కులస్థుడైతే ఎస్.సి., ఎస్.టి. చట్టం కింద విచారణ ఎదుర్కొంటున్న అగ్రకుల ముద్దాయిలు తమకు న్యాయం జరగదని అనుమానించవచ్చు. ఎస్.సి., ఎస్.టి స్పెషల్ కోర్టు 'కుల ప్రాతిపదికన' ఏర్పడిన న్యాయస్థానం కాబట్టి ఆ కోర్టులో విచారణ జరిపే న్యాయమూర్తి ఎస్.సి.గానీ, ఎస్.టి. గానీ అయితే ముద్దాయిలకు న్యాయం జరగదన్న విశ్వాస రాహిత్యాన్ని ప్రకటించి జడ్జి బదిలీ గాని, కేసు బదిలీ గాని కోరవచ్చు.

ఇదీ చుండూరు ముద్దాయిల వాదన. దీనిని వారు తమలో తాము చెప్పుకుని ఊరుకోలేదు. కాగితం మీద పెట్టి హైకోర్టుకే ఇచ్చి కేసును గానీ, జడ్జిని గానీ బదిలీ చేయమని అడిగారు.

న్యాయవ్యవస్థను అవమానపరిచినందుకు కోర్టు ధిక్కారం కేసు, దళితుడు అగ్రకులాల నేరాన్ని విచారించడానికి అనర్హుడని అన్నందుకు పిసిఆర్ చట్టం కింద వారిపైన కేసు నమోదు చేయవలసింది పోయి హైకోర్టు వారి అభ్యర్థన మేరకు జడ్జిని బదిలీ చేసింది. కేసు బదిలీ కోసం ముద్దాయిలు వేసిన వ్యాజ్యం ఇంకా విచారణలో ఉండగానే జడ్జిని బదిలీ చేసింది. ముద్దాయిల నిందా పత్రానికి డా॥ ప్రభాకర్‌రావు సంతృప్తికరంగా జవాబు చెప్పకపోలేదు. జవాబు చెప్పడమే కాక, ముద్దాయిలు కోర్టులో అనుచితంగా ప్రవర్తిస్తున్న వైనాన్ని కూడ హైకోర్టుకు వివరించాడు. దాంతో పాటు ఈ తలనొప్పి తనకొద్దని తానే బదిలీ కూడ కోరాడు. ఆయన అభ్యర్థనకు అగ్రకుల ముద్దాయిలు పెట్టిన వేధింపులే కారణం అని హైకోర్టు గుర్తించి ముద్దాయిలపైన తగు చర్య తీసుకోవలసిందిపోయి వారి కోరికే తీర్చింది.

ఇది హైకోర్టుకు తగునా అని మేము అడుగుతున్నాం. దళితులను హతమార్చిన అగ్రకులస్తులు తమ కులాలకు చెందినవారే తమను విచారించాలని డిమాండ్ చేయడాన్ని ఆమోదించినట్టు కాదా? రేపు దళిత బాధితులు జడ్జి దళితేతరుడు కాబట్టి మాకు న్యాయం జరగదని అనుమానిస్తున్నాం అంటే జడ్జిని మళ్ళీ బదిలీ చేస్తారా?

1991 ఆగస్టు 6న ముద్దాయిలు ఏ అహంకారాన్ని ప్రదర్శించారో అదే అహంకారాన్ని 2005 ఆగస్టు నెలలో జడ్జి మీద తయారుచేసిన నిందాపత్రంలోనూ మళ్ళీ ప్రదర్శించారు. మొదటి దానికి విచారణ ఇప్పటికీ పూర్తికాలేదు. రెండవది వారు కోరిన ఫలితాన్నే ఇచ్చింది. అందరికీ సమన్యాయం జరుగుతుందన్న విశ్వాసాన్ని న్యాయవ్యవస్థ ప్రజలలో నిలబెట్టదలచుకుందా లేదా?

*మొదటి ముద్రణ : HRF కరపత్రంగా వచ్చింది, 27 అక్టోబర్ 2005*

*రెండవ ముద్రణ : 'దళిత', 2011 (పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ)*

# వాకపల్లి - కోర్టులు

హైకోర్టు నుంచి ఏదో ఒక ఆర్డర్ వస్తుంది; దోషులను అరెస్టు చేస్తారు; నేర పరిశోధన, నేర విచారణ జరుగుతాయి అన్న ఒక అభిప్రాయం ఉండింది ఇన్నాళ్లూ. కాని హైకోర్టు చాలా విచిత్రంగా, ఆశ్చర్యంగా, వాకపల్లిలో ఏమైనా జరిగిందో లేదో మేము చెప్పలేక పోతున్నాం కాబట్టి కేసు మూసేస్తున్నాము అని కేసు మూసేయడంతో సమస్య మళ్ళీ మొదటికి వచ్చింది. నేరం జరగలేదు అని మేము అనుకుంటున్నాము కాబట్టి మూసేస్తున్నాము అంటే అది అబద్ధమైనా అది ఒక తీర్పు అనుకోవచ్చు. కాని హైకోర్టు నేరం జరగలేదు అని చెప్పలేదు. జరిగిందనీ చెప్పలేదు. మాకు అర్థం కావడం లేదు కాబట్టి కేసు మూసేస్తున్నాము అనేది న్యాయస్థానాల పాత్ర గురించి తెలిసిన వాళ్ళకి ఎవరికైనా చాలా ఆశ్చర్యమూ, బాధా, ఆవేదనా కలిగించేటటువంటి విషయం.

అయినా హైకోర్టును ఎవరడిగారు నేరం జరిగిందా లేదా నువ్వు చెప్పు అని. హైకోర్టు డ్యూటీ ఏమిటి? అన్ని వ్యవస్థలూ సక్రమంగా పని చేసేటట్లు చూడటమే హైకోర్టు చేయాల్సిన పని. ఒక నేరం జరిగినప్పుడు పోలీసులు ఎఫ్.ఐ.ఆర్ నమోదు చెయ్యాలి, చార్జిషీటు వెయ్యాలి – అది వాళ్ళ డ్యూటీ. డాక్టర్లు, వైద్యులు సక్రమంగా వైద్య పరీక్షలు జరపాలి, ఆ రిపోర్టు వాళ్ళు ఇవ్వాలి – అది వాళ్ళ డ్యూటీ. ఈ లోపున మేజిస్ట్రేటు కోర్టు దోషులకు రిమాండ్ ఇచ్చి వాళ్ళు తప్పించుకొని పారిపోకుండా, నేరపరిశోధనకు అందుబాటులో ఉండేటట్లు చూడాలి – అది కింది కోర్టు డ్యూటీ. ఎస్.సి., ఎస్.టి. కేసు కాబట్టి ప్రభుత్వమే 1989లో జారీ చేసిన

జీ.వో. ప్రకారం బాధితురాళ్ళకు తక్షణం కొంత ఆర్థిక సహాయం ఇచ్చి, చార్జిషీటు వేసిన తరవాత మరికొంత ఇచ్చి, వాళ్ళుగాని పునరావాసం కోరుకుంటే పునరావాసం ఇవ్వాలి – అది ప్రభుత్వం డ్యూటీ. వీళ్ళందరూ వీళ్ళ వీళ్ళ డ్యూటీలు సక్రమంగా చేసేటట్లు చూడటమే హైకోర్టు డ్యూటీ. రాజ్యాంగంలో దాని పాత్ర అది.

హైకోర్టును మనం అడిగింది తమ విధి నిర్వహణను పోలీసులు చెయ్యడం లేదు – చెయ్యించండి వాళ్ళ చేత అని, తన విధి నిర్వహణను ప్రభుత్వం చెయ్యడం లేదు – చెయ్యించండి దాని చేత అని. అత్యాచారం జరిగింది అని పదకొండు మంది మహిళలు ఫిర్యాదు చేసినప్పుడు, ఏ ఏ వ్యవస్థలు ఆ ఫిర్యాదు మీద ఏమేమి చెయ్యాలో వాళ్ళెవ్వరూ అవేమీ చెయ్యలేదు. అంతా పడుకొన్నారు, నిద్రపోతున్నారు, నేరాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. వాళ్ళచేత చట్టం వాళ్ళకు నిర్దేశించినటువంటి బాధ్యతలను నిర్వర్తింపచెయ్యండి అని హైకోర్టుకు పోతే హైకోర్టు కూడ తన డ్యూటీ మర్చిపోయింది. తను ఎందుకోసం ఉందో హైకోర్టూ మర్చిపోయింది.

హైకోర్టు కేసు తీసుకున్న వెంటనే ఏం చెప్పాలి? చాలాసార్లు అన్నాం ఈ మాట – మీరూ అన్నారు, మేమూ మొదటినుంచీ అంటూనే ఉన్నాం – ఆ రోజు కూంబింగ్‌కు పోయిన పోలీసులు ఎవరు? వాళ్ళ పేర్లను బయటపెట్టాలి అని హైకోర్టు ఆదేశించాలి అని అడిగాం. ఆ పని హైకోర్టు చెయ్యలేదు. వాళ్ళ పేర్లు ఎవరికి తెలుస్తాయి? మనకు తెలియదు. బాధితురాళ్ళకూ తెలియదు కదా. మరి తెలిసింది ఎవరికి? పోలీసులకే కదా. పోలీసులకు హైకోర్టు ఆదేశం ఇచ్చి వాళ్ళ పేర్లు బయట పెట్టు, ఎఫ్.ఐ.ఆర్ లో వాళ్ల పేర్లు రాయి, రిమాండ్‌కు పంపు అనొచ్చు కదా! వేరే ఎవరైనా రేప్ చేసినా, మర్డర్ చేసినా, నేరం చేసినా ఏం జరుగుతుంది? అరెస్టు చేస్తారు, రిమాండ్ చేస్తారు. ఆ పనే చెయ్యాలి మీరు అని హైకోర్టు పోలీసు ఎస్.పిని గానీ, గ్రేహౌండ్స్ ఎస్.పిని గానీ ఆదేశించవలసి ఉండింది. కాని ఆ పని హైకోర్టు చెయ్యలేదు. వెంటనే బాధితురాళ్ళ వాంగ్మూలాలు నమోదు చెయ్యి అని ఆదేశం ఇయ్యవలసి ఉండింది. ఆ పనీ హైకోర్టు చెయ్యలేదు. మొట్టమొదట జరగవలసింది ఒక ఫిర్యాదు చేసినప్పుడు – ఫిర్యాదు చేసినవాళ్ళ, సాక్షుల, బాధితుల వాంగ్మూలాలన్నీ నమోదు చెయ్యాలి. వాళ్ళు విషయం మర్చిపోయే లోపల, వాళ్ళు భయపడిపోయే లోపల, వాళ్ళు బెదిరిపోయే లోపల, వాళ్ళను బెదిరించే లోపల, వాళ్ళను ఇంకొక రకంగా నోరు మూయించే లోపల త్వర త్వరగా వాళ్ళ వాంగ్మూలాలు నమోదు చెయ్యాలి. కాని పోలీసులు చెయ్యలేదు. ఆ పని చెయ్యమనే ఆదేశం హైకోర్టూ ఇవ్వలేదు.

హైకోర్టు ఏం చేస్తూ వచ్చిందంటే వీళ్ళ ఫిర్యాదు నిజమా కాదా అని తాను పరిశీలించడం మొదలుబెట్టింది. తన డ్యూటీ అది కాదు. విచిత్రంగా బాధితురాళ్లు దోషులయి కూర్చున్నారు. దోషులు స్వేచ్ఛగా ఉన్నారు. నేరం చేసినోడు స్వేచ్ఛగా ఉన్నాడు. నేరానికి గురయిన వాళ్ళు దోషులయ్యారు. నిజమైన ఫిర్యాదా, అబద్ధమైన ఫిర్యాదా అని పరిశీలిస్తున్నారు. అన్ని ఫిర్యాదులూ అట్లే చేస్తారా? ఆదివాసుల మీద అడవిలో చెట్లు నరికారని కేసు పెడతారు. పోడు కొట్టారని కేసు పెడతారు. దోషులు ఆదివాసులా, ఫారెస్టు వాళ్ళా? ఆదివాసులే అవుతారు కాని ఫారెస్టు వాళ్ళు కారు కదా. ఫారెస్టు వాళ్ళు సక్రమంగా కేసు పెట్టారా అని పరిశోధన చేస్తారా ఎవరైనా? ఆ ఆదివాసుల మీదే కేసు పెడతారు. జైలుకు పంపిస్తారు. నేర విచారణ ఏదో జరుగుతుంది. సరిగ్గా చేశారా లేదా అనేది కోర్టు నిర్ణయం చేస్తుంది. ఇదీ ఎక్కడైనా జరిగేది.

కాని మొదలు పెట్టడం పెట్టడమే ఇచ్చిన ఫిర్యాదు రైటా కాదా అనేది కోర్టు పరిశీలన చేయడం చాలా అన్యాయమైన వైఖరి. పదే పదే అంటూ వచ్చాం - ఆదివాసులు కాకపోతే, ఆదివాసీ మహిళలు కాకపోతే ఇలా జరిగేది కాదని. వేరే ఎవ్వరయినా ఈ రకమైనటువంటి ఫిర్యాదు చేస్తే సీరియస్‌గా తీసుకునే వాళ్ళు. అరెస్టులు చేసేవాళ్ళు. కేసు పెట్టేవాళ్ళు. నేర విచారణ జరిగేది. ఇంత నిర్లక్ష్యం, ఇంత లోకువ ఎందుకూ అంటే ఆదివాసులు కాబట్టి. ఆదివాసీ మహిళలు కాబట్టి. ఏజెన్సీలో బతికే అమాయకులు కాబట్టి. ఆ లోకువ, నిర్లక్ష్యం ఎస్.ఐకు ఉంటే దుర్మార్గుడు అనుకుంటాం. పోలీసు వ్యవస్థ సంస్కృతే అట్లా ఉంది అనుకుంటాం. ఇతర అధికారులకు ఉంటే పాలనా వ్యవస్థ సంస్కృతి అట్లా ఉంది అనుకుంటాం. న్యాయస్థానం వైఖరే అట్లా ఉంటే ఏం చేయాలి? రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ వైఖరీ అదే రకంగా ఉంటే ఏం చేయాలి? అప్పుడు ఏమనుకోవాలి? మొత్తం సమాజమే ఇట్లా ఉందని అనుకోవాలి. వాళ్ల దృష్టిలో మనుషులందరి విలువా ఒక్కటి కాదు. బాబాసాహెబ్ అంబేద్కర్‌కు పూలమాల వేశాం ఇప్పుడే. ఆయన పదే పదే అన్నాడు - మనుషులందరికీ ఒకే విలువ ఉండే సమాజం కావాలి మనకు అని. అందరికీ తిండి కావాలి, అందరికీ బట్టలు కావాలి, అందరికీ పనులు కావాలి - అవన్నీ జరగాలంటే వాటి మూలం అందరికీ ఒకే విలువ ఇవ్వడంలో ఉంది అన్నాడు. అందరికీ ఒకే విలువ ఉండే సమాజం కావాలి అని ఆయన కోరుకున్నాడు. అందుకోసమే రాజ్యాంగం రాశాను అన్నాడు ఆయన. రాజ్యాంగంలో కోర్టులు పెట్టాం, ఎన్నికలు పెట్టాం, పార్లమెంటు, అసెంబ్లీ ఇవన్నీ ఎందుకోసం పెట్టాము అంటే అందరికీ ఒకే విలువ ఉండే సమాజం

రావడం కోసం అన్నాడు. అది ఇప్పటికీ రాలేదు. దరిదాపుల్లోకి కూడ రాలేదు అనడానికి ఈ వాకపల్లి అత్యాచారం ఉదంతం చాలా ఘోరమైన, బాధాకరమైనటువంటి ఉదాహరణ.

చివరకి హైకోర్టు ఏం చేసింది? ఇక్కడ ఎస్.సి., ఎస్.టి. చట్టం తెలిసిన వాళ్ళు చాలామంది ఉన్నారు. మీకు తెలుసు, ఆ చట్టం కింద నమోదు అయిన నేరంలో నేర పరిశోధన, ఇతర చర్యలు ఏవైతే చేపట్టాలో అవి సక్రమంగా చేపట్టని అధికారి కూడ నేరస్తుడే అని ఉందని. వేరే ఏ చట్టంలో అట్లా లేదు. చట్టంలో, రాజ్యాంగంలో ప్రభుత్వ ఉద్యోగి తన డ్యూటీ చేయకపోతే నేరం కాదు. చేస్తే చేస్తాడు లేకపోతే లేదు. అయినా జీతం వస్తూనే ఉంటుంది. ఒక్క ఎస్.సి., ఎస్.టి. చట్టంలో మాత్రమే ప్రత్యేకంగా ఏమి రాశారు అంటే ఈ చట్టం కింద ఒక నేరం నమోదు అయితే ఆ నేరం విషయంలో ఎవరెవరు ఏమేమి చెయ్యాలో, ఎవరెవరు ఏమేమి పాత్ర నిర్వర్తించాలో, అది నిర్వర్తించకపోతే కూడ నేరమే; దానికి ఒక సంవత్సరం జైలు శిక్ష అని రాశారు. ఈ సంగతి హైకోర్టుకు తెలియదా? రాష్ట్ర మానవ హక్కుల కమీషన్‌కు తెలియదా? ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసిన తరవాత నేరపరిశోధన చెయ్యనటువంటి పోలీసు అధికారి దీని కింద నేరస్తుడే కదా? ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసిన తరవాత జీ.వో.3 ప్రకారం బాధితురాళ్ళకు నష్ట పరిహారం ఇవ్వనటువంటి ప్రభుత్వ అధికారులు – వాళ్ళూ నేరస్తులే కదా? గ్రేహౌండ్స్ దళం అక్కడకి పోయింది అని ఒప్పుకొంటూ కూడ వాళ్ళ పేర్లు బయట పెట్టనటువంటి గ్రేహౌండ్స్ ఎస్.పి – అతనూ నేరస్తుడే కదా? వీళ్ళందరూ నేరస్తులే. వీళ్ళమీద కూడ కేసు పెట్టండనే ఆదేశం హైకోర్టు ఇవ్వవలసి ఉండె. మరి ఎందుకు ఇవ్వలేదు హైకోర్టు? ఆ మాత్రం చట్టాలు తెలియని జడ్జీలేమీ లేరు. ఎవరికి వాటిని వర్తింపచేస్తారు, ఎవరికి వాటిని వర్తింపచేయరనేది నిర్ణయించుకుంటారు వాళ్ళు. ఎప్పుడు వర్తింపచేస్తారు, ఎప్పుడు వర్తింపచేయరో కూడ వాళ్ళు నిర్ణయించుకుంటారు. ఇది చాలా దురదృష్టకరం.

రాజకీయాలకు, ప్రభుత్వాల అవసరాలకు, ప్రభుత్వాలకు ఉండేటటువంటి ఒత్తిళ్ళకు అతీతంగా న్యాయవ్యవస్థ పని చెయ్యాలి. అప్పుడప్పుడు చేస్తుంది. అందుకే ఇంకొద్దిగా గౌరవం మిగిలి ఉంది. అప్పుడప్పుడు ప్రభుత్వానికి ఇబ్బందయిన తీర్పులు ఇస్తూ ఉంటారు. అందుకే ఆ గౌరవం ఇంకా మిగిలి ఉంది. కానీ ఇక్కడకొచ్చేసరికి ప్రభుత్వ యంత్రాంగం దగ్గర మొదలు పెట్టి న్యాయవ్యవస్థదాకా అందరికీ ఒకే ఒక ఆలోచన. గ్రేహౌండ్స్ పోలీసులను అరెస్టు చేస్తే, వాళ్ల మనోస్థైర్యం దెబ్బతింటే –

నక్సలైట్ల మీద పోలీసులు చేస్తున్న యుద్ధం, ప్రభుత్వం చేస్తున్న యుద్ధం ఆగిపోతుందేమో, దెబ్బ తింటుందేమో అని. కాని దానికీ, వాకపల్లి కేసుకు ఏమి సంబంధం? ఆ భయాన్నో, ఆ ఆందోళననో, ఆ శంకనో అడ్డం పెట్టుకొని పదకొండు మంది స్త్రీలు తమ పైన అత్యాచారం జరిగిందని చెపుతుంటే నేరపరిశోధన జరిపించము, జరపము అంటే అది ఏ రకంగా న్యాయం అవుతుంది ? నీ పోరాటం నువ్వు చేసుకో నక్సలైట్ల మీద. సరయినటువంటి పద్ధతుల ద్వారా, క్రమశిక్షణ కలిగినటువంటి పోలీసు యంత్రాంగం ద్వారా, ప్రజలను అత్యాచారాలకు, హింసకు గురి చేయని పోలీసు యంత్రాంగం ద్వారా ఆ పని చెయ్యి. ఎవ్వరూ కాదనరు. కానీ దానికోసం ఒక రౌడీ మూకను తయారుచేసి – వాళ్ళు ప్రజలను హింసించినా, వేధించినా, అత్యాచారాలు చేసినా కేసు పెట్టము, విచారణ జరపము – ఆ పని చేస్తే వాళ్ళ మనోస్థైర్యం దెబ్బతింటే తీవ్రవాదానికి వ్యతిరేకంగా చేస్తున్న మహత్తర కార్యక్రమం దెబ్బతింటుందీ అనంటే మరి ప్రజలు దీంట్లో పావులా? ప్రజలేమన్నా గొర్రెలు, మేకలా? బలి పశువులా? చాలా అన్యాయమైన వైఖరి ఇది. ప్రభుత్వానికుంటే ఏమో అనుకోవచ్చు, న్యాయస్థానానికి కూడ ఇదే వైఖరి ఉంటే ఏమనుకోవాలి?

మేము చాలా కేసులు వేస్తుంటాం కోర్టులో. న్యాయస్థానాన్ని మేము ఏవేవో అభ్యర్థిస్తాం – అవన్నీ మమ్మల్ని అడగవద్దు, ఒకటే అడగండి మమ్మల్ని. చట్టం ఏమిటో చెప్పండి. ఆ చట్టాన్ని అమలు చేయమని ఆదేశాలు ఇస్తాం – అంటారు. వేరే విషయాలు మా దగ్గరికి తీసుకురావద్దు అంటారు. ప్రజల తరఫున అడుగుతాము అప్పుడప్పుడు. ఏమని? అయ్యా! చట్టం పరిధికే పరిమితం కావద్దు మీరు, చట్టాన్ని దాటిపోయి చూడండి, ప్రజల కష్టాలు చూసి కొంచెం అధికంగా ఒక ఉత్తర్వు ఇవ్వండి అని కోర్టును అడిగితే మా న్యాయమూర్తులు ఏమంటారు? మాకు అవన్నీ చెప్పొద్దు మీరు; మీ కష్టాలు, మీ సమస్యలు మాకనవసరం. మాకు చట్టం ఒకటే కావాలి. చట్టం అమలు చేయించడం ఒక్కటే మా డ్యూటీ అని మాకు చెప్తారు. మరి ప్రభుత్వానికి ఆ మాట చెప్పలేకపోయారే వాళ్లు? ఎందుకు చెప్పలేకపోయారు ? ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసి వాళ్ళను అరెస్టు చెయ్యి, పేర్లు బయట పెట్టు, చార్జిషీటు వెయ్యి, నేరపరిశోధన విశాఖపట్నంలో ఉండే ఎస్.సి., ఎస్.టి. ప్రత్యేక కోర్టు చేస్తుంది అని ఎందుకు హైకోర్టు ఆదేశం ఇవ్వలేకపోయింది? చాలా అన్యాయమైనటువంటి వైఖరి ఇది.

చివరకు సిబిసిఐడిని నేరపరిశోధన చేసి రెండు వారాలలో నివేదిక ఇవ్వమన్నారంట. చాలా ఆశ్చర్యమనిపించింది నాకు దాన్ని చూసినప్పుడు. రెండు

వారాలలో ఎట్లా ముగిస్తారు వాళ్ళు? అంటే మీ అభిప్రాయం ఏమిటి? ఏదో ఒక రిపోర్టు ఫైల్ చెయ్యమనా? వాళ్ళు ఆ ప్రకారమే నివేదిక ఇచ్చారు. సిబిసిఐడి నేరపరిశోధన ఎట్లా సాగిందంటే నేరం చేసిన వాడి మీద కాదు, ఫిర్యాదుదారుల మీద పరిశోధన చేశారు. 'మొదట్లో ఏం చెప్పారు – గుర్తు పట్టగలం అన్నారు. తరవాత ఏం చెప్పారు – గుర్తుపట్టలేం అన్నారు' అని సిబిసిఐడి నెపం వాళ్ల మీదే పెట్టింది. అవును కాలం గడిచింది. జరిగిన తెల్లవారి ముఖాలు జ్ఞాపకం ఉండి గుర్తు పడతామని ధైర్యంగా అన్నారు. మూడు నెలలు కావస్తుంది, ఏమో గుర్తుపట్టలేమేమో అనడం తప్పా! అయినా ఇదంతా ఎందుకు? వాళ్ళను ప్రవేశపెట్టండి. గుర్తు పట్టగలరో లేదో తేలిపోతుంది కదా. ఈ మీమాంస ఎందుకు? వాళ్ళ పేర్లు చివరకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి నాగిరెడ్డిగారు తన నివేదికలో బయటపెట్టారు. ఆ రోజు కూంబింగ్‌కు పోయినటువంటి ఆ గ్రేహౌండ్స్ సిబ్బంది ఎవరు అని ఆయనే తెలియజేశారు. వాళ్ళను తీసుకొచ్చి ఈ పదకొండు మంది స్త్రీల ముందు ప్రవేశపెట్టి గుర్తు పడతారా లేదా అని అడిగి చూడొచ్చుగా! వాళ్ళు చెప్పే వాళ్ళు కదా. గుర్తుపడతారో లేదో తేలిపోయేది అక్కడే. ఆ పని చేయకుండా, మొదటేమో గుర్తుపడతామూ అన్నారు, ఇప్పుడేమో గుర్తుపట్టలేమూ అంటున్నారు కాబట్టి మాకు అనుమానంగా ఉంది అన్నారు. వెంటనే తేలిపోయే విషయానికి ఈ తర్కమెందుకు? ఇందులో మీమాంస ఏముంది?

అక్కడ పడి ఉన్న గాజులు ఆమె సైజువి కాదు అని అనడమేమిటి? అయినా నువ్వు ఎప్పుడు చూశావు ఆ గాజులను – రెండున్నర నెలల తరువాత. కృత్రిమంగా అక్కడ గాజులు పగలగొట్టి వేసే ఉద్దేశ్యం ఉన్నవాళ్ళు ఆమె నిజమైన గాజులే వెయ్యగలరు కదా! చిన్నగాజులు తెచ్చి వేస్తారా కృత్రిమంగా వెయ్యదల్చుకుంటే! చిన్న గాజులు ఎవరు వేసి ఉండవచ్చును? ఫిర్యాదు తప్పు అని రుజువు చేసే ఉద్దేశ్యం ఉన్నవాళ్ళు వేసి ఉండవచ్చును కదా. నీకు ఆ అనుమానం ఎందుకు రాలేదు? బాధితుల మీద అనుమానం ఎందుకు వచ్చింది ? ఎందుకంటే వారు దర్యాప్తు చేస్తున్నది దోషులను కాదు, ఫిర్యాదిని. చాలా విచిత్రంగా ఉంది. ఒక ఫిర్యాదు వచ్చినప్పుడు నేర పరిశోధన జరగాల్సింది దోషి పైన, ఫిర్యాదిపైన కాదు. కాని సిబిసిఐడి ఫిర్యాదిపైన దర్యాప్తు చేస్తూ ఉంది, దోషి పైన కాదు. ఈ రెండు వాక్యాలు చెప్పి నాగిరెడ్డిగారు తన నివేదికలో నేరం జరిగినట్టే భావిస్తున్నాను అనడానికి ఒక ఆధారం చెప్పారు. "ఒక చిన్నబ్బాయి చెప్పాడు నేను చూశాను అని", "11, 12 ఏళ్ళ పసిబాలుడు అబద్ధం చెప్తాడు అని నేను అనుకోవడం లేదు కాబట్టి జరిగిందని నేను అనుకుంటున్నాను"

అని నాగిరెడ్డిగారు అన్నారు. కాని సిబిసిఐడికి మాత్రం ఆ మాట తోచలేదు. హైకోర్టుకూ తోచలేదు. హైకోర్టు దగ్గర రెండు రిపోర్టులు ఉన్నాయి. సిబిసిఐడి రిపోర్టూ ఉంది. గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి నాగిరెడ్డిగారి నివేదికా ఉంది. అయినా హైకోర్టు మాకేమీ అర్థం కావడం లేదు అంది. అర్థం కాకపోతే ఏం చెయ్యాలి అది? చిన్న విషయం ఇది. చిన్న తర్కమే ఇది. దీనికి లోతయిన ఆలోచనేమీ అక్కర్లేదు, రాజ్యాంగం చదవనక్కర్లేదు, మనం అంబేద్కర్లం కానక్కరలేదు.

సిబిసిఐడి వాళ్ళు ఏమీ జరగలేదు అన్నారు. ఫిర్యాదీదారులు జరిగింది అన్నారు. కోర్టు నాకు అర్థం కాలేదు అంది. మూసేస్తారా కేసు? సిబిసిఐడి కంటే, ఇంకా నిష్పక్షపాతంగా నేరపరిశోధన చెయ్యగల సంస్థకు అప్పగించి నువ్వు పరిశోధన చెయ్యి అని చెప్పాలి. ఆ ఆలోచన ఎందుకు రాదు న్యాయస్థానానికి ? చాలా అన్యాయమైనటువంటి వైఖరి న్యాయస్థానం ప్రదర్శించింది. కోర్టుకే పోకపోతే ఎట్లా ఉండేదో అట్లా ఉంది ఇవ్వాళ ఇంత కష్టపడి కోర్టుకు పోయి కేసు వేసినా. తొలినాటి నుండి, అంటే కేసు వేసిన రోజు నుండీ ఫిర్యాదీదారులే ముద్దాయిలు అయినట్టుగా, వాళ్ళే దోషులయినట్టుగా కోర్టులో విచారణ జరిగింది. మీ ఫిర్యాదు న్యాయమా కాదా, నిజమా కాదా మేము తేలుస్తాం..... కాదో అవునో చెప్పలేక పోతున్నాం కాబట్టి మూసేస్తాం కేసు అనే వైఖరి కోర్టులు ప్రదర్శించడం వల్ల ఇవ్వాళ మళ్ళీ మొదటికొచ్చింది కేసు.

హైకోర్టు చిన్న ఆదేశం ఇచ్చి ఉండాల్సింది – నేరపరిశోధన జరపండి, రిపోర్టు ఫైల్ చెయ్యండి అని. ఒకవేళ పోలీసులు గానీ, సిబిసిఐడి గానీ ఫిర్యాదు అవాస్తవం అంటే ఆ కాపీలు బాధితురాళ్ళకు ఇవ్వండి. వాళ్ళు దాని మీద – చట్టం పరిభాషలో– ప్రొటెస్ట్ పిటిషన్ వేసుకుంటారు. లాయర్‌ను పెట్టుకుంటారు, కేసు నడుపుకుంటారు. ఇది మామూలుగా జరిగేది. చివరకు మనం అక్కడికే వచ్చాం. మిత్రులు అడుగుతున్నారు ఏముంది ఇంకా, ఏం చెయ్యాలి అని.

సరే సి.బి.ఐ పరిశోధన కావాలి అని అడిగాము. హైకోర్టు ఆ ఆదేశం ఇవ్వలేదు కాని, ఇవ్వకపోయినా ప్రభుత్వం ఆ పని ఇప్పటికీ చేయవచ్చు. ప్రతిపక్ష పార్టీలు వరికి మద్దతు ధర కావాలని, ఇంకొకటని, మరొకటని ఏ స్థాయిలో ఆందోళన చేస్తున్నాయో – అవన్నీ అనవసరమని నేను అనడం లేదు – ఆ స్థాయిలోనే ఈ పదకొండు మంది ఆదివాసీ మహిళల ఫిర్యాదు, తమ పైన అత్యాచారం జరిగింది

అన్న ఫిర్యాదు మీద కూడ జరగాలి. దీని పైన రాష్ట్ర ప్రభుత్వమే ఎందుకంటే హైకోర్టు తేల్చలేకుండా ఉన్నానని చెప్పింది కాబట్టి – కేంద్రానికి లెటర్ రాసి సిబిఐ చేత దర్యాప్తు జరిపించాలి. ప్రతిపక్ష పార్టీలన్నీ ముందుకొచ్చి ఆదివాసీ ఐక్యవేదిక, ఇతర సంఘాలు, హక్కుల సంఘాలు అందరితోనూ కలిసి ఈ డిమాండు పెట్టి, ఒత్తిడి పెట్టి సిబిఐ దర్యాప్తు జరిగేలా చేయాలి.

అదొక రాజకీయ ఉద్యమంగా మనం కొనసాగించాలి. చేద్దాం. అసాధ్యమేమీ కాదు. పశ్చిమ బెంగాల్‌లో హైకోర్టు నందిగ్రామ్ కాల్పులకు సంబంధించి ఈ ఆదేశం ఇచ్చింది. అది ఇవ్వకపోయినా కేంద్రప్రభుత్వం ఇవ్వడానికి రెడీగా ఉంది. ఆ నిర్ణయం రాజకీయంగా కూడ తీసుకోవచ్చును కాబట్టి, ముఖ్యంగా హైకోర్టు ఎటూ తేల్చలేను అని చెప్పి మూసేసింది కాబట్టి మనం ఆ ఉద్యమం చేద్దాము. ఒకవైపు ఆ ప్రయత్నం చేద్దాము. ఇంకొకవైపు మామూలుగా అందుబాటులో ఉండే ఒక మార్గం బాధితురాళ్ళే ముందుకు వచ్చి వాళ్ళలో ఒక్కరు ప్రైవేట్ కంప్లెయింట్ వేసి దీనిని కొనసాగించడం. ఎట్లాగూ సిబిసిఐడి వాళ్ళ రిపోర్టు ఒకటుంది ఇప్పుడు. దానిని హైకోర్టు చూసిన తరవాత మొబైల్ మేజిస్ట్రేట్ చట్ట ప్రకారం అయితే, వారు దానిని మీ పాడేరు మొబైల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఫైల్ చేయాలి. వారికి ఈ చట్టం తెలియకపోతే నేనేమీ చెయ్యలేను. అట్లే అనాల్సి వస్తుంది. హైకోర్టుకే తెలియకపోతే ఇక మేజిస్ట్రేట్‌కు తెలియకపోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. చట్ట ప్రకారం అయితే వారు ఫిర్యాదికి అంటే ఎ.పి గిరిజన సంఘానికి కాపీ పంపించాలి. వారు తీసుకొచ్చి మీకు ఇస్తారనే అనుకుంటున్నాను. దాని మీద అంటే సిబిసిఐడి నివేదిక మీద మన అభ్యంతరాలు తెలియచేస్తూ వివరంగా పదకొండు మంది స్త్రీల వాంగ్మూలాలను జతచేసి మేజిస్ట్రేట్ కోర్టులో ఫైల్ చేసి, ప్రైవేట్ కేసుగా దాన్ని కొనసాగించవచ్చు. విడిగా అయినా మనం ప్రైవేటు కేసు వేసుకోవచ్చు. ఆ నిర్ణయం గాని మీరు తీసుకుంటే మేము మానవహక్కుల వేదిక తరఫున, మా మిత్రులు పౌరహక్కుల సంఘం వారు, అందరం కలిసి సహాయం చేస్తాము. విశాఖపట్నంలో న్యాయవాదులు ఉన్నారు, నేనూ వస్తాను. ఇక్కడే కూర్చుందాము. వాంగ్మూలాలు తయారు చేసి, ఫిర్యాదు తయారుచేసి వేద్దాము, ప్రైవేటు కేసుగా కొనసాగిద్దాము.

మరొకవైపు సిబిఐ దర్యాప్తు కోసం ఆందోళన కొనసాగిద్దాం. ఎందుకంటే సిబిసిఐడి నివేదికను హైకోర్టు ఆమోదించలేదు కాబట్టి; ఆమోదించాను అని ఏమీ అనలేదు కాబట్టి; పక్కకు పెట్టింది కాబట్టి; ఆ ఆందోళన కొనసాగిద్దాము.

శంకరన్ గారి చేత ఎంక్వయిరీ చేయిస్తే బాగుండునని అడిగారు. శంకరన్ గారిని ఎవరూ అడిగినట్లు లేదు ఇప్పటిదాకా. నిజానికి ఆయన ఆరోగ్యం అసలు బాగాలేదు. అయినప్పటికీ ఒక మచ్చ లేనటువంటి, ప్రజలను ప్రేమించే అధికారిగా ఆయనకున్న గుర్తింపు, పేరు రీత్యా అదీ చేద్దాం. కానీ చట్టపరంగా శిక్షపడే విచారణ కాదు అది. శిక్ష పడాలి అంటే పోలీసులు దర్యాప్తు చెయ్యాలి లేదా బాధితులయినా సరే కోర్టులో కేసు వేసుకోవాలి. అదైతేనే శిక్షకు దారి తీస్తుంది. శంకరన్ గారు విచారణ జరిపి నివేదిక ఇచ్చినా, నాగిరెడ్డిగారి నివేదిక అయినా నిజంగా అన్యాయం జరిగిందనే అభిప్రాయం సమాజంలో కలిగించడానికి మాత్రమే ఉపయోగపడతాయి. వాళ్ళు పెద్దమనుషులు. నాగిరెడ్డి గారికి ఆఫీసరుగా మంచి పేరే ఉంది. శంకరన్ గారి స్థాయి కాదనుకోండి. శంకరన్ గారికి ఇంకా మంచి పేరుంది. ఆయనగాని ఒక పరిశోధన జరిపి వాస్తవాలను బయటకు తీసుకొస్తే సమాజంలో ఒక గుర్తింపు వస్తుంది. నిజంగానే అన్యాయం జరిగింది ఇక్కడ, వ్యవస్థ విఫలం అయ్యింది న్యాయం చెయ్యడంలో అనే విషయం తెలుస్తుంది. అంతవరకే అవి ఉపయోగపడతాయి. ఆ ఘోరానికి పాల్పడిన వాళ్ళకు, ఆ అత్యాచారానికి పాల్పడిన వాళ్ళకు శిక్ష పడాలి అంటే దానికి రెండే రెండు మార్గాలు. ఒకటి సిబిఐ దర్యాప్తు జరిపించాలి లేదా బాధితురాళ్ళు ప్రైవేటు కేసు వేసి కొనసాగించాలి. ఈ రెండూ కూడ మీరు తీసుకునే నిర్ణయాన్ని బట్టి, ఇక్కడున్నటువంటి ఆదివాసీ సంస్థలు, బాధితురాళ్ళు, వాకపల్లి గ్రామస్తుల నిర్ణయాన్ని బట్టి ఉంటుంది. మీరు నిర్ణయం తీసుకోండి, అందరం సహకరిస్తాము.

నయం కాగల రోగాల వల్ల మనుషులు వేల సంఖ్యలో చనిపోవడమనేది మీరు చూస్తూనే ఉన్నారు చాలా కాలంగా. మేము చాలా బాధపడుతున్నాం – ఏమీ చేయలేక నిస్సహాయంగా ఉండిపోతున్నాం. వాకపల్లి విషయంలో అట్లా కాకుండా చూద్దాం. పట్టుదలగా ఇక్కడదాకా ఉద్యమాన్ని తీసుకొచ్చారు అందరూ కలిసి. ప్రధానంగా ఇక్కడి ఆదివాసీ సంఘాలు, వాకపల్లి మహిళలు, వాకపల్లి గ్రామస్తులు, వారికి అండగా నిలబడినటువంటి ప్రజా సంఘాలు, మీడియా, పత్రికలు ఇక్కడ దాకా తీసుకొచ్చాయి. ఇక్కడ మనం వదిలేయకుండా ముందుకు తీసుకుపోయి, ప్రజా చైతన్యం వల్ల, సంకల్పం వల్ల, పట్టుదల వల్ల ప్రభుత్వ యంత్రాంగం నుంచి న్యాయవ్యవస్థ దాకా తమ విధి ఏమిటీ, తమ కర్తవ్యం ఏమిటీ అని అందరూ మర్చిపోయినా కూడ వాళ్ళచేత వాళ్ళ విధులు జ్ఞాపకం చేయించగలం, నిర్వర్తింప

చేయించగలం అనే సంకేతాన్ని ప్రభుత్వానికి పంపుదాం. ఇప్పటిదాకా చేస్తూ వచ్చింది వదిలేయకుండా దాన్ని ముందుకు తీసుకుపోదాము. కనీసం ఇక మీదటైనా సరే ఈ వ్యవస్థకు, ఈ వ్యవస్థలో అధికారం ఉండే వ్యక్తులకు, అధికారం చెలాయించే పెద్దమనుషులకు – న్యాయమూర్తులతో సహా – ఆషామాషీగా తీసి పారెయ్యడానికి వీలు లేదు వీళ్ళను, ఏం జరిగినా చెల్లుతుందిలే, ఏం చేసినా చెల్లుతుందిలే అనుకోనివ్వకూడదు. అసెంబ్లీలో చర్చలు తీసుకోండి, సెక్రటేరియట్లో, ప్రభుత్వ ఆఫీసుల్లో అధికారుల వైఖరి తీసుకోండి, కోర్టుల్లో న్యాయమూర్తుల వైఖరి తీసుకోండి – ఒకటే ధోరణి. బలవంతుల సమస్యలు, ధనవంతుల సమస్యలు వాళ్ళ దగ్గరకు వస్తే – అసెంబ్లీ కానివ్వండి, ప్రభుత్వ కార్యాలయాలు కానివ్వండి, కోర్టులు కానివ్వండి – చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తారు. కాదంటే ఏమవుతుంది? వీడికి బలముంది. వీడికి సంబంధాలు ఏవో ఉన్నాయి. వీడు ఒత్తిడి పెట్టగలడు, నా ఉద్యోగం పోతుందేమో, నన్ను ట్రాన్స్‌ఫర్ చేస్తారేమో అన్న భయం వాళ్ళలో ఉంటుంది. వాళ్ళు రచ్చ చేస్తారు, అల్లరి చేస్తారు, నేను నా డ్యూటీ సక్రమంగా చెయ్యలేదని చెప్పి నా మీద ఒక నల్లమచ్చ వచ్చేటట్టు చేస్తారేమో అన్న భయం ఉంటుంది. అటువంటి వాళ్ళ సమస్యలు వాళ్ళు పట్టించుకుంటారు. దీర్ఘంగా చర్చిస్తారు, నిర్ణయాలు తీసుకుంటారు. బలహీనవర్గాల విషయానికి వచ్చేటప్పటికి – మేము చూస్తూనే ఉంటాం, కోర్టులలో చూస్తాం, బయట కూడ చూస్తూనే ఉంటాం – రెండు నిమిషాలలో, మూడు నిమిషాలలో నిర్ణయాలు జరిగిపోతుంటాయి. ఏముందిలే, పర్వాలేదులే, దాటవేయవచ్చులే, పక్కకు పెట్టవచ్చులే, వాయిదా వెయ్యొచ్చులే. అట్లా సాగడానికి వీలులేదు అన్న ఒక భయం, ఒక హెచ్చరిక ఇప్పటి దాకా వాకపల్లి బాధితురాళ్ళు, వాళ్ళకు అండగా నిలబడ్డ ఉద్యమకారులు ఇస్తూ వచ్చారు. ఈ వరవడిని చివరదాకా తీసుకొని పోదాము. జరిగినటువంటి ఘోరం ఏమిటనేది బయటకు రావాలి. చేసిన వాళ్ళకు శిక్ష పడాలి. బాధితురాళ్ళకు న్యాయం జరగాలి. దాని కోసం మన ప్రయత్నం మనం చేద్దాం.

*పాడేరు బహిరంగ సభలో ఇచ్చిన ఉపన్యాసం, 18 నవంబర్ 2007*

*ముద్రణ : 'రాజ్యం – సంక్షేమం', (పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ)*

# రోగులకు సమాచార హక్కు

అందరమూ మన కారణంగానో, మనవారి కారణంగానో ప్రైవేట్ ఆస్పత్రుల బాధితులమే కాబట్టి రోగుల పట్ల ప్రైవేట్ ఆస్పత్రులకు ఉండే బాధ్యత గురించి సుప్రీంకోర్టు ఈ మధ్యనే ఇచ్చిన తీర్పు సారాంశాన్ని తెలుసుకోవడం ఉచితంగా ఉంటుంది.

సమీరా కోహ్లీ అనే స్త్రీ రుతుక్రమం సవ్యంగా లేదనీ, రక్తస్రావం అధికంగా అవుతున్నదనీ డాక్టర్ దగ్గరకు వెళ్లింది. ఆమెకప్పటికి 44 సంవత్సరాల వయస్సు. అప్పటివరకు అవివాహితగా ఉన్న ఆమెకు అప్పుడే పెళ్లి నిశ్చయమయింది. మరికొన్ని రోజులలో పెళ్లి కావలసి ఉంది. రోగనిర్ధారణ కోసం ఆపరేషన్ చేయవలసి ఉంటుందని చెప్పి 'లాపరోస్కోపీ, అవసరమైతే లాపరోటమీ' చేయడానికని ఆమె సమ్మతిని కాగితం మీద తీసుకొని ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. (నిజానికి తన సంతకం ఖాళీ ఫారం మీద తీసుకొని ఆ తరువాత పై నాలుగు ముక్కలు రాశారని ఆమె అంటుంది.) ఆమెకు మత్తుమందు ఇచ్చి (జనరల్ అనస్తీషియా) ఆపరేషన్ చేయసాగారు. 80 సంవత్సరాల వయసున్న సమీరా తల్లి బయట కూర్చొని ఉంది. అంతలో ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ గారి అసిస్టెంట్ వడివడిగా బయటికొచ్చి రక్తస్రావం ఎక్కువయిందనీ, గర్భ సంచినీ, ఇతర జననాంగాలను (ఓవరీస్, ఫాలోపియన్ ట్యూబ్స్) కూడ తొలగించాలనీ, దానికి సమ్మతి కావాలనీ తల్లి చేత సమ్మతి కాగితంపైన సంతకం తీసుకొనింది. ఆపరేషన్ పూర్తయి సమీరాకు తెలివి వచ్చిన తరువాత కూడ ఏం జరిగిందీ డాక్టర్ ఆమెకు చెప్పలేదు.

మూడు రోజుల తరువాత డాక్టర్ గారి కుమారుడు మాటల సందర్భంగా గర్భసంచి తీసేసిన విషయం ఆమెకు చెప్పాడు. నాకు చెప్పకుండా ఆ పని ఎందుకు చేశారని ఆమె ప్రశ్నించగా, 'ఇంత వయసొచ్చింది ఇంకా పిల్లల్ని ఏం కంటావు? నీకొచ్చిన నష్టమేమీ లేదు' అని అతను దురుసుగా సమాధానం చెప్పాడు. ఆమెకు కాబోయే భర్త మరుసటి రోజు ఆస్పత్రికి వచ్చి గొడవ పెట్టుకొని ఫీజు చెల్లించకుండా ఆమెను తీసుకువెళ్లిపోయాడు. ఆ తరువాత ఇరుపక్షాలూ ఒకరి మీద ఒకరు కేసులు వేసుకున్నారు. 39,325 రూపాయల ఫీజు చెల్లించాల్సి ఉందని (ఇది 1995లో జరిగిన కథ) డాక్టరు రోగి మీద సివిల్ కోర్టులో దావా వేయగా, చెప్పకుండా జననాంగాలను తొలగించినందుకు, ఆ తరువాత వచ్చిన అనారోగ్యం వల్ల అయిన ఖర్చుకు నష్టపరిహారం చెల్లించాలని రోగి వినియోగదారుల ఫోరంలో డాక్టర్ మీద కేసు వేసింది. డాక్టర్ తాను వేసిన దావాలో నెగ్గింది. సమీరా మాత్రం జిల్లా ఫోరం నుంచి జాతీయ ఫోరం దాకా ఓడిపోయి చివరికి సుప్రీంకోర్టులో అప్పీల్ వేసింది. సుప్రీంకోర్టు ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. డాక్టర్ ఫీజును రద్దు చేసి, రోగికైన 25,000 రూపాయల ఖర్చును కూడ డాక్టరే చెల్లించాలని ఆదేశించింది. ఈ తీర్పు ఇచ్చిన క్రమంలో జస్టిస్ ఆర్.వి. రవీంద్రన్ ప్రైవేట్ ఆస్పత్రుల రోగుల సమాచార హక్కుకు సంబంధించి కొన్ని ఉపయోగకరమైన సూత్రీకరణలు చేశారు.

ప్రైవేట్ ఆస్పత్రులు అందిస్తున్నది నైపుణ్యంతో కూడిన సేవే అయినప్పటికీ, ఆ రంగంలోనూ నిజాయితీగా వృత్తి నిర్వహించే వైద్యులు చాలామంది ఉన్నప్పటికీ, ఆ సంస్థలు ప్రధానంగా చేస్తున్నది వ్యాపారం అని జస్టిస్ రవీంద్రన్ గుర్తించారు. విద్యావ్యాపారాన్ని గురించి ఆ మాట అనడానికి సుప్రీంకోర్టు ఇప్పటికీ తటపటాయిస్తున్నందున ఇదొక ముందడుగేనని భావించాలి. ఈ ఆస్పత్రులు ఖరీదయిన రోగనిర్ధారణ ప్రక్రియలనూ, రోగాన్ని నయంచేసే ప్రక్రియలనూ అనవసరంగా రోగుల మీద రుద్దుతాయనీ, అనవసరమైన ఆపరేషన్లు పురమాయిస్తాయనీ ప్రజలలో ఉన్న అభిప్రాయాన్ని ఆయన ప్రస్తావిస్తూ, ఇదంతా లాభార్జన కోసమేనన్న అనుమానంతో ఆయన ఏకీభావాన్ని వ్యక్తం చేశారు. 'అమాయకత్వం అంటారేమోగానీ' దీనికి పరిష్కారం 'ప్రభుత్వమూ, ధర్మ (ఛారిటబుల్) సంస్థలూ వైద్యరంగంలో ఇతోధికమైన పాత్ర నిర్వహించడమే కాగలదు' అన్న అభిప్రాయం కూడ పనిలో పనిగా వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఈ వైద్య ప్రక్రియలకు లోనయ్యే రోగుల సమాచార హక్కు ఏమిటి అన్న ప్రశ్నను ఆయన అమెరికా, ఇంగ్లాండ్,

కెనడా దేశాల న్యాయవ్యవస్థల తీర్పులను ఉటంకిస్తూ వివరంగా చర్చించారు. వైద్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించినంత కాలం, రోగనిర్ధారణలోనూ రోగాన్ని నయం చేయగల ప్రక్రియల ఎంపికలోనూ వారు తగు విజ్ఞతతో వ్యవహరించినంత కాలం రోగులకు సమాచారం ఉందా లేదా, వారు సమాచారయుతమైన సమ్మతి ఇచ్చారా లేదా అన్న ప్రశ్న ఉత్పన్నం కాదన్న వాదనను ఆయన తిరస్కరించారు. మరింత నిర్దిష్టంగా – రోగనిర్ధారణకు అవసరమైన పరీక్షలకు రోగి సమ్మతి ఇచ్చినట్టయితే ఆ నిర్ధారణ ఆధారంగా వైద్యులు బాధ్యతాయుతంగా ఎంపిక చేసే ట్రీట్‌మెంట్‌కీ ఇచ్చినట్టేననీ, రోగాన్ని నయం చేయగల ఒక ప్రక్రియకు సమ్మతి ఇచ్చినట్టయితే దానికి అదనంగా లేక అనుబంధంగా వైద్యులు చేపట్టే వేరొక ప్రక్రియకూ ఇచ్చినట్టేననీ (కాబట్టి సమీరా కోహ్లీ లాపరోస్కోపీకీ, లాపరోటమీకీ సమ్మతి ఇచ్చింది కాబట్టి హిస్టరక్టమీకి కూడ ఇచ్చినట్టేననీ) ప్రతివాది చేసిన వాదనను జస్టిస్ రవీంద్రన్ తిరస్కరించారు.

'మనిషికి తన శరీరం మీద అనుల్లంఘనీయమైన హక్కు ఉంది' అన్న సూత్రాన్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడు డాక్టరు విజ్ఞతతోనూ బాధ్యతాయుతంగానూ వ్యవహరించారా లేదా అన్నదొక్కటే కాదు, రోగి సమ్మతి ఉందా లేదా అన్నది కూడ ముఖ్యమైన విషయమేనన్నారు. అమెరికాలో న్యాయస్థానాలు ఈ సమ్మతి 'సమాచారయుతమైనది'గా ఉండాలంటాయి (ఇన్ఫార్మ్డ్ కన్సెంట్). ఇంగ్లండ్‌లో న్యాయస్థానాలు అది 'నిజమైన సమ్మతి' (రియల్ కన్సెంట్) అయి ఉండాలంటాయి. 'సమాచారయుతమైన సమ్మతి అన్నప్పుడు రోగికి అమలు చేయబోతున్న వైద్య ప్రక్రియలోని ప్రయోజనాలు, సమస్యల గురించి తెలియజేయాలి; అంతేకాక ప్రత్యామ్నాయ వైద్య ప్రక్రియలలోని ప్రయోజనాలు, సమస్యల గురించి కూడ వివరించాలి; అసలు ఏ వైద్యమూ చేయించుకోని పక్షంలో పర్యవసానాల గురించి సైతం రోగులకు వైద్యులు సమగ్ర సమాచారం ఇవ్వాలి. 'నిజమైన సమ్మతి' ఇంత దూరం పోదు కాని, అర్థవంతంగా సమ్మతి ఇవ్వడానికి కావలసిన సమాచారమంతా రోగికి ఇవ్వాలంటుంది. ఇందులో మొదటిది (అంటే అమెరికా న్యాయస్థానాలు అనుసరించే ప్రమాణం) భారత్‌కు పనికి రాదనీ, దానిని అనుసరించినట్టయితే ఆ పేరు మీద వైద్యులు మరిన్ని పరీక్షలు వగైరా చేపట్టి మరింత ఫీజు వసూలు చేసే ప్రమాదం ఉందని జస్టిస్ రవీంద్రన్ అన్నారు. రెండవదే (అంటే ఇంగ్లండ్‌లోని న్యాయవ్యవస్థ అనుసరించే ప్రమాణం) ఇండియాకు తగినదన్నారు.

కానీ నిజానికి ఆయన సూచించిన ప్రమాణం రెండింటికీ మధ్యస్తంగా ఉంది. అదేమిటంటే;

(అ) వైద్యప్రక్రియ (ట్రీట్‌మెంట్) మొదలుపెట్టే ముందే వైద్యులు రోగి సమ్మతి పొందాలి. అది స్వచ్ఛందమైన సమ్మతి అయి ఉండాలి. అంటే సమ్మతి ఇచ్చే సామర్థ్యం రోగికి ఉండాలి. అందుకు తగిన సమాచారం (వైద్యప్రక్రియ స్వరూప స్వభావాల గురించి) రోగికి అందజెయ్యాలి.

(ఆ) తగిన సమాచారం అంటే ఆ ప్రక్రియకు ఆమోదం తెలుపాలా లేదా అన్న నిర్ణయం తీసుకోవడానికి సరిపోయే సమాచారం. అంటే ఆ ప్రక్రియ లక్ష్యం, స్వభావం, ఫలితాలు, ప్రభావాల గురించి చెప్పాలి. ప్రత్యామ్నాయాలేవైనా ఉంటే వాటి గురించి చెప్పాలి. ఉండగల రిస్క్ గురించి చెప్పాలి. నిరాకరిస్తే ఉండగల పర్యవసానాల గురించి చెప్పాలి. అయితే ఎప్పుడో చాలా అరుదుగా మాత్రమే సంభవించగల హాని గురించి చెప్పి రోగిని బెదరగొట్టనవసరం లేదు.

(ఇ) రోగ నిర్ధారణకు ఇచ్చే సమ్మతిని ట్రీట్‌మెంట్ ప్రక్రియకు ఇచ్చిన సమ్మతిగా భావించడానికి వీలు లేదు. ఒక ప్రక్రియకు ఇచ్చే సమ్మతిని వేరొక ప్రక్రియ అమలు చేయడానికి వాడుకోకూడదు. అదనపు ప్రక్రియకు గానీ అనుబంధ ప్రక్రియకు గానీ ఆమోదంగా తీసుకోకూడదు. ఆమోదం పొందని ప్రక్రియ రోగి మంచికోసమేననీ, దానిని వివరించడంలో సమయం వృథా అవుతుందనీ ఇత్యాది సాకులు చెప్పడానికి వీలు లేదు. దీనికి ఒకే ఒక్క మినహాయింపు– రోగి ప్రాణాన్ని గానీ ఆరోగ్యాన్ని గానీ కాపాడడానికి వెంటనే ఏమైనా చేయవలసిన పరిస్థితి ఉండడం. అప్పుడు మాత్రమే రోగి సమ్మతి కోసం ఆగనక్కర లేదు.

ఈ ప్రమాణాలను పాటించనట్టయితే రోగి సమ్మతి తీసుకోకుండా వైద్యం చేసినట్టేననీ, అప్పుడు ఏ హాని సంభవించినా, 'తగిన జాగ్రత్తలన్నీ తీసుకున్నాననీ, చిత్తశుద్ధితో నమ్మి నిజాయితీగా చేశాననీ వాదించినా', అది నిజమే అయినా, డాక్టరు నష్ట పరిహారం చెల్లించక తప్పదని జస్టిస్ రవీంద్రన్ అన్నారు. కోహ్లీ విషయంలో లాపరోస్కోపీకీ, అవసరమైతే లాపరోటమీకీ మాత్రమే ఆమె ఇచ్చిన సమ్మతి ఆధారంగా, ఆమె ఇంకా అనస్తీషియా మత్తులో ఉండగానే హిస్టరక్టమీ చేసి గర్భసంచితో పాటు

ఇతర జననాంగాలను కూడ తొలగించడం జరిగింది. పై ప్రమాణాల ప్రకారం అనామోదనీయమైన ఈ చర్యలన్నీ ఆమె ప్రాణానికి గానీ ఆరోగ్యానికి గానీ తక్షణ హాని ఏదీ లేకుండానే తీసుకున్నట్టు ఆయన నిర్ధారించారు.

ఈ తీర్పులోని ఒక అసంతృప్తికర అంశం ఏమిటంటే ఈ సూత్రీకరణ ప్రైవేట్ వైద్య సంస్థలకు మాత్రమే వర్తిస్తుందనడం. ప్రభుత్వ ఆస్పత్రులకూ, ధర్మ (ఛారిటబుల్) ఆస్పత్రులకూ వెళ్లే రోగులకు ప్రత్యామ్నాయాల గురించి చెప్పినా వాటిని అనుసరించే స్థోమత ఉండదు కాబట్టి వారి విషయంలో సమ్మతి అనే భావనకు అర్థం లేదని జస్టిస్ రవీంద్రన్ అన్నారు. వారికి వైద్యులు ఏం చేసినా అదే మహాభాగ్యం అన్నారు. ఇది అన్యాయం అనడంలో సందేహం అక్కరలేదు. ఆరోగ్యం కేవలం కలవారి హక్కు కాదు. అది అందరిదీ కాబట్టి ఏ ఆస్పత్రి అయినా, ఏ వైద్యులయినా రోగి సమాచార హక్కును గౌరవించవలసిందే.

*ఆంధ్రజ్యోతి దినపత్రిక*
*16 జూలై 2008*

# భావజాల శృంఖలాలలో న్యాయవ్యవస్థ

రెండు దశాబ్దాల కింద కేరళ రాష్ట్రం నుంచి ఒక కేసు సుప్రీంకోర్టుకు వెళ్లింది. వేసినవారు ముగ్గురు విద్యార్థులు. వాళ్ల స్కూలు వాళ్లను బర్తరఫ్ చేసిందని వాళ్లు కోర్టుకు వెళ్లారు. ఎందుకు బర్తరఫ్ చేసిందంటే వాళ్లు జాతీయ గీతం ఆలపించడానికి నిరాకరించారని. ఎందుకు నిరాకరించారంటే దేశభక్తి అనేది కొరవడటం వల్ల కాదు. వాళ్లు ఆచరించే క్రైస్తవ మతశాఖ దేవుడిని తప్ప మరెవరినీ స్తోత్రం చేయవద్దని చెప్తుందట. అందువల్ల ఈ పిల్లలు స్కూలులో 'ప్రెయర్' జరిగే సమయంలో అందరితో బాటు లేచి నిలబడతారు, వినయంగా తలదించుకుంటారు కానీ 'జనగణమన' మాత్రం పాడరు. అది దేశభక్తికీ స్కూలు నియమాలకూ విరుద్ధం అని చెప్పి వారి స్కూలు యాజమాన్యం వారిని ఇంటికి పంపించింది. వారు కోర్టుకెక్కగా కేరళ హైకోర్టు స్కూలు యాజమాన్యం చర్యను సమర్థించింది. విద్యార్థులు సుప్రీంకోర్టుకు వెళ్లారు. తమకు దేశమన్నా దేశ అధికారిక చిహ్నాలన్నా ఎంత మాత్రం అగౌరవం లేదనీ, అయితే తాము నమ్మే క్రైస్తవ మత శాఖ వేరెవరినీ స్తోత్రించడం ఒప్పుకొనదనీ, కాబట్టి జాతీయగీతం పాడకుండా ఉండే స్వేచ్ఛ తమకు ఉందని వాదించారు.

సుప్రీంకోర్టు వారి వాదనను సమర్థించింది. 'వారిది వికారమైన చేష్ట కాదు, మనస్ఫూర్తిగా నమ్మే విశ్వాసం' అనీ, 'ఒకని విశ్వాసం మనకు వింతగా తోచవచ్చు. కానీ అది నిజాయితీగా నమ్మేదయితే ఆ స్వేచ్ఛను గౌరవించాలి' అని జస్టిస్ చిన్నపరెడ్డి అన్నారు. సహ విద్యార్థులు జాతీయగీతం ఆలపించేటప్పుడు వారు

గౌరవంగా నిలబడుతున్నారే తప్ప అగౌరవం ప్రదర్శించడం లేదనీ, అటువంటప్పుడు తమ మత విశ్వాసాల కారణంగా తాము దాన్ని ఆలపించకుండ ఉండడాన్ని రాజ్యాంగం ఆమోదించిన మతస్వేచ్ఛగా గుర్తించాలని అన్నారు. 'మౌనంగా ఉండడం కూడ భావవ్యక్తీకరణ స్వేచ్ఛలో భాగమే'నన్నారు. 'మన రాజ్యాంగం సహనాన్ని ఆదేశిస్తుంది. దానిని నీరుగార్చవద్దు' అన్నారు.

ఇవాళ చాలా దూరం వచ్చాము. జాతీయ గీతం ఆలపించకపోవటం కాదు, విద్యార్థులంతా నున్నగా గడ్డం చేసుకోవాలని చెప్పే నియమాన్ని అతిక్రమించినందుకు సీటు రద్దు చేసి ఇంటికి పంపించిన చర్యను కూడ సుప్రీంకోర్టు సమర్థించింది. ఆ విద్యార్థి ముస్లిం అనీ గడ్డం పెంచుకోవడం అతని మతాచారంలో భాగమనీ విద్యాలయ నియమాల పేరిట రాజ్యాంగం ఇచ్చిన మత స్వేచ్ఛను నిరాకరించడానికి వీలు లేదనీ అతని తరపున న్యాయవాది అనగా, 'లౌకికవాదాన్ని మరీ దూరం తీసుకుపోవద్దు' అని జస్టిస్ మార్కండేయ కట్జూ అన్నారు. పైగా ఆ న్యాయవాదితో 'నువ్వు కూడ ముస్లింవే. కాని నీకు గడ్డం లేదు కదా' అని చమత్కరించారంట. ఇరవై ఏళ్ల నాడు సుప్రీంకోర్టు గుర్తించినట్టు ఇక్కడ మత స్వేచ్ఛే కాదు, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛా ఉంది. ఒక విద్యార్థి ముస్లిం కాకపోయినా, తన ఇష్టం కారణంగా గడ్డం పెంచుకోవచ్చు. విద్యార్థులు శుభ్రంగా ఉండాలని (సహ విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా) నియమం పెట్టే అధికారం యాజమాన్యానికి ఉండగలదు గానీ, గడ్డం పెంచుకోవచ్చా, అమ్మాయిలు బొట్టు పెట్టుకోవచ్చా, కుర్రవాళ్లు క్రాపు చేసుకోకుండ పగిడీ పెట్టుకోవచ్చా వగైరా నియమాలు పెట్టే అధికారం ఏ విద్యాలయం యాజమాన్యానికయినా ఎందుకు ఉండాలి? ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే జస్టిస్ మార్కండేయ కట్జూ కొంచెం చదువుకున్న వ్యక్తి. మామూలుగా న్యాయమూర్తుల చదువు వారి వృత్తిసంబంధమైన అధ్యయనం దగ్గర ఆగిపోతుంది. అది తరచుగా కోర్టులిచ్చే తీర్పుల మీద దుష్ప్రభావం వేస్తుంది. (భారీ ప్రాజెక్టుల వల్ల కలిగే విస్థాపన మీద జరుగుతున్న చర్చ గురించి ఏమీ తెలుసుకోకుండ సర్దార్ సరోవర్ కేసులో అప్పటి దేశ ప్రధాన న్యాయమూర్తి భాక్రానంగల్ నుంచి నాగార్జునసాగర్ దాకా పెద్ద డ్యాంల నిర్వాసితులంతా ముంపు ముందుకంటే తర్వాతే బాగున్నారని ప్రకటించడం న్యాయ వ్యవస్థలోని ఈ వెలితి గురించి తెలియని వాళ్లను మాత్రమే ఆశ్చర్యపరిచింది.) జస్టిస్ కట్జూ అందుకు కొంత మినహాయింపు. ఆయన స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం మొదలయిన

విషయాల మీద జడ్జిగా కాకుండ విశ్లేషకుడిగా తరచుగా మాట్లాడుతుంటాడు, రాస్తుంటాడు. ప్రజాస్వామ్య స్ఫూర్తినే వ్యక్తం చేస్తుంటాడు.

ఇక్కడ నిజానికి రెండు సమస్యలున్నాయి. ప్రజాస్వామ్యాన్ని గొప్పగా శ్లాఘించడం, మనది ప్రజాస్వామ్య దేశమని గర్వించడం (ముఖ్యంగా ఎన్నికలప్పుడు) ఎంతగా పెరిగిందో దాని వ్యక్తీకరణ పట్ల అసహనమూ అంత పెరిగింది. ఎన్నికలప్పుడు ఒక నెలరోజుల పాటు దేశంలోని ప్రతీ ప్రముఖుడి, ప్రముఖురాలి చేతి వేలి మీది ఇంకుచుక్కను టీవీలోనూ పత్రికలలోనూ వెగటు పుట్టేంతగా మనకు చూపిస్తారు. ఇది గొప్ప 'విజువల్' అని మీడియాకు ఎవరు చెప్పారో తెలీదుగానీ ఈ ప్రదర్శన సార్వజనీనం అయింది. అయితే వోటు వేసి వేలికి ఇంకుచుక్క పెట్టించుకోవడం అన్న ఈ ఒక్క ప్రజాస్వామ్య వ్యక్తీకరణ పట్ల మాత్రమే దేశంలో సహనం, గౌరవం మిగిలాయి. తక్కినవాటి పట్ల అసహనం న్యాయస్థానాలలోనూ సమాజంలోనూ చాలా పెరిగింది. అభివృద్ధి, దేశ సమగ్రత అనే రెండు లక్ష్యాలకు ప్రజాస్వామ్య వ్యక్తీకరణను ఆటంకంగా, అవరోధంగా చూడడం సాధారణం అయింది. ప్రజాస్వామ్యమంటే అందరికీ ప్రేమే గానీ మన దారికి అడ్డుగా ఎవరయినా ఊరేగింపు తీస్తుంటే విసుక్కుంటాం. నగర జీవితానికి ఈ ఆటంకాలేమిటి అని అసహనంగా తిట్టుకుంటాం. ఫలాన వాళ్ల ఊరేగింపును నిషేధించమనీ ఇంకొకరి సమ్మెను నిషేధించమనీ ప్రభుత్వాన్ని ఆదేశించవలసిందిగా కోర్టులో కేసులు వేస్తాం. ఒకరి స్వేచ్ఛను హరించమని ఇంకొకరు కోర్టులో కేసు వేయడమేమిటని న్యాయస్థానాలు ఆ వ్యాజ్యాలను తిరస్కరించే బదులు 'ప్రజా ప్రయోజన' వ్యాజ్యాలుగా స్వీకరిస్తున్నాయి. ఎందుకింకా నిషేధించలేదని ప్రభుత్వాన్ని అడుగుతున్నాయి. అంతకంటే భాగ్యమా అని కోర్టు ప్రశ్ననే ఆదేశంగా స్వీకరించి ప్రభుత్వం పోలీసులను దించుతున్నది.

మళ్లీ మూడు దశాబ్దాలు వెనక్కి పోదాం. ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ వారి ఊరేగింపుకు అహ్మదాబాద్ పోలీస్ కమిషనర్ అనుమతి నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ ఆ సంస్థ సుప్రీంకోర్టులో కేసు వేసింది. ఆ కేసులో మొట్టమొదటిసారిగా సుప్రీంకోర్టు రహదారిపైన ఊరేగింపు తీయడం ప్రాథమిక హక్కు అనీ, దానిని హేతుబద్ధంగా నియంత్రించే అధికారం మాత్రమే పోలీసులకు ఉందనీ చెప్పింది. ఈ నిర్ణయానికి రావడానికి సుప్రీంకోర్టు రెండు ఆసక్తికరమయిన వాదనలు చేసింది. వేరే దేశాల సంగతి ఎట్లాగున్నా భారతదేశంలో పండగలప్పుడు, పెళ్లిళ్లప్పుడు, చావులప్పుడు రహదారిపైన ఊరేగింపు తీయడం అనాదిగా ఉన్న సంప్రదాయమనీ,

రాజ్యాంగం దానిని నిషేధించలేదనీ అనింది. (అనాదిగా ఉన్న ప్రజాస్వామిక సంప్రదాయాలను హక్కులుగా గుర్తించాలన్న ఈ అభిప్రాయాన్ని న్యాయస్థానాలు మళ్లీ ప్రయోగించాయో లేదో గానీ అది 'అభివృద్ధి'లో చిక్కుకున్న ఆదివాసులకూ మత్స్యకారులకూ చాలా మేలుచేయగల సూత్రీకరణ.) రెండవది, రాజ్యాంగం ఊరేగింపును ప్రాథమిక హక్కుగా గుర్తించలేదుగానీ పదిమంది శాంతియుతంగా ఒకచోట గుమిగూడడాన్ని ప్రాథమిక హక్కుగా గుర్తించింది, దేశంలో ఎక్కడి నుంచయినా ఎక్కడికయినా పోయే స్వేచ్ఛను కూడ ప్రాథమిక హక్కుగా గుర్తించింది. ఈ రెండిటినీ కలుపుకుంటే ఊరేగింపు తీయడం ప్రాథమిక హక్కేననింది సుప్రీం కోర్టు. ప్రజాస్వామ్య వ్యక్తీకరణ హక్కులను పెంపొందించడానికి కోర్టులు ఇంత శ్రద్ధగా తర్కించిన సందర్భాలు ఈ మధ్య కాలంలో ఎక్కువ కనబడవు.

రెండవ సమస్య, పరిపాలనలో ఉండే కష్టాల పట్ల న్యాయస్థానాలలోనూ సమాజంలో నోరున్న వర్గాలలోను సానుభూతి పెరిగిపోవడం. బలహీనులయిన ప్రజలకు న్యాయం చేయడంలో ఉండే కష్టాల పట్ల సానుభూతి కాదు. ఆ సానుభూతి అవసరమే, న్యాయస్థానాలకయితే రాజ్యాంగం నిర్దేశించే కర్తవ్యం కూడ. పెరుగుతున్నది అది కాదు. అభివృద్ధికీ దేశ సమగ్రతకూ అవసరమయిన 'క్రమశిక్షణ'ను సమాజంలో నెలకొల్పడంలో పాలకులు ఎదుర్కొనే సమస్యల పట్ల సానుభూతి పెరుగుతున్నది. న్యాయమూర్తులు తరచుగా ఈ సానుభూతిని వ్యక్తం చేస్తుంటారు. ఇది పూర్తిగా అవాంఛనీయం. వ్యక్తులుగా వారికి ఏ అభిప్రాయమైనా ఉండవచ్చును గానీ జడ్జిలుగా వారి కర్తవ్యం అది కాదు. ఏ కారణంగా ప్రభుత్వం సమాజంలో 'క్రమశిక్షణ' పెంపొందించాలని చూసినా ఆ క్రమంలో ప్రజల భావవ్యక్తీకరణ స్వేచ్ఛకూ భౌతిక స్వేచ్ఛకూ జరగగల హాని గురించి ఆందోళన చెందడం, దానిని నివారించడమే న్యాయస్థానాల కర్తవ్యం. యుద్ధ సమయంలో యుద్ధ అవసరాలను చూపించి స్వేచ్ఛను హరించిన ప్రభుత్వ చర్యలనూ, ఆదేశాలనూ నిలిపివేసిన న్యాయస్థానాలకే చరిత్రలో గౌరవం లభించింది. అటువంటి పరిస్థితేమీ లేకపోయినప్పటికీ కేవలం మధ్యతరగతి అభివృద్ధి దాహానికీ, తెచ్చి పెట్టుకున్న దేశ విచ్ఛిత్తి భయానికీ న్యాయస్థానాలు లోనయి ఈ స్ఫూర్తికి దూరం కావడం, ప్రజాస్వామ్య వ్యక్తీకరణ పట్ల అసహనం ప్రదర్శించడం అత్యంత ఆందోళనకరం.

*ఆంధ్రజ్యోతి దినపత్రిక*

*20 మే 2009*

# 377 సెక్షన్ : ఢిల్లీ హైకోర్టు మంచి పని చేసింది

స్వలింగ సంపర్కం నేరం కాదని ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు కొంతమందికి కోపం కలిగించినప్పటికీ సుప్రీంకోర్టు వారి అండకు వచ్చే అవకాశం లేదు. అసలు ప్రభుత్వమే ఐపిసిలోని సెక్షన్ 377 స్వలింగ సంపర్కానికి వర్తించదన్న చట్ట సవరణను ఎప్పుడో చేయవలసి ఉండింది గానీ అన్ని మతాల ఛాందసులు మీదపడతారని భయపడినట్టుంది. గత ప్రభుత్వంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి సవరణకు అనుకూలంగా ఉండగా హోంమంత్రి తటపటాయించినట్టు విన్నాం. కొత్త ప్రభుత్వంలో ఇది రివర్స్ అయింది. కేంద్ర హోంమంత్రి అనుకూలంగా ఉండగా ఆరోగ్యశాఖ మంత్రి వెనక్కు లాగుతున్నాడని వింటున్నాం. రాజకీయంగా కష్టసాధ్యం అయిన పనులు తమ పరిధిలోకి వచ్చేటట్టయితే కోర్టులు చేసేయడం ఒక్కొక్కసారి జరుగుతుంటుంది. మంచికీ జరుగుతుంటుంది, చెడుకూ జరుగుతుంటుంది. ఇది మంచికి జరిగిన ఉదంతం.

నిజానికి సెక్షన్ 377నే తీసేసి అందులో అవసరమైన విషయాన్ని దానికి తగిన భాషలో రాయడం ఉచితంగా ఉంటుంది. ఐపిసిలో మానవ వ్యక్తి పైన జరిగే నేరాల నిర్వచనం, శిక్షల ప్రతిపాదన సెక్షన్ 299 నుండి మొదలవుతుంది. సెక్షన్ 376 రేప్‌కు సంబంధించినది. ఆ తరువాత సెక్షన్ 377 వస్తుంది. చిన్న పిల్లలపైన, పశువుల పైన జరిపే లైంగిక హింసను నేరంగా

ప్రకటించడం దీనిలోని ఒక అంశం. అంతవరకు పేచీలేదు. కాని అక్కడితో ఆగిపోకుండ సంతాన ఉత్పత్తి కోసం జరిగే లైంగిక క్రియను తప్ప తక్కిన అన్ని రకాల లైంగిక క్రియలనూ నేరాలుగా ప్రకటించే పద్ధతిలో ఆ సెక్షన్ రాయబడింది. ఏ బలవంతమూ లేకపోయినా, ఇష్టపూర్వకంగానే జరిగినా అవి నేరాలే అవుతాయి. ఇది మత భావజాలం నుండి, ప్రత్యేకించి మన పూర్వ పాలకులైన బ్రిటిష్ వారి క్రైస్తవ భావజాలం నుండి వచ్చిందే తప్ప నేరస్మృతితో ఈ ఆలోచనకు ఏమీ సంబంధం లేదు. దీనికోసం సెక్షన్ 377ను అస్పష్టమైన భాషలో రాసారు. 'ప్రకృతి విరుద్ధమైన లైంగిక క్రియకు పాల్పడడం నేరం' అని సెక్షన్ 377 అంటుంది. ఏది ప్రకృతి సిద్ధం, ఏది ప్రకృతి విరుద్ధం అని ఆ సెక్షన్ నిర్వచించదు. కానీ న్యాయస్థానాలు సంతానోత్పత్తి లక్ష్యంగా లేని సకల లైంగిక క్రియలనూ దీని కిందికి తీసుకొచ్చాయి. అదే శాసనకర్తల ఉద్దేశ్యంగా భావించబడింది. బలాత్కారంతోనూ బలవంతంతోనూ నిమిత్తం లేకుండ అటువంటి లైంగిక క్రియలను నేరవిచారణ వ్యవస్థ నేరాలుగా గుర్తించింది. స్వలింగ సంపర్కం ఈ క్రమంలో నేరం అయింది.

'ప్రకృతి విరుద్ధం' అనే మాటకు దాని మామూలు అర్థం ఇచ్చుకున్నట్టయితే సెక్షన్ 377కు లోబడే స్వలింగ సంపర్కం నేరం కాదని వాదించవచ్చు. ప్రకృతి విరుద్ధం అంటే ప్రకృతి సహజం కానిది అనేది మామూలు అర్థం. స్వలింగ సంపర్కం ప్రకృతిలో అసహజమేమీ కాదు. స్వలింగ సంపర్కాన్ని ఇష్టపడేవారు, ఆచరించేవారు మైనారిటీయే కావచ్చును గానీ అది 'అసహజము' అనేంత చిన్న మైనారిటీ కాదు. కాబట్టి సెక్షన్ 377లో వాడిన భాషకు లోబడే స్వలింగ సంపర్కం నేరం కాదని ప్రకటించవచ్చు. ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇక్కడితో ఆగిపోయినా సరిపోయేది గానీ, ఇక్కడ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, లైంగిక వివక్ష అనే విషయాలు కూడ ఇమిడి ఉన్నాయి కాబట్టి ఢిల్లీ హైకోర్టు వాటిలోకి కూడ వెళ్లింది.

మతం, కులం, ప్రాంతం, లింగం, భాష మొదలయిన కారణాలుగా మనుషుల పట్ల వివక్ష పాటించడానికి వీలు లేదని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 అంటుంది. ఇప్పటిదాకా 'లింగ వివక్ష' అంటే స్త్రీ పురుషుల మధ్య వివక్ష అని మాత్రమే అర్థం చేసుకుంటూ వచ్చారు. తమను తక్కువగా చూడడం కూడ లింగ వివక్ష కిందికే వస్తుందని ట్రాన్స్ జెండర్ (హిజ్రాలు) చాలాకాలంగా ఆందోళన చేస్తున్నారు. అదట్లాగుంచి లైంగికత ప్రాతిపదికన వివక్ష కూడ లింగ వివక్షేనని ఢిల్లీ హైకోర్టు

ఇప్పుడు ప్రకటించింది. అంటే స్వలింగ సంపర్కాన్ని నేరంగా చూడడం రాజ్యాంగ విరుద్ధం అవుతుంది. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ కూడ భారత రాజ్యంగంలోని ఆర్టికల్ 19లో ఒక ప్రాథమిక హక్కే. లైంగికత భావ వ్యక్తీకరణేననడంలో సందేహం అక్కరలేదు. ఒకరి పట్ల బలవంతం, బలాత్కారం లేకుండ చేసే ఏ భావ వ్యక్తీకరణనయినా సమాజం స్వీకరించాలి, కనీసం సహించాలి. నిజానికి సెక్షన్ 377లోని పరిభాష ఈ చర్చను చాలా దూరం తీసుకుపోయింది గానీ మరొకరికి హాని కలిగించని ఏ చర్యయినా 'నేరం' ఎట్లా అవుతుంది? నేరస్మృతిలో ఎట్లా భాగం అవుతుంది? ఆ చర్య ఒకరికి తప్పనిపించవచ్చు, ఒకరికి ఒప్పనిపించవచ్చు. ఒకరికి పాపకార్యం అనిపించవచ్చు, ఒకరికి పుణ్యకార్యం అనిపించవచ్చు. కానీ వేరెవ్వరికీ హాని చేయనిది 'నేరం' కావడానికి వీలు లేదు. బలాత్కారంతో నిమిత్తం లేకుండ 'ప్రకృతి విరుద్ధమైన లైంగిక చర్య నేరం' అని సెక్షన్ 377లో ప్రకటించడం నేరస్మృతి పునాది స్వభావానికి విరుద్ధం.

దీనికి అవతలి వైపు నుండి ఒక జవాబు చెప్పారు. స్వలింగ సంపర్కం హెచ్ఐవి వ్యాప్తికి దారి తీస్తున్నదనీ, అది ఆ వ్యక్తికే కాక ఇతరులకూ హానికరమని వాదించారు. 'ఎయిడ్స్'కూ స్వలింగ సంపర్కానికీ ఉన్న సంబంధం ఎంతవరకు శాస్త్రీయంగా నిర్ధారించబడిందో తెలీదుగానీ, అది నిజమనుకున్నా స్వలింగ సంపర్కాన్ని నేరంగా చూడడం వల్ల రోగం బారిన పడిన వారు చెప్పుకోవడానికి కూడ భయపడే పరిస్థితి ఏర్పడింది. దానిని నేరస్మృతి నుండి తీసేస్తే కనీసం ధైర్యంగా చెప్పుకోనయినా చెప్పుకుంటారు, సకాలంలో నివారణ మార్గాలు వెతుక్కుంటారు.

మతవాదులు ఈ తీర్పు పట్ల మొదట్లో అభ్యంతరం తెలిపినప్పటికీ త్వరలోనే ఒక విషయం గ్రహించినట్టున్నారు. స్వలింగ సంపర్కం నేరం కాదని ఢిల్లీ హైకోర్టు చెప్పిందే తప్ప పాపం కాదని చెప్పలేదు. పాపపుణ్యాల నిర్ధారణ కోర్టుల కార్యక్షేత్రం కాదు కదా. కాబట్టి అది నేరం కాకపోయినా పాపమేనని నమ్మే వారు నమ్ముతుండవచ్చు. వారినెవ్వరూ ఆపలేరు. అన్ని మతాలు పాపంగానూ, దేవుడి కళ్లలో తప్పుగానూ భావించే చర్యలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా స్త్రీత్వానికీ, లైంగికతకూ, పుట్టుక పెళ్లి చావులకు వర్తించే కర్మకాండకూ సంబంధించి అనేక ఆంక్షలూ, నిషేధాలూ అన్ని మతాలలోనూ సామాన్యమే. వీటినన్నిటినీ చట్టం గుర్తించదు. మతం నిషేధించే వాటన్నిటినీ నేరాలుగా ప్రకటించదు. శిక్షించదు. అంత మాత్రం చేత మతాలకూ వాటి ఉనికికీ భద్రతకూ వాటిల్లిన నష్టమేమీ లేదు. ఇప్పుడు స్వలింగ సంపర్కం

కూడ ఆ జాబితాలో చేరినంత మాత్రాన వచ్చిన ఉపద్రవమేముంది? ఈ విషయం అన్ని మతాల ఆచార్యులు గ్రహించారు కాబట్టి ఒక ప్రకటనతో ఆగిపోయారు. శాపనార్థాలూ ఫత్వాలూ జారీ చేయలేదు.

ఢిల్లీ హైకోర్టు పరిధి ఆ నగరాన్ని దాటి పోదు కాబట్టి ఈ తీర్పు దేశానికంతా వర్తించదు. తీర్పు వల్ల ఢిల్లీ నగరంలో సహితం పెద్ద తిరుగుబాటేమీ రాలేదు కాబట్టి కేంద్ర ప్రభుత్వం తన తటపటాయింపు విడిచిపెట్టి సెక్షన్ 377ను నేరస్మృతి నుంచి తొలగించడం ఉచితంగా ఉంటుంది. పిల్లల పైన, పశువుల పైన లైంగిక చర్యను నేరంగా ప్రకటించే సెక్షన్‌ను దాని స్థానంలో ప్రవేశపెడితే సరిపోతుంది.

*ప్రజాతంత్ర వారపత్రిక*

*6 జూలై 2009*

# ఎన్‌కౌంటర్లు: ప్రజల నిస్సహాయత, న్యాయవ్యవస్థ అనాసక్తి

'ఎన్‌కౌంటర్' హత్యల సంఖ్య ఏటేటా పెరుగుతున్నది. వాటిని ఆపగల మోతాదులో ప్రజల నిరసన లేదు. ఉద్యమాలకు కూడ అంత బలం లేదు. న్యాయవ్యవస్థ గట్టిగా పూనుకుంటే కొంతయినా ప్రభుత్వాన్ని అదుపు చేయగలిగేదేమోగానీ అంతటి సంకల్పం సుప్రీంకోర్టు నుండి జాతీయ మానవహక్కుల కమిషన్ దాకా ఎవరిలోనూ కనిపించడం లేదు..

ఎన్‌కౌంటర్ల గురించి ఎప్పుడు మాట్లాడినా, మాట్లాడిన విషయాలే మళ్లీ మళ్లీ మాట్లాడినట్టు వుంటుంది. కొంచెమయినా ఈ పరిస్థితి మెరుగయితే ఇట్లా అనిపించకపోయేదేమో గానీ మాట్లాడిన కొద్దీ ఎన్‌కౌంటర్ల సంఖ్య పెరుగుతున్నదే తప్ప తగ్గడం లేదు.

1998 సంవత్సరం ఇప్పటిదాకా రికార్డు స్థాయి ఎన్‌కౌంటర్ హత్యలను చూసింది. 1999 ఎన్నికల సంవత్సరం కావడం వల్ల 1998 తో పోల్చినప్పుడు సంఖ్య కొంచెం తగ్గినా, గతంతో పోల్చుకుంటే ఈ సంవత్సరంలో జరిగిన ఎన్‌కౌంటర్లు కూడ తక్కువేమీ కావు.

అకస్మాత్తుగా, కాకతాళీయంగా జరిగే 'ఎన్‌కౌంటర్'లకు ఈ ఎన్నికలతో ఏం సంబంధం, వరదలతో ఏం సంబంధం అని అడిగేంతటి అమాయకులీ రాష్ట్రంలో బహుశా ఎవరూ లేరు. నిఘంటువును బట్టి అర్థం చేసుకున్నట్టయితే ఎన్‌కౌంటర్ జరగడం, జరగకపోవడం అనేది ఒకరి ఇష్టా ఇష్టాలతో నిమిత్తం లేని

విషయాలు. ఎన్నికలొచ్చాయనో ఎండలెక్కువ ఉన్నాయనో లారీ ప్రమాదాలు ఎవరూ ఆపలేరు కదా. ఎన్‌కౌంటర్లు కూడ అంతే అయి వుండాలిగానీ అవి నిజానికి ప్రభుత్వ విధానం ప్రకారం జరిగే హత్యలు కాబట్టే ప్రభుత్వం వాటిని నిలిపివేయగలదు, పెంచదలచుకున్నప్పుడు అకస్మాత్తుగా పెంచగలదు.

మొన్నటి ఎన్నికల ప్రక్రియ మొదలైన తరువాత ఎన్‌కౌంటర్లు అకస్మాత్తుగా తగ్గిపోయి ఎన్నికలు దగ్గరకొచ్చేసరికి పూర్తిగా ఆగిపోయిన సంగతి అందరూ గమనించే వుంటారు.

గతానికీ ఈ మధ్యకాలానికీ సంఖ్యలో పెరుగుదల కాక మరొక తేడా కూడ వుంది. సాయుధ దళాలు, లేదా సాయుధులయిన ఎం.ఎల్ పార్టీల ముఖ్యులు ఎన్‌కౌంటర్‌లలో చనిపోవడం ఈ మధ్య కాలంలో ఎక్కువయింది. ఒక నక్సలైట్ దళం ఫలాన చోట ఉందని పోలీసులకు తెలిసి కూడ ఆ దిక్కు పోకుండా వున్న ఉదంతాలు గతంలో అనేకం వుండేవి. ఇప్పుడటువంటివి లేవని అనలేము గానీ, పోలీసు బలగాలు నక్సలైట్లను వెతికి వేటాడి చంపడం బాగా పెరిగింది. దానికి తగిన పారితోషికం కూడ వారికి లభిస్తున్నది. దళాల దగ్గర తరచుగా డబ్బులు దొరుకుతాయి. వాటిలో పెద్ద భాగం జేబులో వేసుకొని మిగిలినది మాత్రమే ఎఫ్ఐఆర్‌లోకి ఎక్కించడం పోలీసులకు కొంతకాలంగా అలవాటయింది. అందుకోసమే జరిగాయని కచ్చితంగా చెప్పగల ఎన్‌కౌంటర్లు కొన్ని వున్నాయి.

అయితే ఇప్పుడు ఆ శ్రమ కూడ లేకుండా, జిల్లా పోలీస్ అధికారులు హతుల దగ్గర దొరికిన డబ్బు అక్కడికక్కడే హంతకులకు పంచి ఇవ్వడం మొదలయింది. నెత్తురోడుతున్న మృతదేహాల పక్కనే ఈ డబ్బు పంపకాలు చేసుకోవడం తలచుకుంటేనే ఎబ్బెట్టుగా అనిపిస్తుందిగానీ పంచేవాళ్లూ పుచ్చుకునేవాళ్లూ అట్లా అనుకోవడం లేదు. నక్సలైట్ పార్టీలు – చిన్నవి పెద్దవి కూడ డబ్బు వసూలు పెద్ద మొత్తంలో చేపడుతున్నాయి కాబట్టి దళాలను చంపితే ఎంతో కొంత పెద్ద మొత్తమే దొరుకుతోంది. దళాలను వేటాడి చంపడానికి పోలీసులకిది ఒక ముఖ్య ప్రోత్సాహం.

దీని అర్థం పోలీసులు దళాలతో ముఖాముఖి తలపడుతున్నారని కాదు. వెంబడించి వెతికి సమాచారం రాబట్టి ఏ యింట్లోనో వాళ్లు తలదాచుకున్నప్పుడు బయటికొచ్చే అవకాశం లేకుండా ట్రాప్ చేసి ఏకపక్షంగా హతమారుస్తున్నారు. నక్సలైట్ దళాల దగ్గర బలమైన ఆయుధాలు పెద్దగా లేని ఉత్తరాంధ్ర జిల్లాలలో మాత్రమే పోలీసులు కొంత సాహసం ప్రదర్శిస్తున్నట్టు అనిపిస్తుంది.

ప్రమోషన్లు మరొక బహుమానం. ఎన్‌కౌంటర్‌లు చేసే పోలీసులకు మామూలు కంటే వేగంగా ప్రమోషన్లు ఇచ్చే ప్రోత్సాహకాన్ని చంద్రబాబు పగ్గాలు చేపట్టిన తరువాత ప్రవేశపెట్టారు. ఇది చాలా హానికరమైన పోటీకి దారితీస్తున్నది. వెనుకబడి పోయిన పోలీస్ సిబ్బంది గబగబా రెండు 'ఎన్‌కౌంటర్'లు చేసేసి తమతోటి వారిని అందుకున్న ఘటనలు లేకపోలేదు.

ఎన్‌కౌంటర్ల సంఖ్య పెరగడానికి, సాయుధ దళాలతో సహితం తలపడడానికి పోలీసులు గతంలో కంటే ఎక్కువ సంసిద్ధత చూపించడానికి వేరే ఒక కారణం కూడ వుందేమో! ఇది నక్సలైట్ల స్వయంకృతాల ఫలితం. నక్సలైట్ ఉద్యమానికి మొత్తంగా పోలీసులు శత్రువులని భావించగల పరిస్థితి ఈ రోజు వుంది. అందువల్ల కూడ నక్సలైట్ల వేటలో గతంలో కంటే ఎక్కువ ఉత్సాహంతో సగటు పోలీసులు పాల్గొంటూ వుండవచ్చు. నక్సలైట్ల దాడులలోనూ మందుపాతర ఘటనలలోనూ ఎక్కువగా చనిపోతున్నది కింది స్థాయి పోలీసు సిబ్బందే. దీని వల్ల వారిలో భయం పెరిగే అవకాశం ఎంత వుందో, నక్సలైట్లను ఎదుర్కొనాలన్న పట్టుదల పెరిగే అవకాశం కూడ అంత వుంది.

అయితే దళాలతో పోలీసులు ఏదో ఒక మేరకు తలపడే ఘటనల సంఖ్య కొంచెం పెరిగినప్పటికీ, ఈనాటికీ సగటు ఎన్‌కౌంటర్ ఘటన, పక్క మీది నుండి లేపి తీసుకుపోయి చంపిన ఘటనే. అర్ధరాత్రి దాటిన తరువాత నిద్రలేపి తీసుకుపోయి తెల్లవారే లోపల పక్క వూరి శివారులో కాల్చి చంపడమే సగటున ఎన్‌కౌంటరంటే. ఈ హత్యకు గురయ్యేది (ఎప్పుడో తప్ప) సాయుధ దళ సభ్యులు కారు. ఎక్కువ భాగం మిలిటెంట్లు, సానుభూతిపరులు, ఇంకా సంబంధాలు కొనసాగిస్తున్నారని అనుమానించబడే ' మాజీలు'. ఈ రకమైన హత్యలను కూడ ప్రభుత్వమిచ్చే ప్రమోషన్లు, పారితోషికాలూ ప్రోత్సహిస్తున్నాయి. సమర్థుడయిన పాలకుడిగా దేశంలోనే కాదు, బయట కూడ గుర్తింపు పొందుతున్న చంద్రబాబు పోలీసు హత్యాకాండను కూడ చాలా 'సమర్థంగా' పెంచుతున్నాడని ప్రపంచమింకా గుర్తించినట్టు లేదు. ఆయనగారు నమ్మే రాజకీయార్థిక సిద్ధాంతాలలో ప్రోత్సాహకాలకు కేంద్ర స్థానం వుంది. ప్రతిఫలం చూపించి సామర్థ్యం పెంచాలని ఈ సిద్ధాంతాలు చేప్తాయి. దానినే వారు ఎన్‌కౌంటర్లకు కూడ వర్తింపచేసి చాలా సమర్థంగా హత్యలు చేయిస్తున్నారు.

మరి ఈ రకమైన హత్యాకాండను అదుపు చేసే బాధ్యత గల సంస్థలు ఏం చేస్తున్నాయి? పోలీసులు మనుషులను పట్టుకుపోయి కాల్చి చంపడాన్ని భారత

రాజ్యాంగం ఆమోదించదు. ఇంట్లో 'ట్రాప్' చేసి కిటికీలలో నుండి, పైకప్పు పెంకులు తొలగించి ఆ పొక్కలలో నుండి కాల్చి చంపడాన్ని కూడ ఆమోదించదు. హతులు సాయుధులు కావచ్చు, 'తీవ్రవాదం' అని పిలవబడే రాజకీయ పోకడలు గలవారు కావచ్చు, ఇంకెవరయినా కావచ్చు. ఆమోదించకపోవడమే కాదు, అటువంటి హత్యలను చట్టం సాధారణ పౌరులు చేసే నేరాలతో సమానంగా చూడాలంటుంది.

మన రాజ్యాంగం, చట్టాలే కాక భారత ప్రభుత్వం సంతకం చేసిన అంతర్జాతీయ ఒడంబడికలు కూడ ఉన్నాయి. సార్వభౌమ అధికారం ఉన్న ఒక ప్రభుత్వం అటువంటి ఒడంబడికపైన సంతకం చేసిందంటే దానిని పాటించే నైతిక బాధ్యత, రాజకీయ బాధ్యత ఆ ప్రభుత్వం పైన ఉన్నాయని అర్థం. అంతర్జాతీయ ఒడంబడికలు అమలు చేసే యంత్రాంగమేదీ లేదు కాబట్టి సంతకం చేయడంతో తన పని అయిపోయిందని ఏ ప్రభుత్వమయినా దబాయిస్తే అది సార్వభౌమత్వం అనే భావననే కించపరచడం తప్ప వేరే ఏమీ కాదు. సార్వభౌమత్వం ప్రజలది. ప్రభుత్వం ప్రజా ప్రతినిధిగా దానిని చలాయిస్తుంది. రాజ్యాంగం ప్రజల ఆకాంక్షల మేరకు ఆ సార్వభౌమత్వాన్ని నిర్వచిస్తుంది. 'ప్రజల' ఆకాంక్షలు అనేవి ఒకటి కాదు కాబట్టి, భిన్న ఆకాంక్షలకు భిన్న స్థితిగతులు, అవసరాల ప్రాతిపదిక వుంది కాబట్టి, అన్ని అవసరాల బలం ఒకటి కాదు కాబట్టి ఈ సార్వభౌమత్వం ఆచరణలో కొందరి ప్రయోజనాలకే పెద్ద పీట వేసినప్పటికీ, సూత్రప్రాయంగా సార్వభౌమత్వం ప్రజలది. రాజ్యాంగమైనా ప్రభుత్వమైనా దానికి ప్రతినిధులు మాత్రమేనని గుర్తించడం అవసరం. అటువంటి రాజ్యాంగం ప్రకటించుకున్న విలువలను, ప్రభుత్వం సంతకం చేసిన ఒడంబడికలను తేలికగా తీసిపారేయడం ప్రజలను అవమానపరచడమే.

## అంతర్జాతీయ ఒడంబడికలు

భారత ప్రభుత్వం స్వాతంత్ర్యం వచ్చిన కొద్దికాలానికే ఐక్యరాజ్యసమితి రూపొందించిన అంతర్జాతీయ మానవహక్కుల ప్రకటనపైన సంతకం చేసింది. అందులో :

ఆర్టికల్ 3 : జీవితం, స్వేచ్ఛ, భద్రత ప్రతి ఒక్కరి హక్కు

ఆర్టికల్ 5: ఎవ్వరినీ చిత్రహింసలకు గురిచేయకూడదు. క్రూరమైన, అమానవీయమైన, అవమానకరమైన పద్ధతిలో ఎవరితోనూ వ్యవహరించకూడదు. అటువంటి శిక్షలు ఎవరికీ వేయకూడదు.

ఆర్టికల్ 6 : ప్రతి ఒక్కరికీ చట్టం ముందు వ్యక్తిగా గుర్తింపు వుండాలి.

ఆర్టికల్ 7: చట్టం ముందు అందరూ సమానమే. ఎటువంటి వివక్ష లేకుండా చట్టం అందరినీ సమానంగా రక్షించాలి.

ఆర్టికల్ 10: నేరారోపణ విషయంలో గానీ ఇతర హక్కుల, బాధ్యతల విషయంలో గానీ ఒక స్వతంత్రమైన, నిష్పాక్షికమైన న్యాయస్థానంలో బహిరంగ విచారణ పొందే హక్కు అందరికీ సమానంగా వుండాలి.

ఆర్టికల్ 11 (1) : నేరారోపణ చేయబడ్డ వ్యక్తిని నేరం రుజువయ్యేదాకా నిర్దోషిగానే భావించాలి. నేరం రుజువు చేసే విచారణ బహిరంగ విచారణ అయి వుండాలి, ముద్దాయికి తనపైన ఆరోపణను తిప్పికొట్టడానికి అన్ని అవకాశాలు వుండాలి.

ఈ హక్కులన్నీ అందరికీ వర్తించాలి. కొందరికి మాత్రమే కాదు. ముఖ్యంగా (ప్రస్తుత సందర్భాన్ని దృష్టిలో పెట్టుకొని) రాజకీయ అభిప్రాయాలను అనుసరించి కొందరికి నిరాకరించడానికి వీలు లేదు.

ఆర్టికల్ 2: ఈ ప్రకటనలోని హక్కులు, స్వేచ్ఛలు పొందే హక్కు అందరికీ ఉంటుంది. ఏ రకమైన వివక్షా ఈ విషయంలో పాటించడానికి వీలు లేదు. జాతి, రంగు, లింగం, భాష, మతం, రాజకీయ లేక ఇతర అభిప్రాయాలు, పుట్టుక, స్థితిగతులు, ఆస్తి, సామాజిక స్థితి, జాతీయత మొదలయిన ఏ వివక్షా ఈ హక్కులను అనుభవించే విషయంలో పాటించకూడదు.

ఈ ఒడంబడికను ఐక్యరాజ్యసమితి ఆమోదించింది 1948 డిసెంబర్ 10న. ఆ తరువాత 1966లో రూపొందించి 1976 మార్చి 23న అమలులోకి తీసుకొచ్చిన అంతర్జాతీయ పౌర రాజకీయ హక్కుల ఒడంబడిక ఉంది. అందులో కూడ పైన పేర్కొన్న హక్కుల వంటివే వున్నాయి.

ఆర్టికల్ 6(1) : ప్రతీ మనిషికీ జీవించే హక్కు వుంది. దానిని చట్టం కాపాడాలి. చట్టబాహ్యమైన పద్ధతులలో ఎవ్వరి ప్రాణమూ తీసివేయడానికి వీలు లేదు.

ఆర్టికల్ 7(1) : ఎవ్వరినీ చిత్రహింసలకు గురి చేయడానికి వీలు లేదు. క్రూరమైన, అమానవీయమైన, అవమానకరమైన పద్ధతులలో ఎవరితోనూ ప్రవర్తించకూడదు. అటువంటి శిక్షలు ఎవరికీ వేయకూడదు.

ఆర్టికల్ 16: ప్రతి ఒక్కరికీ చట్టం ముందు వ్యక్తిగా గుర్తింపు వుండాలి.

ఆర్టికల్ 24 : చట్టం ముందు అందరూ సమానమే. ఎటువంటి వివక్షా లేకుండా చట్టం అందరికీ రక్షణ కల్పించాలి. అటువంటి వివక్ష ఏమైనా ఉంటే చట్టం నిషేధించాలి. జాతి, రంగు, లింగం, భాష, మతం, రాజకీయ లేక ఇతర అభిప్రాయాలు, ఆస్తి, పుట్టుక మొదలయిన కారణాలుగా ఎవరూ వివక్ష అనుభవించకుండా వుండేటట్టు అందరికీ సమానంగా సమర్థంగా చట్టం రక్షణ కల్పించాలి.

ఎవ్వరినీ చిత్రహింసలకు గానీ, క్రూరమైన, అమానుషమైన, అవమానకరమైన శిక్షలకు గానీ గురి చేయకూడదన్న నియమం ఈ రెండు ప్రకటనలలోనూ ఉన్నాయి. 1984లో ఐక్యరాజ్యసమితి ఈ విషయం మీదనే ఒక ప్రత్యేకమైన ఒడంబడికను రూపొందించింది. అది 26 జూన్ 1987న అమలులోకి వచ్చింది.

ఇవన్నీ ఏకరవు పెట్టి ఏం ప్రయోజనమని చాలా మంది అనుకోవచ్చు. అమలు చేసే యంత్రాంగమేదీ లేని నియమాలను పాటించకపోతే అడగడానికి హక్కెవరికీ లేదని ప్రభుత్వాలు దబాయించినట్టే, అడిగి ప్రయోజనమేమీ లేదని మనం కూడ అనుకుంటున్నాం. అది ఎందుకు తప్పో పైన చెప్పాను. అసలు ప్రపంచ దేశాల ప్రభుత్వాల ఉమ్మడి వేదిక అయిన ఐక్యరాజ్యసమితి ఇటువంటి ఒడంబడికలూ ప్రకటనలూ రూపొందించిందంటేనే అంతటి ఆమోదం వాటికి మానవ సమాజంలో వుందని, అంతటి ఆకాంక్ష ప్రజలలో ఉందని అర్థం. అమలు చేసే యంత్రాంగం లేదు కాబట్టి వీటి గురించి మాట్లాడడం వృథా అనుకోవడం ఆ ఆకాంక్షను అవమానపరచడమే.

అయినా ఈ అంతర్జాతీయ ఒడంబడికలనూ ప్రకటనలనూ కొన్ని సందర్భాలలో మన దేశంలోని కోర్టులు అమలు చేయించవచ్చునని భారత సుప్రీంకోర్టు అనింది. మన రాజ్యాంగం ప్రాథమిక హక్కులు కల్పించిన విషయాలపైన అంతర్జాతీయ ఒడంబడికలలో నియమాలేమైనా వుంటే, వాటిని మన రాజ్యాంగ హక్కులను విశదీకరించే విషయాలుగా భావించి, వాటిని కూడ రాజ్యాంగ హక్కులలాగా అమలు చేయించే అధికారం మన కోర్టులకుందని సుప్రీంకోర్టు 1997లో పియుసిఎల్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో అనింది. (ఇది కూడ ఎన్‌కౌంటర్లకు సంబంధించిన కేసే కావడం గమనార్హం. ఒక బూటకపు ఎన్‌కౌంటర్లో చనిపోయినవారి కుటుంబాలకు ఒక లక్ష రూపాయల నష్టపరిహారం ఇమ్మని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ జస్టిస్ జీవన్ రెడ్డి ఈ తీర్పు యిచ్చారు).

అంతకంటే ముందే (1996లో) ఒక పర్యావరణ సంబంధమైన కేసులో (వేలూర్ సిటిజెన్స్ వెల్ఫేర్ ఫోరం వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా) జస్టిస్ కుల్దీప్ సింగ్ అంతకంటే లోతయిన సూత్రీకరణ చేశారు. ఒక అంతర్జాతీయ ఒడంబడికలోని అంశాలు మన దేశ చట్టానికి వ్యతిరేకం కాకపోతే, వాటిని మన దేశ న్యాయస్థానాలు అమలు చేయించవచ్చునన్నారు.

కాబట్టి అంతర్జాతీయ ఒడంబడికలూ ప్రకటనలూ ఇప్పుడింక అమలు చేసే యంత్రాంగం లేని ఒట్టి కాగితపు పులులు కావు. మన దేశ చట్టాలు ఏ మేరకు అమలు చేయించుకోగలమో ఆ మేరకు వాటిని కూడ న్యాయస్థానాల ద్వారా అమలు చేయించుకోవచ్చు.

అది ఏ మేరకు అన్న ప్రశ్న వేసుకున్నప్పుడు మాత్రం, అన్ని విషయాలలో కాకున్నా వ్యవస్థిత పెత్తనాన్నీ అధికారాన్నీ (అది రాజకీయం కావచ్చు, సాంఘికం కావచ్చు. ఆర్థికం కావచ్చు) కదిలించే హక్కుల విషయంలో మాత్రం జవాబు నిరాశాజనకంగానే వుందని చెప్పక తప్పదు.

## కలకత్తా హత్యలపై కోర్టుల మౌనం

కలకత్తా నగరంలో నక్సల్బరీ రాజకీయాల తొలిదశలో జరిగిన భీకరమైన హత్యాకాండపైన ఇప్పటికైనా ఒక విచారణ జరిపించాలని కేసు వేసిన పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఎపిడిఆర్ అనే హక్కుల సంఘానికి కలకత్తా హైకోర్టులోనూ సుప్రీంకోర్టులోనూ ఎదురయిన చేదు అనుభవాన్నే ఉదాహరణగా తీసుకోవచ్చు. 1968–72ల మధ్య కాలంలో కలకత్తా నగరంలో నక్సలైట్లుగా భావించబడే వ్యక్తులు పెద్ద సంఖ్యలో చంపబడ్డారు. అవన్నీ ఇప్పటి ఎన్‌కౌంటర్ల వంటివి కావు. పోలీసులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నక్సలైట్ల చేత చంపబడ్డవారి అనుచర గణమూ కలిసి లెక్కా పక్కా లేకుండా జరిపిన మారణకాండ అది. అప్పట్లో హక్కుల సంఘాలు లేకపోవడం వల్ల (ప్రస్తుతం దేశంలో పని చేస్తున్న హక్కుల సంఘాలలో మొదటిదయిన ఎపిడిఆర్ ఈ మారణకాండ ఫలితంగానే ఆ దశ చివరి భాగంలో – అంటే 1972లో ఏర్పడింది) ఈ హత్యల వివరాలు పూర్తిగా బయటికి తెచ్చే వారెవరూ లేకపోయారు. సిపిఐ (ఎం.ఎల్) కు అంతటి నిర్మాణం లేదు.

1972 తరువాత ఎపిడిఆర్ సేకరించిన వివరాలను బట్టి చూస్తే ఆ నాలుగు సంవత్సరాలలో కొన్ని వందల ప్రాణాలు పోయాయని తెలిసింది. ఈ రోజు మన

రాష్ట్రంలో జరుగుతున్న హత్యాకాండతో పోలిస్తే అది కొంచెం తక్కువ పరిమాణంలోని హత్యాకాండే గానీ విచ్చలవిడితనంలో అది దీని తలదన్నిన కాలం. కొన్ని ఉదాహరణలు చెప్పుకుంటే ఆనాటి వాతావరణం అర్థం కావచ్చు,

1970 సెప్టెంబర్ 25న కలకత్తా మెడికల్ కాలేజీ హాస్పిటల్ నుండి ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేసి తీసుకుపోయారు. కాలేజ్ స్ట్రీట్ పక్కనున్న భవానీదత్త వీధిలోకి వ్యాన్లో తీసుకుపోయి అక్కడ దించి వెళ్లిపొమ్మన్నారు. వాళ్లు వెళ్లిపోతుండగా వెనుక నుండి కాల్చి చంపారు. పోస్టర్లు అంటిస్తున్న నక్సలైట్లను అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా వారు పోలీసుల పైన తిరగబడ్డారని, పోలీసులు ఎదురు కాల్పులు జరుపగా వారు చనిపోయారని చెప్పారు.

1970 నవంబర్ 28న కలకత్తా మైదాన్‌లోని షహీద్ మినార్ దగ్గర 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. రెండు కార్లలో ఎక్కించి లాల్ బజార్ పోలీస్ స్టేషన్‌లో చిత్రహింసలు పెట్టారు. తరువాత వారి శవాలు నగరం బయట జాతీయ రహదారి పైన ఇక్కడొకటి అక్కడొకటి కొన్ని మైళ్ల పర్యంతం పడి వున్నాయి. ఈ హత్యాకాండ పైన రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ తారాపద ముఖర్జీ కమిషన్‌ను నియమించింది. విచారణ మొదలుపెట్టిన కొద్ది రోజులకే ఆయనను ఎవరో కత్తితో పొడిచారు. ఆయన కోలుకున్నాడు గానీ విచారణ ఇంక కొనసాగించలేదు.

1971 జనవరి 24న దక్షిణ 24 పరగణాల జిల్లాలోని డైమండ్ హార్బర్ వద్ద ఆరు శవాలు దొరికాయి. వాళ్లు బందిపోట్లని పోలీసులన్నారు. కానీ వాళ్లు నక్సలైట్లయి వుంటారని స్థానికులు అభిప్రాయం. వారిని ఎవరు చంపారో ఏం జరిగిందో ఎవరికీ తెలియదు.

1971 జూన్ 1వ తేదీన కోన్‌నగర్‌లో పోలీసులు తొమ్మిది శవాలను తవ్వి వెలికి తీశారు. పోలీసు రికార్డుల ప్రకారం వారు నక్సలైట్లని తేలింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన వాళ్లు వారిని హతమార్చి పూడ్చి పెట్టారు. శవాల తల, చేతులు తెగనరకబడి వున్నాయి.

కాశీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక గూండా నాయకుడయిన కాంగ్రెస్ నేతను నక్సలైట్లు చంపినందుకు ప్రతీకారంగా పోలీసుల గ్రీన్ సిగ్నల్‌తో కాంగ్రెస్ వాళ్ళు 1971 ఆగస్ట్ 12-13 తేదీలలో పెద్దఎత్తున ప్రతీకార హత్యాకాండకు పాల్పడ్డారు. 150 మందిని చంపారన్న ఉద్యమకారుల అంచనా అతిశయోక్తి అనిపిస్తుందిగానీ

పెద్దఎత్తున చంపారనేది సత్యం. తుపాకులు ధరించిన ఇద్దరు కిరాయి హంతకులు లిస్టు ప్రకారం ఈ మారణకాండకు పాల్పడుతుండగా పోలీసులు వారి పని ఎక్కడిదాకా వచ్చిందని లెక్కలు పెట్టుకున్నారని ఆరోపణ.

ఆనాటి పశ్చిమ బెంగాల్ వాతావరణం కొంత అర్థమయి వుంటుంది. ఈ హత్యాకాండపైన ఆందోళన జరగగా జరగగా పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం 1984లో జస్టిస్ చక్రవర్తి కమిషన్‌ను న్యాయవిచారణ నిమిత్తం నియమించింది. అయితే న్యాయవిచారణ కమిషన్‌ను నియమించాలన్న నిర్ణయం ఏ ఆధారం మీద రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందో చెప్పలేకపోయిందంటూ కలకత్తా హైకోర్టు ఆ కమిషన్ నియామకాన్ని కొట్టి వేసింది.

(ప్రజాజీవితానికి ప్రాముఖ్యం గల విషయమని భావించి ప్రభుత్వం న్యాయ విచారణ కమిషన్ నియమిస్తే అది ప్రాముఖ్యం గల విషయమని చెప్పడానికి ప్రభుత్వం ఆధారాలు చూపలేకపోయిందని చెప్పి కమిషన్ నియామకాన్ని కొట్టి వేయడం ఈ నాటికీ కొనసాగుతున్నది. మన రాష్ట్ర హైకోర్టు ఈ మధ్యనే ఏలేరు స్కాం మీద రాష్ట్ర ప్రభుత్వం నియమించిన న్యాయ విచారణ కమిషన్‌ను కొట్టి వేసింది. వేరే విషయంలో ప్రభుత్వం చేసే పనులలో ప్రజా ప్రయోజనం ఎంత వుందో చూడడానికి సులభంగా సిద్ధపడని కోర్టులు, ప్రజా ప్రయోజనం ఒకవేళ లేకున్నా ఎవరికీ ఏ నష్టమూ చేయని న్యాయవిచారణ కమీషన్ల నియామకాలను కొట్టివేయడానికి సులభంగా సిద్ధపడటం కొంచెం ఆశ్చర్యం కలిగించే విషయమే.)

ఆ ఉదంతం అక్కడితో ముగిసింది కానీ 1998లో ఎపిడిఆర్ చొరవ తీసుకొని మళ్లీ కలకత్తా హైకోర్టులో రిట్ పిటీషన్ వేసింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం న్యాయవిచారణ కమిషన్ ఎందుకు వేయవలసి వచ్చిందనేందుకు ఆధారాలు చూపించలేకపోయిందని చెప్పి కమిషన్ నియామకాన్ని కొట్టేసిన హైకోర్టుకు ఎపిడిఆర్ ఇప్పుడు హత్యల జాబితా ఇచ్చి న్యాయవిచారణ కమిషన్ నియమించడానికి ఈ మాత్రం ఆధారం చాలును కాబట్టి ప్రభుత్వానికి ఆదేశం ఇమ్మని చెప్పి రిట్‌లో కోరింది. ఈసారి కలకత్తా హైకోర్టు 'లేటయిపోయింది' అనింది. సంఘటనలు జరిగి దాదాపు 27 ఏళ్లు గడిచిన తరువాత న్యాయవిచారణ జరిపి ఏం ప్రయోజనం ఉంటుంది అని అడిగింది. 1984లో న్యాయ విచారణ కమిషన్ నియామకాన్ని హైకోర్టు కొట్టేసినప్పుడు సుప్రీంకోర్టు కెందుకు పోలేదు అనింది. (అప్పుడు పోనిదెవరు? ఇప్పుడు కేసు

వేసిందెవరు? వీరిని ఆ ప్రశ్న వేయడం సబబా? అని హైకోర్టుకు తోచలేదు.) 1984 నుండి 1998 దాకా ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం ఎందుకు వేయలేదు, ఇంత ఆలస్యంగానా కేసు వేసేది, ఇప్పుడు న్యాయ విచారణ జరిపించినా సాక్ష్యాలు ఏం దొరుకుతాయి? అంటూ అనేక సందేహాలు వ్యక్తం చేసి చివరికి 1999 ఫిబ్రవరి 2న కలకత్తా హైకోర్టు ఈ కేసు కొట్టేసింది.

కలకత్తా హైకోర్టు సందేహాలను వివరంగా విమర్శించవలసిన అవసరం లేదు. తాను చేయవలసిన పని చేయలేక సాకులు వెతుక్కునే ప్రయత్నంగా దానిని గుర్తించడం కష్టం కాదు. అయితే ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకు పోతే 'హైకోర్టు సకారణంగానే కొట్టేసింది కదా' అని అత్యున్నత న్యాయస్థానం ఐదు నిమిషాలలో తేల్చి చెప్పేసింది.

సుప్రీంకోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్లో పైన వివరించిన న్యాయ సిద్ధాంత సూత్రాలను పిటిషనర్లు వివరించకపోలేదు. అంతర్జాతీయ ఒడంబడికల గురించి, వాటి అమలు విషయంలో ఇదే సుప్రీంకోర్టు చేసిన సూత్రీకరణల గురించి కూడ చెప్పడం జరిగింది. అయినప్పటికీ సుప్రీంకోర్టు వినదల్చుకోలేదు. ఇది కాకతాళీయం కాదు. ఒకటి రెండు ఎన్‌కౌంటర్ ఘటనల పైన రిట్ పిటిషన్లు వేసినప్పుడు సుప్రీంకోర్టే కాదు, వివిధ హైకోర్టులు సహితం నష్టపరిహారం ఇప్పించిన ఉదంతాలు, రాష్ట్ర సిఐడి చేతగానీ సిబిఐ చేతగానీ నేర పరిశోధన జరిపించమని ఆదేశించిన ఉదంతాలూ ఉన్నాయిగానీ 'ఎన్‌కౌంటర్ల పాలసీ' గురించి వేసిన ఒక్క కేసూ ఇప్పటిదాకా ఆదరణ పొందలేదు.

## హక్కుల కమిషన్ చెప్పినా వినలేదు

న్యాయస్థానాల వైఖరి ఈ రకంగా వుంటే జాతీయ మానవహక్కుల కమిషన్ వైఖరి అంతకంటే పెద్ద భిన్నంగా లేదు. మన రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఎన్‌కౌంటర్ల పాలసీ గురించి ఎపిసిఎల్‌సి పంపించిన ఫిర్యాదుపైన జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్రానికొచ్చి విచారణ జరిపిన సంగతి తెలిసిందే. ఐదు ఘటనల పైన విచారణ జరిపి ఐదింటిలోనూ ఫిర్యాది ఆరోపణను నమ్మడానికే ఆధారాలున్నాయని నిర్ణయించింది. ఎన్‌కౌంటర్ చేసిన పోలీసులపైన ఎటువంటి నేర విచారణ జరపకుండా, చనిపోయిన నక్సలైట్ల పైన హత్యా ప్రయత్నం కేసు పెట్టి చేతులు దులుపుకునే ప్రయత్నాన్ని తీవ్రంగా విమర్శించింది. ప్రతీ ఎన్‌కౌంటర్‌పైనా హత్యకేసు

నమోదు చేసి ఒక స్వతంత్ర సంస్థ చేత నేర పరిశోధన జరిపించాలన్న సాధారణ సూత్రీకరణ చేస్తూ, తాను విచారించిన ఐదు కేసులనూ పరిశోధన నిమిత్తం రాష్ట్ర సిబిసిఐడికి అప్పగించాలని ఆదేశించింది. ఈ ఆదేశం ఇచ్చింది నవంబర్ 5, 1996న. ఇప్పుడు మూడేళ్లు గడిచాయి. ఇప్పటికీ ఆ ఐదు కేసులను సిబిసిఐడికి అప్పగించలేదు. ఆ తరువాత 'ఎన్‌కౌంటర్' ఘటనలేమయినా తగ్గాయా అంటే తగ్గలేదు. పోనీ జరిగిన ఘటనల పైన హత్యకేసు నమోదు చేసి ఏదైనా స్వతంత్ర పరిశోధన సంస్థకు అప్పగిస్తున్నారా అంటే అది కూడ లేదు. నిజానికి 1996 నవంబర్ 5న జాతీయ మానవహక్కుల కమిషన్ ఇచ్చిన ఆదేశంలో సాధారణ సూత్రీకరణ ఏదీ లేదనీ, ఆ రిపోర్టు కేవలం ఆ ఐదు ఘటనలకు సంబంధించినది మాత్రమేననీ అప్పటినుండి మన రాష్ట్ర ప్రభుత్వం దబాయిస్తూనే వుంది. ఆ ఐదు కేసులలో సహితం నివేదికలోని ఆదేశాలను పాటించనప్పుడు ఈ దబాయింపెందుకో!

1996 నవంబర్ 5న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలోని సూత్రీకరణ కేవలం ఆ ఐదు కేసులకు మాత్రమే సంబంధించినది కాదని స్పష్టంగా సూచిస్తూ, జాతీయ మానవ హక్కుల కమిషన్ 1997 మార్చి 29న దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకూ ఒక సర్క్యులర్ జారీ చేసింది. అందులో:

> *ఆంధ్రప్రదేశ్‌లో, బహుశా దేశమంతటా జరుగుతున్నదేమిటంటే ఎన్‌కౌంటర్ జరిగిన తరువాత అందులో పాల్గొన్న పోలీస్ పార్టీ ముఖ్యుడు పోలీస్ స్టేషన్లో ఆ ఎన్‌కౌంటర్ గురించి, అందులో చనిపోయిన వారి గురించి సమాచారం ఇస్తాడు. ఎపిసిఎల్‌సి ఫిర్యాదు చేసిన ఈ అన్ని ఘటనలలోనూ పోలీసుల కథనం ఒక్కటే. చనిపోయిన వ్యక్తులు పోలీసులను చూడగానే వారిని హతమార్చే ఉద్దేశ్యంతో కాల్పులు జరిపారనీ, కాబట్టి వారు ఐపిసి సెక్షన్ 307 ప్రకారం శిక్షార్హులనీ ఫిర్యాదు తెలియచేస్తుంది. తాము వారిపైన కాల్పులు జరిపి చంపడం ఆత్మరక్షణ హక్కులో భాగంగా జరిగిందని పోలీసులు అంటారు. ఈ సమాచారం మేరకు పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ నమోదు అవుతుంది. అందులో పోలీసులు తూటా దెబ్బలకు చనిపోయిన వారిని ముద్దాయిలుగా చూపించడం జరుగుతుంది. ముద్దాయిలు చనిపోయారు కాబట్టి ఇంక ఏ నేర పరిశోధనా లేకుండా కేసులను మూసేస్తున్నారు.*

అని వివరించి,

*మన చట్టాలలో పోలీసులకు ఒకరి ప్రాణం తీసే హక్కు లేదు. ఒక పోలీసు అధికారి తన చర్య ద్వారా ఒక ప్రాణం తీస్తే అది చట్టం కల్పించే ఏదైనా మినహాయింపు కిందకి వస్తే తప్ప హత్య అవుతుంది. ఆ చర్య ఆత్మరక్షణలో జరిగి వుంటే అది నేరం కాదని చట్టం చెప్తుంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 46 కింద కూడ ఆ పోలీస్ అధికారి చర్య సమర్థనీయం కావచ్చు. ఈ రెండు మినహాయింపుల కిందికి రాని పక్షంలో ఆ పోలీసు అధికారి చేసినది హత్యనేది స్పష్టమే. ఎన్‌కౌంటర్ పేరిట జరిగిన ఘటన ఈ రెండు మినహాయింపులలో ఒకదాని కిందికి వస్తుందా లేదా అనేది సరయిన నేర పరిశోధనలో మాత్రమే తేలగలదు.*

అని స్పష్టం చేసింది. ఈ వివరణ ఆధారంగా నాలుగు నియమాలను జాతీయ మానవ హక్కుల కమిషన్ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకూ జారీ చేసింది.

ఎ) పోలీసులకూ ఇతరులకూ మధ్య ఎన్‌కౌంటర్ జరిగిన సమాచారం పోలీస్ స్టేషన్ అధికారి దృష్టికి వచ్చినప్పుడు అతను దానిని జనరల్ డైరీలో నమోదు చేయాలి.

బి) ఆ సమాచారం ఒక కాగ్నైజబుల్ నేరం జరిగిన విషయాన్ని తెలుపుతుందని గుర్తించి వెంటనే దానిని పరిశోధించడానికి ఉపక్రమించాలి. ఏదైనా నేరం జరిగిందా, నేరం ఎవరు చేశారు అనే విషయాలు నిర్ధారించే ప్రయత్నం చేయాలి.

సి) ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నది ఆ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీసు సిబ్బందే అయి వుంటారు కాబట్టి ఈ ఘటనపైన జరిగే పరిశోధనను వేరే ఏదైనా స్వతంత్ర పరిశోధన సంస్థకు – ఉదాహరణకు రాష్ట్ర సిఐడికి అప్పగించాలి.

డి) ఈ నేరపరిశోధన ఫలితంగా పోలీసుల పైన విచారణ జరిగి వారికి శిక్ష పడినట్టయితే మృతుల కుటుంబానికి నష్ట పరిహారం ఇచ్చే విషయం పరిశీలించవచ్చు.

ఇది జారీ చేసి మూడు నెలలు తక్కువగా రెండేళ్లు కావస్తున్నది. ఈ రెండేళ్ల కాలంలో మన రాష్ట్రంలో ఎన్నడూ లేనంత ఎక్కువగా 'ఎన్‌కౌంటర్లు' జరుగుతున్నాయి. కాశ్మీర్ లోనయితే చెప్పనవసరమే లేదు. ఇతర రాష్ట్రాలలోనూ (ముఖ్యంగా పంజాబు, ఉత్తరప్రదేశ్, బీహార్, అస్సాం, నాగాలాండ్, మణిపూర్‌లలో) ఎప్పటిలాగే జరుగుతూ వున్నాయి. ఏ ఒక్క రాష్ట్ర ప్రభుత్వమూ జాతీయ మానవహక్కుల కమిషన్ ఆదేశాలను అమలు చేసిన దాఖలాలు లేవు.

దీనికి జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను తప్పుపట్టాలని మేము అనడం లేదు. తానిచ్చిన సూచనలను ప్రభుత్వం పాటించకపోతే ఏ రకమైన చర్య తీసుకునే అధికారమూ కమిషన్‌కు మానవహక్కుల పరిరక్షణ చట్టం (1993) లో లేదు. కనీసం ఇతర కోర్టులకుండేట్టు కోర్టు ధిక్కారానికి శిక్షించే అధికారం కూడ లేదు.

అయితే జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఎక్కడ తప్పు పడుతున్నామంటే, ఈ దేశంలోని ఏ ఒక్క రాష్ట్ర ప్రభుత్వమూ తన ఆదేశాలను ఖాతరు చేయడం లేదని ప్రజలకు చెప్పడానికి జంకుతున్నందుకు. అదేదో తాము సిగ్గుపడవలసిన విషయమైనట్టు మానవహక్కుల కమిషన్ పెద్దలు "ఏం చెప్పుకుంటాంలే" అని తటపటాయిస్తున్నారు. కానీ ఇందులో వాళ్లు సిగ్గు పడవలసిందేమీ లేదు. సిగ్గంటూ పడితే ప్రభుత్వాలు పడాలి. సిగ్గు లేకపోతే ఆ విషయం బయట పెట్టాలి. మానవహక్కుల కమిషన్ ఛైర్మన్‌గారు ఆంధ్రప్రదేశ్‌తో ఈ ఆదేశం అమలు విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నారు. వారు ఏవో అబద్ధాలు చెప్తున్నారు. అవి అబద్ధాలని ప్రైవేట్‌గా విసుక్కుంటూ, పైకి మాత్రం విభిన్న అధికార సంస్థలు అలవాటుగా పాటించే మర్యాదల్నే మానవహక్కుల సంఘం పెద్దలు పాటిస్తున్నారు. నిజానికి కోర్టులో న్యాయమూర్తులు తమ ఆదేశాలు పాటించని అధికారులను కోర్టుకు పిలిచి గట్టిగా తిడతారు. వేరే ఏమీ జరగకపోయినా ఆ సంతృప్తయినా ఫిర్యాదికి ఉంటుంది. జాతీయ మానవ హక్కుల కమిషన్ చంద్రబాబును ఢిల్లీకి పిలిచి తిట్టనక్కరలేదుగానీ అతగాడి వైఖరిని నిరసిస్తూ బహిరంగ ప్రకటన చేయవచ్చు. అప్పుడు కనీసం కొంచెం భయమైనా వుంటుందేమో. కానీ 'ప్రభుత్వంతో శత్రువైఖరి మాకొద్దు' అని కమిషన్ ఛైర్మన్ అంటారు. మళ్లీ మళ్లీ లేఖలు రాస్తూనే ఉంటారంతే.

## ముగింపు దగ్గర్లో లేదు

ఈ సంస్థలేవీ పని చేయకపోయినా పరవాలేదు. ప్రజలు పోరాటాలు చేసి ఎన్‌కౌంటర్‌లను ఆపగలరని ఉపన్యాస ధోరణిలో అనేవారు లేకపోలేదు. ఈ సంస్థలన్నీ ప్రజాతంత్ర రాజకీయ కృషి ఫలితంగా – అంటే ఏదో ఒక రూపంలో జరిగిన ప్రజా ఉద్యమాల ఫలితంగా – ఏర్పడినవే. ప్రజా పోరాటాలు నిజంగా ఇచ్చే ఫలితం ఒక అన్యాయాన్నో మరొక అన్యాయాన్నో ఆపడం కాదు. అది తాత్కాలిక ఫలితం మాత్రమే. నిజమైన ఫలితమెప్పుడొస్తుందంటే ఆ పోరాటాల ఆకాంక్షలు వ్యవస్థిత రూపం తీసుకున్నప్పుడు, అవి నిత్యం పని చేసినప్పుడు. హక్కుల అమలుకు పోరాటాలు

అవసరమైతే చేయవలసిందేగానీ అవి నిత్యం వ్యవస్థితంగా అమలయినప్పుడే నిజంగా హక్కులు వున్నట్టు. హక్కులు అమలు చేయవలసిన సంస్థలను నడిపే వారి వ్యవహార శైలిలో ఆ ఒత్తిడి, లేక ఆ చైతన్యం, లేక ఆ 'సంస్కారం' భాగమయినప్పుడే అవి నిజంగా దక్కినట్టు. అందుకే భిన్న ప్రజాతంత్ర సంస్థల పనితీరుకు ప్రాముఖ్యం ఇవ్వడం, అవి సరిగ్గా పని చేయకపోవడానికి గల వైయక్తిక, సామాజిక, సాంస్కృతిక కారణాలను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.

అదెట్లాగున్నా, ఇప్పుడు ఎన్‌కౌంటర్ల విషయంలో అంతటి ప్రజాస్పందన కూడ లేదు. హతుని వ్యవహార శైలి వల్ల అతనికి స్థానికంగా ప్రజాభిమానం వున్నప్పుడు, లేదా హతునికి స్థానికంగా విస్తృతమైన సామాజిక సంబంధాలు వున్నప్పుడు (ఉదాహరణకు అతనిది సంఖ్యరీత్యా పెద్దదయిన కులమైనప్పుడు), ఎక్కువ భాగం హతుడు చనిపోయిన ప్రాంతానికి స్థానికుడయినప్పుడు ప్రజలలో స్పందన వస్తున్నదే తప్ప అన్ని సందర్భాలలో రావడం లేదు. ఈ స్పందన అంత్యక్రియలకు పెద్ద సంఖ్యలో హాజరుకావడం, శవం దగ్గర పోలీసులను తిట్టిపోసుకోవడం మొదలయిన రూపాలలో వుంటున్నది. నూటికి అయిదు లేక పది కేసులకు మించి కనిపించని ఈ స్పందనలో హతుని మీద అభిమానం ఎంత, ఎన్‌కౌంటర్‌ల పట్ల రాజకీయ వ్యతిరేకత ఎంత అంటే మొదటిదే ఎక్కువ అని చెప్పవచ్చు. అయినా, పాకిస్థాన్ నుండి వచ్చి కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్లో చనిపోయే అపరిచితుడయిన ముజాహిదీన్‌కు సహితం ఉద్యమకాంక్ష నుండి పుట్టిన అభిమానంతో మన దగ్గరి కంటే చాలా తరచుగా, ఎక్కువగా నిరసన తెలిపే కాశ్మీరీలు సహితం తమ నిరసన ద్వారా ఎన్‌కౌంటర్ హత్యలను తగ్గించలేక పోతున్నప్పుడు మన దగ్గర వ్యక్తమయ్యే ఈ పాటి నిరసన ఆ పని చేయగలుగుతుందని నమ్మడం కష్టం.

ఈ నిరసనను పెంచడం ఎంత ముఖ్యమైన కర్తవ్యమో, రాజ్యహింసను అదుపు చేసే చట్టపరమైన బాధ్యత గల సంస్థలకు బలం చేకూర్చడమూ అంతే ముఖ్యం. అది రోజురోజుకూ మరింత కష్టతరమైన కర్తవ్యంగా కనిపిస్తున్నప్పటికీ దాని మీద ప్రత్యేకంగా దృష్టి పెట్టడం చాలా అవసరం.

*మానవహక్కుల వేదిక బులెటిన్ 1*
*నవంబర్ 1999*

# హత్యచేసి ఎదురుకాల్పులంటే సరిపోతుందా?

'ఎన్‌కౌంటర్లన్నీ పోలీసు హత్యలే' అన్న నినాదం వినని వారు రాష్ట్రంలో ఉండరు. దాదాపు నలభై సంవత్సరాలుగా ఈ వ్యాఖ్య ఒక నినాదం రూపంలో హక్కుల ఉద్యమం, ప్రజాతంత్ర ఉద్యమాలు ప్రచారంలో పెట్టాయి.

ఇది కేవలం ఒక రాజకీయ నినాదం కాదని, ఇది చట్ట సంబంధమైన వ్యాఖ్య అని కూడ ఈ ఉద్యమాలు స్పష్టం చేశాయి. అంటే చట్టమే 'ఎన్‌కౌంటర్' అనే దానిని హత్యగా గుర్తిస్తుందని అర్థం. ఇందులో పెద్ద రహస్యమేమీ లేదు. నిగూఢమైన న్యాయ సిద్ధాంతమూ లేదు. ఆయుధాలు ధరించిన ఒక వ్యక్తిని తాము అరెస్టు చేయబోగా అతను లొంగిపోకుండా తమపైన దాడి చేశాడనీ, దానివల్ల తమకు ప్రాణాపాయం ఏర్పడిందనీ, ఆత్మరక్షణలో తాము ఎదురుకాల్పులు జరపగా అతను చనిపోయాడని ప్రతీ 'ఎన్‌కౌంటర్'లోనూ పోలీసులు అంటుంటారు. ఆత్మరక్షణలో చేసిన హత్య కూడ చట్టం కళ్ళలో హత్యే. అది నిజంగా ఆత్మరక్షణలో జరిగినట్టయితే దానికి శిక్ష ఉండదు గానీ అది హత్య కాకుండా పోదు. అది ఆత్మరక్షణలో జరిగిందా లేదా అనేది తేలవలసింది నేర విచారణలోనే తప్ప చంపిన వాడే ప్రకటించుకొని స్వేచ్ఛగా వెళ్ళిపోవడానికి వీలులేదు. అతని పైన హత్య కేసు నమోదు కావాలి, నేర విచారణ జరగాలి, ఆత్మరక్షణలో ప్రాణం తీసే అగత్యం తనకు ఏర్పడిందని అతను రుజువు చేసుకోవాలి. ఈ విషయంలో

పోలీసులకూ, మామూలు పౌరులకూ తేడా ఏమీ లేదు. చంపినవాడు 'ఆత్మరక్షణలో చేశాను' అని ప్రకటించినంత మాత్రాన స్వేచ్ఛ పొందేటట్టయితే జీవించే హక్కుకు అర్థమేమైనా ఉంటుందా?

ఇది ఎవరికైనా సులభంగా అర్థమయ్యే విషయమేనని మేము భావిస్తున్నాం. అయితే న్యాయస్థానాలకు అర్థం చేయించడానికి చాలా కష్టతరమైన ప్రయత్నం చేయవలసి వచ్చింది. అది ఒక దశాబ్దం కింద సఫలమైనట్టే అయి చివరికి విఫలమయింది. ఎన్‌కౌంటర్ అనేది దానంతటదే హత్య కాదనీ, 'ఫలానా పోలీస్ అధికారి ఫలానా వ్యక్తిని ఉద్దేశ్య పూర్వకంగా చంపి దానికి ఎదురుకాల్పుల కథ అల్లాడు' అని ఎవరైనా నిర్దిష్టంగా ఫిర్యాదు చేస్తేనే ఆ పోలీసు అధికారిపైన హత్యకేసు నమోదు చేయవలసి ఉంటుందనీ మన రాష్ట్ర హైకోర్టు ఇప్పుడు తీర్పు చెప్పింది. పోలీసులు ముఖానికి ముసుగు వేసుకొని ఎవరినైనా చంపేసినా, చీకటిలో మాటువేసి చంపేసినా, లేదా ఫిర్యాదు చేసే నాథుడు లేని ఏ పాకిస్తానీనో, బంగ్లాదేశీనో హైదరాబాద్‌లో కాల్చేసినా నిర్దిష్టమైన ఫిర్యాదు ఉండజాలదు కాబట్టి అది హత్య కాదు. మరి అటువంటి కేసులలో ఏం జరగాలంటే మెజిస్టీరియల్ విచారణలో ఏమైనా అనుమానాస్పదంగా తేలితే అప్పుడు తదనుగుణంగా చర్యలు చేపట్టాలంటుంది హైకోర్టు.

ఇది చట్టవిరుద్ధమైన, రాజ్యాంగ విరుద్ధమైన తీర్పే కాక 'జీవించే హక్కు'కు చాలా నష్టకరమైనది కూడ. ఈ తీర్పును తిరస్కరించి జీవించే హక్కును కాపాడుకుందాం రమ్మని మేము ప్రజలకు పిలుపునిస్తున్నాం. ఒకరిని చంపేసి, ఫిర్యాదు చేయగల వాళ్ళను బెదిరించి ఫిర్యాదు లేకుండా, మెజిస్టీరియల్ విచారణకు ఎవరూ హాజరు కాకుండా చేసుకునేటట్టయితే ఏ కేసూ ఉండదని పోలీసులు హామీ పొందడం సాధారణ పౌరుల మనుగడకు అత్యంత ప్రమాదకరం. మొన్నటికి మొన్న విశాఖపట్నంలో జరిగిన ఘటన అందరికీ గుర్తుండే ఉంటుంది. నిజాయితీపరుడైన ఒక బ్యాంక్ అధికారిని ఎవరో దుర్మార్గులు చాలా కిరాతకంగా హత్యచేశారు. పోలీసులు ఇద్దరు అనుమానితులను పట్టుకొని కాల్చిచంపి 'తమ మీద తిరగబడితే ఆత్మరక్షణలో కాల్చి చంపాం' అని ప్రకటించారు. భయం వల్లనో, ఏ కారణంగానో మృతుల కుటుంబాలు ఫిర్యాదు చేయలేదు. మెజిస్టీరియల్ విచారణలో ఏం చెప్పారో, అసలేమైనా చెప్పారో లేదో తెలీదు. ఇక అంతేనా? ఆ బ్యాంకు అధికారిని చంపిన వారికి తప్పక శిక్ష పడవలసిందే. కానీ శిక్ష వేయవలసింది న్యాయస్థానమా పోలీసులా? ఈ ఇద్దరే

హంతకులని వాదన కోసం అనుకుందాం. పోలీసులివాళ ఆ దుర్మార్గులను చంపారు. రేపు సన్మార్గులను చంపుతారు. అప్పుడు కూడ తమకు అలవాటైన పద్ధతిలో 'నిర్దిష్టమైన ఫిర్యాదు' లేకుండా చేసుకుంటారు. మెజిస్ట్రీరియల్ విచారణకు సాక్షులు రాకుండా చేసుకుంటారు. అప్పుడేం గతి?

'ఆత్మరక్షణ'లో ఎదుటివారి పైన ఎదురుదాడి చేసే హక్కు పోలీసులకే కాదు పౌరులందరికీ ఉంది. ఎంతటి ప్రమాదం ఏర్పడితే అంత మేరకు మాత్రమే ఎదురుదాడి చేసే హక్కు ఉందని చట్టం అంటుంది. అంతకు మించి చేస్తే అది నేరం అవుతుంది. అందుకే ఆత్మరక్షణలో హింసకు పాల్పడ్డాను అని చెప్పుకున్న వ్యక్తి స్వేచ్ఛగా వెళ్ళిపోవడానికి వీలులేదు. అతనికి ఎంత ప్రమాదం ఏర్పడింది, దానిని ఎదుర్కొనడానికి ఎంతటి ఎదురుదాడి చేశాడు అనేది నేర విచారణలో తేలవలసిందే. పైగా అవసరమైన మేరకే చేశానని అతనే రుజువు చేసుకోవాలి అని చట్టం అంటుంది. అంటే అతని పైన కేసు నమోదు కావాలి, నేర విచారణ జరగాలి, ఏ సంగతీ విచారణలో తేలాలి.

సాధారణ పౌరుల విషయంలో ఇది న్యాయస్థానాలు అంగీకరించే సూత్రమే. ప్రతి రోజూ అమలు చేసే సూత్రమే. ఈ విషయంలో పోలీసులకు భిన్నమైన సూత్రం వర్తిస్తుందని చట్టంలో ఎక్కడా లేదు. అయినప్పటికీ భిన్నమైన సూత్రం వర్తించాలని హైకోర్టు భావించింది. శాంతిభద్రతల నిర్వహణలోనూ, నేరాల అదుపులోనూ పోలీసులకు ఉండే విధులన్నిటినీ ఏకరవు పెట్టి 'ఇంత బృహత్తరమైన పాత్రను పోలీసు యంత్రాంగానికి అప్పగించినప్పుడు, విధి నిర్వహణ క్రమంలో వారు పాల్పడే తప్పిదాలను సాధారణ పౌరులు చేసే నేరాలతో సమానంగా చూడాలన్న వాదనను అంగీకరించడం కష్టం' అంటుంది హైకోర్టు. అటువంటి నిర్ణయానికి వచ్చే అధికారం శాసనకర్తలకు ఉందేమోగానీ న్యాయస్థానాలకు ఉందా? పోలీసులు విధినిర్వహణ పేరిట చేసే నేరాలకు వేరే నేరస్మృతి వర్తించాలని శాసనకర్తలు భావించలేదు. నేరస్మృతిలో ఎక్కడా ఆ తేడా లేదు. చట్టాలలో లేనిదానిని ఊహించే అధికారం కోర్టులకెక్కడిది?

'హింస చేసే వారికి హక్కు లెక్కడివి?" అన్న ప్రశ్న తరచుగా వింటుంటాం. అది వినడానికి న్యాయంగానే తోస్తుందిగానీ మంచివాళ్ళకు మాత్రమే హక్కులుండే సమాజం నాగరికం అనిపించుకుంటుందా? మంచి కారణంగానో, చెడ్డ కారణంగానో సమాజం కట్టడిని అతిక్రమించే వాళ్ళను కూడ అందరితో సమానంగా పౌరులుగా

గుర్తించి, సమానంగా హక్కులు కల్పించి, వారిని అదుపు చేసినా కూడ ఆ హక్కుల పరిధిలో మాత్రమే చేసే సమాజమే నాగరికం అనిపించుకుంటుంది. మన రాజ్యాంగకర్తలు ఆ విధంగా భావించారు కాబట్టే హక్కులు అందరికీ ఒకే రకంగా కల్పించారు. వాళ్ళేమీ ప్రశాంత వాతావరణంలో కూర్చొని రాజ్యాంగాన్ని రాయలేదు. విపరీతమైన హింసాకాండ మధ్య భారత రాజ్యాంగం రాయబడింది. దేశ విభజన సందర్భంగా హిందువులు, ముస్లింలు, సిక్కులు మతం ప్రాతిపదికన పెద్దెత్తున నరుక్కున్నారు, చంపుకున్నారు. ఊళ్ళకు ఊళ్ళు ఖాళీ అయ్యాయి, కనీసం 10 లక్షల మంది చనిపోయారు. ప్రపంచం అప్పటికెక్కడా చూసి ఎరుగని బలాత్కారపు జనాభా మార్పిడీ జరిగింది. ఇదంతా జరుగుతుండగా రాసినదైనా సరే రాజ్యాంగం అందరికీ ఒకే రకంగా హక్కులు కల్పించింది, అనుల్లంఘనీయమైన హక్కులు కల్పించింది. ఆ స్ఫూర్తిని న్యాయస్థానాలు మరచిపోవడం విచారకరం.

'చట్టాన్ని అందరూ గౌరవించి నడుచుకునే స్థితి ఉంటే చాలా బాగుండేది. అయితే కొంతమంది తాము ఇతరులకు హానిచేస్తాము గానీ తమకు ఎట్టి పరిస్థితిలోనైనా చట్టబద్ధ పాలనే వర్తించాలన్నప్పుడు సమస్య వస్తుంది. నిజమే, న్యాయంగా వర్తించిన వాడికే న్యాయం కోరే హక్కు ఉంది అన్న సూత్రం నేరస్మృతిలో లేదు. చట్టాన్ని గౌరవించని వారికి రాజ్యాంగ రక్షణ ఉండదన్న సూత్రమూ లేదు. అయితే ఈ మేరకు మాత్రం చెప్పగలం. ఒక వ్యక్తిగానీ, బృందంగానీ అమాయకులను చంపుతూ, చంపుతామని ప్రచారం చేసుకుంటూ తమ చర్యలను అదుపుచేసే విషయంలో అన్ని రకాల రక్షణ తమకు కావాలని కోరడానికి వీలులేదు' అని హైకోర్టు అభిప్రాయపడింది. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమైన అభిప్రాయం. రాజ్యాంగం సంగతి అటుంచి, ఎటువంటి వారితో నైనా నాగరికంగా వ్యవహరించే సమాజమే నాగరికమైనది. తన నియమాలను గౌరవించే వాళ్ళతో మాత్రమే నాగరికంగా వ్యవహరించేది నాగరిక సమాజం కాదు.

అయినా పోలీసులు 'అమాయకులను' చంపడాన్ని కార్యక్రమంగా పెట్టుకున్న వాళ్ళను మాత్రమే ఎన్‌కౌంటర్ల పేరిట చంపడం లేదు. కోర్టులు విచారించి శిక్షించగల ముద్దాయిలను సైతం తామే న్యాయనిర్ణేతలై చంపుతున్నారు. 'నక్సలైట్' అన్న ముద్ర ఉన్న వారెవ్వరినైనా అరెస్టు చేసే అవకాశం ఉండీ, ఆ ప్రయత్నం చేయకుండా నేరుగా కాల్చి చంపుతున్నారు. ముదిగొండలో లాగా తాము విరమించమన్నప్పుడు

ఆందోళన విరమించలేదన్న కక్షతో కాల్చి చంపుతున్నారు. నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయనుకున్నప్పుడూ, 'దొంగ వెధవలకు భయం లేకుండా పోయింది' అనుకున్నప్పుడూ కూడ ఒకరిద్దరిని కాల్చి చంపి భయం కల్పిస్తున్నారు.

హైకోర్టు న్యాయమూర్తులు చట్టాన్ని తప్పుగా అర్థం చేసుకోవడం కూడ ఈ తప్పుడు తీర్పుకు దారితీసింది. పార్లమెంటు పైన 2001 డిసెంబర్ 13 నాడు జరిగిన దాడిని, ఆ దాడికి పాల్పడిన అయిదుగురిని సిఆర్‌పిఎఫ్ జవాన్లు కాల్చిచంపిన విషయాన్ని ప్రస్తావిస్తూ వారిపైన కూడ హత్య కేసు నమోదు చేయాలా? అని ప్రశ్నించారు. నమోదు చేసినట్టయితే, దాడి చేసిన వారు చంపదలచుకుంది పార్లమెంటు సభ్యులనే తప్ప ఈ జవాన్లను కాదు కాబట్టి వారి చర్య ఆత్మరక్షణ కిందికి రాదనీ, వారికి శిక్షపడి ఉండేదనీ అభిప్రాయపడ్డారు. కానీ చట్టంలో ఉండే ఆత్మరక్షణ హక్కు మన ప్రాణాన్ని కాపాడుకునే హక్కే కాదు, పక్కవారి ప్రాణాన్ని కాపాడే హక్కు కూడ. అంతేకాక, పోలీసు సిబ్బందికి నేరాలను నిరోధించడానికి అవసరమైన బలప్రయోగానికి పాల్పడే అధికారమూ చట్టంలో ఉంది. ఎటొచ్చీ ఆత్మరక్షణలోనైనా, విధి నిర్వహణలోనైనా అవసరమైన మేరకే బలప్రయోగానికి పాల్పడ్డారా లేదా అన్నది తేలాలి. దాని కోసం కేసు నమోదు చేయాలి, నేరపరిశోధన జరపాలి. జవాన్ల కాల్పులలో చనిపోయిన అయిదుగురిలో నలుగురు మాత్రమే పార్లమెంటుపైన దాడిచేసిన దుండగులై ఉంటే? అయిదవ వ్యక్తి స్థానికంగా పరిచయాలేవీ లేని పర్యాటకుడు అయివుంటే? అతన్ని కూడ దుండగుడిగా భావించి అన్యాయంగా కాల్చేశారని ఫిర్యాదు చేసేవాళ్ళెవరూ లేకపోతే ఆ చావు ఈ చావులతో కలిసి పోవలసిందేనా? అందుకే హత్యకేసు నమోదు, స్వతంత్రమైన నేరపరిశోధన అవసరం. అంతమాత్రం చేత ఆ సిఆర్‌పిఎఫ్ జవాన్లను అరెస్టు చేయనక్కరలేదు, ఉద్యోగాల నుండి బర్తరఫ్ చేయనక్కరలేదు. కేసు నమోదైన వెంటనే అరెస్టు చేసి తీరాలని, ఉద్యోగం నుంచి తీసివేయాలని నియమం లేదు. నేరపరిశోధన మాత్రం స్వతంత్రంగా, నిష్పాక్షికంగా జరగాలి. చివరికి ఆత్మరక్షణ (ఇందులో చట్టం ప్రకారం పక్కవారి ప్రాణరక్షణ కూడ మిళితమై ఉందని మరొకసారి చెప్పాలి) లో గానీ విధి నిర్వహణలో గానీ కాల్పులు సహేతుకంగా జరిపారన్న నిర్ధారణకు వస్తే, విచారణ ఆదిలోనే వారిని నిర్దోషులుగా ప్రకటించవచ్చు. ఈ రకమైన ప్రక్రియను అనుసరించడం నాగరికం అనిపించుకుంటుంది గానీ అయిదు ప్రాణాలు పోయిన ఆ ఘటనను ఏ విచారణా లేకుండా మూసేయడం సరైనది కాదు.

మెజిస్ట్రీరియల్ విచారణ పట్ల హైకోర్టు ప్రదర్శించిన విశ్వాసాన్నీ, దానికి ఆపాదించిన ప్రాముఖ్యాన్నీ ప్రస్తావించి ముగిస్తాం. ఆ విచారణ చేపట్టేది ఆర్డీవో స్థాయి అధికారులు. వారికి న్యాయస్థానాలకుండే ఏ అధికారమూ లేదు. ఏ సాక్షినీ విచారణకు రప్పించలేరు. రాకపోతే ఎవరినీ దండించలేరు. ఆ విచారణలో సాక్షుల క్రాస్ – ఎగ్జామినేషన్ ఉండదు. విచారణాధికారి అభిప్రాయం తీర్పు కాదు. అన్నిటినీ మించి, కోర్టులంటేనే అంతంత మాత్రం గౌరవం ఉన్న పోలీసులకు ఈ విచారణలంటే అసలు గౌరవం లేదు. ఆర్‌డివో కార్యాలయాన్నీ, మృతుని గ్రామాన్నీ చుట్టుముట్టి ఎవ్వరూ విచారణకు రాకుండా చేయగలరు, తరచూ చేస్తారు కూడ. అటువంటి విచారణలో నిజం తేలితేనే కేసు పెట్టాలనడం కేసు పెట్టనే అక్కరలేదనడంతో సమానం.

ఏ రకంగా చూసినా అన్యాయమైన ఈ తీర్పు ప్రజల జీవించే హక్కుకు తీవ్ర విఘాతం. దీనిని నిరసిస్తూ మానవహక్కుల వేదిక రాష్ట్ర వ్యాపితంగా చేపడుతున్న కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ –

*మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది*

*1 డిసెంబర్ 2007*

*ఈ తీర్పు ఇచ్చింది ముగ్గురు జడ్జిల బెంచి. అందులో ఇద్దరు మెజారిటీ అభిప్రాయంగా దీనిని ప్రకటించారు. ఆ న్యాయమూర్తులు ఎల్.నరసింహారెడ్డి, జి.యతిరాజులు గార్లు. మూడవ జడ్జి అయిన బిలాల్ నజ్కీ గారు ఈ తీర్పుతో విభేదించి హక్కుల సంఘాల వాదనే సరైనదన్నారు. అయితే మెజారిటీ తీర్పే కోర్టు తీర్పుగా భావించబడుతుంది.*

# సహజ న్యాయమా... పోలీసు న్యాయమా?

ఎన్‌కౌంటర్లన్నీ హత్యలేనని చివరికి హైకోర్టు అననే అనింది. 'వాళ్లే చంపి వాళ్లే అది ఆత్మరక్షణలో జరిగిందని ప్రకటించుకునే పనయితే ఇంక కోర్టులెందుకు? అని చాలా కాలంగా ప్రశ్నిస్తున్న పామర జనంతో రాష్ట్రంలోని అత్యున్నత న్యాయస్థానం గొంతు కలిపింది.

మరయితే మాకు తుపాకులెందుకిచ్చారు అని కొందరు పోలీసు సిబ్బంది విస్మయం వ్యక్తం చేసారు. పోలీసులకు తుపాకులిచ్చింది ప్రాణాలు తీయడానికి కాదు, కాపాడడానికి అనేది కూడ వాళ్లు మరిచిపోయినట్టున్నారు. ఒకరి ప్రాణానికి అపాయమో, ఆస్తికి తీవ్ర నష్టమో జరిగే అవకాశం ఉన్నప్పుడు దానిని నివారించడానికి ఇచ్చిన పరిమితమైన బలప్రయోగ అధికారాన్ని ప్రాణాలు తీసే అధికారంగా పోలీసులూ, వారిని తమ సాధనాలుగా వాడుకునే పాలకులూ భావించడం 'ఎన్‌కౌంటర్' హత్యలకు బాట వేసింది. దేశభద్రత కోసం, సామాజిక శాంతి కోసం చంపొచ్చని మొదట్లో సమర్థించుకున్నారు. కరడు గట్టిన నేరగాళ్ల పీడ వదిలించుకోవడానికి ఇదే సరయిన మార్గమని తరువాత దానిని విస్తరించారు. చివరికి 'ప్రజలు కోరుకుంటున్నారు' అనే పేరు మీద చంపడమూ మొదలుపెట్టారు.

నైతికంగా సమర్థించుకోవడానికి ఈ కారణాలు చూపించినా, చట్టం ఆమోదం పొందడానికివి సరిపోవు కాబట్టి ఆత్మరక్షణలో చంపారన్నది 'ఎన్‌కౌంటర్ల' కథ అయింది. రానురాను ఈ కథ ఎంత రివాజుగా తయారయిందంటే పోలీసులకు హత్యలు చేసే అధికారం

ఉండాలని భావించేవారు సహితం వాటిని నమ్మడం మానేసారు. ఇవ్వాళ పోలీసులు నిజంగానే ఆత్మరక్షణలో ఒకరిని చంపినా ఎవరూ నమ్మని పరిస్థితి ఏర్పడింది. దశాబ్దాల తరబడి అబద్ధాలను ఆశ్రయించడం పోలీసు యంత్రాంగం విశ్వసనీయతను అంతగా దెబ్బ తీసింది.

'ఎన్‌కౌంటర్లు' అనేవి కేవలం ఒకరిద్దరు పోలీసు అధికారుల తప్పుడు ఆలోచనల ఫలితంగా జరుగుతున్నవి కావనీ అవి పాలనా విధానంగా, పాలసీగా జరుగుతున్నాయనీ హక్కుల సంఘాలుగా మేము మొదటి నుండి అంటున్నాం. ఈ హంతక విధానాన్ని ఎండగట్టడం, ప్రజలు దానిని నిరసించేటట్లు చేయడం ఒక ముఖ్య కార్యక్రమంగా పెట్టుకున్నాం. పోలీసులు ఒక వ్యక్తిని కాల్చి పారేస్తే ఆ వ్యక్తి మన దృష్టిలో దుర్మార్గుడనో, దేశానికి ప్రమాదకారి అనో మౌనంగా ఉండిపోవద్దనీ, దాని వలన ఏ నాగరిక సమాజంలోనూ అధికార యంత్రాంగానికి ఉండకూడని అధికారాలను మనం చేజేతులా ఇచ్చిన వారమవుతామనీ హెచ్చరించడం ఒక పనిగా పెట్టుకున్నాం. ఎన్‌కౌంటర్ హత్యల విషయంలో విస్తృతమైన ఏహ్యభావాన్ని కలిగించడంలో కృతకృత్యులమయ్యామనే భావిస్తున్నాం. 'చంపే అధికారం లేకపోతే పోలీసులకు తుపాకులెందుకిచ్చారు?' అన్న ఎదురుప్రశ్న మొదట్లో తరచుగా వినేవాళ్లం. చదువుకోని వాళ్లకంటే చదువుకున్న వాళ్లనుండే ఎక్కువ వినేవాళ్లం. ఇప్పుడది బాగా తగ్గిపోయింది.

అయినప్పటికీ ఎన్‌కౌంటర్ హత్యలు తగ్గకపోగా కొత్త వర్గాలకు విస్తరిస్తున్నాయంటే మన ప్రజాస్వామ్యం దౌర్బల్యం దానికొక కారణం. ప్రజాభిప్రాయం ఆమోదించని పనులు సాగించుకోవడం అసాధ్యం చేసే బలాన్ని భారత ప్రజాస్వామ్యం ఇంకా పొందలేదు. అయితే వేరొక కారణమూ ఉంది. సమాజంలో వివిధ కారణాల వల్ల పెరుగుతున్న హింసకు రాజ్యహింసే విరుగుడన్న భావజాలాన్ని పాలకులు సమర్థంగా పెంపొందించగలిగారు. దానికి వంతపాడే మేధావులూ సమాజంలో తయారయ్యారు. హక్కుల ఉద్యమం ప్రజలలో పోలీసు హింసాకాండ పట్ల కలిగించడంలో సఫలం అయిన వ్యతిరేకతను అవతలివైపునుండి అధిగమించడానికి ఈ భావజాలం వ్యాప్తి పాలకులకు అక్కరకొచ్చింది. అనధికార హింసకు అధికార హింస పరిష్కారం అన్న ఆలోచన విధ్వంసకరమైనదన్న ఎరుక సమాజంలో లేకపోలేదు గానీ దాని గొంతు వినపడని మోతాదులో ఈ భావజాలం చేసే రొద ఉంటున్నది. దానిని ఎదుర్కోవడం ఇవాళ హక్కుల ఉద్యమం చేపడుతున్న ఒక ముఖ్య కార్యక్రమం.

అదే సమయంలో చట్టం ద్వారా, న్యాయస్థానాల ద్వారా ఈ రాజ్య హింసాకాండను ఎదుర్కొనే ప్రయత్నమూ చేస్తున్నాం. ఆత్మరక్షణ కోసం ఎదురుదాడి చేసే హక్కు ప్రతీ ప్రాణికీ ఉంది. అది జీవికి ఉండే సహజ హక్కులలో ఒకటి. చట్టమూ దానిని గుర్తించింది. అయితే ఆ హక్కు హింసకు సాకు కాకుండ చూడడానికి చట్టం దానికి పరిధులు నిర్దేశించింది. ప్రమాదాన్ని అధిగమించే మేరకు చేసే ఎదురుదాడి మాత్రమే ఆత్మరక్షణ కిందికి వస్తుందనీ దానిని దాటిపోతే నేరం అవుతుందనీ చట్టం అంటుంది. 'ఆత్మరక్షణ' పేరిట జరిగిన దాడి ఆ పరిధికి లోబడి ఉందా లేదా అని తేల్చడానికి నిష్పాక్షికమైన విచారణ జరగాలని చట్టం అంటుంది. ఇది సాధారణ పౌరులకెంత మేరకు వర్తిస్తుందో పోలీసు సిబ్బందికీ సైనిక సిబ్బందికీ కూడ అంతే మేరకు వర్తిస్తుంది.

ఈ వాదన న్యాయస్థానాలలో చేయగా చేయగా 1995లో మొదటిసారి మన రాష్ట్ర హైకోర్టు దీనితో ఏకీభవించింది. దాదాపు అదే సమయంలో ఎన్‌కౌంటర్లపైన విచారణ చేపట్టి 1996లో ఆదేశాలు జారీ చేసిన జాతీయ మానవ హక్కుల కమిషన్ కూడ ఏకీభవించింది. ప్రతీ ఎన్‌కౌంటర్ ఘటనపై ఎవరి ఫిర్యాదూ అవసరం లేకుండ కేసు నమోదు చేయాలనీ, దానిపైన నిష్పాక్షికమైన నేరపరిశోధన జరగాలనీ, ఆ హత్య ఆత్మరక్షణలో జరిగిందా లేదా అనేది న్యాయస్థానం తేల్చాలనీ హైకోర్టు, జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశించాయి. న్యాయపోరాటం సూత్రప్రాయంగా అక్కడితో అయిపోవలసిందేగానీ ఆ తరువాత హైకోర్టు అందుకు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేయడం వల్ల మళ్లీ మళ్లీ వాదనలు జరపవలసి వచ్చింది. చివరికి ఐదుగురు న్యాయమూర్తుల బెంచి ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రకటించిన తీర్పు హక్కుల సంఘాల వాదనను సమర్థించింది. ఇప్పుడు రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం దానిని సుప్రీంకోర్టులో సవాలు చేసింది కాబట్టి ఇక ఈ సంవాదం ఢిల్లీలో కొనసాగుతుంది.

హైకోర్టు తీర్పులో రెండు మూడు విషయాలు అస్పష్టంగా ఉండిపోయాయి. ఒకటి – ప్రతీ 'ఎన్‌కౌంటర్' పైనా నేరం నమోదు కావాలనీ నిష్పాక్షికమైన నేర పరిశోధన జరగాలనీ అన్నారు బాగానే ఉంది గానీ నేర పరిశోధన ఎవరు చేయాలి? 1996లో జాతీయ మానవ హక్కుల కమిషన్ ఇచ్చిన ఆదేశంలో 'స్థానిక పోలీసు యంత్రాంగం నుండి వీలయినంత వరకు స్వతంత్రులయిన' యంత్రాంగం నేర పరిశోధన జరపాలని అన్నారు. అటువంటి యంత్రాంగం ఎక్కడుంది? 'సిబిఐ విచారణ' అని వివిధ సందర్భాలలో చాలామంది డిమాండ్ చేస్తుంటారు గానీ సిబిఐలో ఉండే

అధికారులు వివిధ రాష్ట్రాల పోలీసు యంత్రాంగం నుండి తీసుకోబడ్డవారే. ఇప్పుడు ఎన్‌కౌంటర్లు అన్ని రాష్ట్రాలకూ పాకాయి కాబట్టి వారి నుండి నిష్పాక్షికతను కూడ ఆశించలేం.

జాతీయ, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్లకు అనుబంధంగా నేరపరిశోధక శాఖలున్నాయి. అయితే వాటి సిబ్బందినీ అధికారులనూ వివిధ రాష్ట్రాల పోలీసు యంత్రాంగాల నుండి, కేంద్ర పారా మిలిటరీ నుండి డిప్యుటేషన్ మీద తీసుకుంటున్నారు తప్ప స్వతంత్రంగా ఎంపిక చేయడం లేదు. ఈ పద్ధతి మానేసి వారిని విడిగా ఆయా మానవ హక్కుల కమిషన్‌లే ఎంపిక చేయాలనీ, వారికి పోలీసు యంత్రాంగాలతో శాఖాపరమైన సంబంధాలేవీ ఉండకూడదనీ ఒక నియమం చేసి వారికే పోలీస్ ఎన్‌కౌంటర్లు, చిత్రహింసల కేసుల పరిశోధన అప్పగిస్తే కొంతవరకయినా స్వతంత్రమైన నేరపరిశోధన జరగవచ్చు.

మేజిస్ట్రేట్లకు అవసరమయిన శిక్షణ రెండవ సమస్య. ఎన్‌కౌంటర్ పైన కేసు పెట్టి నేరపరిశోధన జరిపే యంత్రాంగం అది నిజంగా ఎదురుకాల్పుల ఘటనేనని ఒకవేళ భావించి రిపోర్టు నమోదు చేసినా కూడ మేజిస్ట్రేటు దానిని ఆమోదించనవసరం లేదనీ, తన విజ్ఞత ఉపయోగించి విభేదించవచ్చునీ చట్టం చెప్తుంది. హైకోర్టు ఆ మాటే అనింది. కానీ దానికి కావలసిన శిక్షణ, చొరవ ఉందా? నేరపరిశోధన జరిపిన యంత్రాంగం ఏం దాచిపెట్టిందో చూసి మళ్లీ పరిశోధన జరపమని ఆదేశించాలి లేదా వారు సేకరించిన సమాచారం నుండే భిన్న అభిప్రాయానికి రావాలి. దీనికి కావలసిన యోగ్యత సగటు మేజిస్ట్రేట్లలో లేదు. పోలీసు హింస ఒక ముఖ్యమైన సమస్య కాబట్టి ఈ కర్తవ్యానికి అవసరమైన శిక్షణ మేజిస్ట్రేట్లకు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఈ శిక్షణ హక్కుల ఉద్యమంలో అనుభవం ఉన్న సీనియర్ న్యాయవాదుల చేత ఇప్పించడమే ఉచితంగా ఉంటుంది.

ఈ రెండవ సమస్యలోనే మూడవ సమస్య ఇమిడి ఉంది. ఒక ఫిర్యాదును పరిశోధించిన పోలీసులు అందులో నిజం లేదన్న అభిప్రాయానికొచ్చి మేజిస్ట్రేట్ కోర్టులో నివేదిక దాఖలు చేసినప్పుడు ఫిర్యాదికి ఆ విషయం తెలియజేయాలని చట్టం అంటుంది. అప్పుడు ఫిర్యాదికి తన అభ్యంతరాలు మేజిస్ట్రేటుకు చెప్పే అవకాశం లభిస్తుంది. ఇది పోలీసుల నివేదికను పరిశీలించే విషయంలో మేజిస్ట్రేటుకు తోడ్పడుతుంది. అయితే 'ఎన్‌కౌంటర్'లో చంపిన పోలీస్ అధికారే 'ఫిర్యాది'. అతని సమాచారం

మీదనే కేసు నమోదవుతుంది. కాబట్టి చట్టం ఫిర్యాదికి ఇచ్చే హక్కు ఎన్‌కౌంటర్ కేసులో ఉపయోగపడదు. కేవలం ఫిర్యాదికే కాక మృతుల కుటుంబానికి కూడ తెలియజేయాలనీ, వారి జాడ తెలియని పక్షంలో పత్రికా ప్రకటన ద్వారా ప్రజాబాహుళ్యానికి తెలియజేయాలనీ నియమం ఉండడం అవసరం. లేకపోతే వ్యవహారం మొత్తం పోలీసులకూ మేజిస్ట్రేటుకూ మధ్యనే ఉండిపోయే ప్రమాదం ఉంది.

హైకోర్టులో జరిగిన వాదనలలో ప్రధాన విషయం మీదే దృష్టి కేంద్రీకరించడం వల్ల ఈ మూడు సమస్యల ప్రస్తావన పెద్దగా రాలేదు. తీర్పులోనూ వీటి ప్రస్తావన లేదు. భవిష్యత్తులో కోర్టు లోపలా బయటా వీటి గురించి కృషి చేయవలసి ఉంది. అయితే అన్నిటికంటే ముఖ్యమైన కర్తవ్యం ఈ తీర్పును అమలు చేయించుకోవడం. పాలకుల ప్రయోజనాలకు ఇబ్బందికరమైన కోర్టు తీర్పులూ, రాజ్యాంగ ఆదేశాలు అమలు కావనేది మన నిత్య జీవిత అనుభవం. అందువల్ల 'ఎన్‌కౌంటర్ల' గురించి ఆందోళన కొనసాగక తప్పదు.

*మానవహక్కుల వేదిక, ఎపిసిఎల్‌సిల సంయుక్త కరపత్రంగా వచ్చింది*
*19 మార్చి 2009*

# చర్చ కూడ కోర్టు ధిక్కారమేనా?

నర్మదా బచావో ఆందోళన్ నాయకురాలు మేధాపాట్కర్ పైన, ప్రముఖ రచయిత్రి అరుంధతిరాయ్ పైన సుప్రీంకోర్టు కోర్టు ధిక్కార నేరానికి చర్య తీసుకోవాలని గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం కోరడాన్ని కడుపుమంటగా అర్థం చేసుకోవచ్చు. కానీ గుజరాత్ ప్రభుత్వం అడిగినా అడగకున్నా తానే చర్య తీసుకోవడానికి సిద్ధమవుతున్నట్టు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మాట్లాడడం కొంచెం ఆశ్చర్యమే కాక ఆందోళన కూడ కలిగించే విషయం.

చీఫ్ జస్టిస్ ఆనంద్ న్యాయశాస్త్ర పాండిత్యాన్ని గురించి ఎవరికీ సందేహాలు లేవు. ఆ పాండిత్యాన్ని కోర్టుకు రాలేని మూగ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ఆయన ఉపయోగించిన ఉదంతాలూ ఉన్నాయి. నర్మదా నది పైన గుజరాత్ ప్రభుత్వం తలపెట్టిన ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులు కాగల ఆదివాసులూ, ఇతర పేద ప్రజలూ ఆయన కోర్టులో ఎంతో కొంత న్యాయం దొరుకుతుందని సహేతుకంగానే ఆశ పెట్టుకుని ఉండవచ్చు.

కానీ 'కోర్టుకొచ్చావు కాబట్టి ఇంక బయట ఎక్కడా మాట్లాడవద్దు' అనీ, కోర్టు ఇచ్చే ఆర్డర్ల పైన బహిరంగంగా విమర్శ పెట్టొద్దు అనీ అనడాన్ని సహేతుకమైన ఆదేశంగా స్వీకరించడం కష్టం.

'కోర్టుధిక్కారం' అనే నేరానికి సంబంధించిన న్యాయ శాస్త్ర సిద్ధాంత చర్చను కొంతసేపు పక్కన పెడదాం. తమ కొంపా గోడూ కోల్పోయే పరిస్థితి దాపురించిన వారు ఇటువంటి ఆదేశాలను

పాటించడం సాధ్యమవుతుందా? తమ జీవితాన్ని కాపాడుకోవటం కోసం వాళ్ళు దొరికిన అవకాశాలనూ, అందుబాట్లో ఉన్న అన్ని వేదికలనూ వాడుకుంటారు. వాడుకోవటంలో వారు అహేతుకంగానో అన్యాయంగానో ప్రవర్తిస్తే వారిని ఎవరు తప్పు పట్టినా పరవాలేదు గానీ 'మా దగ్గరకు వచ్చావు కాబట్టి ఇంక మమ్మల్నే నమ్ముకొని ఉండమన'డంలో అర్థం లేదు. న్యాయస్థానానికి ఇవ్వాల్సిన గౌరవం ఇయ్యవలసిందే గానీ అది ఒకానొక చారిత్రక దశలో మనుషులు తమ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసుకొన్న ఒకానొక వ్యవస్థ మాత్రమేనని గుర్తించక సత్యానికీ, న్యాయానికీ దానిని ఒక అంతిమ ప్రమాణంగా భావించడం విజ్ఞులకు తగదు.

అయినా, ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ ఒక అంగం మాత్రమే. పత్రికలు మరొకటి. చట్టసభలు ఇంకొకటి. ప్రజాభిప్రాయం వీటన్నింటి కంటే మౌలికమైనది. వీటిలో ఒకరి దగ్గరకొచ్చిన వారు మరొకరి దగ్గరకు పోకూడదనడంలో అర్థమేముంది? అన్నీ కలిస్తేనే ప్రజాస్వామ్యం అవుతుంది. అన్నీ కల్పించే అవకాశాలను ప్రజలు వాడుకుంటారు. వాడుకున్నప్పుడే హక్కులకు కొంతమేరకైనా రక్షణ ఉంటుంది.

ఒక అభ్యర్థనతో కోర్టులో కేసు వేసిన వారు అదే అభ్యర్థనను అసెంబ్లీ ముందో పార్లమెంటు ముందో పెట్టి చట్టం చేయమని అడిగారనుకోండి. దానిని కోర్టు ధిక్కారంగా సుప్రీంకోర్టు భావిస్తుందా ? 'మా దగ్గర కొచ్చిన తరువాత మళ్ళీ ఎంఎల్ఎల చుట్టూ ఎందుకు తిరుగుతున్నావు?' అంటుందా?

అనదు. తమ అభ్యర్థనలకు వ్యవస్థిత రూపం సాధించుకోవడానికి న్యాయస్థానాల దగ్గర కొచ్చినట్టే చట్టసభల దగ్గరకు పోవచ్చుననీ, హక్కుల సాధనకు ఇవి ప్రత్యామ్నాయ వేదికలనీ గుర్తింపు ఉంది. ప్రజాభిప్రాయానికి మాత్రం ఎందుకు లేకుండా పోయింది? కోర్టుకు తమ సమస్యలు తీసుకొచ్చిన వారు ఆ సమస్యలను ప్రజాభిప్రాయం ముంగిటికి ఎందుకు తీసుకుపోకూడదు? బలమైన ప్రజాభిప్రాయాన్ని మించిన సాధనం ప్రజాస్వామ్యంలో వేరే ఏదైనా ఉండగలదా? ఆ అవకాశంపైన నిషేధం ఎందుకు?

నిజానికి నర్మదా ఆందోళనకారులు లేవదీస్తున్న ప్రశ్నలలో న్యాయస్థానాలు జవాబు చెప్పగలిగినవి కొన్నే. ప్రాజెక్టు నిర్మాణం అంటూ జరిగితే నిర్వాసితులకు ఏ రకమైన పునరావాసం ఇవ్వాలి, లేదా ఎంత నష్టపరిహారం ఇవ్వాలి అనే విషయాలనే కోర్టులు (నిర్ణయించదలచుకుంటే) నిర్ణయించగలవు. ఈ వివాదాన్ని కోర్టుకు తీసుకుపోవడం వల్ల ప్రభుత్వంపైన ఒత్తిడి పెరిగి మామూలుగా ఇచ్చేదాని కంటే

కొంత కాకపోతే కొంత ఎక్కువ ఇస్తుందనేది కూడ సత్యమే. ఈ వాస్తవాన్ని గుర్తించబట్టే ప్రజలు కోర్టు కొస్తారు. ఈ మేరకు కోర్టులు న్యాయం సమకూర్చగలవు కాబట్టి ఆ మేరకు కోర్టులను గౌరవిస్తారు కూడ.

కానీ ఇంతకంటే ఎక్కువ విధేయత ప్రజల నుండి డిమాండ్ చేయడం సబబా? ఆందోళనకారులు వేస్తున్న ప్రశ్నలలో న్యాయస్థానాలు జవాబు చెప్పలేనిని చాలా ఉన్నాయి. ఒక్కసారిగా ఎక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టి పెద్ద నదుల మీద పెద్ద పెద్ద ప్రాజెక్టులు కట్టి ఒకేసారి లక్షల ఎకరాలను సాగులోకి తీసుకొచ్చి అదే క్రమంలో లక్షల మందిని నిర్వాసితులు చేయడం మంచిదా? లేక కొంత ఎక్కువ సమయం తీసుకున్నా, ఒకేసారి లక్షల ఎకరాలు సాగులోకి తేలేకున్నా పెద్ద నదుల మీద కాక వాటిలోకి నీరు చేరవేసే ఉపనదులు, వాగుల మీద చిన్న ప్రాజెక్టులు ఎక్కువ సంఖ్యలో కట్టి ఎక్కువ మందిని నిర్వాసితులను చేయకుండా పొందగలిగిన ప్రయోజనం పొందడం మంచిదా? ఈ ప్రశ్న న్యాయస్థానాలను అడిగితే అది తాము తేల్చగలిగింది కాదనీ, అది ప్రభుత్వ పాలసీకి సంబంధించిన విషయమనీ అంటారు. మరి ఆ పాలసీని ప్రభావితం చేయడానికి ప్రజాభిప్రాయాన్ని కూడగట్టే లక్ష్యంతో ఉద్యమకారులు కోర్టు బయట కూడ సంవాదం, ఆందోళన కొనసాగించవలసిన అవసరం లేదా?

ముంపుకు గురయిన ప్రాంతాల ప్రజలకు ఇచ్చే నష్టపరిహారం గురించి ఇప్పటి దాకా ప్రభుత్వానికి ఉండే పాలసీ ఏమిటంటే ముంపు ప్రాంతంలో స్థిరాస్తులుండి వాటిని పోగొట్టుకున్న వారికి మాత్రమే నగదు రూపంలో నష్టపరిహారం వస్తుంది. చరాస్తి (ఉదాహరణకు గొర్రెలు, మేకలు) మాత్రమే ఉండేవారు, ప్రకృతి వనరుల పైన (ఉదాహరణకు చేపలు పట్టుకోవడానికి చెరువులు, కుంటలు, కల్లు తీసి అమ్ముకోవడానికి ఈతచెట్లు, తాడిచెట్లు) ఆధారపడి బతికేవాళ్ళు, ఇతరుల చేలల్లో కూలి చేసుకుని బతికేవాళ్ళు కొత్త ప్రాంతానికి వలస పోయి జీవనం సంపాదించుకోవడం చాలా కష్టం. కానీ ప్రాజెక్టు కింద ఇచ్చే నష్టపరిహారంలో వారికి వాటా ఉండదు. ఇది తప్పనీ, పోగొట్టుకున్న ఆస్తికి నష్టపరిహారమే కాక కోల్పోయిన జీవనానికి కూడ పునరావాసం ఇచ్చే విధానం ఉండాలనీ ఆందోళనకారులు అడగొచ్చు. అది కూడ ప్రభుత్వ పాలసీకి సంబంధించిన విషయమనీ, న్యాయస్థానాలు ఏమీ చేయలేవనీ కోర్టులు అన్నాయనుకోండి. అప్పుడు బయట దీని గురించి ఆందోళనకారులు మాట్లాడనక్కర లేదా? ప్రభుత్వ పాలసీని మార్చే పద్ధతిలో ప్రజాభిప్రాయాన్ని కూడగట్టనవసరం లేదా?

అంతే కాదు. ఇటువంటి విషయాలలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవన్న అభిప్రాయాన్నే ఆందోళనకారులు తిరస్కరించకూడదా? న్యాయస్థానాలు జోక్యం చేసుకోవలసిందేననీ, ఆ అవకాశం భారత రాజ్యాంగంలో ఉందనీ వాదించి ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయాలనుకోవడం 'కోర్టు ధిక్కారం' అవుతుందా? అనేక విషయాలలో ఒక దశ వరకు ఇది కోర్టుల పరిధిలో లేదు అన్న న్యాయస్థానాలు ఆ తరువాత ఆ విషయం తమ పరిధిలో ఉందని తీర్పులిచ్చాయి. అంతకుముందు అదే విషయాన్ని కోర్టు ముందు వాదించి భంగపడినవారు ఉంటారు. వారు ఆ భంగపాటును మౌనంగా స్వీకరించకుండా ప్రజలలో చర్చకు పెట్టడం కోర్టు ధిక్కారం అవుతుందా? పెట్టినప్పుడే సంవాదానికి విస్తృత ప్రాతిపదిక ఏర్పడి ఆ అభిప్రాయాన్ని న్యాయస్థానాలు మరింత సీరియస్‌గా తీసుకొని కొత్త కోణం నుండి చూసే ప్రయత్నం చేస్తాయేమో కదా? అసలు కోర్టు బయట సంవాదమేమీ లేకుండానే న్యాయ శాస్త్రం పురోభివృద్ధి సాధిస్తుందని నమ్మడం ప్రాథమికంగానే తప్పు కాదా?

ఏ విషయాలయితే 'మా పరిధిలో లేవు' అని సుప్రీంకోర్టు ఈ రోజు అంటున్నదో ఆ విషయాలు కోర్టు పరిధిలో ఉన్నాయని గతంలో ఇదే కోర్టు ఇచ్చిన తీర్పులను ఆధారం చేసుకొని వాదించవచ్చు. ఆ వాదన కోర్టు లోపల విఫలమైతే బయట దానిని కొనసాగించడం కోర్టు ధిక్కారమవుతుందా? లేకపోతే ఒక మంచి సూత్రీకరణను బతికించుకునే ప్రయత్నం అవుతుందా?

ఎప్పుడో కాదు. కేవలం మూడేళ్ళ కిందట జస్టిస్ కుల్దీప్ సింగ్ పర్యావరణానికి సంబంధించిన ఒక తీర్పు ఇస్తూ నదులు, సరస్సులు, అడవులు, కొండలు మొదలయిన ప్రకృతి వనరుల విషయంలో ప్రభుత్వం ప్రజల తరపున ఒక 'పబ్లిక్ ట్రస్టీ'గా వ్యవహరించాలని అన్నారు. అంటే ఆ వనరులపైన ఆధారపడి బతుకుతున్న ప్రజల ప్రయోజనాలు దెబ్బతినే రీతిలో వాటిని ఇతరులకు ధారాదత్తం చేయకూడదని అర్థం. ప్రభుత్వం ప్రజల తరపున ట్రస్టీగా వ్యవహరిస్తున్నదా లేదా అని న్యాయస్థానాలు పర్యవేక్షించవచ్చునని ఆయన తీర్పులో అన్నారు. దానిని ఆధారం చేసుకొని మొత్తంగానే నర్మదానది పైన గుజరాత్ ప్రభుత్వం తలపెట్టిన భారీ ప్రాజెక్టుల విజ్ఞతను సుప్రీంకోర్టు పరిశీలించవచ్చునని వాదించే అవకాశం ఉంది. ఆ వాదన కోర్టు లోపల నెగ్గకపోతే దానిని బయట కొనసాగించడం జస్టిస్ కుల్దీప్ సింగ్ ప్రతిపాదించిన ఒక మంచి సూత్రాన్ని సజీవంగా ఉంచే ప్రయత్నం అవుతుంది.

న్యాయస్థానాల ప్రతిష్ఠను దిగజార్చే విధంగా మాట్లాడితే అది కోర్టు ధిక్కారం అవుతుందని శాస్త్రం చెప్తుంది. దానికి శిక్ష అవసరం అంటుంది. న్యాయస్థానాలకు ఉండే సున్నితమైన స్థానం దృష్ట్యా వేరే ఏ వ్యవస్థకూ లేని అధికారం న్యాయస్థానాలకు ఉండాలన్న వాదనలో కొంత పస లేకపోలేదు గానీ న్యాయస్థానాలు తమ ప్రతిష్ఠకు భంగం కలగకుండా వ్యవహరించడమే వాటి ప్రతిష్ఠను కాపాడుకోవడానికి తగిన మార్గం తప్ప విమర్శను కోర్టు ధిక్కారంగా పరిగణించే అధికారం వాటికి కట్టబెట్టడం కాదు. న్యాయస్థానాల ఆదేశాలను అతిక్రమించే చర్యలకు మాత్రమే కోర్టు ధిక్కార నేరాన్ని పరిమితం చేయాలి తప్ప విమర్శకూ, న్యాయసిద్ధాంత సంవాదానికీ దానిని వర్తింపచేయకూడదు.

అరుంధతీరాయ్, మేధాపాట్కర్‌లు సుప్రీంకోర్టు ప్రతిష్టను దిగజార్చే విధంగా విమర్శ, చర్చ పెడుతున్నారన్నది ఎంత వాస్తవమో గానీ వారి పైన కోర్టుధిక్కారం కేసు పెట్టి శిక్ష వేస్తే మాత్రం సుప్రీంకోర్టు ప్రతిష్ట నిజంగానే దిగజారుతుంది. ఆ సంగతి చీఫ్ జస్టిస్ ఆనంద్ గారికి తెలియనిది కాదు.

*ఆంధ్రప్రభ దినపత్రిక*

*19 ఆగస్టు 1999*

# సర్దార్ సరోవర్ ప్రాజెక్టు:
# సుప్రీంకోర్టు కళ్లకు ‘అభివృద్ధి’ గంతలు

నర్మదా బచావో ఆందోళన్ (ఎన్‌బిఏ) కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వల్ల ఆ కేసులోని బాధితులకు జరిగిన అన్యాయం ఒకెత్తయితే, ప్రభుత్వ ‘అభివృద్ధి’ పథకాలపైన న్యాయవ్యవస్థకు ఉండే పర్యవేక్షణ అధికారాన్ని చాలా సంకుచితంగా వ్యాఖ్యానించడం ద్వారా ఆ వ్యవస్థ ప్రజలకు ఇవ్వగల రక్షణను బాగా కుదించి వేయడం మరొక ఎత్తు. ఇదే వరవడిని సుప్రీంకోర్టు కొనసాగించేటట్టయితే సగటు రాజకీయనాయకుల పట్ల ప్రజలకు ఏమాత్రం గౌరవం ఉందో అంతకంటే ఎక్కువ కోర్టుల పట్ల ఉండబోదు. ఉండవలసిన అవసరమూ లేదు.

ఆ కేసుకు సంబంధించిన వివరాలివి.

నర్మదా నది దేశ పడమటి తీరంలో ప్రవహించే నదులన్నిటిలోనికీ పెద్దది. మధ్యభారతంలోని ఎత్తయిన కొండలలో పుట్టి ఎక్కువ భాగం మధ్యప్రదేశ్‌లోనూ, కొంత ఆ రాష్ట్రానికీ, మహారాష్ట్రకూ ఉన్న సరిహద్దుమీదుగానూ, కొంత మహారాష్ట్రకూ గుజరాత్‌కు ఉన్న సరిహద్దుమీదుగానూ, కొంత గుజరాత్ రాష్ట్ర మైదాన ప్రాంతంలోనూ ప్రవహించి భరూచ్ నగరం సమీపంలో అరేబియన్ సముద్రంలో కలుస్తుంది.

దాదాపు 96 శాతం వృథాగా సముద్రంలోకి పోతున్న ఈ నది నీటిని సాగు కోసం వినియోగించుకోవడం వ్యవసాయ అభివృద్ధికి చాలా ఉపయోగపడుతుందన్న ఆలోచన స్వాతంత్ర్యం

వచ్చిన తొలి రోజులలోనే ప్రభుత్వాలకు వచ్చింది. అయితే వేరే ఏ నది విషయంలోనూ జరగనిదీ, నర్మద విషయంలో మొదటి నుండి జరుగుతున్నదీ ఏమిటంటే మొత్తంగా నది పై భాగం నుండి కింది భాగం వరకు అనేక ప్రాజెక్టుల రూపకల్పనకు ఒకేసారి ముసాయిదాలు తయారు చేయడం. ఉదాహరణకు ప్రస్తుతం ప్రతిపాదనలో ఉన్నది 30 పెద్ద డ్యాంలు, 135 మధ్యతరహా డ్యాంలు, 3000 చిన్నతరహా డ్యాంలు. ఇందులో ఎక్కువభాగం మధ్యప్రదేశ్‌లోనూ, కొన్ని గుజరాత్‌లోనూ కట్టాలని ప్రతిపాదన. కోర్టుకెక్కిన సర్దార్ సరోవర్ ఈ 30 పెద్ద డ్యాంలలో అన్నిటికన్నా దిగువన ఉంటుంది. అదొక్కటి గుజరాత్‌లో ఉంటుంది. మిగిలిన 29 పెద్ద డ్యాంలూ దానికి ఎగువన మధ్యప్రదేశ్‌లో కట్టనున్నారు. కాబట్టి సర్దార్ సరోవర్ గురించి సుప్రీంకోర్టు వ్యక్తపరచిన అభిప్రాయాలు రాబోయే ఆ 29 పెద్ద ప్రాజెక్టులకూ వర్తిస్తాయి. అయితే ఈ అభిప్రాయం వ్యక్తం చేసే క్రమంలో సుప్రీంకోర్టు చాలా సూత్రీకరణలు చేసింది కాబట్టి అవి నర్మదా నది మీద మన పాలకులు తలపెట్టిన భారీ ప్రణాళికను దాటి ఇతర అన్ని అభివృద్ధి పథకాలకూ వర్తిస్తాయి. ఈ అభిప్రాయాల సారాంశాన్ని రెండు వాక్యాలలో చెప్పుకోవచ్చు. ప్రభుత్వం మీద కోర్టులకు అపనమ్మకం ఉండవలసిన అవసరం లేదు. ఆధారాలు చూపించినా ఉండనవసరం లేదు. అన్యాయం జరగకుండా చూడడానికి తగు జాగ్రత్తలు రూపొందించినట్టు ప్రభుత్వం చూపిస్తే చాలు, కోర్టులింక జోక్యం చేసుకోనక్కరలేదు. ఆ జాగ్రత్తలు పని చేస్తాయని కోర్టులు విశ్వసిస్తాయి.

నర్మదా నీటిని వృథా పోనీయకుండా వాడుకోవాలన్న సంకల్పం మూడు రాష్ట్రాలలోనూ తొలి నుండి ఉన్నప్పటికీ ఒకరి ప్రయత్నం పట్ల మరొకరికి సందేహాలు ఉన్నాయి. మధ్యప్రదేశ్, మహారాష్ట్రలు చేపట్టజూస్తున్న ప్రాజెక్టులు తాను చేపట్ట తలపెట్టిన ప్రాజెక్టుకు నీళ్లు లేకుండా చేస్తాయని గుజరాత్ ప్రభుత్వం లేవదీసిన వివాదం ఫలితంగా నర్మదా జలవివాదాల ట్రిబ్యునల్‌ను కేంద్ర ప్రభుత్వం 1968లో ఏర్పాటు చేసింది. ట్రిబ్యునల్ తన తీర్పును 1978లో ఇచ్చింది. ఆ తీర్పును మించి ఇప్పుడు చెప్పేది ఏమీ లేదనీ, అందులో లేని హక్కులడిగితే ఇచ్చేది లేదనీ ఇప్పుడు సుప్రీంకోర్టు అంటున్నది. సుప్రీంకోర్టు ఈ కేసులో చేసిన అన్ని సూత్రీకరణలలోకీ హాస్యాస్పదమైనది ఇది. దేశంలోని అన్ని కోర్టులపైన, అన్ని ట్రిబ్యునల్స్‌పైన పర్యవేక్షక అధికారం రాజ్యాంగమే ఆర్టికల్ 136లో సుప్రీంకోర్టుకు ఇచ్చింది. అటువంటప్పుడు 'నర్మదా ట్రిబ్యునల్ అవార్డులో లేనిదేదీ మమ్మల్ని అడగొద్దు. దానికి అందరూ (సుప్రీంకోర్టుతో సహా) కట్టుబడి ఉండాలి' అనడంలో అర్థం లేదు.

నర్మదా జలవివాదాల ట్రిబ్యునల్ అవార్డును అనుసరించి గుజరాత్ ప్రభుత్వం సర్దార్ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకుంది. మొదట్లో ఈ ప్రాజెక్టు వలన 7000 కుటుంబాలు నిర్వాసితులవుతారని అంచనా వేశారు. ప్రాజెక్టు నిర్మించే ప్రయత్నం 1978లోనే మొదలయినప్పటికీ ముంపుకు గురయ్యే ప్రాంతం దట్టమైన అడవి కావడం వల్ల పర్యావరణ సంబంధమైన అనుమతి కేంద్రప్రభుత్వం నుండి 1987 దాకా గుజరాత్‌కు లభించలేదు.

ఆ నేపథ్యంలో 1986లో నర్మదా బచావో ఆందోళన్ (ఎన్‌బిఏ) ఏర్పడింది. పునరావాసం నుండి పర్యావరణం దాకా అనేక విషయాలలో వారు అభ్యంతరాలు లేవదీసి ప్రాజెక్టును పునఃపరిశీలించాలని కోరారు. గుజరాత్ ప్రభుత్వం అప్పటికే (1985లో) ఈ ప్రాజెక్టుకు ప్రపంచబ్యాంకు సహాయం మంజూరు చేయించుకుంది. అయితే ప్రాజెక్ట్ గురించి గుజరాత్ ప్రభుత్వం చెప్పినదేదీ విశ్వసనీయం కాదని ఎన్‌బిఏ ఆందోళన చేయడం వల్లనే కాబోలు ప్రపంచబ్యాంకు ప్రాజెక్టును తిరిగి పరిశీలించి నివేదిక సమర్పించమని మోర్స్ కమిటీ అనే స్వతంత్ర కమిటీని నియమించింది. పునరావాసం, పర్యావరణాలకు సంబంధించిన అంశాలపైన ఈ కమిటీ దృష్టి కేంద్రీకరించి 10 నెలల పాటు ఒక్క సర్దార్ సరోవర్‌నే కాక మొత్తంగా గుజరాత్ రాష్ట్రం నర్మదా నదిపైన తల పెట్టిన అన్ని ప్రాజెక్టులనూ అధ్యయనం చేసింది. ప్రపంచబ్యాంకు నుండి గుజరాత్ ప్రభుత్వం దాకా అందరి దగ్గరున్న పత్రాలూ మోర్స్ కమిటీ చూడగలిగింది. ఈ విషయంలో నిపుణులైన చాలామంది దేశవిదేశాలకు చెందిన వైజ్ఞానికులు ఆ కమిటీకి సహాయం చేశారు.

## మోర్స్ కమిటీ చెప్పిందేమిటి? కోర్టు అనిందేమిటి?

1992 జూన్ నెలలో మోర్స్ కమిటీ తన నివేదికను ప్రపంచబ్యాంకుకు సమర్పించింది. అందులో...

ఈ ప్రాజెక్టులకు ప్రాతిపదిక అయిన అతి ముఖ్యమైన అభిప్రాయాలిప్పుడు ప్రశ్నార్థకంగా కనిపిస్తున్నాయి. అందులో కొన్ని పూర్తిగా నిరాధారమైనవి. పర్యవసానాల గురించి సమగ్రమైన అవగాహన లేకుండా సాంఘిక దుష్పరిణామాల కంటే, పర్యావరణ సంబంధమైన దుష్ఫలితాల కంటే ప్రాజెక్టు ఇచ్చే సత్ఫలితాలే ఎక్కువన్న నిర్ధారణకు వచ్చేశారు. ఆ కారణంగా సత్ఫలితాలనెక్కువ చేసి చూపించడం, సాంఘిక దుష్పరిణామాలనూ పర్యావరణ సంబంధమైన దుష్పరిణామాలనూ తక్కువ చేసి చూపించడం జరుగుతున్నది'.

‘ఈ ప్రాజెక్టులు లోపభూయిష్టమైనవని మేము భావిస్తున్నాం. వీటివల్ల నిర్వాసితులు కాబోయే వారందరి పునరావాసం ప్రస్తుత పరిస్థితులలో అసాధ్యమని నమ్ముతున్నాం. ఈ ప్రాజెక్టులు పర్యావరణం పైన వేయగల ప్రభావాన్ని సరిగ్గా లెక్కలోకి తీసుకోలేదనీ, వాటికి తగిన రీతిలో జవాబు చెప్పలేదనీ అనుకుంటున్నాం’.

‘సర్దార్ సరోవర్ చరిత్ర పర్యావరణ సంబంధమైన విషయాలను నిర్లక్ష్యం చేసిన చరిత్రే. ప్రాజెక్టు ప్రభావాన్ని గురించి సమగ్రమైన ప్రకటన లేదు. పర్యావరణ సంబంధమైన సమస్యల స్వభావం, వాటి పరిమాణం అంచనాకు అందడం లేదు’.

‘మానవ అవసరాల కంటే, పర్యావరణ ప్రయోజనాల కంటే ఆర్థిక ఒత్తిడులూ సాంకేతిక నియమాలూ ప్రధానమయ్యాయనేది స్పష్టమే. సాంఘిక, పర్యావరణ సంబంధమైన విషయాలను తృణీకరించిన తీరు ఈ రోజు సమర్థనీయంగా కనిపించదు’.

ఇవీ మోర్స్ కమిటీ నర్మదా ప్రాజెక్టుల గురించి వ్యక్తం చేసిన స్పష్టమైన అభిప్రాయాలు. ఎన్‌బిఏ 1994లో సుప్రీంకోర్టులో కేసు వేసినప్పుడు ఈ రిపోర్టును కూడ కోర్టు ముందుంచింది. అయితే చివరికి తీర్పు ఇచ్చేటప్పుడు సుప్రీంకోర్టు మోర్స్ రిపోర్టు గురించి ఏమనిందంటే ‘దీనిని గుజరాత్ ప్రభుత్వమూ తిరస్కరించింది, ప్రపంచబ్యాంకు కూడ తిరస్కరించింది’ కాబట్టి కోర్టు పట్టించుకోనక్కర లేదని. ప్రభుత్వం అభిప్రాయాలనూ, ప్రపంచబ్యాంకు అభిప్రాయాలనూ ప్రామాణికంగా తీసుకునేటట్టయితే ఇంక దేశంలో కోర్టులెందుకు?

1986లో ఏర్పడిన నాటి నుండి ఎన్‌బిఏ సర్దార్ సరోవర్ ప్రాజెక్టు గురించి ప్రశ్నలు లేవదీస్తూ అనేక రూపాలలో ఆందోళన చేసింది. మోర్స్ కమిటీతో పూర్తిగా సహకరించింది. ఆ నివేదికను ప్రపంచబ్యాంకు, మన పాలకులూ కూడ తిరస్కరించడం, డ్యాం నిర్మాణం కొనసాగించడం చూసి ప్రాజెక్టును పునః పరిశీలించాలన్న ఒత్తిడి గుజరాత్ ప్రభుత్వం పైన పెంచింది. 1993లో గుజరాత్ ప్రభుత్వం ఎన్‌బిఏ అభ్యంతరాలను పరిశీలించి తనకు నివేదిక సమర్పించమని ఒక అయిదుగురు సభ్యుల కమిటీని వేసింది.

ఈ క్రమంలోనే ఎన్‌బిఏ సుప్రీంకోర్టులో 1994లో ప్రజా ప్రయోజనం కేసు వేయగా సుప్రీంకోర్టు ప్రాజెక్టు నిర్మాణంపైన స్టే ఇచ్చింది. ఆ తరువాత కేసును తీరికగా విని చివరికి 2000 సంవత్సరం అక్టోబర్ 18వ తేదీన పిటిషనర్‌ను కించపరిచే వ్యాఖ్యలు చేస్తూ కేసు కొట్టేసింది.

'ఈ పిటిషనర్ డ్యాంలను వ్యతిరేకించే సంస్థ. 1986లోనే, పర్యావరణ సంబంధమైన అనుమతి ఈ ప్రాజెక్టుకు లభించకముందే ఈ సంస్థ ఉనికిలోకి వచ్చింది. అప్పటి నుండి డ్యాంను వ్యతిరేకించడానికి రకరకాల మార్గాలు అనుసరించింది. వీరి ఒత్తిడి ఫలితంగానే అయిదుగురు సభ్యుల కమిషన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. అయినప్పటికీ పునరావాసం పూర్తయ్యేదాకా డ్యాం నిర్మాణాన్ని ఆపాలన్న కాంక్ష తీరలేదు కాబట్టి కోర్టుకొచ్చారు'.

ఇంత చులకనగా కాకుండా వేరొకరకంగా వ్యాఖ్యానించుకుంటే ఇదే విషయాన్ని ఇంకొక రీతిగా చెప్పుకోవచ్చు. సర్దార్ సరోవర్ ప్రాజెక్టు వల్ల ప్రయోజనం కన్నా నష్టమే ఎక్కువని గ్రహించిన ఎన్‌బిఏ మొదట బహిరంగ విమర్శ ద్వారా, ఆందోళన ద్వారా గుజరాత్ ప్రభుత్వ నిర్ణయాన్ని, ప్రపంచబ్యాంకు మద్దతును ప్రభావితం చేయాలని ప్రయత్నం చేసింది. ప్రపంచబ్యాంకు మోర్స్ కమిటీని నియమించగా, ఎన్‌బిఏ ఆ కమిటీతో పూర్తిగా సహకరించింది. ఆ కమిటీ ఎన్‌బిఏతో అంగీకరించినా ప్రపంచబ్యాంకు, గుజరాత్ ప్రభుత్వమూ ఆ నిపుణుల నివేదికను తిరస్కరించాయి. అయినప్పటికీ ఎన్‌బిఏ తన ఆందోళనను కొనసాగించి పునఃపరిశీలన కోసం గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం అయిదుగురు సభ్యుల కమిటీని నియమించేటట్టు ఒత్తిడి పెట్టగలిగింది. ఒక పక్క ఆ కమిటీని నియమించిన ప్రభుత్వం మరో పక్క డ్యాం నిర్మాణాన్ని కొనసాగించేసరికి ఇంక విధిలేక ఎన్‌బిఏ 1994లో కోర్టుకొచ్చింది.

మామూలుగానయితే ఇదే సరైన పద్ధతి అని న్యాయమూర్తులు మెచ్చుకుంటారు. 'ప్రత్యామ్నాయ ప్రయత్నాలన్నీ చేయకుండా నేరుగా కోర్టుకెందుకు వచ్చారు?' అని ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోగానే కోర్టుకెక్కిన వారిని మందలిస్తుంటారు. కానీ ఆ పని చేసిన ఎన్‌బిఏను 'అట్లా ఆపుదామని చూశావు, ఇట్లా ఆపుదామని చూశావు, ఏదీ సాధ్యం కాకపోయేసరికి ఆఖరి ఎత్తుగడగా కోర్టుకు వచ్చావా?' అని అడుగుతున్నది సుప్రీంకోర్టు. మరైతే ప్రజలు ఏం చేయాలి? వెంటనే రాకూడదు, ఆలస్యంగా రాకూడదు అంటే అసలే కోర్టుకు రావద్దనే కదా అర్థం?

సర్దార్ సరోవర్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం 1987లోనే పర్యావరణ సంబంధమైన అనుమతి ఇచ్చేసిందనీ, ఆ తరువాత గుజరాత్ ప్రభుత్వం డ్యాం నిర్మాణం చేపట్టడం సక్రమమేననీ, అటువంటప్పుడు 1994లో ఎన్‌బిఏ కోర్టుకొచ్చి ప్రాజెక్టును ఆపమనడం బాధ్యతారహితమైన ఆలస్యమనీ, అందువల్ల పర్యావరణ సంబంధమైన

అభ్యంతరాలేవయితే ఎన్‌బిఏ లేవదీసిందో వాటికి జవాబు చెప్పనవసరం లేదనీ సుప్రీంకోర్టు అనింది. లక్షలాది మంది జీవితాలకు సంబంధించిన విషయంలో ఏడేళ్ల ఆలస్యం క్షమించరానిదేం కాదని దీనికి జవాబు చెప్పవచ్చు. ఆ ఏడేళ్లూ ఇతర రూపాలలో ఎన్‌బిఏ గుజరాత్ ప్రభుత్వంతో సంవాదం పెట్టుకుంటూనే ఉంది. కాబట్టి ఆ ఆలస్యంలో ఎన్‌బిఏ నిర్లక్ష్యమేమీ లేదని చెప్పవచ్చు. అయితే జస్టిస్ భరూచా దానికి ఇంకా కచ్చితమైన జవాబు చెప్పారు. ఈయన చీఫ్ జస్టిస్ ఆనంద్‌తోనూ జస్టిస్ కిర్పాల్‌తోనూ విభేదించి ఎన్‌బిఏతో చాలావరకు ఏకీభవిస్తూ 'అసమ్మతి తీర్పు' ఇచ్చాడు. ఆయన ఏమంటాడంటే 1987లో కేంద్రం ఇచ్చిన పర్యావరణ సంబంధమైన అనుమతి సక్రమంగా ఇచ్చినది కాదు కాబట్టి దానిని ఆధారం చేసుకుని గుజరాత్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టు నిర్మాణం కూడ సక్రమం కాదు. అందువల్ల ఏడేళ్ల తరువాత దానిని ఆపమని కోర్టుకు రావడంలో తప్పేమీ లేదన్నాడు.

## పర్యావరణ అనుమతి విధంబెట్టిదన...

పర్యావరణ సంబంధమైన అనుమతి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన క్రమాన్ని తెలుసుకుంటే భరూచా గారి అభిప్రాయం ఎంత న్యాయమైనదో అర్థమవుతుంది. అంతకంటే ముందు 'పర్యావరణ సంబంధమైన అభ్యంతరాలు' అంటే ఏమిటో వివరించడం అవసరం. ఏవో అరుదయిన వృక్షజాతులో జంతుజాతులో అదృశ్యమయి పోతాయనో, ఇక్ష్వాకుల నాటి గుళ్లు మునిగిపోతాయనో గొడవ చేసి మనుషులకు మంచినీళ్లు లేకుండా చేస్తారని పర్యావరణ ఉద్యమకారులపైన ఇతరత్రా ప్రజానుకూల భావాలు కలవారికి కూడ కొంచెం అనుమానం ఉండడం కద్దు. ఆ రకంగా ఆలోచించే పర్యావరణ ఉద్యమకారులు లేకపోలేదు గానీ నిజమైన అర్థంలో పర్యావరణ సమస్యలు ప్రజల సమస్యలే. ఒక ప్రాజెక్టు ఫలితంగా చుట్టూ ఉన్న నేల, నీరు, గాలి, జీవరాశులు దెబ్బతింటే వాటి మీద ఆధారపడి జీవించే ప్రజల జీవనం, ఆరోగ్యం దెబ్బతింటాయి. జీవరాశులకు జరిగే నష్టం (అరుదయిన జీవజాతులు అదృశ్యమయిపోవడం వగైరా) కూడ నష్టమేగానీ పర్యావరణ సమస్య అంటే అది మాత్రమే కాదు.

సర్దార్ సరోవర్‌కు సంబంధించిన పర్యావరణ సమస్యలు చాలానే ఉన్నాయి. నర్మదా నదిపైన మూడు రాష్ట్రాలూ తలపెట్టిన ప్రాజెక్టులన్నీ కట్టినట్టయితే వాటిలో ఆఖరిదైన సర్దార్ సరోవర్‌కు దిగువన నర్మదలో వరద బాగా తగ్గిపోతుంది. నదీముఖం దగ్గర హిల్సా అనే చేప ప్రస్తుతం బాగా దొరుకుతుంది. ఆ చేపను వేటాడి బతుకుతెరువు

సంపాదించుకుంటున్న జాలర్ల కుటుంబాలు గుజరాత్ ప్రభుత్వం అంచనా ప్రకారమే 4644 ఉన్నాయి. (10 వేల కుటుంబాలని ఎన్‌బిఏ అంచనా.) వీరి బతుకుతెరువు రాబోయే రోజులలో తీవ్రంగా దెబ్బతింటుంది. అంతేకాదు, నదీముఖం దగ్గర ప్రవాహం తగ్గిపోయినట్టయితే సముద్రపు నీరు ప్రవాహానికి ఎదురుగా నదీముఖంలోకి ప్రవేశిస్తుంది. ఒడ్డున ఉన్న గ్రామాలకు తాగునీటి సమస్య ఏర్పడుతుంది. భరూచ్ పట్టణంతో సహా మొత్తం 210 గ్రామాలు ఈ సమస్యను ఎదుర్కొంటాయని మోర్స్ కమిటీ అంచనా వేసింది.

అందువల్ల ఈ 'పర్యావరణ' సమస్య వేల కుటుంబాల సమస్యనేది అర్థం అవుతుంది. అయితే దీనికి సుప్రీంకోర్టు ఏమంటుందంటే ఈ నష్టం అంచనా వేసింది మోర్స్ కమిటీ. ఆ కమిటీ నివేదికను ప్రపంచబ్యాంకు తిరస్కరించింది, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వమూ తిరస్కరించింది. కాబట్టి దాని మీద ఆధారపడడానికి వీలు లేదు. రెండు, ఈ నష్టం ఇంక 30 ఏళ్ళకు గానీ జరగదు. అంటే నర్మదా నదిపైన మూడు రాష్ట్రాలూ తలపెట్టిన అన్ని డ్యాంలూ కట్టిన తరువాత గానీ ఆ నష్టం జరగదు. 'అది కనుచూపుమేరలో జరగబోయే విషయం కాదు కాబట్టి పిటిషనర్ ఆందోళన నిరాధారమైనది' అని సుప్రీంకోర్టు అనింది.

దీనిని వ్యాఖ్యానించకుండా ఉంటేనే మర్యాదగా ఉంటుందేమో.

రిజర్వాయర్‌లో అడవి చాలా మునుగుతుంది. అటవీ భూభాగం తరిగిపోవడం వాతావరణానికి చాలా నష్టకరం కాబట్టి, వర్షాభావం రూపంలోనూ, మితిమీరిన ఉష్ణోగ్రత రూపంలోనూ, కరువు రూపంలోనూ అది మనుషుల జీవితాలపైన తీవ్ర దుష్ప్రభావం చూపిస్తుంది కాబట్టి ఏ మేరకు అడవి మునుగుతుందో ఆ మేరకు కొత్తగా అడవి పెంచాలన్న నియమం పర్యావరణ సంబంధమయిన అనుమతికి ఒక తప్పనిసరి షరతు. గుజరాత్ ప్రభుత్వం ఆ షరతును అమలు చేస్తున్నట్టు చెప్పింది గానీ కొత్తగా అడవులు పెంచుతున్న భూములు సారహీనమైనవి కాబట్టి అది షరతును అమలు చేసినట్టు కాదని ఎన్‌బిఏ వాదించింది. దానికి సుప్రీంకోర్టు ఏమంటుందంటే 'కొత్తగా అడవులు పెంచుతున్నది సారహీనమైన నేలలో అయినంత మాత్రాన ఆ అడవులు ఏపుగా ఉండవని భావించవలసిన అవసరమేమీ లేదు.' బండనేలలో చవుడు నేలలో కూడ వనాలూ తోటలూ ఏపుగా పెరుగుతాయనే కొత్త జీవశాస్త్రానికి ఈ తీర్పు నాందిగా భావించాలేమో.

ప్రతీ రిజర్వాయర్‌కూ ఒక 'కాచ్‌మెంట్' ఉంటుంది. అది వర్షపు నీటిని ఆ రిజర్వాయర్‌లోకి చేరవేసే పరిసరప్రాంతం. అక్కడ కురిసిన వాననీళ్లు రిజర్వాయర్‌లోకి ప్రవహించే క్రమంలో అక్కడి మట్టి కూడ రిజర్వాయర్‌లోకి చేరి రిజర్వాయర్ గర్భంలోని నేలమట్టం పెరుగుతుంది. దీనినే పూడిక అంటాం. ప్రాజెక్టులకు సంబంధించిన ముఖ్యమైన పర్యావరణ సమస్యలలో ఇదొకటి. ఈ పూడిక ఫలితంగా రిజర్వాయర్‌లో నిలవ ఉంచాలని ఆశించినంత నీరు నిలవ ఉండదు. అందువల్ల రిజర్వాయర్ అందియ్యాలని ఆశించినంతగా సాగునీరు అందియ్యదు. రెండు లక్షల ఎకరాల ఆయకట్టు పూడిక ఫలితంగా నాలుగయిదేళ్లలో ఒక లక్ష ఎకరాలకు పడిపోతే మిగిలిన సగం ఆయకట్టు రైతులకు నోటికాడికొచ్చిన కూడు గుంజుకున్నట్టవుతుంది. అందువల్ల ఈ 'పర్యావరణ' సమస్య తీవ్రమైన మానవ సమస్యే. దీనిని పూర్తిగా నివారించడం సాధ్యం కాదు గానీ కాచ్‌మెంట్‌లోని మట్టి సులభంగా కొట్టుకొని పోకుండా ఉండడానికి తగిన చర్యలు తీసుకుంటే బాగా తగ్గించవచ్చు. పెద్దఎత్తున కాచ్‌మెంట్‌లో మొక్కలు పెంచడం ఈ చర్యలలో ఒకటి.

రిజర్వాయర్ పూడిక అనేది ప్రాజెక్టు ఒక చివర ఉండే సమస్య కాగా, పొలాలలోకి ప్రవహించే ప్రాజెక్టు నీళ్లు బయటికి వెళ్లిపోయే వ్యవస్థ సరిగ్గా ఏర్పడకపోతే వచ్చే మురుగు నీటి సమస్య ఇంకొక చివర ఉండే పర్యావరణ సమస్య. సమర్థమైన డ్రైనేజ్ వ్యవస్థను ప్రాజెక్టులో భాగంగా రూపొందించకపోతే ఈ సమస్య తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది.

పంటకాలవలు ప్రవహించే ప్రాంతంలో భూగర్భజలాలు ఉప్పునీటిగా మారడం (లవణీకరణ – సెలైనేజేషన్) మరొక ముఖ్యమైన పర్యావరణ సమస్య. ఇది ఆ ప్రాంత నివాసులకొక ముఖ్యమైన సమస్య అని వివరించి చెప్పనవసరం లేదు. మనుషుల జీవితం పైన, జీవనం పైన ప్రత్యక్ష ప్రభావం వేసే ఈ పర్యావరణ సమస్యలే కాక, వేరే సమస్యలు కూడ ఉన్నాయి. వేరే ఎక్కడా లేని వృక్షజాతులు, అరుదైన జంతుజాతులు, హరప్పా నాగరికతకు చెందిన అవశేషాలు, ఆదివాసీ పుణ్యస్థలాలు, దేవాలయాలు అనేకం ఈ ముంపు ప్రాంతంలో ఉన్నాయి. పర్యావరణ విధ్వంసమంటే వీటి విధ్వంసం మాత్రమే కాదుగానీ వీటి ప్రాముఖ్యతను తృణీకరించడం కూడ భావ్యం కాదు.

పర్యావరణ సమస్యలంటే ఏమిటో, వాటి అర్థమేమిటో చూసిన తరువాత 1987లో ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పర్యావరణ సంబంధమైన అనుమతి చెల్లదని జస్టిస్ భరూచా తన 'అసమ్మతి తీర్పు'లో ఎందుకన్నారో చూద్దాం.

1985కు ముందే పర్యావరణ సంబంధమైన అనుమతి లభించివుంటే ఏమయ్యేదో గానీ అది జరగలేదు. 1985 జనవరిలో కేంద్ర ప్రభుత్వ పర్యావరణం, అటవీ మంత్రిత్వశాఖ పర్యావరణ అనుమతికి సంబంధించి గైడ్ లైన్స్ జారీ చేసింది. ఆ తరువాత ఆ మార్గదర్శక సూత్రాలకు లోబడి మాత్రమే పర్యావరణ అనుమతిని ఇయ్యవలసి ఉంటుంది. అయితే ఆ పని చేయవలసింది పర్యావరణ మంత్రిత్వ శాఖ కాగా, ఆ శాఖ తన అభిప్రాయాలను ఎప్పటికప్పుడు ఒక నోట్ రూపంలో ప్రధానమంత్రి ముందు పెట్టి నిర్ణయం తీసుకునే బాధ్యతను ప్రధాని మీదకు నెట్టేసింది.

1986 అక్టోబర్ నెలలో పర్యావరణ మంత్రిత్వశాఖ తన మొదటి నోట్‌ను ప్రధానికి సమర్పించింది. వీలయినంత త్వరగా అనుమతి ఇచ్చే పని ముగించాలని తాము ప్రయత్నిస్తున్నామనీ, అయితే 'రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన సమాచారం అసమగ్రంగా, అసంతృప్తికరంగా ఉంది' అనింది. జీవరాశుల విషయంలో 'వాటి సంఖ్యకు సంబంధించిన సమాచారం లేదు' అనింది. కాచ్‌మెంట్‌లో భూసార సంరక్షణ చేపట్టే కర్తవ్యానికి సంబంధించి 'ఎంత భూభాగం అత్యవసరంగా ఈ కర్తవ్యం చేపట్టవలసిన హీనస్థితిలో ఉందో తెలీద'ని అనింది. వన్యమృగాల జనాభాల లెక్కలు తీయడం కోసం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు జువలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాతోనూ వాటి పునరావాసం కోసం వైల్డ్‌లైఫ్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌తోనూ చర్చలు జరుపుతున్నాయనింది. ఆ సంస్థలు తమ తమ సర్వేలు పూర్తి చేయడానికి రెండేళ్లు పడుతుందనింది. వృక్షసంపదకు సంబంధించిన సర్వేను బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా 1985 డిసెంబర్‌లో మొదలుపెట్టిందనీ, అది పూర్తి కావడానికి కూడ రెండుమూడేళ్లు పడుతుందనింది.

సారాంశంలో, 'కొన్ని పథకాలు రూపొందించడం జరిగింది, కొన్ని విషయాలపై అధ్యయనం మొదలయింది, కొంత కార్యాచరణ ప్రారంభమయింది. అయితే పైన చెప్పిన విషయాలు దృష్టిలో పెట్టుకుంటే ఇంకా జరగవలసింది చాలా ఉందని అర్థం అవుతుంది. నిజానికి పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ అభిప్రాయంలో ఇప్పటికి జరిగింది కొంచెమే. చాలా విషయాలు ఇప్పటికింకా ప్రాథమిక దశలో ఉన్నాయి' అని తేల్చి చెప్పింది.

ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే పర్యావరణ సంబంధమైన చర్యలు ఇంతటి ప్రాథమిక దశలో ఉన్నప్పుడు పర్యావరణ సంబంధమైన అనుమతి ఇచ్చేది లేదని చెప్పవలసిందిపోయి, 'ప్రభుత్వం ముందు రెండు ప్రత్యామ్నాయాలున్నాయి' అని పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ అనింది. అన్ని అధ్యయనాలు, జనాభా లెక్కలు, సర్వేలు పూర్తి చేసి కాచ్‌మెంట్ ఏరియా ట్రీట్‌మెంట్‌కు, పునరటవీకరణకు, నిర్వాసితుల పునరావాసానికి, జీవజాతుల తరలింపుకు సంబంధించి వివరమైన ప్రణాళికలు రూపొందించి, వాటి అమలుకు సంబంధించిన బాధ్యతలు స్పష్టంగా కేటాయించిన తరువాతే పర్యావరణ అనుమతి ఇవ్వడం ఒక ప్రత్యామ్నాయం. ఇట్లాగయితే అనుమతిని కనీసం మూడు సంవత్సరాలు వాయిదా వేయవలసి ఉంటుంది.

రెండవది, ఏమేం చేయాలనే విషయంలో తగు ఆదేశాలిచ్చి, షరతులు విధించి దానిని పర్యవేక్షించే వ్యవస్థను నెలకొల్పి అనుమతి ఇప్పుడే ఇచ్చేయడం.

ఈ రెండు ప్రత్యామ్నాయాలను సూచించి ఊరుకోకుండా, 'అనుమతిని మూడేళ్ళు వాయిదా వేయడాన్ని వ్యతిరేకించే వాదనకే తర్కబలం ఉంది' అనింది.

అప్పటి నుండి ఒక సంవత్సరం పాటు పర్యావరణం, అటవీ సంరక్షణ, నీటి వనరుల శాఖలు సర్దార్ సరోవర్ ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ పార్శ్వాన్ని గురించి ఎప్పుడు మాట్లాడినా ఇంకా పనేమీ జరగలేదనీ, ఎంతలేదన్నా రెండు మూడేళ్లు పడుతుందనీ, అయితే ప్రాజెక్టును ఇంకా ఆలస్యం చేయడం ఉచితం కాదు కాబట్టి అన్ని పనులూ చేసేదాకా అనుమతి ఆపడం కంటే అనుమతి ఇచ్చేసి ప్రాజెక్టు నిర్మాణమూ పర్యావరణ పరిరక్షణా సమాంతరంగా పూర్తి చేయమని షరతు పెట్టడం మంచిదనీ అంటూ వచ్చాయి. చేయకపోతే ఇచ్చిన అనుమతిని వెనక్కి తీసుకోవడం గానీ కట్టిన ప్రాజెక్టును కూల్చేయడం గానీ జరిగే పని కాదు కాబట్టి ఈ 'షరతు' అనే దానికి అర్థమేమీ లేదు. అనుమతి ఇచ్చేసి, పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని ఆశ పెట్టుకోవడమే ఈ 'ప్రత్యామ్నాయానికి' అర్థం.

చివరికి ఈ ప్రత్యామ్నాయమే గెలిచింది. పరిస్థితిలో ఏ మార్పూ లేకుండానే 1987 జూన్ 24న ప్రధానమంత్రి ఈ ప్రాజెక్టుకు పర్యావరణ సంబంధమైన అనుమతి ఇచ్చేసారు.

'ఈ అనుమతి చట్టం కళ్లల్లో అనుమతే కాదు' అని జస్టిస్ భరూచా నిక్కచ్చిగా అన్నారు. ప్రాజెక్టుకు పర్యావరణం పైన ఉండగల ప్రభావం గురించి సమాచారం

సమగ్రంగా సేకరించి దానిని మదింపు వేసి ఉండాలి. అయినప్పటికీ ప్రాజెక్టును చేపట్టవచ్చునన్న నిర్ణయానికి వచ్చి ఉండాలి. పర్యావరణ పరిరక్షణకు చేపట్టే చర్యలను రూపొందించి వాటి ఖర్చును అంచనా వేసి ఉండాలి. ఇవన్నీ జరిగిన తరువాత ఇచ్చిన అనుమతే అనుమతిగానీ ప్రాథమిక సమాచారం సహితం ఇంకా సేకరించని స్థితిలో ఇచ్చిన అనుమతి అనుమతే కాదని ఆయన అన్నారు.

మెజారిటీ జడ్జిలిద్దరు మాత్రం అనేక ప్రభుత్వ శాఖల అధికారులు తమ నైపుణ్యాన్నంతా వెచ్చించి అనుమతి ఇవ్వడం సబబేనని నిర్ణయించారు కాబట్టి ఈ అనుమతి అనాలోచితంగా ఇచ్చినట్టు భావించలేమన్నారు. నిజానికి వారి తీర్పులో చాలా చోట్ల ఉన్నతస్థాయి అధికారుల హోదాలను (చీఫ్ ఇంజనీర్, ప్రిన్సిపల్ అడ్వైజర్ వగైరాలు) చాలా మురిపెంగా ప్రస్తావించి అంతటి వారు పర్యవేక్షిస్తుండగా ఇంక సమస్య ఏముంది అనే పద్ధతిలో సంతృప్తి వ్యక్తం చేయడం కనిపిస్తుంది. ఒక మున్సిఫ్ మేజిస్ట్రేటు కోర్టులో సాక్ష్యం ఇయ్యడానికి వచ్చిన రాష్ట్ర చీఫ్ సెక్రెటరీని చూసి మేజిస్ట్రేటు కొంచెం తబ్బిబ్బయి తన వివేచనాశక్తిని పక్కన పెడితే అర్థం చేసుకోవచ్చునేమోగానీ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ అదే వైఖరి ప్రదర్శిస్తే ఏమనుకోవాలి? నిర్ణయం తీసుకున్నవారి హోదా ముఖ్యం కాదు, వారు ఆ నిర్ణయానికి అవసరమైన సమాచారాన్నంతా లెక్కలోకి తీసుకున్నారా లేదా, ఆ సమాచారాన్ని అర్థం చేసుకోవడంలో కనీస హేతుబద్ధత ప్రదర్శించారా లేదా అన్నది న్యాయస్థానాలు చూడవలసిన విషయం అని సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ఇంకా నేర్పించవలసిన అవసరం ఉన్నట్టుంది.

1978లో నర్మదా జలవివాదాల ట్రిబ్యునల్ ఇచ్చిన అవార్డులో లేని హక్కేదీ ఎవరూ అడగడానికి వీలులేదు, ప్రభుత్వమూ ప్రపంచబ్యాంకు తిరస్కరించిన నిపుణుల అభిప్రాయాలకు విలువ లేదు, పెద్ద పెద్ద హోదాలున్న అధికారుల పర్యవేక్షణకు పర్యావరణ పరిరక్షణను వదిలేసి ఏ సమాచారమూ లేకుండానే 1987లో ప్రాజెక్టుకు ప్రధానమంత్రి ఇచ్చిన పర్యావరణ సంబంధమైన అనుమతి సక్రమమైనదే, దానిని ఇన్నేళ్ల తరువాత తిరగదోడడానికి వీలు లేదు అన్న చీఫ్ జస్టిస్ ఆనంద్, జస్టిస్ కిర్పాల్‌ల అభిప్రాయాలు చూశాం.

## నిర్వాసితులకు న్యాయం చేసినా బాగుండేది

ఇంక వాళ్లు నిర్వాసితుల పునరావాసాన్ని గురించి ఏమన్నారో చూద్దాం. నిజానికి, నిర్వాసితుల పునరావాసం 1978 నాటి ట్రిబ్యునల్ అవార్డుకు లోబడి జరిగిందా

లేదా అన్న ఒక్క విషయాన్ని చూడడానికి మాత్రమే ఈ కేసు విచారణ చేపట్టామనీ లేకపోతే ఈ కేసులో వినడానికేమీ లేదని వారు అన్నారు. ఆ ఒక్క పనయినా సరిగ్గా చేసి ఉంటే ఇతర విషయాలలో జడ్జిలిద్దరినీ క్షమించి ఉండవచ్చునేమోగానీ ఆ పని కూడ సరిగ్గా చేయలేదు.

నిజానికి ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని చెప్పే చట్టమేదీ భారతదేశంలో లేదు. స్థిరాస్తులకు నష్టపరిహారం మాత్రమే చట్టంలో ఉంది. అదృష్టం కొద్దీ నిర్వాసితులందరికీ పునరావాసం కల్పించాలని నర్మదా జలవివాదాల ట్రిబ్యునలే తన 1978 నాటి అవార్డులో చెప్పింది కాబట్టి సరిపోయిందిగానీ లేకపోతే సుప్రీంకోర్టు పునరావాసం గురించి చర్చ చేసేదే కాదేమో. నిర్వాసితుల పునరావాసం సరిగ్గా జరిగిందా లేదా అన్న విషయం పట్ల మాకు ఆదుర్దా ఉంది కాబట్టి అందుకోసం ఈ కేసు విచారిస్తున్నామని జడ్జీలు అన్నప్పటికీ అది ట్రిబ్యునల్ చలవే తప్ప వారిది కాదు.

ప్రాజెక్టు నిర్మాణంలో ఒక్కొక్క దశలోనూ అప్పటివరకు నిర్వాసితులయిన వారికి పునరావాసం సంపూర్ణంగా కల్పించిన తరువాతే ఆ తరువాతి దశకు పోవాలని ఆదేశించమని ఎన్‌బిఏ సుప్రీంకోర్టును కోరింది. లేకపోయినట్టయితే ప్రాజెక్టు పూర్తయ్యాక కూడ పునరావాసం కాగితాల మీదనే ఉండిపోయే ప్రమాదం ఉంటుంది. జస్టిస్ భరూచా తన అసమ్మతి తీర్పులో అటువంటి కచ్చితమైన ఆదేశం ఇచ్చారు కూడ. డ్యాం ఎత్తు మరొక అయిదు మీటర్లు పెంచితే ఎవరెవరు నిర్వాసితులవుతారో వారందరి పునరావాసం సంతృప్తిగా జరిగిందని మూడు రాష్ట్రాల ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలు (జిఆర్ఏ) ధృవీకరించిన తరువాతే ఆ తర్వాతి అయిదు మీటర్లు పెంచడానికి అనుమతి ఇవ్వాలి. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రతీ అయిదు మీటర్ల పెంపుదలకూ ఈ విధంగా అనుమతి తీసుకోవాలి. (ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పర్యావరణ సంబంధమైన అనుమతే చెల్లదని జస్టిస్ భరూచా అన్నారని చూశాం. అందువల్ల ఆయన ప్రాజెక్టు నిర్మాణమే ఆపేసి తిరిగి పర్యావరణ సంబంధమైన అనుమతి ఇచ్చేదీ లేనిదీ సక్రమంగా పరిశీలించమన్నాడు. ఒకవేళ అనుమతి ఇచ్చినట్టయితే పునరావాసానికి సంబంధించి పై నియమం పాటించమన్నాడు).

జస్టిస్ భరూచా ప్రస్తావించిన ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం (జిఆర్ఏ) ప్రభుత్వ యంత్రాంగం కాదు. అది ప్రభుత్వ సహాయ పునరావాస యంత్రాంగంపైన ప్రజలు చేసే ఫిర్యాదులను పరిష్కరించడానికి సుప్రీంకోర్టు ఒక మధ్యంతర ఉత్తర్వు

ద్వారా నెలకొల్పిన యంత్రాంగం. మూడు రాష్ట్రాలలోనూ ముగ్గురు రిటైర్డు హైకోర్టు/ సుప్రీంకోర్టు జడ్జిల ఆధ్వర్యంలో ఈ జిఆర్ఎలు అప్పటికే ఏర్పడి ఉన్నాయి.

మెజారిటీ జడ్జిలు మాత్రం ఒక్కొక్క దశలోనూ పునరావాసం పూర్తయితేనే తరువాత దశల నిర్మాణం చేపట్టవచ్చునన్న ఆదేశానికి కచ్చితమైన రూపం ఇవ్వలేదు, ఆదేశం ఇచ్చిన మేరకు దాని అమలు పర్యవేక్షణ ప్రభుత్వ యంత్రాంగం చేతిలోనే పెట్టడం తప్పనుకోనూ లేదు. ప్రాజెక్టు నిర్మాణం, పునరావాసం సమాంతరంగా సాగాలన్నారు. పునరావాసం జరిగిందని ప్రభుత్వ అధికారులతో కూడిన సహాయ పునరావాస ఉపసంఘం ఎప్పటికప్పుడు ధృవీకరించినట్టయితేనే ప్రాజెక్టు నిర్మాణం కొనసాగించాలన్నారు. ఈ ఉపసంఘం సుప్రీంకోర్టు అప్పటికే నెలకొల్పిన జిఆర్ఎలను సంప్రదించాలన్నారు.

సహాయ పునరావాస ఉపసంఘం తన ధృవీకరణను ఏ ప్రాతిపదికపైన ఇవ్వాలో ఇందులో చెప్పలేదు. అంతా ప్రభుత్వ అధికారులే కాబట్టి, పునరావాసానికి కావాల్సిన భూమి సేకరించడానికి ప్రభుత్వం కేవలం నోటీసు జారీ చేసినా అదే చాలునని చెప్పి పునరావాసం జరుగుతున్నట్టు ధృవీకరణ ఇచ్చేయొచ్చు. సుప్రీంకోర్టు నియమించిన స్వతంత్రమైన జిఆర్ఏకి ఇందులో నిర్ణాయకపాత్ర ఇచ్చి ఉంటే కొంత మెరుగ్గా ఉండేదేమో. కానీ వారిని 'సంప్రదించాలని' మాత్రమే అన్నారు. వారి సమ్మతి తీసుకోవాలని అనలేదు.

నిర్వాసితులకు పునరావాసం దొరుకుతుందా లేదా అన్న విషయాల్ని ఈ విధంగా సంశయంలో పెట్టడమే కాకుండా, పునరావాసం స్వభావాన్ని కొంచెం ఉదారంగా వ్యాఖ్యానించమంటే కూడ సుప్రీంకోర్టు ఒప్పుకోలేదు. ఒక గూడెంకు చెందిన నిర్వాసితులకు ఒకే చోట పునరావాసం కల్పించాలని అడిగితే 'నర్మదా జలవివాదాల ట్రిబ్యునల్ అవార్డులో ఈ విధంగా చెప్పలేదు కాబట్టి ఆ విధంగా కల్పించాలని మేము ఆదేశించలేం' అన్నారు. ఒకే చోట పునరావాసం కల్పించాలని అడగడానికొక సహేతుకమైన కారణం ఉంది. ఆదివాసులు తమకంటే ఆర్థికంగా రాజకీయంగా బలవంతులయిన 'నాగరికుల'తో తలపడవలసి వచ్చినప్పుడు, ఆ దాడిని ఎదుర్కోవడానికి ఆదివాసీ తెగ సంబంధాలు కల్పించే కట్టడి, ఐకమత్యం, సమిష్టిబలం చాలా ఉపయోగపడతాయనేది తెలిసిన విషయమే. వారి సమాజాన్ని ముక్కలు చెక్కలు చేసి 'నాగరిక' సమాజంలో పడేస్తే వారు తట్టుకోవడం కష్టం.

రిజర్వాయర్ వల్ల నిర్వాసితులయ్యేవారి లాగే కాలవల కోసం భూములు సేకరించడం వల్ల నిర్వాసితులయ్యేవారు కూడ రేపు ఉండబోతారు. వారికి కూడ వీరికిచ్చినట్టే పునరావాసం ఇవ్వాలనీ, కేవలం స్థిరాస్తులున్నవారికిచ్చే నష్టపరిహారంతో సరిపెట్టకూడదనీ ఎన్‌బిఏ వాదించింది. కానీ సుప్రీంకోర్టు ఒప్పుకోలేదు. దీనికి రెండు కారణాలు చెప్పింది. రెండూ విచిత్రమైనవే.

కాలవ కింద కొంత భూమి పోయినా మిగిలిన భూమికి కాలవ నీళ్లు వస్తాయి కాబట్టి వారు కూడ ప్రాజెక్టు లబ్దిదారుల కోవలోకి వస్తారనీ, అందువల్ల వారిని రిజర్వాయర్ నిర్వాసితులతో సమానంగా చూడకూడదనేది ఒక కారణం. కాలవ కింద భూములు కోల్పోయే ప్రతీ ఒక్కరికీ ఇంకా భూమి మిగిలి ఉంటుందనిగానీ, ఆ భూమికి కాలవ నీళ్లు వస్తాయనిగానీ కోర్టుకు ఎవరు చెప్పారో! అటువంటి సమాచారమేదీ తన ముందు లేకుండానే సుప్రీంకోర్టు ఈ నిర్ణయానికి వచ్చేసింది.

రెండవ కారణాన్ని ఇప్పటికే చూసి ఉన్నాం. నర్మదా జలవివాదాల ట్రిబ్యునల్ రిజర్వాయర్ నిర్వాసితులకు పునరావాసం ఇమ్మనిందే తప్ప కాలవల కింద భూములు కోల్పోయిన వాళ్లకు కూడ ఇమ్మని చెప్పలేదు. ట్రిబ్యునల్ తీర్పుకు సుప్రీంకోర్టుతో సహా అందరూ కట్టుబడి ఉండక తప్పదు కాబట్టి ఈ అభ్యర్థనకు కోర్టు అంగీకరించజాలదు.

ఇది కేవలం తప్పుడు అభిప్రాయమే కాదు, హాస్యాస్పదమైనదని కూడ మొదట్లోనే అన్నాం. దేశంలోని ప్రతి కోర్టుపైనా, ప్రతి ట్రిబ్యునల్‌పైనా సుప్రీంకోర్టుకు అజమాయిషీ ఉంది. ఆ అధికారాన్ని సుప్రీంకోర్టుకు ఇచ్చే ఆర్టికల్ 136 రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమని సుప్రీంకోర్టే అనింది. ఏ కోర్టు లేక ట్రిబ్యునల్ తీర్పులో సుప్రీంకోర్టు ఏ మేరకు జోక్యం చేసుకుంటుందనే విషయంలో తేడాలు ఉంటే ఉండవచ్చునుగాక. అయితే నర్మదా జలవివాదాల ట్రిబ్యునల్ నిర్వాసితులలో ఒక వర్గానికిచ్చిన హక్కును ఇంకొక వర్గానికి ఇయ్యనప్పుడు 'మేము కూడ ఏమీ చేయలేం' అని సుప్రీంకోర్టు అనడానికి వీలు లేదు. అటువంటి వివక్ష ఆర్టికల్ 14కు విరుద్ధమని ప్రకటించి తక్కినవారికి కూడ అదే హక్కును సుప్రీంకోర్టు కల్పించాలి.

న్యాయశాస్త్రంలో ఇంతటి ప్రాథమిక పాఠాలు మాబోటి వారి చేత చెప్పించుకునే అవసరం చీఫ్ జస్టిస్ ఆనంద్ వంటి న్యాయశాస్త్ర కోవిదులకు ఉందని మేము అనుకోవడం లేదు. అందువల్ల ఇక్కడున్నది న్యాయశాస్త్ర సంబంధమైన అజ్ఞానం

కాదనీ, న్యాయశాస్త్రంతో నిమిత్తం లేని భావాల ప్రేరణ ఇక్కడ పని చేస్తున్నదనీ అనుకోవలసి ఉంటుంది. దీని మూలం గ్లోబలైజేషన్ పట్ల మన దేశంలోని 'శిష్ట' వర్గాలలో ఉన్న ఆకర్షణ. 'అభివృద్ధి' అని దేనినయితే గ్లోబలైజేషన్ పేర్కొంటుందో అదిప్పుడందరికీ కావాలి. వేగంగా కావాలి. దానికి సిద్ధాంతాలు, ఆదర్శాలు, 'సెంటిమెంట్లు' ఏవీ అడ్డం రాకూడదు. రాజ్యాంగం కూడ అడ్డం రాకూడదు. అడ్డమొస్తే దానిని తప్పించుకోవడానికి అడ్డదారులు వెతుక్కుంటారు. ఈ తీర్పు దానికొక నిదర్శనం.

## పెద్ద డ్యాంలకు స్తోత్రపాఠం

'అభివృద్ధి' పట్ల ఉన్న ఉత్సాహంతో సుప్రీంకోర్టు పెద్ద డ్యాంలను పొగుడుతూ ఈ తీర్పులో పొందుపరిచిన స్తోత్రపాఠం అందరినీ ఆశ్చర్యపరిచింది. అప్పుడెప్పుడో జవహర్‌లాల్ నెహ్రూ ప్రాజెక్టులను ఆధునిక దేవాలయాలు అన్నాడని విన్నాం. అప్పట్లో అందరి అభిప్రాయమూ అదే కాబట్టి ఆయనను తప్పు పట్టలేకపోవచ్చు. కానీ గడచిన నలభై సంవత్సరాలలో ఆ రకమైన అభిప్రాయాల మీద చాలా చర్చ జరిగింది. పెద్ద డ్యాంల వల్ల అనుకున్నంత ప్రయోజనం లేదనీ, అనుకోని నష్టాలు చాలా ఉన్నాయనీ ఇప్పుడందరూ గుర్తిస్తున్నారు. డ్యాంలు ఇంక కట్టనే వద్దనే వాళ్లు కొందరే ఉండవచ్చునుగానీ, మంచినీ చెడునూ సమగ్రంగా అంచనా వేసుకొని తగిన రీతిలో ప్రాజెక్టుల రూపకల్పన చేయాలన్న గుర్తింపు మాత్రం సార్వజనీనంగానే వచ్చింది. ఈ నలభై ఏళ్ల సంవాదం సాధారణ దినపత్రికల పాఠకులకు సహితం ఎంతో కొంత తెలుసు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు మాత్రమే అదేమీ తెలియనట్టుంది. కనీసం చీఫ్ జస్టిస్ ఆనంద్, జస్టిస్ కిర్పాల్‌లకు తెలియదన్నది స్పష్టమే. వారు తమ అజ్ఞానాన్ని బయట పెట్టుకుంటూ 'ఆధునిక దేవాలయాల' పరిభాషను మరొకసారి గుర్తుచేశారు.

ఎన్‌బిఏకీ వారి తరపు న్యాయవాదులకూ కోపం తెప్పించిన విషయమేమిటంటే, వాదన జరుగుతున్న సమయంలో పెద్ద ప్రాజెక్టులు, వాటి వల్ల జరిగే నష్టాలు, పర్యావరణ పునరావాస సమస్యల గురించి వారు ఎప్పుడు మాట్లాడే ప్రయత్నం చేసినా జడ్జిలు వారి నోరు మూయించేశారని. 'అవన్నీ వద్దు, ఈ కేసు గురించి మాట్లాడు' అన్నారు వారితో. చివరికి తీర్పులో మాత్రం పెద్ద డ్యాంలను వెనకేసుకొస్తూ చాలా రాశారు.

'భారతదేశంలో అనేక నదీజలాల ప్రాజెక్టులను చేపట్టడం జరిగింది. ఒక డ్యాం నిర్మాణం వల్ల పర్యావరణానికి హాని జరిగిన ఒక్క ఉదంతం కూడ పిటిషనర్

మా దృష్టికి తేలేదు. వాస్తవమేమిటంటే, పర్యావరణం నిజానికి మెరుగుపడింది' అన్నారు జడ్జిలు. హాని ఎక్కువ జరిగిన ఉదంతాల గురించి మాట్లాడనివ్వలేదు కాబట్టి పిటిషనర్ ఒక్కటి కూడ ఉదహరించలేదు. కాగా పర్యావరణం నిజానికి మెరుగుపడిందన్న విషయం కోర్టు దృష్టికి ఎవరు తీసుకొచ్చారు? ఎవరూ తీసుకురాలేదు. అది జడ్జిల అభిప్రాయమే. అభిప్రాయం కూడ కాదు, అది వాళ్లు నమ్మదలచుకున్న విషయం.

పెరియార్ డ్యాం వల్ల తమిళనాడులోని మధురై జిల్లాలో క్షామాలు మటుమాయం కాలేదా? అన్నారు. కర్ణాటకలోని కృష్ణరాజసాగర్ డ్యాం వల్ల వన్యమృగాలు తిరిగే చిట్టడివిగా ఉన్న మాండ్య జిల్లా సస్యశ్యామలంగా మారలేదా? అన్నారు. లేదని ఎవరూ అనలేదు, అనరు. ఎటొచ్చీ దీనికి అయిన ఖర్చెంత అనేది ప్రశ్న. పర్యావరణానికి, తత్ఫలితంగా మనుషుల జీవితాలకు జరిగిన హానిని ఖర్చులో లెక్కపెట్టవద్దా అనేది ప్రశ్న. నిర్వాసితులైన ప్రజలు కోల్పోయిన జీవనాన్నీ ఆదాయాన్నీ ఖర్చులో లెక్కపెట్టవద్దా అన్నది ప్రశ్న. అవన్నీ ఖర్చులో భాగంగా లెక్కగట్టేటట్టయితే అవే నదీ జలాలను అంతకంటే తక్కువ ఖర్చుతో వినియోగించుకునే ప్రత్యామ్నాయాలను అన్వేషించడం సామాజికంగా తక్కువ నష్టకరమవుతుంది కదా అనేది ప్రశ్న. పెద్ద డ్యాంలను విమర్శించేవాళ్లు వాటి వల్ల నీళ్లు రావనీ, పంటలు పండవనీ అనడం లేదు. వాటి అసలైన ఖర్చుకూ పైకి లెక్కపెట్టే ఖర్చుకూ చాలా తేడా ఉందనీ, అసలయిన ఖర్చు లెక్కలోకి తీసుకుంటే అవేమంత ప్రయోజనకరమైనవి కావనీ, అదే నది నీటిని వేరే రూపాలలో సాగు కోసం వాడుకోవడం ఎక్కువ ప్రయోజనకరమనీ అంటున్నారు.

ఈ అభిప్రాయం సత్యమా కాదా అన్న విషయం ఈ కేసులో చర్చకు రాలేదు. జడ్జిలు అనుమతించలేదు కాబట్టి రాలేదు. కానీ వారు మాత్రం ఈ అభిప్రాయం మీద తీర్పు చెప్పేశారు. ఒక్క పర్యావరణం గురించే కాదు, మొత్తంగా 'అభివృద్ధి' అనే ప్రక్రియ గురించి సుప్రీంకోర్టు ఒక కచ్చితమైన అభిప్రాయాన్ని ఏ చర్చా తన ఎదుట జరగకుండానే ప్రకటించేసింది. ఆదివాసులు, వెనకబడిన ప్రాంతాల ప్రజలు శాస్త్రసాంకేతిక జ్ఞానం వల్ల ప్రయోజనం పొందకుండా ఉండిపోవడం అన్యాయమనింది. వాళ్ల కృషి వల్లగానీ పరిస్థితుల ఒత్తిడి వల్లగానీ వేరే ఎక్కడయినా పచ్చని జీవితాన్ని వెతుక్కోవడం మంచిది కాదా? అనింది. పరిస్థితుల ఒత్తిడి వల్ల నిర్వాసితులయిన వారికి వేరే ఎక్కడయినా పచ్చని జీవితం దొరుకుతుందన్న భరోసా మన సమాజంలో ఎంత ఉంది అన్న ప్రశ్న జడ్జిలు వేసుకోలేదు. వాదిగానీ ప్రతివాదిగానీ కేసు విచారణలో దానిని చర్చించలేదు.

ఏ అభివృద్ధీ రాని గ్రామాల కంటే భాక్రానంగల్, నాగార్జునసాగర్, తెహ్రీ డ్యాంల సమీపంలోని భిలాయి, టాటానగర్ స్టీల్ ప్లాంట్ల సమీపంలోని గ్రామాలలో నివసిస్తున్న ప్రజల జీవితాలు మెరుగ్గా ఉన్నాయని కూడ జడ్జిలు ప్రకటించారు. దీనికీ ఏ ఆధారమూ లేదు. ఊరికే వాళ్లకు తోచిన ప్రాజెక్టుల పేర్లు టకటకా ఏకరువు పెట్టారు తప్ప వీటి గురించి ఏ పరిశోధనా వారి ముందు లేదు. నిర్దిష్టంగా పరిశోధన జరిపితే ప్రతీ అభివృద్ధి కేంద్రంలోనూ జీవితాలు బాగుపడిన వారూ కనిపిస్తారు, నాశనమైనవారూ కనిపిస్తారు. ఏ వృత్తుల వారు, ఏ కులాల వారు, ఏ రకమైన సామాజిక ఆర్థిక జీవితరంగానికి చెందిన వారు ప్రయోజనం పొందారు, ఎవరు నష్టపోయారు అని విశ్లేషించుకుంటే అభివృద్ధికి ఉండే సామాజిక పర్యవసానాలు స్పష్టంగా అర్థం అవుతాయి. అభివృద్ధి వల్ల అంతా నష్టమే జరుగుతుందని ఎవరో అంటున్నట్టు ఊహించుకొని అంతా మేలే జరుగుతుందని ఏ సమాచారమూ, ఏ పరిశోధనా లేకుండా దబాయించాలని చూశారు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు. ఒక పదవతరగతి విద్యార్థి అభివృద్ధి అనే టాపిక్ మీద ఈ రకమైన వ్యాసం రాస్తే బి గ్రేడ్ రావడం కూడ కష్టం.

## పర్యవేక్షక సంస్థకు సైతం అంగీకరించలేదు

చివరిగా ఒక విషయం చూసి ముగిద్దాం. పర్యావరణం, పునరావాసాలకు సంబంధించిన కచ్చితమైన ప్రమాణాలు నిర్దేశించి, ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన ఒక్కొక్క దశలోనూ ఆ ప్రమాణాన్ని పరిపూర్తి చేసిన తరువాతే తరువాతి దశకు అనుమతి లభించేటట్టు ఆదేశించమని ఎన్‌బిఏ సుప్రీంకోర్టును కోరిందనీ, 'అసమ్మతి తీర్పు' ఇచ్చిన జస్టిస్ భరూచా దీనికి అంగీకరించారుగానీ మెజారిటీ జడ్జిలు ఒప్పుకోలేదనీ చూశాం. పోనీ కనీసం ప్రాజెక్టు నిర్వహణను మొత్తంగా పర్యవేక్షించి హామీలు అమలయ్యేటట్టు చూడడానికి ఒక స్వతంత్ర పర్యవేక్షక వ్యవస్థను నియమించమని ఎన్‌బిఏ అడిగింది. నిజానికి దీని వలన పెద్ద ప్రయోజనం ఉండదు. ఎందుకంటే ఒకవేళ హామీలు అమలు చేయకపోయినా ప్రాజెక్టును ఆపే అధికారం గానీ నిర్బంధంగా అమలు చేయించే అధికారం గానీ అటువంటి పర్యవేక్షక వ్యవస్థకు ఉండదు.

అయితే దీనికి కూడ మెజారిటీ జడ్జీలు అంగీకరించలేదు. దానికి వారు చెప్పిన కారణాన్ని ఉటంకించడం అవసరం. 'సమాజంలో చాలామందికి మేలు చేసే జాతీయ ప్రాముఖ్యం గల ప్రాజెక్టు గురించి కేంద్ర ప్రభుత్వం గానీ రాష్ట్ర ప్రభుత్వం గానీ

అత్యున్నత స్థాయిలో ఎటువంటి తొందరపాటు లేకుండా సమాలోచన జరిపినట్టయితేను, అందులోనూ ప్లానింగ్ కమిషన్ దానిని మదింపు వేసి దానికి ఆమోదం తెలిపినట్టయితేను కోర్టులు దానిని పర్యవేక్షించడం గానీ స్వతంత్ర పర్యవేక్షక వ్యవస్థను నెలకొల్పడం గానీ అనవసరం. ప్రజాస్వామ్యంలో ప్రజల మేలు కోసం ఏ ప్రాజెక్టు చేపట్టాలో నిర్ణయించే అధికారం ఎన్నికయిన ప్రభుత్వానిది. ప్రాజెక్టులోగానీ ప్రాజెక్టు నిర్వహణలోగానీ కచ్చితంగా చట్టాన్ని అతిక్రమించే విషయమేదైనా ఉంటేనే కోర్టులు జోక్యం చేసుకుంటాయి' అన్నారు.

విధాన నిర్ణయాలు ప్రభుత్వం బదులు న్యాయస్థానాలు చేయాలని ఎవరూ అనరుగానీ ప్రభుత్వం చేసిన విధాన నిర్ణయాలపైన న్యాయస్థానాలకు ఉండే పర్యవేక్షక అధికారం ఇంతేనా? 'ఉన్నత స్థాయి' అధికారులు తీరికగా నిర్ణయం చేస్తే సరిపోతుందా? ప్లానింగ్ కమిషన్ వంటి 'ఉన్నత స్థాయి' సంస్థ ఆమోదిస్తే సరిపోతుందా? ఆమోదం ఏ విధంగా తెలిపారన్నది కాక ఎవరు తెలిపారన్నది ప్రమాణం అవుతుందా? ఆ నిర్ణయానికి సంబంధించిన సమాచారమంతటినీ లెక్కలోకి తీసుకున్నారా, అసందర్భమైన కారణాలేమైనా నిర్ణయాన్ని ప్రభావితం చేశాయా, నిర్ణయం తీసుకోవడంలో అహేతుకంగా వ్యవహరించారా అని చూసే అధికారం కోర్టులకుందని నిన్నమొన్నటి దాకా ఇదే సుప్రీంకోర్టు అనేక తీర్పులలో అనింది. ఇప్పుడు ఆ అభిప్రాయాన్ని తిరగదోడినట్టనుకోవాలా?

బహుశా 'అభివృద్ధి'కి కోర్టులు అడ్డం రాకుండా ఉండాలంటే ఈ సవరణ అవసరమని ఈ తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులిద్దరూ భావించి ఉండవచ్చు. సుప్రీంకోర్టు, హైకోర్టులలోని న్యాయమూర్తులలో చాలామంది ఈ రకమైన అభిప్రాయం వైపే మొగ్గు చూపుతున్నారని భావించడానికి ఆధారాలు కనిపిస్తున్నాయి. అందుకే ఈ తీర్పు ప్రాముఖ్యం న్యాయసిద్ధాంతానికి పరిమితమైనది కాదనుకుంటున్నాం. అది దేశ రాజకీయాలకూ రాజకీయ ఆర్థిక భవితవ్యానికీ కూడ సంబంధించిన విషయం.

*మొదటి ముద్రణ : మానవహక్కుల వేదిక బులెటిన్ 3, మార్చి 2001*

*రెండవ ముద్రణ : 'అభివృద్ధి –విధ్వంసం', 2015 (HRF ప్రచురణ)*

# నర్మదా ఆందోళనను సుప్రీంకోర్టు పరిష్కరించగలదా?

ఈసారి నర్మదా బచావో ఆందోళన్ (ఎన్.బి.ఎ) నాయకురాలు మేధాపాట్కర్ చేపట్టిన నిరాహార దీక్ష ప్రముఖ వార్త అయింది. ఆమె ఎందుకోసం ఆ నిరాహారదీక్ష చేపట్టిందో కూడ దేశానికి కొంతమేరకు అర్థం అయింది. నిర్వాసితుల పునరావాసం సమగ్రంగా చేపట్టకుండానే నర్మదా డ్యాం ఎత్తు పెంచుతున్నారనీ, పునరావాసం సమగ్రంగా చేపట్టేదాకా దానిని ఆపాలని ఆమె డిమాండ్ చేస్తోందని చాలామంది అర్థం చేసుకున్నారు. సుప్రీంకోర్టు ఒకవైపు డ్యాం ఎత్తు పెంచే పని కొనసాగించమని చెప్తూ, ఇంకొకవైపు పునరావాసం పని కూడ వేగంగా జరగాలని ఆదేశించడం ద్వారా ఆమె నిరాహార దీక్ష వల్ల తలెత్తిన సంక్షోభాన్ని తాత్కాలికంగా పరిష్కరించిందనీ, మే నెల మొదటివారంలో సుప్రీంకోర్టు కొనసాగించబోయే విచారణ తుది పరిష్కారం ఇవ్వగలదనీ కూడ చాలామంది నమ్ముతున్నారు.

కొంచెం వెనక్కిపోయి విషయాన్ని అర్థం చేసుకుంటే తప్ప ఈ సమస్య గురించి సమగ్రమైన అవగాహన ఏర్పడదు. అది ఏర్పడనిదే రేపు సుప్రీంకోర్టు చేయగల పరిష్కారానికి వుండే పరిమితులు అర్థం కావు. అర్థం కానిదే రేపు మళ్ళీ ఎన్‌బిఏ ఆందోళన మొదలుపెడితే అందులోని న్యాయాన్యాయాలు అవగాహన కావు. ఇవాల్టి సంక్షోభానికి కారణం సుప్రీంకోర్టేనని మొదట అర్థం చేసుకోవడం అవసరం. సర్దార్ సరోవర్ డ్యాం మీద ఎన్‌బిఏ

సుప్రీంకోర్టులో వేసిన కేసుపైన 2000 సంవత్సరంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులోనే దాని మూలం వుంది. ఆ తీర్పును ఇప్పుడు సుప్రీంకోర్టు తిరగదోడజాలదు కాబట్టి ఈ రోజు ఎన్‌బిఏ చేస్తున్న ఫిర్యాదుకు సంతృప్తికరమైన పరిష్కారం చూపించడం సుప్రీంకోర్టుకు కష్టం.

## 2000 సంవత్సరంలో సుప్రీంకోర్టు ఏమనింది?

నర్మదా నది మధ్యభారతంలోని కొండలలో పుట్టి పడమటికి ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తుంది. ఇది మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌ల భూభాగంలో ప్రవహిస్తుంది. ఈ నదిపైన ఆ మూడు రాష్ట్రాలూ నిర్మించదలచిన డ్యాంలు 30 పెద్దవి, 135 మధ్యతరహావి. సర్దార్ సరోవర్ వీటన్నిటిలోకీ పెద్దది. అది ఉండేది గుజరాత్‌లో, దానివల్ల ఫలితం పొందేదీ పూర్తిగా గుజరాతే. కానీ మునిగేది మాత్రం అత్యధికంగా మధ్యప్రదేశ్‌లోని ఆదివాసీ ప్రాంతం.

ఈ సర్దార్ సరోవర్ డ్యాం నిర్మాణాన్నే సవాలుచేస్తూ 1994లో ఎన్‌బిఏ సుప్రీంకోర్టులో కేసు వేసింది. అసలు ఆ డ్యాంను చేపట్టడమే చట్టవిరుద్ధమని వాదించింది. మొదట్లో డ్యాం నిర్మాణంపైన స్టే ఇచ్చినప్పటికీ, 2000 సంవత్సరంలో ఆ కేసులో తుదితీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు ఎన్‌బిఏ వాదనలన్నిటినీ కొట్టేసి డ్యాం కట్టుకొమ్మని గుజరాత్‌కు అనుమతి ఇచ్చింది. ఆ కేసులో జరిగిన వాదోపవాదాలన్నిటినీ ఇప్పుడు ప్రస్తావించడం అనవసరం. పునరావాసం గురించి సుప్రీంకోర్టు ఆనాడు ఏం చెప్పిందన్నదే మనకు ప్రస్తుతం.

డ్యాంకు అనుమతి ఇస్తేనే కదా పునరావాసం ప్రసక్తి వచ్చేది. కాబట్టి ఆ కేసు వాదనలో పునరావాసం చర్చ ప్రధానం కాదు. అయినప్పటికీ అన్ని వాదనలతోపాటు పునరావాసం గురించి కూడ వాదన చేయడం జరిగింది. సుప్రీంకోర్టు ఈ విషయంలో స్పష్టమైన వైఖరి ప్రదర్శించింది. అదేమిటో తెలుసుకోవడం ప్రస్తుత సంక్షోభాన్ని అర్థం చేసుకోవడానికి అవసరం – ఎందుకంటే దీనికి కారణం ఆ వైఖరే కాబట్టి.

నర్మదా నదిపైన మూడు రాష్ట్రాలు పెద్దఎత్తున ప్రాజెక్టులు తలపెట్టాయని పైన చెప్పుకున్నాం. ఎగువన ఉన్న మధ్యప్రదేశ్ తలపెట్టిన డ్యాంల వల్ల దిగువన ఉన్న తాము తలపెట్టిన సర్దార్ సరోవర్‌కు నష్టం రాగలదని గుజరాత్ వివాదం లేవదీయగా, కేంద్ర ప్రభుత్వం 1968లో నర్మదా జల వివాదాల ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. ఆ ట్రిబ్యునల్ 1978లో తన అవార్డు ప్రకటించింది. ఆ అవార్డులో, నర్మదా

నదిపైన ప్రాజెక్టు నిర్మించే ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా రిజర్వాయర్ వల్ల ముంపుకు గురయ్యే నిర్వాసితులకు పునరావాసం కల్పించాలనీ, కోల్పోయిన భూమికి బదులుగా భూమి ఇవ్వాలనీ చెప్పింది.

ట్రిబ్యునల్ పునరావాసం విషయంలో ప్రకటించిన ఈ ఆదేశం అమలయ్యేటట్లు చూసేంతవరకే తన కర్తవ్యం తప్ప పునరావాసం గురించి తనను అదనంగా ఏమీ అడగొద్దనీ, అడిగితే ఇవ్వబోయేది లేదని కూడ 2000 సంవత్సరంలో ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు స్పష్టంగా ప్రకటించింది. ఉదాహరణకు – నిర్వాసితులు అత్యధికంగా ఆదివాసులు కాబట్టి, ఉమ్మడి జీవితం వారి మనుగడకు ముఖ్యం కాబట్టి, నిర్వాసిత గ్రామానికి గ్రామంగానే వేరొకచోట పునరావాసం కల్పించాలని ఎన్‌బిఏ వాదించగా, 'అట్లాగని నర్మదా జలాల ట్రిబ్యునల్ అనలేదే' అనింది సుప్రీంకోర్టు. 'పునరావాసం ఇమ్మన్నదిగానీ ఒకేచోట ఇమ్మనలేదు కాబట్టి మీకు ఆ హక్కు లేదు' అనింది. అట్లాగే, రిజర్వాయర్ కింద భూములు కోల్పోయిన వారికిచ్చినట్టే కాలవల కింద భూములు కోల్పోయిన వారికి కూడ పునరావాసం ఇవ్వాలని ఎన్‌బిఏ వాదించగా, 'ట్రిబ్యునల్ అట్లా అనలేదే' అనింది సుప్రీంకోర్టు. 'రిజర్వాయర్ కింద భూమి కోల్పోయే వారికి భూమికి భూమి ప్రాతిపదికన పునరావాసం ఇమ్మని ట్రిబ్యునల్ చెప్పిందే తప్ప కాలవల కింద భూములు కోల్పోయిన వారికి కూడ ఇవ్వాలని ట్రిబ్యునల్ అనలేదు కాబట్టి మీకు ఆ హక్కు లేదు" అనింది.

సుప్రీంకోర్టు అనుసరించిన ఈ తర్కం హాస్యాస్పదమైనది. నదీ జలాల ట్రిబ్యునల్ అవార్డు పరీవాహక రాష్ట్రాలకు శిరోధార్యం తప్ప సుప్రీంకోర్టుకది శిరోధార్యం కాదు. అవార్డు అన్యాయంగా ఉందని సుప్రీంకోర్టు భావిస్తే దానిని రద్దు చేయవచ్చు. అసమగ్రంగా ఉంటే సమగ్రత కల్పించవచ్చు, లేదా సమగ్రత కల్పించమని ట్రిబ్యునల్‌ను ఆదేశించవచ్చు. దేశంలోని అన్ని న్యాయ నిర్ణయ వ్యవస్థల మీద పర్యవేక్షక అధికారం సుప్రీంకోర్టుకు ఉందని రాజ్యాంగంలోని ఆర్టికల్ 136 అంటోంది. అటువంటప్పుడు 'నదీ జలాల ట్రిబ్యునల్ ఇచ్చిన అవార్డును దాటి పునరావాసం గురించి మేమేమీ చెప్పము అనేది అర్థరహితమైన అభిప్రాయం. ఆర్టికల్ 136 గురించి సుప్రీంకోర్టు జడ్జిలకు తెలియదనుకోలేము కాబట్టి ఇది అజ్ఞానం నుండి పుట్టిన అభిప్రాయం కాదనీ, ఉద్దేశ్యపూర్వకంగా తీసుకున్న నిర్ణయమనీ అర్థం అవుతుంది.

చివరిగా ఎన్‌బిఏ తరఫు న్యాయవాది సుప్రీంకోర్టును ఒకటి కోరాడు. ఎట్లాగూ డ్యాం కట్టుకొమ్మంటున్నారు. ట్రిబ్యునల్ ఇమ్మన్న మేరకు పునరావాసం

ఇమ్మంటున్నారు. అయితే ఒకసారి డ్యాం కట్టేస్తే ఇంక పునరావాసం ఇచ్చేది ఉండదు కాబట్టి, ఒక్కొక్క దశలోనూ డ్యాం ఎత్తు పెంచే ముందు పెంచబోయే ఎత్తు వల్ల నిర్వాసితులు కాబోయే వారికి పునరావాసం పూర్తిగా కల్పించిన తరువాతే ఎత్తు పెంచేటట్లు ఆదేశించమని అడిగాడు. సుప్రీంకోర్టు ఒప్పుకోలేదు. డ్యాం నిర్మాణం, పునరావాసం సమాంతరంగా సాగుతాయనింది. పోనీ పునరావాసం నిజంగా సమాంతరంగా జరుగుతున్నదా లేదా చూడటానికి ఒక స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటుచేయమని అడిగితే దానికి కూడ సుప్రీంకోర్టు ఒప్పుకోలేదు. మూడు రాష్ట్రాలూ సహాయ పునరావాస సంఘాలు ఏర్పాటు చేశాయి కదా, ఆ ఉపసంఘాలు ఓకే అంటే చాలుననింది. అవి ప్రభుత్వం ఏర్పాటుచేసిన సంస్థలయినంత మాత్రాన వాటి విశ్వసనీయతను శంకించనవసరం లేదనింది. అంతేకాక, పునరావాసం అందని నిర్వాసితుల ఫిర్యాదులు వినడానికి మూడు రాష్ట్రాలూ ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలు నెలకొల్పాయి, వాటిని కూడ ఉపసంఘాలు సంప్రదిస్తాయి లెమ్మని అనింది.

ఈ అభిప్రాయమే ఇవాళ్టి సంక్షోభానికి మూలం. పునరావాస ప్రక్రియ ఏ మాత్రం సంతృప్తికరంగా లేకున్నప్పటికీ సహాయ పునరావాస ఉపసంఘం డ్యాం ఎత్తు పెంపుకు అనుమతి ఇచ్చేస్తున్నదని ఎన్‌బిఏ ఆరోపణ. ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం ఏ ఫిర్యాదులనూ పరిష్కరించడం లేదని ఇంకొక ఆరోపణ. ఇవి రెండూ నిజమేనని మేధాపాట్కర్ నిరాహారదీక్ష మొదలుపెట్టిన తరువాత ఆ ప్రాంతానికి పోయి పరిశీలించిన కేంద్ర మంత్రుల బృందం కూడ ధృవీకరించింది. ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం బాధిత ప్రాంతాలను సందర్శించి 6 సంవత్సరాలయిందని కేంద్ర మంత్రుల బృందం అనింది. కేంద్ర జలవనరుల శాఖ మంత్రి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి సభ్యులుగా వున్న ఈ బృందం ఎన్‌బిఏ చేసిన ఆరోపణ న్యాయమైనదేనని ఇంత స్పష్టంగా చెప్పినప్పటికీ డ్యాం ఎత్తు పెంపును సుప్రీంకోర్టు స్టే చేయడానికి నిరాకరించి 'ఎత్తు పెంచుకోండి, అయితే పునరావాసమూ వేగంగా చేయండి' అని చెప్తూ కేసును మే నెలకు వాయిదా వేయడానికి కారణం 2000 సంవత్సరంలో ఇచ్చిన తీర్పులో తీసుకున్న వైఖరే. సమగ్రమైన పునరావాసం అనేది డ్యాం ఎత్తు పెంపుకు ముందుషరతు కాదు. దేనికది 'సమాంతరంగా' సాగుతుంటాయి. 'సమాంతరం' అనే మాటకు ఈ సందర్భంలో స్పష్టమైన అర్థమేమీ లేదు కాబట్టి ఆచరణలో దీని అర్థం ఇవి రెండూ విడివిడి విషయాలని. పునరావాసం సరిగ్గా చేపడుతున్నారా లేదా పర్యవేక్షించి డ్యాం ఎత్తు పెంపుకు గ్రీన్ సిగ్నల్ ఇయ్యవలసిన

మూడు రాష్ట్రాల సహాయ పునరావాస ఉపసంఘాలు, వారు సంప్రదించవలసిన ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగమూ తమ డ్యూటీ సక్రమంగా చేయని పక్షంలో సుప్రీంకోర్టు (మన దినపత్రికల భాషలో) 'కొరడా ఝుళిపిస్తుంది' అంతే. ఆ ఝుళిపింపులకు ఆయా సంఘాలూ, యంత్రాంగాలూ బెదరకపోతే నిర్వాసితులు చేయగలిగిందేమీ లేదు.

ఇక్కడ సమస్య సుప్రీంకోర్టు సీరియస్‌గా స్పందిస్తుందా లేదా అన్నది కాదు. నిజంగానే పునరావాస ప్రక్రియ డ్యాం నిర్మాణ ప్రక్రియ అంత చురుగ్గా సాగాలన్న సంకల్పం సుప్రీంకోర్టుకు వున్నా, సాగుతున్నదని ఒకరూ, సాగడం లేదని ఒకరూ అంటున్నప్పుడు నిజమేమిటో దైనందిన ప్రాతిపదికన తేల్చి చక్కదిద్దడం ఢిల్లీలో కూర్చున్న న్యాయస్థానానికి సాధ్యం కాదు. అందుకే ఈ పర్యవేక్షణ చేయడానికి ఒక స్వతంత్ర యంత్రాంగాన్ని నియమించమని 2000 సంవత్సరంలో చివరి కోరికగా ఎన్‌బిఏ తన వాదనలలో కోరింది. అటువంటి యంత్రాంగం ఊరూరా తిరిగి నిజమేమిటో తేల్చగలిగేది. కానీ 'ప్రభుత్వం నియమించిన ఉపసంఘాల విశ్వసనీయతను శంకించనక్కర లేదు' అంటూ ఆ వాదనను తోసిపుచ్చిన కోర్టు, అది నిజమేనని ఇప్పుడు కేంద్ర జలవనరుల మంత్రి, సాంఘిక సంక్షేమ మంత్రి స్వయంగా చెప్పిన తరువాత తానే కొరడా చేతబట్టుకుంటానని ప్రకటించినా అది ఆచరణయోగ్యమైన పరిష్కారం కాబోదు.

ప్రస్తుత సంక్షోభానికి మే నెలలో ఏదో ఒక రకంగా తెరపడినా, ఈ సమస్య మళ్ళీ మళ్ళీ ముందుకు రాబోతుంది. నర్మదా డ్యాం ప్రతిపాదిత ఎత్తు 136 మీటర్లు. ఇప్పుడు వారు అనుమతి అడుగుతున్నది 112 మీటర్ల ఎత్తుకు పెంచడానికి. అంటే ఇంకా 24 మీటర్లు పెంచబోతారు. అది రెండు విడతలలో చేస్తారో, మూడు విడతలలో చేస్తారో తెలీదు. కాబట్టి ఇంక రెండుసార్లో మూడుసార్లో రాబోయే సంవత్సరాలలో ఇదే సంక్షోభం రాగలదు. అప్పటికింకా ఒంట్లో ఓపిక ఉంటే మేధాపాట్కర్ మళ్ళీ నిరాహారదీక్షకు కూర్చోవచ్చు. లేదా ఇంకెవరైనా కూర్చోవచ్చు. సజావుగా మాత్రం డ్యాం నిర్మాణం, పునరావాసం జరిగిపోవు.

నిజాయితీగా స్పందించదలచుకుంటే సుప్రీంకోర్టు 2000 సంవత్సరం నాటి తీర్పును పునస్సమీక్షించాలి. దానికి న్యాయమూర్తులు సిద్ధమేనా?

*మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది*

*28 ఏప్రిల్ 2006*

# 'జుడీషియల్ మర్డర్'

రాజీవ్ గాంధీ హత్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చట్ట ప్రకారం కూడ అన్యాయమైన తీర్పు. నేర నిర్ధారణ చట్టబద్ధంగానే చేసినా మరణదండన విధించడాన్ని హక్కుల ఉద్యమకారులు, ప్రజాతంత్ర వాదులు వ్యతిరేకించేవారే. కానీ చాలామందికి బహుశా తెలియని విషయమేమిటంటే ఈ కేసులో సుప్రీంకోర్టు చేసిన నేర నిర్ధారణే అన్యాయమైనది.

'రాజీవ్ గాంధీ హత్య కేసు' అంటున్నాము గానీ 1991 మే 21 నాడు తమిళనాడులోని శ్రీపెరుంబుదూర్‌లో జరిగిన 'మానవ బాంబు' పేలుడు ఘటనలో రాజీవ్‌గాంధీయే కాక ఇంకొక 15 మంది చనిపోయారు. అయినప్పటికీ ఆ హత్యాకాండ లక్ష్యం రాజీవ్‌గాంధీని చంపడం మాత్రమే కాబట్టి, ఆయన దేశ మాజీ ప్రధానమంత్రి కాబట్టి, అప్పట్లో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలలో ఒకవేళ కాంగ్రెస్ పార్టీ గనుక గెలిస్తే మళ్లీ ప్రధానమంత్రి అయ్యేవాడు కాబట్టి ఆ కేసును రాజీవ్‌గాంధీ హత్య కేసుగానే ప్రస్తావించడం జరుగుతున్నది.

ఈ దృష్టే న్యాయస్థానాల వైఖరిని కూడ ప్రభావితం చేసిందని చెప్పక తప్పదు. చనిపోయిన వాళ్లు పెద్దవాళ్లా చిన్నవాళ్లా అన్నది న్యాయస్థానాలు చూడకూడదనీ, నేరం ఎవరు చేసినా ఎవరి మీద జరిగినా ఒకేలాగ చూడాలని చట్టం అంటుంది. రాజ్యాంగం అంటుంది. అయినప్పటికీ న్యాయస్థానాలు అన్ని సందర్భాలలోనూ అంత సమదృష్టి ప్రదర్శించవు.

శ్రీపెరుంబుదూర్ హత్యాకాండలో ఒకవేళ రాజీవ్‌గాంధీ తప్పించుకొని స్థానిక కాంగ్రెస్ నాయకులో లేక సభకు వచ్చిన ప్రజలో

చనిపోయి వుంటే ముద్దాయిలందరికీ మరణ దండన విధించాలన్న ఆలోచన ఆ కేసును విచారించిన న్యాయమూర్తికి వచ్చి వుండేదా? పాత తీర్పులను సవరించి చట్టాలకు కొత్త వ్యాఖ్యానాలు చేసయినా సరే ముద్దాయిలలో కొందరిని ఉరికంబం ఎక్కించాలన్న ఆలోచన సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు వచ్చి వుండేదా?

లేదనుకుంటాను.

అట్లాగని సుప్రీంకోర్టు సాక్ష్యాలను అర్థం చేసుకోవడంలో పూర్తిగా గుడ్డిగా వ్యవహరించిందని కూడ అనలేము. నిజానికి, నేరానికున్న సామాజిక రాజకీయ నేపథ్యాన్ని అర్థం చేసుకుంటే తప్ప నేరాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేమన్న ప్రజాస్వామిక సూత్రాన్ని సుప్రీంకోర్టు ఈ కేసులో బాగానే అనుసరించింది. చాలా దూరం అన్వయించింది. కానీ చివరిదాకా తీసుకుపోవడానికి ఈ కేసుకు వున్న రాజకీయ ప్రాముఖ్యత ఎక్కడో అడ్డం వచ్చినట్టుంది.

అందువల్ల ఈ కేసులో ముద్దాయిలకు అన్యాయం జరగడమేకాక కొన్ని అవాంఛనీయమైన సూత్రీకరణలకు ఆమోదముద్ర లభించింది. ముద్దాయి హక్కులకు బలం కల్పించే రెండు తీర్పులను ఈ క్రమంలో సుప్రీంకోర్టు తిరగదోడడమేకాక మరొక ముఖ్య విషయంలో గత కాలంలో సుప్రీంకోర్టే ఇచ్చిన అనేక తీర్పులను అసలే పట్టించుకోకుండా సాక్ష్యాన్ని వ్యాఖ్యానించడం ద్వారా ఒక నష్టకరమైన వరవడిని సృష్టించింది.

ఈ విషయాలను వివరించే ముందు శ్రీపెరుంబుదూర్ కేసు వివరాలను కొంచెం తెలుసుకోవడం అవసరం. 1991న 21 సాయంత్రం శ్రీపెరుంబుదూర్‌లో రాజీవ్ గాంధీ ఉపన్యసించనున్న బహిరంగసభ దగ్గర థాను అనే ఎల్‌టిటిఇ కార్యకర్త తన నడుముకు బెల్టు బాంబు కట్టుకొని రాజీవ్ గాంధీకి పూలదండ వేసే నెపంతో దగ్గరికి పోయి బాంబు పేల్చడం ద్వారా తనను తాను పేల్చేసుకొని రాజీవ్ గాంధీని కూడ పేల్చేసింది. ఇద్దరి శరీరాలు తుత్తునియలయిపోయాయి.

వీళ్లిద్దరేకాక ఇంకొక 15 మంది కూడ ఆ పేలుడులో చనిపోయారు. వారిలో ఒకడయిన హరిబాబు థాను సహచరుడే. అతను అప్పటిదాకా తీసిన ఫోటోలన్నీ అతని శవం పక్కన వున్న కెమెరాలో పదిలంగా వున్నాయి. వాటిని డెవలప్ చేశాకే పోలీసులకు ఈ కేసులో మొదటి క్లూలు దొరికాయి. వాటిని ఆధారం చేసుకొని ఒక్కొక్క విషయం బయటకు లాగగలిగారు.

ఈ కేసు గురించి పత్రికలు రాసిన వార్తల ద్వారా థాను కాక మరి రెండు పేర్లు బాగా ప్రచారంలోకి వచ్చాయి. వీరిద్దరూ హరిబాబు కెమెరాలో బంధించబడ్డారు. వీరి పేర్లు శివరాసన్, శుభ. రాజీవ్ గాంధీ హత్యకు వ్యూహకర్త శివరాసన్ అన్న అభిప్రాయం వెంటనే ప్రచారంలోకి వచ్చింది. అతనిని ఎట్లాగయినా పట్టుకోవాలనీ, అప్పుడే కేసు పరిష్కారమవుతుందనీ నేరపరిశోధన చేపట్టిన సిబిఐ వారి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) భావించింది. అయితే వాళ్లకు చేజిక్కే పరిస్థితి ఆసన్నమయిందనుకున్నప్పుడు శివరాసన్, శుభ ఆత్మహత్య చేసుకొని చనిపోయారు. వీరిద్దరే కాదు, మొత్తం 12 మంది ముద్దాయిలు సిబిఐ పోలీసుల చేతికి చిక్కడం కంటే చావడం మేలని భావించి ఆత్మహత్య చేసుకున్నారు. మన పోలీసుల 'నేరపరిశోధన' పద్ధతులకు ఇంతకంటే వేరే సర్టిఫికేట్ అక్కరలేదు.

ఆత్మహత్య చేసుకొని చనిపోయిన ఈ పన్నెండు మంది కంటే ముఖ్యులు మరి ముగ్గురున్నారని సిబిఐ భావించింది. వారు ఎల్‌టిటిఇ అగ్రనేతలు వి. ప్రభాకరన్, పొట్టు అమ్మన్, అఖిల. ఈ కేసులో వీరే ప్రధాన సూత్రధారులని సిబిఐ భావించింది. అయితే వీరు శ్రీలంకలో వున్నారో ఇంకెక్కడ వున్నారోగానీ మన పోలీసులకు మాత్రం దొరకలేదు.

ఆత్మహత్య చేసుకున్న 12 మంది, దొరకని ముగ్గురు కలిసి మొత్తం 15 మంది నేరవిచారణ తప్పించుకోగా 26 మంది సిబిఐకి దొరికారు. బోనులో నిలబడ్డారు. వీళ్లు సిబిఐ చార్జిషీటు ప్రకారమే ప్రధాన సూత్రధారులూ కారు, ప్రధాన పాత్రధారులూ కారు. రకరకాల రూపాలలో ఎల్‌టిటిఇకి సహరించినవారు, లేదా ఎల్‌టిటిఇ రూపొందించిన పథకంలో చిన్నా చితకా పాత్రలు పోషించినవారు.

కొంచెం చెప్పుకోదగ్గ పాత్ర పోషించిన 12 మంది ఆత్మహత్య చేసుకొని చనిపోయారు. థాను, హరిబాబు పేలుడులోనే చనిపోయారు. అంటే నేరస్తులలో 14 మంది కేసు విచారణ మొదలు కూడ కాకముందే చనిపోయారు. ప్రాణానికి ప్రాణమే సమాధానం అని నమ్మేవాళ్లకు సహితం దీనితో సంతృప్తి కలిగి వుండాలి. కానీ పోయిన 14 మంది పోగా మిగిలిన 26 మందికి కూడ మరణదండన విధిస్తే తప్ప పూర్తి న్యాయం జరగదని ఈ కేసును పరిశోధించిన సిబిఐ భావించింది.

సిబిఐ చాలా పెద్ద కేసు తయారు చేసింది. ఎల్‌టిటిఇ అగ్రనేత ప్రభాకరన్ ఆధ్వర్యంలో శివరాసన్‌ది ప్రధాన బాధ్యతగా భారతదేశంలో బీభత్సం సృష్టించడానికి

ఏడు బృందాలుగా ఎల్‌టిటిఇ కార్యకర్తలను భారతదేశానికి పంపడం జరిగిందని సిబిఐ అనింది. 1987 నుండి ఈ కుట్ర సాగుతూనే వుందని అనింది. దాని కోసం వాళ్లు మద్రాసులోనూ ఢిల్లీలోనూ ఇళ్లు తీసుకున్నారు. స్థానిక తమిళులతో స్నేహం చేసి వారి ఇళ్లలో కూడ స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు. ఒక యింట్లో వైర్‌లెస్ సెట్ ఏర్పాటు చేసి శ్రీలంకలోని ప్రభాకరన్ తదితర ఎల్‌టిటిఇ నాయకులతో సంప్రదింపులు కొనసాగించారు. వారు సృష్టించిన బీభత్సంలో భాగమే రాజీవ్ గాంధీ హత్య. ఒక దశ వరకు శ్రీలంకలో జరుగుతున్న తమిళ ఈలం పోరాటానికి అనుకూలంగా వున్న భారత ప్రభుత్వం 1987 జూలై 22 నాడు అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ చొరవతో శ్రీలంక ప్రభుత్వంతో ఆ దేశంలో శాంతి నెలకొల్పడానికి సహకరిస్తానని ఒప్పందం చేసుకొని అక్కడికి భారత సైన్యాన్ని పంపించి తమిళుల పైన అణచివేత ప్రయోగించిందన్న కోపంతో ఎల్‌టిటిఇ ఈ కుట్రకు పూనుకుందని సిబిఐ తన చార్జిషీటులో అనింది.

అందువల్ల కేసు టాడా చట్టం కింద పెట్టింది. చెన్నైలోని టాడా కోర్టులో కేసు విచారణ జరిగింది. కేసులో ప్రధాన సాక్ష్యం ముద్దాయిలు ఎస్‌పి ర్యాంకు పోలీసు అధికారికి ఇచ్చిన ఒప్పుకోలు. టాడా కింద రెండు నెలల పోలీసు రిమాండు పొందే అవకాశం వుంది కాబట్టి ముద్దాయిలందరినీ సిబిఐ అరవై రోజుల పాటు రిమాండులోకి తీసుకునింది. ఎవరెవరి నుండి ఒప్పుకోళ్లు కావాలనుకుంటే వాళ్లందరి దగ్గరా ఒప్పుకోళ్లు తీసుకుంది. ఇప్పుడు ఉరికంబం ఎక్కబోతున్న నలుగురితో సహా మొత్తం 11 మంది ఒప్పుకోలు వాంగ్మూలాలు ఇచ్చారు. వారిలో 13 మంది ఇంక కొన్ని రోజులలో రెండు నెలల రిమాండు గడచిపోతుందనగా ఒప్పుకోళ్లు ఇచ్చారు. అంటే 50 రోజులు పైగా పోలీస్ కస్టడీలో ఉన్న తరువాత ఇచ్చారు.

ఈ కేసులో ప్రధాన సాక్ష్యం ఈ 17 మంది ముద్దాయిలు ఇచ్చిన ఒప్పుకోలు వాంగ్మూలాలే. ఇవిగాక కొన్ని ఉత్తరాలూ పత్రాలూ అద్దెకు తీసుకున్న ఇళ్ల ఇరుగుపొరుగు ఇచ్చిన సాక్ష్యాలూ ఉన్నాయిగానీ ఈ వాంగ్మూలాలే లేకపోతే ఉరిశిక్ష కాదు కదా, ఏ శిక్ష వేయడానికి కావలసిన సాక్ష్యం ఈ కేసులో లేదు.

పోలీసు కస్టడీలో ఉన్న ముద్దాయి ఇచ్చే వాంగ్మూలాన్ని (మేజిస్ట్రేట్‌కు ఇస్తే తప్ప) చట్టం మామూలు కేసులలో సాక్ష్యంగా ఒప్పుకోదు. కానీ టాడా కేసులలో ఒప్పుకుంటుంది. టాడా చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం ఎస్‌పి ర్యాంకుకు తక్కువకాని

పోలీస్ అధికారికి ముద్దాయి ఇచ్చే ఒప్పుకోలు ఆ ముద్దాయికి వ్యతిరేకంగానే కాదు, సహ ముద్దాయిలకు వ్యతిరేకంగా కూడ చెల్లుబాటవుతుంది.

దీనిని ఆసరా చేసుకొని సిబిఐ చాలా భారీగా ఒప్పుకోలు సాక్ష్యాలు పెట్టి చెన్నైలోని టాడా ప్రత్యేక కోర్టులో నేరాన్ని రుజువు చేయగలిగింది. ముద్దాయిల ఒప్పుకోలు వాంగ్మూలాలను ఒకదాని పక్కన ఒకటి పెడితే పెద్ద కథే అవుతుంది. అన్ని ఘటనలూ ఒకదానితో ఒకటి అతికి ఒక సమగ్రమైన కుట్రను మనకు చూపిస్తాయి. ఎటొచ్చీ యాభై రోజులు పైగా పోలీసు లాకప్పులో ఉన్న వ్యక్తి పోలీసులకు ఇచ్చే వాంగ్మూలాన్ని ఎంత మేరకు నమ్మవచ్చుననేది ప్రశ్న. టాడా చట్టం సహితం అటువంటి వాంగ్మూలం సాక్ష్యంగా చెల్లుబాటు అవుతుందంటుందే తప్ప నిర్విచక్షణగా నమ్మమని చెప్పదు.

అయితే చెన్నైలోని టాడా ప్రత్యేక కోర్టు ఈ సాక్ష్యాన్ని పూర్తిగా నమ్మింది. 1987లో మొదలయిన కుట్ర రాజీవ్ గాంధీ హత్యతో ముగిసిందని నమ్మి, ఇంత భారీ కుట్రలో భాగమైనందుకు ముద్దాయిలు 26 మందికీ మరణదండన విధించింది. విదేశీ కుట్రదారులు భారత భూభాగం పైన బీభత్సానికీ రక్తపాతానికీ పాల్పడకుండా ఈ తీర్పు ఒక హెచ్చరికగా ఉంటుందన్న ఆశాభావాన్ని ఆ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి వ్యక్తం చేశారు. 'తగిన పరిహారం జరిగింది' అని నేరపరిశోధన నిర్వహించిన సిబిఐ ఉన్నతాధికారి కార్తికేయన్ వ్యాఖ్యానించాడు.

అక్కడి నుంచి కేసు సుప్రీంకోర్టుకు పోయింది. అక్కడ జస్టిస్ డి.పి. వాధ్వా, కె.టి. థామస్, మహమ్మద్ ఖాద్రిలతో కూడిన ముగ్గురు జడ్జిల బెంచి ఈ కేసును వినింది. ముగ్గురు న్యాయమూర్తులూ తమ అభిప్రాయాలు విడివిడిగా చెప్పినప్పటికీ జస్టిస్ వాధ్వా తీర్పే ప్రధానమైనది. చెన్నైలోని టాడా స్పెషల్ కోర్టు వేసిన శిక్షను 'జ్యుడీషియల్ మర్డర్' అని సుప్రీంకోర్టులో ఈ కేసును వాదించిన ముద్దాయిల న్యాయవాది నటరాజన్ అన్నాడు. జస్టిస్ వాధ్వా కూడ నిర్మొహమాటంగా అవుననే ఒప్పుకున్నారు. ఈ ఒక్క విషయంలోనే కాదు, మరికొన్ని ముఖ్యమైన విషయాలలో కూడ సుప్రీంకోర్టు చాలా నిర్మొహమాటంగా ముద్దాయిల వాదనను అంగీకరించింది.

## నేపథ్యాన్ని బాగా చెప్పారు కాని...

సుప్రీంకోర్టు తీర్పు చదివిన వారికెవరికైనా మొట్టమొదట తోచేది అందులో ఎల్‌టిటిఇ గురించి ఒక్క చెడ్డ మాట కూడ లేకపోవడం. కింది కోర్టు మాత్రం చాలా

ఘాటైన మాటలు వాడింది. ఎల్‌టిటిఇ పాల్పడిన కుట్ర భారత సార్వభౌమత్వానికే సవాలు అనింది. ఒక సార్వభౌమ దేశంగా భారత్ తీసుకున్న నిర్ణయానికి ప్రతీకారంగా అప్పటి దేశ అధినేతను చంపడం క్షమించరాని చర్య అనింది. ఆ నిర్ణయం మంచిదయినా చెడ్డదయినా ఒక విదేశీ టెర్రరిస్టు సంస్థ మన గడ్డ మీదనే దానికి ప్రతీకారం తీర్చుకోవడం దేశం మనుగడకే చేటు అనింది.

న్యాయస్థానాలు తీర్పులిచ్చేటప్పుడు ఈ రకమైన ఆవేశానికి లోనుకావడం అవాంఛనీయమైనప్పటికీ అది తరచు జరుగుతుంటుంది. సుప్రీంకోర్టు ఒక మేరకు అందుకు భిన్నంగా తర్కించింది. తీర్పు మొదటి భాగంలో ఘటన పూర్వరంగాన్ని చర్చించిన చోట ఒక గ్రామ కక్షలో చర్య – ప్రతిచర్యలను చర్చించినంత నిష్పాక్షికంగా చర్చించిందని చెప్పవచ్చు. ఇవతల ఉన్నదొక సార్వభౌమ దేశం, ఆవతల ఉన్నది ఒక విదేశీ టెర్రరిస్టు సంస్థ అన్న స్పృహ లేకుండా ఇరు పక్షాలనూ ఒకటి చేసి చర్చించారని సుప్రీంకోర్టు జడ్జిలపైన మన పాలకులకు కోపం వచ్చి వుండవచ్చును కూడ. అయితే తీర్పు చివరి భాగానికి పోయేటప్పటికి న్యాయమూర్తులు ఈ స్థిమితాన్ని కోల్పోయినట్టు అనిపిస్తుంది. కేసుకున్న రాజకీయ ప్రాముఖ్యం ప్రభావం అక్కడ స్పష్టంగా కనిపిస్తుంది.

కేసు పూర్వరంగాన్ని సుప్రీంకోర్టు చర్చించిన తీరు చూసిన వారెవ్వరయినా 'మరయితే మీరు వీళ్లకు శిక్ష ఎందుకు వేస్తున్నట్టు' అని ప్రశ్నించకుండా ఉండలేరు. రాజీవ్‌గాంధీ హత్య స్వయంకృతమైన రాజకీయ నిర్ణయాల పర్యవసానంగా కనిపిస్తుందే తప్ప హంతకుల దుర్మార్గం ఫలితమనిపించదు తీర్పులోని తొలి భాగాన్ని చదివితే. అయినప్పటికీ నేరస్తులకు కఠినమైన శిక్ష వేయగలిగారంటే నేరానికి గల పూర్వరంగం ఆ మేరకు నేరస్తుల బాధ్యతను తగ్గిస్తుందని న్యాయమూర్తులు గుర్తించలేకపోయారనైనా అనుకోవాలి, లేదా కేసుకు వున్న రాజకీయ ప్రాముఖ్యం దృష్ట్యా తమ విశ్లేషణను తామే చివరిదాకా తీసుకుపోలేకపోయారనైనా అనుకోవాలి.

> *శ్రీలంకలోని తమిళ ప్రాంతాలలో కొంతకాలంగా అశాంతి నెలకొని వుంది. ఆ దేశంలోని మెజారిటీ ప్రజలయిన సింహళ జాతీయులు తమపైన అణచివేతకు పాల్పడుతున్నారని శ్రీలంక తమిళుల అభియోగం. ఈ నేపథ్యంలో శ్రీలంకలోని తమిళుల హక్కుల్ని కాపాడడం కోసం పుట్టిన అనేక సంస్థలలో అగ్రభాగాన నిలబడ్డది ఎల్‌టిటిఇ. తానే తమిళ ప్రజల ఏకైక ప్రతినిధి అని ఎల్‌టిటిఇ అంటోంది. తమిళ ప్రాంతం స్వాతంత్ర్యం కోసం ఎల్‌టిటిఇ శ్రీలంక*

*ప్రభుత్వంపైన సాయుధ పోరాటం మొదలుపెట్టింది. ఈ కారణంగా అశాంతి చెలరేగి భారతదేశంలోకి శ్రీలంక నుండి తమిళ శరణార్థులు రావడం మొదలయింది. 1981 నాటికి సమస్య (బహుశా శరణార్థుల సమస్య అయి వుండాలి) చేయి దాటిపోయే పరిస్థితి ఏర్పడింది. శ్రీలంకలో సాయుధ పోరాటం నిర్వహిస్తున్న ఎల్‌టిటిఇకి భారతదేశంలో చాలా స్వేచ్ఛ లభించింది. సాయుధ శిక్షణ కోసం, గాయపడిన వారికి వైద్యం చేయించుకోవడం కోసం, మందులు తదితర అవసరాల సరఫరా కోసం, డబ్బు వసూలు కోసం, ప్రచురణలు చేపట్టడం కోసం, పెట్రోలు, వైర్‌లెస్ పరికరాలు, బాంబుల సరఫరా కోసం ఎల్‌టిటిఇ భారత గడ్డ మీద స్థావరం ఏర్పరచుకొని శ్రీలంక సైన్యంతో పోరాటం చేసింది.*

ఇవి మా మాటలు కావు. భారత సుప్రీంకోర్టు మాటలు. ఎక్కడా 'అట' అనిగానీ 'ఇది అభియోగం' అనిగానీ అనకుండా సుప్రీంకోర్టు నిర్వ్యామోహమాటంగా గుర్తించిన సత్యాలు. ఎల్‌టిటిఇ సాయుధ శిక్షణ భారతదేశంలోనే పొందిందని చెప్పిన చోట ఆ శిక్షణ భారత సైన్యమే ఇచ్చిందన్న ఒక్క మాట సుప్రీంకోర్టు అనలేదుగానీ అదొక్కటి తక్కువగా అన్నీ అనింది. అన్ని విషయాలు గుర్తించింది.

అంతా సజావుగా సాగుతున్న ఈ దశలో 1987 జూలై 29న అప్పటి భారత ప్రధాని రాజీవ్ గాంధీ చొరవతో భారత – శ్రీలంక ఒడంబడిక జరిగింది. 'మన పొరుగువారయిన శ్రీలంక సోదరులను చాలా ఏళ్లుగా బాధిస్తున్న సాయుధ పోరుకు అంతం పలకడానికి ఈ ఒడంబడిక ఉద్దేశించబడింది' అని రాజీవ్‌గాంధీ పార్లమెంటుకు చెప్పాడు. ఈ సాయుధ పోరు శ్రీలంకలో భద్రతకూ సమగ్రతకూ ఏకతకూ భంగకరంగా తయారయిందని అన్నాడు. ఈ ఒడంబడిక ప్రకారం శ్రీలంక ప్రభుత్వం ఉత్తరాన ఉన్న తమిళ ప్రాంతాలలో అమలులో వున్న ఎమర్జెన్సీ ఎత్తివేస్తుంది. ఎన్నికలు నిర్వహిస్తుంది. అధికార వికేంద్రీకరణలో భాగంగా స్థానిక కౌన్సిళ్లను నెలకొల్పుతుంది. తమిళ పోరాటకారులంతా తమ ఆయుధాలు అప్పగించేస్తారు. ఎమర్జన్సీ చట్టాలు, టెర్రరిస్టు చట్టాల కింద బందీలయి వున్న ఖైదీలందరినీ శ్రీలంక ప్రభుత్వం విడుదల చేస్తుంది అని చెప్పారు. ఇవన్నీ జరిగేటట్టు చూసే బాధ్యత భారత్‌ది. అందుకోసం భారత సైన్యాన్ని భారత శాంతి పరిరక్షణ బలగం (ఐపికెఎఫ్) అనే పేరిట శ్రీలంకకు పంపించారు.

భారత ప్రభుత్వం ఒత్తిడి మీద ప్రభాకరన్ (ఎల్‌టిటిఇ అధినేత) కూడ ఈ ఒప్పందంపైన సంతకం పెట్టాడు. తన పోరాటానికి అతను అప్పట్లో పూర్తిగా భారత దేశం మీద ఆధారపడి వున్నాడు కాబట్టి అతనికి సంతకం చేయక తప్పలేదు.

అయితే త్వరలోనే భారత – శ్రీలంక ఒప్పందం పట్ల ఎల్‌టిటిఇ వ్యతిరేకత పెంచుకుంది. దీనికి గల కారణాలను సుప్రీంకోర్టు సానుభూతితోనే వివరించింది. ముగ్గురు జడ్జిలలో ఒకరయిన జస్టిస్ థామస్ తాను విడిగా రాసిన తీర్పులో 'ఐపికెఎఫ్ శ్రీలంకలో తమిళులపైన అనేక అత్యాచారాలకు పాల్పడింది. ఎల్‌టిటిఇ కార్యకర్తల పట్ల అమానుషంగా ప్రవర్తించింది' అన్నారు. మిగిలిన ఇద్దరు జడ్జిలు (జస్టిస్ ఖాద్రి, జస్టిస్ వాధ్వా) రాసిన తీర్పులలో కూడ ఐపికెఎఫ్ చేసిన అత్యాచారాల గురించి 'అట' అనిగానీ 'ఇది అభియోగం' అనిగానీ ఎక్కడా అనకుండా శ్రీలంక తమిళులు, వివిధ హక్కుల సంఘాలు వెలిబుచ్చిన అభిప్రాయాలను తమ మాటలలో పునరుద్ఘాటించారు.

భారత – శ్రీలంక ఒడంబడిక పట్ల ఎల్‌టిటిఇ అసంతృప్తి చెందడానికి గల మరొక రెండు కారణాలను కూడ జస్టిస్ వాధ్వా సానుభూతి స్వరంతోనే ప్రస్తావించారు. భారత ఒత్తిడి వల్ల ఆ ఒప్పందం పైన సంతకం చేసిన కారణంగా ఎల్‌టిటిఇ స్వతంత్ర తమిళ ఈలం లక్ష్యాన్ని వదులుకోవలసి వచ్చింది. అది ఆ సంస్థకు మింగుడు పడలేదు. అంతేకాదు, శ్రీలంక ప్రభుత్వం తమిళ శరణార్థులతోనూ, ఎటిటిఇకి చెందిన ఖైదీలతోనూ ఈ ఒప్పందం స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరించినప్పుడు భారత ప్రభుత్వం ఏమనకపోవడం సహితం ఎల్‌టిటిఇకి ఆగ్రహం కలిగించిందని జస్టిస్ వాధ్వా అన్నారు.

అయినప్పటికీ ఎల్‌టిటిఇ నేత ప్రభాకరన్ భారతదేశం మీదగానీ భారత ప్రజల మీదగానీ ద్వేషం పెంచుకోలేదని ఈ పరిస్థితులకు కర్త అయిన రాజీవ్ గాంధీ మీద మాత్రమే పెంచుకున్నారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఎల్‌టిటిఇ భారతదేశ సమగ్రతనుగానీ సార్వభౌమత్వాన్నిగానీ ప్రశ్నించినట్టు వారి ప్రచురణలలో ఎక్కడా కనిపించదని అనింది. ఆ ప్రచురణలనూ, ప్రభాకరన్ మాటలనూ ఈ అభిప్రాయానికి వత్తాసుగా ఉటంకించింది. 1989లో మన దేశ ప్రధానమంత్రిగా అధికారానికి వచ్చిన వి.పి.సింగ్ ఐపికెఎఫ్‌ను వెనక్కు పిలిపించడాన్ని రాజీవ్ గాంధీ తీవ్రంగా విమర్శించి, కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తే భారత – శ్రీలంక ఒడంబడికను మళ్లీ అమలు చేస్తుందని ప్రకటించాడు. 1991లో జరిగిన మధ్యంతర పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ గెలిచే అవకాశాలు కనిపించడంతో రాజీవ్ గాంధీ తిరిగి ప్రధానమంత్రి

కాకుండా ఉండాలంటే అతనిని చంపాలని ఎల్‌టిటిఇ నిర్ణయించుకున్నట్టు సుప్రీంకోర్టు నిర్ధారించింది. అంటే భారతదేశ సమగ్రతనూ సార్వభౌమత్వాన్నీ భగ్నం చేసే ఉద్దేశంగానీ భారత ప్రజలను భయభ్రాంతులు చేసే ఉద్దేశంగానీ ఎల్‌టిటిఇకి లేవు. రాజీవ్ గాంధీని చంపే లక్ష్యం మాత్రమే ఉండింది.

రాజీవ్ గాంధీ తీసుకున్న నిర్ణయం దేశ ప్రధానమంత్రిగా తీసుకున్నది కాబట్టి దానికి ప్రతీకారంగా అతనిని చంపడం ఒక సార్వభౌమ దేశానికి తప్పనిసరిగా ఉండవలసిన నిర్ణయాధికారానికి సవాలు కాదా, అంటే మన దేశ సార్వభౌమత్వాన్ని భగ్నం చేసే చర్య కాదా అని సొలిసిటర్ జనరల్ శ్రీ అల్తాఫ్ అహ్మద్ లేవదీసిన ప్రశ్నకు జవాబుగా అధికారంలో ఉన్న ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను ప్రతిపక్షాలు ప్రశ్నించడం లేదా, అది దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నించడం కిందికి వస్తుందా అని సుప్రీంకోర్టు అనింది. ఈ మాట సుప్రీంకోర్టు జడ్జిలు అన్నారు కాబట్టి సరిపోయింది. వేరే ఎవరయినా దేశంలోని ప్రతిపక్షాల విమర్శను ఎల్‌టిటిఇ హత్యాకాండతో సమానం చేసి మాట్లాడి ఉంటే దేశభక్తులంతా వారి పైన ఎంతగా విరుచుకుపడి ఉందురో !

## టెర్రరిజమూ కాదు, విచ్ఛిన్నమూ కాదు

ఈ విశ్లేషణ పర్యవసానమేమిటంటే శ్రీపెరుంబుదూర్ హత్య టెర్రరిస్టు చర్య కాదు, విచ్ఛిన్నకర చర్య కాదు. అంటే టాడా కిందికి రాదు. ఒక చర్య టాడా ప్రకారం టెర్రరిస్టు చర్య కావాలంటే దానికి పాల్పడిన వారికి భారత ప్రభుత్వాన్ని ఆయుధాల ప్రయోగంతో లొంగదీసుకునే ఉద్దేశమైనా ఉండాలి, లేదా ప్రజలను భీతావహుల్ని చేసే ఉద్దేశమైనా ఉండాలి. శ్రీపెరుంబుదూర్ హత్యాకాండలో ఇవి రెండూ లేవని సుప్రీంకోర్టు నిర్ధారించిన విషయం చూశాం. అది కేవలం ఒక వ్యక్తిని చంపడాన్ని లక్ష్యంగా పెట్టుకున్న చర్య. అది గతంలో వారికి అతను చేసిన అన్యాయానికి ప్రతీకారం కావచ్చు, లేదా తిరిగి ప్రధానమంత్రిగా ఎన్నికయి అదే పని మళ్లీ చేయకుండా నిలపాలన్న ఆరాటం కావచ్చు. ఏదయినా టాడాలోని నిర్వచనం ప్రకారం అందులో టెర్రరిజం లేదు.

రాజీవ్ గాంధీని తామే చంపినట్టు ఎల్‌టిటిఇ ఎక్కడా చెప్పుకోకపోవడాన్ని కూడ సుప్రీంకోర్టు ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ , ప్రచారం టెర్రరిజంలో ఒక ముఖ్య అంశమనీ చంపిన తరువాత ఆ విషయాన్ని చెప్పుకోవడం లేదంటే ఆ వ్యక్తిని చంపడం మాత్రమే వారి లక్ష్యం తప్ప తద్వారా సమాజంలో భయాన్నీ, భీతినీ పెంచే లక్ష్యం

వారికి లేదని అర్థమవుతుందని అనింది. ఆ రకంగా చూసినా అది మామూలు హత్యే తప్ప టెర్రరిస్టు చర్య కాదు. హత్య జరిగిన తరువాతి దినం శ్రీలంక నుండి ఎల్‌టిటిఇ పెద్ద లీడర్లలో ఒకరయిన పొట్టు అమ్మన్ శివరాసన్‌కు పంపించిన వైర్‌లెస్ సందేశంలో మనవాళ్లకు సహితం ఈ పని చేసింది మనమేనని చెప్పడం లేదు అన్నాడని చెప్తూ, భారతదేశంతోనూ భారత ప్రజలతోనూ స్నేహ సంబంధాలు కావాలనే ఎల్‌టిటిఇ కోరుకుందనీ, అందువల్ల గుట్టు చప్పుడు కాకుండా రాజీవ్ గాంధీని చంపాలని నిర్ణయించుకుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అటువంటి హత్య టెర్రర్ పుట్టిస్తే పుట్టించవచ్చు, కానీ అది ఈ దేశంలో టెర్రర్ పుట్టించే ఉద్దేశ్యంతో చేసిన హత్య కాదు. ఈ దేశాన్నీ ఈ దేశస్తులనూ శత్రువుల్ని చేసుకోకుండా ఒక్క రాజీవ్ గాంధీని మాత్రమే తొలగించే లక్ష్యంతో చేసిన హత్య. ఒక నేరం టాడా కిందికి వస్తుందా రాదా అనేదానికి ప్రమాణం దానివల్ల కలిగే పర్యవసానం కాదు, ఆ నేరం చేయడంలో గల ఉద్దేశ్యం. ఉద్దేశ్యంలో ప్రజలను టెర్రరైజ్ చేయాలన్నది (ప్రభుత్వాన్ని లొంగదీసు కోవాలన్నది) లేనప్పుడు అది టాడా చట్టం ప్రకారం టెర్రరిస్టు చర్య కాదు. అంటే టాడాలోని సెక్షన్ 3 కిందికి రాదు.

అది 'విచ్ఛిన్నకర చర్య' కూడ కాదు. అంటే టాడా చట్టంలోని సెక్షన్ 4 కిందికి కూడ రాదు. ఒక చర్య విచ్ఛిన్నకర చర్య కావాలంటే అది భారతదేశ సమగ్రతనూ సార్వభౌమత్వాన్నీ ప్రశ్నించే చర్య అయివుండాలి. ఎల్‌టిటిఇకి అటువంటి లక్ష్యమేమీ లేకపోగా భారతదేశంతో స్నేహసంబంధాలనే కోరుకుందన్న సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని ఇప్పటికే చూశాం. కాబట్టి రాజీవ్ గాంధీ హత్య టాడా సెక్షన్ 4 కిందికి కూడ రాదు.

అయితే దేశ సమగ్రతనూ సార్వభౌమత్వాన్నీ ప్రశ్నించే ఉద్దేశ్యం లేకపోయినా, విద్యుక్త ధర్మంగా దేశ సమగ్రతనూ సార్వభౌమత్వాన్నీ కాపాడే బాధ్యత గల వ్యక్తులను లేక ప్రభుత్వ ఉద్యోగులను చంపితే అది విచ్ఛిన్నకర చర్య అవుతుందని సెక్షన్ 4(3) అంటుంది. దానికిందికైనా రాదా? అని సొలిసిటర్ జనరల్ అల్తాఫ్ అహ్మద్ ఆందోళనగా ప్రశ్నించారు. ఎందుకంటే ప్రధానమంత్రిగా ఉండిన రాజీవ్ గాంధీ అటువంటి విద్యుక్త ధర్మం గలవాడు. అంతేకాక శ్రీపెరుంబుదూర్ పేలుడులో రాజీవ్ గాంధీతో బాటు 9 మంది పోలీస్ అధికారులు చనిపోయారు. వీరంతా ప్రభుత్వ ఉద్యోగులు. కాబట్టి సెక్షన్ 4(3) కింద ఈ హత్యాకాండ 'విచ్ఛిన్నకర చర్య' అవుతుందని ఆయన వాదించారు.

ఈ వాదనను కూడ సుప్రీంకోర్టు ఒప్పుకోలేదు. రాజీవ్ గాంధీ ఒకప్పుడు ప్రధానమంత్రి అయి ఉండవచ్చునుగానీ చనిపోయినప్పుడు కాదు. అప్పుడు కనీసం పార్లమెంటు సభ్యుడు కూడ కాదు. ఎందుకంటే పార్లమెంటు రద్దయిపోయి ఎన్నికలు జరుగుతున్నాయి. ఇక అతనితో బాటు చనిపోయిన పోలీస్ అధికారుల మాటకొస్తే వారిని చంపాలన్న ఉద్దేశం హంతకులకు వుండి వుంటే అది సెక్షన్ 4 (3) కిందకి వచ్చేదేగానీ హంతకులు ఉద్దేశించింది రాజీవ్ గాంధీని చంపాలని మాత్రమే. అతని సమీపంలో ఉన్న కారణంగా వీరు చనిపోయారు.

కాబట్టి ఏ రకంగా చూసినా రాజీవ్ గాంధీ హత్య టాడా కిందికి రాదని సుప్రీంకోర్టు తీర్మానించింది. ఇందులో ప్రధానంగా ప్రశంసించవలసిన విషయం ఏమిటంటే ఈ దేశ ప్రధానమంత్రిగా ఉండిన వ్యక్తి ఆ హోదాలో తీసుకున్న నిర్ణయానికి కక్ష గట్టి ఒక విదేశీ సంస్థ అతను తిరిగి ఎన్నిక కాకుండా ఉండడం కోసం అతనిని ఈ దేశంలోనే హతమార్చిన కేసులో కూడ న్యాయనిర్ణయానికి హానికరమైన ఆవేశానికి, ఆగ్రహానికి లోనుకాకుండా స్థిమితంగా తర్కించగలగడం. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఒక మంచి సంప్రదాయాన్ని నిలబెట్టిందనే చెప్పాలి. ఎటొచ్చీ దానిని చివరి దాకా నిలుపుకోలేక పోయింది.

రాజీవ్ గాంధీని హత్య చేయడం మాత్రమే కాకుండ భారతదేశంలో టెర్రర్ సృష్టించే కార్యకలాపాలకు పాల్పడడం కూడ ఎల్‌టిటిఇ లక్ష్యమన్నది సిబిఐ అభియోగమని పైన చూశాం. ఈ లక్ష్య సాధనకు కుట్ర 1987 నుండి జరుగుతున్నదని సిబిఐ రుజువు చేయబూనుకుంది. అయితే అటువంటి ఆధారాలేవీ ప్రాసిక్యూషన్ చూపించలేకపోయిందనీ ఎల్‌టిటిఇకి అటువంటి ఉద్దేశ్యం లేదని నమ్మడానికే ఎక్కువ ఆధారాలున్నాయనీ సుప్రీంకోర్టు అనింది. రాజీవ్ గాంధీ హత్య, అందుకోసం జరిగిన కుట్ర అనే రెండు నేరాలు మాత్రమే ఈ కేసులో ఉన్నాయనింది.

ఆ కుట్రలో ఎవరు భాగస్వాములన్న విషయంలో కూడ సుప్రీంకోర్టు చెన్నై టాడా స్పెషల్ కోర్టుతో విభేదించింది. 26 మంది ముద్దాయిలూ అందులో భాగస్వాములేనని నిర్ధారించి అందరికీ మరణదండన విధించింది టాడా స్పెషల్ కోర్టు. సుప్రీంకోర్టు ఒక్కొక్కరి పాత్రనూ విడివిడిగా చర్చించి అందులో 19 మందిని 'కుట్ర' అభియోగం నుండి విముక్తం చేసింది. మిగిలిన ఏడుగురిలో ముగ్గురి మరణదండనను జీవిత ఖైదుగా మార్చింది. నలుగురికి మాత్రం మరణదండన ఖరారు

చేసింది. ఆ నలుగురిలో ఒకరైన నళిని విషయంలో జడ్జిలలో ఒకరు (జస్టిస్ థామస్) మిగిలిన ఇద్దరితో విభేదించారు. ఆమెకు కూడ జీవిత ఖైదు చాలన్నాడు. కానీ మిగిలిన ఇద్దరూ ఒప్పుకోలేదు కాబట్టి ఆమెకు కూడ మరణదండన ఖరారయింది.

రాజీవ్ గాంధీ హత్యకై జరిగిన కుట్రలో ఎవరు ఏ మేరకు భాగస్వాములనే విషయాన్ని చర్చించే క్రమంలో సుప్రీంకోర్టు భారత శిక్షాస్మృతిలో కుట్ర అనే నేరానికి ఉండే అర్థాన్నీ దానిని రుజువు చేసే పద్ధతినీ వివరంగా చర్చించింది. ఆ చర్చనిక్కడ వివరించడం అనవసరంగానీ రాజకీయ మిలిటెన్సీ పైన పెట్టే కేసులలో ముద్దాయిలకు అది ఉపయోగపడగలదని చెప్పడం అవసరంగా భావిస్తున్నా. ఈ విషయంలో సుప్రీంకోర్టు కొత్తగా చేసిన సూత్రీకరణ ఏదీ లేకున్నా ఒకే చోట ఇంత వివరమైన చర్చ ఉండడం ఉపయోగపడుతుంది. సాధారణంగా ఇటువంటి కేసులలో రాజకీయ భావసారూప్యత, నిర్మాణంలో భాగస్వామ్యం, నేరం కోసం జరిగిన కుట్రలో పాత్ర కలిగి ఉండడం అనే భిన్న విషయాల మధ్య తేడా చెరిగిపోతుంటుంది. ఈ తేడాను చెరిపేసి చాలా మందిని కేసులో ఇరికించాలని పోలీసులు చూస్తారు. న్యాయస్థానాలు ఈ తేడాను లెక్కలోకి తీసుకోక పోయినట్టయితే చాలా అన్యాయం జరిగే ప్రమాదం వుంటుంది. ఆ జాగ్రత్త నేర్పించడానికి రాజీవ్ గాంధీ కేసులో సుప్రీంకోర్టు కుట్ర గురించి చేసిన న్యాయ సిద్ధాంత విశ్లేషణ ఉపయోగపడుతుంది.

## ఒప్పుకోళ్ల స్వీకారంలో తప్పటడుగు

ఇక్కడిదాకా చాలా జాగ్రత్తగా వ్యవహరించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఆ తరువాత అంతే అజాగ్రత్తగా న్యాయసిద్ధాంత సంబంధమైన మెళకువలన్నిటినీ గాలికి వదిలివేయడం ఆశ్చర్యం కలిగించే విషయం. టెర్రరిస్టు చర్య, విచ్ఛిన్నకర చర్య, కుట్ర మొదలయిన న్యాయసిద్ధాంత భావనలను ఈ కేసు సాక్ష్యాలకు ఆచితూచి అన్వయించారుగానీ ఒప్పుకోలు (కన్ఫెషన్) వాంగ్మూలాలను ఏ విధంగా వ్యాఖ్యానించాలన్న విషయంలో కొన్ని దశాబ్దాలుగా సుప్రీంకోర్టు సూచించిన జాగ్రత్తలన్నిటినీ విస్మరించి 'ఒప్పుకున్నావంటే నువ్వు చేశావన్న మాటేనని' ఒప్పుకోలు వాంగ్మూలాలన్నిటినీ పరమసత్యాలుగా స్వీకరించేశారు.

ఈ కేసులో 17 మంది ముద్దాయిలు ఎస్‌పి ర్యాంకు పోలీసు అధికారికి ఒప్పుకోలు ఇచ్చారు. తాము నేరం చేసినట్టు ఒప్పేసుకుంటూ తమ సహ ముద్దాయిల

పాత్ర గురించి కూడ చెప్పారు. మొదట్లో చెప్పినట్టు ఈ కేసులోని ప్రధాన సాక్ష్యం ఇదే.

మామూలు కేసులలోనయితే ముద్దాయి పోలీసులకు ఇచ్చే ఒప్పుకోలు సాక్ష్యంగా చెల్లుబాటు కాదు. టాడా కేసులో సెక్షన్ 15 ప్రకారం చెల్లుబాటు అవుతుంది. రాజీవ్ గాంధీ హత్య కేసు టాడా చట్టం కింద పెట్టిన కేసు కాబట్టి సిబిఐ ముద్దాయిల వాంగ్మూలాల్ని తానే రికార్డు చేసింది. కేసును విచారించిన టాడా స్పెషల్ కోర్టు ఆ నేరం టెర్రరిస్టు నేరమేనని నమ్మింది కాబట్టి టాడా చట్టంలోని సెక్షన్ 15 కింద ఆ వాంగ్మూలాలను సాక్ష్యంగా స్వీకరించింది. ఒప్పుకోలు ఇచ్చిన ముద్దాయిల పైననే కాక ఆ వాంగ్మూలంలో ప్రస్తావించిన ఇతర సహ ముద్దాయిల పైన కూడ అది సాక్ష్యంగా చెల్లుబాటవుతుందని సెక్షన్ 15 అంటుంది కాబట్టి ఒకరి ఒప్పుకోలును మరొకరి పైన సాక్ష్యంగా కూడ స్పెషల్ కోర్టు స్వీకరించింది. ఆ విధంగా 17 మంది ముద్దాయిలు ఇచ్చిన ఒప్పుకోలు వాంగ్మూలాలను ఆధారం చేసుకొని 26 మందికి ఉరిశిక్ష విధించేసింది.

కానీ ఈ నేరం టాడా కిందికే రాదని భావించిన సుప్రీంకోర్టు ఆ ఒప్పుకోళ్లను ఎట్లా లెక్కలోకి తీసుకోగలుగుతుంది? రాజీవ్ గాంధీ హత్య టెర్రరిస్టు నేరం కాదనీ మామూలు నేరమేననీ గుర్తించిన తరువాత మామూలు నేరాలకు వర్తించే న్యాయసూత్రం ప్రకారం పోలీసులకు ఇచ్చిన ఒప్పుకోలు వాంగ్మూలాలను సాక్ష్యం నుండి తొలగించి మిగిలిన సాక్ష్యం ఆధారంగా ఏదైనా నిర్ణయానికి రావలసి వుంటుంది. మిగిలిన సాక్ష్యం దాదాపు మృగ్యం కాబట్టి మరణదండన సంగతి దేవుడెరుగు, ఏ దండనా వేయడానికి కావలసిన ఆధారాలు లేవని గుర్తించి ముద్దాయిలందరినీ విడిచి పెట్టవలసి వుంటుంది.

కానీ సుప్రీంకోర్టు చాలా ఆశ్చర్యకరంగా, ఇది టెర్రరిస్టు నేరం కాదని ఒక వైపు అంటూనే టాడా చట్టంలోని సెక్షన్ 15 కింద నమోదు చేసిన ఒప్పుకోలు వాంగ్మూలాలను సాక్ష్యంగా పరిగణించింది. అట్లా చేయడానికి వీలు లేదని, ఒకసారి ఆ నేరం టాడా కిందికి రాదని గుర్తించిన తరువాత సెక్షన్ 15 ఇచ్చే అవకాశం ప్రాసిక్యూషన్‌కు ఇక ఉండదని సుప్రీంకోర్టు గతంలో బిలాల్ అహ్మద్ కాలూ వర్సస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో (1997) ఇచ్చిన తీర్పు 'తప్పు' అని ఈ ముగ్గురు జడ్జిలు ఇప్పుడు ప్రకటించారు.

దీనికి ఆధారం టాడాలోని సెక్షన్ 12లో వుందని వారు అన్నారు. సెక్షన్ 12 సారాంశాన్ని మామూలు భాషలో చెప్పాలంటే, ఒక టాడా కేసులో అభియోగ పత్రం పెట్టేటప్పుడు ముద్దాయి పైన టాడా చట్టం కింద అభియోగాలతో పాటు ఇతర సాధారణ చట్టాల కింద అభియోగాలు కూడ (టాడా నేరంతో సంబంధం ఉన్నవి) ప్రాసిక్యూషన్ పెట్టవచ్చు. టాడా ప్రత్యేక కోర్టు అన్నిటినీ కలిపి విచారించి వాటికి కూడ శిక్ష వేయవచ్చు. ఉదాహరణకు ఈ కేసులో రాజీవ్ గాంధీని చంపారన్న అభియోగంతో పాటు దొంగ పాస్‌పోర్ట్‌లు కలిగి ఉన్నారన్న అభియోగం కూడ ముద్దాయిల పైన వుంది. రాజీవ్ గాంధీ హత్య టాడా కిందికొచ్చే నేరమేననుకున్నా దొంగ పాస్‌పోర్ట్‌లు కలిగి వుండటం టాడా కిందికి రాదు. అది పాస్‌పోర్ట్ చట్టం కింద నేరం. అయినప్పటికీ టాడా కోర్టే రెండింటినీ కలిపి విచారించవచ్చునని సెక్షన్ 12 అంటోంది. అప్పుడు టాడా కింద ఇచ్చిన ఒప్పుకోలును ఆధారం చేసుకొని పాస్‌పోర్టు చట్టం కింద కూడ శిక్ష వేయవచ్చును. అదే విధంగా, టాడా కింద ఒక కేసు విచారించే క్రమంలో ముద్దాయి వేరే నేరాలు చేసిన సంగతి కూడ ప్రత్యేక కోర్టు దృష్టికి వస్తే ఆ కోర్టు వాటి మీద కూడ తానే అభియోగం మోపి విచారించవచ్చు. అప్పుడు కూడ టాడా కింద నమోదయిన ఒప్పుకోలు వాంగ్మూలాలు ఈ నేరాలకు సాక్ష్యంగా పని చేస్తాయి.

టాడా కింద కేసంటూ ఉంటే, దానితో కలగలిసి వున్న వేరే నేరాన్ని టాడా కోర్టు టాడా కేసుతో పాటు అదే పద్ధతిలో విచారించవచ్చుననడంలో కొంత అర్థమేమైనా ఉందేమో (సెక్షన్ 12 భావం అదే) కానీ టాడా కింద నేరమేదీ జరగలేదనీ, జరిగిన నేరం సాధారణ నేరస్మృతి కిందనేననీ నిర్ధారించిన తరువాత ఇంక సెక్షన్ 12 ఏ విధంగా వర్తిస్తుంది? వర్తించేటట్టయితే, అసలు ఏ టెర్రరిస్టు స్వభావం లేని నేరాన్ని పోలీసులు కావాలని టాడా కింద బుక్ చేయవచ్చు. దానితో పాటు ఇతర సంబంధిత సెక్షన్లు కూడ పెట్టవచ్చు. ముద్దాయి నుండి తామే ఒప్పుకోలు వాంగ్మూలం తీసుకొని దానిని సాక్ష్యంగా ప్రవేశ పెట్టవచ్చు. అంతా అయిపోయిన తరువాత టాడా స్పెషల్ కోర్టు కేసులో టెర్రరిస్టు నేరమేదీ లేదని చెప్పి ఒప్పుకోలు వాంగ్మూలం ఆధారంగా ఇతర నేరాలకు శిక్ష వేసేయవచ్చు. అంటే సాధారణ నేరాల విచారణలో సాక్ష్యంగా చెల్లుబాటు కాని పోలీసులకిచ్చిన ఒప్పుకోలును ఈ రూపంలో సాక్ష్యంగా చెల్లుబాటు చేసేసుకోవచ్చు. దొడ్డిదారిన ఈ పని చేయడం ఈ తీర్పు ప్రకారం చట్టబద్ధం అయిపోతుంది. కానీ 'ప్రత్యక్షంగా' చేయరాని పని పరోక్షంగా చేయడానికి వీలులేదు అనేది ఒక ప్రాథమిక న్యాయసూత్రం.

సెక్షన్ 12 కు సుప్రీంకోర్టు ఇచ్చిన చాలా సందేహాస్పదమైన వ్యాఖ్యానాన్ని రేపెప్పుడైనా ఇదే కోర్టు వెనక్కి తీసుకోవచ్చు. కానీ అప్పటికి మరణదండన విధించబడ్డ ఈ నలుగురూ వుండరు. అందువల్ల ముద్దాయిల తరఫున ఈ తీర్పుపైన రివ్యూ పిటిషన్ వేసి ఈ వ్యాఖ్యానాన్ని పునః పరిశీలించమని కోరవలసి వుండింది. రివ్యూ పిటిషన్ వేయడమయితే జరిగిందిగానీ అందులో సెక్షన్ 12కు ఇచ్చిన వ్యాఖ్యానాన్ని పునః పరిశీలించమన్న అభ్యర్థన లేదు. కేవలం మరణదండనను పునః పరిశీలించమన్న అభ్యర్థన వుంది. అందువల్ల ప్రస్తుతానికి ఈ వ్యాఖ్యానమే చట్టం.

పోలీసులకిచ్చిన ఒప్పుకోలు వాంగ్మూలాలను చెల్లుబాటు చేయడం కోసం బిలాల్ అహ్మద్ కాలూ కేసు తీర్పును తిరగదోడినట్టే, ఒకరి ఒప్పుకోలు నుండి వేరొకరి నేరాన్ని సహితం రుజువు చేయడం కోసం 'కల్పనాథ్ రాయ్' కేసు తీర్పును కూడ సుప్రీంకోర్టు తిరగదోడింది. సాధారణ నేరాలలో ముద్దాయి పోలీసులకు ఇచ్చిన ఒప్పుకోలు సాక్ష్యంగా చెల్లుబాటు కాదని చూశాము. పోలీసు కస్టడీలో ఉండగా ఇతరులకు ఇచ్చిన ఒప్పుకోలు కూడ చెల్లుబాటు కాదు. కానీ ఆ ఒప్పుకోలు మేజిస్ట్రేటుకు ఇస్తే మాత్రం అది సాక్ష్యంగా చెల్లుబాటు అవుతుంది. అయితే అందులో ముద్దాయి తన నేరం గురించి తాను చెప్పుకునేది మాత్రమే చెల్లుబాటు అవుతుంది. నేరం చేయనివారు చేసినట్టు స్వచ్ఛందంగా ఒప్పుకోరు కాబట్టి స్వచ్ఛందంగా ఒప్పుకోవడం అంటూ జరిగితే ఆ ఒప్పుకోలును సాక్ష్యంగా స్వీకరించవచ్చునని చట్టం భావిస్తుంది. కానీ తనతో పాటు తోటి ముద్దాయిలను కూడా ఇరికిస్తే, వారిని ఇరికించే విషయాలు చట్టం కళ్లలో సాక్ష్యం కావని భారత సాక్ష్యాల చట్టంలోని సెక్షన్ 30 అంటుంది. ఇతర సాక్ష్యమేదైనా ఉన్నట్టయితే దానికి బలం చేకూర్చే విషయంగా దీనిని పరిగణనలోకి తీసుకోవచ్చునుగానీ దానంతటది సాక్ష్యం కాదు. ఉదాహరణకు ఒక హత్య కేసులో మొదటి ముద్దాయి మేజిస్ట్రేటుకు ఒప్పుకోలు ఇస్తూ 'హతుడిని నేనే పొడిచాను. నాకు కత్తి రెండవ ముద్దాయి అందిచ్చాడు' అని చెప్తే ఇందులో మొదటిది మాత్రమే సాక్ష్యంగా గుర్తించబడుతుంది. రెండవది కాదు. ఆ రెండవ ముద్దాయి కత్తిని నిజంగానే అందిచ్చాడని రుజువు చేసే వేరే ఆధారమేదైనా వుంటే దానికి బలం చేకూర్చే విషయంగా మొదటి ముద్దాయి ఒప్పుకోలులోని రెండవ వాక్యాన్ని కోర్టు లెక్కలోకి తీసుకోవచ్చు.

టాడా విషయం వేరే. మేజిస్ట్రేటుకు ఇచ్చిన ఒప్పుకోలే కాక పోలీసులకు (ఎస్.పి ర్యాంకు అధికారికి) ఇచ్చిన ఒప్పుకోలు సహితం సాక్ష్యంగా చెల్లుబాటు కావడమే

కాదు, ఆ ఒప్పుకోలు ఇచ్చిన ముద్దాయికి, అతని సహ ముద్దాయిలకు వ్యతిరేకంగా కూడ అది సాక్ష్యంగా చెల్లుబాటవుతుందని సెక్షన్ 15 అంటుంది. అంటే టాడా కేసు ముద్దాయి 'ఆ హత్య నేను చేశాను. నాతో బాటు ఫలాన వ్యక్తి కూడ చేశాడు' అని తన సహ ముద్దాయిని ఇరికిస్తూ ఒప్పుకోలు ఇస్తే అది అతనికి వ్యతిరేకంగానే కాక ఆ సహముద్దాయికి వ్యతిరేకంగా కూడ సాక్ష్యంగా చెల్లుబాటవుతుంది.

సాధారణ దృక్పథానికి కూడ ఇది అన్యాయంగా తోస్తుంది. దీనిని వ్యాఖ్యానించే అవకాశం సుప్రీంకోర్టుకు కల్పనాథ్ రాయ్ కేసులో వచ్చింది. కల్పనాథ్ రాయ్ ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు. ఇప్పుడే పార్టీలో ఉన్నాడోగానీ ఒకప్పుడు కాంగ్రెస్‌లో ఉండేవాడు. బందిపోట్లకు ఆశ్రయం ఇచ్చినందుకో ఏమోగానీ అతనిపైన టాడా కేసు పెట్టారు. ఇతర ముద్దాయిలు సెక్షన్ 15 కింద పోలీసు అధికారికి ఇచ్చిన ఒప్పుకోలులో చెప్పిన విషయాలు కల్పనాథ్ రాయ్‌కి వ్యతిరేకంగా సాక్ష్యంగా చెల్లుబాటవుతాయా అన్న ప్రశ్న సుప్రీంకోర్టు ముందుకు వచ్చింది. సెక్షన్ 15 చెల్లుబాటవుతాయనే అంటుంది కానీ సుప్రీంకోర్టు సెక్షన్ 15ను చాలా కుదించి వ్యాఖ్యానించింది. ముద్దాయి ఇచ్చిన ఒప్పుకోలు అతనికి వ్యతిరేకంగా చెల్లుబాటవుతుంది కానీ సహముద్దాయి విషయానికొచ్చేసరికి సాక్ష్యాల చట్టంలోని సెక్షన్ 30 కీ, టాడాలోని సెక్షన్ 15 కూ తేడా ఏమీ లేదని అనింది. అంటే సహముద్దాయికి సంబంధించినంత వరకు ఆ ఒప్పుకోలు సాక్ష్యం కాదు. ఇతర సాక్ష్యమేమైనా వుంటే దానికి బలం చేకూర్చగలుగుతుందేమోగానీ అంతకంటే దానికి విలువ లేదు.

ఆ తీర్పు కల్పనాథ్ రాయ్‌ని కాపాడిందేమోగానీ ఇప్పుడు రాజీవ్ గాంధీ హత్య కేసులో ప్రాసిక్యూషన్ అభియోగాన్ని రుజువు చేయడానికి అది అడ్డం వచ్చింది. ముద్దాయిలు ఇచ్చిన ఒప్పుకోలు వాంగ్మూలాలలో వారికి వ్యతిరేకంగా ఉన్న విషయాలను మాత్రమే సాక్ష్యంగా పరిగణించి తక్కిన వారిపైన చెప్పినవి పక్కన పెట్టేట్టయితే కేసు రుజువు కావడం కష్టం. అయితే ముగ్గురు జడ్జిలలో ఇద్దరు (జస్టిస్ వాధ్వా, జస్టిస్ ఖాద్రి) కల్పనాథ్ రాయ్ కేసు తీర్పును తిరగదోడడానికి సిద్ధపడ్డారు. సెక్షన్ 15 లో ఏం చెప్పి వుందో అదే దాని అర్థంగానీ, దానిని కుదించి వ్యాఖ్యానించడం తప్పని అన్నారు. మూడవ జడ్జి అయిన జస్టిస్ థామస్ కల్పనాథ్ రాయ్ కేసు తీర్పు ఇచ్చిన ఇద్దరు జడ్జిలలో ఒకరు కాబట్టి దానిని తిరగదోడడానికి ఆయన సిద్ధపడలేదు. అయినప్పటికీ మెజారిటీ సిద్ధపడ్డారు కాబట్టి ఆ సవరణ జరిగిపోయింది.

ఒక్క వాక్యంలో చెప్పాలంటే రెండు పాత తీర్పులను (బిలాల్ అహ్మద్ కాలూ కేసు, కల్పనాథ్ రాయ్ కేసు తీర్పులను) సుప్రీంకోర్టు తిరగదోడి అవి చేసిన సూత్రీకరణలను తిరస్కరించి ఈ కేసులో 17 మంది ముద్దాయిలు పోలీసులకిచ్చిన ఒప్పుకోలు వాంగ్మూలాలను సంపూర్ణంగా సాక్ష్యంగా స్వీకరించింది. అదే లేకపోతే ఈ కేసులో దాదాపు సాక్ష్యమే లేదు. చాలా సందేహాస్పదమైన ఈ చర్య ద్వారా రుజువు అయిన నేరానికి ఇప్పుడు నలుగురు ముద్దాయిలు ఉరికంబం ఎక్కబోతున్నారు.

సుప్రీంకోర్టు వైఖరిలోని అభ్యంతరంమైన విషయం ఇదొక్కటే కాదు. పోలీసులకిచ్చిన ఒప్పుకోలు వాంగ్మూలం టాడా కేసులలో సూత్రప్రాయంగా సాక్ష్యంగా చెల్లుబాటయినంత మాత్రాన దానిని నిర్విచక్షణగా విశ్వసించమని ఎక్కడా లేదు. ఏ ఒప్పుకోలయినా సరే – అది పోలీసులకిచ్చినా, మేజిస్ట్రేట్‌కు ఇచ్చినా – పూర్తిగా స్వచ్ఛందంగా ఎటువంటి ఒత్తిడి లేకుండా ఇస్తేనే విశ్వసించాలి. సాధారణ కేసులలో పోలీసు కస్టడీలో వున్న ముద్దాయి మేజిస్ట్రేటుకు ఇచ్చే ఒప్పుకోలే సాక్ష్యంగా చెల్లుబాటవుతుంది కానీ పోలీసులకుగానీ ఇతర వ్యక్తులకుగానీ ఇచ్చే ఒప్పుకోలు సాక్ష్యంగా చెల్లుబాటు కాదు. అదీ స్వచ్ఛందంగా ఇచ్చినదా కాదా అని నిర్ణయించడానికి కావలసిన ప్రమాణాలను చట్టం నిర్దేశించడమేకాక అనేక కేసులలో సుప్రీంకోర్టు కూడ వివరించింది. ఆ ప్రమాణాలే టాడా కేసులలో పోలీసు అధికారికి ఇచ్చే వాంగ్మూలానికి కూడ వర్తిస్తాయని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కర్తార్ సింగ్ కేసులో అనింది.

రాజీవ్ గాంధీ హత్య కేసులో సుప్రీంకోర్టు (అదృష్టం కొద్దీ) ఆ అభిప్రాయాలనుగానీ ఆ ప్రమాణాలనుగానీ తిరగదోడలేదు. వాటిని తిరస్కరించలేదు. కేవలం వాటిని విస్మరించి ఒప్పుకోలు సాక్ష్యాల ప్రామాణికతకు ఆధారాలేమీ అక్కరలేనట్టు వ్యవహరించింది. ఈ కేసులో ఒప్పుకోలు ఇచ్చిన వారంతా దీర్ఘకాలం పోలీసు రిమాండులో వున్న తరువాత నేరుగా ఒక ఎస్‌పి ర్యాంకు అధికారి దగ్గరికి తీసుకుపోబడ్డారు. అతనికి వాంగ్మూలం ఇచ్చేశారు. పోలీసు కస్టడీ నుండి నేరుగా వెళ్లి ఒక మేజిస్ట్రేటు దగ్గర ఇచ్చిన ఒప్పుకోలును సహితం విశ్వసించలేమని గతంలో సుప్రీంకోర్టు అనేక సందర్భాలలో చెప్పి వుంది. కొంత సమయమైనా పోలీసుల ఒత్తిడి లేకుండా గడిపిన తరువాత ఇచ్చిన వాంగ్మూలమైతేనే విశ్వసించవచ్చునని చెప్పి వుంది. ఇటువంటి ప్రమాణాలేవీ ఇప్పుడు అక్కర లేకుండా పోయాయి.

ఒప్పుకోలు ఇచ్చిన తరువాత ముద్దాయిలందరూ తమ చేత పోలీసులు బలవంతంగా వాంగ్మూలం తీసుకున్నారని కోర్టులో చెప్పారు. ఈ విధంగా 'వెనక్కి తీసుకున్న ఒప్పుకోలు'కు సాక్ష్యంగా పెద్దగా బలం లేదని కూడ గతంలో అనేక తీర్పులలో సుప్రీంకోర్టు చెప్పి వుంది. అది కూడ ఇప్పుడొక పనికి రాని సూత్రీకరణ అయింది. ఆ తీర్పులు 'చెల్లవు' అనకుండానే వాటిని సుప్రీంకోర్టు పూర్తిగా విస్మరించింది.

మొత్తం మీద అన్ని ప్రమాణాలనూ కాదని ఈ 17 ఒప్పుకోలు వాంగ్మూలాలనూ సంపూర్ణంగా విశ్వసించి, 26 మంది ముద్దాయిలలో ఏడుగురు కుట్రదారులేనని సుప్రీంకోర్టు నిర్ణయించింది.

## కుట్ర ఉంటే మాత్రం ఉరి దేనికి?

ఈ నిర్ణయం సరయినదేననుకున్నా, అందులో నలుగురికి ఉరిశిక్ష ఎందుకు వేయాలి? హత్యకు సాధారణంగా జీవిత ఖైదు మాత్రమే విధించాలనీ, ఒక మినహాయింపుగా మాత్రమే మరణదండన విధించవచ్చుననీ చట్టం అంటుంది. ఆ మినహాయింపు అరుదైన వాటిలోకే అరుదైన ఘటనలలో మాత్రమే ఇవ్వాలని కూడ సుప్రీంకోర్టు అనింది. నళిని, మురుగన్, శంతన్, అరివుల నేరం అంత 'అరుదయిన'దని సుప్రీంకోర్టు ఎందుకు భావించింది?

తీర్పు ఇచ్చిన ముగ్గురు జడ్జిలు మురుగన్, శంతన్, అరివుల విషయంలో ఏకాభిప్రాయం కలిగి వున్నారు. జస్టిస్ థామస్ నళిని తన అమాయకత్వం వల్ల, మురుగన్ మీద ఉన్న ప్రేమ వల్ల ఈ కుట్రలో ఇరుక్కుందని నమ్మి ఆమెకు జీవిత ఖైదు వేస్తే సరిపోతుందని అన్నారుగానీ మిగిలిన ఇద్దరూ ఒప్పుకోలేదు. ఆమె స్త్రీ కాబట్టి అంతటి క్రూరత్వాన్ని ఆమెకు ఆపాదించలేమన్న వాదనకు జవాబుగా ఈ కేసులో 'మానవ బాంబు'గా వ్యవహరించిన థాను స్త్రీయే, శివరాసన్‌తో పాటు నేరంలో ప్రధాన పాత్ర వహించిన శుభ కూడ స్త్రీయేననీ, అందువల్ల వీరిని 'స్త్రీలు' అని మామూలుగా చూసే దృష్టితో చూడకూడదనీ జస్టిస్ వాధ్వా అన్నారు. ఆమెనూ మురుగన్‌నూ ఇద్దరినీ ఉరితీస్తే వాళ్ల పాప అనాథ అవుతుందన్న వాదనకు జవాబుగా వాళ్లు పేల్చిన బాంబు వల్ల ఎన్ని కుటుంబాలు అనాథలు కాలేదని జస్టిస్ వాధ్వా అన్నారు. నళిని, మురుగన్ బిడ్డ ప్రస్తావనకు స్పందిస్తూ వారు పేల్చిన బాంబు వల్ల చనిపోయిన వారిలో కోకిల అనే చిన్న పాప కూడా వుందనీ, ఆ అమ్మాయి రాజీవ్

గాంధీకి కవిత చదివి వినిపిద్దామని తన తల్లితో పాటు వచ్చిందనీ తల్లీబిడ్డలిద్దరూ థాను పేల్చిన బాంబులో చనిపోయారనీ ఆయన జ్ఞాపకం చేశారు.

మొత్తానికి శిక్ష గురించి న్యాయమూర్తులయినా సాధారణ పౌరులయినా చేసే ఆలోచన ప్రతీకార భావనకు పెద్దగా దూరం ఉండదని జస్టిస్ వాధ్వా మరొక్కసారి రుజువు చేశారు. న్యాయం నేరస్తుల స్థానంలో తాను కూడ నిలబడి 'వాళ్లంత క్రూరంగా ప్రవర్తించినప్పుడు నేను క్రూరంగా శిక్షిస్తే తప్పేముంది' అన్నట్టుగా చేసింది. ఇది అనాగరికమైన ఆలోచన అని గుర్తిస్తే తప్ప జస్టిస్ వాధ్వా వాదనలో తప్పేమిటో అర్థం కాదు.

ఇకపోతే ఈ నేరం 'అరుదయిన వాటిలోనే అరుదయినది' ఎందుకయిందంటే చాలా పకడ్బందీగా పథకం వేశారు. నిర్దాక్షిణ్యంగా అమలు చేశారు. రాజీవ్ గాంధీ పక్కన ఇతర ప్రజలు ఉంటారని తెలిసి కూడ చాలా శక్తివంతమైన బాంబు వాడి మరొక 15 మందిని చంపారు. అన్నిటి కంటే ముఖ్యంగా దేశ ప్రధానమంత్రి హోదాలో మెజారిటీ వోటర్లు ఎన్నుకున్న పార్టీ నాయకుడి హోదాలో తీసుకున్న నిర్ణయానికి రాజీవ్ గాంధీని బలి చేశారు.

రాజీవ్ గాంధీ హత్య టాడా కిందికి వస్తుందా రాదా అన్న చర్చ చేసినప్పుడు లెక్కలోకి తీసుకున్న రాజకీయ నేపథ్యాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఇక్కడ పూర్తిగా మరిచిపోయారు. 1987లో భారత ప్రభుత్వం తమిళ ఈలం పోరాటం పట్ల అప్పటిదాకా అమలు చేసిన విధానాన్ని అకస్మాత్తుగా మార్చుకోవడం వల్ల ఆ పోరాటానికి కలిగిన నష్టాన్ని, ఐపికెఎఫ్ శ్రీలంకలో తమిళుల పైన పాల్పడిన అణచివేత, అత్యాచారాల పట్ల శ్రీలంక తమిళులలో కలిగిన న్యాయమైన ఆగ్రహాన్ని, తాను తిరిగి ప్రధానమంత్రి అయినట్టయితే వి.పి.సింగ్ వెనక్కి పిలిపించిన ఐపికెఎఫ్‌ను తిరిగి శ్రీలంకకు పంపిస్తానని ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజీవ్ గాంధీ చేసిన ప్రకటన వారిలో కలిగించిన ఆందోళనను – వీటన్నిటిని లెక్కలోకి తీసుకుని ఉంటే తప్పంతా వారి మీదనే పెట్టి వారిని ఉరి తీయవలసిందేనని సుప్రీంకోర్టు అనగలిగి వుండేది కాదు.

*మానవహక్కుల వేదిక బులెటిన్ 1,*
*1999*

# డిసెంబర్ 13: దానికి ప్రతీకారం

పార్లమెంటుపై దాడి భారత ప్రజాస్వామ్యంపైన దాడి అని ఒక సంవత్సరం కింద అన్నారు. ఆ దాడి చేసిన వారు ఆనాడే చనిపోగా, దానికి సహకరించిన వారిలో ముగ్గురికి ఉరిశిక్ష వేసిన పాటియాలా కోర్టు సెషన్స్ జడ్జి ఢింగ్రా ప్రజాస్వామ్యాన్ని కాపాడారని ఇప్పుడు అంటున్నారు.

ప్రజాస్వామ్యం అనేది పార్లమెంటు గోడలలో, గదులలో ఉందా? అన్న అనుమానం ఎవరికైనా రాగలదు. ప్రజాస్వామ్యంతో సమానంగా భావించబడే పార్లమెంటు బిల్డింగుపైన దాడి చేసిన వారికి సహకరించిన వారిని నిర్దాక్షిణ్యంగా ఉరికంబం ఎక్కించడం కంటే, ఎట్టి పరిస్థితులలోనయినా సరే భారత న్యాయవ్యవస్థ ఆవేశానికి లోను కాకుండ ఒకే రకంగా న్యాయం చేస్తుందని రుజువు చేయడం ద్వారా సెషన్స్ జడ్జి ఢింగ్రా గారు భారత ప్రజాస్వామ్యానికి ఎక్కువ మేలు చేసి ఉందురు. ప్రజాస్వామ్యం అంటే చట్టసభల బిల్డింగులు కాదు. ప్రజాస్వామ్యం అంటే ప్రజాస్వామ్య వ్యవస్థలు. ఎంతగా రెచ్చగొట్టినా అవి చెక్కు చెదరకుండ తమ విలువలకు కట్టుబడి ఉంటాయని రుజువు చేయడం ఆ వ్యవస్థలలో బాధ్యతలు నిర్వర్తించేవారు ప్రజాస్వామ్యానికి చేయగల అత్యుత్తమ సేవ.

'అదిగో, దాడి చేసిన వాళ్లు ముస్లింలు కాబట్టి, టెర్రరిస్టులు కాబట్టి, ఈయన వెనకేసుకొస్తున్నాడు' అనబోతారు. నేను ఆ దాడి చేసిన వారిని వెనకేసుకు రావడం లేదు. వెనకేసుకు రావడానికి వారింకా ప్రాణంతో లేరు. ప్రత్యక్షంగా దాడిలో పాల్గొన్న వారందరూ ఆనాడే చనిపోయారు. 'ప్రతీకారం' అవసరం అనుకున్నట్లయితే అది ఆనాడే జరిగిపోయింది.

అయితే భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి ఈ ప్రతీకారం కూడ అవసరం అని చాలామంది లాగా సెషన్స్ జడ్జి డింగ్రా గారు కూడ భావించారు. నేర విచారణ నడుస్తుండగా జరిగిన ఒక ఘటన దీనికి తార్కాణం. సాక్ష్యం చెప్తున్న ఒక పోలీస్ అధికారిని ముద్దాయిల తరఫున క్రాస్ ఎగ్జామిన్ చేస్తున్న న్యాయవాది హెచ్చరిస్తూ, 'బాగా ఆలోచించి జవాబు చెప్పండి, నాలుగు ప్రాణాలు మీ జవాబు మీద ఆధారపడి ఉన్నాయి' అనగా, జడ్జి ఢింగ్రా గారు జోక్యం చేసుకొని 'అవును బాగా ఆలోచించుకుని జవాబు చెప్పండి – భారత ప్రజాస్వామ్యం భవిష్యత్తు మీ జవాబు మీద ఆధారపడి ఉంది' అన్నారంట.

ఒక నేరాన్ని విచారించే జడ్జి తాను దేశాన్ని కాపాడే పోరాటంలో పాల్గొంటున్నానని అనుభూతి చెందుతూ ఆ పని చేస్తే, బోనులో నిలబడ్డ వ్యక్తికి న్యాయం చేస్తాడన్న భరోసా లేదు. ఆ నేరం జరిగిన సందర్భం భయానకమైనదే కావచ్చు. నేరం ఘోరమైనదే కావచ్చు. అయినప్పటికీ న్యాయమూర్తి చేయవలసింది ఆ ఘోరానికి జవాబు చెప్పడం కాదు, తన ఎదుట నిలబడ్డ వ్యక్తి పాత్ర ఏమిటో నిర్ధారించి సముచితంగా శిక్షించడం మాత్రమే. ఇదేదో టెక్నికల్ విషయం అనుకోవడం చాలా పొరబాటవుతుంది. న్యాయస్థానాలు ఈ దృష్టితో పని చేయకుంటే వ్యక్తి స్వేచ్ఛకూ ప్రాణానికీ భరోసా ఉండదు.

నలుగురు ముద్దాయిలలో ఒకరయిన అఫ్సాన్ గురుకు అయిదు సంవత్సరాల జైలు శిక్ష వేయడం సెషన్స్ జడ్జి ఢింగ్రా గారి వైఖరికి అద్దం పడుతుంది. తన భర్త షౌకత్ హుస్సేన్ గురుతో సహా ఇతర కుట్రదారులు కుట్ర చేస్తున్న సంగతి తెలిసి కూడ పోలీసులకు చెప్పనందుకు ఆమెకు అయిదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. టెర్రరిస్టుకు ఆశ్రయం ఇవ్వడం లేదా వారిని దాచి ఉంచడం నేరం అని 'పోటా'లోని సెక్షన్ 3(4) అంటుంది కానీ భార్యాభర్తలకు మినహాయింపు ఇస్తుంది. అంటే తన భర్త టెర్రరిస్టు అని తెలిసీ ఒక స్త్రీ అతనిని పోలీసుల నుండి కాపాడినా అది పోటా కింద నేరం కాదు. అటువంటప్పుడు తన భర్త కూడ భాగస్వామి అయిన కుట్రను పోలీసులకు తెలియజేయకపోవడం టెర్రరిజానికి సహకరించడంగా భావించి ఆమెకు శిక్ష విధించడం ఎట్లా న్యాయం అవుతుంది?

శిక్ష పడిన ఈ నలుగురూ 'అమాయకులా' అని చాలామంది మా బోటివాళ్లను ఆవేశంగా అడుగుతున్నారు. అమాయకులు అనే మాటకు ఈ సందర్భంలో రెండు అర్థాలు ఉండగలవు. వాళ్లు డిసెంబర్ 13 నాటి దాడికి పాల్పడిన వారితో గానీ, ఆ

దాడితో గానీ ఏ సంబంధం లేని దారినపోయేవారు అనేది అర్థమయితే ఈ నలుగురూ (నాకు అర్థం అయినంతవరకు) అమాయకులు కారు. వాళ్లు ఆ దాడికి పాల్పడిన వారికి చిన్నా, చితకా సహాయాలు చేసి ఉండవచ్చును. కానీ ఆ దాడి జరుగుతుందని తెలిసి, దానికి సంబంధించిన పథకంలో భాగంగా సహాయం చేసారా అంటే ఒక్క మహమ్మద్ అఫ్జల్ తప్ప తక్కిన వారి విషయంలో అవునని అనడానికి ఆధారాలు లేవు. ఆ అర్థంలో తక్కిన ముగ్గురూ అమాయకులేననుకుంటాను.

మనకు పరిచయమున్న సందర్భాన్ని ఉదాహరణగా తీసుకుంటే విషయం సులభంగా అర్థం అవుతుంది. తెలంగాణలో ఒక ఊరిలో ఒకరినో ఇద్దరినో చంపే ఉద్దేశ్యంతోనో, పోలీస్ స్టేషన్‌పై దాడి చేసే ఉద్దేశ్యంతోనో 'అన్నలు' ప్రవేశిస్తారు. వారి కార్యక్రమం వివరాలు ఒకరిద్దరు మిలిటెంట్లకు తప్ప వేరే ఎవరికి తెలియక పోవచ్చును. అయితే వారు ఆ ఊరిలో చాలామంది సహాయం తీసుకుంటారు. ఆ వ్యక్తులు భయానికే కాదు భక్తితో కూడ సహాయం చేస్తారు. ఒకరి దగ్గర నాలుగు రోజులు ఉండి పోవడానికి గదో గొడ్ల చావడో తాత్కాలికంగా తీసుకుంటారు. ఒకరి ఇంట్లో అటక మీద బాంబులు వగైరా సామగ్రి నాలుగు రోజులు ఉంచమని కోరతారు. ఒకరి స్కూటర్ నాలుగు రోజులు వాడుకుంటామంటారు. ఒకరిని రెండు పూటలు అన్నం వండి పెట్టమంటారు. వీరంతా 'అన్నల' మీద అభిమానంతోనే ఈ సహాయాలు చేసారనుకోండి. అయినప్పటికీ నాలుగో రోజు 'అన్నలు' ఒక హత్య చేసి వెళ్లిపోతే ఆ కేసులో వీరందరినీ కుట్రదారుల కింద చేర్చి ఉరిశిక్ష, జీవిత ఖైదు విధిస్తే 'అమాయకులను శిక్షించారు' అనమా? ఆ అర్థంలో గిలానీ, షౌకత్ హుసేన్ గురు, అఫ్జల్ గురు అమాయకులే.

వాళ్లు కాశ్మీరీలు. కాశ్మీరీలకు మొదటినుండి భారత ప్రభుత్వం పట్ల ఉన్న అసంతృప్తికి తోడు ఈ పదేళ్లలో ఎంత లేదన్నా ఒక 30 వేల మంది కాశ్మీరీలు భారత సైన్యం చేతిలో చనిపోయారు. కాబట్టి భారత ప్రభుత్వం మీద పోరాటం చేసే వారెవరికైనా తమకు చేతనైన సహాయం చేయడానికి వారు సిద్ధపడడం సహజం. ఒక గది అద్దెకు ఇప్పించడం, ఒక కారు కొనుక్కోవడానికి సహకరించడం వారు చేసిన సహాయం. ఈ సహాయం పొందుతున్న వారు ఏం చేయబోతున్నారో వారికి నిర్దిష్టంగా తెలీదు. వారి పథకమేమిటో తెలీదు. అయినా వారిని తమ శత్రువుపైన పోరాటం చేసే పోరాటకారులుగా గుర్తించి వారు అడిగిన చిన్నా చితకా సహాయాలు చేసారు.

దానికి వారిని ఉరికంబం ఎక్కించడం న్యాయమా?

*మొదటి ముద్రణ : ప్రజాతంత్ర వారపత్రిక, 23 డిసెంబర్ 2002*

*రెండవ ముద్రణ : 'ఆ శిక్షే ఒక నేరం', 2012 (HRF ప్రచురణ)*

# ఎవరికి సంకేతాలు పంపడానికి అఫ్జల్‌ను ఉరితీయాలి?

ఇష్టమొచ్చిన పని చేసేసి 'ప్రజలు కోరుకుంటున్నారు కాబట్టి చేశాను' అనడం తెలిసిందే. ఈ మధ్య న్యాయస్థానాలు కూడ కఠినమైన శిక్షలు వేసి 'ప్రజలు కోరుకుంటున్నారు' అనడం మొదలు పెట్టాయి. గాయపడ్డ భారత ప్రజల మానసిక ఆవేదనకు ఉపశమనం లభించాలంటే మహమ్మద్ అఫ్జల్‌ను ఉరితీయవలసిందేనని సుప్రీంకోర్టు ప్రకటించి అఫ్జల్‌కు కింది కోర్టు విధించిన మరణశిక్షను ధృవీకరించింది.

ఇది అర్థంలేని వాదన. భారత ప్రజల మనోభావాలు సుప్రీంకోర్టుకు ఎట్లా తెలుసన్న ప్రశ్నను పక్కన పెడదాం. అసలు అఫ్జల్ మీద ఉన్న నేరారోపణ ఏమిటో, దానికి మద్దతుగా ఏపాటి సాక్ష్యాలు పోలీసులు సేకరించారో భారత ప్రజానీకానికి తెలుసా? తెలియనప్పుడు అతనికి ఏ శిక్ష వేయాలన్న చర్చకు 'భారత ప్రజల' మనోభావాలతో ఏం సంబంధం ఉండగలదు? సగటు భారత పౌరులు మహమ్మద్ అఫ్జల్ ప్రత్యక్షంగా పార్లమెంట్‌పైన జరిగిన దాడిలో పాల్గొన్నాడనో, లేదా తానే వెనకుండి కుట్ర పన్ని నడిపించాడనో అనుకుంటుండవచ్చు. కాని ఇది నిజం కాదని సుప్రీంకోర్టుకు తెలుసును.

13 డిసెంబర్ 2001 నాడు పార్లమెంట్ పైన జరిగిన దాడిలో పాల్గొన్న వారందరూ అక్కడికక్కడే ఎదురుకాల్పులలో మరణించారు. ఆ తరువాత నేర విచారణ ఎదుర్కొన్న మహమ్మద్ అఫ్జల్, షౌకత్

హుస్సేన్ గురు, ఎస్.ఏ.ఆర్. గిలానీ, అఫ్సాన్ గురులు దాడి జరిగిన సమయంలో అక్కడ ఉండి పాల్గొన్నారన్నది కాదు పోలీసుల అభియోగం. చనిపోయిన ఐదుగురు, ఈ నలుగురు, పాకిస్తాన్లో ఉన్న ఘాజీబాబా, మౌలానా మసూద్ అజర్, అబు జిహాదీ, తారిక్ అహమ్మద్ అనే వాళ్ళంతా ఈ నేరానికి కుట్ర చేశారనీ, ఆ కుట్ర ఫలితమే చనిపోయిన ఐదుగురు చేసిన దాడి అనీ వాళ్ల అభియోగం. వీరందరూ పాకిస్తాన్ కేంద్రంగా గల జైష్-ఇ-మహమ్మద్ అనే సాయుధ మతవాద సంస్థ సభ్యులనేది పోలీసు కథనం.

పార్లమెంట్ పైన దాడి జైష్-ఇ-మహమ్మద్ పనేనని ఆరోపించడమే కాక, ప్రసార మాధ్యమాలలో విస్తృతంగా ప్రచారం చేశారు. అయితే కేసు విచారణ సమయంలో దీనికి ఆధారంగా ఏ ఒక్క సాక్ష్యం చూపించలేదు. విశ్వసనీయ సాక్ష్యం కాదు, ఎటువంటి సాక్ష్యమైనా ఆవగింజంత కూడ చూపించలేదు. పోనీ పాకిస్తాన్‌కు చెందిన జైష్-ఇ-మహమ్మద్ నాయకులు ఘాజీబాబా, మౌలానా మసూద్ అజర్లతో నేర విచారణ ఎదుర్కొన్న నలుగురికీ సంబంధాలు ఉన్నాయన్న సాక్ష్యమేమైనా ప్రవేశపెట్టారా అంటే అదీ లేదు. ఉన్న సాక్ష్యమంతా ఏమిటంటే చనిపోయిన అయిదుగురి వద్దా, మహమ్మద్ అఫ్జల్ వద్దా స్వాధీనం చేసుకున్నట్లు చెప్తున్న సెల్‌ఫోన్‌ల ద్వారా పాకిస్తాన్‌కు, సౌదీ అరేబియాకు చాలాసార్లు ఫోన్లు చేసినట్టు చూపించే ఆధారాలు. ఆ ఫోన్‌లు ఆ దేశాలలో ఎవరికి చేశారన్న ఆధారాలు ఏమీ లేవు. పాకిస్తాన్‌లో జైష్-ఇ-మహమ్మద్ కార్యకర్తలే కాక కొన్ని కోట్ల మంది వేరే ప్రజలున్నారు. భారతదేశ వాసులకూ వారికీ సంబంధ బాంధవ్యాలున్నాయి. కాబట్టి ఎవరినైనా పట్టుకొని నీ సెల్‌ఫోన్ ద్వారా నువ్వు డజన్‌సార్లు పాకిస్తాన్‌లో ఎవరితోనో మాట్లాడావంటే దానితో రుజువయ్యేదేమీ లేదు.

పోనీ దాడిచేసి చనిపోయిన అయిదుగురూ జైష్-ఇ-మహమ్మద్ కార్యకర్తలన్న ఆధారాలేవయినా ఉన్నాయా అంటే వారి ఊరూ పేరూ కూడ తెలియదు. వారి పొడిపేర్లు మాత్రమే తెలుసు. ఒకరి పేరు మహమ్మద్ అంట. ప్రపంచంలో ప్రతీ రెండవ ముస్లిం పురుషుడి పేరూ మహమ్మదే. మిగతా ఇద్దరూ రాజా, రాణా. అవి ముస్లింల పేర్లే కానక్కరలేదు. మిగిలిన ఇద్దరూ హంజు, హైదర్. ముందు పేరూ వెనక పేరూ ఊరి పేరూ తెలీదు. ఏ సంస్థకు చెందినవారో తెలీదు. ఏ దేశస్తులో తెలీదు.

కాబట్టి పార్లమెంట్ పైన దాడి జైష్-ఇ-మహమ్మద్ పని అనడానికి ఆవగింజంత సాక్ష్యం కూడ లేదు. విశ్వసనీయమైన సాక్ష్యం కాదు, ఏ సాక్ష్యమూ లేదు.

ఇక మిగిలింది కుట్ర. అఫ్జల్ తదితరులు చనిపోయిన అయిదుగురు అనామకులతో కలిసి పార్లమెంట్‌పైన దాడి చేయడానికి కుట్ర చేశారనడానికి ఏం ఆధారాలు చూపించారు? కుట్ర అంటే అర్థం 'ఉద్దేశ్యం, అంగీకారం' అని న్యాయ సిద్ధాంతం అంటుంది. కుట్రదారులందరికీ ఫలానా (నిర్దిష్టమైన) లక్ష్యం సాధించాలన్న ఉద్దేశ్యం ఉండాలి. దాని సాధన కోసం పనిచేయాలన్న అంగీకారం ఉండాలి.

అఫ్జల్ తదితరులకు పార్లమెంట్‌పైన దాడి జరపాలన్న లక్ష్యం ఉన్నట్టుగానీ, చనిపోయిన అయిదుగురికి అటువంటి లక్ష్యం ఉండిందన్న విషయం తెలిసినట్టు గానీ ఏ సాక్ష్యమూ లేదు. విశ్వసనీయమైన సాక్ష్యం లేదనడం లేదని మళ్లీ చెప్పాలి. అసలు ఏ సాక్ష్యమూ లేదు.

ఉన్న సాక్ష్యమేమిటి? పోలీసులు అఫ్జల్ అద్దెకు తీసుకుని నివసిస్తున్న గది మీద దాడి చేసినప్పుడు అక్కడ పేలుడు పదార్థాలు దొరికాయని సాక్ష్యం ప్రవేశపెట్టారు. పేలుడు పదార్థాలను అనుమతి లేకుండా కలిగి ఉండటం నేరమేగాని, వాటిని పార్లమెంట్‌పైన దాడి చేయడానికి కుట్రలో భాగంగా అఫ్జల్ తెచ్చిపెట్టుకున్నాడని నమ్మడానికి ఆధారమేమీ లేదు. దాడిలో చనిపోయిన మహమ్మద్ అని పేరు పెట్టబడ్డ అనామకుడు దాడికి కొద్ది సమయం ముందు తన సెల్‌ఫోన్ ద్వారా అఫ్జల్‌తో సంభాషించాడనీ, అతని దగ్గర దొరికిన ఒక కాగితం మీద అఫ్జల్ సెల్‌ఫోన్ నెంబర్ ఉందనీ ఆధారాలు చూపించారు. అఫ్జల్ కొందరు వ్యక్తులతో తిరుగుతుండగా చూశామనీ, ఆ వ్యక్తులు పార్లమెంట్‌పైన దాడి చేసినవారనీ, వారి శవాల ఫోటోలను బట్టి గుర్తుపట్టామనీ కొందరు సాక్షులు చెప్పారు. అయితే ఈ రకమైన ఫోటో గుర్తింపు విశ్వసనీయమైనది కాదని కర్తార్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు ప్రకటించింది. శవం ఫోటో సంగతి పక్కన పెట్టండి. బతికున్నప్పటి ఫోటో ద్వారా మనిషిని గుర్తుపట్టే సాక్ష్యం సహితం విశ్వసనీయం కాదని సుప్రీంకోర్టు అన్నది. ఫోటో గుర్తింపును సాక్ష్యంగా పరిగణించడాన్ని అనుమతించే 'టాడా' చట్టంలోని సెక్షన్ 22 చెల్లదని సుప్రీంకోర్టే కొట్టేసింది.

పోనీ సాక్ష్యమంతా నమ్మినా తేలేది ఏమిటంటే పార్లమెంట్‌పైన దాడి చేసిన వ్యక్తులతో అఫ్జల్‌కు సంబంధం ఉండింది; వాళ్ళు అతని సహాయం తీసుకున్నారు; అతను వారికి సహాయం చేశాడు. అంతమాత్రం చేత వారి నిర్దిష్ట లక్ష్యం (పార్లమెంట్ పైన దాడి చేసి పార్లమెంట్ సభ్యులను, కేంద్ర మంత్రివర్గ సభ్యులను హతమార్చాలన్న

లక్ష్యం) అతనికి తెలుసనీ, అతను దానికోసం పనిచేశాడనీ నిర్ధారించగలమా? కామన్‌సెన్స్ ప్రకారం చూసినా అటువంటి లక్ష్యంగలవాళ్ళు తమకు సహాయం అందించిన వారందరికీ తమ కార్యక్రమమంతా చెప్పరు. వారికి ఎంత తెలియాలో అంతే చెప్తారు. రహస్య సంస్థల పనితీరే అంత.

తన రాజకీయ లక్ష్యంలో భాగంగా ఒకరిని చంపడానికి పూనుకున్న ఒక రాజకీయ కార్యకర్తకు ఆ పని చేయడానికి మోటార్ సైకిల్ అవసరమయిందనుకోండి. ఒక గంట కోసం మోటార్ సైకిల్ ఇప్పించమని తన రాజకీయాల పట్ల సానుభూతి గల వ్యక్తిని అడిగాడనుకోండి, అతను ఇప్పిస్తాడు. ఇతను దాని మీద పోయి హత్యచేసి బండి వాపస్ ఇచ్చేస్తాడు. బండి ఇప్పించిన వ్యక్తి ఆ హత్యకు కుట్రదారుడంటే సాధారణ ఆలోచనారీతీ ఒప్పుకోదు, చట్టమూ ఒప్పుకోదు. అఫ్జల్‌కు వ్యతిరేకంగా పోలీసులు ప్రవేశపెట్టిన సాక్ష్యమంతా నమ్మినా అతని పాత్ర ఇంతకంటే ఎక్కువని నిర్ధారించడానికి ఏ ఆధారమూ లేదు. అతనికి శిక్ష అంటూ వేస్తే అనుమతి లేకుండా పేలుడు పదార్థాలు కలిగి ఉన్నందున శిక్ష వేయాలి. దానికి పేలుడు పదార్థాల చట్టం కింద ఐదు సంవత్సరాల నుండి జీవిత ఖైదు దాకా ఉండగలదు. ఆ నేరానికి జీవితఖైదు సాధారణంగా వేయరు. మరణదండన వేసే అవకాశం అసలే లేదు.

వాళ్ళ లక్ష్యాలు తెలియకుండా అఫ్జల్ వాళ్ళకు సహాయం ఎందుకు చేస్తాడు? అన్న సందేహం రావచ్చు. కాశ్మీరీల గురించి ఏ మాత్రం తెలిసినా అటువంటి సందేహం రావడానికి ఆస్కారం లేదు. కాశ్మీర్ కోసం భారత్ పదిహేడు సంవత్సరాలుగా చేస్తున్న యుద్ధంలో అరవైవేలకు పైగా ప్రాణాలు పోయాయి. వీటిలో భారత సైనిక జవాన్ల ప్రాణాలు కొన్ని, కాశ్మీర్ పండిట్ల ప్రాణాలు కొన్ని కాగా అత్యధిక భాగం అఫ్జల్, షౌకత్, గిలానీ, అఫ్సాన్ వంటి సాధారణ కాశ్మీరీల ప్రాణాలే పోయాయి. చంపింది భారత ప్రశాసనమైనా, మిలిటెంట్లయినా చనిపోయింది కాశ్మీరీలే.

విధ్వంసమూ చాలా జరిగింది. అఫ్జల్ బారాముల్లాలోని సొపోర్‌కు చెందినవాడు. అది ఆపిల్ వ్యాపారానికి కేంద్రం. వాణిజ్య కేంద్రమైన సొపోర్ చాలా అందమైన ఊరు. కానీ అది మిలిటెన్సీకి కూడ కేంద్రం. భారత సైన్యం ఆ ఊరిని మూడుసార్లు దాదాపు సంపూర్ణంగా అగ్నికి ఆహుతి చేసింది. సొపోర్‌నే కాదు, కాశ్మీర్ లోయలో అనేక గ్రామాలను, పట్టణాలను తగలబెట్టడం, నివాస స్థలాలను పేల్చివేయడం గత పదిహేడు సంవత్సరాలుగా జరుగుతూనే ఉంది. అటు మిలిటెంట్లు కూడ క్రమేపీ

మరింత క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. భారత ప్రభుత్వం పైన తాము చేస్తున్న పోరాటంలో సాధారణ పౌరుల ప్రాణాలు తీయడానికి సైతం వాళ్లు ఇవాళ వెనకాడటం లేదు.

తప్పెవరిది ఉన్నా, ఎందరిది ఉన్నా ఈ స్థితికి ప్రాథమిక బాధ్యత భారత ప్రభుత్వానిదే అన్న సగటు కాశ్మీరీల అభిప్రాయాన్ని తప్పుపట్టడం కష్టం. ఇక అఫ్జల్ మాటకొస్తే అతను కొంతకాలం మిలిటెంట్‌గా ఉండి ఆ తరువాత లొంగిపోయి, కొంతకాలం సరెండర్డ్ మిలిటెంట్ గా ఉండి స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌తో పనిచేసి, ఆద్యంతం విపరీతంగా హింస అనుభవించాడు. అటువంటి వాళ్ళ దగ్గరికి ఎవరైనా వచ్చి భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాం అని చెప్తే, వివరాలు కూడ అడగకుండ వారు ఏ సహాయం అడిగితే ఆ సహాయం ఇవ్వడం ఆశ్చర్యం కలిగించవలసిన విషయం కాదు.

ఈ సామాజిక, చారిత్రక విషయాలు కాకున్నా, చట్టపరమైన విషయాలు న్యాయమూర్తులకు అర్థం కాకపోలేదు. వాళ్ళకు న్యాయసిద్ధాంత పరిజ్ఞానం లేదని అనడం లేదు. ఆ పరిధిలో వివేచించినంత వరకు సహేతుకంగానే వ్యవహరించారు. ఇది 'పోటా' కింద పెట్టిన కేసు కాబట్టి ముద్దాయిలు పోలీసులకిచ్చిన ఒప్పుకోలును వాళ్ళు సాక్ష్యంగా స్వీకరించి ఉండవచ్చును. ట్రిబ్యునల్ కోర్టు అలానే చేసింది. కాని హైకోర్టు, సుప్రీంకోర్టు ఆ ఒప్పుకోళ్ళను తిరస్కరించాయి. 'పోలీసులు ఒప్పుకోళ్ళు ఏ విధంగా తీసుకుంటారో మాకు తెలియక పోలేదులే' అని సుప్రీంకోర్టు చిన్న చురక కూడ వేసింది.

కానీ ఇటువంటి కేసులలో ఎక్కడో రాజకీయం ప్రవేశిస్తుంది. న్యాయస్థానాలు న్యాయనిర్ణయం చేయడం ఆపేసి ఏవో రాజకీయ కర్తవ్యాలు మీద వేసుకుంటాయి. 'భారత ప్రజల మనోభావాలు' అన్నారు గానీ న్యాయస్థానాలు స్పందించింది దానికి కూడ కాదు. పాకిస్తాన్‌కు, ఇస్లాం పేరు మీద హింస చేసే సంస్థలకు ఏదో సందేశం పంపడం అవసరం అని భావించారు. 'భారతదేశం ప్రజాస్వామ్యమని కదా మీకంతా ఇంత చులకన? ఇక్కడేం చేసినా సాగుతుందని కదా మీ అభిప్రాయం? ఆ ప్రజాస్వామ్య చిహ్నమైన పార్లమెంట్‌పైనే దాడిచేసి భారత్‌ను వెక్కిరిద్దామనుకున్నారా? మీ వాడిని ఉరితీస్తాం చూడండి. మేము చేతకాని వాళ్ళం కామని రుజువు చేస్తాం చూడండి'.

ఇదీ న్యాయస్థానాలతో సహా అన్నీ తెలిసిన, తెలిసి ఉండవలసిన భారతీయుల వైఖరి. దానికి ఏ పాపం ఎరుగని వాడు కాకున్నా, మరీ అంత పాపం ఎరుగని అఫ్జల్

బలి కావలసిందేనా అన్నది మనం వేసుకోవలసిన ప్రశ్న. ఇంకొంచెం ముందుకుపోయి ఆ కొంచెం పాపం కూడ అతనిదా లేక అతనిని బోనెక్కించిన భారత సర్కార్‌దా అన్న ప్రశ్న కూడ మనం వేసుకోవలసిందే. కానీ దీనికి భారత్‌లో ఎంతమంది సిద్ధంగా ఉన్నారు?

*(కేసులో సాక్ష్యాధారాలు ఏమున్నాయో, ఏం లేవో నేనెట్లా చెప్పగలుగుతున్నానని నా అభిప్రాయాలతో విభేదించే వారెవరైనా ప్రశ్నించగలరు. సుప్రీంకోర్టు తీర్పు ఎక్కడయినా దొరుకుతుంది. దానిని ఎవరైనా చదవవచ్చు. కానీ నేను దాని మీద మాత్రమే ఆధారపడలేదు. షౌకత్ హుస్సేన్ గురుకు ట్రయల్ కోర్టులో న్యాయవాదిగా ఉన్న నిత్యారామకృష్ణన్ సీనియర్ న్యాయవాదిగా సహాయం చేయమని కన్నబిరాన్ గారిని కోరారు. కన్నబిరాన్ గారు కేసు కాగితాలన్నీ నాకిచ్చి షౌకత్ తరపున వాదనలు తయారు చేయమని అడిగారు. ఆ విధంగా సాక్ష్యాలు మొత్తం చూసే అవకాశం నాకు కలిగింది.)*

*మొదటి ముద్రణ : వీక్షణం మాసపత్రిక, సెప్టెంబర్ 2006*

*రెండవ ముద్రణ : 'మతతత్వంపై బాలగోపాల్', 2010 (హెచ్‌బిటీ ప్రచురణ)*

*మూడవ ముద్రణ : 'ఆ శిక్షే ఒక నేరం', 2012 (మానవహక్కుల వేదిక ప్రచురణ)*

# రిజర్వేషన్లు దళితుల ప్రజాస్వామిక హక్కు

**మూ**డు సంవత్సరాల క్రితం ఆంధ్రరాష్ట్రంలో రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన నడిచింది. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం మురళీధరరావు కమిషన్ సూచనలను అనుసరించి వెనుకబడ్డ కులాలకు విద్యా, ఉద్యోగరంగాలలో రిజర్వేషన్‌ను 25 శాతం నుండి 44 శాతానికి పెంచడానికి నిర్ణయించినప్పుడు దానిని వ్యతిరేకిస్తూ అగ్రకులాలకు చెందిన కొందరు విద్యార్థులు, విద్యావంతులు ఆందోళన నడిపారు. రిజర్వేషన్లు కల్పించడం వల్ల ప్రతిభావంతుల స్థానంలో అసమర్థులు, ప్రతిభలేని వాళ్లు పైకొచ్చి దేశం నాశనం అయిపోతుందని వాదించారు. అగ్రకులాలలోని పేదవాళ్ళకు ఉద్యోగాలు దొరకకుండా పోతాయని అన్నారు. తమ ఆందోళనలో భాగంగా తాము ఎన్నడూ చేయని 'నీచ' వృత్తులను నిరసనగా చేపట్టారు. బూట్లు తుడిచారు. రోడ్లు ఊడ్చారు. మూటలు మోసారు. తమ ప్రచారంలోనూ, ఆందోళనలోనూ అగ్రకుల అహంకారం ధ్వనించకుండా చూడాలన్న మొహమాటం సైతం లేకుండా ప్రవర్తించారు. మామూలుగా ఏ ప్రజా ఆందోళననూ సహించని ప్రభుత్వం ఈ ఉద్యమం పట్ల మటుకు చాలా సహనంతో వ్యవహరించడం అందరికీ కొట్టొచ్చినట్టు కనబడింది. మామూలుగా ఎవరు ఏ పోరాటం చేపట్టినా అందులో తప్పులెంచడానికి ముందుకొచ్చే పత్రికలు రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనను మటుకు చాలా సాదరంగా ఆహ్వానించాయి. బాహాటంగా సమర్థించాయి. వాళ్ళు ఎంచుకున్న ఆందోళనా రూపాల సృజనాత్మకతనూ, కళాత్మకతనూ కొనియాడాయి. వాళ్లు చేసిన హింస తమ కళ్ళకు కనబడనట్టు నటించాయి. ఆందోళనకారులు

హైకోర్టులో రిట్ పిటిషన్ వేసి రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ సమ్మతం కాదని కొట్టేయించారు. ఒక రిటైర్డు గుమాస్తా పెన్షన్ కోసం కోర్టులో కేసు వేస్తే సుప్రీంకోర్టు దాకా లాగకుండా ఊరుకోని రాష్ట్ర ప్రభుత్వం ఇంత ముఖ్యమైన విషయంలో హైకోర్టు తీర్పును వినమ్రంగా శిరసావహించి ఊరుకుంది. ఆ వినయాన్ని పత్రికలన్నీ కొనియాడాయి కూడ.

ఇవ్వాళ ఈ సంఘటనలన్నీ ఒక్కొక్కటి పునరావృతమవుతున్నవి. అయితే మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ నిర్ణయం కావడం వల్ల ఈ సారి రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన దేశమంతటా జరుగుతోంది. దాని మీద కేసు సుప్రీంకోర్టులో ఉంది. నవంబర్ నెలలో కేసు వినబోతున్నట్టు సుప్రీంకోర్టు ప్రకటించింది. ఈ కేసుకు చాలా ప్రాముఖ్యం ఉండగలదు. 1951 లో మొట్టమొదటిసారి చంపకం దొరైరాజన్ కేసులో రిజర్వేషన్లు భారత రాజ్యాంగంలోని 15(1), 29(2) అధికరణాలకు విరుద్ధమని సుప్రీంకోర్టు ప్రకటించినప్పటి నుండి ఈ విషయం వీధులలోనే కాక కోర్టులలోనూ నలుగుతోంది. ఒక జడ్జి చెప్పిన అభిప్రాయాలు ఇంకొక జడ్జి చెప్పకుండా తీర్పులు ఇస్తూ ఉన్నారు. అసలు ఈ విషయంలో సరైన తీర్పు చెప్పడానికి అవసరమైన సామాజికశాస్త్ర పరిజ్ఞానంగానీ, సామర్థ్యంగానీ జడ్జీలకు లేవని జస్టిస్ ఎ.పి. సేన్ మొహమాటం వదిలిపెట్టి అన్నారు. అయినప్పటికీ తీర్పులు ఇస్తూనే ఉన్నారు. చంపకం దొరైరాజన్ కేసు ఫలితంగా పార్లమెంటు మొట్టమొదటి రాజ్యాంగ సవరణను చేపట్టి అధికరణం 15(4)ను రాజ్యాంగానికి చేర్చి 'సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు' రిజర్వేషన్లు ఇవ్వడాన్ని రాజ్యాంగబద్ధం చేసింది. ఆ తరువాత కూడ కోర్టులు రిజర్వేషన్లను సూత్రప్రాయంగా ఆమోదిస్తూ అదే సమయంలో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదనీ, వెనుకబడినతనానికి కులం ప్రమాణం కాజాలదనీ ఆంక్షలు పెడుతూ వచ్చాయి. జస్టిస్ డి.ఎ.దేశాయి మాటల్లో చెప్పాలంటే కోర్టుల వైఖరిని 'ఊగిసలాటగా' (Dithering & Vacillation) వర్ణించవచ్చు. ఎటొచ్చీ ఈ విమర్శకు జస్టిస్ దేశాయి కూడ మినహాయింపు కాదు. ఇప్పుడు మొత్తంగానే దేశంలో నెలకొన్న అప్రజాస్వామిక వాతావరణంలో సుప్రీంకోర్టు ఒక 'అంతిమ తీర్పు' ఇచ్చే ప్రయత్నం చేయవచ్చు. ఆ తీర్పు దళితులకు అన్యాయం చేయకుండా చూడడం ప్రజాస్వామికవాదుల కర్తవ్యం.

గతంలో ఆంధ్రలో మనకున్న అనుభవాన్ని బట్టి రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనకారులు కోర్టు విచారణా సమయం సమీపించే కొద్దీ ఆందోళనను ఉధృతం

చేసి కోర్టు మీద చాలా ఒత్తిడి పెడతారని ఊహించవచ్చును. మురళీధరరావు కమిషన్ మీద వేసిన కేసులో వాదోపవాదాలు రాష్ట్ర హైకోర్టులో సాగుతున్నన్ని రోజులు ఆ కేసు వేసిన ఆందోళనకారులు రాష్ట్రమంతటా రాస్తారోకోలు, బంద్‌లు, బస్సుల విధ్వంసం కొనసాగిస్తూనే వచ్చారు. పత్రికలు ఈ ఆందోళనను రిపోర్టు చేస్తూ ఇక కోర్టే రాష్ట్రాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేస్తూ వచ్చాయి. 'జడ్జీలూ మనుషులే' కాబట్టి ఈ ఒత్తిడి ప్రభావం వాళ్లమీద ఉండక తప్పదు. రిజర్వేషన్లను దళితుల ప్రజాస్వామిక హక్కుగా భావించేవారు ఈ ఒత్తిడిని ఎదుర్కొని భారత రాజ్యాంగానికి పునాదియైన విలువలను నిలబెట్టడంలో భారత ప్రభుత్వానికి గల గురుతర బాధ్యతను గుర్తుచేయాలి. ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించేలా చేయడంలో కోర్టుకు గల బాధ్యతను కూడ గుర్తుచేయాలి. ఈ వాదోపవాదాలు కోర్టులలో సాగితే చాలవు. బజార్లలోనూ సాగాలి. సామాజిక సంఘర్షణ శాసనాల రూపమో, జీవోల రూపమో తీసుకున్నప్పుడు ఇటువైపో, అటువైపో రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకుని కోర్టుకు పోక తప్పదు. సంఘర్షణ రాజ్యాంగ వ్యాఖ్యానాల రూపం తీసుకోక తప్పదు. రాజ్యాంగం తనలో ఇముడ్చుకున్న ఆదర్శాలనూ, అణచివేతనూ, అభ్యుదయ విలువలనూ, అపరిమితమైన అధికారాన్నీ తిరిగి వ్యాఖ్యానించుకుని ఆ విరుద్ధ అంశాల వెనక దాగివున్న సామాజిక సంఘర్షణల కొనసాగింపుగా ప్రస్తుత సంఘర్షణను విశ్లేషించక తప్పదు. అప్పుడు ఆ సంఘర్షణ కోర్టు నాలుగు గోడల మధ్యనే కాక వీధిలోనూ జరగాల్సి వుంటుంది. ఆ విషయం రిజర్వేషన్ వ్యతిరేకులు స్పష్టంగా గుర్తించారు. ప్రజాస్వామికవాదులే వెనకబడి వున్నారు.

మండల్ కమిషన్ సిఫారసులను వ్యతిరేకించేవాళ్లు చేస్తున్న వాదనలను భారత రాజ్యాంగం ప్రకటించుకున్న విలువల నేపథ్యంలో పరిశీలిద్దాం. ఉద్యోగాలు, విద్యాసంస్థలలో సీట్లు మనుషుల సామర్థ్యాన్ని, ప్రతిభనూ బట్టి ఇవ్వాలని, లేకపోతే దేశ భవిష్యత్తు దెబ్బ తింటుందని, ఒకవేళ కొందరికి ప్రత్యేకమైన సదుపాయాలేమైనా కల్పించదలుచుకుంటే అది ఆర్థిక ప్రాతిపదిక మీదనే తప్ప కుల, మత, తదితర సామాజిక అంశాల ప్రాతిపదిక మీద ఉండరాదని, ఆ సదుపాయాలు సైతం స్కాలర్‌షిప్పులు, ట్యూషన్‌లు, ఉచిత హాస్టలు వసతి మొదలైన రూపాలలో ఉండాలేగానీ రిజర్వేషన్లు ఇవ్వకూడదని మండల్ కమిషన్ వ్యతిరేకులు ప్రధానంగా వాదిస్తున్నారు.

సామర్థ్యం, ప్రతిభ మొదలైన మాటల అర్థం ఏమిటని వెతికే ప్రయత్నం ప్రస్తుతానికి చేయకుండా, రిజర్వేషన్ వ్యతిరేకులు చెబుతున్నదే ఆ మాటల అర్థమని

కొద్దిసేపు అనుకుందాం. అట్లా అనుకున్నా ప్రభుత్వ విధానాలకు ఉండవలసిన భూమిక గురించి, సమాజంలోని అసమానతలను అంతం చేయవలసిన కర్తవ్యాన్ని గురించి భారత రాజ్యాంగం ఇచ్చే ఆదేశాలకూ, ఈ వాదనకూ ఏ మాత్రం పొంతన లేదని మొట్టమొదట గుర్తించాలి. ఇవ్వాళ మనం స్వతంత్ర భారతదేశంగా పరిగణిస్తూ ఉన్నది అనేక పోరాటాల ఫలితంగా ఏర్పడింది. అందులో రాజ్యాధికారం కోసం జరిగిన రాజకీయ పోరాటమే కాక కార్మికులు, రైతులు ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా చేసిన పోరాటాలు, కులవ్యవస్థకూ, స్త్రీల కుటుంబ బానిసత్వానికీ వ్యతిరేకంగా జరిగిన సామాజిక పోరాటాలు కూడ ఉన్నాయి. స్వాతంత్ర్యం అంటే తెల్లవాడిని పారద్రోలి నల్లదొరలు గద్దెనెక్కి కూచోవడం అని ప్రజలు ఆనాడు అనుకోలేదు. కుల రహిత సమాజం, స్త్రీ – పురుష సమానత్వం, దున్నేవానికే భూమినిచ్చే భూసంస్కరణలు, కార్మికులకు గౌరవప్రదమైన జీవితం, ఇవీ – ఇంకా అనేక ఆదర్శాలు ఆ పోరాటంలో భాగం అయ్యాయి. ఇవన్నీ సాధించినదే నిజమైన స్వాతంత్ర్యమని ఆనాడు ప్రజలు భావించారు, జాతీయోద్యమ నాయకులూ భావించారు. వివేకానందుని నుండి గాంధీదాకా, గాంధీ నుండి కమ్యూనిస్టులదాకా, కమ్యూనిస్టుల నుండి అంబేద్కర్‌దాకా అందరి రచనల నుండీ, ఉపన్యాసాల నుండీ ఈ అభిప్రాయాలను ఉటంకించవచ్చును. స్వతంత్ర భారతం ప్రజలలో కొందరినే ప్రతిభావంతులుగా గుర్తించి వాళ్ళ చేతిలో పదవులు, ఉద్యోగాలు, సాంకేతిక సాధనాలు పెట్టి వాళ్ళ పురోగమనాన్నే దేశప్రగతిగా భావిస్తుందని ఆనాటి జాతీయోద్యమంలో ఏ ఒక్కరూ అనుకోలేదు. అన్ని రకాల అసమానతలకూ నిలయమైన ఈ దేశంలో అసమానతలను పారద్రోలి సమానత్వాన్ని సాధించనిదే ఆ స్వాతంత్ర్యం నిజమైన స్వాతంత్ర్యం కాదని భావించారు. ఇవ్వాళ ఆ విలువలను తిరస్కరించే వాళ్ళు భారత జాతీయోద్యమానికి నిజమైన వారసులు కానే కారు.

ప్రస్తుత సంఘర్షణ భారత ప్రజల సుదీర్ఘమైన పోరాటాల చరిత్ర మనకు అందించిన విలువల వారసత్వాన్ని గురించిన సంఘర్షణ. చరిత్రలో పుట్టి, రాజ్యాంగంలో నిక్షిప్తమైన ఆ విలువలే భారత రాజ్యాంగానికి జీవనాడి వంటివని సుప్రీంకోర్టు పలుమార్లు అని వుంది.

## 1. భారత రాజ్యాంగం – కోర్టులు – రిజర్వేషన్లు

సామాజిక సమానత్వాన్ని గురించి చర్చించేటప్పుడు భారత రాజ్యాంగంలోని అధికరణాలు 38, 46 చాలా ముఖ్యమైనవి.

38(1) : సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం జాతి జీవనంలోని అన్ని వ్యవస్థల లక్షణంగా ఉండేటటువంటి సమాజాన్ని ప్రయత్న పూర్వకంగా నిర్మించి, సంరక్షించి, తద్వారా ప్రజల క్షేమాన్ని పెంపొందించడం ప్రభుత్వం కర్తవ్యం.

(2) : ప్రత్యేకించి స్థితిగతులలోనూ, సౌకర్యాలలోనూ, అవకాశాలలోనూ సమాజంలోని వ్యక్తుల మధ్యనే కాక, వివిధ వృత్తులననుసరించే వారి మధ్య లేక వివిధ ప్రాంతాలలో నివసించే వర్గాల మధ్య ఉన్న అంతరాలను తొలగించడం ప్రభుత్వం కర్తవ్యం. (ఇందులో రెండవ క్లాజు 1978 లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చబడింది.)

46 : సమాజంలోని బలహీనుల యొక్క, ప్రత్యేకించి షెడ్యూల్డు కులాల, తెగల యొక్క విద్యా అవసరాలను, ఆర్థిక అవసరాలను ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో సాధించాలి. వాళ్ళను సామాజిక అన్యాయాల నుండి, అన్ని రకాల దోపిడీ నుండి కాపాడాలి.

ఈ రెండు అధికరణాలు ఆదేశిక సూత్రాల జాబితాలో ఉన్నాయి. ఆదేశిక సూత్రాలు దేశ పరిపాలనలో మౌలికమైన పాత్ర నిర్వహిస్తాయనీ, చట్టాలు చేసేటప్పుడు ప్రభుత్వం ఈ సూత్రాలను అనుసరించి చేయాలనీ అధికరణం 37 అంటుంది. రాజ్యాంగం ముందుమాటలో చెప్పుకున్న ఆదర్శాలను సాధించడానికి అనుసరించాల్సిన బాటను ఆదేశిక సూత్రాలు నిర్దేశిస్తాయని సుప్రీంకోర్టు కేశవానంద భారతి కేసు నుండి చెప్తూ వస్తూవుంది. రిజర్వేషన్లు 50 శాతం మించరాదని సుప్రీంకోర్టు బాలాజీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మైసూర్ (1963) కేసులో చెప్పిందని చాలామంది ఉటంకిస్తూ ఉన్నారు కానీ, అదే తీర్పులో రిజర్వేషన్లు ఇచ్చేటప్పుడు అధికరణం 46 లోని ఆదేశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకోవాలని సుప్రీంకోర్టు చెప్పిన సంగతి ఎవ్వరూ ఉటంకించరు!

సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం సాధించాలనీ, స్థితిగతులలోనూ, సౌకర్యాలలోనూ, అవకాశాలలోనూ ఉన్న అంతరాలను తొలగించాలనీ, షెడ్యూల్డు కులాలు, తెగలతో సహా బలహీన వర్గాల విద్యా, ఆర్థిక అవసరాలను తీర్చడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలనీ రాజ్యాంగం ఇంత స్పష్టం చేసిన తరువాత కులం ప్రాతిపదిక మీద రిజర్వేషన్లను ఏమని వ్యతిరేకిస్తారు? ఈ వ్యత్యాసాలు, అంతరాలు ఏర్పడడానికి

ఆర్థిక అసమానతలు ఒక కారణమైతే, కులవ్యవస్థ మరొక కారణం కాదా? ఆర్థిక వివక్ష ఒక్కటే దేశంలో పోగొట్టవలసిన వివక్ష అని రాజ్యాంగకర్తలు భావించలేదు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అనే కీలకమైన ఆదర్శం రాజ్యాంగం ముందుమాటలోనూ, అధికరణం 38 లోనూ కూడ ఉంది. మన చరిత్రలో కేవలం ఆర్థిక అసమానతలు, దోపిడీయే కాక సామాజిక వివక్ష, రాజకీయ వివక్ష కూడ ఉన్నాయన్న గుర్తింపు ఇక్కడ ఉంది. ఈ అన్యాయానికి ప్రధానమైన ప్రాతిపదిక కులవ్యవస్థ అనే విషయం అందరికీ తెలుసును. కానీ గుర్తించడానికి ఎవరూ సిద్ధంగా లేరు. ముఖ్యంగా కోర్టులు సిద్ధంగా లేవు. రిజర్వేషన్ల విషయంలో ఇప్పటికి పదమూడుసార్లు సుప్రీంకోర్టును కదిలించడం జరిగింది. ఇందులో పన్నెండు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వేసిన కేసుల మీద అప్పీళ్ళు కాగా చివరిది వసంత్‌కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కర్ణాటక అనే కేసులో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు జడ్జీల సలహా కోసం చేసిన అభ్యర్థన (1985). ఈ చివరి అభ్యర్థనలో జస్టిస్ చిన్నపరెడ్డిగారు వెలిబుచ్చిన  వివరమైన అభిప్రాయాన్ని మినహాయిస్తే వేరే ఏ ఒక్క కేసులో ఏ ఒక్క న్యాయమూర్తి కూడ మన దేశంలో సామాజిక వెనుకబాటుతనానికి కులవ్యవస్థ ప్రధానమైన కారణం అని ఊగిసలాట లేకుండా ఒప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నట్టు కనిపించదు.

కులవ్యవస్థ శూద్ర, పంచమ కులాలను సామాజికంగా నీచంగా చూసింది. రాజకీయంగా హక్కులు లేకుండా చేసింది. వాళ్ళు చదువుకోడానికి వీలు లేదు. ఆస్తి కలిగి ఉండడానికి వీలు లేదు. ఆయుధాలు ధరించడానికి వీలు లేదు. ఉన్నత హోదాగల ఉద్యోగాలు చేయడానికి వీలు లేదు. చివరికి గుళ్ళలోకి పోవడానికి కూడ వీలు లేదు. ఈ అన్యాయం అన్ని కాలాలలో ఒకే రకంగా లేకపోయినా హైందవ సామాజిక వ్యవస్థలో ఎప్పుడూ ఉంటూనే వచ్చింది. ధర్మశాస్త్రాలూ, పవిత్ర గ్రంథాలూ దీనిని సిద్ధాంతీకరించాయి. ఈ కులవ్యవస్థను నాశనం చేయడం అనేది భారత రాజ్యాంగం ప్రభుత్వానికి ఆదేశించిన కర్తవ్యాలలో ముఖ్యమైనది. ఈ ఆదేశం వెనుక కులవ్యవస్థకు వ్యతిరేకంగా దేశంలో జరిగిన పోరాటాల చరిత్ర ఉంది. ఏ రాజకీయాధికారం నుంచి శూద్రులను వెలివేసారో ఆ అధికారం కోసం ఏ దేవుడి సమక్షం నుండి వెలివేసారో ఆ సాన్నిధ్యం కోసం అనేక పోరాటాలు జరిగాయి. వాటి ఫలితంగానూ, చారిత్రక మార్పుల ఫలితంగానూ కులవ్యవస్థ కొంత సడలి శూద్రులకు కొన్ని హక్కులు వచ్చాయి. కొన్ని శూద్ర కులాలకు అగ్రకుల స్థాయి లభించింది. అయితే ఎప్పుడూ మరికొందరు

సామాజిక బహిష్కృతులు ఉంటూనే ఉన్నారు. ఏ ప్రాతిపదిక మీద వారు బహిష్కృతులయ్యారో అదే ప్రాతిపదిక మీద వారికి తిరిగి గౌరవప్రదమైన జీవితంలోనికి ప్రవేశం కల్పించడం భారత ప్రజాస్వామ్యం చారిత్రక కర్తవ్యం. అధికరణ 38 లోనూ, 46 లోనూ ఉన్న ఆదేశిక సూత్రాల వెనుక ఉన్నదీ, మండల్ కమిషన్ సిఫారసు వెనుక ఉన్నదీ కూడ ఈ ఆరాటమే. చరిత్రను మర్చిపోయి ఆర్థిక వివక్ష ఒక్కటే రాజ్యాంగం గుర్తించిన వివక్ష అనడంలో అర్థం లేదు.

ఆదేశిక సూత్రాలే కాక భారత రాజ్యాంగం కులవివక్షకు వ్యతిరేకంగా ప్రాథమిక హక్కులు కూడ కల్పించింది. విద్యా, ఉద్యోగ రంగాలలో తరతరాలుగా ప్రబలంగా ఉండిన కులవ్యవస్థ ఇక చెల్లదంటూ అధికరణాలు 15(1), 16(1), 29(2)లలో పేర్కొనింది. విచిత్రం ఏమిటంటే కులవివక్షను నిషేధించే ఈ ప్రాథమిక హక్కులు ఇవ్వాళ అగ్రకులాల చేతిలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఒక వాదనగా ఉపయోగపడుతున్నాయి. చట్టం అందరికీ సమానంగా వర్తించాలనీ, అందరికీ సమానమైన సంరక్షణ కల్పించాలనీ చెప్పే అధికరణం 14 ను భూస్వాములు భూసంస్కరణలకు వ్యతిరేకంగా వాడుకోలేదా? సమాజంలో బలహీనులకు సహాయపడడానికి ఉద్దేశించిన శాసనాలను వాళ్ళకు వ్యతిరేకంగానే బలవంతులు వాడుకోవడం చరిత్రలో తరచు జరుగుతూనే ఉంటుంది. దేశంలో కులవ్యవస్థ లేకపోతే, అగ్రకులాలు చదువును, రాజ్యాధికారాన్ని, గౌరవప్రదమైన ఉద్యోగాలను నూటికి 27% కాదు, 50% కాదు, నూటికి 100% తమకే రిజర్వు చేసుకోకపోతే భారత రాజ్యాంగంలో 15(1), 16(1), 29(2) అసలు ఉండేవే కావు. ఆ సంప్రదాయక రిజర్వేషన్లను సమీప భవిష్యత్తులోనైనా తొలగించాలంటే చదువు నుండి, ఉద్యోగాల నుండి బహిష్కృతులైన వారికి ఆయా రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలని శాసనం చేస్తే ఆ శాసనం 15(1), 16(1), 29(2)కు వ్యతిరేకం అని అగ్రకులాలే కోర్టుకు ఎక్కుతున్నారు.

భారత రాజ్యాంగాన్ని రూపొందించినప్పుడు అధికరణం 15లో మూడు క్లాజులే ఉండేవి. అవి

15 (1): పౌరుల పట్ల ప్రభుత్వం జాతి, మత, లింగ, కుల, ప్రాంతాల ప్రాతిపదిక మీద వివక్ష పాటించడానికి వీలు లేదు.

(2): జాతి, మత, లింగ, కుల, ప్రాంతాల ప్రాతిపదిక మీద పౌరులెవ్వరికీ కూడ (అ) దుకాణాలు, హోటళ్ళు, ప్రదర్శన స్థలాల్లోకి ప్రవేశం గానీ

(ఆ) బావుల, చెరువుల, స్నానస్థలాల, ప్రజావసరాల నిమిత్తం నిర్మించిన బహిరంగ ప్రదేశాల, మొత్తంగానో పాక్షికంగానో ప్రభుత్వం ఖర్చుతో నిర్మించిన బహిరంగ ప్రదేశాల ఉపయోగం గానీ నిరాకరించడానికి వీలు లేదు.

(3): అయితే స్త్రీల కోసం, పిల్లల కోసం ప్రభుత్వం కల్పించే ప్రత్యేక సదుపాయాలకు ఈ అధికరణం అడ్డు రాదు.

ఈ అధికరణం అన్ని రకాల వివక్షను పేరుపేరునా పేర్కొని నిషేధించింది. అసలు 15(2) ను చూస్తేనే ఇది ప్రధానంగా కులవ్యవస్థను గురించి మాట్లాడుతోందని అర్థమవుతుంది. అయినా సుప్రీంకోర్టుకు మట్టుకు ఎంత గింజుకున్నా అర్థం కాలేదు. సుప్రీంకోర్టు రిజర్వేషన్లపై ఇచ్చిన తీర్పులలో భారత సామాజిక వ్యవస్థ యొక్క చరిత్రను గుర్తించ నిరాకరించిందని జస్టిస్ ఇ.ఎస్. వెంకట్రామయ్య వెలిబుచ్చిన అభిప్రాయంతో ఏకీభవించక తప్పదు.

అధికరణం 16 లోని అయిదు క్లాజులలో మూడు మాత్రమే ప్రస్తుత వివాదానికి అవసరం.

(16) (1): ఏ ప్రభుత్వ ఉద్యోగం విషయంలోనైనా, పదవి విషయంలోనైనా పౌరులందరికీ సమాన అవకాశాలు ఉండాలి.

(2): పౌరులెవ్వరినీ కూడా జాతి, కుల, మత, లింగ, వంశ, ప్రాంతాల ప్రాతిపదిక మీద ప్రభుత్వ ఉద్యోగాలకు కానీ, పదవులకు కానీ అనర్హులుగా భావించకూడదు. వివక్ష పాటించకూడదు.

(4): అయితే ప్రభుత్వ ఉద్యోగాలలోనూ, పదవులలోనూ తగు ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పిస్తే దానికి ఈ అధికరణం అడ్డం రాదు.

ఈ అధికరణం కూడ అన్నిరకాల వివక్షనూ పేరుపేరునా పేర్కొన్నా ఉద్యోగాలకు, పదవులకు మనుషులలో కొందరిని అనర్హులుగా భావించింది కులం ప్రాతిపదిక మీద కాబట్టి, ఇది కూడ కులవ్యవస్థ గురించే ప్రధానంగా మాట్లాడుతుంది. 16(4)లో వెనుకబడిన వర్గాలు అని పేర్కొన్నవి కులాలు కాజాలవని ఎవరెంత వాదించినా అవి ప్రధానంగా కులాలేనని మన చరిత్రే చెప్తుంది.

అధికరణం 29లోని రెండవ క్లాజు మాత్రమే ప్రస్తుత వివాదానికి అవసరం.

29 (2): ప్రభుత్వం నిర్వహించే లేక ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందే ఏ విద్యాసంస్థలోనైనా ఒక వ్యక్తికి మతం, జాతి, కులం లేక భాష కారణంగా ప్రవేశం నిరాకరించడానికి వీలులేదు.

శతాబ్దాలుగా కులవివక్షకు గురైన శ్రామిక ప్రజానీకానికి విద్య, ఉద్యోగ రంగాలలో ప్రవేశహక్కు కల్పించడం కోసం ఉద్దేశింపబడ్డ ఈ ప్రాథమిక హక్కులను వాళ్ళ కంటే ఎక్కువగా, వాళ్ళకే వ్యతిరేకంగా వాడుకున్నది అగ్రకులాలే. పూర్తిగా బ్రాహ్మణ ఆధిక్యత చలామణి అయిన మద్రాసు రాష్ట్రంలో బ్రాహ్మణేతరులకు విద్యారంగంలో ప్రవేశం కల్పించడం కోసం రిజర్వేషన్లు కల్పిస్తే అది 15(1)కి, 29(2)కు వ్యతిరేకం అంటూ శ్రీమతి చంపకం దొరైరాజన్ స్వాతంత్ర్యం వచ్చిన కొద్దికాలానికే కోర్టుకెక్కారు. సుప్రీంకోర్టు ఆమె వాదనను అంగీకరించి రిజర్వేషన్‌ను కొట్టేసింది. అప్పుడు భారత పార్లమెంటు 1951లో మొట్టమొదటి రాజ్యాంగ సవరణను తీసుకొచ్చి 15(4)ను భారత రాజ్యాంగానికి చేర్చింది.

15 (4): షెడ్యుల్డు కులాలు, తెగలు లేక సామాజికంగాను, విద్యాపరంగాను వెనుకబడ్డ వర్గాల పురోగమనం కోసం ప్రభుత్వం ఏమైనా ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తే అది ఈ అధికరణానికి విరుద్ధం కాదు.

కులవివక్ష పాటించడానికి వీలులేదని అధికరణం 15(1)లో ఇచ్చిన ప్రాథమిక హక్కు వాస్తవం కావాలంటే ఇన్నాళ్ళూ కులవివక్షకు గురి అవుతూ ఉన్నవారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించడం అవసరమని కొంచెం ఆలోచిస్తే అర్థమవుతుంది. అంటే 15(4)ను కొత్తగా రాజ్యాంగానికి చేర్చనవసరం లేదనీ, అది 15(1)లో అంతర్లీనంగా ఉండనే ఉందనీ అనిపిస్తుంది. కాని సుప్రీంకోర్టు ఈ అవగాహనకు ఎదగడానికి పాతికేళ్లు పట్టింది. స్టేట్ ఆఫ్ కేరళ వర్సెస్ ఎన్.ఎమ్.థామస్ (1976) కేసులో జస్టిస్ రే, మాథ్యూ, ముర్తజా ఫజల్ అలీ, బేగ్, కృష్ణయ్యర్‌లు ఈ అభిప్రాయానికి వచ్చారు. అంతవరకు 15(4) కానీ, 16(4)కానీ ప్రభుత్వానికి రిజర్వేషన్లు కల్పించే అవకాశాన్ని మాత్రమే కల్పిస్తాయనీ, కులవివక్ష పోవాలంటే రిజర్వేషన్లు కల్పించి తీరాలని రాజ్యాంగం చెప్పలేదనీ సుప్రీంకోర్టు భావిస్తూ వచ్చింది.

మొదటి రాజ్యాంగ సవరణ జరిగినప్పటి నుండి రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు రెండు సందేహాలతో కొట్టుమిట్టాడుతోంది. సామాజికంగానూ,

విద్యాపరంగానూ వెనకబడ్డ వర్గాలు ఏవని గుర్తించడానికి కులం ఏకైక లేక ప్రధాన ప్రాతిపదిక కాగలదా అనేది ఒక సందేహం. మొత్తం రిజర్వేషన్లకు ఒక గరిష్ట పరిమితి ఉండనక్కరలేదా అనేది రెండో సందేహం. ఈ రెండు సందేహాలకు బాలాజీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మైసూర్ (1963) కేసులో జస్టిస్ గజేంద్ర గడ్కర్ సమాధానం చెప్పారు. వెనుకబాటుతనాన్ని గుర్తించడానికి కులం కూడ ఒక ప్రమాణం కాగలదు కానీ అదే ఏకైక లేదా ప్రధాన ప్రమాణం కాజాలదని ఆయన అన్నారు. ఆ తరువాత వచ్చినటువంటి చిత్రలేఖ వర్సెస్ స్టేట్ ఆఫ్ మైసూర్ (1964) కేసులో జస్టిస్ కోకా సుబ్బారావు మరొకడుగు వెనుకకు వేసి అసలు కులాన్ని పరిగణనలోకి తీసుకోకుండానే వెనుకబాటుతనాన్ని నిర్ణయించినా అందులో తప్పేమీ లేదని తీర్పు చెప్పారు. 15(4)లో వెనుకబడిన వర్గాలు అన్నమాట ప్రయోగించారనీ, కులాన్నే ఉద్దేశించి ఉంటే కులం అనే వుండేవారనీ ఆయన అన్నారు. విజ్ఞులైన సుబ్బారావుగారు మొదటి రాజ్యాంగ సవరణ సందర్భంలో 'వెనుకబడ్డ వర్గాలు అనేవి కొన్ని కులాల సముదాయం తప్ప మరేమీ కాదు' అని డా॥ అంబేడ్కర్ వెలిబుచ్చిన అభిప్రాయాన్ని పట్టించుకున్నట్టు లేదు.

రిజర్వేషన్లకు గరిష్ట పరిమాణం ఉండన్కరలేదా అనే ప్రశ్నకు కూడ బాలాజీ కేసులో జస్టిస్ గజేంద్ర గడ్కర్ సమాధానం ఇచ్చినట్లు చెప్తారు. మొత్తం రిజర్వేషన్లు 50% మించి ఉండరాదని ఆయన అన్నాడని ఆనాటి నుండి ఈనాటి దాకా కోర్టులోనూ, కోర్టు బయటా వాదిస్తున్నారు. కానీ నిజానికి ఆయన అంత స్పష్టమైన సమాధానం ఏమీ చెప్పలేదు. తాను చాలా సంశయంతో చెప్తున్నానని అంటూ 'సాధారణ పరిస్థితులలోనూ, స్థూలంగానూ చెప్పాలంటే ప్రత్యేక సదుపాయాలు 50% మించి ఉండరాదు' అని మాత్రమే ఆయన అన్నారు.

సుప్రీంకోర్టు ఏమన్నా, రాజకీయ నిర్ణయాలు సామాజిక పరిస్థితులకు స్పందించక తప్పదు కాబట్టి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానంగా కులం ప్రాతిపదిక మీదనే రిజర్వేషన్లు కల్పిస్తూ వచ్చాయి. ఏ కులాలు వెనుకబడినవి అని నిర్ణయించడానికి విద్యారంగంలో వెనుకబాటుతనాన్ని, సామాజిక ఆచారాలలో వెనుకబాటుతనాన్ని ప్రధాన ప్రమాణాలుగా తీసుకున్నాయి. సుప్రీంకోర్టు ప్రవచనాలకూ ఈ రాజకీయ ఆచరణకూ మధ్యనున్న వైరుధ్యాన్ని వాడుకుని అగ్రకులాల వాళ్ళు ఎప్పటికప్పుడు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా రిట్ పిటిషన్లు వేస్తూ వచ్చారు. 1970 తర్వాతే సుప్రీంకోర్టు తన అవగాహనను కొద్దిగా మార్చుకుంది. వెనుకబాటుతనాన్ని నిర్ణయించడానికి కులమే ఏకైక లేక ప్రధాన ప్రమాణం కాజాలదన్న అభిప్రాయాన్ని ఇప్పటికీ వదులుకోలేదు

కానీ వేరే ప్రమాణాల్ని ఉపయోగించినప్పటికీ కొన్ని కులాలు మొత్తంగా వెనుకబడినవని నిర్ధారిస్తే అప్పుడు కులం ప్రాతిపదిక మీద రిజర్వేషన్లు కల్పించడంలో తప్పేమీ లేదని సుప్రీంకోర్టు రాజేంద్రన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మద్రాసు (1968), స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వర్సెస్ బలరామ్ (1972) కేసులలో అనింది. పెరియకరుప్పన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ తమిళనాడు (1971) కేసులో మరింత స్పష్టంగా కులం కూడ ఒక వర్గమేనంటూ 'మన దేశంలో సామాజికంగానూ, విద్యాపరంగానూ వెనుకబడిన కులాలు అనేకం ఉన్నాయనేది కాదనలేని వాస్తవం. వాటి ఉనికిని కాదనడం వాస్తవాలను కాదనడం అవుతుంది' అనింది. సామాజిక వెనుకబాటుతనానికి పేదరికం ప్రమాణం కాజాలదంటూ జానకీప్రసాద్ పరిమూ వర్సెస్ స్టేట్ ఆఫ్ జమ్ము కాశ్మీర్ కేసులో సుప్రీంకోర్టు ఈ విధంగా వ్యాఖ్యానించింది. 'పేదరికాన్నే ఏకైక ప్రమాణంగా తీసుకొనేట్టయితే భారత జనాభాలో అత్యధిక శాతాన్ని సామాజికంగానూ, విద్యాపరంగాను వెనుకబడినవారుగా గుర్తించవలసి ఉంటుంది. అప్పుడు ఆర్థిక ప్రాతిపదిక మీద కల్పించే రిజర్వేషన్లు సామాజికంగానూ, విద్యాపరంగానూ అభివృద్ధి చెందినవారిగా అందరూ భావించేవారికి కూడ వర్తిస్తాయి. ఇది అసంబద్ధమైన పరిస్థితి'.

రిజర్వేషన్లకు 50% గరిష్ట పరిమితి ఉండాలన్న సూచనను కూడ తరువాత కాలంలో సుప్రీంకోర్టు నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. స్టేట్ ఆఫ్ కేరళ వర్సెస్ ఎన్.ఎమ్.థామస్ కేసులో జస్టిస్ రే, బేగ్, ముర్తజా ఫజల్ అలీ, కృష్ణయ్యర్‌లు అటువంటి పరిమితి చెల్లదన్నారు. 'ఒక రాష్ట్రంలో వెనుకబడ్డ తరగతుల జనాభా 80 శాతం వుంటే, వాళ్ళకు ఉద్యోగాలలో 80 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకుంటే అది తప్పవుతుందా' అని జస్టిస్ ఫజల్ అలీ ప్రశ్నించారు. వసంత్ కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కర్ణాటక కేసులో తన అభిప్రాయాన్ని చెపుతూ జస్టిస్ చిన్నపరెడ్డి రిజర్వేషన్లకు గరిష్ట పరిమితిని నిర్ణయించే అధికారం కోర్టుకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. రిజర్వేషన్లు 40 శాతం, 50 శాతం, 60 శాతం దాటడానికి వీలులేదని నిర్దేశించడానికి కోర్టుకు ఆధారాలేమీ లేవని ఆయన అన్నారు. రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించడంలో సామర్థ్యం ఉంటే చాలదనీ, మనం వ్యాఖ్యానిస్తున్న రాజ్యాంగం 20వ శతాబ్దపు మధ్య భాగంలో ఒక సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో నుంచి పుట్టిందనీ, ఇంతకంటే ఉన్నతమైన ప్రపంచం కోసం అన్వేషించిన విప్లవాల చేత ప్రభావితమైందనీ, అందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కల్పించాలన్న ఆదర్శానికి అది కట్టుబడి ఉందనీ జ్ఞాపకం ఉంచుకోవాలని ఆయన అన్నారు.

## II. ప్రతిభ

ఇకపోతే, రిజర్వేషన్ల వల్ల ప్రతిభ పోతుందన్న వాదనకు వద్దాం. మనది ప్రజాస్వామ్యం అని గర్వించే వాళ్ళు అన్ని విషయాల గురించీ ప్రజాస్వామికంగా ఆలోచించడం నేర్చుకోవాలి. ప్రతిభ గురించి, సామర్థ్యం గురించి కూడ ప్రజాస్వామికంగా ఆలోచించడం నేర్చుకోవాలి. రిజర్వేషన్ల మీద కాలేజీ సీట్లు, ఉద్యోగాలు సంపాదించుకునే వాళ్ళకు ప్రతిభ ఉండదనీ, ప్రతిభ గల అగ్రకులాల యువకులకు తత్ఫలితంగా సీట్లు, ఉద్యోగాలు రాకుండా పోయి దేశం నష్టపోతుందనీ వాదిస్తున్నారు. ఈ వాదన ఎక్కడిదాకా పోతూ ఉందంటే అగ్రకులాలకు మాత్రమే ప్రతిభ ఉంటుందని, ఇతరులు చేతకాని వాళ్ళని స్పష్టంగా ధ్వనించడం మొదలైంది. రిజర్వేషన్లు ఎయిడ్స్ అంత ప్రమాదకరమైన వ్యాధి అని, వెనుకబడిన కులాల్లో పుట్టి రిజర్వేషన్ల మీద వైద్యులైన వాళ్ళు కాలు తీయమంటే కన్ను తీసేస్తారని, ఇంజనీర్లు వంతెనలు కడితే కూలిపోతాయని పోస్టర్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తున్నారు. పత్రికలలో కార్టూన్లు వేస్తున్నారు. మండల్ కమిషన్ సిఫారసు అమలు జాతి వినాశనానికి నాంది పలుకుతుందని అరుణ్‌శౌరి వంటి మేధావులు అసహ్యాకరమైన ప్రచారం చేస్తున్నారు. అగ్రవర్ణాల కుల అహంకారం పట్టం కట్టుకుని నిరాఘాటంగా దేశ రహదారుల మీద ఊరేగుతోంది.

తిట్టుకు తిట్టుతో సమాధానం చెప్పడం తేలికే. 43 ఏళ్ళుగా ఈ దేశాన్ని పరిపాలిస్తున్న వాళ్ళలో అత్యధికులు అగ్రవర్ణాలకు చెందినవాళ్ళే. రాజకీయ నాయకులే కాదు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారస్తులు, భూస్వాములు, వైజ్ఞానికులు, బ్యూరోక్రాట్లు, సాంకేతిక నిపుణులు, యావత్ భారత భాగ్య విధాతలు 99 శాతం వాళ్ళే. 43 ఏళ్ళలో వాళ్ళు దేశాన్ని ఎక్కడిదాకా తెచ్చారో చూస్తూనే ఉన్నాం. 50 కోట్ల నిరక్షరాస్యులు, 40 కోట్ల పేదలు, 2 కోట్ల మంది నమోదయిన నిరుద్యోగులు, వ్యవసాయ పారిశ్రామిక రంగాలలో మాంద్యం, రాజకీయ సామాజిక సంక్షోభం – ఇక్కడిదాకా తెచ్చింది వీళ్ళ 'ప్రతిభ' దేశాన్ని. ఈ ప్రతిభ ఇంకింత రాణించకపోతే మించిపోయిందేమిటో అర్థం కాదు. తప్పుడు వైద్యం చేసే వైద్యుల జాబితా, కూలిపోయిన వంతెనలు కట్టే ఇంజనీర్ల జాబితా తయారు చేస్తే అందులో అంతా అగ్రకులాల వారే ఉంటారనడానికి ఎటువంటి సందేహం అక్కరలేదు.

అయితే ఈ విషయాన్ని కొంచెం లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రతిభను గురించి మాట్లాడుతున్న వాళ్లు ఆ మాటకు ఇస్తున్న నిర్వచనం ఏమిటి?

దానిని కొలవడానికి ఉపయోగిస్తున్న ప్రమాణం ఏమిటి? విద్యారంగంలో రాణించడమే ప్రతిభ అని, పరీక్షలలో వచ్చే మార్కులే దానికి కొలమానం అని వీళ్ళ అభిప్రాయం. ఇదే నిజమైనా ఇంటా, బయటా సమానమైన అవకాశాలు కల్పిస్తే దళితులు కూడ వీళ్ళతో సమానంగా రాణించగలరు. ఆ విషయాన్ని పక్కకు పెట్టి ప్రతిభకు వీళ్ళిస్తున్న నిర్వచనాన్ని కొంచెం పరిశీలిద్దాం.

పరీక్షలలో మార్కులు వచ్చే వాళ్ళందరికీ విషయ పరిజ్ఞానం ఉంటుందా? విషయ పరిజ్ఞానం ఉన్నవాళ్ళందరికీ పనిలో సామర్థ్యం ఉంటుందా? ఫస్టు మార్కులు వచ్చిన వైద్యులు, ఇంజనీర్లు తమ వృత్తులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారా? అవునని అనుకోవడమే కాని దీని గురించి ఎవరైనా విషయ సేకరణ చేసారా? సామర్థ్యం ఉన్నా అది సమాజానికి ఉపయోగపడి తీరుతుందా? చాలా సామర్థ్యం ఉన్న వైద్యుడు కంప్యూటరైజ్డ్ డయాగ్నొస్టిక్ సెంటర్‌లోనో, ఏర్‌కండిషన్డ్ ఫైవ్‌స్టార్ ఆసుపత్రిలోనో పనిచేయవచ్చును. చాలా సామర్థ్యంగల ఇంజనీర్ ధనికుల కోసం అత్యంత ఆధునికమైన బంగళాలు డిజైన్ చేయడంలో తన సామర్థ్యాన్నంతా వినియోగించవచ్చు. చాలా సామర్థ్యం గల వైజ్ఞానికుడు ప్రపంచాన్ని నాశనం చేసే అణ్వాయుధాల తయారీలో తన సామర్థ్యాన్నంతా వినియోగించవచ్చును. అంతేకాదు. వీళ్ళు తమ సామర్థ్యాన్నంతా నీతి బాహ్యమైన పనులలో వెచ్చించవచ్చును. స్మగ్లర్‌లు, లంచగొండ్లు, దొంగ వ్యాపారస్తులు కావచ్చును. ఇవేవీ కాకపోయినా తమ సామర్థ్యాన్ని ఈ దేశ ప్రజల మేలు కోసం వినియోగించాలన్న పట్టింపు లేకుండా డిగ్రీ సంపాదించుకోగానే విదేశాలకు పోవచ్చును. విద్యారంగంలో అత్యధికంగా రాణించే వాళ్లు ఈ పనే చేస్తున్నారు. వీళ్ళ విద్య మీద ఈ దేశ ప్రజలు కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. ఆ ఖర్చు లేకపోతే వీళ్ళ ప్రతిభ అసలు రాణించేది కాదు. కానీ వీళ్ళు ప్రజలకు అందుకు మారుగా ఏమీ ఇవ్వకపోగా ప్రజలకు అందుబాటులో లేని వృత్తులలోనికో విదేశాలకో పోతున్నారు.

మనిషికి ఉండే విలువలను ప్రస్తావించకుండా ప్రతిభను గురించి, సామర్థ్యాన్ని గురించి మాట్లాడడంలో అర్థం లేదు. ప్రజల క్షేమాన్ని గురించి పట్టింపు, పనిలో నిమగ్నత ఉండే వాళ్ళ సామర్థ్యం వల్లనే ప్రజలకు మేలు జరుగుతుంది. అదే సామాజికంగా ఉపయోగకరమైన సామర్థ్యం. ఇవ్వాళ బంగారు పతకాలు పొందుతున్న విద్యార్థులలో ఈ రకమైన విలువలున్నాయా?

మరొక ప్రశ్న కూడ వేసుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగాలు ప్రతిభ ఉన్నవాళ్ళకే ఇవ్వాలంటున్నారు. ప్రతిభకు ఇస్తున్న నిర్వచనాన్ని పక్కకు పెట్టి, ఇది ఒక్క ప్రభుత్వ ఉద్యోగాలకేనా లేక అన్నిటికీ వర్తిస్తుందా? కొడుకుకు ప్రతిభ ఉంటేనే తండ్రి ఆస్తికి వారసుడు అవుతున్నాడా? ప్రతిభ ఉన్నా లేకపోయినా తండ్రి ఆస్తి కొడుకుకే రిజర్వు అయిపోలేదా? భూమిగల వాళ్ళందరికీ వ్యవసాయం చేయడంలో ప్రతిభ ఉందా? సేద్యం చేయడంలో ప్రతిభ ఉన్నవాళ్ళకే భూమి అంతా పంచేస్తామంటే ఒప్పుకుంటారా? చెప్పులు కుట్టేవాళ్ళకే చెప్పుల ఫ్యాక్టరీలు చెందాలనీ, బట్టలు నేసే వాళ్ళకే బట్టల ఫ్యాక్టరీలు చెందాలనీ, మూటలు మోసేవాళ్ళకే గోడౌన్లు చెందాలనీ చట్టం చేస్తే ఒప్పుకుంటారా? ఆస్తిలో కానీ, ప్రైవేటు సెక్టర్ ఉద్యోగాలలో కానీ, ప్రైవేటు కళాశాలల సీట్లలో కానీ వారసత్వానికి, బంధుత్వాలకు, రికమెండేషన్లకు, 'మావాడు' అనే సామాజిక సంబంధానికి ఉన్న ప్రాధాన్యం ప్రతిభకు లేదు. దీనివల్ల నూటికి 90 శాతం ప్రయోజనం పొందుతున్నది అగ్రకులాల వాళ్లే. వాళ్ళ యాజమాన్యంలో లేని ప్రభుత్వ ఉద్యోగాలలో తమకు ప్రవేశం కావాలని దళితులు కోరుకుంటే ఇంత దుమారం లేపుతున్నారు. సమాజంలోని అన్ని వనరులనూ ఆక్రమించుకున్న వాళ్ళు ప్రభుత్వ ఉద్యోగాలనే ఈ చిన్న వనరును కూడ దళితులతో పంచుకోవడానికి సిద్ధంగా లేరు. ఆస్తి నుండి ఉద్యోగాల దాకా అన్ని వనరులలోనూ జనాభా ప్రాతిపదిక మీద ప్రవేశం డిమాండ్ చేస్తే ఆకాశమే బద్దలవుతుందో, ప్రళయమే వచ్చేస్తుందో.

ప్రతిభ పోతూవుందని గొంతు చించుకుంటున్నవాళ్ళంతా తమకు ప్రతిభ ఉందనీ, అది తమ స్వంతం అనీ, దానికి గుర్తింపు ఇవ్వడం దేశానికి మంచిదనీ భావిస్తున్నారు. వాళ్ళకు ఏ పాటి ప్రతిభ వుందో వాళ్ళ వృత్తులలో వాళ్ళు వెలగబెడుతున్న నిర్వాకం తెలుపుతుంది. ఒకవేళ ఉన్నా ఆ ప్రతిభ వాళ్ళ సొంతం కాదు. అది సామాజికమైనది. ఒక వ్యక్తికి గల ప్రతిభ వెనుక మూడువేల సంవత్సరాల చారిత్రక విజయాలు ఉన్నాయి. ఇవ్వాళ తన చుట్టూవున్న కోట్లాది ప్రజల శ్రమ ఉంది. ఆ చారిత్రక విజయాలను అందరికీ సమంగా దక్కనివ్వలేదు. ఈ శ్రమ ఫలాన్నీ దక్కనివ్వడం లేదు. చరిత్ర, నాగరికత కొందరి వారసత్వం అయ్యాయి. కులవ్యవస్థ కొందరిని నాగరికత నుండి బహిష్కరించింది. కొందరికి దాని విజయాలను కట్టబెట్టింది. ఆ సంపదంతా అనుభవించనిదే ఎవ్వడూ 'ప్రతిభావంతుడు' కాలేదు. అగ్రకులాలకు చెందిన వాళ్ళకు చారిత్రక కారణాల వల్ల మూడు సహస్రాబ్దాల సాంస్కృతిక ప్రగతి ఎక్కువగా అందుబాటులో ఉంది. అది దళితులకు లేదు.

చదువుకోవడానికి ఆస్తిపరులకుండే అవకాశాలు ఆస్తిహీనులకు లేనట్టే అగ్రకులాలకు ఉండే అవకాశాలు దళితులకు లేవు. తమ 'ప్రతిభ'ను సంపాదించుకొనడంలో తాము కులవ్యవస్థకు ఎంతగా రుణపడి ఉన్నారో రిజర్వేషన్ వ్యతిరేకులకు అర్థం అయినట్టు లేదు. దళితుల శ్రమ ఫలితం అయిన నాగరికతను వాళ్ళకు కాకుండా చేయడమే కాక తాము స్వంతం చేసుకుని ఇప్పుడు అదంతా తమ స్వంత ప్రతిభేననుకుంటున్నారు. ఈ అహంభావం వాళ్లు ఎంచుకుంటున్న ఆందోళన రూపాలలోనే ఉంది. రోడ్లు ఊడవడం, బూట్లు పాలిష్ చేయడం, మూటలు మోయటం మొదలయినవన్నీ ఆయా వృత్తుల పట్ల న్యూనతాభావంతో చేస్తూన్న పనులే తప్ప వేరే కాదు. అవన్నీ దళితులు చేయవలసిన పనులనీ, రిజర్వేషన్ల వల్ల దళితులు ఇంజనీర్లూ, డాక్టర్లూ అయిపోతే తాము ఈ నీచ వృత్తులు చేపట్టవలసి వస్తుందనీ ఈ చర్యల ద్వారా చెప్తున్నారు. ఈ అహంభావ ప్రదర్శనకు దళితులు రెచ్చిపోతే దానికి బాధ్యులు ఎవరు?

## III. కుల ప్రాతిపదిక – ఆర్థిక ప్రాతిపదిక :

రిజర్వేషన్లకు కుల ప్రాతిపదిక బదులు ఆర్థిక ప్రాతిపదిక ఉండాలనీ, ఏ కులానికి చెందినా పేదవాళ్ళంతా ఒకటేననీ ఒక వాదన ఉంది. సుప్రీంకోర్టు కూడ ఈ అభిప్రాయాన్ని పదేపదే వ్యక్తం చేసింది. దేశంలోని మేధావులలో అత్యధిక భాగం ఇవ్వాళ ఇదే అభిప్రాయాన్ని కలిగివున్నారు.

కులాన్ని చూడదలచుకోని వాళ్లకు ఇది చాలా ఆకర్షణీయమయిన వాదనగా అనిపిస్తుంది. ఈ వాదన నిజమయితే ఎంతో బాగుండును కూడ. కానీ దురదృష్టవశాత్తూ అది నిజం కాదు. కేవలం ఆర్థిక ప్రాతిపదిక మీదనే రిజర్వేషన్లు కల్పిస్తే సమాజంలో 15 శాతం లోపు ఉన్న అగ్రకులాలు మొత్తం రిజర్వేషన్లను కొట్టేస్తారనడంలో ఎటువంటి సందేహం లేదు.

విద్యకూ, తెల్లబట్టల ఉద్యోగాలకూ పుస్తక విజ్ఞానం ప్రాతిపదిక. పుస్తక విజ్ఞానం సాంస్కృతికమయినది. పుస్తకాలలో మనం నేర్చుకునేది కేవలం విషయ పరిజ్ఞానం కాదు. ఒక సంస్కృతిని, భావ వాతావరణాన్ని, ప్రాపంచిక దృక్పథాన్ని, అందులో అంతర్భాగంగా విషయ పరిజ్ఞానాన్ని పొందుతాం. ఇవ్వాళ విద్యారంగంలో చలామణి అవుతున్న సంస్కృతి తరతరాల భారతీయ సంస్కృతీ, దానికి కొత్తగా తెచ్చి అతికించుకున్న ఆంగ్లేయ సంస్కృతీ. అందుకే పుస్తక విద్య ఈ భారతీయ సంస్కృతికి అసలుసిసలు వారసులయిన బ్రాహ్మణులకూ, బ్రాహ్మణీకరణ చెందిన

ఇతర అగ్రకులాలకూ అబ్బినంత సులభంగా ఇతరులకు అబ్బదు. ఇంగ్లీష్ చదువులనూ, తెల్లవాడి సంస్కృతినీ కూడ ఈ కులాల వాళ్లే ముందు ఆశ్రయించారు కాబట్టి కొత్తగా అతికించుకున్న ఆంగ్లేయ సంస్కృతి కూడ వాళ్లకు ఒంటబట్టినంత సులభంగా ఇతరులకు ఒంటబట్టదు. ఉదాహరణకు ఒక భారతీయుడిని అమెరికాకు తీసుకుపోయి స్కూల్లో ప్రవేశపెట్టి స్థానికులతో సమంగా పోటీపడమంటే చాలా కష్టపడతాడు. ఆర్థికంగా వాళ్ళతో సమానమయినా, తనది కాని సంస్కృతిలో, తనది కాని భావ వాతావరణంలో అతను తెల్లవాళ్ళతో సరితూగలేడు. ఈ విషయాన్ని అక్కడున్న భారతీయులు (ఎక్కువగా అగ్రకులాలవాళ్లు) గుర్తించి, తమకు ప్రత్యేక రాయితీలు కావాలని గొడవచేస్తున్నారు. ఇక్కడ మట్టుకు దళితులు రాయితీలు అడగటానికి వీలులేదని, చేతనైతే తమతో సమంగా పోటిపడి గెలవాలనీ రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారు.

అసలు విజ్ఞానానికీ, సామర్థ్యానికీ, ప్రతిభకూ ఇస్తున్న నిర్వచనమే చాలా వివక్షతో కూడుకుని ఉంది. ప్రజలకు తమ జీవన విధానాన్ని అనుసరించి అనేక విషయాలను గురించి విజ్ఞానం ఉంటుంది. వ్యవసాయాన్ని గురించి ఎంతో పరిజ్ఞానం లేనిదే రైతు పంటలు పండించలేడు. బట్టలు నేసేవాళ్లు, రంగులు అద్దేవాళ్ళు, కుండలు చేసేవాళ్ళు, కల్లు తీసేవాళ్లు, సహస్ర వృత్తుల ఈ జనానికి ఎంతో విషయ పరిజ్ఞానం ఉంటుంది. అయితే దీనికి విజ్ఞానంగా మన దేశంలో గుర్తింపు లేదు. బ్రాహ్మణ సంస్కృతి వీళ్ల శ్రమను నీచంగా చూసినట్టే, వీళ్ల విజ్ఞానాన్నీ తృణీకారభావంతో చూసింది. ఆధునిక కాలంలోనైనా శాస్త్ర సాంకేతిక విజ్ఞానం ఈ శ్రామిక ప్రజల సాంప్రదాయక విజ్ఞానం నుండి ఆవిర్భవించిందా అంటే అదీ లేదు. పాశ్చాత్య దేశాల నుండి దిగుమతి అయింది. సంప్రదాయక బ్రాహ్మణ సంస్కృతినీ, పాశ్చాత్య దేశాల నుండి దిగుమతి అయిన భావాలనూ, సాంకేతిక విజ్ఞానాన్నీ కలగలిపి మన స్కూళ్ళలోనూ, కాలేజీలలోనూ సిలబస్ తయారు చేసుకున్నాం. ప్రజలకుండే విజ్ఞానానికి ఈ సిలబస్‌లో గుర్తింపు లేదు. ఈ సిలబస్ 'విజ్ఞానం'గా గుర్తిస్తున్నదానికి ప్రజల నిత్య జీవితంలో స్థానం లేదు. ఈ రకంగా రూపొందిన విద్యారంగంలో రాణించడాన్ని 'ప్రతిభ' గా గుర్తిస్తే ఆ 'ప్రతిభ' బ్రాహ్మణ సంస్కృతిలోనూ, పాశ్చాత్య సంస్కృతిలోనూ పెరిగిన వాళ్లకు అబ్బినంత సులభంగా ఇతరులకు అబ్బదు. స్కూలు పాఠ్యపుస్తకాలలో నుండి తిక్కన భారతం పద్యాలనూ, కెనడీ, అబ్రహాం లింకన్‌ల జీవిత గాథలనూ తొలగించి బట్టల మగ్గాల గురించీ, నాగలి కర్రు గురించీ పాఠ్యాంశాలు పెడితే బ్రాహ్మణుల పిల్లలూ, ఆఫీసర్ల ఇళ్ళలోని కాన్వెంట్ సంస్కృతిలో పుట్టిన పిల్లలూ

శ్రామిక కులాల పిల్లలతో పోటీపడడానికి ఎంత కష్టపడతారో ఊహించడం కష్టం కాదు. విజ్ఞానానికి ప్రస్తుతం ఇస్తున్న అప్రజాస్వామిక నిర్వచనాన్నయినా తొలగించాలి లేదా ఇదే విజ్ఞానం అనుకుంటే ఆ 'విజ్ఞానం' శ్రామిక కులాల నిత్యజీవితంలోనూ, సంస్కృతిలోను భాగం అయ్యేదాకా వాళ్లకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలి. ఈ రిజర్వేషన్ల వల్ల అసమర్థులూ, సోమరులూ తయారవుతారనే వాదన కుల అహంకారం నుండి పుట్టినదేగాని వాస్తవం కాదు. రిజర్వేషన్లతో కాలేజీలో ప్రవేశించిన వాళ్లు చాలా మంది కష్టపడి చదివి ఫస్టు ర్యాంక్ సంపాదించుకుంటున్నారు. తమ ఉద్యోగాలలో రాణిస్తున్నారు. అయితే ఒకరిద్దరు ఇట్లా రాణించినంత మాత్రాన సరిపోదు. వాళ్ల జీవితాలకూ, ప్రస్తుత విద్యావిధానానికీ మధ్యనున్న కృత్రిమమయిన అంతరం తొలగిపోయే వరకు రిజర్వేషన్లు ఇవ్వడం అవసరం.

రిజర్వేషన్లకు ఆదాయపరిమితి పెట్టాలనీ లేదా ఒక తరం తరువాత ఇవ్వకూడదనీ ఒక వాదన ఉంది. ఇది పైకి ఆకర్షణీయంగా కనిపిస్తుంది గానీ కొంచెం లోతుగా ఆలోచించడం అవసరం. అసలు దేనికయినా ఆదాయపరిమితి అనేది మన దేశంలో ఆచరణ సాధ్యం కాదు. కేవలం ప్రభుత్వ ఉద్యోగాలు తప్ప వేరే ఏ ఆధారం లేనివాళ్ళు, అందులోనూ లంచగొండ్లు కానివాళ్ళు ఎవరయినా ఉంటే వాళ్ళకు మట్టుకే కచ్చితమయిన ఆదాయం ఉంటుంది. వేరే ఎవ్వరికీ ఉండదు. ఒకవేళ ఆదాయపరిమితి ప్రాతిపదిక మీద పేదవాళ్ళకు మాత్రమే ఇచ్చినా తప్పుడు సర్టిఫికేట్లు పెట్టి డబ్బున్న వాళ్ళు వాడుకుంటారు. సామాజికంగానూ విద్యాపరంగానూ వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చిన తరువాత ఆ వెనుకబాటుతనం ఎంతకాలం ఉంటే అంతకాలం ఇవ్వవలసి ఉంటుందనేది విదితమే. '40 ఏళ్లు గడిచాయి కదా, ఒక తరం గడిచింది కదా ఇంకానా'? అని అడుగుతున్నారు. ఆ ప్రశ్న వేసిన వాళ్లనే అడగాలి – సామాజిక వెనుకబాటుతనం పోయినట్టే అనుకుంటున్నారా? పోకపోతే దానికి బాధ్యులు దళితులా లేక అగ్రకులాలా? ఎవరిని అడగవలసిన ప్రశ్న ఎవరిని అడుగుతున్నారు?

మనం ఒక పోటీ వ్యవస్థలో బ్రతుకుతున్నాం, ఉద్యోగాల కోసం పోటీ, వనరుల కోసం పోటీ, విద్య కోసం పోటీ, ఆస్తి కోసం పోటీ, అధికారం కోసం పోటీ, అన్నిటా పోటీ మన సామాజిక జీవితంలోకి ప్రవేశించింది. ఈ పోటీలో నిలదొక్కుకోవడానికి బలహీనులకు చేయూత అవసరం. అగ్రకులాలకు చెందిన పేదవాళ్ళకు ఆ కులాలకు చెందిన ఆస్తిపరులూ, అధికారులూ, బలవంతులూ 'మనవాడు' అనే ఆత్మీయతతో

ఎంతో కొంత చేయూతనిస్తారు. (అంటే అగ్రకులాలోని పేదలకు సమస్యలే లేవని కాదు, కొంత సహాయం దొరుకుతుందని మాత్రమే నా ఉద్దేశ్యం.) వెనుకబడ్డ కులాలలో కూడ అటువంటి ఒక బలమైన వర్గం ఏర్పడితే ఆ కులాలలోని పేదలకు కొంత సహాయం దొరకగలుగుతుంది. వాళ్ల అవసరాలకు కనీసం రాజకీయాలలో వ్యక్తీకరణ దొరుకుతుంది. ఒక తరానికే రిజర్వేషన్ అనీ, ఆదాయపరిమితి అనీ ఆంక్షలు పెడితే అది ఈ మార్పుకు ఆటంకం కాగలదు.

అగ్రకులాలలో ఒక బలవంతుల వర్గం వాళ్ల 'ప్రతిభ' వల్ల ఏర్పడలేదు. ఎలా ఏర్పడిందంటే వారికి ఇతరులను దోచుకొనడానికి కావలసిన ఆస్తి ఉంది. రాజకీయాధికారం ఉంది. ఇతరులకు కాకుండా చేసి తామే స్వంతం చేసుకున్న నాగరికత వుంది. కులవ్యవస్థ వీటిని సమకూర్చి పెట్టింది. వీటిని నిలుపుకోవడం కోసం, పెంపుదల చేసుకోవడం కోసం కులాన్ని నిరభ్యంతరంగా వాడుకుంటూనే ఉంటారు. ఎంఎల్ఎ టికెట్టు కోసం కులం, మంత్రి పదవి కోసం కులం, ప్రమోషన్ కోసం కులం - కులాన్ని వాడుకోకుండ వాళ్లు ఆధిపత్యాన్ని సంపాదించుకోలేదు. నిలబెట్టుకోలేదు. వెనుకబడ్డవాళ్లు తమ కులాన్ని ఈ రూపంలో కాక రిజర్వేషన్ల రూపంలో వాడుకుని తమలోనూ ఆర్థికంగా, ఉద్యోగరీత్యా, రాజకీయంగా బలవంతులయిన ఒక వర్గాన్ని తయారు చేసుకుంటామంటే అక్కడ మాత్రం ఒక తరానికే పరిమితం చేస్తామనీ, ఆదాయపరిమితి పెడతామనీ అంటారు. నిజానికి ఈ రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన మన కులవ్యవస్థలోని ద్వంద్వనీతిని మొత్తం నగ్నంగా బయటకు తెచ్చింది. ఆస్తిని కూడ ఒక తరానికే పరిమితం చేస్తామనీ, రెండవ తరానికి అది వారసత్వంగా సంక్రమించదనీ, రెండవతరం కష్టపడి మళ్లీ సంపాదించుకోవలసిందేననీ అంటే ఒప్పుకుంటారా? తండ్రి లాయరు, డాక్టరు అయితే ఆ ప్రాక్టీసు కొడుకుకు సంక్రమించదనీ, విడిగా కృషి చేసి సంపాదించుకోవలసిందేననీ అంటే ఒప్పుకుంటారా? కులం లాగా ఆస్తి కూడ మన సమాజంలో పుట్టుకతో సంక్రమిస్తుంది. ఆస్తిలో స్వాభావికంగానే 'రిజర్వేషన్' ఉంది. దానినెందుకు వ్యతిరేకించరు? పుట్టుకతో సంక్రమించే ఆస్తికి వారసులయ్యే వాళ్ళు సోమరులూ, అసమర్థులూ అయి దేశాన్ని నాశనం చేస్తారంటే ఒప్పుకుంటారా? వేల సంవత్సరాలుగా బ్రాహ్మణులు తమకే స్వంతం చేసుకున్న పుస్తక విద్య బ్రాహ్మణ కుటుంబాలకు వారసత్వంగా వచ్చింది. అది వాళ్ళ 'రిజర్వేషన్'. ఇన్ని తరాలయ్యాయి కదా - ఇంక ఆ రిజర్వేషన్ చెల్లదు, ఇక మీదట బ్రాహ్మణ పిల్లలు ఇళ్ళలో పెరగడానికి వీలు లేదు,

పుట్టగానే హాస్టల్‌లో వేస్తామంటే ఒప్పుకుంటారా? అసలు సమాజంలో ఎన్ని రకాల రిజర్వేషన్లు నడుస్తున్నాయి! ఆస్తి, డబ్బు, రికమెండేషన్, బంధుత్వం, సాంస్కృతిక గుత్తాధిపత్యం – ఇన్ని ఉండగా వీటిలో ఏదీ ఒక తరానికి గానీ పేదవాళ్ళకు మాత్రమే గానీ పరిమితం కాకపోగా, తద్విరుద్ధంగా ఆస్తిపరులను మరింత ఆస్తిపరులుగా చేయడానికి, బలవంతులను మరింత బలవంతులుగా చేయడానికి ఇవి తోడ్పడుతుండగా, ఒక్క కుల రిజర్వేషన్ల మీదే పరిమితులు పెట్టడం దళితులకు మరొక్కసారి అన్యాయం చేయడం కాదా? చరిత్ర క్రమంలో వాళ్ళలోని పేదవాళ్లే వాళ్ళలోని పెత్తందారీ వర్గాన్ని వ్యతిరేకించే రోజు వస్తే అప్పుడు ఈ పరిమితులు అర్థవంతం అవుతాయిగానీ, అన్ని రకాల రిజర్వేషన్లనూ తరాల తరబడి అనుభవిస్తూ ఉన్న అగ్రకులాల వాళ్ళు వీటిని గురించి మాట్లాడడం సహించరాని ద్వంద్వనీతి అవుతుంది.

## ముగింపు

మన దేశంలో రాజకీయ వాతావరణం రోజురోజుకూ అప్రజాస్వామికంగా తయారవుతూ ఉంది. సంపదనూ అధికారాన్నీ చేజిక్కించుకున్నవాళ్లు మరింత పొందాలని చూస్తున్నారేగాని పేదలతో ఏ మాత్రం పంచుకోవడానికి సిద్ధంగా లేరు. రిజర్వేషన్ల సమస్య వచ్చినప్పుడు అగ్రకులాలలోని పేదవాళ్లను గురించి కన్నీళ్లు కారుస్తారు గానీ వాళ్ళతోనూ ఏదీ పంచుకోవడానికి సిద్ధంగా లేరు.

భూసంస్కరణలు, కనీసవేతన చట్టాలు, కార్మిక చట్టాలు, ఇతర సంక్షేమ చట్టాలు మూలన పడిపోయినాయి. వ్యవసాయ అభివృద్ధి, పారిశ్రామిక అభివృద్ధి స్తంభించినాయి. ఉన్నంతలో దోచుకుంటూ తమ అధికారాన్నీ ఆస్తినీ పెంచుకుంటున్నారు. ఈ క్రమంలో కులం వాళ్ళకొక బలమయిన సాధనంగా ఉపయోగపడుతూ ఉంది. పార్లమెంట్ నుండి పంచాయితీ స్థాయి దాకా అన్ని ఎన్నికలలో, వ్యవసాయ పరపతి సంఘాలలో, మార్కెటింగ్ సొసైటీలలో, ఇంకా ఎన్ని రాజకీయ సంస్థలుంటే అన్నింటిలోనూ తమ ప్రాబల్యాన్ని నిలబెట్టుకోవడానికి కులాన్ని ఒక సాధనంగా వాడుకుంటున్నారు. కాంట్రాక్టర్లకు కాంట్రాక్టులు, పెట్టుబడిదార్లకు ప్రభుత్వ రుణాలు, వ్యాపారస్తులకు ఎగుమతి దిగుమతి లైసెన్సులు, బ్రోకర్లకు దళారీతనం చేసే అవకాశాలు ఏవీ కూడ కులాన్ని వాడుకోకుండ రావడం లేదు. ఆర్థిక రాజకీయ రంగాలలో ఆధిపత్యాన్ని నిలబెట్టడంలో కులం ఈ విధంగా ఒక బలమయిన సాధనంగా తయారయింది.

తండ్రులు తమ కులాన్ని వాడుకుని ఈ విధంగా బలపడబట్టే కొడుకులకు అన్ని అవకాశాలూ సమకూరి 'ప్రతిభ' వచ్చింది. ఇవ్వాళ 'ప్రతిభ'ను బ్యానర్ల మీద ఎక్కించి ఊరేగుతున్న యువకుల 'ప్రతిభ' కులం ప్రమేయం లేకుండ ఊడిపడలేదు. వాళ్ల తండ్రుల ఆస్తులయినా ఉద్యోగాలయినా వ్యాపారాలయినా రాజకీయ ప్రాబల్యమయినా కులాన్ని వాడుకోకుండ పుట్టలేదు. నిలవలేదు. ఆ కులాలలోని పేదవాళ్లు కూడ ఈ ఆధిపత్యం వల్ల కొంత కాకపోతే కొంత ప్రయోజనం పొందుతుంటారు. తమ కులం వాడు కాంట్రాక్టర్ అయితే మేస్త్రీ పని దొరకవచ్చును. వ్యాపారస్తుడయితే షాపు గుమాస్తా పని దొరకవచ్చును. ఆఫీసర్ అయితే టైపిస్టు ఉద్యోగం దొరకవచ్చును. అగ్రకులాలలో నిరుద్యోగ సమస్య లేదనేది మా అభిమతం కాదు. అయితే కులాన్ని వాడుకుని కొంతమేరకు దానిని ఎదుర్కొనే అవకాశం వాళ్ళకు ఉంటుందనేది వాస్తవం.

దోచుకోవడమే ప్రధానమయిపోయిన రాజకీయాలలో ప్రజల పట్ల అణచివేతే ప్రధాన విధానం. వాళ్లు ఐక్యమై ఉద్యమించిన చోట్ల పోలీసు బలగాలను పెట్టి అణచివేత ప్రయోగిస్తే, వాళ్లు సంఘటితంగా లేని చోట కులపరమయిన దాడులు చేస్తున్నారు. అగ్రకులాలకు చెందిన మధ్యతరగతిని సహితం కదిలించి దళితులపైన ప్రాణాంతకమయిన దాడులు చేయిస్తున్నారు. కారంచేడు నుండి ఈనాటి దాకా అటువంటి ఘటనలు అనేకం చూసాము.

అయితే భౌతికదాడులొక్కటే అణచివేత కాదు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా పేదలంతా పైకి రావాలని ఏ ఆదర్శమయితే రాజ్యాంగం చెప్తుందో ఆ పైకి రావడం అనేదానికి అవకాశం లేకుండా చేయడమూ అణచివేతే. భూములూ ఆస్తులూ వ్యాపారాలూ పోనివ్వండి. కనీస జీవనం కూడ వాళ్ళకు దక్కనివ్వడం లేదు. రిజర్వేషన్లు ఇస్తానని చెప్పే ప్రభుత్వం భూసంస్కరణలను గురించి మాట్లాడదు. అడవులలో గిరిజనులకు హక్కులు కల్పించడాన్ని గురించి మాట్లాడదు. కల్లు కాంట్రాక్టు గానీ, చేపల కాంట్రాక్టుగానీ, బంజర్లలోని పంటచెరుకు కొట్టి అమ్ముకునే కాంట్రాక్టుగానీ ఆయా వృత్తులలో వున్న వారికే తప్ప వేరే వాళ్లకు ఇవ్వరాదంటే మాట్లాడదు. వెనుకబడిన ప్రాంతాల వ్యవసాయ అభివృద్ధిని గురించి మాట్లాడదు. తమ వృత్తులను వదిలిపోక తప్పని పరిస్థితి ఏర్పడుతూ ఉన్న చాకలి, మంగలి, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, పద్మశాలి తదితర కులాల ఉద్యోగ సమస్యను గురించి మాట్లాడదు. కూలివాళ్ల కనీస వేతనాన్ని గురించి మాట్లాడదు. ఇవన్నీ కూడ 'ఎస్.సి, ఎస్.టి, బి.సి' కులాల

సమస్యలే. కానీ వీటిని గురించి ఈ ప్రభుత్వాలు మాట్లాడవు. ఈ కులాలలో కొంచెం నోరున్న వాళ్ళ నోళ్లు మూసేయడానికని విద్యా ఉద్యోగరంగాలలో రిజర్వేషన్ల గురించి మట్టుకు ప్రభుత్వం మాట్లాడుతుంది.

అయితే ఈ మాట్లాడటంలో కూడ చిత్తశుద్ధి లేదు. ఎందుకంటే ఉన్న ఉద్యోగాలు ఎంత కొన్ని అయినా ఈ చర్య కులవ్యవస్థ మూలాన్ని తాకుతుంది. అంతటి ప్రజాస్వామిక పరిణామాన్ని తట్టుకునే శక్తి మన రాజకీయ వ్యవస్థకు లేదు. అది అన్ని రకాలగానూ తన ప్రజాస్వామిక స్వభావాన్ని కోల్పోయింది. అందుకనే రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన పట్ల అన్ని పార్టీల ప్రభుత్వాలూ అంత సానుభూతితో వ్యవహరిస్తున్నాయి. వాళ్లు నిరాఘాటంగా బస్సులను ధ్వంసం చేస్తూ హైజాక్ చేస్తూ రోడ్లు ఆపేస్తూ రోడ్లమీద నృత్యనాటికలు వేస్తూ ఆందోళన సాగిస్తున్నారు. వాళ్లకు ఆందోళన చేసే హక్కు లేదని మా అభిమతం కాదు. తప్పకుండ ఉంది. కానీ పేదలు చేసే ఏ ఆందోళననూ కొంచెం కూడ సహించని ప్రభుత్వం ఇంతగా వీటిని ప్రోత్సహించడం వింత అనిపించక తప్పదు. పేదలు చేసే ఏ ఆందోళనలోనయినా తప్పులను వెతుకుతూ విమర్శించే పత్రికలు రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలో తాము కూడ భాగం అయిపోవడం వింత అనిపించక తప్పదు. పేదల ఆందోళనలలో ఏ కొద్ది హింస కనిపించినా దానిని ప్రజలంతా నిర్ద్వంద్వంగా ఖండించాలని విన్నపాలు చేసే మేధావులూ, సంపాదకులూ రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనకారులు బస్సులను పెద్ద సంఖ్యలో విధ్వంసం చేస్తూంటే చూసీ చూడనట్టు ఊరుకోవడం కూడ వింత అనిపించక మానదు. ప్రజా ఉద్యమాల మీద అణచివేత ప్రయోగించవద్దు, వాళ్ల సమస్యలు పరిష్కరించండి అని పౌరహక్కుల సంఘాలు అంటే 'అదిగో! మీరూ తీవ్రవాదులే' అని మా మీద ఆరోపణలు చేసేవాళ్లంతా, 'రిజర్వేషన్ వ్యతిరేకుల మీద అణచివేత ప్రయోగించవద్దు, చర్చలకు పిలిచి మాట్లాడు' అని విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్‌కు హెచ్చరిక చేయడమూ వింతగానే అనిపించకమానదు. ఏ సామాజిక విషయానికీ సాధారణంగా స్పందించని ఫైవ్‌స్టార్ న్యాయవాదులయిన సుప్రీంకోర్టు వకీళ్లు తమ కోర్టు ముందే పెండింగ్‌లో ఉన్న రిజర్వేషన్ వ్యతిరేక రిట్ పిటిషన్ల మీద తామే తీర్పు చెపుతూ కోర్టును బహిష్కరించడం అన్నిటికంటే వింతగా అనిపించకమానదు. కులం మన సామాజిక రాజకీయ వ్యవస్థను నిలబెట్టడంలో ఎంత ముఖ్యమయిన పాత్ర నిర్వహిస్తుందో దీనిని బట్టి తెలుసుకోవచ్చును.

రేపు సుప్రీంకోర్టులో జరగబోయే వాదనలలో గతంలో సందిగ్ధంగా వదిలేసిన అంశాలనే మళ్లీ లేవదీస్తారనుకోవడంలో సందేహం అక్కరలేదు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదనేది ఒకటి. దీనిని గురించి గతంలో కూడ కొందరు సుప్రీంకోర్టు జడ్జీలు విభేదించారని చూసాం. రిజర్వేషన్ల వల్ల వెనుకబడ్డ కులాలలోని ధనికులే బాగుపడుతున్నారు కాబట్టి ఆదాయపరిమితి పెట్టాలనేది మరొకటి. దురదృష్టవశాత్తు రిజర్వేషన్లకు సూత్రప్రాయంగా అనుకూలంగా ఉన్న న్యాయమూర్తులు సహితం ఈ 'ఆదాయ పరిమితి' అనేదానికి సుముఖంగా ఉన్నట్టు మనకు సుప్రీంకోర్టు తీర్పులను బట్టి తెలుస్తుంది. ఇక్కడ కూడ పైన చెప్పిన విచిత్రమయిన ద్వంద్వనీతి కనబడుతుంది. మన దేశంలో ప్రభుత్వం 'అభివృద్ధి' పేరుమీద చేపట్టిన ఏ చర్యవల్లనయినా ధనికులే బాగుపడ్డారు. వ్యవసాయరంగంలో హరిత విప్లవం రావడంవల్ల వ్యవసాయదారుల్లో ధనికులు మాత్రమే బాగుపడ్డారు. అయినా దానిని భూస్వాముల ప్రగతి అనలేదు. దేశప్రగతి అన్నారు. పారిశ్రామికీకరణ వల్ల పెట్టుబడిదార్లూ కాంట్రాక్టర్లూ మాత్రమే బాగుపడ్డారు. అయినా దానిని కూడ డబ్బున్నవాళ్ల ప్రగతి అనలేదు, దేశప్రగతి అన్నారు. ఇంజనీరింగ్ కాలేజీలు, మెడికల్ కాలేజీలు, పరిశోధనా కేంద్రాలు, విశ్వవిద్యాలయాలు – వీటన్నిటి వల్లా డబ్బున్న వాళ్లే బాగుపడ్డారు. కానీ దానినీ దేశ ప్రగతి అనే అన్నారు. మరి బిసిలలో డబ్బున్న వాళ్ళు రిజర్వేషన్ల వల్ల బాగుపడితే దానిని మట్టుకు దేశప్రగతిగా ఎందుకు భావించకూడదు? వెనుకబడ్డ కులాలలో ఒక బలమైన వర్గం తయారయి తమ రాజకీయ అధికారాన్నీ సామాజిక పెత్తనాన్నీ సవాలుచేయడాన్ని సహించలేక పెట్టే వాదనలే తప్ప వేరే కాదు ఇవన్నీ. కీలకమయిన రక్షణ, సాంకేతిక రంగాలకూ, ఉన్నత విద్యకూ రిజర్వేషన్లు వర్తించవని వి.పి.సింగ్ ప్రకటించిన సవరణ వెనక ఉన్నది కూడ ఈ వైఖరే.

ఈ ఆధిపత్యాన్నీ, దానికి ఆలంబనగా ఉన్న కులవ్యవస్థనూ నిలబెట్టుకోవడం కోసం సమాజంలోని పెత్తందారీ శక్తులు తమ కులాలలోని సామాన్య ప్రజానీకాన్ని రెచ్చగొట్టి రోడ్లమీదికి తీసుకొస్తున్నారు. మీకు ఉద్యోగాలు దొరకవు అని బెదిరించి దళితుల మీదికి ఉసిగొల్పుతున్నారు. నిజానికి ఈ ఆందోళన ఉద్యోగాల గురించి కాదని వాళ్లకు బాగానే తెలుసు. రిజర్వేషన్లు నిరుద్యోగానికి కారణమూ కాదు, పరిష్కారమూ కాదు. ఈ అగ్రకుల ప్రతిభావంతుల పాలనే నిరుద్యోగాన్ని పెంచి పోషించింది. దానికి అన్ని కులాలలోని పేదవాళ్లూ బలి అవుతున్నారు. అయితే ఉన్న కొద్ది ఉద్యోగాల కోసం అందరూ 'సమానంగా' పోటీ పడండి అంటే అది సామాజికంగా

బలహీనులయిన వాళ్లకు అన్యాయం అవుతుంది కాబట్టి ఆ బలహీనత పోయేదాకా చేయూత కావాలని అంటున్నాం. అంత మాత్రమే. అగ్రకులాలలోని పేదవాళ్ల మాటకొస్తే, ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు కులం ప్రాతిపదిక మీద రిజర్వేషన్లు ఇచ్చినట్లే వారికి ఆర్థిక ప్రాతిపదిక మీద 10 లేక 15 శాతం రిజర్వేషన్ ఇమ్మని కోరవచ్చును. ఆ కోరికను ప్రజలంతా సమర్థిస్తారు. అందరికీ అన్ని రిజర్వేషన్లూ వచ్చిన తరువాత కూడ ఉద్యోగాల సమస్య పరిష్కారం కాలేదని అందరికీ అర్థం అవుతుంది. ఇవ్వాళ 'ప్రతిభ' పోతూవుందని గొడవచేస్తున్న వాళ్లెవరూ అప్పుడు ఆందోళన నడపడానికి ముందుకు రారు. ఈ రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న వాళ్ళెవరూ ఉద్యోగాలు కావలసిన వాళ్లు కారు. అప్పుడు ఉద్యోగాలు దొరకని పేదవాళ్ళంతా ఒకటయి అందరికీ పని కల్పించగల నిజమయిన ప్రజాస్వామిక వ్యవస్థ కోసం పోరాడవలసి ఉంటుంది. కొందరి కోసం, కొందరు సంపన్నులను మరింత సంపన్నులు చేయడం కోసం, పార్లమెంటరీ రాజకీయాల నుండి ప్లానింగ్ కమిషన్ దాకా, విదేశీ అప్పుల నుండి కులం దాకా అన్నిటినీ వాడుకుని బలవంతులు మరింత బలపడటం కోసం నడుస్తున్న ప్రస్తుత అప్రజాస్వామిక వ్యవస్థ స్థానంలో అందరికీ నిజమయిన సమానత్వాన్ని ఇవ్వగల వ్యవస్థ రావాలని ఉద్యమించవలసి ఉంటుంది.

**కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఎస్.సి, ఎస్.టిలు, బి.సిలు (%)**

| | క్లాస్ I | | క్లాస్ II | | క్లాస్ III + క్లాస్ IV | |
|---|---|---|---|---|---|---|
| | SC + ST | BC | SC + ST | BC | SC + ST | BC |
| కేంద్రమంత్రిత్వ శాఖలు | 7.18 | 2.59 | 13.66 | 3.98 | 30.95 | 8.41 |
| కేంద్ర ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి సంస్థలు | 6.64 | 5.09 | 18.74 | 11.74 | 20.78 | 20.98 |
| పబ్లిక్ సెక్టర్ సంస్థలు | 4.51 | 4.59 | 17.84 | 9.91 | 31.76 | 15.77 |
| మొత్తం | 5.68 | 4.69 | 18.18 | 10.63 | 24.40 | 18.98 |

సామాజికంగా ఎస్‌సి, ఎస్‌టిల కంటే బిసిలు కొంత మెరుగయిన స్థితిలో ఉన్నారు. జనాభాలో కూడ చాలా ఎక్కువ ఉన్నారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగరంగంలో ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు ఉండగా బిసిలకు లేకపోవడం వల్ల ఏ కేంద్రప్రభుత్వ విభాగంలో చూసినా ఎస్‌సి, ఎస్‌టిల కంటే బిసిలు తక్కువ

ఉన్నారు. క్లాస్ I ఉద్యోగాల నుండి క్లాస్ IV దాకా, మంత్రిత్వశాఖల నుండి కార్పొరేషన్ల దాకా, అన్నిటిలోనూ ఈ వాస్తవాన్ని చూడవచ్చును. మండల్ కమిషన్ సిఫారసులు అమలు చేయడం అవసరం అని ఈ ఒక్క పట్టికే ఋజువు చేస్తున్నది.

*మొదటి ముద్రణ : APCLC కృష్ణాజిల్లాశాఖ బుక్‌లెట్‌గా వచ్చింది, అక్టోబర్ 1990*

*రెండవ ముద్రణ : రిజర్వేషన్లు : ప్రజాస్వామిక దృక్పథం', 2013*

*(పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ)*

**నోట్** : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బిసిలకు విద్యా, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లను 25 శాతం నుండి 44 శాతానికి పెంచాలన్న మురళీధరరావు కమిషన్ సిఫార్సులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదం తెలిపినపుడు దానికి వ్యతిరేకంగా అగ్రకులాల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. ఆందోళన జరిగింది. రిజర్వేషన్లు హక్కుల సమస్యే అన్న అవగాహన ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో అప్పటికింకా ఏర్పడలేదు కాబట్టి బాలగోపాల్ వారి ఆందోళనను వ్యతిరేకిస్తూ, రిజర్వేషన్లను సమర్థిస్తూ 'రిజర్వేషన్ల పైన దాడిని వ్యతిరేకించండి' అనే శీర్షికతో ఇంచుమించు ఇవే విషయాలతో ఒక పెద్ద వ్యాసం రాశారు. అది 'రిజర్వేషన్ల సంరక్షణ వేదిక' బుక్‌లెట్‌గా (1987లో) వెలువడింది.

# రిజర్వేషన్లు : సుప్రీంకోర్టు రాజకీయాలు

రిజర్వేషన్ల మీద సుప్రీంకోర్టు ఈ మధ్య కాలంలో ఇస్తున్న తీర్పులను వివరంగా పరిశీలించవలసిందేగానీ న్యాయశాస్త్ర సిద్ధాంత చర్చలోకి పోకుండా కూడ అందరికీ సులభంగా అర్థమయ్యే విషయాలు కొన్ని ఉన్నాయి.

సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన సామాజిక వర్గాలకు ప్రత్యేక సదుపాయాలు కల్పించే అధికారం ప్రభుత్వానికి ఉందని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 (4) అంటుంది.

ఇది ప్రభుత్వానికి ఉండే అధికారం మాత్రమేనా? లేక ఆ ప్రజల హక్కా ? అన్న ప్రశ్న మన న్యాయస్థానాలను చాలా కాలం పీడించింది. మొదట్లో ఇది ప్రభుత్వానికి రాజ్యాంగమిచ్చిన అధికారమే తప్ప ఎవరి హక్కూ కాదని సుప్రీంకోర్టు అనింది. అంటే ప్రభుత్వం రిజర్వేషన్లు ఇస్తే వారు తీసుకోవలసిందే తప్ప ఇమ్మని డిమాండ్ చేసే అధికారం ఎవ్వరికీ లేదని అర్థం.

కాని కాలక్రమంలో సుప్రీంకోర్టు ఈ విషయంలో తన వైఖరిని మార్చుకునింది. 1970ల తరువాత, రిజర్వేషన్లు కల్పించడం 'అందరినీ సమానంగా చూడాలి' అన్న సమానతా సూత్రానికి మినహాయింపు కాదనీ, దానిలో భాగమేననీ సుప్రీంకోర్టు గుర్తించింది. 1992లో మండల్ కమిషన్ పైన ఇచ్చిన తీర్పులో 9 మంది జడ్జిల బెంచి ఈ విషయాన్ని బాగా విశదీకరించి చెప్పింది.

అయితే మండల్ కమిషన్ తీర్పు ఇచ్చేనాటికి రిజర్వేషన్లన్నీ బడుగు వర్గాలలోని ధనవంతులు లేక బలవంతులే

తీసేసుకుంటున్నారన్న అభిప్రాయం సుప్రీంకోర్టులో బలపడింది. ఇది నిజానికి బయట తరచుగా వినిపించే మాటే. ఏ హక్కునయినా వ్యతిరేకించదలచుకుంటే దానిని నేరుగా వ్యతిరేకించడం ఒక పద్ధతయితే దాని 'దుర్వినియోగాన్ని' గుర్తించి చర్చ పెట్టడం రెండవ పద్ధతి. మొదటిది నైతికంగా సాధ్యం కానప్పుడు రెండవ మార్గం ఎంచుకుంటుంటారు. దళితులు, ఆదివాసీలు, స్త్రీల హక్కుల విషయంలో వాటి వ్యతిరేకులు ఈ పనే తరచుగా చేస్తుంటారు.

రిజర్వేషన్లు దళితులలో (లేక బిసిలలో, లేక ఆదివాసీలలో, లేక స్త్రీలలో) అప్పటికే డబ్బులున్న వాళ్లకో లేక అప్పటికే అభివృద్ధి చెందిన వారికో అందుతున్నాయనీ, కాబట్టి వారిని రిజర్వేషన్ల పరిధి నుండి తొలగించాలనీ వీరు వాదిస్తుంటారు. ఇక్కడ కనీసం నాలుగు విషయాలు గుర్తుపెట్టుకోవాలి. అభివృద్ధి చెందిన వారే మళ్లీ అభివృద్ధి చెందుతున్నారనేది నిజమేనని రుజువు చేసిన వారెవ్వరూ లేరు. రెండు, అది నిజమేననుకున్నా వారికి రిజర్వేషన్లు లేకుండా చేస్తే అసలు బడుగు ప్రజలలో ఎవ్వరూ రిజర్వేషన్లు అందుకోలేకపోవచ్చు. మూడు, ప్రయోజనం పొందిన వారే మళ్లీ పొందడం వల్ల ఆయా వర్గాలలోని ఇతర ప్రజలు పైకి రాలేకుండా పోయినట్టయితేనే అది నిజమైన సమస్య అవుతుందిగానీ పెత్తందారీ కులాలకు చెందిన వారి కడుపుమంటను వారి సమస్యగా చూపించడంలో అర్థం లేదు. నాలుగు, బలహీన వర్గాలలో కొందరు పైకి రావడం కేవలం వారి వ్యక్తిగత అభివృద్ధేననుకోనక్కర లేదు. అది ఒక మేరకు ఆ వర్గాలలో ఇతరులకు కూడ ప్రయోజనం కల్పిస్తుంది. మొదట పైకి వచ్చిన వారందరూ నిస్వార్థపరులు కాకపోవచ్చును. తమ స్వంతం మాత్రమే చూసుకుంటున్నారన్న అభియోగం వారిపైన తరచుగా వేయడం వింటున్నాం. అయినప్పటికీ ఏదో ఒక మేరకు వారు ఆ వర్గాలకు చెందిన ఇతర ప్రజల అభివృద్ధికి చేయూత నివ్వగలుగుతున్నారు.

ఇవేవీ లెక్కలోకి తీసుకోకుండా సుప్రీంకోర్టు మండల్ కమిషన్ తీర్పులో రిజర్వేషన్ పొందే వర్గాలలో 'క్రీమీలేయర్' ను గుర్తించి దానిని రిజర్వేషన్ల పరిధి నుండి తొలగించాలని ప్రకటించింది.

ఆ తరువాత రెండు విచిత్రమైన పరిణామాలు జరిగాయి. రిజర్వేషన్లు పొందడం ఒక హక్కు అన్న అభిప్రాయం నుండి సుప్రీంకోర్టు ఒక్కడుగు వెనక్కివేసి, రిజర్వేషన్లు ఇవ్వడం ప్రభుత్వ అధికారం మాత్రమే తప్ప 'మాకు ఇయ్యవలసిందేనని' ఎవ్వరూ

డిమాండ్ చేయడానికి వీలులేదని ఈ సంవత్సరం అయిదుగురు జడ్జీల ధర్మాసనం ప్రకటించింది. కానీ 'క్రీమీలేయర్'ను గుర్తించి తొలగించడం మాత్రం ప్రభుత్వ ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేని విషయమనీ, ఆ పని ప్రభుత్వం తప్పనిసరిగా చేయవలసిందేననీ ఇంకొక కేసులో ఇద్దరు జడ్జీల బెంచి అనింది!

నిజానికి ఈ అభిప్రాయాల తప్పొప్పుల సంగతి అటుంచి ఇవి ప్రభుత్వ పాలనా విధానాలకు సంబంధించిన విషయాలు. న్యాయస్థానాలు విధానరచన చేయజాలవు. ప్రభుత్వ విధానరచన రాజ్యాంగం పరిధిలో ఉందా లేదా అని చెప్పడం వరకే న్యాయస్థానాల పని. వేరే సందర్భంలో ప్రజలేవయినా మౌలిక హక్కుల కల్పనకు ఆదేశాలిమ్మని ఆశ్రయిస్తే, అది 'విధాన సంబంధమైన విషయం' అని ఇవే న్యాయస్థానాలు కొట్టిపారేస్తుంటాయి. కానీ రిజర్వేషన్ల పట్ల పెత్తందారీ కులాలలో ఉన్న వ్యతిరేకతను దేశ పాలనా విధానంలో భాగం చేయడానికి మాత్రం తమకున్న అధికారాన్ని వినియోగించుకోవడానికి న్యాయస్థానాలు వెనకాడడం లేదు. ఈ మధ్య కేరళ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని దళిత, బిసి కులాలలో 'క్రీమీలేయర్' అనేది లేదని చెపితే అటువంటి ఉపవర్గాన్ని గుర్తించి తీరవలసిందేనని సుప్రీంకోర్టు తీర్పు జారీ చేయడం దీనికొక ఉదాహరణ. పైగా ఈ తీర్పులో సుప్రీంకోర్టు రాజ్యాంగ వ్యతిరేకమైన వ్యాఖ్య కూడ చేసింది. 'ప్రభుత్వ ఉద్యోగాలలో తగిన ప్రాతినిధ్యం లేని వర్గాలకు' రిజర్వేషన్లు కల్పించాలని ఆర్టికల్ 16(4) అంటుంది కదా, 'క్రీమీలేయర్'ను రిజర్వేషన్ పరిధి నుండి తొలగించి వేస్తే ఆ వర్గం తగిన ప్రాతినిధ్యం పొందలేక పోవచ్చునేమోనంటే 'అయినా ఫరవాలేదు, తీసేయాల్సిందే' ననింది!

రిజర్వేషన్లు ఒక హక్కుగా అడగడానికి వీలు లేదనీ, ఇస్తే తీసుకోవలసిందేననీ అయిదుగురు జడ్జీల బెంచి అనడం కూడ ఈ కోణం నుండి అభిశంసనీయమే. 9 మంది న్యాయమూర్తులు తీర్పు ఇచ్చిన మండల్ కమిషన్ కేసులో రిజర్వేషన్లు ఒక హక్కేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ అభిప్రాయాన్ని అంతకంటే ఎక్కువ మంది న్యాయమూర్తుల బెంచి మాత్రమే తిరగదోడగలదు. వేరే విషయంలో కోర్టే ఆ మాట అంటుంది. కానీ ఈ విషయానికొచ్చేసరికి 5 మంది న్యాయమూర్తుల బెంచి ఆ అధికారం తనకుందనుకునింది!

*మొదటి ముద్రణ : ప్రజాతంత్ర వారపత్రిక, 26 డిసెంబర్ 1999*

*రెండవ ముద్రణ : 'రిజర్వేషన్లు : ప్రజాస్వామిక దృక్పథం', 2013*

*(పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ)*

# విద్యా సంస్థలలో రిజర్వేషన్లు కాపాడుకుందాం

సంక్షేమ బాధ్యతలకు వ్యతిరేకంగా న్యాయస్థానాలు ఒక్కమాట అంటే చాలు, దానికి కార్యరూపం ఇవ్వడానికి మన ప్రభుత్వాలు తొందర పడతాయనడానికి ఒక ఉదాహరణను కిందటిసారి ప్రస్తావించాను. అడవులలోని 'చొరబాటుదార్ల' గెంటివేత గురించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కేంద్ర అటవీ శాఖను ప్రశ్నించినదే తడవుగా, ఆదివాసులతో సహా అందరినీ ఫలాన తేదీ లోపల రిజర్వ్ ఫారెస్టు నుండి గెంటివేయాలని దేశ ప్రధాన ఫారెస్టు కన్సర్వేటర్ సర్క్యులర్ జారీ చేసాడు.

అటువంటి మరొక ఉదాహరణ మన రాష్ట్ర ప్రభుత్వం చల్లగా జారీ చేసిన జీవో నెం. 75 (విద్యా శాఖ), తేదీ 18 అక్టోబర్ 2002. ప్రభుత్వం నుండి ఎయిడ్ పొందే వాటితో సహా ఏ ప్రైవేట్ విద్యా సంస్థా అధ్యాపకుల నియామకంలో రిజర్వేషన్లు పాటించనవసరం లేదని ఈ జీవో సారాంశం.

అంతకు ముందు ఆం.ప్ర విద్యా సంస్థల (ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలల వ్యవస్థాపన, గుర్తింపు, నిర్వహణ, నియంత్రణ) రూల్స్ 1993లోని రూల్ 12(6) ప్రకారం ప్రభుత్వ పాఠశాలల లాగా ప్రైవేట్ పాఠశాలలు కూడ అధ్యాపకుల నియామకంలో రోస్టర్ ప్రకారం రిజర్వేషన్లు పాటించాలని ఉండింది. దీని వల్ల తమ వారికి ఉద్యోగాలిచ్చుకునే మహదవకాశం

తగ్గిపోయిందనీ, విద్యా సంస్థలు నెలకొల్పేది అందుకోసమేగా అని బాధపడిన ప్రైవేట్ విద్యాసంస్థవారెవరో ఈ రూల్ 12(6) చెల్లదంటూ హైకోర్టు కెక్కారు.

వారి అదృష్టం కొద్దీ మన దురదృష్టం కొద్దీ అప్పట్లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిలో సత్యవ్రత సిన్హా అనే పెద్దమనిషి ఉండేవాడు. ఈయన పదవీ కాలంలో మన రాష్ట్రంలో సంక్షేమ చట్టాలకూ, ప్రభుత్వ సంక్షేమ బాధ్యతకూ ఎంత నష్టం చేయాలో అంతా చేసి పోయాడు. వాటిలో ఒకటి రూల్ 12(6) లోని రోస్టర్ నియామకం.

జడ్జిలు చట్టాన్ని అనుసరించి తీర్పులు చెప్తారు కదా, ఒక జడ్జి ప్రభుత్వ సంక్షేమ బాధ్యతలకు అన్యాయం చేయడం ఏమిటి అంటారేమో, చట్టాలను వ్యాఖ్యానించేటప్పుడు న్యాయమూర్తులకు చాలా విస్తృతమైన విచక్షణాధికారం ఉంటుంది. దాని చాటున వారి వ్యక్తిగత అభిప్రాయాలను తీర్పులలోకి తరచుగా చొప్పిస్తుంటారు. ఇది ప్రతీ రోజూ జరుగుతూనే ఉంటుంది. అయితే బయట దీని గురించి చర్చ జరగదు. దానికి మూడు కారణాలున్నాయి. కోర్టు తీర్పులు సాంకేతికమైన చట్ట పరిభాషలో ఉంటాయి కాబట్టి అందులో తమకు అంతుబట్టని గొప్ప జ్ఞానం ఏదో ఉందని పామర జనం జంకుతారు, న్యాయమూర్తులను విమర్శిస్తే కోర్టు ధిక్కారం అవుతుందేమోనన్న భయం రెండవ కారణం. అన్నీ తెలిసి సత్యం బహిర్గతం చేసే స్థితిలో ఉన్న లాయర్లు జడ్జిలను ఏమైనా అంటే తమ వ్యాపారం దెబ్బతింటుందని (లాయర్లు చేసేది వ్యాపారమే కాబట్టి) భయపడడం మూడవ కారణం.

సత్యవ్రత సిన్హాగారికి సంక్షేమం, సమానత్వం మొదలయిన రాజ్యాంగ విలువలంటే గౌరవం లేదు. ఆ అగౌరవం ఆయన మన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఇచ్చిన అన్ని తీర్పులలోనూ కన్పిస్తుంది. ఎవ్వరికీ రిజర్వేషన్లు ఇవ్వడానికి వీలు లేదని ప్రకటించే అవకాశం ఉంటే ప్రకటించేవాడే గాని అది సాధ్యం కాదు కాబట్టి రిజర్వేషన్లు ప్రభుత్వ రంగానికి మాత్రమే వర్తిస్తాయని ప్రకటించి రూల్ 12(6) చెల్లదని ఆయన అన్నాడు.

ఆ తీర్పు న్యాయసిద్ధాంత పరంగా తప్పని రుజువు చేయవచ్చును గానీ చేయడానికిది సందర్భం కాదు. అయితే దానిని అధిగమించి ప్రైవేట్ విద్యా సంస్థలలో రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వానికి మార్గం లేకపోతే ఆం.ప్ర. విద్యా చట్టానికి తగు సవరణలు చేస్తే సరిపోయేది. దాని బదులు సిన్హా గారి తీర్పును మన రాష్ట్ర

ప్రభుత్వం సవినయంగా శిరసావహించి జీవో నెం. 75 జారీ చేసింది. ప్రజా వ్యతిరేకమైన ఏదయినా చట్టాన్ని లేక జీవోను హైకోర్టు కొట్టేసి ఉంటే దానికి ప్రాణం పోయడానికి ఏం చేయాలో అన్నీ చేద్దురు. ఈ వినయమంతా ప్రజా వ్యతిరేక స్వభావం గల తీర్పుల అమలు విషయంలోనే.

మన రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలు ఉన్నది ఒక్క విద్యా సంస్థలలోనే అన్నది అందరూ ఎరిగిన విషయమే. విద్యా రంగం నుండి ప్రభుత్వం క్రమంగా పక్కకు తప్పుకునే కొద్దీ ఈ అవకాశాలు ప్రైవేట్ విద్యా రంగంలోనే మిగిలి ఉంటాయి. అక్కడ రిజర్వేషన్లు లేనట్టయితే విద్యావంతులయిన దళిత, బిసి, ఆదివాసీ యువకులకు ఉద్యోగ అవకాశాలు బాగా తగ్గిపోతాయి. కనీసం ఎయిడెడ్ విద్యా సంస్థలలోనయినా రిజర్వేషన్ కల్పించే అధికారాన్ని చట్ట సవరణ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తనకు తాను కల్పించుకుని ఉండడం ఉచితంగా ఉండేది.

ఇప్పుడు దళిత సంఘాలు కొంచెం గొడవ చేసేసరికి జీవో 75ను పక్కన పెట్టాలని కేబినెట్ నిర్ణయించిన వార్తలొస్తున్నాయి. అయితే పక్కన పెట్టి ఏం చేస్తారు? హైకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా రిజర్వేషన్లు అమలు చేయలేరు కదా? చేయమని ప్రైవేట్ విద్యా సంస్థలను ఆదేశించినా వారు సమ్మతించరు కదా?

హైకోర్టు తీర్పును అధిగమించడానికి ఆం.ప్ర. విద్యా చట్టాన్ని (ఎడ్యుకేషన్ ఆక్ట్) సవరించి ప్రైవేట్ విద్యా సంస్థలలో రిజర్వేషన్లు అమలు చేయించే అధికారం ప్రభుత్వానికి కల్పించడం అవసరం. లేదా హైకోర్టు తీర్పుపైన సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసినట్టు చెప్తున్న అప్పీలును త్వరగా తెమల్చవచ్చు. విద్యా చట్టం ప్రైవేట్ విద్యా సంస్థలపైన రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే విస్తృతమైన నియంత్రణ అధికారాలు ఇచ్చింది. అవి చెల్లుతాయని కోర్టులు తీర్పులిచ్చి ఉన్నాయి. రాజ్యాంగంలో ప్రత్యేక హక్కులున్న మైనారిటీ విద్యా సంస్థలు సహితం, ప్రభుత్వం నుండి ఎయిడ్ పొందేటట్టయితే సమాజహితం కోరి ప్రభుత్వం జారీ చేసే నియమాలకు లోబడి నడుచుకోవాలని సుప్రీంకోర్టు చెప్పి ఉంది. కాబట్టి రిజర్వేషన్లు కల్పించాలనీ రోస్టర్ ప్రకారం అధ్యాపకుల నియామకాలు జరపాలనీ వారిని ఆదేశించే అధికారాన్ని ఆ చట్టంలో చేర్చినట్టయితే ఆ సవరణ చెల్లుబాటు కాకుండాపోదు.

సంక్షేమానికి సంబంధించిన ఒక్కొక్క హక్కునూ మనం మౌనంగా కోల్పోతున్నాం. ఉద్యమాలు స్తబ్దంగా, బలహీనంగా ఉండడం ప్రభుత్వానికి గొప్ప

అవకాశాన్ని ఇచ్చింది. ఇప్పుడు ఏ కారణంగానయితేనేం జీవో 75ను పక్కన పెట్టాలని ప్రభుత్వమే నిర్ణయించింది కాబట్టి, అది చాలదనీ, విద్యా చట్టాన్ని సవరించి రూల్ 12(6)కు చట్టంలోనే చోటు కల్పించాలనీ డిమాండ్ చేస్తూ బలమైన ఉద్యమం చేపట్టవలసిన అవసరం ఉంది. ఇదేదో దళిత సంఘాల బాధ్యత అనుకొని వారికే వదిలేయకుండ ప్రజాతంత్ర ఉద్యమ సంస్థలన్నీ దీని కోసం నడుం కడతాయని ఆశిద్దాం.

*మొదటి ముద్రణ : ప్రజాతంత్ర వారపత్రిక, 11 నవంబర్ 2002*

*రెండవ ముద్రణ : 'రిజర్వేషన్లు : ప్రజాస్వామిక దృక్పథం', 2013*

*(పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ)*

# ABCD పైన సుప్రీంకోర్టు తీర్పు: విజ్ఞత లేదు, తర్కమూ లేదు

షెడ్యూల్డు కులాల రిజర్వేషన్ వర్గీకరణ చెల్లదంటూ అయిదుగురు జడ్జిల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం* ఇచ్చిన తీర్పు మీద దీర్ఘమైన సమీక్ష రాయనవసరం లేదు. ఒక తీర్పులో గట్టి తర్కమున్నా లోతయిన విజ్ఞత ఉన్నా దానిని వివరంగా సమీక్షించే అవసరం ఉంటుంది. అది అంగీకార పూర్వకమయిన సమీక్ష అయినా, అనంగీకార పూర్వకమైనదైనా అటువంటి సమీక్ష న్యాయసిద్ధాంతాన్ని గురించీ, దానికీ సమాజానికీ ఉన్న సంబంధాన్ని గురించీ మనకు ఎంతో కొంత నేర్పగలదు. కానీ తర్కమూ విజ్ఞతా రెండూ లేని తీర్పును దీర్ఘంగా సమీక్షించడం వల్ల నేర్చుకునేదేమీ ఉండదు. కాగితాలు వృధా చేయడం తప్ప జరిగేదీ ఒరిగేదీ ఏమీ ఉండదు.

ఆంధ్రప్రదేశ్‌లోని షెడ్యూల్డు కులాల మధ్య అంతరాలేవీ లేవని గానీ, అభివృద్ధిలోనూ, సాంఘిక ప్రతిపత్తిలోనూ అందరూ సమానంగా ఉన్నారని గానీ సుప్రీంకోర్టు అనలేదు. అంటే ఏ వాస్తవ పరిస్థితిని ఆసరా చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణను చేపట్టిందో ఆ పరిస్థితి వాస్తవం కాదని సుప్రీంకోర్టు అనలేదు. అయినప్పటికీ వర్గీకరణ చెల్లదని చెప్పింది.

అదీ విశేషం.

వర్గీకరణ చేపట్టే అధికారం రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదనీ కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందనీ అని

* ఇ.వి.చిన్నయ్య వర్సస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, (2005) 1 SCC 394

ఊరుకోలేదు. రాష్ట్రంలో గానీ, కేంద్రంలో గానీ ఎవరూ వర్గీకరణ చేయడానికి వీలులేదని కూడ అనింది. షెడ్యూల్డు కులాలలో అంతర్గత భేదాలు ఉంటే ఉండవచ్చు. ఉండవని కాదు. వాటిని ప్రభుత్వం గుర్తిస్తే గుర్తించవచ్చు. గుర్తించడానికి వీలులేదని కాదు. కానీ ఏమీ చేయడానికి మాత్రం వీలులేదు. కేంద్ర ప్రభుత్వమూ ఏమీ చేయడానికి లేదు, రాష్ట్ర ప్రభుత్వమూ ఏమీ చేయడానికి లేదు.

ఇదీ సుప్రీంకోర్టు తీర్పు సారాంశం.

జస్టిస్ చిన్నపరెడ్డిగారు అప్పుడెప్పుడో ఒక తీర్పులో సుప్రీంకోర్టును ఎందుకు అత్యున్నత  న్యాయస్థానం అంటారో వివరిస్తూ, 'దాని విజ్ఞత అత్యుత్తమం కాబట్టి దానిని అత్యున్నత న్యాయస్థానం అనరు, అది అత్యున్నత న్యాయస్థానం కాబట్టి దాని విజ్ఞత అత్యుత్తమం' అన్నారు. అంటే సుప్రీంకోర్టు ప్రకటించే న్యాయం మీద అప్పీల్ లేదు కాబట్టే అది తుదిన్యాయం. వేరే ఏ అర్థంలోనూ కాదని ఆయన భావం. ఇటువంటి తీర్పులు చదివినప్పుడు అది ఎంత సరయిన వ్యాఖ్యో కదా అనిపిస్తుంది.

ఇంతకూ రాష్ట్ర ప్రభుత్వం ఏం చేసింది? ఏం చేసిందని సుప్రీంకోర్టు భావించింది?

భారత రాజ్యాంగం ప్రకారం షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల జాబితాను ఆర్టికల్స్ 341, 342లను అనుసరించి రాష్ట్రపతి అన్ని రాష్ట్రాల గవర్నర్లను సంప్రదించి ప్రకటిస్తారు. ఒక్కొక్క రాష్ట్రానికి రాష్ట్ర ఎస్.సి, ఎస్.టిల జాబితా ఉంటుంది. ఒకసారి రాష్ట్రపతి (గవర్నర్‌ను సంప్రదించి) ఈ జాబితాను ప్రకటించిన తరువాత దానిలో ఏదైనా ఒక కులాన్ని చేర్చే అధికారం గానీ, తీసేసే అధికారం గానీ రాష్ట్రపతికీ లేదు, గవర్నర్‌కూ లేదు. పార్లమెంటుకు మాత్రమే ఉంది. ప్రకటించేది రాష్ట్రపతే అయినప్పుడు సవరించే అధికారం రాష్ట్రపతికే ఎందుకివ్వకూడదు అన్న చర్చ రాజ్యాంగ సభలో వచ్చినప్పుడు, అంబేద్కర్ ఏమన్నాడంటే సవరించే అధికారం రాష్ట్రపతి చేతిలో పెడితే అది రాజకీయ దుర్వినియోగానికి దారితీస్తుందని. పార్లమెంటులో రాజకీయాలుండవని ఆయన ఉద్దేశ్యం కాదు. రాష్ట్రపతి పాలక పార్టీ మనిషిగా వ్యవహరించబోతాడని ఆయన ఆనాడే ఊహించినట్టున్నాడు. కాబట్టి షెడ్యూల్డు కులాల లేక తెగల జాబితాలో చేర్పులు తీసివేతలు చేసే అధికారం రాష్ట్రపతి చేతిలో పెడితే పాలక పార్టీల ఇష్టానుసారం ఆ జాబితా మారే ప్రమాదం ఉంటుంది. పార్లమెంటులోనూ పాలక పార్టీకి మెజారిటీ ఉంటుంది గానీ పార్లమెంటులో ప్రతిపక్షమూ ఉంటుంది, వారి అభిప్రాయాలను

వినవలసిన అగత్యమూ ఉంటుంది. అక్కడ జరిగే చర్చ బయటి ప్రపంచానికి తెలిసే అవకాశమూ ఉంటుంది.

ఇదీ షెడ్యూల్డు కులాలు, తెగల జాబితా రూపకల్పన, సవరణల సంగతి. రాష్ట్రపతి ప్రకటించి, పార్లమెంటుకు మాత్రమే సవరించే అధికారం ఉన్న ఈ ఎస్.సి, ఎస్.టి జాబితాను ఇతర సంస్థలన్నీ ఉన్నదున్నట్టు స్వీకరించవలసిందే. ఒక రాష్ట్ర ప్రభుత్వం, ఒక విశ్వవిద్యాలయం, ఒక ప్రభుత్వరంగ సంస్థ, ఒక మునిసిపాలిటీ ఎస్.సిలకు గానీ, ఎస్.టిలకు గానీ రిజర్వేషన్లు ఇయ్యదలచుకున్నా, స్కాలర్‌షిప్పులు ఇయ్యదలచుకున్నా, ఇతర ప్రోత్సాహకాలు ఇయ్యదలచుకున్నా ఈ జాబితాల ప్రకారమే ఇయ్యాలి. ఏ రాష్ట్ర ప్రభుత్వానికైనా తన రాష్ట్రానికి సంబంధించిన కులాన్నో లేక తెగనో చేర్చాలనో, తీసివేయాలనో అనిపిస్తే, కేంద్ర ప్రభుత్వానికి తెలిపి, వారిని ఒప్పించి పార్లమెంటులో చట్టం చేయించి ఆ పని చేయాలి.

ఇప్పుడు సుప్రీంకోర్టు ఏమంటుందంటే, షెడ్యూల్డు కులాలు లేక తెగల జాబితాలో ఒక కులాన్నో, తెగనో చేర్చే అధికారం లేక తీసివేసే అధికారం మాత్రమే కాదు, జాబితాను ఉన్నదున్నట్టుగా స్వీకరిస్తూ ఆ జాబితాలో ఉన్న కులాలకు ఇచ్చే ప్రత్యేక హక్కులను హేతుబద్ధంగా వర్గీకరించే అధికారం కూడ పార్లమెంటుకు మాత్రమే ఉందని.

ఇది సబబేనా?

ఒకసారి ఎస్.సి లేక ఎస్.టి జాబితాను ప్రకటించిన తరువాత ఆ జాబితాలోని కులాలకు లేక తెగలకు ప్రత్యేక అవకాశాలు, హక్కులు, సదుపాయాలు కల్పించే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకే కాదు, ప్రతీ ప్రభుత్వ సంస్థకు, ప్రతీ స్థానిక సంస్థకు, ప్రతీ పబ్లిక్ సెక్టార్ సంస్థకూ ఉంది. దానికి వారు పార్లమెంటు అనుమతి తీసుకోనక్కరలేదు. ఉదాహరణకు మీ ఊరి మునిసిపాలిటీ వారు మంచినీటి వసతికి కేటాయించిన డబ్బులలో 30 శాతం దళిత కుటుంబాలకు నీటి కనెక్షన్లనివ్వడానికి ఖర్చు పెట్టాలని నిర్ణయించుకోవచ్చు. రాష్ట్రానికి సంబంధించిన 59 ఎస్.సి కులాలనూ వారు ఎస్.సి కులాలుగా స్వీకరించాలంతే. ఆ విషయంలో ఎస్.సి జాబితాను అతిక్రమించకుండా ఉన్నంత కాలం, ఆ నిర్ణయం తీసుకోవడానికి మునిసిపాలిటీకి పార్లమెంటు అనుమతి గానీ, ఎవరి అనుమతి గానీ అక్కరలేదు.

మీది విశాఖపట్నం అనుకోండి. మీ ఊరిలోని దళితులందరికన్నా రెల్లీలు ఎక్కువ వెనుకబడి ఉన్నారని మీ మునిసిపాలిటీ భావించిందనుకోండి. దళిత కుటుంబాల కోసం ఖర్చు పెట్టదలచుకున్న 30 శాతం మంచినీటి వ్యవస్థ వనరులలో 20 శాతం మీ మునిసిపాలిటీ వారు రెల్లీల కోసం ఖర్చు పెట్టి మిగిలిన పదిశాతం ఇతర దళిత కుటుంబాల కోసం ఖర్చు పెట్టాలని నిర్ణయించుకున్నారనుకోండి. ఆ స్వేచ్ఛ మీ మునిసిపాలిటీకి ఉంటుందా ఉండదా?

మునిసిపాలిటీ నిధుల గురించి రేపెప్పుడయినా కేసు కోర్టుకెక్కితే సుప్రీంకోర్టు ఏమంటుందో గానీ విద్యా ఉద్యోగ రిజర్వేషన్ల విషయంలో ఆ స్వేచ్ఛ మునిసిపాలిటీకీ, జిల్లాపరిషత్‌కే కాదు, పార్లమెంటొక చట్టం చేసేదాకా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు సహితం లేదని అనింది. నిజానికి పైన ఇచ్చిన ఉదాహరణలో రెల్లీలు మరీ వెనుకబడి ఉన్నారని చెప్పి, దళిత కుటుంబాల నీటి కనెక్షన్ల కోసం కేటాయించిన నిధులలో కొంచెం ఎక్కువ వారికి కేటాయించినట్టు చెప్పాను. మన రాష్ట్ర ప్రభుత్వం చేసిన రిజర్వేషన్ల వర్గీకరణలో అది సహితం లేదు. రెల్లీలకూ, మాదిగలకూ వారి దామాషా కంటే ఎక్కువ ఇచ్చే ఆలోచన చేయలేదు. ఎవరి వాటా వారికిచ్చే ఆలోచన మాత్రమే చేసింది.

ఇది చెల్లదనడంలో సుప్రీంకోర్టు అనుసరించిన తర్కం ఏమిటి? ఆర్టికల్ 341(2) ఏమంటుందంటే, రాష్ట్రపతి ప్రకటించిన షెడ్యూల్డు కులాల జాబితాలో పార్లమెంటు ఒక చట్టం చేయడం ద్వారా ఒక కులాన్ని లేక కులంలో భాగాన్ని చేర్చవచ్చు, తీసేయవచ్చు. ఈ విధంగా తప్ప 'వేరే ఏ విధంగానూ రాష్ట్రపతి జారీ చేసిన జాబితాను మార్చడానికి వీలు లేదు. ఇక్కడ జాబితాను మార్చడం అంటే అందులో ఒక కులాన్ని చేర్చడం లేక తీసివేయడం అని మాత్రమే అర్థం. రాష్ట్ర ప్రభుత్వం చేసిన వర్గీకరణ ఫలితంగా ఆ జాబితాలో కొత్తగా ఒక్క కులమూ ప్రవేశించలేదు, ఒక్క కులమూ బయటకు పోలేదు. అన్ని ఎస్.సి కులాలకూ కలిపి ఇచ్చిన రిజర్వేషన్‌ను నాలుగుగా విడగొట్టి జాబితాలో నాలుగు ఉపవర్గాలకు ఎవరి కోటా వారికి ఇవ్వడం జరిగిందంతే.

ఇది ఆర్టికల్ 341(2) ప్రకారం పార్లమెంటుకు మాత్రమే ఉండే అధికారం అని సుప్రీంకోర్టు ఏ విధంగా అనింది? 341(2)లో లేని మాటలు చేర్చి, రాష్ట్రపతి ప్రకటించిన జాబితాలో ఏ రకంగా జోక్యం చేసుకున్నా, దానిని కదిలించినా, దానిలో

ఉపవర్గాలను గుర్తించినా అది కూడ ఆర్టికల్ 341(2)లోని నిషేధానికి గురి అవుతుందని అనింది. కులాలను ఆ జాబితాలోకి 'చేర్చడం, తొలగించడం' అన్న స్పష్టమైన మాటలకు ఇంతటి విపరీత అర్థం ఎక్కడినుండి వచ్చింది? సుప్రీంకోర్టయినా ఏ కోర్టయినా చట్టాన్నీ, రాజ్యాంగాన్నీ వ్యాఖ్యానిస్తాయి తప్ప తిరగరాయవని న్యాయ సిద్ధాంతం అంటుంది. తిరగరాసే అధికారం ప్రజలు ఎన్నుకునే శాసనసభలకు మాత్రమే ఉండడం ప్రజాస్వామ్య వ్యవస్థలకు ఉండే ఆరోగ్యకరమైన లక్షణాలలో ఒకటి. ఆ మాటే సుప్రీంకోర్టు వేరే సందర్భాలలో అంటూ ఉంటుంది. కానీ తానే ఇప్పుడు ఆర్టికల్ 341(2)ను పూర్తిగా తిరగరాసింది.

ఒక చట్టం అస్పష్టంగానో, అసంపూర్ణంగానో ఉన్నప్పుడు దానిని వ్యాఖ్యానించే క్రమంలో కోర్టులు ఆ ఖాళీని పూరించవచ్చు. ఆ విధంగా కోర్టులు కూడ కొంతమేరకు శాసనాధికారం చలాయిస్తుంటాయి. కానీ ఆర్టికల్ 341(2)లో ఎటువంటి అస్పష్టతా లేదు. శాసనకర్తలు వాడిన భాషలో అస్పష్టత ఏదీ లేనప్పుడు దానిలో మార్పులు చేర్పులూ చేసే అధికారం న్యాయస్థానాలకు లేదనేది అందరూ అంగీకరించే న్యాయసిద్ధాంత సూత్రం. అటువంటప్పుడు ఆర్టికల్ 341(2)కు విపరీత అర్థం కల్పించే అధికారం సుప్రీంకోర్టుకు ఎవరిచ్చారు?

ఇక్కడితో ఆగిపోయి ఉన్నా ఒక రకం. లేని పెత్తనం చలాయించిందని సుప్రీంకోర్టును విమర్శించినా, పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి వర్గీకరణ సాధించుకునే అవకాశం ఇంకా మిగిలి ఉందని సర్దుకుపోదుము.

కానీ పార్లమెంటుకు మాత్రమే ఆ అధికారం ఉందని చెప్పిన తరువాత, పార్లమెంటుకు కూడ ఆ అధికారం లేదని ప్రకటించింది రాజ్యాంగ ధర్మాసనం. ఎందుకంట? షెడ్యూల్డు కులాలు అనేది ఒక అవిభాజ్యమైన (హోమోజెనస్) వర్గమంట. అని ఎవరు చెప్పారు? రాజ్యాంగమే చెప్పిందంట.

రాజ్యాంగం అంతమాటేం అనలేదు. రాష్ట్రపతి ఒక్కొక్క రాష్ట్రానికి సంబంధించి ఆ రాష్ట్ర గవర్నర్‌ను సంప్రదించి ఏ కులాలు లేక తెగలు లేక జాతులు లేక కులాలలో తెగలలో జాతులలో భాగాలు షెడ్యూల్డు కులాలుగా పరిగణించబడతాయో నిర్ణయించి ప్రకటిస్తాడు. అవే షెడ్యూల్డు కులాలు అని రాజ్యాంగం ఆర్టికల్ 341(1)లో అంటుంది.

ఈ నిర్వచనం చదవగానే మొదట స్ఫురించేది దానిలో బహుళత్వం. కొన్ని కులాలు, తెగలు, జాతులు, వాటి శకలాలు కలిసి 'షెడ్యూల్డు కులాలు' అవుతాయి.

అదొక అవిభాజ్యమైన వర్గం అన్న భావం ఈ నిర్వచనంలో ఎక్కడుంది? అయిదుగురు జడ్జీలకు కనిపించింది మరి.

ఏ విధంగా?

రాజ్యాంగం రాకముందు అవి వేరు వేరు కులాలు అయి ఉండవచ్చు. ఇప్పటికీ సాంఘికంగా వేరు వేరు కులాలే కావచ్చు. అయితే ఆ కులాలన్నీ చాలా అణగారి ఉన్నాయని గుర్తించి ప్రత్యేకమైన ప్రభుత్వ అండ వారికి అవసరమని గుర్తించి వాటినన్నిటికీ కలిపి 'షెడ్యూల్డు కులాలు' అని ఎప్పుడయితే రాజ్యాంగం పేరు పెట్టిందో అప్పుడిక రాజ్యాంగానికి సంబంధించినంత వరకు అవన్నీ కలిసి ఒకే వర్గం అయిపోయినట్టే, అవిభాజ్యం అయిపోయినట్టేనని వాదించడం ద్వారా అది సాధ్యం అయింది. ఎప్పుడయితే ఆ కులాలన్నీ (రాజ్యాంగానికి సంబంధించినంతవరకు) తమ ప్రత్యేకతలన్నీ కోల్పోయి ఒకే అవిభాజ్యమైన వర్గం అయిపోయాయో ఇక రాజ్యాంగం నుండి సంక్రమించే అధికారం చలాయించే వారెవ్వరూ ఆ కులాలలో ఒకరెక్కువ ఒకరు తక్కువ, ఒకరు మరీ వెనుకబడి ఉన్నారు, ఒకరి స్థితి కొంచెం ఫరవాలేదు అని వర్గీకరించడానికి వీలులేదని దీనినుండి నిర్ధారించారు.

1976లో ఇచ్చిన ఒక తీర్పులో జస్టిస్ కృష్ణయ్యర్ చేసిన వ్యాఖ్య భావాన్నే మార్చేసి, కృష్ణయ్యర్ కూడ ఇదే అన్నాడు అన్నారు ఈ అయిదుగురు న్యాయకోవిదులు. 'షెడ్యూల్డు కులాలు అనేది ఒక కులం కాదు. అది కొన్ని కులాలు, తెగలు, జాతులు, వాటి శకలాల సముదాయం . వీరు చాలా అణగారి ఉన్నారనీ వీరికి భారీగా ప్రభుత్వ సహాయం అవసరం అని గుర్తించి ఈ కులాలు, తెగలు, జాతులు, వాటి శకలాలన్నిటినీ ఒక సముదాయంగా గుర్తించగా ఏర్పడిందే షెడ్యూల్డు కులాలు అనే జాబితా' అని జస్టిస్ కృష్ణయ్యర్ అన్నారు. దీన్ని ఉటంకిస్తూ 'కాబట్టి షెడ్యూల్డు కులాలు అనేది ఒక అవిభాజ్యమైన వర్గం' అని అయిదుగురు జడ్జిలు వ్యాఖ్యానించారు. అది ఎంత విజ్ఞత గల వ్యాఖ్యో మీరే నిర్ణయించండి.

నిజానికి, ఒక వెనుకబడిన సామాజిక వర్గానికి రిజర్వేషన్లు కల్పించిన తరువాత ఆ రిజర్వేషన్లు ఆ వర్గంలోని వారందరూ సంపూర్ణంగా అందుకోవడం కోసం ఆ వర్గాన్ని వెనుకబడినవారు, మరీ వెనుకబడిన వారు అని వర్గీకరించవచ్చునా అన్న ప్రశ్న ఇవాళ కొత్తగా కోర్టు ముందుకొస్తున్నది కాదు. మన రాష్ట్రంలో బి.సిలను ఎబిసిడిలుగా విభజించడం రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు 1972 లోనే

ప్రకటించింది. బి.సిలకు వర్తించేది ఎస్.సిలకు వర్తిస్తుందా అన్న సందేహానికి ఆస్కారం లేకుండ మండల్ కమిషన్ కేసు (ఇందిరా సహానీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా) విచారించిన తొమ్మిది మంది జడ్జిల రాజ్యాంగ ధర్మాసనం అటువంటి వర్గీకరణ ఎస్.సిలలో చేసినా తప్పు లేదనింది. మండల్ కమిషన్ కేసుకున్న ప్రత్యేకత ఏమిటంటే, ఆ కమిషన్ రిపోర్టు ఆధారంగా బి.సిలకు ఇచ్చిన రిజర్వేషన్ చెల్లుతుందా అన్నది ఆ కేసు వేసిన వారు లేవదీసిన ప్రశ్న కాగా, దానిని విచారించిన ధర్మాసనం 'రిజర్వేషన్ల విషయంలో పదే పదే తలెత్తుతున్న అన్ని ప్రశ్నలకూ జవాబు చెప్పదలచుకున్నాం' అని ప్రకటించి, 14 ప్రశ్నలు వేసుకొని, అన్నిటి గురించీ వాదనలు విని తీర్పు ప్రకటించింది. ఆ 14లో అయిదవ ప్రశ్న వర్గీకరణకు సంబంధించినది. సహేతుకమయితే వర్గీకరణ చేయవచ్చునని ఆ ధర్మాసనం చెప్పింది. ఆ కేసు బి.సి రిజర్వేషన్ల కేసు కాబట్టి ఆ అభిప్రాయం బి.సి రిజర్వేషన్లకే వర్తిస్తుందని వాదించడానికి ఆస్కారం లేదు. ఎందుకంటే ఆ ధర్మాసనం ఉద్దేశ్యపూర్వకంగానే రిజర్వేషన్లకు సంబంధించిన 'అన్ని ప్రశ్నలకూ' జవాబు చెప్పడానికి పూనుకుంది. మామూలుగా, పెద్ద ధర్మాసనం తీర్పుకు చిన్న ధర్మాసనం కట్టుబడి ఉంటుందనేది న్యాయవ్యవస్థ క్రమశిక్షణలో అనుల్లంఘనీయమైన నియమం. ఈ కేసులో సుప్రీంకోర్టు దానిని కూడ అతిక్రమించింది.

షెడ్యూల్డు కులాలన్నీ నిజంగానే ఒకే స్థాయిలో, ఒకే అభివృద్ధి దశలో ఉన్నాయని గానీ, ఆ కులాల మధ్య హెచ్చుతగ్గులు లేవని గానీ సుప్రీంకోర్టు భావించలేదని మొదట్లో చెప్పిన విషయం మరొకసారి జ్ఞాపకం చేయాలి. ఆ విధంగా భావించి ఉంటే, దానికి కనీసం వారికి సంతృప్తినిచ్చే ఆధారాలు ఉండి ఉంటే, తక్కిన అభిప్రాయాలను క్షమించి ఉండవచ్చునేమో. కానీ అసమానతలనూ, అంతరాలనూ ఒప్పుకుంటూనే వాటి గురించి ఏమీ చేయడానికి వీలులేదనే వైఖరిని క్షమించడం కష్టం. పైగా రాజ్యాంగం అవకాశం ఇవ్వదనడం విడ్డూరం కూడ. భారత రాజ్యాంగంలో లోపాలు చాలానే ఉన్నాయి గానీ ఒక అన్యాయాన్ని గుర్తించిన తరువాత, అది అన్యాయమేనని అందరూ అంగీకరించిన తరువాత, దాని పరిష్కారానికి ఏ అవకాశమూ రాజ్యాంగంలో లేదనడం, దానికి అన్యాయమని పేరు పెట్టడాన్నే రాజ్యాంగం ఒప్పుకోదనడం భారత రాజ్యాంగాన్ని అర్థం చేసుకున్న వారెవరూ అంగీకరించగల విషయం కాదు. రాజ్యాంగం కల్పించే అవకాశం రాజకీయంగా ఎంతయినా కష్టతరం కావచ్చు. అది వేరే సంగతి. కానీ ఫలానా అసమానతను

చూడడానికే వీలులేదని భారత రాజ్యాంగం అంటుందంటే ఒప్పుకోవడం కష్టం (జాతుల స్వయం నిర్ణయాధికార కాంక్ష ఒక్కటే దీనికి మినహాయింపు).

వివిధ షెడ్యూల్డు కులాలు రిజర్వేషన్లను ఒకే దామాషాలో అందుకోలేక పోతున్నాయనేది అందరూ ఒప్పుకుంటున్న వాస్తవం. సంస్కృతిలో, ఆచారాలలో కూడ షెడ్యూల్డు కులాలలో నిచ్చెన మెట్ల అంతరాలు ఉన్న మాట వాస్తవం. రిజర్వేషన్లలో ఎవరి వాటా వారికిచ్చేయడం ఈ స్థితిని కొంతవరకు మెరుగుపరచగలదనేది నిర్వివాదం. అయినప్పటికీ రాజ్యాంగం షెడ్యూల్డు కులాలను అవిభాజ్యమైన వర్గంగా గుర్తించింది కాబట్టి ఆచరణాత్మకమైన ఈ (పాక్షిక) పరిష్కారం రాజ్యాంగం పరిధిలో సాధ్యం కాదనేది భారత రాజ్యాంగానికున్న స్వాభావికమైన తర్కానికి అతికే అభిప్రాయమయితే కాదు. అయిదుగురు సుప్రీంకోర్టు జడ్జీలు ఏకగ్రీవంగా ప్రకటించినంత మాత్రాన అయిపోదు.

అంతా అయిన తరువాత, దళితుల లోపలి అసమానతల గురించి ఏమీ అనకపోతే బాగుండదనుకున్నారో ఏమో, అయిదుగురు జడ్జిలలో ఒకరయిన జస్టిస్ సత్యబ్రత సిన్హాగారు రెల్లీల గురించి ప్రస్తావించి 'ఆ కులానికి చెందిన వారెవ్వరూ ఇంజనీరింగ్ లేక మెడికల్ కాలేజీలలో సీట్లు పొందలేదు. వాళ్లకు ఇంజనీరింగ్ కాలేజీలలో, మెడికల్ కాలేజీలలో రిజర్వేషన్లు ఇవ్వడం వల్ల ఏం ప్రయోజనం?' అన్నారు. 'వాళ్లకు స్కాలర్‌షిప్పులు, హాస్టళ్లు, స్పెషల్ కోచింగ్' ఇవ్వాలన్నారు. ఇవ్వాల్సిందే. స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్లయితే ఇస్తున్నారు కూడ. కానీ వాటిని ఉపయోగించుకొని కొంచెం మంచి మార్కులు తెచ్చుకున్నా వృత్తి విద్యా కోర్సులలో సీట్లు రావు. ఎస్.సి కోటాలో కూడ రావు. అప్పుడేం చేయాలి? మొట్టమొదట శూద్ర కులాలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్నప్పుడు బ్రాహ్మణులు ఇవే మాటలన్నారు. స్కాలర్‌షిప్పులివ్వండి, స్పెషల్ కోచింగ్ ఇవ్వండి, రిజర్వేషన్లు వద్దు అన్నారు. బి.సిలకు రిజర్వేషన్లివ్వాలని మండల్ కమిషన్ సూచించినప్పుడు బ్రాహ్మణ-శూద్ర అగ్రకులాల వారూ ఇదే అన్నారు. స్కాలర్‌షిప్పులివ్వండి, హాస్టళ్లు నెలకొల్పండి, రిజర్వేషన్లు వద్దు అన్నారు. ప్రతీసారీ కోర్టులే అవన్నీ వేరు, రిజర్వేషన్లు వేరు, దేని అవసరం దానిదే, దేని పాత్ర దానిదే అంటూ తీర్పులిచ్చాయి. ఇప్పుడు సుప్రీంకోర్టు 'రెల్లీలకు రిజర్వేషన్లు ఇచ్చి ఏం ప్రయోజనం? కోచింగ్ ఇవ్వండి, స్కాలర్ షిప్పులివ్వండి' అంటున్నది. భూమి గుండ్రంగా తిరిగి మొదటికొచ్చినట్టుంది.

ఈ తిరోగమనం జస్టిస్ సిన్హా గారి నోట వెలువడడం ఉచితమే. ఆయన మన హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి సుప్రీంకోర్టుకు పోయారు. రాజ్యాంగంలో ఉండే సామాజిక న్యాయ స్ఫూర్తి పట్ల ఆయనకు ఏ మాత్రం ఏకీభావం లేదనేది ఆయన తీర్పులెరిగిన వారికి కొత్త కాదు. ఈ మధ్యనే వేరొక తీర్పులో ఆయన ప్రపంచీకరణను ప్రస్తావిస్తూ, ప్రపంచంలో వీస్తున్న గాలులను కోర్టులు చూడడానికి నిరాకరించకూడదనీ, పాతకాలపు ఆలోచనలను పట్టుకొని వేళ్లాడకూడదనీ అన్నారు. సామాజిక న్యాయం కూడ ఒక పాతకాలపు ఆలోచనే మరి.

*మొదటి ముద్రణ : మానవహక్కుల వేదిక బులెటిన్ 7, మే 2005*
*రెండవ ముద్రణ : 'రిజర్వేషన్లు : ప్రజాస్వామిక దృక్పథం', 2013*
*(పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ)*

# సమాన విద్యావకాశాలకు సుప్రీంకోర్టు కూడ ఆటంకమైతే ఎలా?

ప్రైవేట్ వృత్తి విద్యా సంస్థలు రిజర్వేషన్లు ఇవ్వనక్కరలేదంటూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు చాలా ఆగ్రహానికీ, అలజడికీ దారితీసింది.

ఆ ఆగ్రహాన్నీ, అలజడినీ చూసిన దేశ ప్రధాన న్యాయమూర్తి అలిగి, 'మా ధర్మం మేము నిర్వర్తిస్తున్నాం. మీకు మా తీర్పులు నచ్చకపోతే కోర్టులను మూసేసి మీ యిష్టం వచ్చినట్టు పరిపాలించుకోండి' అన్న సంగతి కూడ పత్రికలలో చూశాం. 'అయినా మేం ఏమన్నామని మా మీద ఇంత కోపం? ప్రైవేట్ వృత్తి విద్యా సంస్థలు రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటే దానికి చట్టం చేయండి అన్నామంతే. మీరు చట్టం చేయలేక కోర్టులను ఆడిపోసుకోవడం ఎందుకు?' అని కూడ దేశ ప్రధాన న్యాయమూర్తి అన్నట్టు పత్రికలలో వచ్చింది.

ప్రధాన న్యాయమూర్తిగారు ఈ ప్రవచనాలు మౌఖికంగా అన్నవే తప్ప ఏ తీర్పులోనూ భాగం కాదు కాబట్టి పత్రికలలో ప్రచురించినవే ఆయన వాడిన మాటలా అంటే కచ్చితంగా చెప్పలేముగానీ రెండు విషయాలు మాత్రం కచ్చితంగా చెప్పగలం. పాలనా వ్యవస్థ మీద, చట్టసభల మీద న్యాయస్థానాలు తమకు సందర్భోచితం అని తోచినప్పుడు తీవ్రమైన వ్యాఖ్యలు చేయడం చాలా కాలంగా చూస్తూనే ఉన్నాం. బూటాసింగ్ వ్యవహారంలో గవర్నర్ల వ్యవస్థ గురించి కూడ సుప్రీంకోర్టు నిక్కచ్చిగా వ్యాఖ్యానించడం

చూశాం. మరి న్యాయస్థానాల తీరును సందర్భోచితం అని తోచినప్పుడు అంతే తీవ్రంగా విమర్శించే స్వేచ్ఛ చట్టసభలకూ పాలనా యంత్రాంగానికీ ఎందుకు ఉండదు? ఈ వ్యవస్థలలో ఒకటి ఎక్కువ, ఒకటి తక్కువ అని రాజ్యాంగంలో ఎక్కడా చెప్పలేదే. ఇక ప్రజల మాటకొస్తే, రాజ్యాంగానికి మూలం ప్రజలే కాబట్టి మూడు వ్యవస్థలనూ స్వేచ్ఛగా విమర్శించే హక్కు ప్రజలకెందుకు ఉండదు?

రెండు, 'మేం ఏమన్నాం' అంటూ దేశ ప్రధాన న్యాయమూర్తి ఇచ్చిన వివరణ నిజమే అయితే చాలా దురదృష్టకరమని భావించవలసి ఉంటుంది. ఆయన తెలిసీ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని భావించవలసి ఉంటుంది. ప్రైవేట్ వృత్తి విద్యా సంస్థలు ఎస్.సి, ఎస్.టి, బి.సి కులాలకూ, స్త్రీలకూ, వికలాంగులకూ రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం కోరుకున్నట్టయితే దానికొక చట్టం చేయవలసి ఉంటుంది అని మాత్రమే సుప్రీంకోర్టు అని ఉంటే ఎవరికయినా ఎందుకు కోపం వస్తుంది? ఏ ప్రైవేట్ వ్యాపారంపైన అయినా ఏ ఆంక్షలయినా ప్రభుత్వం పెట్టదలచుకుంటే అది చట్టం ద్వారా చేయవలసిందేనని రాజ్యాంగాన్ని ఎరిగిన వారందరికీ తెలుసును. ఆ మాటే సుప్రీంకోర్టు అని ఉంటే కోపాలెందుకొస్తాయి? సుప్రీంకోర్టు అనింది అది కాదు. ప్రభుత్వం నుండి 'ఎయిడ్' (నిధులు) పొందని ప్రైవేట్ విద్యా సంస్థలు రిజర్వేషన్లు పాటించనే అక్కరలేదనీ, వారు పాటించాలనడం రాజ్యాంగ విరుద్ధమనీ అనింది.

"ఎయిడ్ (ప్రభుత్వ నిధులు) పొందని ప్రైవేట్ వృత్తి విద్యా సంస్థలు ప్రభుత్వం సూచించిన వారికి సీట్లు ఇవ్వాలనడం గానీ, రిజర్వేషన్ విధానాన్ని పాటించాలనడం గానీ వారి హక్కుల పైన, స్వయంప్రతిపత్తి పైన తీవ్రమైన దాడి."

"దీని అర్థం ఆ సీట్లను ప్రభుత్వం జాతీయం చేసిందని. ప్రైవేట్ విద్యా సంస్థలలో సీట్లను జాతీయం చేయడం చెల్లదని ఈ కోర్టు ఎప్పుడో స్పష్టం చేసింది."

"వృత్తి విద్యా సంస్థలు నెలకొల్పడానికి అవసరమైన నిధులు ప్రభుత్వం వద్ద లేవు. అలాంటప్పుడు మెరుగైన వృత్తి విద్య కల్పించడానికి ప్రైవేట్ రంగంలో ముందుకొచ్చిన వారు ప్రభుత్వ రిజర్వేషన్ విధానాన్ని అనుసరించి ప్రతిభ తక్కువ ఉన్న విద్యార్థులకు సీట్లు ఇవ్వాలని బలవంతం చేయడం తగదు."

ఇవీ సుప్రీంకోర్టు మొన్న (ఇనాందార్ వర్సస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో) అన్న మాటలు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం అయినట్టయితే, దానికొక చట్టం చేస్తే ఎంత, చేయకపోతే ఎంత?

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు నిజంగా రాజ్యాంగ విరుద్ధమా అన్న ప్రశ్నను పక్కన పెడదాం. నిజానికి ఏ వ్యాపారం మీదనయినా ప్రజా సామాన్యం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సహేతుకమైన పరిమితులు విధించవచ్చునని రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(6) లో చెప్తుంది. 'ప్రజా సామాన్యం ప్రయోజనాలు' అనేది చాలా విస్తృతమైన ప్రయోగమనీ, రాజ్యాంగ ఆదేశిక సూత్రాల అమలు కూడ దాని కిందికి వస్తుందని సుప్రీంకోర్టు పలుమార్లు వ్యాఖ్యానించింది. సామాజిక న్యాయమనేది రాజ్యాంగ ఆదేశిక సూత్రాల సారాంశం కాబట్టి సామాజిక న్యాయం కోసం ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించడానికి ప్రభుత్వం ఒక చట్టం చేస్తే అది తప్పక రాజ్యాంగబద్ధమే అవుతుంది.

అదట్లాగుంచి, తప్పో ఒప్పో తన అభిప్రాయం ప్రకటించడానికి సుప్రీంకోర్టు ఎంచుకున్న పద్ధతి సరయినదా? నిజమే ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలన్న చట్టమేదీ ప్రభుత్వం ఇప్పటిదాకా చేయలేదు. చట్టం చేసి వుంటే, దానినెవరయినా సవాలు చేసి ఉంటే, రిజర్వేషన్ పొందవలసిన వర్గాలు కూడ ఆ వ్యాజ్యంలో భాగమై తమ తరఫున న్యాయవాదులను పెట్టుకుని ఉందురు. అప్పుడు అందరి అభిప్రాయాలూ విని సుప్రీంకోర్టు తన అభిప్రాయం ప్రకటించి ఉంటే, ఆ అభిప్రాయంతో ఏకీభవించినా, లేకున్నా అత్యున్నత న్యాయస్థానం ఒక పద్ధతి ప్రకారం నడుచుకుందని అందుము.

ఇప్పుడది ఏదీ లేదే! 'ఎయిడ్' పొందని ప్రైవేట్ వృత్తి విద్యా సంస్థల పైన ప్రభుత్వానికి ఉండే అజమాయిషీ ఎంత అనే అంశం మీద వ్యాజ్యం సుప్రీంకోర్టు ముందుకొచ్చింది. 2002లో 11 మంది న్యాయమూర్తుల ధర్మాసనం దానిమీద తీర్పు ఇచ్చింది. (దీనిని టి.ఎం.ఏ పాయ్ కేసు అంటారు.) ఆ తీర్పులో కొన్ని ముఖ్యమైన విషయాలు అస్పష్టంగా ఉన్నాయని సుప్రీంకోర్టుకే అనిపించడం వల్ల ఆ అస్పష్టమైన వాక్యాలను స్పష్టపరచడానికి 2003లో అయిదుగురు జడ్జిల ధర్మాసనం కూర్చునింది (ఇస్లామిక్ అకాడమీ కేసు). ఈ తీర్పు కూడ స్పష్టపరచవలసింది పోయి వక్రీకరించిందన్న ప్రైవేట్ విద్యా సంస్థల అభియోగంలో న్యాయం ఉందని సుప్రీంకోర్టుకే మళ్లీ అనిపించి, ఆ స్పష్టీకరణ సరయినదా కాదా అని తేల్చడానికి ఏడుగురు జడ్జిల ధర్మాసనం పూనుకుంది (ఇనాందార్ కేసు). ఆ తీర్పే మొన్న రచ్చకు దారితీసింది. ఈ మొత్తం వ్యాజ్యంలో ప్రైవేట్ విద్యా సంస్థలు, ప్రభుత్వమూ మాత్రమే పార్టీలు. వారికి రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేదు, వీరికీ ఇప్పించాలని పెద్దగా ఆసక్తి లేదు. వారిద్దరి వాదనలూ విని ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం అని ఏడుగురు

న్యాయమూర్తుల ధర్మాసనం ప్రకటించేయడం ఏం న్యాయం? రిజర్వేషన్లు డిమాండ్ చేస్తున్న సామాజిక వర్గాలు వ్యాజ్యంలో భాగం కాదు, వారి వాదనలు కోర్టు వినలేదు. విని ఉంటే పైన మేము రెండు వాక్యాలలో ప్రతిపాదించిన వాదన వివరంగా చేసి ఉందురు. ఆ అవకాశమే లేకుండ వారి ఆకాంక్ష మీద నీళ్లు గుమ్మరించడం కోపం తెప్పించదా? చేసిన పని చేసేసి, 'మా తీర్పులు నచ్చకపోతే కోర్టులు మూసేయండి' అంటూ అలగడం ఎందుకు?

## విద్యా రంగం ప్రైవేటీకరణ - కోర్టులు

ప్రపంచీకరణ, ఆర్థిక సంస్కరణలలో భాగంగా ఒక దశాబ్ద కాలంగా దేశంలో వేగంగా పెరుగుతున్న విద్యారంగ ప్రైవేటీకరణ పట్ల సుప్రీంకోర్టు అనుసరిస్తున్న వైఖరిని మొత్తంగా చూసినప్పుడు ఈ తీర్పు పెద్దగా ఆశ్చర్యం కలిగించదు. విద్యను వ్యాపారం చేయడానికి వీలులేదన్న అభిప్రాయం నుండి సుప్రీంకోర్టు ఇప్పటిదాకా పక్కకు తొలగలేదు. అయితే ప్రైవేట్ విద్యా సంస్థలు చేస్తున్నది వ్యాపారం అన్న విషయం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ దానిని చూడడానికి కోర్టుకు మనస్కరించడం లేదు.

విద్యా సంస్థలను నెలకొల్పడం వ్యాపారం కిందికి రాదనీ అదొక వ్యాపకం అనీ సుప్రీంకోర్టు అంటుంది. ఆ వ్యాపకం వ్యాపారంగా మారిపోయినా దానిని వ్యాపకంగానే చూస్తాననంటుంది. వ్యాపారమో వ్యాపకమో, దానిని సామాజిక ప్రయోజనాల దృష్ట్యా నియంత్రించే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని సూత్రప్రాయంగా ఒప్పుకుంటుంది. కానీ "మేము స్వంత నిధులతో సంస్థను నిర్వహిస్తున్నప్పుడు మా వ్యవహారాలలో జోక్యం చేసుకోవడానికి ప్రభుత్వానికేం అధికారం ఉంది?'' అన్న వారి వాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరించదు. తిరస్కరించకపోగా చాలా సానుభూతితో చూస్తుంది.

ఈ అస్పష్ట వైఖరి నుండే అస్పష్టమైన తీర్పులు వెలువడుతున్నాయి. లేకపోతే 2002లో 11 మంది జడ్జిలు ఇచ్చిన తీర్పును 2003లో అయిదుగురు జడ్జిలు కూర్చొని స్పష్టీకరించవలసి రావడం, ఆ స్పష్టీకరణ సరిగ్గా ఉందా లేదా అని 2005లో మళ్ళీ ఏడుగురు జడ్జిలు పరిశీలించవలసి రావడం జరిగేది కాదు. న్యాయస్థానాల పట్ల ఇంకా గౌరవం ఉండబట్టి సరిపోయిందిగానీ లేకపోతే ప్రజలు సుప్రీంకోర్టును హాస్యం పట్టించి ఉందురు. మంచి తీర్పులిస్తారో చెడ్డ తీర్పులిస్తారో కనీసం వాటిని

స్పష్టంగానయినా రాయలేరా అని అడిగితే 'అత్యున్నత' న్యాయమూర్తులు ఏం జవాబు చెప్తారు? ఒక్కొక్కసారి ఒక తీర్పు ఇచ్చిన తరువాత 20 లేక 30 సంవత్సరాలకు మారిన పరిస్థితులలో దానిని సక్రమంగా అన్వయించడానికి పునఃపరిశీలించవలసిన అవసరం వస్తుంటుంది. కానీ మూడేళ్లలో రెండుసార్లు పునఃపరిశీలించవలసి వచ్చే తీర్పును ఏమనాలి? చట్టాలు, ప్రభుత్వ తాఖీదులు అస్పష్టంగా ఉంటే న్యాయస్థానాలు ప్రభుత్వాల పైన విరుచుకు పడుతుంటాయి. మీరు ఏం చెప్పదలచుకున్నారో మీకే తెలీదా అని అభిశంసిస్తుంటాయి. ఇప్పుడు ఆ ప్రశ్నే సుప్రీంకోర్టును అడగనక్కరలేదా?

మూడేళ్లలో రెండుసార్లు పునఃపరిశీలించిన తరువాతయినా అస్పష్టత తీరిందా అంటే తీరలేదు. ఇంకొక సంవత్సరం తిరిగేలోపల తొమ్మిది మంది జడ్జిలు కూర్చొని ఇనాందార్ కేసులో ఇస్లామిక్ అకాడమీ కేసు తీర్పుపైన చేసిన వ్యాఖ్యలను పునఃపరిశీలించినా, 13 మంది జడ్జిలు కూర్చొని టిఎంఎ పాయ్ కేసు తీర్పునే పునఃపరిశీలించినా ఆశ్చర్యపోవద్దు. నిక్కచ్చిగా మా అభిప్రాయం చెప్పాలంటే 'విద్యను వ్యాపారం చేసుకోవచ్చు. దానిలో తప్పేమీ లేదు' అని సుప్రీంకోర్టు నిర్మొహమాటంగా ప్రకటించేదాకా ఈ ప్రహసనం సాగుతూనే ఉంటుంది. ఒకదాని తరువాత ఒకటి వెలువడుతున్న తీర్పులు ఆ దిశనే చూపిస్తున్నాయి.

ప్రస్తుతానికి 11+5+7 మంది జడ్జిలు తర్కించి తర్కించి ఒక విషయం మాత్రమే స్పష్టం చేశారు. ప్రైవేట్ విద్యా సంస్థలు రిజర్వేషన్లు ఇయ్యనక్కర లేదని. విద్యార్థుల విద్య హక్కుకు కీలకమైన మరి రెండు విషయాలు ఇనాందార్ కేసు తరువాత కూడ అస్పష్టంగానే ఉండిపోయాయి. ఒకటి ఫీజు పరిమాణం, రెండు అడ్మిషన్ల పద్ధతి.

విద్యాభ్యాసం కల్పించడం వ్యాపకమే తప్ప వ్యాపారం కాదు కాబట్టి లాభాలు దండుకోకూడదు గానీ, ఖర్చులు వసూలు చేసుకోవచ్చునని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. 'ఖర్చులు' అనే దానిలో ప్రస్తుత వ్యయమే కాక రాబోయే రోజులలో సంస్థ విస్తరణ కోసం, మెరుగుదల కోసం పెట్టబోయే వ్యయాన్ని కూడ లెక్కించవచ్చునని స్పష్టం చేసింది. ఈ భవిష్యత్ వ్యయం ఎంత ఉండవచ్చునో నిర్ణయించే పద్ధతిని నిర్దేశించడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు (లేక కేంద్ర ప్రభుత్వం) చట్టం చేయవచ్చునని అంటూ, అప్పటిదాకా ప్రతీ రాష్ట్రంలోనూ ఒక రిటైర్డు హైకోర్టు జడ్జి నేతృత్వంలో ఒక కమిటీ వేయాలని చెప్పింది. కానీ 'భవిష్యత్ విస్తరణ వ్యయం' పేరిట వసూలు చేసిన ఫీజును దాని కోసం ఖర్చుచేయక వ్యాపార లాభంగా జేబులో వేసుకుంటే చూసేదెవరు?

చూసినా చేయగలిగిందేముంది? బలవంతంగా సంస్థ విస్తరణ చేయిస్తారా, లేక పాత విద్యార్థులకు పైసలు వెనక్కి ఇప్పిస్తారా? ఇవి ఆచరణ సాధ్యం అయిన విషయాలా? ఈ ప్రశ్నలకు మూడు తీర్పులలోనూ జవాబు లేదు. భవిష్యత్ విస్తరణ వ్యయం పేరిట, కూడదు కూడదంటున్న వ్యాపార లాభాలకు సుప్రీంకోర్టు తలుపులు తెరిచి ఉంచిందని వ్యాఖ్యానిస్తే అబద్ధం అవుతుందా?

ప్రైవేట్ విద్యా సంస్థలలో అడ్మిషన్ల పద్ధతి ఏవిధంగా ఉండాలనేదీ ఇప్పటికీ అస్పష్టంగానే ఉంది. ఇక మీదట ప్రభుత్వం ఎంసెట్ పరీక్ష నిర్వహించి కౌన్సెలింగ్ జరిపి ప్రైవేట్ ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలకు విద్యార్థులను కేటాయిస్తుందా, లేక వేరే ఏదయినా అడ్మిషన్ పద్ధతి అమలవుతుందా? అనేది విద్యార్థులను ఆదుర్దాకు గురిచేస్తున్న ప్రశ్న. టిఎంఎ పాయ్ కేసు తీర్పునూ, దానిని వ్యాఖ్యానించిన ఇస్లామిక్ అకాడమీ కేసు తీర్పునూ, దానిని పునఃపరిశీలించిన ఇనాందార్ కేసు తీర్పునూ ఆద్యంతం చదివినవారు చెప్పగల జవాబు 'ఏమో తెలీదు' అని మాత్రమే.

ప్రభుత్వం నుండి నిధులు పొందని ప్రైవేట్ వృత్తి విద్యా సంస్థలకు విద్యార్థులను అడ్మిట్ చేసుకునే విషయంలో స్వేచ్ఛ ఉండాలని అన్నారు. వారికి బుద్ధిపుట్టిన విద్యార్థులను అడ్మిట్ చేసుకోవచ్చునని అన్నారు. అయితే అడ్మిషన్ పద్ధతి న్యాయబద్ధంగా, పారదర్శకంగా ఉండాలన్నారు. విద్యా ప్రమాణాలను గౌరవించాలని అన్నారు. ఈ మేరకు నియమాలు నిర్దేశించే అధికారం ప్రభుత్వానికి ఉంటుందన్నారు. అడ్మిషన్లు పారదర్శకంగా, న్యాయబద్ధంగా ఉండాలంటే అందరూ పోటీపడగల ఉమ్మడి ప్రవేశ పరీక్ష జరిపి అందులో పొందిన ర్యాంకులను ప్రమాణంగా తీసుకోవడమే సరయిన పద్ధతి అన్నారు. ఈ ఉమ్మడి ప్రవేశ పరీక్షను ప్రైవేట్ వృత్తి విద్యా సంస్థలు కలిసి ఉమ్మడిగా నిర్వహించుకోవచ్చునన్నారు. అందరూ కలిసి ఒకటే నిర్వహించనక్కరలేదన్నారు. ఆయా సంస్థలలో ఇచ్చే స్పెషలైజేషన్లను బట్టి ఒక కోవకు చెందిన సంస్థలన్నీ కలిసి ఒక ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించవచ్చునన్నారు. ఈ ప్రవేశ పరీక్షలు సక్రమంగా జరిగేటట్టు ప్రభుత్వం పర్యవేక్షించవచ్చునన్నారు. లేదా ప్రభుత్వమే ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించవచ్చునన్నారు. (అదీ ఇదీ రెండూ జరగవచ్చా? తెలీదు) ఈ ప్రవేశ పరీక్ష(ల?)లో లభించిన ర్యాంకులను గౌరవిస్తూ వివిధ సంస్థల యాజమాన్యాలు తమకు ఇష్టమొచ్చిన వారికి స్వేచ్ఛగా అడ్మిషన్ ఇయ్యవచ్చునన్నారు.

ఇంతకూ అడ్మిషన్లు ఏ విధంగా జరగబోతాయో మీకు అర్థం అయిందా? మాకయితే కాలేదు. ఒక విషయం మాత్రం మాకే కాదు, మీకు కూడ అర్థం అయి వుండాలి. దీనిమీద లిటిగేషన్ విపరీతంగా జరగబోతుంది. తొమ్మిది మంది జడ్జిలు కూర్చొని ఇనాందార్ కేసును మరొకసారి వ్యాఖ్యానించడమో, 13 మంది కూర్చొని టిఎంఏ పాయ్ కేసు తీర్పునే తిరగరాయడమో జరుగుతుంది. 'విద్యా వ్యాపారంలో తప్పేమీ లేదు' అన్న అధికారిక ప్రకటన అత్యున్నత న్యాయస్థానం నుండి వెలువడేదాకా ఈ తీర్పులు, వ్యాఖ్యానాలు, పునః పరిశీలనలు సాగుతూనే ఉంటాయి.

అన్ని స్థాయిలలోనూ విద్యావకాశాలు అందరికీ సమానంగా దక్కాలన్న హక్కు కోసం ప్రభుత్వాల మీద, సమాజంలోని పెత్తందారీ కులాలు, వర్గాల మీదే కాక కోర్టుల మీద కూడ పోరాటం చేయవలసిన రోజు వచ్చిందని మాత్రం అందరూ గుర్తిస్తారనీ, దానికి తగిన సామాజిక, రాజకీయ కార్యాచరణ ప్రజాతంత్ర శక్తులు రూపొందించుకుంటారని ఆశిస్తాం.

*మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది, 27 అక్టోబర్ 2005*

*ముద్రణ : 'దళిత', 2011 (పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ)*

# ముస్లింలు, బి.సిలు, రిజర్వేషన్లు

ఈ వారంలో బి.సి సంఘం నాయకులు ఆర్. కృష్ణయ్యగారి పేరు మీద రెండు పరస్పర భిన్నమైన ప్రకటనలు పత్రికలలో ప్రచురితమయ్యాయి. (ఆయన చెప్పిందే పత్రికలు రాసాయో లేదో తెలీదు కాబట్టి పత్రికలలో ప్రచురితమయ్యాయని అంటున్నాను.)

ముస్లింలను బి.సి జాబితాలో 'ఇ' గ్రూపుగా చేర్చి 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను హైకోర్టు కొట్టివేయడాన్ని ప్రస్తావిస్తూ, 'ఒక్క రూపాయి విలువలేని రిజర్వేషన్లు ఇచ్చి రెండు వర్గాల మధ్య ప్రభుత్వం చిచ్చు పెట్టింది' అని ఆర్. కృష్ణయ్యగారు అన్నట్టు పత్రికలు రాసాయి. మరుసటి రోజు, కొన్ని బి.సి కులాలను బి.సి జాబితా నుండి తొలగించే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం మొదలు పెట్టిందన్న వార్తకు స్పందిస్తూ ఆర్. కృష్ణయ్యగారే 'ఇటువంటి పనులు చేస్తే కాంగ్రెస్ పార్టీ అడ్రసు గల్లంతవుతుంది' అని హెచ్చరించినట్టు పత్రికలు ప్రచురించాయి.

ఇవి రెండూ వారిచ్చిన ప్రకటనలే అయితే, ముస్లింలకిచ్చినప్పుడు రూపాయి విలువలేని రిజర్వేషన్లు బి.సిలకు ఇస్తేనేం, ఇయ్యకపోతేనేం కృష్ణయ్యగారూ అని వారిని మనం అడగవద్దా?

ఒక ప్రహసనంగా అందరూ కలిసి మార్చేసిన ముస్లిం రిజర్వేషన్ల ఉదంతంలో బాధాకరమైన విషయాలు చాలా ఉన్నాయి. అన్నిటి కంటే ఆందోళనకరమైన విషయం, రాష్ట్రంలోని బి.సి కులాల సంఘాలు చాలావరకు ముస్లింలకు ప్రభుత్వం అందించిన చేయూతను సంఘటితంగా వ్యతిరేకించడం. హైకోర్టులో కేసు వేసిన వారిలో

అగ్రకుల హిందువులు కొందరు కాగా, కనీసం మూడు బి.సి సంఘాలూ ఉన్నాయి. కోర్టులో కేసు వేయడమే కాక, బయట మీటింగులు పెట్టారు. ప్రకటనలు చేసారు, పత్రికలలో రాసారు.

దీనికి అపోహలు కొంత కారణం కాగా, సంఘ్ పరివార్ ప్రేరణ కూడ కొంతవరకు కారణం. సంఘ్ పరివార్ వాళ్లు కార్మిక సంఘాలు నడిపినా, దళిత సంఘాలు నడిపినా పైకి ఆ వర్గాల ప్రయోజనాల కోసం ఒక మేరకు పనిచేస్తూ కూడ తమ దీర్ఘకాలిక అజెండాను లోలోపల సాగిస్తారనేది వారి వ్యవహారశైలిని అర్థం చేసుకున్న వారందరూ ఎరిగిన విషయమే. గుజరాత్‌లోని ఆదివాసీ గూడెంలలో పనిచేస్తున్న విశ్వహిందూ పరిషత్, ఆ ప్రజల మెదళ్ళలోకి ఎంతటి విషం ఎక్కించిందో 2002లో జరిగిన మారణకాండ చూపించింది. ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ బి.సిల పేరిట రాష్ట్రంలో జరిగిన ప్రచార ఆందోళనలలో సంఘ్ పరివార్ పాత్ర చాలానే ఉంది. మన దగ్గర ప్రజాతంత్ర ఉద్యమాలలో సహితం సంఘ్ పరివార్ గురించి సరయిన అంచనా ఏనాడూ లేకపోవడం వల్ల బి.సి సంఘాలలోను, ఉద్యమాలలోను ఉన్న ప్రజాతంత్రవాదులు ఈ విషయాన్ని గుర్తించనూ లేదు, గొంతెత్తి మాట్లాడనూ లేదు. లేకపోగా, కొందరు ప్రజాతంత్రవాదులుగా గుర్తింపు ఉన్న బి.సి మేధావులు తమ వంతుగా గొంతు కలిపారు కూడ.

కాగా, నిజమైన అపోహలూ వాటి నుండి పుట్టిన తప్పుడు వాదనలూ కూడ పనిచేశాయి. ఒక మైనారిటీగా ముస్లింలకు మైనారిటీ విద్యాసంస్థలు నడుపుకొనే హక్కు ఉన్నప్పుడు 'అదనంగా' రిజర్వేషన్లు ఎట్లా అడుగుతారన్న వాదన ఒకటి చేసారు. మైనారిటీ విద్యాసంస్థలు ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్‌కు ప్రత్యామ్నాయం ఎట్లా అవుతాయి? మహా అయితే మైనారిటీ విద్యాసంస్థలు మైనారిటీలకు ప్రత్యేక విద్యావకాశాలు కల్పిస్తాయని చెప్పవచ్చు. అంతమేరకు విద్యారంగంలో రిజర్వేషన్లు అడగడం సరయినది కాదనవచ్చు. కానీ ఆ వాదన కూడ సబబు కాదు. మైనారిటీ విద్యాసంస్థలన్నీ ప్రైవేట్ రంగ సంస్థలు. అక్కడ విద్య ఖరీదయినది. పేద మైనారిటీలకు అది అందుబాట్లో ఉండదు. డబ్బున్న మైనారిటీలను 'క్రీమీలేయర్' పేరిట ప్రభుత్వ రిజర్వేషన్లకు దూరం ఉంచారు కాబట్టి అదీ ఇదీ కూడ పొందేవారెవరూ ఉండరు.

ఇంకా రిజర్వేషన్లు పొందవలసిన బి.సి కులాలు ఉన్నాయి కాబట్టి ముస్లింలకు ఇచ్చేస్తే వారికి నష్టం జరుగుతుందన్న వాదన కొందరు తీసుకొచ్చారు. మరి వారికి

ఇచ్చేస్తే ముస్లింలకు నష్టం జరగదా? రిజర్వేషన్ల జాబితాలోని 'బి.సి' అనే పదాన్ని 'వెనుకబడిన కులం' అని అర్థం చేసుకొని బి.సిలలో ముస్లింలను ఎట్లా చేరుస్తారు, వారికి ఇవ్వదలచుకుంటే వేరుగా ఇవ్వండి, మా కోటాలో వద్దు అన్నవారున్నారు.

'బి.సి' అంటే వెనుకబడిన వర్గం అని అర్థం. కుల వ్యవస్థలో వెనుకబడిన కులాలుగా గుర్తించబడ్డవన్నీ వెనుకబడిన వర్గాలే. కానీ వెనుకబడిన కులాలు కాని వెనుకబడిన వర్గాలూ ఉండగలవు. అనేక రాష్ట్రాల జాబితాలలో ఉన్నాయి కూడ. కొన్ని రాష్ట్రాలలో కొండ ప్రాంతాలలో నివసించే వారందరినీ (ఆదివాసులయినా కాకపోయినా) ఒక 'వెనుకబడిన వర్గం'గా గుర్తించి రిజర్వేషన్ ఇచ్చారు. జమ్మూ కాశ్మీర్‌లో వాస్తవాధీన రేఖ (ఎల్ఒసికి) సమీపంలో నివసించే వారందరినీ వెనుకబడిన వర్గంగా గుర్తించి రిజర్వేషన్ ఇచ్చారు. సాంకేతిక అభివృద్ధికి అవకాశం లేని వృత్తులలో ఉన్నవారిని అప్పటి మైసూర్ రాష్ట్రప్రభుత్వం కులంతో నిమిత్తం లేకుండ ఒక 'వెనుకబడిన వర్గం'గా గుర్తించి రిజర్వేషన్ ఇచ్చింది. ఇవన్నీ సుప్రీంకోర్టు ఆమోదం పొందాయి. 'వెనుకబాటుతనం' అనే దానికి కొన్ని సూచికలుంటాయి. ఆ సూచికలు ఏవి అనేది శాశ్వతంగా నిర్ణయించలేము అనీ, అది పరిస్థితులను బట్టి ఉంటుందనీ సుప్రీంకోర్టు అనింది. మండల్ కమిషన్ తయారుచేసిన 12 సూచికలను, కర్ణాటక రాష్ట్ర వెనుకబడిన వర్గాల కమిషన్ (చిన్నపరెడ్డి కమిషన్ అంటారు దీనిని) రూపొందించిన ప్రమాణాలను సుప్రీంకోర్టు ఆమోదించింది. ఈ సూచికలు, ప్రమాణాల ప్రకారం ఏయే సామాజిక వర్గాలు వెనుకబడిన వర్గాలుగా గుర్తింపు పొందుతాయో అవి బి.సి కోటాలో రిజర్వేషన్ పొందగలవు. అంతే తప్ప 'బి.సి' రిజర్వేషన్ అనేది 'బి.సి' కులాలకే చెందిందని భావించి దానిలోనికి వేరే సామాజిక వర్గాలను రానియ్యవద్దనడం సరయిన వాదన కాదు. దీనిలో ముందు, వెనక అని వాదించేటట్టయితే ఎవరికి ముందు ఇచ్చినా మరొకరు అవకాశం కోల్పోగలరు కాబట్టి ఇది కేవలం ఒకరి విషయంలో ప్రయోగించగల వాదన కాదు.

ఇక హైకోర్టు వైఖరి విషయానికొద్దాం. తీర్పు ఇంకా చూడకపోయినప్పటికీ వాదన సమయంలో వారు వేసిన ప్రశ్నలను, పత్రికలలో తీర్పు గురించి వచ్చిన వార్తలను జోడించినట్టయితే ముస్లింలను వెనుకబడిన వర్గంగా గుర్తించిన బి.సి కమిషన్ రిపోర్టు అసమగ్రంగా, అశాస్త్రీయంగా ఉందని హైకోర్టు ప్రధానంగా అభ్యంతరం చెప్పినట్టు అర్థమవుతుంది.

ప్రభుత్వాలు పాలనాక్రమంలో అనేక విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటాయి. సమగ్రమైన, శాస్త్రీయమైన అధ్యయనం తరువాతనే పాలనా నిర్ణయాలు తీసుకోవాలని ఏ రాజ్యాంగమూ చెప్పదు. అట్లాగయితే పరిపాలన అసాధ్యం అవుతుంది. ఒక నిర్ణయం తీసుకునే ముందు దానికి సంబంధించిన సమాచారం సేకరించాలి, ఆ సమాచారాన్ని హేతుబద్ధంగా మదింపు వేయాలి. అంతే తప్ప 'సమగ్రమైన, శాస్త్రీయమైన' సమాచారం సేకరించాలనడానికి ప్రభుత్వం రీసర్చ్ స్కాలర్ కాదు, ప్రభుత్వం చేసేది సామాజిక శాస్త్ర పరిశోధనా కాదు.

సంబంధిత సమాచారాన్ని సేకరించి దానిని హేతుబద్ధంగా మదింపు వేయడానికి బి.సి కమిషన్ నెలకొల్పబడింది. అది తన పని చేసింది. ముస్లింలు మొత్తం మీద వెనుకబడిన వర్గమనీ, రిజర్వేషన్లకు అర్హులనీ సూచించడానికి కావలసిన సమాచారం బి.సి కమిషన్ నివేదికలో ఉంది. వారిలో డబ్బున్న వర్గాలు 'క్రీమీలేయర్' కింద ఎట్లాగూ మినహాయించబడతారు.

ఈ నివేదిక ఆధారంగా బి.సి కమిషన్ చైర్మన్ దాళవా సుబ్రమణ్యంగారికి పిహెచ్‌డి పట్టా ఇయ్యలేకపోవచ్చును గానీ ముస్లింలకు రిజర్వేషన్ ఇయ్యవచ్చు. అయినా ఈ విషయంలో మన హైకోర్టు ప్రదర్శించిన వైఖరి కొత్తది కాదు. రిజర్వేషన్లు ఇచ్చే అధికారాన్ని ప్రభుత్వం చేతి నుండి తన చేతిలోకి తీసుకోవడానికి న్యాయవ్యవస్థ చాలా కాలంగా ప్రయత్నం చేస్తున్నది. దానిలో భాగంగానే ఒక సామాజిక వర్గానికి రిజర్వేషన్ ఇవ్వొచ్చునా లేదా అని నిర్ణయించడానికి ప్రభుత్వం శాస్త్రీయమైన పరిశోధన జరపాలనీ, ఆ పరిశోధన ఎంత శాస్త్రీయంగా ఉందో తాము చూస్తామనీ అనసాగాయి. దాని పర్యవసానమే బి.సి కమిషన్ ఏర్పాటు, దాని నివేదిక హేతుబద్ధంగానే కాదు, 'శాస్త్రీయంగా' కూడ ఉండాలన్న వక్కాణింపు. న్యాయవ్యవస్థలో రిజర్వేషన్ల పట్ల తొలినాటి నుండి ఉన్న వ్యతిరేక వైఖరే ఈ పరిణామానికి మూలం. దాని వల్ల ఈ రోజు ముస్లింలకు అన్యాయం జరిగింది. రేపు ఇంకెవరికయినా జరగగలదని గుర్తించినట్టయితే ఈ తీర్పును బిసి సంఘాలు తమ విజయంగా భావించవు.

చివరిగా, 'ఇది ముస్లింలకు ఒక మతవర్గంగా రిజర్వేషన్లు కల్పించడానికి చట్టం అనే ఆచ్ఛాదన తగిలించుకున్న అనుచిత ప్రయత్నం' అన్న హైకోర్టు వ్యాఖ్య గురించి ఒక మాట. అది రాజకీయంగా సరైన వ్యాఖ్యా కాదా అన్నది పక్కన పెట్టండి. కోర్టు చేయదగ్గ వ్యాఖ్యేనా? ఆ ఆర్డినెన్స్ రాజ్యాంగబద్ధమా కాదా అని నిర్ణయించడం

వేరు, దానిని జారీచేయడం వెనుక దురుద్దేశ్యం ఉందనడం వేరు. హైకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగపరంగా తప్పన్న విమర్శతో ఆగిపోకుండా, 'ఇది మైనారిటీల హక్కులను అణగదొక్కడానికి కోర్టు ధరించిన ముసుగు మాత్రమే'నంటే దానిని ఏమంటారు? కోర్టు ధిక్కారమంటారు. క్షమాపణ కోరుకోకపోతే ఆరునెలలు జైలుకు పంపుతామంటారు. మరి కోర్టు చేసిన వ్యాఖ్యకు ఏ పేరు పెట్టాలి?

*మొదటి ముద్రణ : ప్రజాతంత్ర వారపత్రిక, 13 నవంబర్ 2005*

*రెండవ ముద్రణ : 'రిజర్వేషన్లు : ప్రజాస్వామిక దృక్పథం', 2013*

*(పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ)*

# ముస్లిం రిజర్వేషన్లను అడ్డుకోవడమంటే సామాజిక న్యాయాన్ని బలహీనపర్చడమే

ఇద్దరు హిందువులు కలుసుకుని ముస్లింల గురించి ఎప్పుడయినా మాట్లాడుకుంటే వాళ్ళ వెనకబాటుతనాన్ని గురించి అవహేళనగా ముచ్చటించుకుంటారు. ముస్లింలు ఉద్దేశ్యపూర్వకంగా వెనుకబడి ఉన్నారనీ, నాగరికంగా అభివృద్ధి చెందడం వారికి రుచించదనీ ఏవగించుకుంటారు. స్త్రీలను బురఖాలలో బంధించి ఉంచుతారు, అన్నిటికీ షరియత్ వైపు చూస్తారు, పిల్లలను చదువు కోసం మదరసాలకే పంపిస్తారు, సైన్స్ కంటే ముల్లాల మాటలే ఎక్కువ విశ్వసిస్తారు – ఈ రకమైన సంభాషణ ఎన్నిసార్లు వినలేదు?

అయితే ముస్లింలు సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని భావించి ప్రభుత్వం వారికి విద్య, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు ఇవ్వడానికి సంకల్పించగానే ముస్లింలు వెనుకబడిన వర్గం కానేకాదు అంటూ అదే హిందువులు ఆగ్రహించారు. రాజశేఖరరెడ్డి వోట్ల కోసం మైనారిటీలను బుజ్జగిస్తున్నాడని నిందించారు. హైకోర్టులో కేసు వేసి గెలిచారు. రిజర్వేషన్ల చట్టాన్ని కొట్టేసిన బెంచిలోని అయిదుగురు జడ్జిలలో ఇద్దరు దాదాపు ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. 'ముస్లింలకు ఒక మత వర్గంగానే రిజర్వేషన్లు కల్పించడానికి చట్టం అనే ఆచ్ఛాదన తగిలించుకున్న అనుచిత ప్రయత్నం' అని వ్యాఖ్యానించారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను విశ్వసిస్తున్నామని చెప్పుకునేవారు ప్రభుత్వం ఫలాన పని వోట్ల కోసం చేసింది అని

నిందించడంలో అర్థమేమిటో తెలీదు. వోట్ల కోసం రాజకీయ పార్టీలు ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించే ప్రయత్నం చేస్తాయనే కదా పార్లమెంటరీ వ్యవస్థను ప్రజాస్వామ్య వ్యవస్థగా గుర్తించేది?

ముస్లింలకు ఒక సామాజిక వర్గంగా రిజర్వేషన్లు కల్పించడం సబబా కాదా అన్న చర్చకు అర్థం ఉంది గానీ ఆ పని వోట్ల కోసం చేసారన్న వ్యాఖ్యకు అర్థం లేదు. మరి అది సబబు కాదనడానికి కోర్టులో ఏ వాదనలు చేసారు? కోర్టు వాటిని ఎందుకు ఆమోదించింది? చాలా విచిత్రమైన వాదనలు చేసారు. ఒక సామాజిక వర్గానికి రిజర్వేషన్ ఇచ్చేటప్పుడు ఆ వర్గాన్ని నిర్వచించవలసి ఉంటుంది. నిర్వచనం రిజర్వేషన్ ఇవ్వడానికి గల కారణాన్ని సూచించదు. రిజర్వేషన్ ఇస్తున్నదెవరికో వివరిస్తుందంతే. ముస్లింలకు రిజర్వేషన్ ఇచ్చే ఈ చట్టం 'ముస్లిం' అంటే ఎవరంటే ఇస్లాంను ఆచరించేవారు అని నిర్వచించింది. ఇస్లాంను ఆచరిస్తున్నందు వల్ల వారికి రిజర్వేషన్ ఇస్తున్నామనలేదు. రిజర్వేషన్ పొందుతున్న వర్గాన్ని వర్ణించడానికి మాత్రమే ఈ నిర్వచనం ఇవ్వడం జరిగింది. అయితే దీనిని పట్టుకొని 'ఇస్లాంను ఆచరించడానికీ వెనుకబాటుతనానికీ సంబంధం ఏమిటి? లక్ష్యంతో సంబంధం లేని నిర్ణయం సహేతుకం ఎట్లా అవుతుంది? అని వాదించడం జరిగింది. హైకోర్టు ఆ వాదనకు అనుకూలంగా స్పందించడమూ జరిగింది.

'ముస్లింలందరికీ రిజర్వేషన్ ఇస్తున్నారు. ఇస్లాంను ఆచరించే వారంతా ముస్లింలేనంటున్నారు. మరి రేపు ఒక హిందూ అగ్రకులస్తుడు రిజర్వేషన్ పొందడం కోసం ఇస్లాం పుచ్చుకుంటే అతను కూడ వెనుకబడినవాడు అయిపోతాడా? అని వాదించారు. దీనికి సహితం హైకోర్టు సానుకూలంగా స్పందించింది. ఈ రకమైన వాదనలను గతంలో సుప్రీంకోర్టు తిరస్కరించిన విషయాన్ని వివరించి చెప్పినప్పటికీ ఆ ఉదాహరణలను విస్మరించి ఈ వాదనను ఆమోదించింది.

జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో వాస్తవాధీన రేఖ సమీపంలో అభివృద్ధి ఏదీ జరిగే అవకాశం లేదు కాబట్టి అక్కడ నివసించే ప్రజలను ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒక వెనుకబడిన వర్గంగా గుర్తించి వారిని బి.సి జాబితాలో చేర్చింది. ఇది అహేతుకం అంటూ జానకీ ప్రసాద్ పరిమూ అనే కాశ్మీరీ పండిట్ కోర్టుకు ఎక్కాడు. అక్కడ నివసించే వారందరూ ఒక వెనుకబడిన వర్గమని మీరంటే, రేపు ఒక శ్రీనగర్ నివాసి కేవలం రిజర్వేషన్ పొందడం కోసం అక్కడకు పోయి ఇల్లు కట్టుకుంటాడు. 'కేవలం ఇల్లు మార్చి వెనుకబడిన వర్గం వాడయిపోతాడా?' అని ఆయన ప్రశ్నించాడు.

సుప్రీంకోర్టు ఈ వాదనను తిరస్కరించింది. ఒక చట్టం, లేక ప్రభుత్వ చర్య సమర్థనీయమా కాదా అని చూసేటప్పుడు దానిని దుర్వినియోగం చేసే అవకాశం ఉందనేది ప్రమాణం కావడానికి వీలులేదు. అది దానంతటది సమర్థనీయమా కాదా అని చూడాలి. దుర్వినియోగం చేసే అవకాశం ఉంటే దానిని అరికట్టే సహేతుకమైన మార్గాలు అన్వేషించాలే తప్ప ఆ చట్టాన్ని కొట్టేసే యత్నం తగదు. ఆ దుర్వినియోగం కూడ ఎప్పుడో అరుదుగా తప్ప జరగదని భావిస్తే దానిని అరికట్టడానికి ఏవో నియమాలు రూపొందించి చిక్కులు తెచ్చుకొనే బదులు దానిని ఉపేక్షించడం మేలు. (కేవలం ఉద్యోగం కోసమో మెడిసిన్‌లో సీటు కోసమో ముస్లిం మతం పుచ్చుకునే హిందూ అగ్రకులస్తులు కోటిమందిలో ఒక్కరయినా ఉంటారా?)

ఇంతకంటే విచిత్రమైన వాదన కూడ చేసారు, దానికి కూడ హైకోర్టు తీర్పులో ఆమోదం లభించింది. ఈ వాదన చేసింది ఖాకీ నిక్కరు బి.సి సంఘాల తరఫున వాదించడానికి కర్ణాటక నుండి వచ్చిన రవివర్మ కుమార్ అనే ఆ రాష్ట్ర బి.సి కమిషన్ మాజీ సభ్యుడు, ఆ రాష్ట్రంలో బ్రాహ్మణ వ్యతిరేక ప్రజాతంత్ర ఉద్యమంలో ముఖ్యపాత్ర వహించిన మేధావి.

'ఖాకీ నిక్కరు బి.సి సంఘాలు' అన్న మాట ఎవరికీ కోపం తెప్పించనవసరం లేదు. వేరే ఏ విషయంలోనయినా మొహమాటానికి చోటు ఉందేమోగానీ సంఘ్ పరివార్‌ను పేరు పెట్టి గుర్తించడంలో ఉండదు, ఉండడానికి వీలు లేదు. సంఘ పరివార్ ఆలోచనారీతులు శూద్రకులాల ఉద్యమాలలోకి చాపకింద నీరులాగ పాకిపోయాయి. ప్రజాతంత్ర దృష్టిగల కొందరు తప్ప మిగతా బి.సి సంఘాలు, మేధావులు ఈ విషయాన్ని గుర్తించకపోవడం బాధాకరం. మనువాదం మీద పోరాడడానికీ, సంఘ్ పరివార్ రాజకీయ ప్రతినిధులతో చెలిమి చేయడానికీ మధ్య వైరుధ్యమేమీ లేదని నమ్మే మాయావతులూ, కాన్షీరాంలూ దళిత నాయకులుగా చలామణి అవుతున్న చోట ఈ గుడ్డితనం ఆశ్చర్యపోవలసింది కాదేమోగానీ చాలా నష్టకరం.

రవివర్మ కుమార్‌గారి వాదన ఏమిటంటే రాజ్యాంగంలో 'వెనుకబడిన వర్గం' అన్న ప్రయోగానికి అర్థం, వెనుకబడిన హైందవ కులాలే తప్ప అన్యం కాదు. అది మైనారిటీలకు వర్తించదు. దీనికి మద్దతుగా రాజ్యాంగ పరిషత్‌లో అంబేద్కర్ ఇచ్చిన వివరణను ఆయన దీర్ఘంగా ఉటంకించారు. ఆయన వాదన చేసినప్పుడు కోర్టులో నవ్వుకున్నవారందరికీ, 'ఇది కొట్టివేయదగ్గ వాదన కాదు' అని హైకోర్టు తీర్పులో లభించిన ఆదరణ ఆశ్చర్యం కలిగించింది.

రాజ్యాంగంలో వాడిన 'వెనుకబడిన వర్గం' అనే ప్రయోగం ముస్లింలకు వర్తిస్తుందా అన్న ప్రశ్న రాజ్యాంగ పరిషత్‌లో అసలు చర్చకు రాలేదు. 'వెనుకబడిన వర్గం' అనేది అస్పష్టంగా ఉంది, దాని భావం ఏమిటి అన్న వివరణ సభ్యులు కోరారు. అప్పుడు అంబేద్కర్ తమ దృష్టిలో ఉన్నది అణగారిన హైందవ కులాలేనని వివరించాడు. ముస్లింల ప్రస్తావన ప్రశ్నలోనూ లేదు, జవాబులోనూ లేదు. ఒక మైనారిటీగా ముస్లింలకు ప్రత్యేక హక్కులు ఇవ్వాలా వద్దా అన్న చర్చ మాత్రం జరిగింది. దాని నేపథ్యం వెనుకబాటుతనం కాదు. దేశ విభజనను నివారించడానికి మైనారిటీలకు ప్రత్యేక హక్కులూ అధికారాలూ కల్పించడం ఒక మార్గమన్న ఆలోచన 1946 దాకా చర్చలో ఉండింది. దేశ విభజన జరిగిన తరువాత ఇంక ఆ రకమైన ఆలోచనలు అనవసరం అన్న 'మూడ్' లోకి అందరూ రావడం వల్ల ముస్లింలకు ఒక మైనారిటీగా ప్రత్యేక హక్కులు కల్పించే ఆలోచనను విరమించుకోవడం జరిగింది. అంతే తప్ప సామాజిక నేపథ్యంలో ముస్లింల గురించి చర్చ రాజ్యాంగ పరిషత్‌లో జరగనే లేదు.

జరిగి ఉండే అవకాశం కూడ లేదు. ఎందుకంటే రాజ్యాంగానికి తుదిరూపు ఇచ్చిన నాటికి దేశవిభజన జరిగిపోయిందిగానీ స్వాతంత్ర్యానంతర సామాజిక చిత్రం ఇంకా రూపం తీసుకోలేదు. అప్పటికి ఇంకా ముస్లింల గురించి ఎవరు ఆలోచించినా స్వాతంత్ర్య పూర్వపు సామాజిక దృశ్యమే మనసులో ఉండే అవకాశం ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం దేశ వాయవ్య ప్రాంతంలో (అంటే ప్రస్తుత పాకిస్తాన్‌లో) ముస్లింలు ప్రధాన ఉన్నతవర్గం. బొంబాయితో పోటీపడిన కరాచీ నగరం, ఉమ్మడి పంజాబు రాజధాని అయిన లాహోర్ నగరం ముస్లింలు ప్రధాన సముదాయంగా ఉన్న నగరాలు. ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలలో ముస్లిం జమీందార్లు, సంపన్నవర్గాలు పెద్ద సంఖ్యలో ఉండేవారు. హైదరాబాద్, భోపాల్ వంటి సంస్థానాలలో రాజవంశీకులయిన ముస్లిం నవాబులుండేవారు. స్వాతంత్ర్యానంతరం వాయవ్య ప్రాంతం పాకిస్తాన్‌లోకి పోయింది. ఉత్తరప్రదేశ్‌లోని జమీందారీ వర్గమే కాదు, ఉన్నత విద్యావంతులు, ధనవంతులు అయిన ముస్లింలు పెద్ద నంఖ్యలో పాకిస్తాన్‌కు తరలిపోయారు. హైదరాబాద్, భోపాల్ వంటి సంస్థానాల రాజవంశీకులు సహితం దేశాన్ని విడిచిపెట్టి వెళ్లిపోవడమో లేక సామాజిక జీవితం నుండి పూర్తిగా పక్కకు తప్పుకోవడమో జరిగింది. ఆ తరువాతే స్వాతంత్ర్యానంతర ముస్లిం సమాజం క్రమంగా రూపం తీసుకుంది. ఇది ప్రధానంగా అణగారిన హైందవ కులాల నుండి మతమార్పిడి

ద్వారా ముస్లింలయిన ప్రజా సమూహం. కనుక వీరి వెనుకబాటుతనాన్ని గురించి చర్చించేటప్పుడు రాజ్యాంగ పరిషత్‌లో జరిగిన చర్చ అసందర్భమయినది.

అంతేకాక రాజ్యాంగాన్ని రాసిన వారి ఉద్దేశ్యాలు ఏవయినా, చివరికి రాజ్యాంగం 'వెనుకబడిన వర్గం' అన్న మాట వాడిందే తప్ప 'వెనుకబడిన కులం' అనలేదు. దీనిని సుప్రీంకోర్టు అనేక సందర్భాలలో నొక్కి చెప్పింది. వెనుకబడిన కులాలు వెనుకబడిన వర్గాలవుతాయి గానీ అవి మాత్రమే కావు అనీ, వెనుకబాటుతనానికి కులాన్ని ఏకైక ప్రమాణం చేయడానికి వీలు లేదనీ కనీసం డజను కేసులలో సుప్రీంకోర్టు అనింది.

పైన చెప్పినట్టు జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో వాస్తవాధీన రేఖ సమీపంలో నివసించే వారిని వెనుకబడిన వర్గంగా గుర్తించారు. దానిని సుప్రీంకోర్టు ఆమోదించింది. ఉత్తరప్రదేశ్‌లో కొండ ప్రాంతాలలో నివసించే ప్రజానీకం (ఆదివాసులయినా కాకున్నా) అభివృద్ధికి అననుకూలమైన పరిస్థితులలో జీవిస్తున్నందున ఆ రాష్ట్ర ప్రభుత్వం వారిని వెనుకబడిన వర్గంగా గుర్తించింది. దానిని కూడ సుప్రీంకోర్టు ఆమోదించింది. చాలా ఏళ్ల కింద అప్పటి మైసూరు రాష్ట్రప్రభుత్వం సాంకేతికంగా వెనుకబడిన వృత్తులను జీవనాధారంగా కలిగిన ప్రజలందరినీ వెనుకబడిన వర్గంగా గుర్తించింది. దీనినీ సుప్రీంకోర్టు ఆమోదించింది. ఇవన్నీ రవివర్మ కుమార్ గారు ఉటంకించిన 'అంబేద్కర్ అభిప్రాయానికి' భిన్నమైనవే. అయినప్పటికీ వారు ఆ వాదన చేయడం, 'అది కొట్టిపారేయదగ్గ వాదన కాద'ని ఒక జడ్జి ఆదరించడం, ఆ జడ్జి అభిప్రాయంతో తామూ ఏకీభవిస్తున్నామని మరో ఇద్దరు ప్రకటించడం జరిగిపోయింది.

నిజానికి విద్యా ఉద్యోగ రంగాలలో ముస్లింలు సగటు కంటే వెనుకబడి ఉన్నట్టు గణాంకాలు సూచిస్తున్నాయని హైకోర్టు ఒప్పుకునింది. ఒక్కొక్క రంగంలోనూ ముస్లింల ప్రాతినిధ్యం లేక భాగస్వామ్యం 15 నుండి 30 శాతం దాకా తక్కువ ఉందని గుర్తించింది. అయితే ఇది గణనీయమైన వెనుకబాటుతనం కాదనీ, 50 శాతం తక్కువ ఉంటేనే గణనీయమైన వెనుకబాటుతనం అవుతుందనీ హైకోర్టు అంటుంది. ఈ అభిప్రాయానికి ప్రాతిపదిక ఏమిటి ? సగటు కంటే 25 శాతం వెనుకబడి ఉంటే అది గణనీయమైన వెనుకబాటుతనం అని మండల్ కమిషన్ సూత్రీకరించింది. దానిని సుప్రీంకోర్టు ఆమోదించింది. మన రాష్ట్రంలో ముస్లింల వెనుకబాటుతనం దాదాపు అంత వుంది. ఒక్కొక్క రంగంలో కొంచెం తక్కువ, ఒక్కొక్క

రంగంలో కొంచెం ఎక్కువ వుంది. అయినప్పటికీ 50 శాతం వెనుకబాటుతనం ఉంటేనే గణనీయమైన వెనుకబాటుతనం అవుతుందని హైకోర్టు ఏ ప్రమాణం లేకుండ అనింది.

రాష్ట్ర ప్రభుత్వం వ్యవహారశైలిలోను, బి.సి కమిషన్ నివేదికలోను లోపాలు లేకపోలేదు. రాజశేఖరరెడ్డి ప్రభుత్వానికి నిలకడయిన న్యాయం చేయడం ముఖ్యం కాదు. 'మేము అధికారానికి రాగానే అయిదు శాతం రిజర్వేషన్ ఇచ్చేస్తాం' అన్న హామీని వెంటనే నిలబెట్టుకోవడం ముఖ్యం. బి.సి కమిషన్‌కు సమగ్రమైన నివేదిక ఇవ్వడం ముఖ్యం కాదు, ఏలినవారు ఎంత వేగంగా ఇమ్మంటే అంత వేగంగా ఇవ్వడం ముఖ్యం. బి.సి కమిషన్ ముందు హాజరై వాళ్ళకు ఒక విషయం వివరంగా చెప్పడం జరిగింది. అధిక భాగం సాంకేతిక అభివృద్ధికి అవకాశం లేని సంప్రదాయక అసంఘటిత ఉత్పత్తి రంగాలలో చిక్కుకున్న ప్రజావర్గాలను వెనుకబడిన వర్గాలుగా గుర్తించవచ్చుననే అభిప్రాయం అనేక సుప్రీంకోర్టు తీర్పులలో వ్యక్తం అయింది. అది ముస్లింల సామాజిక స్థితికి సరిగ్గా అతుకుతుంది. కాబట్టి 'ముస్లిం ఉపాధి వివరాలను సమగ్రంగా సేకరించి ఆ ప్రాతిపదికన విశ్లేషిస్తే ఆ విశ్లేషణ కోర్టులలో నిలుస్తుంద'ని సూచించాం. బి.సి కమిషన్ ఆ పని చేయకుండ, మేము ముస్లింలు నివసించే ప్రాంతాలకు పోయినప్పుడు ఎక్కువమంది చిల్లర వృత్తులలో ఉండడం గమనించాము అంటూ జర్నలిస్టు రిపోర్టులాగ రాయడం సహజంగానే అభిశంసనకు దారితీసింది.

లక్ష్యశుద్ధి లేని రాజకీయాలు, కార్యదక్షత లేని నిపుణులు సామాజిక న్యాయాన్ని అకారణంగా బలహీనపరచగా, ప్రామాణికత అక్కరలేని న్యాయవ్యవస్థ దానిని మొత్తంగా పూడ్చి పెట్టింది.

*మొదటి ముద్రణ : మహాజన, సాక్షి, మహాబోధి, చమన్, 2006*

*రెండవ ముద్రణ : 'రిజర్వేషన్లు : ప్రజాస్వామిక దృక్పథం', 2013*

*(పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ)*

# రిజర్వేషన్లు : న్యాయస్థానాల వైఖరే అసలు సమస్య

తీర్పు రాయమంటే వ్యాసాలు రాస్తే కష్టం.

సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఎం. నాగరాజ్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా అనే కేసులో పిటిషనర్లు లేవదీసిన ప్రశ్నలకు జవాబులు చెప్పి ఊరుకోకుండా, రిజర్వేషన్ల మీద ఉడికీ ఉడకని వ్యాసం రాయడం కలకలానికి దారితీసింది. బి.సిలలో లాగే ఎస్.సి, ఎస్.టిలలో కూడ 'క్రీమీ లేయర్'ను గుర్తించి రిజర్వేషన్ల పరిధి నుంచి తొలగించమని సుప్రీంకోర్టు అన్నదన్న అభిప్రాయం ప్రచారం అయింది. ఇంకొక రెండు ఆందోళనకరమైన అభిప్రాయాలు కూడ ఆ తీర్పులో వ్యక్తం అయ్యాయి గానీ, అవి మొదటి దానిలాగా వెంటనే అర్థమయ్యేవి కావు కాబట్టి అల్లరి జరగలేదు. ఒకటి ఎస్.సి, ఎస్.టిలకు ప్రభుత్వ ఉద్యోగాల ఎంపికలో ఏదైనా ప్రత్యేక ప్రతిపత్తి లేక హక్కు (రిజర్వేషన్లు, అర్హతల సడలింపు వగైరా) ఇవ్వదలచిన ప్రతి ఒక్క సందర్భంలోనూ వారు వెనుకబడి ఉన్నారని శాస్త్రీయ ప్రమాణాల ప్రాతిపదికన రుజువు చేసిన తరువాతే ఆ పని చేయాలి. రెండు, ప్రభుత్వ ఉద్యోగ రంగం ఎంపికలో ఎస్.సి, ఎస్.టిల లాగే బి.సిలకు కూడ రిజర్వేషన్లు ఇయ్యవచ్చును గానీ ప్రమోషన్లలో బి.సిలకు ఇవ్వడానికి వీలులేదు.

ఈ మూడు అభిప్రాయాలూ స్పష్టాస్పష్టంగా ఈ తీర్పులో ఉన్నాయి. వాటిని రాజ్యాంగ వ్యాఖ్యానంగా సుప్రీంకోర్టు ఉద్దేశించిందా లేక యథాలాపంగా ప్రవచించిందా అనేది తెలీదు. మొదటిదేనేమోనన్న

భయం, రెండవదే లెమ్మన్న ధీమా ఈ తీర్పు పట్ల కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన వ్యాఖ్యలలో వ్యక్తం అవుతున్నది.

ఒక కవిత గురించో కథ గురించో చర్చించుకునేటప్పుడు రచయిత భావమేమిటి అని వాదించుకోవడం, విభేదించడం సహజం. కాని న్యాయస్థానాలిచ్చే తీర్పుల విషయంలోనూ అటువంటి పరిస్థితి ఉంటే కష్టం. తీర్పు తప్పు కావచ్చు, ఒప్పు కావచ్చు. న్యాయం కావచ్చు, అన్యాయం కావచ్చు. కానీ అస్పష్టంగా మాత్రం ఉండడానికి వీలు లేదు.

ఈ మధ్యకాలంలో సుప్రీంకోర్టు నుంచే అస్పష్టమైన తీర్పులు వెలువడడం మామూలు విషయం అయిపోయింది. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల గురించి 13 మంది జడ్జిల బెంచి ఏమందో స్పష్టంగా లేదని వారి అభిప్రాయం ఏమిటో వివరించమని అయిదుగురు జడ్జీలను కూర్చోబెడితే, ఈ బెంచి వారి అభిప్రాయాన్ని స్పష్టం చేసే బదులు తన సొంత అభిప్రాయం చెప్పగా, మళ్ళీ ఏడుగురు జడ్జీలు కూర్చొని వీరి అధిక ప్రసంగాన్ని విమర్శించి తొలితీర్పును స్పష్టపరచే పని చేసిన వైనం ఇనాందార్ వర్సస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో ఈ మధ్యనే చూశాం. ఇది కొంతవరకు భాషకు సంబంధించిన సమస్య. హైకోర్టు, సుప్రీంకోర్టుల భాష ఇంగ్లీష్ అని రాసుకున్నాం. (కింది కోర్టులన్నీ కూడ ఇంగ్లీష్‌లో నడిచే అతి కొద్ది రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి.) కానీ ఆ భాష మీద అతి కొద్దిమంది న్యాయమూర్తులకు పట్టు ఉంది. నాలుగు న్యాయ సిద్ధాంత పడికట్టు పదాలు పట్టుకొని క్లిష్టమైన వ్యాఖ్యలు చేస్తుంటారు. ఇది సహజంగానే అస్పష్టతకు, అసమగ్రతకు దారితీస్తుంది. కానీ భాష ఒక్కటే సమస్య కాదు. ఆలోచనలలో తార్కికత కొరవడడం మరొక సమస్య. కొంత న్యాయసిద్ధాంత పరిభాష అలవడాలే గానీ, అత్యున్నత స్థాయి కోర్టు తీర్పులలో సైతం తర్కం ఎంత బలహీనంగా ఉంటున్నదో సాధారణ విద్యావంతులు కూడ చూడగలరు. మూడవ సమస్య భావదారిద్ర్యం. భారతదేశమంతటి వైవిధ్యము, సంక్లిష్టత ఉన్న దేశ పాలన గురించి ఆలోచించేటప్పుడు ఉండవలసిన విశాల దృక్పథం ఈ తరం న్యాయమూర్తులలో చాలా అరుదు. ప్రత్యేకించి సమానత, సామాజిక న్యాయం అనే భావాల పట్ల వ్యతిరేక వైఖరి – రాజ్యాంగంలో వాటికింకా చోటు ఉంది కాబట్టి అప్పుడప్పుడు వాటి దిశగా ఒక నమస్కారం పారేయడం తప్పనిసరైనప్పటికీ – న్యాయస్థానాలలో చాలా మామూలు విషయం అయిపోయింది.

ఈ భావదారిద్ర్యమే లేకపోతే ప్రస్తుతం ఆందోళనకూ వివాదానికీ దారితీసిన 'నాగరాజు' కేసు ఉనికిలోకి వచ్చేదే కాదు. పార్లమెంటు రాజ్యాంగానికి చేసిన 77వ, 81వ, 82వ, 85వ సవరణలు చెల్లుతాయా లేక అవి పార్లమెంటుకుండే అధికారాలను మించిన సవరణలా అనేది నాగరాజు కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందున్న వివాదం. రిజర్వేషన్ల పట్ల సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన సంకుచితమైన తీర్పులను అధిగమించడానికే ఈ నాలుగు రాజ్యాంగ సవరణలూ చేయవలసి వచ్చిందని గ్రహిస్తే, వాటి రాజ్యాంగబద్ధత పైన అగ్రకులాలు లేవదీసిన సవాలును అడ్డం పెట్టుకొని మరిన్ని సందేహాస్పదమైన వ్యాఖ్యలు ఆ కోర్టు ఏ విధంగా చేయగలిగిందో అర్థం అవుతుంది.

ఉద్యోగ రిజర్వేషన్లకు మూలం రాజ్యాంగంలోని ఆర్టికల్ 16 (4)లో ఉంది. ప్రభుత్వ ఉద్యోగ రంగంలో తగిన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు నియామకాలలోనూ పోస్టులలోనూ రిజర్వేషన్లు ఇయ్యవచ్చునని 16(4) అంటుంది. నియామకం అనేది నేరుగా ఉద్యోగంలోకి తీసుకోవడం ద్వారా జరగవచ్చు. ప్రమోషన్ ద్వారాను జరగవచ్చు. 'పోస్టు' అనేది (ఉద్యోగం అందాం) నేరుగా నింపేదీ కావచ్చు, ప్రమోషన్ ద్వారా నింపేదీ కావచ్చు. కాబట్టి 16(4) ప్రకారం నేరుగా చేసే నియామకాలలోనే కాక ప్రమోషన్లలో కూడ (తగిన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు) రిజర్వేషన్ కల్పించవచ్చుననేది అందరూ సులభంగా గ్రహించగల విషయం. 1962లో 'రంగాచారి' కేసుగా పేరుపొందిన జనరల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే వర్సెస్ రంగాచారి అనే కేసులో సుప్రీంకోర్టు అదే అభిప్రాయం వ్యక్తం చేసింది. అయితే 1992లో మండల్ కమిషన్ కేసు (ఇందిరా సహానీ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా)లో తొమ్మిది మంది జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం దానిని తిరగదోడి నేరుగా చేసే అపాయింట్‌మెంట్‌లోనే తప్ప ప్రమోషన్‌లో రిజర్వేషన్ ఇవ్వడానికి వీలులేదనింది.

ఎందుకని? రిజర్వేషన్ ద్వారా జూనియర్లకు ప్రమోషన్ వచ్చి సీనియర్ దిగువ పోస్టులో ఉండిపోవడం పాలనా యంత్రాంగంలో అసంతృప్తికి దారితీస్తున్నదని, దాని సామర్థ్యాన్ని దెబ్బతీస్తున్నదని వాదించిన వారి తర్కాన్ని కోర్టు ఆమోదించిన కారణంగా ఈ అభిప్రాయం వ్యక్తం చేసింది. రిజర్వేషన్లు ఇచ్చేటప్పుడు పాలనా యంత్రాంగం సామర్థ్యం దెబ్బతినకుండా చూసుకోవాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 335 చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా ఉటంకించింది. అయితే జూనియర్లు ముందే ప్రమోట్ కావడమనేది వేరే కారణాల వల్ల కూడ జరుగుతుంటుంది. క్వాలిఫికేషన్లు లేవని,

డిపార్టుమెంటల్ పరీక్షలు పాసు కాలేదని, పనిలో యోగ్యత కొరవడిందని సీనియర్‌లు ప్రమోషన్ పొందని సందర్భాలు అనేకం. ఒక్కొక్కసారి పైస్థాయి పోస్టుకు కింది నుంచి ప్రమోషన్ల ద్వారానే కాక నేరుగా రిక్రూట్ చేసుకోవడం కూడ జరుగుతుంది. అప్పుడు వయసు, అనుభవం రెండూ తక్కువ ఉన్న వారు పైస్థాయి ఉద్యోగాలలో నియమితులవుతుంటారు. 50 ఏళ్ళ వయసున్న ఆర్‌డిఓలు మూతిమీద మీసం లేని యువ కలెక్టర్లకు వంగి వంగి సలాంలు చేయడం చూస్తూనే ఉన్నాం. అప్పుడు లేని సమస్య రిజర్వేషన్ ఇచ్చినప్పుడే ఎందుకొచ్చింది?

వచ్చిందని తొమ్మిది మంది జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం భావించింది. దానికి విరుగుడుగా 77వ రాజ్యాంగ సవరణ చేసి ఆర్టికల్ 16(4ఎ) చేర్చి ఎస్.సి, ఎస్.టిలకు ప్రభుత్వ ఉద్యోగాలలోనూ (తగిన ప్రాతినిధ్యం లేని పక్షంలో), ప్రమోషన్లలోనూ రిజర్వేషన్ ఇయ్యవచ్చునని రాజ్యాంగం చేత చెప్పించారు.

ఈ సవరణ వెంటనే అమలు కావడం మొదలయింది. సహజంగానే, రిజర్వేషన్ ద్వారా ప్రమోషన్ పొందిన వారు పైపోస్టులో చేరిన రోజు నుంచి సీనియారిటీ పొందారు. దీనిని ప్రమోషన్ ఆలస్యంగా పొందిన అగ్రకులాల వారు సవాలు చేయగా, అజిత్‌సింగ్ జనూజా వర్సస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో 1995లో సుప్రీంకోర్టు 77వ రాజ్యాంగ సవరణ కారణంగా ఎస్.సి, ఎస్.టిలకు ప్రమోషన్‌లో రిజర్వేషన్లు ఇస్తే ఇచ్చారు గానీ ఈ రకంగా ప్రమోషన్ పొందిన వారికి పైపోస్టులో సీనియారిటీ రాదనింది. వారి తరువాత ప్రమోషన్ పొందిన వారి సీనియర్లు పైపోస్టులోనూ సీనియర్లవుతారని ప్రకటించింది. పైన చెప్పినట్టు, అనేక ఇతర కారణాల వల్ల కింది పోస్టులో జూనియర్లుగా ఉన్న వారు ముందుగా ప్రమోషన్ పొందుతారని చూశాం. అక్కడ వాళ్ళ సీనియారిటీ ప్రమోషన్ పొందిన నాటి నుంచి లెక్కించబడుతుంది తప్ప కింది పోస్టులో వారికి సీనియర్లుగా ఉన్నవారు ఆలస్యంగా డిపార్టుమెంటల్ టెస్టులు పాసై ఆలస్యంగా ప్రమోషన్ పొందితే పైపోస్టులో వారికి సీనియారిటీ ఇవ్వరు. ఒక్క రిజర్వేషన్ల విషయంలోనే అభ్యంతరం ఎందుకొచ్చింది మరి?

వచ్చిందని సుప్రీంకోర్టు భావించింది కాబట్టే 85 రాజ్యంగ సవరణ అవసరం అయింది. మొన్ననే పుట్టిన ఆర్టికల్ 16(4ఎ) ని సవరించి ప్రమోషన్‌లో రిజర్వేషన్‌లు సీనియారిటీతో సహా ఇయ్యవచ్చునని రాజ్యాంగం చేత అనిపించవలసి వచ్చింది.

అక్కడితో కథ అయిపోలేదు. మామూలుగా, రిజర్వేషన్లు కల్పించినా కూడ సంబంధిత సామాజిక వర్గం ఆ ప్రయోజనాన్ని అందుకునే స్థితిలో లేకుంటే, ఉద్యోగ అర్హతలను సడలించడం జరుగుతుంది. ఇందులో తప్పేమీ లేదని కోర్టులు అని ఉన్నాయి. ప్రమోషన్లలో ఎస్.సి, ఎస్.టిలకు ఇచ్చిన రిజర్వేషన్లకు కూడ దీనిని వర్తింపచేసి ప్రమోషన్ పోస్టులకుండే అర్హతలను కూడ అవసరమైన మేరకు ప్రభుత్వం సడలించసాగింది. ఇది చెల్లదని సుప్రీంకోర్టు ఎస్. వినోద్‌కుమార్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో 1996లో అనింది. దీనిని అధిగమించడానికి 82వ రాజ్యాంగ సవరణ చేసి ఆర్టికల్ 335కు ఒక షరతు తగిలించవలసి వచ్చింది.

చివరిగా మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న నియమాన్ని మండల్ కమిషన్ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన తీరు వల్ల 81వ రాజ్యాంగ సవరణ అవసరం అయింది. నిజానికి ఒక కేడర్‌లో మొత్తం రిజర్వేషన్ 50 శాతం మించి ఉండడానికి వీలులేదన్న రాజ్యాంగ సూత్రానికి ఇప్పుడు ఏ తర్కం లేదు. ప్రభుత్వ ఉద్యోగాలలో ఎటువంటి వివక్షా పాటించడానికి వీలులేదని, అందరికీ సమాన అవకాశాలు ఉండాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(1) అంటుంది. అయితే ఉద్యోగ రంగంలో తగు ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించవచ్చునని 16(4) అంటుంది. మొదట్లో ఈ 16(4) ను 16(1)కి మినహాయింపుగా భావించింది సుప్రీంకోర్టు. అంటే రిజర్వేషన్లు సమాన అవకాశాలకు మినహాయింపు అని అర్థం చేసుకుంది. మరైతే మినహాయింపు అసలు కంటే ఎక్కువ ఉండకూడదు కదా? ఎక్కువ ఉంటే దానిని మినహాయింపు అనరు కదా? ఈ కామన్‌సెన్స్ తర్కంతో 1963లో గజేంద్ర గడ్కర్ '50 శాతం గరిష్ట పరిమాణం' అనే దానిని రిజర్వేషన్లకు సంబంధించిన రాజ్యాంగ సూత్రంగా ఎం.ఆర్. బాలాజీ వర్సస్ స్టేట్ ఆఫ్ మైసూర్ కేసులో ప్రకటించాడు.

రిజర్వేషన్లు సమాన అవకాశాలకు మినహాయింపు కాదనీ, సమాన అవకాశాలకు ఒక సాధనమనీ 1976లో మొట్టమొదటిసారి సుప్రీంకోర్టు గుర్తించింది. కృష్ణయ్యర్, ఫజల్ ఆలీ మొదలుగా గల ఏడుగురు జడ్జీల బెంచి స్టేట్ ఆఫ్ కేరళ వర్సస్ ఎన్.ఎం థామస్ కేసులో ఈ వాస్తవాన్ని గుర్తించి ప్రకటించింది. మరి రిజర్వేషన్లు సమాన అవకాశాలకు మినహాయింపు కాదు, ఒక సాధనం అని గుర్తించినట్టయితే మొత్తం రిజర్వేషన్ 50 శాతానికి లోబడి ఎందుకు ఉండాలి? సమాన అవకాశాలకు ఆ సమయంలో ఉండే ఆటంకం ఎంత బలంగా ఉందన్న దాన్ని బట్టి రిజర్వేషన్ల

పరిమాణం ఉండాలే తప్ప ముందే ఒక గరిష్ట పరిమాణం రాజ్యాంగం ఎట్లా ప్రకటించగలుగుతుంది? ఫజల్ ఆలీ ఆ కేసులో విడిగా రాసిన తీర్పులో ఈ మాట అననే అన్నాడు. ఒక రాష్ట్రంలో వెనుకబడిన ప్రజలు 80 శాతం ఉంటే రిజర్వేషన్లు 50 శాతం మించి ఉండడానికి వీలు లేదనడం అర్థరహితం అన్నాడు. (ఈ మాట ఒక హైందవేతర న్యాయమూర్తే అనగలిగాడని మేమంటే న్యాయమూర్తులకు మతాన్నీ, కులాన్నీ ఆపాదిస్తున్నాం అని విరుచుకుపడతారు కాబోలు!)

అయినప్పటికీ గజేంద్ర గడ్కర్ అభిప్రాయమే సుప్రీంకోర్టు అభిప్రాయంగా కొనసాగింది. మండల్ కమిషన్ కేసులో తొమ్మిది మంది జడ్జీల బెంచి కూడ దానిని నొక్కి చెప్పింది. తొలినాటి తర్కాన్ని కోల్పోయిన ఈ అభిప్రాయం కేవలం సుప్రీంకోర్టు ప్రవచనం కారణంగా ఒక రాజ్యాంగ సూత్రంగా మిగిలిపోయింది. అయితే మండల్ కమిషన్ కేసులో సుప్రీంకోర్టు ఒక ఉద్యోగానికి సంబంధించిన కేడర్‌లో రిజర్వేషన్లు 50 శాతం మించడానికి వీలులేదని ఊరుకోకుండా, ఒక కేడర్‌కు ఏ ఒక్క సంవత్సరంలో జరిగే రిక్రూట్‌మెంట్‌లోనైనా రిజర్వేషన్లు 50 శాతం మించి ఉండడానికి వీలులేదని ప్రకటించింది. మరైతే బ్యాక్‌లాగ్ పోస్టులను ఎట్లా నింపుతారు? ఒక కేడర్‌లో ఒక సంవత్సరం కొత్తగా 30 పోస్టులు నింపవలసి వచ్చిందనుకుందాం. అందులో 15 దాకా రిజర్వ్‌డ్ పోస్టులు ఉంటాయి (ఒకటో రెండో ఇటూ అటూగా). కానీ అదే కేడర్‌లో 20 ఎస్‌సి బ్యాక్‌లాగ్ పోస్టులు నింపవలసి ఉందనుకోండి. అవన్నీ ఎస్‌సిలకు రిజర్వ్ కావలసిందే కదా! ఆ 30, ఈ 20 కలిపి నోటిఫై చేస్తే మొత్తం 50 పోస్టులలో 35 రిజర్వ్ అవుతాయి. అంటే 50 శాతం మించిపోతుంది. ఒకవేళ ఆ సంవత్సరం కేవలం బ్యాక్‌లాగ్ పోస్టులే నింపినట్టయితే ఇరవైకి ఇరవయ్యీ రిజర్వ్ అవుతాయి. అంటే బ్యాక్‌లాగ్ నింపడం అసాధ్యం అని అర్థం. బొత్తిగా అనాలోచితంగా తొమ్మిది మంది జడ్జీల బెంచి వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని అధిగమించడానికి 81వ రాజ్యాంగ సవరణ చేసి రాజ్యాంగానికి ఆర్టికల్ 16 (4బి) ని చేర్చి, రిజర్వేషన్లు 50 శాతం మించడానికి వీలు లేదు అన్న నియమాన్ని ఒక సంవత్సరంలో చేసే నియామకాలకు అన్వయించేటప్పుడు బ్యాక్‌లాగ్ పోస్టులు లెక్కలోకి రావని రాజ్యాంగం చేతనే చెప్పించవలసి వచ్చింది.

ఉద్యోగ రంగంలో తగిన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించే అధికారానికి సుప్రీంకోర్టు అడుగడుగునా అహేతుకంగా అడ్డం పడడం ఈ రాజ్యాంగ సవరణలకు దారితీసిందనేది స్పష్టమే. 1950ల నుంచి 1970ల దాకా

ప్రైవేటు ఆస్తిని ప్రభుత్వ పరం చేసే చట్టాలకు, ప్రభుత్వ ఆదేశాలకు సుప్రీంకోర్టు అడ్డం పడడం, ఆ అడ్డంకిని తొలగించుకోవడానికి ప్రభుత్వం ఒకటికి నాలుగుసార్లు రాజ్యాంగాన్ని సవరించడం జరిగింది. ఇప్పుడు ప్రైవేటు ఆస్తులను పెంచే పనే తప్ప స్వాధీనం చేసుకునే ఆలోచన ప్రభుత్వాలు చేయడం లేదు కాబట్టి ఆ విషయంలో ప్రభుత్వానికీ, న్యాయస్థానాలకూ ఘర్షణ పాత చరిత్ర అయిపోయింది. దాని స్థానాన్ని రిజర్వేషన్లు ఆక్రమించుకున్నాయి. మెట్టుమెట్టుగా సుప్రీంకోర్టు అడ్డుపడడం, ప్రభుత్వం రాజ్యాంగాన్ని సవరించి సామాజిక న్యాయ లక్ష్యాన్ని కాపాడడం జరుగుతున్నది.

భారత రాజ్యాంగం ప్రపంచంలోని అతి పెద్ద రాజ్యాంగాలలో ఒకటన్నది తెలిసిన విషయమే. రాజ్యాంగంలో స్థూలంగా పాలనాధికారాలనూ, పౌరుల హక్కులనూ సూచించాలే గానీ ప్రతి చిన్న పాలనాధికార విశేషాన్ని రాజ్యాంగంలో రాయడం ఏమిటన్న విమర్శ భారత రాజ్యాంగంపైన ఎప్పటినుంచో ఉంది. రాజ్యాంగ పరిషత్ ముందు రాజ్యాంగం ముసాయిదాను ప్రవేశపెట్టిన సందర్భంగా చేసిన చాలా ఆసక్తికరమైన ఉపన్యాసంలో అంబేద్కర్ దీనికి చక్కగా జవాబు చెప్పాడు. ప్రతి రాజ్యాంగానికీ కొన్ని విలువలు ఉంటాయి. ఆ విలువల స్ఫూర్తిని ఆ సమాజం, ఆ దేశ పాలనా యంత్రాంగం జీర్ణించుకొని ఉన్నట్టయితే రాజ్యాంగం క్లుప్తంగా ఉన్నా ఫరవాలేదు గానీ మనది ప్రజాస్వామ్యాన్ని పైపూతగా గల అత్యంత అప్రజాస్వామిక సమాజం కాబట్టి అది సాధ్యం కాదని అన్నాడు. చారిత్రక కారణాల వల్ల వెనుక ఉంచబడ్డ వారికి ఉద్యోగాలలో ప్రత్యేక హక్కులు కల్పించే అధికారం ప్రభుత్వానికి ఉంది అన్న నాలుగు వాక్యాలు రాజ్యాంగంలో రాసి ఉంటే సరిపోవలసింది, ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇయ్యవచ్చునా, ఇస్తే సీనియారిటీ ఇయ్యవచ్చునా, క్వాలిఫికేషన్ మార్కులు తగ్గించవచ్చునా అంటూ ఒక జీవోలో ఉండవలసిన వివరాలన్నీ రాజ్యాంగంలోనే రాసుకోవలసిన అగత్యం ఏర్పడడానికి రాజ్యాంగ విలువల స్ఫూర్తి సమాజంలోను, పాలనా యంత్రాంగంలోనే కాదు, న్యాయస్థానాలలోనూ కొరవడడం తప్ప వేరే కారణం కాదు.

సరే, పైన క్లుప్తంగా వివరించిన 77, 81, 82, 85వ రాజ్యాంగ సవరణలు చెల్లవంటూ అగ్రకులాల వారు కుప్పలు కుప్పలుగా సుప్రీంకోర్టులో కేసులు వేశారు. వాటన్నిటి పైనా 2006 అక్టోబరు 19వ తేదీన నాగరాజు వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా అనే కేసులో అయిదుగురు జడ్జీల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తరఫున తీర్పు ప్రకటించిన కపాడియా అన్ని కేసులనూ కొట్టివేసి ఆ నాలుగు రాజ్యాంగ సవరణలూ చెల్లుతాయని స్పష్టం చేశారు. అయితే ఆ క్రమంలో వివాదంలో భాగం

కాని విషయాల మీద పొంతన లేని వ్యాఖ్యలు చేసి అనవసరమైన గందరగోళం సృష్టించారు.

కేసు వేసిన వాళ్ళు ఆ నాలుగు రాజ్యాంగ సవరణలూ చెల్లవనడానికి రెండు కారణాలు చూపించారు. సుప్రీంకోర్టు తీర్పులలో ప్రకటించిన సూత్రాలను వమ్ము చేయడానికి రాజ్యాంగాన్ని సవరించడం చట్టసభలకు రాజ్యాంగం ఇచ్చిన అధికారాల దుర్వినియోగం అన్నారు. రెండు, ఈ నాలుగు సవరణలు రాజ్యాంగం మౌలిక స్వరూపాన్నే మార్చేశాయి కాబట్టి అవి చెల్లవన్నారు. రెండు వాదనలనూ కపాడియా నిస్సంకోచంగానే తిరస్కరించారు. చట్టానికి సుప్రీంకోర్టు చేసే వ్యాఖ్య చట్టంతో సమానమని రాజ్యాంగంలోని ఆర్టికల్ 141 అంటుంది. కాబట్టి అన్ని చట్టాలను సవరించినట్టే ఆ వ్యాఖ్యను కూడ సవరించవచ్చు. అది చట్ట సవరణే అవుతుంది గానీ సుప్రీంకోర్టును అగౌరవపరిచే చర్య కాదు. ఇది సాధారణ చట్టాలకే కాక రాజ్యాంగ చట్టానికి కూడ వర్తిస్తుంది. ఎందుకంటే రాజ్యాంగాన్ని సవరించే అధికారం కూడ పార్లమెంటుకు ఉంది.

ఇక రెండవ అభ్యంతరం, ఈ నాలుగు సవరణలూ రాజ్యాంగం మౌలిక స్వరూపాన్నే మార్చేశాయి కాబట్టి అవి చెల్లవు అనేది. రాజ్యాంగాన్ని సైతం సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది అని రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 అంటుంది. వివిధ రకాల రాజ్యాంగ సవరణలకు అనుసరించవలసిన పద్ధతులను కూడ నిర్దేశిస్తుంది. పైన చెప్పినట్టు, సొంత ఆస్తులను ప్రభుత్వపరం చేయడానికి చేపట్టిన చర్యలకు సుప్రీంకోర్టు పదే పదే అడ్డుతగలగా ఆ ఆటంకాన్ని అధిగమించడానికి 1970 దాకా రాజ్యాంగాన్ని అనేకసార్లు సవరించడం జరిగింది. ఆ సందర్భంగా, రాజ్యాంగాన్ని సవరించవచ్చునంటే ఎంత దూరమైనా పోవచ్చునా, మొత్తంగా రాజ్యాంగాన్నే తిరగ రాయవచ్చునా అన్న ప్రశ్న వచ్చింది. కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ అనే కేసులో 1973లో 13 మంది జడ్జీల బెంచి రాజ్యాంగ ప్రాథమిక హక్కులతో సహా దేనినైనా సవరించవచ్చును గానీ సవరణ కారణంగా రాజ్యాంగ 'మౌలిక స్వరూపం' మారిపోకూడదని ప్రకటించింది. కాని 'మౌలిక స్వరూపం' అంటే ఏమిటో అప్పటి నుంచి ఇప్పటి దాకా సుప్రీంకోర్టు చెప్పలేదు. అయితే ప్రజాస్వామ్యం, లౌకికవాదం, చట్టబద్ధ పాలన మొదలైన వాటిని 'మౌలిక స్వరూపం'లో భాగంగా సుప్రీంకోర్టు ఆ తరువాత వెలువరించిన తీర్పులలో గుర్తించింది.

నాగరాజు కేసులో కపాడియా ఈ విషయాన్ని ఆసక్తికరంగా చర్చించారు. మౌలిక స్వరూపం అంటే రాజ్యాంగంలోని ఫలానా ఆర్టికల్, లేదా మరొక ఆర్టికల్ కాదనీ, రాజ్యాంగంలోని వివిధ అధికరణాలను కలుపుతూ అనుసంధానం చేసే అంతస్సూత్రాలను మౌలిక స్వరూపంగా భావించాలనీ అన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం, చట్టపరమైన సమానత్వం, సామాజిక న్యాయం, పాలనలో నిష్పాక్షికత మొదలైనవి ఒక చోటో ఇంకొక చోటో రాజ్యాంగంలో ప్రస్తావించబడి ఉండవచ్చు, ఉండకపోవచ్చు. కానీ ఇవి రాజ్యాంగానికి అంతస్సూత్రంగా ఉన్నాయి. ఇవీ, ఇటువంటివీ మౌలిక సూత్రాలు. వీటిని తిరస్కరించే విధంగా రాజ్యాంగ సవరణలు చేసే అధికారం పార్లమెంటుకు రాజ్యాంగం ఇవ్వలేదు. ప్రభుత్వ ఉద్యోగ రంగంలో ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వవచ్చునా లేదా, ఇస్తే సీనియారిటీ ఇవ్వవచ్చునా లేదా అనేవి ఇటువంటి అంతస్సూత్రాల కిందికి రావు కాబట్టి వాటికి సంబంధించి చేసిన సవరణలు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చేశాయని అనడానికి వీలులేదని కపాడియా అన్నారు.

అంతవరకూ బాగానే ఉంది. కానీ 'మౌలిక స్వరూపం' అనే దానికి ఇచ్చిన సవరణ హేతుబద్ధంగానే ఉందనుకున్నా, రాజ్యాంగ అధికరణాలకు అంతస్సూత్రంగా ఏయే విలువలను గుర్తించాలనేది ఇప్పటికీ సుప్రీంకోర్టు చేతిలోనే ఉండిపోవడం గమనార్హం. దేశ పార్లమెంటు దేశ రాజ్యాంగంలో ఏ మేరకు సవరణలు చేయవచ్చునన్న ప్రమాణాలను రాజ్యాంగమే సూచించడం ఉచితంగా ఉంటుంది తప్ప సుప్రీంకోర్టులో అప్పటికి కూర్చున్న న్యాయమూర్తుల అభిప్రాయాలు ఆ ప్రమాణాన్ని నిర్దేశించడం ఏ రకంగానూ మంచిది కాదు. ప్రభుత్వ ఉద్యోగాలలో 69 శాతం రిజర్వేషన్లు ఇస్తున్న తమిళనాడు రాష్ట్రప్రభుత్వ విధానం రాజ్యాంగ బద్ధమేనా అనేది సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులలో ఒకటి.  దానిని 9వ షెడ్యూల్‌లో వేసి న్యాయ సమీక్ష నుంచి కాపాడాలని చూశారు గానీ 9వ షెడ్యూలులో ఉన్న చట్టాలు సైతం రాజ్యాంగ మౌలిక స్వరూపానికి  భిన్నమైతే కొట్టివేయవలసి ఉంటుందని ఈ మధ్యనే సుప్రీంకోర్టు అని ఉంది. కాబట్టి మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించడానికి వీలులేదన్న సూత్రం రాజ్యాంగ మౌలిక స్వరూపానికి సంబంధించినదా – అంటే రిజర్వేషన్లు సగం కంటే ఎక్కువ ఉండడం రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమైన సమానతా సూత్రాన్ని అతిక్రమిస్తుందా – అనే ప్రశ్న త్వరలోనే మరొక రాజ్యాంగ ధర్మాసనం ముందుకు

రాబోతుంది. ఆ లోపల 'మౌలిక స్వరూపం'గా గుర్తించగల రాజ్యాంగ అంతస్సూత్రాలైన విలువలు ఏమిటన్నది పార్లమెంట్ స్పష్టం చేయడం మంచిది.

అదట్లా ఉంచి 77, 81, 82, 85వ రాజ్యాంగ సవరణలు ఏ రకంగానూ రాజ్యాంగ విరుద్ధం కావని అంటూ అక్కడితో ఆగిపోకుండా సుప్రీంకోర్టు చేసిన అసందర్భమైన అదనపు ప్రసంగాన్నీ, నష్టకరం కాగల వ్యాఖ్యలనూ చూద్దాం.

"ఈ రాజ్యాంగ సవరణలు రాజ్యాంగ బద్ధమైనవేనని అంటున్నామంటే వీటిని ఆశ్రయించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలూ ప్రభుత్వ సంస్థలూ ప్రమోషన్ల విషయంలో చేపట్టిన రిజర్వేషన్‌లన్నీ చెల్లుతాయని మా అభిప్రాయం కాదు. ఈ సవరణలు ఆ విషయంలో ప్రభుత్వానికి కల్పించే అధికారం రాజ్యాంగ బద్ధమేనంటున్నాం. కానీ ఆ అధికారాన్ని వినియోగించిన ప్రతి సందర్భంలోనూ, దానిని సక్రమంగా వినియోగించారా లేదా అనేది కోర్టులు సమీక్షించగలవు" అని సుప్రీంకోర్టు అనింది. ఒక అధికారాన్ని ప్రభుత్వానికి కట్టబెట్టడం రాజ్యాంగ బద్ధమే అయినా, దానిని వినియోగించే క్రమంలో చేపట్టిన ఒక చర్య అక్రమంగా ఉంటే అది చెల్లదనీ, ఆ విషయం కోర్టులు సమీక్షించగలవనీ చెప్పే సూత్రంతో పేచీ ఏమీ లేదు. ఉదాహరణకు ప్రజావసరాల కోసం ప్రభుత్వం బలవంతపు భూసేకరణ చేయవచ్చునన్న అధికారం రాజ్యాంగ బద్ధమే అయినా ఒక్కొక్క భూసేకరణ ప్రక్రియనూ అది నిజంగా ప్రజావసరం కోసమే జరుగుతున్నదా, నిష్పక్షపాతంగానే జరుగుతున్నదా మొదలైన ప్రమాణాల ప్రాతిపదికన కోర్టులు సమీక్షించవచ్చు.

అయితే 77, 81, 82, 85వ రాజ్యాంగ సవరణలు ఇచ్చే అధికారాన్ని వినియోగించే చర్యలను సమీక్షించే సందర్భంలో ఏ ప్రమాణాలను ప్రయోగించాలన్న సూత్రీకరణ చేసేటప్పుడు, ఈ రాజ్యాంగ సవరణలిచ్చే అధికారం ఎస్‌సి, ఎస్‌టిలకు మాత్రమే సంబంధించిందని దృష్టిలో పెట్టుకోకుండా బి.సి రిజర్వేషన్లకు వర్తించే ప్రమాణాలను కూడ కపాడియా తన తీర్పులో ఉటంకించడం అనవసరమైన గందరగోళానికి దారితీసింది. ఇంత సామాజిక ప్రాధాన్యం గల విషయాలలో అజాగ్రత్తగా తీర్పులు రాయడం క్షంతవ్యం కాదు. అయితే ఈ అజాగ్రత్త కేవలం పొరబాటున దొర్లింది కాదు. రాజ్యాంగ బద్ధమేనని ఒప్పుకోక తప్పని అధికారాల పట్ల వాస్తవానికి వ్యతిరేక భావం ఉండడం ఈ అదనపు ప్రసంగానికి కారణం.

ఆయన ఏకరవు పెట్టిన ప్రమాణాలేమిటంటే రిజర్వేషన్లు పొందబోయే వారు వెనుకబడి ఉన్నారని 'గణాంక యుతమైన సమాచారం' ఉండాలి. ఆ ఉద్యోగ రంగంలో వారికి తగిన ప్రాతినిధ్యం లేదని కూడ కచ్చితమైన సమాచారం ఉండాలి. మొత్తం కేడర్‌లో రిజర్వేషన్ 50 శాతం మించకుండా ఉండాలి. క్రీమీలేయర్ సూత్రాన్ని పాటించాలి. వీటిని ఆయన తీర్పులో ఒక చోట పొందుపరచలేదు. వ్యాసం రాసే పద్ధతిలో – ఇంకా సరిగ్గా చెప్పాలంటే ఉపన్యాస ధోరణిలో – ఇక్కడొకటీ, అక్కడొకటీ చెప్పారు. అయితే ఈ నాలుగింటిలో రెండు మాత్రమే ఎస్.సి, ఎస్.టిలకు వర్తిస్తాయి. ఆ ఉద్యోగ రంగంలో తగిన ప్రాతినిధ్యం ఉందా లేదా అని చూడాలి, మొత్తం కేడర్‌లో రిజర్వేషన్ 50 శాతం మించకుండా చూడాలి అనేవి రెండూ ప్రస్తుత రాజ్యాంగ వ్యాఖ్యానాల ప్రకారం అన్ని రిజర్వేషన్లకూ వర్తిస్తాయి. వెనుకబడి ఉన్నారని రుజువు చేసే గణాంకయుతమైన సమాచారం ఉండాలి అనేదీ, క్రీమీ లేయర్‌ను తొలగించాలి అనేదీ బి.సిలకే తప్ప ఎస్.సి, ఎస్.టిలకు వర్తించవని ఇంతకంటే పెద్ద బెంచిలు తీర్పులు ఇచ్చి ఉన్నాయి.

'ప్రభుత్వ ఉద్యోగాలలో తగిన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు' రిజర్వేషన్ ఇవ్వడాన్ని గురించి ఆర్టికల్ 16 (4) చెప్తుంది. ఒక సామాజిక వర్గానికి రిజర్వేషన్ ఇచ్చే ముందు అది వెనుకబడిన వర్గమా కాదా అని పరిశీలించాలి. దాని కోసం ప్రతి రాష్ట్రంలోనూ ఒక బి.సి కమిషన్‌ను నెలకొల్పాలనీ, ఆ కమిషన్ ఈ విషయాన్ని పరిశోధించి నివేదిక ఇవ్వాలనీ మండల్ కమిషన్ కేసులో సుప్రీంకోర్టు అనింది. అయితే ఇది ఎస్.సి, ఎస్.టిలు కాని కులాలకు మాత్రమే వర్తిస్తుంది. ఎందుకంటే ఎస్.సి, ఎస్.టిలను ఆర్టికల్ 16(4) పరిధిలోని వెనుకబడిన వర్గాలుగా రాజ్యాంగమే గుర్తించిందని ఒకసారి కాదు, అనేక సార్లు సుప్రీంకోర్టు ప్రకటించి ఉంది. వారి విషయంలో వెనుకబడి ఉన్నారని 'గణాంకయుతమైన సమాచారం' ప్రతిసారీ సేకరించి రుజువు చేయనవసరం లేదు. రాజ్యాంగం ప్రకారమే వారు వెనుకబడిన వర్గాలు. ఇతర కులాలకే అది అవసరం. (అందుకే అటువంటి కులాలను ఇతర వెనుకబడిన కులాలు – other backward classes – అంటారు.) క్రీమీ లేయర్‌ను – అంటే ఇప్పటికే రిజర్వేషన్‌ల వల్ల ప్రయోజనం పొంది ఉన్న ఉప వర్గాన్ని గుర్తించి రిజర్వేషన్ల పరిధి నుంచి వారిని తొలగించాలన్న సూత్రాన్ని ఆదేశించిన మండల్ కమిషన్ కేసులోనే 'ఇది బి.సిలకే తప్ప ఎస్.సి, ఎస్.టిలకు వర్తించదని స్పష్టం చేస్తున్నాం' అని సుప్రీంకోర్టు అనింది. అది తొమ్మిది మంది జడ్జీల తీర్పు.

దానికి భిన్నంగా ఐదుగురు జడ్జీలు ప్రవచించడానికి వీలులేదు. అయినా తాను ఆ సాహసం చేస్తున్నానని కపాడియా అనలేదు. ఏం రాస్తున్నాడో ఆలోచించకుండా రాసేశాడంతే.

ఈ రెండు ప్రవచనాలూ గందరగోళానికి దారితీసినప్పటికీ అవి ఇంతకంటే పెద్ద బెంచీలు గతంలో ఇచ్చిన తీర్పులకు వ్యతిరేకం కాబట్టి వాటికి ఆచరణలో దుష్ఫలితమేమీ ఉండదు. కానీ మరొక నష్టకరమైన సూత్రీకరణ తీర్పులో ఉంది – దానినెవ్వరూ గమనించినట్టు లేరు.

ప్రమోషన్లలో ఎస్.సి. ఎస్.టిలకు రిజర్వేషన్లు ఇవ్వవచ్చునని చెప్పే ఆర్టికల్ 16 (4ఎ) చెల్లుబాటు అవుతుందనే అభిప్రాయానికి రావడానికి సుప్రీంకోర్టు ఇతర కారణాలతో బాటు ఒక విచిత్రమైన వాదనను ఆసరా చేసుకుంది. ఇది ఎవరైనా చేసిన వాదనో లేక జడ్జీల బుద్ధికే తోచిందో తెలీదు. 16(4) ప్రకారం ఎస్.సి, ఎస్.టి, బి.సిలకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు ఇయ్యవచ్చు. 16(4ఎ) ప్రకారం ఎస్.సి, ఎస్.టిలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వవచ్చు. అంటే ఉద్యోగాలలో వెనుకబడిన వర్గాలన్నిటికీ రిజర్వేషన్లు ఇచ్చే అవకాశం ఉండగా, ప్రమోషన్ల దగ్గరికి వచ్చేసరికి అందులో మరీ వెనుకబడిన వారైన ఎస్.సి, ఎస్.టిలను వేరుచేసి వారికి మాత్రం రిజర్వేషన్లు ఇచ్చే అవకాశాన్ని కల్పించారు. ఇది హేతుబద్ధమైన ఉపవర్గీకరణే కదా! అనింది సుప్రీంకోర్టు. బి.సిల కంటే ఎస్.సిలు, ఎస్.టిలు వెనుకబడిన వారు కాబట్టి వారిని వేరుచేసి వారికి మాత్రం ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వడంలో తప్పేమీ లేదనింది.

నిజానికి బి.సిలకు ఇవ్వకుండా ఎస్.సి., ఎస్.టిలకు మాత్రమే ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వడం న్యాయమా అన్న ప్రశ్న ఎవరూ లేవదీయలేదు. ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించే అధికారం ఇచ్చే రాజ్యాంగ సవరణ చెల్లుతుందా లేదా అన్నదొక్కటే ఈ కేసులోని వివాదం. అది రాజ్యాంగ మౌలిక స్వరూపానికి భంగకరం కాదు కాబట్టి దానిలో తప్పేమీ లేదని సుప్రీంకోర్టు అనింది. అక్కడితో ఆగకుండా, మూడు వర్గాలకు రిజర్వేషన్ ఇచ్చే అధికారం ఉండగా, అందులో రెండు వర్గాలను మరీ వెనుకబడినవిగా గుర్తించి వేరుచేసి వారికి మాత్రం ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వడం హేతుబద్ధమైన ఉపవర్గీకరణేననీ, అందులో తప్పేమీ లేదనీ అనడం ఎందుకు? రేపు బి.సిలకు కూడ ఆయా ఉద్యోగరంగాలలో తగిన ప్రాతినిధ్యం లేని సందర్భాలలో ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించవచ్చుననే సవరణ చేస్తే, వారికి ఇవ్వకుండా ఎస్.సి, ఎస్.టిలకు

మాత్రమే ఇవ్వడం వల్లనే 16 (4ఎ) చెల్లుబాటవుతుందని సుప్రీంకోర్టు నాగరాజు కేసులో చెప్పింది కాబట్టి వారికి కూడ ఇస్తే చెల్లదని దబాయించడానికా? దీనిని 'ముందు జాగ్రత్తగా' చేసిన సూత్రీకరణగా అనుకోకూడదా?

ప్రభుత్వ రంగమే తగ్గిపోతూ ఉన్నప్పుడు, ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలే తరిగిపోతున్నప్పుడు ఈ చర్చ ఎందుకు అంటారేమో. అది సరైన అభ్యంతరం కాదు. ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ బలంగా ముందుకొస్తున్నది. విద్యా సంస్థల వరకు దీనికి సహితం ఒక రాజ్యాంగ సవరణ సుప్రీంకోర్టు నిర్వాకం వల్ల అవసరం అయింది. దాన్ని చేశారు కూడ. ఉద్యోగ రంగంలో రిజర్వేషన్ల విషయంలో ప్రస్తుత ప్రభుత్వం తటపటాయిస్తున్నా రేపో మాపో కల్పించక తప్పదు. సుప్రీంకోర్టు అడ్డం పడితే దానికి కూడ రాజ్యాంగాన్ని సవరించక తప్పదు. ఈ రోజు ప్రభుత్వ రంగ రిజర్వేషన్ల గురించి జరుగుతున్న సంవాదం యావత్తు రేపు ప్రైవేటు రంగ రిజర్వేషన్ల సమస్య మీద కూడ ప్రభావితం చేస్తుంది. అందువల్ల ఈ చర్చ చాలా అవసరం. ఆ సంగతి ప్రజాతంత్ర శక్తులకు అర్థం కాకున్నా రిజర్వేషన్ వ్యతిరేకులకు స్పష్టంగా అవుతున్నది కాబట్టే వాళ్ళు దీనికి ఇవ్వవలసిన ప్రాధాన్యమంతా ఇస్తున్నారు.

*మొదటి ముద్రణ : మానవహక్కుల వేదిక బులెటిన్ 8, మే 2007*
*రెండవ ముద్రణ : 'రిజర్వేషన్లు : ప్రజాస్వామిక దృక్పథం', 2013*
*(పర్స్పెక్టివ్స్ ప్రచురణ)*

# ఈ తీర్పుతోనూ సమస్యలున్నాయి

**ఒ**బిసి రిజర్వేషన్ కేసును రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించిన సమయంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి అరిజిత్ పసాయత్ వ్యక్తం చేసిన వ్యతిరేక అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకున్నప్పుడు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తుదితీర్పు సంతోషం కలిగించడం సహజం. అందువల్ల వెంటనే అందరూ దానిని ఆహ్వానించారు. కాంగ్రెస్ వారు భుజాలు చరుచుకున్నారు కూడ. అగ్రహారాలుగా ఉన్న ఉన్నత విద్యాసంస్థలలో ఒబిసిల ప్రవేశానికి మార్గం సుగమం చేసిన మేరకు ఈ తీర్పు హర్షణీయమే గానీ, ఇప్పటివరకు పత్రికలలో వచ్చిన వ్యాఖ్యలను బట్టే చూసినా పదిహేనేళ్లుగా రిజర్వేషన్ల విషయంలో న్యాయస్థానాలు వ్యక్తం చేస్తున్న వ్యతిరేక వైఖరినే ఈ తీర్పు ఇంకొంచెం ముందుకు తీసుకుపోయిందన్న సందేహం రాకమానదు. ఒబిసిల కిచ్చే రిజర్వేషన్ నుండి ఆయా కులాలలోని ఉన్నత వర్గాన్ని (క్రీమీలేయర్) మినహాయించాలన్న సూత్రీకరణ ఇప్పటిదాకా ఉద్యోగ రిజర్వేషన్లకే పరిమితం అయి ఉండింది. దానినిప్పుడు విద్యా వ్యవస్థలో సీట్లకూ వర్తింపచేశారు. ఆ ఉన్నత వర్గాన్ని గుర్తించడానికి ఉపయోగించవలసిన ప్రమాణాలను కూడ తామే శాసనకర్తలయినట్టు ప్రకటించారు. ఇంకా ఏమేం చెప్పారో తీర్పు పూర్తి ప్రతిని చూస్తే తప్ప చెప్పలేం.

రాజ్యాంగం రాక పూర్వం నుండి కూడ మన దేశంలో రిజర్వేషన్లు అమలయ్యాయి. దక్షిణ భారత రాష్ట్రాలలోనూ మహారాష్ట్రలోనూ వచ్చిన బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాల ప్రభావం వల్ల విద్యా ఉద్యోగరంగాలలోనూ, ప్రాతినిధ్య వ్యవస్థలలోనూ

బ్రాహ్మణేతర కులాల ప్రవేశానికి మార్గం ఏర్పడింది. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత ఇది నిజానికి మరింత సరళతరం అయిఉండాలి. రాజ్యాంగకర్తల ఉద్దేశ్యం అదే. అయితే న్యాయస్థానాలు తమ వ్యతిరేక వైఖరితో ఆ అవకాశాన్ని కుదించి వేశాయి. 1976 దాకా రిజర్వేషన్లు సమాన అవకాశాలకు విరుద్ధం అంటూ జడ్జీలు సూత్రీకరించారు. 1976లో మొట్టమొదటిసారి రిజర్వేషన్లు సమాన అవకాశాలకు విరుద్ధం కాదనీ, సమాన అవకాశాలకు సాధనం అనీ సుప్రీంకోర్టు గుర్తించింది. మామూలు మనుషులకిది సులభంగానే అర్థం అవుతుంది గానీ న్యాయమూర్తులకు అర్థం కావడానికి పాతికేళ్లు పట్టింది.

అప్పటి నుండి రిజర్వేషన్ల విషయంలో కొంత అనుకూల వైఖరి కోర్టు తీర్పులలో కనిపించింది. 1992లో తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ప్రకటించిన 'మండల్ కమిషన్' కేసు ఈ అనుకూల వైఖరిని ఒక వైపు క్రోడీకరించి ఆమోదముద్ర వేస్తూ, మరోవైపు ఆ తరువాతి వ్యతిరేక పరిణామాలకు బీజం అయిన రెండు సూత్రీకరణలను కూడ చేసింది. అన్ని ఒబిసి కులాలలోనూ 'క్రీమీలేయర్' అని పిలవబడే ఉన్నత వర్గాన్ని రిజర్వేషన్ల పరిధి నుండి తొలిగించాలన్నది ఒక సూత్రీకరణ. ఒబిసి కులాలను గుర్తించడానికి బిసి కమిషన్‌ను నియమించి బహిరంగ విచారణను చేపట్టాలన్నది రెండవది.

అప్పటినుండి గడిచిన పదిహేను సంవత్సరాలుగా మళ్లీ వ్యతిరేక వైఖరి గల తీర్పులే వస్తున్నాయి. ఈ వ్యతిరేక వైఖరిని సమర్థించుకోవడానికి రిజర్వేషన్ల వల్ల ఆయా కులాలలోని ధనవంతులే బాగు పడుతున్నారని వ్యాఖ్యానించడం వింటున్నాం. ఈ వ్యాఖ్య న్యాయమూర్తుల నుండి వింటున్నాం, సామాజిక వ్యాఖ్యాతల నుండి కూడ వింటున్నాం. నాకు తెలిసి ఈ విషయంలో ఎవరూ అధ్యయనం చేపట్టలేదు. రిజర్వేషన్లు ఆయా కులాలలో ఎంత మందికి అందాయన్న సమగ్రమైన పరిశోధన ఏదీ లేదు. న్యాయస్థానాల తీర్పులు అటువంటి ఏ పరిశోధననూ ఉటంకించలేదు. మరి ఏ సమాచారం లేకుండా ఈ నిర్ణయానికి ఎట్లా వచ్చారు? ప్రభుత్వం ఏదైనా నిర్ణయం చేస్తే 'నీ దగ్గర ఏం సమాచారం ఉంది? ఎప్పుడు సేకరించారు? ఎంత శాస్త్రీయంగా సేకరించారు?' అని న్యాయస్థానాలు ప్రశ్నిస్తుంటాయి. మరి అవే ప్రశ్నలను మనం న్యాయస్థానాలను అడగకూడదా? తమ దగ్గర ఏం సమాచారం ఉందని న్యాయమూర్తులు ఈ వ్యాఖ్యలు చేస్తున్నారు? ఏ సమాచారం ఆధారంగా ప్రతీ ఒబిసి కులంలోనూ ఒక ఉన్నత వర్గమే రిజర్వేషన్లు తీసుకుంటున్నదన్న నిర్ణయానికొచ్చి

వారిని తొలగించాలని పట్టుబడుతున్నారు? ఒబిసిలలో ఎస్.సి, ఎస్.టిలకు దగ్గరగా ఉన్న కులాలూ ఉన్నాయి. మన దగ్గర దొమ్మరి కులాన్ని ఉదాహరణగా తీసుకోవచ్చు. దొమ్మరులలోనూ క్రీమీలేయర్‌ను తొలగించవలసిందేనా? నాకు తెలిసి ఆ కులంలో ఒక ఎమ్మెల్యే గానీ ఒక ఐఎఎస్ అధికారి గానీ ఒక జడ్జీ గానీ లేరు. రేపెవరైనా కష్టపడి ఆ హోదాను చేరుకుంటే వారి పిల్లలను వెంటనే రిజర్వేషన్లకు అనర్హులు చేయవలసిందేనా? చాలా ఒబిసి కులాలలో 'క్రీమీలేయర్'ను తొలగించినట్టయితే రిజర్వేషన్ కోటా సహితం నిండకపోవచ్చు. ప్రస్తుత విషయానికే వస్తే, ఐఐటి, ఐఐఎం వంటి సంస్థలలో సీట్లు అందుకోవాలంటే కొంత ఆర్థిక స్థోమత, విద్య విషయంలో అనుకూలమైన కుటుంబ వాతావరణం అవసరం. 'క్రీమీలేయర్'ను తొలిగించి వేస్తే 27 శాతంలో సగం కూడ నిండకపోవచ్చు. ఉద్యోగాలయితే ఖాళీగా ఉంచి మరుసటి సంవత్సరం మళ్లీ ప్రయత్నించవచ్చును గానీ విద్యాసంస్థలలో సీట్లను ఖాళీ ఉంచడానికి వీలులేదు. ఓపెన్ కాంపిటిషన్‌కు బదలాయించవలసిందే. ఇంతా చేసి ఉన్నత విద్యా సంస్థలలో ఈ తీర్పు చలవ వల్ల ఏ మార్పయినా చూడబోతామా?

రిజర్వేషన్ల లక్ష్యం సామాజిక వర్గాల మధ్య సమానత సాధించడమే తప్ప సామాజిక వర్గాల లోపల సమానత సాధించడం కాదు. దానికి కావలసిన చర్యలు వేరే. ఓపెన్ కాంపిటిషన్‌లోనూ ఇప్పటికే బాగుపడిన వారి పిల్లలే మళ్లీ మళ్లీ ఎంపిక అవతుంటారు. అదెందుకు ఎవరికీ ఆందోళన కలిగించదు? సామాజిక వర్గాలను, ప్రత్యేకించి కులాలను నిచ్చెన మెట్ల మీద నిలబెట్టి హెచ్చు తగ్గులు నిర్దేశించిన సామాజిక వ్యవస్థను సంస్కరించి అన్ని కులాలనూ ఒకే సరసన నిలబెట్టడం రిజర్వేషన్ల లక్ష్యం. ఒబిసిలలో ఏదైనా ఒక కులం రిజర్వేషన్ల అవసరం లేకుండ ఓపెన్ కాంపిటిషన్‌లోనే అవకాశాలు పొందగలుగుతున్నదన్న అభిప్రాయం ఉన్నట్టయితే, అదెంత వరకు వాస్తవమో పరిశీలించి ఆ మేరకు ఆ కులానికిచ్చే రిజర్వేషన్ కోటా తగ్గించవచ్చు. అది న్యాయమైన చర్యే అవుతుంది. అయితే ఆ పని చేయాలంటే ముందు కులాలవారీ జనాభా లెక్కలు కావాలి, కులాల వారీగా ఓపెన్ కాంపిటిషన్‌లో ఏ మేరకు నెగ్గుకొని రాగలుగుతున్నారన్న లెక్కలు కావాలి. ప్రస్తుతం ఇవేవీ లేవు.

ఇక వెనుకబడిన సామాజిక వర్గాల గుర్తింపు విషయానికొస్తే, ఒక వర్గం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉందని సూచించే ప్రాథమిక సమాచారం ప్రభుత్వం దగ్గరుంటే చాలు. ప్రభుత్వం వారికి రిజర్వేషన్ కల్పించవచ్చు. అంతే తప్ప వెనుకబాటుతనాన్ని శాస్త్రీయంగా రుజువు చేయాలన్నది రాజ్యాంగ నియమం కాదు.

బహిరంగ విచారణ జరిపి రిజర్వేషన్ ఇవ్వడాన్ని వ్యతిరేకించే వాళ్ల అభిప్రాయాలు కూడ లెక్కలోకి తీసుకొని నిర్ణయం చేయాలన్నది అసలే కాదు. ఈ ఒక్క విషయంలోనే కాదు. ఏ విషయంలోనైనా సమస్యను వాస్తవికంగా గుర్తించాలి, హేతుబద్ధంగా పరిష్కరించాలి అన్నదే పాలనా నియమం. దీనికి సంబంధించిన ప్రాథమిక సమాచారం ప్రభుత్వం దగ్గర ఉంది, హేతుబద్ధంగా వ్యవహరించినంత కాలం న్యాయస్థానాల జోక్యానికి అవకాశం లేదు, ఉండకూడదు. ఆపైన ప్రభుత్వ చర్యల తప్పొప్పులు ప్రభుత్వాన్ని ఎన్నుకునే ప్రజలు చూసుకుంటారు.

రిజర్వేషన్ల విషయంలో ఈ ప్రజాస్వామ్య సూత్రాన్ని న్యాయస్థానాలు పక్కన పెట్టి, వెనుకబడిన వర్గాల గుర్తింపు బహిరంగ విచారణ ద్వారా జరగాలనీ, శాస్త్రీయ ప్రమాణాలను సంతృప్తి పరచాలనీ, ఆ ప్రమాణాలను అందుకున్నదీ లేనిదీ తాము తేలుస్తామనీ అంటున్నాయి. 1992లో తొమ్మిది మంది జడ్జీలు ఇచ్చిన మండల్ కమిషన్ తీర్పు ఇంత దూరం పోలేదు గానీ దీనికి బీజం వేసింది. ఆ తరువాత వచ్చిన తీర్పులలో ఈ వైఖరి బలపడింది. మన రాష్ట్ర హైకోర్టు గతంలో ముస్లిం రిజర్వేషన్ల చట్టాన్ని కొట్టేస్తూ ఇచ్చిన తీర్పు దీనికి అతి సమీప ఉదాహరణ.

మొన్నటి సుప్రీంకోర్టు తీర్పులో ముగ్గురు జడ్జీలు విడిగా రాసిన అభిప్రాయంలో ఈ కోవకు చెందిన వ్యాఖ్యలూ సూత్రీకరణలూ చాలా ఉన్నట్టున్నాయి. న్యాయస్థానాలు మితిమీరి అధికారాన్ని చలాయిస్తున్న ఈ వైనాన్ని నిర్మొహమాటంగా చర్చించకపోతే ఒక్క రిజర్వేషన్ హక్కునే కాదు, మొత్తంగానే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం పోనుపోను చాలా కష్టం కాగలదు.

*మొదటి ముద్రణ : ఆంధ్రజ్యోతి దినపత్రిక, 16 ఏప్రిల్ 2008*

*రెండవ ముద్రణ : 'రిజర్వేషన్లు : ప్రజాస్వామిక దృక్పథం', 2013*

*(పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ)*

# ఒబిసిల కోటా అగ్రకులాలకు!

ఉన్నతస్థాయి కేంద్రీయ విద్యా సంస్థలలో వెనుకబడిన వర్గాల విద్యార్థులకు రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఒక చట్టం చేసిందని పత్రికలలో అందరూ చదివే ఉంటారు. కాని ఆ చట్టం ఫలితంగా ఆ విద్యాసంస్థలలో అగ్రకులాల విద్యార్థులకు మరిన్ని సీట్లు దక్కాయంటే ఆశ్చర్యపోతారేమో. ఏ కేంద్రీయ విశ్వవిద్యాలయాన్నయినా, ఏ ఇతర ఉన్నతస్థాయి కేంద్రీయ విద్యాసంస్థనయినా పరామర్శించండి – ఇది నిజమని తెలుస్తుంది. దీనికి కారణం, అగ్రకులాలు చేసిన రచ్చకు లొంగి కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాన్ని రూపొందించిన తీరు, దానికి సుప్రీంకోర్టు ఇచ్చిన వ్యాఖ్యానం.

కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఐఐటి, ఐఐఎం వంటి సంస్థలలో వెనుకబడిన వర్గాల విద్యార్థుల ప్రవేశం చాలా స్వల్పంగా ఉందని ప్రభుత్వం గుర్తించి, వారికి రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వాల యాజమాన్యంలో ఉన్న అదే స్థాయి విద్యాసంస్థలలో అనేక రాష్ట్రాలలో ఇప్పటికే రిజర్వేషన్లు అమలవుతున్నాయి. దాని సత్ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి కూడ. రాష్ట్ర విశ్వవిద్యాలయాలిప్పుడు పూర్తి అగ్రహారాలుగా లేవు. తొలుత విద్యార్థులలోనూ, తరువాత అధ్యాపకులలోనూ సామాజికంగా వెనుక ఉంచబడ్డ కులాల వారు చెప్పుకోదగ్గ సంఖ్యలో ప్రవేశించగలిగారు. కేంద్ర ప్రభుత్వం యాజమాన్యంలో ఉన్న విద్యా సంస్థలలోనూ అటువంటి రిజర్వేషన్లు ఎప్పుడో కల్పించవలసింది. ఆలస్యంగానయినా ఆలోచన చేసిన కేంద్ర ప్రభుత్వం మొదట దానిని

అనవసరంగా సంక్లిష్టం చేసుకునింది. ఏ చట్టమూ జారీ చేయకుండానే రిజర్వేషన్లు ఇచ్చి ఉండవచ్చును గానీ, ప్రైవేట్ యాజమాన్యంలో ఉన్న విద్యా సంస్థలలో రిజర్వేషన్లు కల్పించమని యాజమాన్యాలను ఆదేశించే అధికారం ప్రభుత్వానికి లేదంటూ సుప్రీంకోర్టు 2002లో అనాలోచితంగా వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని రాజ్యాంగ సవరణ ద్వారా అధిగమించవలసిన అవసరాన్ని దీనితో కలిపింది. దానివలన అనవసరమైన లిటిగేషన్ కొని తెచ్చుకుంది.

అందుకోసం రాజ్యాంగాన్ని సవరించి ప్రభుత్వరంగంలోనయినా ప్రైవేట్ రంగంలోనయినా విద్యాసంస్థలలో సామాజికంగా విద్యాపరంగా వెనుకబడిన విద్యార్థులకు (ఒబిసిలకు) రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం చేసే అధికారం ప్రభుత్వానికి ఉంది అంటూ అధికరణం 15లో క్లాజ్ 5 చేర్చారు. ఆ అధికారాన్ని వినియోగించుకొని, కేంద్రీయ విద్యాసంస్థల అడ్మిషన్లలో వెనుకబడిన వర్గాలకు 27 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ఆదేశిస్తూ చట్టం చేశారు. ఈ చట్టంలో ఉద్దేశించినవన్నీ ప్రత్యక్షంగానో పరోక్షంగానో కేంద్ర ప్రభుత్వం అజమాయిషీలో ఉన్న సంస్థలే కాబట్టి వీటిలో రిజర్వేషన్లు ఇవ్వడానికి చట్టం చేయనవసరం ఉండలేదు, చేసినా దానికి అధికరణం 15 ను సవరించవలసిన అవసరమూ ఉండలేదు. ఏ ప్రతిభావంతుడి సలహా మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ పని చేసిందో తెలీదు. దీనివల్ల, అధికరణం 15కు చేర్చిన 5వ క్లాజుతో బాటు ఈ రిజర్వేషన్‌ను కూడ సవాలు చేసే అవకాశం అగ్రకులాలకు దక్కింది.

వాళ్లు నిజానికి చట్టం చేయకముందే అల్లరి మొదలు పెట్టారు. ఉన్నతస్థాయి విద్యాసంస్థలలో 'ప్రతిభ'కు తప్ప దేనికీ చోటు ఉండకూడదని ఒక వైపు వాదిస్తూ, ఒకవేళ రిజర్వేషన్లు ఇచ్చేటట్టయితే ఎంత శాతం ఇస్తారో అంత శాతం మొత్తం సీట్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ రెండు వాదనలకూ పొంతన లేదనేది స్పష్టమే. ఒకవేళ రిజర్వేషన్లు ఇవ్వడం వల్ల ప్రతిభ దెబ్బతినేటట్టయితే, సీట్లు పెంచితే దెబ్బతినకుండా ఉండదు కదా. వారి అసలు ఆందోళన తమ కోటాగా భావించే 'ఒ.సి' కోటా తగ్గకూడదనేది తప్ప వేరే ఏమీ కాదు. అంతేకాక, రాష్ట్ర ప్రభుత్వాల యాజమాన్యంలో ఉన్న అదే స్థాయి విద్యాసంస్థలలో దక్షిణ భారత రాష్ట్రాలలో, మహారాష్ట్రలో చాలాకాలంగా ఒబిసిలకు అమలవుతున్న రిజర్వేషన్ల వల్ల ఏం నష్టం జరిగిందో వివరించే ప్రయత్నం వారు గానీ, వారికి తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం గానీ చేయలేదు.

తలొగ్గడం మాత్రం జరిగింది. ఎంత మేరకు వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వడం జరుగుతుందో అంతమేరకు మొత్తం సీట్లు పెంచాలని చట్టంలోనే కేంద్ర ప్రభుత్వం రాసేసింది. ఇది చిన్న విషయం కాదని ప్రభుత్వానికి తెలుసు. సీట్లు పెంచితే దానితో పాటు అధ్యాపకుల సంఖ్య పెంచవలసి ఉంటుంది, వైజ్ఞానిక సంస్థలలోనయితే పరిశోధనా పరికరాలు అదనంగా కొనవలసి ఉంటుంది, క్లాస్ రూంలు చాలకపోతే కొత్తవి కట్టవలసి ఉంటుంది. చివరికి పెంచిన సీట్ల సంఖ్యతో ఈ చట్టాన్ని అన్ని కేంద్రీయ విద్యా సంస్థలలో అమలు చేయడానికి 17 వేల కోట్ల రూపాయలు ఖర్చవుతాయని ప్రభుత్వమే అంచనా వేసింది. బలవంతుల బ్లాక్‌మెయిల్‌కు లొంగిన ఫలితం ఈ ఆర్థిక భారం.

విజయవంతంగా 'ఓ.సి' కోటా కాపాడుకున్నాము కదా అని అగ్రకులశక్తులు ఊరుకున్నారా అంటే లేదు. రాజ్యాంగ సవరణనూ దాని ఫలితంగా జారీ అయిన చట్టాన్ని కూడ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. తమను తాము ప్రతిభావంతులమని పిలుచుకునే వారిలోని సంకుచితత్వం ఎంతటిదో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. (కోర్టులో వారు చేసిన వాదనలలో ఒకటి: 'పేద విద్యార్థులకు ప్రాథమిక విద్య అందించడానికి డబ్బులు లేవని చెప్పే ప్రభుత్వం, ఉన్నత విద్యా సంస్థలలో ఒబిసిలకు రిజర్వేషన్ ఇవ్వడానికి 17 వేల కోట్లు ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉండడం ఎంత అన్యాయం!) 1992 లో 9 మంది జడ్జిల బెంచి మండల్ కమిషన్ కేసులో వెనుకబడిన వర్గాల రిజర్వేషన్ రాజ్యాంగ బద్ధమేనని తీర్పు ఇస్తూ దానికి వ్యతిరేకంగా వచ్చిన అన్ని వాదనలకూ జవాబు చెప్పింది కాబట్టి సరిపోయిందిగానీ, లేకపోతే ఏమయ్యేదో చెప్పలేము. మొదట వారి సవాలు ఇద్దరు జడ్జిల బెంచి ముందుకు రాగా వారు కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తూ ఆ కేసును అయిదుగురు జడ్జిల బెంచికి నివేదించారు. ఆ బెంచిలో ముగ్గురు మళ్లీ అదే వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ కూడ మండల్ కమిషన్ తీర్పుకు తల ఒగ్గక తప్పదు కాబట్టి (ముగ్గురిలో ఒక జడ్జి ఈ మాట అననే అన్నాడు) చివరికి రాజ్యాంగ సవరణనూ చట్టాన్నీ కూడ ఆమోదించారు. అయితే ఉద్యోగ రిజర్వేషన్ల విషయంలో మండల్ కమిషన్ జారీ చేసిన ఆదేశాన్ని అనుసరించి విద్యా రిజర్వేషన్లలో కూడ వెనుకబడిన వర్గాలలో 'క్రీమీలేయర్'ను తప్పక రిజర్వేషన్ పరిధి నుండి తొలగించాలని ఆదేశించారు. ఉద్యోగాల విషయంలో 'క్రీమీలేయర్'ను తొలగించాలన్న నియమం ఎంత సబబన్న విషయం ఎట్లాగున్నా, ఉన్నత విద్య దాకా ఎంతో కొంత స్థోమత ఉన్నవారే రాగలరు కాబట్టి క్రీమీలేయర్ తొలగింపు నియమం వల్ల అసలెవరూ రిజర్వేషన్‌ను అందుకోలేని

పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. అదే జరిగింది. కనీసం ప్రవేశ అర్హత కోసం ఆయా విద్యా సంస్థలు నిర్వహించే పరీక్షలో పొందవలసిన మార్కులను తగినంత సడలించినా ఇంకొంత మంది అందుకునే వారేమో. కానీ దానికీ సుప్రీంకోర్టు అడ్డుపడింది.

మొదట కేంద్ర ప్రభుత్వం, ప్రవేశ పరీక్షలో పొందవలసిన కనీస మార్కులను వెనుకబడిన వర్గాల విషయంలో ఎంతమేరకు సడలించిందీ ఆయా విద్యాసంస్థలే నిర్ణయించాలని ఒక ఆదేశం జారీ చేసింది. 'విద్యా ప్రమాణాలను కాపాడుకుంటూ తగినంత మంది వెనుకబడిన వర్గాల విద్యార్థులు ప్రవేశం పొందే అవకాశం ఉండేటట్టు' నిర్ణయం చేయమని అనింది. అయితే ఎంతమేరకు సడలించవచ్చు, నిండకుండ మిగిలిపోయిన వెనుకబడిన వర్గాల కోటాను ఏం చేయాలి అన్న ప్రశ్నలతో ఒక రిటైర్డ్ ఐఐటి ప్రొఫెసర్ మళ్లీ సుప్రీంకోర్టుకు పోయాడు. 'ఇది న్యాయస్థానాలు చేయవలసిన నిర్ణయం కాదు, ప్రభుత్వాన్ని అడగండి' అని కోర్టు అనవలసింది. అయితే రిజర్వేషన్ల విషయంలో విధాన నిర్ణయాలు తామే చేయాలన్న ఉబలాటం న్యాయస్థానాలలో చాలా పెరిగింది. అది తమ పరిధిలోని విషయం కాదన్న తటపటాయింపు వారిని ఆపడం లేదు. అందువల్ల సుప్రీంకోర్టు ప్రవేశ అర్హతకు పొందవలసిన మార్కులను నూటికి 10 కంటే తగ్గించడానికి వీలులేదనీ, నిండకుండ మిగిలిపోయిన సీట్లు ఓ.సి కోటాలో నింపాలనీ ఆదేశించింది. నిజానికి ఈ ప్రవేశ పరీక్షలు ఆయా విద్యా సంస్థలు అప్లై చేసుకున్న విద్యార్థులను జల్లెడ పట్టడానికి రూపొందించుకున్నవే. వారందరికి ఆ కోర్సులో చేరడానికి అవసరమైన ప్రాథమిక అర్హత ఎలాగూ ఉంటుంది. ఉంటేనే అప్లై చేయగలుగుతారు. కాబట్టి ప్రవేశ అర్హత కోసం ఆ ప్రవేశ పరీక్షలో పొందవలసిన మార్కులను రిజర్వేషన్ లక్ష్యాన్ని సాధించడం కోసం కొంచెం ఎక్కువగానే తగ్గించినా తప్పేమీ లేదు. కాని సుప్రీంకోర్టు ఇదేదీ లెక్కలోకి తీసుకోకుండ తన పరిధిలో లేని ఆదేశం జారీ చేసింది.

అందుకే ఈ సంవత్సరం అన్ని కేంద్రీయ ఉన్నత విద్యా సంస్థలలోనూ సగానికి సగం మిగిలిపోయిన వెనుకబడిన వర్గాల కోటా ఓ.సి కోటాలో కలిసి అగ్రకులాలవారు ఎప్పటికంటే ఎక్కువ మోతాదులో సీట్లు పొందగలిగారు. ఓడిపోయి గెలిచే ప్రతిభ అందరికీ ఉండదు మరి !

*మొదటి ముద్రణ : ఆంధ్రజ్యోతి దినపత్రిక, 26 ఆగస్టు 2009*

*రెండవ ముద్రణ : 'రిజర్వేషన్లు : ప్రజాస్వామిక దృక్పథం', 2013*

*(పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ)*

# సిపిసి సవరణలు అన్యాయమైనవే కానీ వకీళ్ళ నిర్వాకం సంగతేమిటి?

సమాజంలో అనేక సానుభూతి లేని ఉద్యమాలకొక ఉదాహరణగా సిపిసి సవరణలకు వ్యతిరేకంగా లాయర్లు నడుపుతున్న ఆందోళనను చెప్పుకోవచ్చునేమో.

అందులో సానుభూతి చూపించడానికి ఏమీ లేదని కాదు. కానీ చట్టాన్నీ న్యాయస్థానాలనూ న్యాయ నిర్ణయానికి కాక తమ సంపాదనకు సాధనంగా భావించే లాయర్లు, సిపిసి చట్టం సవరణ వల్ల నష్టముందంటే అది వారి సంపాదనకు నష్టమే లెమ్మనుకొని ప్రజాసామాన్యం సానుభూతి చూపించకపోవడం సహజం.

అది సహజమైనా - సహజం కావడం మరీ నష్టకరం అయినప్పటికీ - ఎందుకు సహజమో అర్థం చేసుకోవడానికి సిద్ధపడని లాయర్లు తమ ఉద్యమానికి సానుభూతి ఎందుకు లేదో అర్థం చేసుకోలేరు.

లాయర్లలో చాలామంది రెండు పూటలా తినడానికి కావలసిన సంపాదన సహితం లేని వారేనంటే అందులో పెద్దగా అతిశయోక్తి లేదు. వారు చట్టానికి గానీ న్యాయవ్యవస్థకు గానీ చేయగల ద్రోహమేమీ లేదు. కానీ చట్టాన్నీ న్యాయవ్యవస్థనూ వాడుకొని లక్షలార్జించిన వారు చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉన్నారు. ప్రజల దృష్టిలో లాయర్లంటే వాళ్లే.

న్యాయవ్యవస్థను నాశనం చేసిందెవరంటే లాయర్లని చెప్పుకోవాలి, జడ్జిలను చెప్పుకోవాలి, తమ వ్యక్తిగత ప్రయోజనాల

కోసం న్యాయవ్యవస్థను అదే పనిగా వాడుకునే వృత్తి లిటిగెంట్లను చెప్పుకోవాలి. అదే వరుసలో చెప్పుకోవాలి. జడ్జీలలోనూ వృత్తి పట్ల నిర్లక్ష్య వైఖరి ఉంది. న్యాయశాస్త్రాన్ని గురించి అజ్ఞానం ఉంది. ప్రజల జీవితం పట్ల అవగాహనా రాహిత్యం ఉంది. సానుభూతి రాహిత్యముంది. బద్ధకం ఉంది. అవినీతి సహితం ఉంది. అయినప్పటికీ జడ్జిని న్యాయమూర్తి అని మరీ ఎక్కువగా సిగ్గుపడకుండ పిలవగలుగుతున్నాం. లాయర్‌ను న్యాయవాది అని పిలవడం మాత్రం కష్టమే. ఎవడు ఫీజిస్తే వాడికి వకాల్తా పుచ్చుకొని చట్టం కల్పించే అన్ని అవకాశాలూ వక్రీకరించి వాడుకొని అబద్ధాలూ అభూతకల్పనలూ చెప్పి వాడి ప్రయోజనాలు కాపాడి తమ బ్యాంకుల ఖాతా పెంచుకునే 'అడ్వకేట్' నామధేయమే తెలుగులో కూడ స్థిరపడిపోయింది.

సహజ న్యాయసూత్రాల దృష్ట్యా న్యాయ నిర్ణయంలో ఇరు పక్షాలకూ తగిన అవకాశాలు ఇవ్వడం కోసం రూపొందించబడ్డ సివిల్ ప్రొసీజర్ ఈ 'అడ్వకసీ'కి బలి అయింది. సామాజిక జీవితం దీని వల్ల చాలా నష్టపోయిందిగానీ అడ్వకేట్లు చాలా బాగుపడ్డారు. సివిల్ దావా ముగింపుకొచ్చేసరికి గెలిచిన వాడూ ఓడినవాడూ ఇద్దరూ నెత్తిన గుడ్డ వేసుకొని ఇంటికి పోతారనీ, ఇద్దరి అడ్వకేట్‌లు మాత్రమే బాగుపడతారనీ అనడం కేవలం జోక్ కాదు.

అందుకే ఇప్పుడు ప్రభుత్వం చాలా తెలివిగా అడ్వకేట్ల బారి నుండి న్యాయవ్యవస్థను కాపాడతానని ముందుకొచ్చి సిపిసికి సవరణలు ప్రతిపాదించి ప్రజామోదం సులభంగా పొందగలిగింది. క్రిమినల్ చట్టాన్ని సవరించే ముందు దొంగలను సంప్రదించడం ఎంత అనవసరమో, సివిల్ చట్టాన్ని సవరించే ముందు అడ్వకేట్లను సంప్రదించడం అంతే అనవసరమన్న పద్ధతిలో ప్రభుత్వం వ్యవహరించడం సమాజంలో ఎవరికీ కోపం తెప్పించకపోవడం ఆ వృత్తి మీద మంచి కామెంట్‌గా భావించాలి.

అయితే దీనిని ఆసరా చేసుకొని ప్రభుత్వం పేద ప్రజలకు హానికరమైన సవరణలు చేసేసి తప్పించుకోజూడడం నష్టకరం. సివిల్ ప్రొసీజర్ కోడ్ అనేది ఆస్తి తగాదాలకు సంబంధించిన చట్టం కాబట్టి పేదలకు దానితో ఏం ప్రమేయం అనుకోవచ్చు. ఆస్తిపరులలో చిన్న ఆస్తిపరులు కూడ ఉంటారు. కాబట్టి ఇది పేదలకు అసలే సంబంధం లేని విషయం కాదు. అంతేకాక, ప్రజలు అర్థం చేసుకోవలసిన దేమిటంటే సిపిసి ఒక్క క్రిమినల్ కోర్టులలో తప్ప అన్ని కోర్టులలోనూ అనుసరించే

విచారణా పద్ధతి. లేబర్ కోర్టులలోనూ, సహకార సంఘాల వ్యవహారాలకు వర్తించే కోఆపరేటివ్ చట్టానికి సంబంధించిన విచారణలలోనూ, ఆదివాసుల భూమి బదలాయింపు ఫిర్యాదులు విచారించే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోర్టులలోనూ అన్ని చోట్లా సిపిసియే వర్తిస్తుంది.

కేసులో ప్రతివాది అయిన వ్యక్తి, కేసు వేసిన నెల రోజుల లోపల తనకున్న అన్ని ఆధారాలు చూపిస్తూ తన సమాధానం దాఖలు చేయాలంటున్నారు. ఆధారాలు అనేవి ఎక్కువగా డాక్యుమెంట్ల రూపంలో ఉంటాయి. వాటిని సంబంధిత అధికారుల నుండి ఒక నెల రోజుల లోపల రాబట్టుకోవడం లంచాలు మేపగల వాళ్లకు సాధ్యమవుతుంది గానీ పేదలకు కాదు. ఒక పేద రైతు ఊరి వి.ఎ.ఓ నుండి తనకు ఎంత భూమి ఉందన్న వివరాలు చెప్పే సర్టిఫికెట్ సహితం నెల రోజుల లోపల తెచ్చుకోవడం కష్ట సాధ్యం.

ఒకసారి వేసిన పిటిషన్ లేక సమాధానాన్ని మళ్ళీ సవరించడానికి వీలు లేదన్నది మరొక ప్రతిపాదిత నియమం. అంటే అన్ని విషయాలూ మొదటిసారే చెప్పేయాలి. అన్ని డాక్యుమెంట్లూ మొదటే వేసేయాలి. అర్జెంట్‌గా కేసు వేయవలసి ఉన్నప్పుడు, లేదా అర్జెంటుగా సమాధానం దాఖలు చేయవలసి ఉన్నప్పుడు అన్ని విషయాలూ గ్రహించి చెప్పేయలేకపోవచ్చు. అన్ని డాక్యుమెంట్లూ సేకరించి వేయలేకపోవచ్చు. సవరణలు, మార్పులు చేర్పులు చేసే అవకాశాన్ని లాయర్లు చాలా దుర్వినియోగం చేసిన మాట వాస్తవమేగానీ దానికిది పరిష్కారం కాదు. పారిశ్రామిక వివాదాల చట్టం కింద లేబర్ కోర్టులో కేసు నడిపే కార్మికులు, ఏజెన్సీ చట్టాల కింద భూమి వివాదం లేవదీసే ఆదివాసులు తొలినాడే అన్ని విషయాలూ చెప్పేయాలి తప్ప సవరణలు అనుమతించబడవంటే చాలా నష్టపోతారు. అన్ని డాక్యుమెంట్లూ వెంటనే సంపాదించడం డబ్బున్న వాళ్లకు సాధ్యం కావచ్చుగానీ పేదలకు చాలా కష్టం.

కోర్టులో మేజిస్ట్రేటు సాక్ష్యాలు నమోదు చేసే బదులు అడ్వకేట్ కమిషనర్లను నియమించి వారిచేత రికార్డు చేయించాలనే ప్రతిపాదన బహుశా అన్నింటికంటే అభ్యంతరకరమైనది. ఏ కేసులోనయినా ఈ వాంగ్మూలాలే ప్రాణం వంటివి. వాటి నమోదు సక్రమంగా జరగకపోతే ఎంత గట్టి కేసున్నా ప్రయోజనం ఉండదు. ఈ కమిషనర్‌ల పద్ధతి వాంగ్మూలాల నమోదులో అక్రమాలకు, అవినీతికి అవకాశం పెంచుతుంది. మేజిస్ట్రేట్‌లలో అవినీతి లేకపోలేదు గానీ ఇక్కడ లోపాయికారీగా

మూడవ కంటికి కనిపించకుండా తప్పులు చేయడం మరింత సులభం అవుతుంది. అడ్వకేట్లు గుంపుకట్టి ఒకరి కేసులో మరొకరు కమిషనర్లుగా వ్యవహరిస్తూ న్యాయాన్ని భ్రష్టు పట్టించగలరు.

మరొకరి హక్కుల వినియోగంపైన 'స్టే' కోరినట్టయితే తగు మాత్రం ధరావతు కట్టాలనే నియమం ప్రత్యక్షంగా పేదలకు చాలా నష్టకరం. ఫ్యాక్టరీ కాలుష్యం వల్ల తన పొలాలు నాశనం అవుతున్నాయని కోర్టుకు పోయే రైతులకు, కేసు విచారణ అయిపోయే దాకా ఫ్యాక్టరీని నడపొద్దని 'స్టే' అడగడం తప్ప వేరే గత్యంతరం లేకపోవచ్చు. దానికి సెక్యూరిటీ చెల్లించాలని నియమం పెడితే కాలుష్యానికి వ్యతిరేకంగా ఎంతమంది రైతులు కోర్టుకు పోతారు?

ఇప్పుడు సిపిసి సవరణల ద్వారా తీసేయాలని చూస్తున్న అవకాశాలన్నీ వకీళ్ల చేతిలో విపరీతంగా దుర్వినియోగానికి గురయినవే. కానీ వాటిని మొత్తంగా తొలగించడం విచారణా పద్ధతిని అన్యాయంగా మారుస్తుంది. ధనవంతులు, బలవంతులు మాత్రమే కోర్టులో నిలబడగలుగుతారు. హైకోర్టులో సహితం సింగిల్ జడ్జి తీర్పుపైన డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం తీసేస్తారంట. డబ్బున్న వాడు సుప్రీంకోర్టుకు పోతాడు. లేనివాడు తన హక్కులు వదులుకొని ఇంటికి పోవలసిందే.

అయితే ఈ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న అడ్వకేట్లు, పరిస్థితి ఇక్కడి దాకా రావడానికి తమ బాధ్యత చాలా ఉందని గుర్తించాలి. వారు న్యాయవాద వృత్తిని ఏ కొంచెం బాధ్యతగా నిర్వర్తించి ఉన్నా పరిస్థితి ఇక్కడి దాకా వచ్చేది కాదు. ఇప్పుడు ఈ సవరణలకు వ్యతిరేకంగా ఆందోళన చేయడంతో బాటు ఆత్మపరిశీలన కూడ చేసుకుని ఇకపై చట్టాన్ని సంకుచిత ప్రయోజనాల కోసం వక్రీకరించకుండా తమ వృత్తిని నిర్వహిస్తామనే సంకల్పాన్ని ప్రకటిస్తారా?

*ప్రజాతంత్ర వారపత్రిక*

*5 మార్చి 2000*

# న్యాయవాదులకు వేరే న్యాయమా?

సంగీత అనే న్యాయవాది ఈ మధ్య ఆత్మహత్య చేసుకొని చనిపోయింది. ఆత్మహత్య చేసుకునే ముందు ఉత్తరాలు రాసిపెట్టి పోవడమే కాదు, తాను ఎవరిచేత ఏ రకమైన లైంగిక వేధింపులకు గురవుతున్నదీ అప్పటికి ఆరు నెలలుగా చాలామందికి చెప్పుకుంటూనే ఉంది. హైకోర్టులోని మహిళా న్యాయవాదులు ఈ విషయమై సమావేశాలు నిర్వహించి ఏం చేయాలని చర్చించుకున్నారు కూడ.

తన సీనియర్ అయిన విజయకుమార్ అనే న్యాయవాది, అతని మిత్రగణం తనను వేధిస్తున్నారనేది ఆమె అభియోగం. ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నవారు పోతూ పోతూ కక్ష కొద్దీ తమ కిష్టం లేని వాళ్లందరినీ ఇరికించే నిందలు వేసి చనిపోతారన్న అభిప్రాయం – దీనిని అభిప్రాయం అనే కంటే అనుమానం అనడం సబబు – ప్రచారంలో ఉంది కాబట్టి సంగీత ఈ ఫిర్యాదు ఆరునెలలుగా చేస్తున్నదని మరొక్కసారి చెప్పాలి. ఒక్కరితో కాదు, చాలా మందితో చేసిందని కూడ చెప్పాలి.

ఈ మాత్రం ఆధారం వేరే ఎవరి విషయంలోనయినా దొరికి ఉంటే అతన్ని ఈ పాటికి పత్రికలకెక్కించి భ్రష్టు పట్టించి ఉందురు. ఏ సంఘాలవారో చేద్దురు, లేకపోతే విలేఖరులే చేద్దురు.

కానీ విజయకుమార్ 'న్యాయవాది' (ఆ మాట అనడానికి సిగ్గనిపించినప్పటికీ). జడ్జి కూడ కాబోతున్నాడంట. (ఇప్పుడింక కాలేదేమో గానీ సంగీత కొంచెం ఆలస్యం చేసి ఉంటే ఈ పాటికి అయిపోయి ఉండేవాడేమో. అప్పుడింక ఈ మాత్రం కూడ ఎవ్వరూ మాట్లాడకపోదురు.) 'భార్యను కడతేర్చిన తాగుబోతు' అనే శీర్షికతో

వార్తలు చూస్తుంటాము. మృతురాలి ఫోటో దయనీయంగా అచ్చువేసి ఇన్‌సెట్‌లో తాగుబోతు మొగుడి ఫోటో వేస్తారు. అతని నేరప్రవృత్తి గురించి ఎటువంటి మొహమాటం లేకుండా రాసేస్తారు. 'మృతురాలు చనిపోకముందు చెప్పినదానిలో అతిశయోక్తి ఉందేమో! నేరం రుజువు కాకముందే ఎందుకు రాయాలి?' అన్న సందేహం ఎవరికీ రాదు. తప్పకుండా రావలసిందేనని అనలేము కూడ. అది సంఘటనను బట్టి ఉంటుంది. కానీ నోరున్న వృత్తి అయిన వకీళ్లజాతికి చెందిన విజయకుమార్ గురించి రాయడానికి, రాయించడానికి పత్రికలకు గానీ, ఉద్యమ సంఘాలకు గానీ మనసొప్పినట్టు లేదు.

కాగా, కేవలం ఆమె రాసిపెట్టిన ఉత్తరాన్ని ఆధారం చేసుకొని అతనిపైన కేసు పెట్టడం అన్యాయమంటూ అతని స్వంత జిల్లాకు చెందిన సీనియర్ క్రిమినల్ న్యాయవాది హైకోర్టులో కేసు వేసినట్టు వినికిడి. అతని జిల్లాకు, అతని కులానికి చెందిన మరొక సీనియర్ పోలీస్ అధికారి అతన్ని అరెస్టు కాకుండా కాపాడుతున్నట్టు కూడ వినికిడి. సీనియర్ పోలీస్ అధికారి కొన్ని రోజులు కాపాడితే, సీనియర్ న్యాయవాది ఈ లోపల ఎఫ్.ఐ.ఆర్ మీద 'స్టే' తీసుకుంటే విజయకుమార్ ఊచలు లెక్కపెట్టే దుర్గతిని తప్పించుకొని హుందాగా బయట తిరుగుతాడు. అతని హోదాకేం తక్కువ కాదని ముందే చెప్పొచ్చు. లైంగికంగా ఒక స్త్రీని చచ్చేదాకా వేధించే సత్తాగల మగతనాన్ని ఈ సమాజం గౌరవించకపోదు.

స్త్రీలు ఇంటినుండి బయటికొచ్చి పనిచేసే ఏ స్థలంలోనైనా లైంగిక వేధింపులు ఉంటాయి. అవి ఉండడం అనాగరికం కాదు గానీ చెప్పుకోవడం అనాగరికమనుకునే చోట బయటికి పొక్కక పోవచ్చును గాక. అయితే మహిళా న్యాయవాదులకు ప్రత్యేకమైన సమస్య ఉంది. మహిళా డాక్టర్లకు పేషెంట్లు దొరుకుతారు గానీ మహిళా న్యాయవాదులకు క్లయింట్లు దొరకడం చాలా కష్టం. లిటిగెంట్ల ప్రపంచం మగప్రపంచం. కాబట్టి లాయర్ వృత్తి చేపట్టిన స్త్రీ స్వతంత్రంగా ప్రాక్టీస్ పెట్టడం చాలా చాలా కష్టం. మగవాళ్లకైనా కొంతకాలం ఒకరికి 'జూనియర్'గా ఉండకతప్పదు గానీ స్త్రీలైతే చాలా ఏళ్ళు జూనియర్‌గానే ఉండిపోతారు. అందరి అనుభవాలూ చేదుగానే ఉంటాయని చెప్పలేము గానీ చేదు అనుభవం ఎదురయితే వృత్తిని వదులుకోవాలా లేక ఆత్మగౌరవాన్ని వదులుకోవాలా అన్న ప్రశ్నను ఎదుర్కోవలసి ఉంటుంది. 'సీనియర్'ను కాదని నా ప్రాక్టీస్ నేను పెట్టుకుంటానని ఒక మగ న్యాయవాది అన్నట్టు స్త్రీ అనలేదు. సంగీత గత ఆరునెలలలో ఎవరితో తన గోడు చెప్పుకున్నా వృత్తిని వదులుకోవడం అనే ప్రత్యామ్నాయం చర్చకు వస్తూనే ఉంది.

న్యాయస్థానంలో లేని సంస్కారమేదో ఉన్నట్టు నటించడం మానేసి ఆస్పత్రులలో డాక్టర్లు నర్సులను వేధించినట్టు కోర్టులలోనూ లైంగిక వేధింపులు ఉన్నాయని గుర్తించి నివారించడానికి నిజాయితీగా కృషి చేయడం ఉత్తమం.

పని స్థలాలలో లైంగిక వేధింపులకు గురయ్యే స్త్రీలు ఫిర్యాదు చేసుకొని న్యాయం పొందడానికి ఒక సంస్థాగత వ్యవస్థను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు 'విశాఖ వర్సస్ స్టేట్' అనే కేసులో దాదాపు మూడేళ్ళక్రితం తీర్పు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం అన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థలలోనూ అటువంటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని సర్క్యులర్ జారీ చేసింది. కొన్ని చోట్ల ఏర్పడ్డాయి. మన రాష్ట్ర ప్రభుత్వం కూడ కొంతకాలం కింద అటువంటి సర్క్యులర్ జారీచేసింది.

రాష్ట్రంలోని అన్ని న్యాయస్థానాలపైన పాలనా సంబంధమైన అజమాయిషీ హైకోర్టుదే కాబట్టి హైకోర్టు అన్ని న్యాయస్థానాలలోనూ అటువంటి ఫిర్యాదుల వ్యవస్థ ఏర్పాటు చేయమని ఆదేశం జారీచేయాలి. ముందు హైకోర్టులో ఏర్పాటు చేయాలి. సంగీత వంటి స్త్రీలు ఇక్కడా అక్కడా పోయి తమ గోడు చెప్పుకోవలసిన అవసరం లేకుండా కోర్టులోనే (సగం కంటె ఎక్కువమంది స్త్రీలు సభ్యులుగా గల) ఫిర్యాదుల వ్యవస్థ ఉంటే, ఆ వ్యవస్థ ఫిర్యాది వాంగ్మూలాన్ని ఆధారం చేసుకొని నిందితుడిని అప్పటికప్పుడు పిలిచి నిలదీయగలిగితే, ఆ వ్యవస్థకు వారు ఫిర్యాదు చేసుకోగలుగుతారు. అప్పుడు లైంగిక వేధింపులు కొంతమేరకైనా అదుపులో ఉంటాయేమో.

వకీళ్ళు దీనిని సాగనిస్తారా అన్న సందేహం రాక మానదు. న్యాయం కోసం ఏర్పడిన ప్రతీ ఒక్క వ్యవస్థనూ శాయశక్తులా అడ్డుకునేది 'న్యాయవాదు'లే. లాయర్ ఆఫీసు ఒక పనిస్థలం కాదనీ, లాయర్ల గుమాస్తాలు, జానియర్లు కార్మిక చట్టాల వల్ల ప్రయోజనం పొందలేరనీ లాయర్లు ఇంతకుముందు కేసులు వేశారు. జడ్జిలు అవునవునంటూ తీర్పులిచ్చారు. కాబట్టి 'పనిస్థలం' కాని లాయర్ ఆఫీసులో జరిగే లైంగిక వేధింపులకు 'పనిస్థలం'లో జరిగే వేధింపుల గురించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వర్తించదని వాళ్ళు అడ్డుకోరన్న గ్యారంటీ ఏమీ లేదు! కోర్టులు అవుననవన్న గ్యారంటీ కూడ లేదు. అయినప్పటికీ నివారణ చర్యలు ఎక్కడో ఒక చోట మొదలుపెట్టాలి కాబట్టి ఇక్కడ మొదలుపెట్టి, కనీసం ఆ వ్యవస్థనయినా అడ్డుకోకుండా ఉండే సంస్కారాన్ని వకీళ్ల జాతి ప్రదర్శిస్తుందేమో చూడాలి.

*ప్రజాతంత్ర వారపత్రిక*

*1 జూలై 2000*

# న్యాయమూర్తులలో అవినీతి: బహిరంగ చర్చే ఈ పురుగుకు మందు

**జ**డ్జి అవినీతిపరుడయితే దాని వల్ల ఏ విధంగా ప్రయోజనం పొందుదామా అని చూడడం సగటు లాయరు లక్షణం. అవినీతిని దూరం ఉంచే వారు జడ్జీలలో చాలామందే ఉండవచ్చును గానీ జడ్జీలలోని అవినీతిని తన వృత్తి ప్రయోజనం కోసం వాడుకోవడంలో తప్పు లేదన్న ఆలోచనను దూరం ఉంచే లాయర్లు ఎక్కువ మంది ఉండరు.

అందువల్లనే, మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుభాషణ్ రెడ్డి అవినీతిపరుడని ఆరోపిస్తూ, అతనిని బర్తరఫ్ చేయాలని మద్రాసు హైకోర్టు లాయర్లు ఆందోళనకు దిగడం ఆశ్చర్యం కలిగించే విషయం. ఎవరికి వారు స్వంత ప్రయోజనం చూసుకునే ఆలోచన విడిచిపెట్టి ఉమ్మడిగా అతన్ని బర్తరఫ్ చేసి న్యాయవ్యవస్థను కాపాడాలని నినదించడం ఇవ్వాళ్టి సమాజంలో అసాధారణ విషయమే మరి.

అవినీతి అంటే లంచగొండితనం అని మాత్రమే అనుకుంటే పైస్థాయి న్యాయస్థానాలలో అవినీతిపరులైన న్యాయమూర్తులు ఎక్కువమంది ఉండకపోవచ్చు. ఏ వ్యవస్థలోనైనా కొంత మంది స్వతహాగా నీతిమంతులుంటారు. వారిని పక్కన పెట్టినా, ఉన్నత న్యాయస్థానాలలో న్యాయమూర్తులుగా ఉండే వారికి జీతభత్యాలు బాగుండడమే కాక రిటైరయిన తరువాత కూడ ఎన్నో కొన్ని కమిషన్లు, ఆర్బిట్రేషన్లు వగైరాలతో జీవితాంతం అదే హోదాలో

బతికే అవకాశం ఉంటుంది. డబ్బుకు కక్కుర్తి పడి దానిని చేజార్చుకోవడం సబబు కాదని భావించడానికి ఏమంత నీతిమంతులు కానవసరం లేదు. అయినప్పటికీ కొంతమంది లంచగొండ్లు ఉన్నారనేది వాస్తవం.

అయితే అవినీతి అనే మాటకు లంచం తిని తప్పుడు తీర్పు ఇవ్వడం అని మాత్రమే కాక, న్యాయ నిర్ణయానికి బాహ్యమైన ఒత్తిళ్లకూ ప్రయోజనాలకూ లోనుకావడం అనే విస్తృతమైన అర్థంలో కూడ తీసుకున్నట్టయితే అవినీతిపరులు న్యాయస్థానాల్లో అన్ని స్థాయిలలోనూ చాలామందే ఉన్నారని చెప్పక తప్పదు. కానీ దీని గురించి సమాజానికి పెద్దగా తెలియదు. తెలియకపోవడానికి కారణమేమిటంటే, తెలియజెప్పగల లాయర్లు ఈ విషయాన్ని బయట పెట్టడం కంటే దీని వల్ల ప్రయోజనం పొందడమే తెలివైన పని అని భావించడం. ఈ వైఖరి న్యాయవ్యవస్థకు చాలా నష్టం చేస్తున్నదని వేరే చెప్పనవసరం లేదు.

అందుకే జస్టిస్ సుభాషణ్ రెడ్డిని బర్తరఫ్ చేయాలంటూ మద్రాసు హైకోర్టు లాయర్లు ఆందోళన చేయడం చెప్పుకోదగ్గ విషయం. మన రాజ్యాంగంలో హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జీలను బర్తరఫ్ చేయడం సులభం కాదు. మామూలుగా ఉద్యోగం ఇచ్చేవాడికి తీసేసే అధికారం కూడ ఉంటుంది. అయితే దానికి సరయిన కారణాలు ఉండాలి. తీసేసే ముందు సహజ న్యాయసూత్రాలను పాటించి విచారణ జరపాలి అని చట్టం చెప్తుంది. ఒక్క హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జీల విషయం మాత్రమే ఇందుకు భిన్నమైనది. వాళ్లకు ఉద్యోగాలు ఇచ్చేది ప్రభుత్వమే కాని వారు ఎంతటి తప్పు చేసినా వారిని తొలగించే అధికారం ప్రభుత్వానికి లేదు. ఆ అధికారం పార్లమెంట్‌కు మాత్రమే ఉంది. వందమంది పార్లమెంట్ సభ్యులు బర్తరఫ్ ప్రతిపాదనపైన సంతకాలు చేయాలి. ఆపైన దానిని పార్లమెంట్ చర్చించి మూడింట రెండు వంతుల మెజార్టీతో ఆమోదించాలి. అప్పుడు మాత్రమే హైకోర్టు లేక సుప్రీంకోర్టు జడ్జిని ఉద్యోగం నుండి తొలగించడం జరుగుతుంది.

జస్టిస్ సుభాషణ్ రెడ్డి బర్తరఫ్ ప్రతిపాదనను మద్రాసు హైకోర్టు న్యాయవాదులు తయారు చేసారు. అదొక 262 పేజీల గ్రంథం. దానిపైన 100 మంది పార్లమెంట్ సభ్యులు సంతకాలు చేస్తే అది పార్లమెంట్ ముందుకు చర్చ కోసం వస్తుంది. మూడింట రెండువంతుల మంది దానిని ఆమోదిస్తే ఆయన గారి ఉద్యోగం పోతుంది. ప్రస్తుతానికి వామపక్ష పార్టీల ఎంపిలు దానిపై సంతకం చేయడానికి ఒప్పుకున్నారని వినికిడి.

అయితే వారు 60 చిల్లర మాత్రమే ఉన్నారు. కాబట్టి ఇంకా 40 దాకా సంతకాలు అవసరం.

జస్టిస్ సుభాషణ్ రెడ్డిపైన ఉన్న అభియోగాలను అర్థం చేసుకోవాలంటే హైకోర్టులలో అనుసరించే వ్యవహార నియమాలను తెలుసుకోవాలి. హైకోర్టులో చాలా రకాల కేసులు విచారణకొస్తుంటాయి. క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కంపెనీ కేసులు, వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన రిట్ పిటిషన్లు వగైరా. వీటిలో ఏ జడ్జి ఏ కేసులు వినాలనేది ప్రధాన న్యాయమూర్తి నిర్ణయిస్తారు. ఈ ఏర్పాటు స్థిరంగా ఉండదు. రెండు మూడు నెలలకొకసారి మారుతుంటుంది. అంటే రెండు మూడు నెలలకొకసారి ప్రధాన న్యాయమూర్తి ఏ జడ్జి ఏ కేసులు వినాలో నిర్ణయించే 'రోస్టర్' ప్రకటిస్తారు. మళ్ళీ మారేంత వరకు ఆ ప్రకారమే కేసులు విచారించడం జరుగుతుంది.

రెండు మూడు నెలలకొకసారి అంటున్నామంటేనే దీనికొక కచ్చితమైన నియమమేదీ లేదని అర్థం. ఎన్ని రోజులకొకసారి ఈ 'రోస్టర్' మారుతుందనేది ప్రధాన న్యాయమూర్తి ఇష్టం. అంతేకాదు, ఒకసారి 'రోస్టర్' ప్రకటించిన తరువాత కూడ ఏ రోజయినా ఏ కేసునయినా ఒక జడ్జి దగ్గర నుంచి తీసేసి ఇంకొక జడ్జి ముందు విచారణకు పెట్టే అధికారమూ ప్రధాన న్యాయమూర్తికి ఉంది. ఇదొక విశృంఖల అధికారమనీ, దీనికి ఏ పరిమితీ లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించి ఉంది.

చట్టమూ, న్యాయసిద్ధాంతమూ ఒకటే అయినప్పుడు ఏ కేసు ఏ న్యాయమూర్తి వింటే ఏం? అనుకునేంత అమాయకులు ఇప్పుడెవరూ లేరనుకుంటాను. చట్టమూ న్యాయసిద్ధాంతమూ ఒకటే అయినా దానిని అన్వయించే కోణాలు వంద ఉంటాయి. అందువల్ల కేసు ఏ జడ్జి ముందు వస్తుందనేది అతి ముఖ్యమైన విషయం అని ప్రతి లిటిగెంటుకూ తెలుసు.

సాధారణంగా ఒకసారి రోస్టర్ నిర్ణయించిన తరువాత, రెండు నెలలకో, మూడు నెలలకో కొత్త రోస్టర్ ప్రకటించేంత వరకు ఒక కేసును ఒక జడ్జి ముందు నుంచి తీసేసి ఇంకొక జడ్జి ముందు ఉంచడం జరగదు. ఆ పని చేసే విశృంఖల అధికారం ప్రధాన న్యాయమూర్తికి ఉందని సుప్రీంకోర్టు భాష్యం చెప్పినప్పటికీ క్రమశిక్షణ గల ప్రధాన న్యాయమూర్తులు ఎవరూ ఆ పని చేయరు.

కాని జస్టిస్ సుభాషణ్ రెడ్డి తమిళనాడు ముఖ్యమంత్రికి సన్నిహితులైన వారి కేసులను, ఇతరత్రా బలవంతులయిన వారి కేసులను వారిని ఇబ్బంది పెట్టే జడ్జీల

లిస్టు నుంచి తీసేసి వారికి అనుకూలమైన జడ్జీల లిస్టులో పెట్టించిన ఘటనలు జరిగాయనేది ఆయనపై గల అభియోగాలలో ముఖ్యమైనది. ఈ పని ఆయన రహస్యంగా కూడ చేయలేదు. అందరికీ తెలిసేటట్టే చేసాడు.

మరొక అభియోగం, ఒక న్యాయవాదికి చాలా అనుకూలంగా వ్యవహరించడం. ఈ న్యాయవాది వేరే ఎవరో కాదు. మన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేసి సుప్రీంకోర్టుకు పోయిన జస్టిస్ ఎ.ఆర్.లక్ష్మణన్ గారి సుపుత్రుడు ఎ.ఆర్.ఎల్. సుందరేశన్. ఇతను ఏ కేసు వేసినా జస్టిస్ సుభాషణ్ రెడ్డి అనుకూలంగా స్పందిస్తున్నారని చెప్పి అప్పటివరకు వేరే లాయర్లను పెట్టుకున్న లిటిగెంట్లు వకాలత్ మార్పించి సుందరేశన్‌కు వకాలత్ ఇవ్వనారంభించారు. ఇది జస్టిస్ సుభాషణ్ రెడ్డి మద్రాసు హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తి పదవి చేపట్టిన అనతి కాలంలోనే మొదలయిందంటే ఆ పక్షపాతాన్ని కూడ రహస్యంగా ఉంచలేదని అర్థం అవుతుంది. 2003 సంవత్సరం జూన్ 16 – అక్టోబర్ 20 మధ్య కాలంలో సుందరేశన్ జస్టిస్ సుభాషణ్ రెడ్డి కోర్టులో 86 అప్పీల్స్ దాఖలు చేయగా, అందులో 44 కేసులు మారిన వకాలత్ మీద వేసినవేనని మద్రాసు హైకోర్టుల రికార్డులే తెలుపుతున్నాయి.

ఇంకా కూడ అభియోగాలున్నాయి. పైన చెప్పినవి పామరులకు సహితం సులభంగా అర్థం అయ్యేవి మాత్రమే. అన్ని అభియోగాలపైనా పార్లమెంట్ – ఒకవేళ వంద మంది ఎంపిలు సంతకాలు చేసినట్టయితే – చర్చ చేపట్టవలసి ఉంది. అయితే న్యాయవ్యవస్థకు సంబంధించిన అన్ని విషయాలూ రహస్యంగా ఉండిపోవడమే ఈ చేటుకు మూలం కాబట్టి దీని గురించి ప్రజలు తెలుసుకోవడం అవసరం. చర్చించుకోవడం అవసరం.

*ప్రజాతంత్ర వారపత్రిక*

*19 సెప్టెంబర్ 2004*

# మినహాయింపుగా నిలబడ్డ మనిషి

**బి.** ఎస్.ఏ స్వామి గారిని నేను జడ్జిగానే ఎరుగుదును. అంతకుముందు బహుజన సమాజ్ పార్టీ నాయకులలో ఒకరిగా ఆయన గురించి తెలుసు. పౌరహక్కుల సంఘం తరపున ఆ హోదాలో ఆయనతో ఉత్తర ప్రత్యుత్తరాలూ నడిచాయిగానీ వ్యక్తిగత పరిచయం లేదు.

బి.ఎస్.ఏ స్వామి గారు సగటు న్యాయమూర్తుల కంటే చాలా భిన్నమైన మనిషి. జడ్జిలు మామూలుగా బిగుసుకుపోయి ఉంటారు. నవ్వుతూ మాట్లాడితే అలుసయిపోతామనుకుంటారు. అడ్వకేట్లు దాన్ని అవకాశంగా తీసుకొని ఆర్డర్లు కొట్టేస్తారనుకుంటారు. స్వామిగారు అటువంటి శంక ఎప్పుడూ ప్రదర్శించలేదు. కోర్టు వరండాలో ఎదురైన అడ్వకేటును ఆపి 'ఏమయ్యా, ఈ మధ్య కనబడడం లేదే' అంటూ ముచ్చట్లు పెట్టుకోకుండా పోనిచ్చేవారు కాదు.

తన సామాజిక అభిప్రాయాలను కూడ ఆయనెప్పుడూ దాచుకోలేదు. ఎప్పుడో ఆరు నెలలకొకసారి ఏ సభలోనో మాట్లాడినప్పుడు అభ్యుదయ ఆదర్శాలు వల్లెవేసి, బెంచి మీద కూర్చుని తీర్పులిచ్చేటప్పుడు మాత్రం యథాస్థితి వాదాన్ని పాటించే న్యాయమూర్తులు చాలామంది ఉన్నారు. నిజంగా అభ్యుదయ భావాల పట్ల కొంత ప్రేమ ఉన్నా, దానిని కోర్టులో ప్రదర్శిస్తే 'పక్షపాత వైఖరి' అంటారేమోనని భయపడేవారూ ఉన్నారు. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే యథాస్థితి భావాలు, తిరోగామి భావాలు గల న్యాయమూర్తులు మాత్రం వాటిని దాచుకునే ప్రయత్నం చేయరు. దానిని 'పక్షపాత వైఖరి'గా కూడ ఎవరూ అనుకోరు. సామాజిక

న్యాయం, అభ్యుదయం వంటి భావాలను బహిరంగంగా వ్యక్తం చేయడం మాత్రమే పక్షపాతం అనిపించుకుంటుంది. 'ఇప్పుడు వీస్తున్న ప్రపంచీకరణ గాలులను కోర్టులు విస్మరించడానికి వీలు లేదు' అని సత్యవ్రత సిన్హా అనే సుప్రీంకోర్టు జడ్జి తన తీర్పులలోనే రాస్తున్నాడు. అంతే తెగువతో సమసమాజ స్థాపన లక్ష్యాన్ని న్యాయస్థానాలు విస్మరించడానికి వీలు లేదు అని తమ తీర్పులలోనే అనగల ధైర్యం అతి కొద్దిమంది న్యాయమూర్తులకే ఉంటుంది.

స్వామిగారు తన తీర్పులలోనే కాదు, కేసు విచారణ సందర్భంగా చేసే వ్యాఖ్యలలో కూడ తన సామాజిక దృక్పథాన్ని నిస్సంకోచంగా ప్రకటించేవారు. మాబోటి లాయర్లు కోర్టులో ఉంటే కేసు సందర్భంగా రాజకీయ చర్చ పెట్టుకునేవారు. ఎరుకల, యానాది తెగలకు చెందిన బందిపోటు కేసుల్లో ముద్దాయిల కోసం హెబియస్ కార్పస్ పిటిషన్ వేస్తే 'చాలా మంచి పని చేస్తున్నావు గానీ వాళ్లను సంస్కరించే పని కూడ నువ్వు చేపట్టాలి' అంటూ హేమలతా లవణం గారి కృషిని కోర్టులోనే ప్రస్తుతించేవారు.

బడుగు బలహీన వర్గాలకు చెందిన వారికి, రాడికల్ భావాలు గల వారికి ఉన్నత పదవులలో స్థానం కల్పిస్తే ఏక సమయంలో వ్యవస్థ ప్రతిష్ఠ పెరుగుతుంది, భద్రతా పెరుగుతుంది అనే ఆలోచన పాలకులలో ఉంటుంది. ఇంగ్లీష్ నుడికారంలో దీనిని వ్యవస్థ 'కో-ఆప్ట్' చేసుకోవడం అంటారు. దురదృష్టవశాత్తు ఆ వర్గాలకు చెందిన వారు చాలామంది తమ స్వార్థ ప్రయోజనం కోసం దీనికి సహకరిస్తుంటారు. స్వామిగారు అందుకు పూర్తిగా భిన్నమైన మనిషి. తనకు జడ్జి పదవి ఇవ్వగానే న్యాయవ్యవస్థలో అగ్రకుల ఆధిపత్యం పోయిందనుకోలేదు. ఇంక పోకపోయినా ఫరవాలేదనీ అనుకోలేదు. అన్ని పాలనా వ్యవస్థలలోకీ న్యాయవ్యవస్థలోనే కులపెత్తనం ఎక్కువగా ఉందన్న అభిప్రాయాన్ని జడ్జిగా కూడ వ్యక్తం చేస్తూ వచ్చారు. తరచుగా 'రెడ్డి' పెత్తనం గురించే మాట్లాడేవారు గానీ ఇది కేవలం ఒక కులం పట్ల వ్యతిరేకత కాదు. న్యాయవ్యవస్థ ఒకప్పుడు బ్రాహ్మణుల కార్యక్షేత్రంగా ఉండింది. ఇప్పటికీ బ్రాహ్మణాధిక్యం చాలా ఉంది గానీ మన హైకోర్టు విషయానికొచ్చేసరికి రెడ్ల పెత్తనం సాపేక్షంగా ఎక్కువే. లాయర్‌గానూ జడ్జిగానూ దీనిని స్వామిగారు దగ్గరనుండి చూసారు, వ్యతిరేకత పెంచుకున్నారు.

ప్రధాన న్యాయమూర్తి కావాలనీ సుప్రీంకోర్టు జడ్జి కావాలనీ స్వామిగారు కోరుకున్నారో లేదో తెలీదుగానీ దానికోసం రాజీ మాత్రం పడలేదు. ఎవరికి కోపం

తెప్పిస్తుందో అని చూడకుండ తనకు న్యాయం అని తోచింది చేసుకుంటూ పోయారు. ప్రమోషన్ సంగతి దేవుడెరుగు, దీని కారణంగా రిటైర్‌మెంట్‌కు ముందు చివరి రోజులలో ఆయన చాలా అవమానానికి గురయ్యారు. అప్పటి ప్రధాన న్యాయమూర్తి తీసుకున్న ఒక పాలనాపరమైన నిర్ణయాన్ని స్వామిగారు ఒక తీర్పులో తప్పుపట్టారు. హైకోర్టు పాలనా రంగంలో చేసే నిర్ణయాలపైన న్యాయ సమీక్ష చేసే అధికారం హైకోర్టుకే ఉంది కాబట్టి, పాలనా పరమైన నిర్ణయాలన్నీ ప్రధాన న్యాయమూర్తి పేరు మీదే తీసుకోవడం జరుగుతుంది కాబట్టి, ఇందులో అక్రమమేమీ లేదు. అయితే దీనికి ఆయన చాలా మూల్యం చెల్లించారు. ఆయన సీనియారిటీకి తగ్గ హోదాను చివరి రోజులలో తీసేసి వెలివేసినట్టు చేసారు. దానిమీద ఇతర న్యాయమూర్తులెవ్వరూ మాట్లాడకపోగా కనీసం న్యాయవాదుల చేత సంతకాలు చేయించి రాష్ట్రపతికి నిరసన లేఖ పంపుదామని కొద్దిమంది లాయర్లు చేసిన ప్రయత్నం కూడ ఫలించలేదు.

అనవసరమైన మధ్యయుగాల మర్యాదలకు కోర్టులు నిలయం అన్న సంగతి తెలిసిందే. ఈ మర్యాదలు మనసులో నుండి రావు, పైకి ప్రదర్శించేవే. స్వామిగారు దానికి భిన్నంగా నడుచుకునేవారు. ఒక రోజు ఒక సీనియర్ న్యాయవాది కేసు వాదన మొదలు పెట్టబోతుండగా స్వామిగారు అచ్చతెలుగులో 'నిన్న సాయంత్రం మీవాడు (అంటే ఆ కేసు వేసిన వ్యక్తి) నాకు ఎవరి చేత ఫోన్ చేయించాడు మిస్టర్ రావ్?' అని అందరి ముందూ ఆ న్యాయవాదిని అడిగారు. ఏ మంత్రి చేతనో ఫోన్ చేయించి ఉంటాడని గ్రహించిన ఆ న్యాయవాది బిత్తరపోయి ఆ పూటకు ఇంక వాదించలేనని క్షమాపణ కోరి కట్టలు సర్దుకొని వెళ్లిపోయాడు. వేరే జడ్జి అయితే మధ్యాహ్న భోజన విరామంలో ఆ న్యాయవాదిని తన గదికి పిలిచి అది తప్పు అని గోప్యంగా మందలించి ఉండేవారు. (మంత్రి సిఫారసుకు తలొగ్గదలచుకుంటే వేరే సంగతి. అప్పుడు ఎవరికీ ఏమీ తెలియకుండ జరగవలసింది జరిగిపోయేది.)

ఇన్ని ప్రజాతంత్ర భావాలున్నప్పటికీ ఆ భావాలు గల చాలామంది మగవాళ్లలానే స్వామిగారికి స్త్రీల స్వతంత్రత విషయంలో కొంత అసహనం ఉండేది. మహిళా న్యాయవాదుల సంప్రదాయ విరుద్ధమైన వేషధారణపైన ఆయన కామెంట్ చేసి వారిని నొప్పించిన సంఘటనలు జరిగాయి. అయితే ఇందులో కూడ దాపరికం లేదు. అన్నీ బహిరంగంగానే అందరూ వినేటట్టే అనేవారు, చేసేవారు. ఒక పేరున్న న్యాయవాది డైవోర్స్ కేసు అప్పీలును విచారించే క్రమంలో ఆ న్యాయవాది అంటే ఉన్న మమకారం కారణంగా అతని భార్య నడవడిక పట్ల స్వామిగారు వ్యతిరేకత పెంచుకున్నారు.

ఆమె మితిమీరి ప్రవర్తించిందనీ, భర్తను జలగలాగ పీడించిందనీ బహిరంగంగానే వ్యాఖ్యానించారు. ఆమె తరపు న్యాయవాది స్వామిగారి కోపానికి భయపడి కేసు ఇంక వాదించలేనని వెనక్కి ఇచ్చేస్తే ఆమె నా దగ్గరికి వచ్చి కేసు చేయాలని కోరగా మరుసటి రోజు స్వామిగారి కోర్టుకు పోయి వకాలత్ వేస్తున్నాననీ, రెండు రోజులు గడువివ్వాలనీ కోరాను. స్వామిగారు నా మీద విరుచుకుపడ్డారు. 'నువ్వు నిన్న కోర్టులో ఉండి నేనన్న మాటలన్నీ విన్నావు. కావాలనే ఈ కేసు చేపడుతున్నావు. ఈమె నీలాంటి వారు సహాయం చేయవలసిన వ్యక్తి కాదు' అంటూ నా మీద కేకలు వేసారు. 'ఒక్కరోజు మాత్రమే గడువిస్తాను, ఏం వాదిస్తావో వాదించు' అన్నారు. చివరికి వాదన సావధానంగానే విన్నారు గానీ భర్తకే అనుకూలంగా తీర్పు ఇచ్చారు.

స్వామిగారు అసాధారణ న్యాయకోవిదులనీ, న్యాయ సిద్ధాంతాన్ని గొప్పగా పెంపొందించారనీ చెప్పలేముగానీ సామాజిక అన్యాయాల విషయంలో నిస్సంకోచంగా న్యాయ సిద్ధాంతాలను పీడితుల పక్షాన వ్యాఖ్యానించారు. ప్రభుత్వ శాఖలలో క్యాజువల్ ఉద్యోగులుగా, ఎన్ఎంఆర్లుగా ఏళ్ల తరబడి మగ్గిపోతున్నవారి ఉద్యోగాల క్రమబద్ధీకరణ గురించి పదిహేను సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం నడుపుతున్న ప్రహసనాన్ని ఆయన జడ్జీగా తీవ్రంగా తప్పుపట్టారు. 1992లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఒక తీర్పును అమలు చేయక తప్పదని భావించి రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం. 21 పేరిట ఒక క్రమబద్ధీకరణ జీవోను జారీ చేసింది. దాని అమలు, కుదింపు ఒక ప్రహసనంగా సాగాయి. సాగుతున్నాయి. దీనికి అడ్డుకట్ట వేయడానికి స్వామిగారు ఇచ్చిన తీర్పులు ఆయనకూ ప్రభుత్వానికీ మధ్య దాదాపు వ్యక్తిగత ఘర్షణ రూపం తీసుకున్నాయి.

న్యాయమూర్తిగా సామాజిక న్యాయకాంక్షతోపాటు స్వతంత్రత, ఆత్మగౌరవం ఉన్న వ్యక్తి బి.ఎస్.ఏ స్వామిగారు. పై నుండి కింది దాకా అవకాశవాదమే ఆదర్శంగా ఉన్న ఈ రోజులలో దానికి మినహాయింపుగా నిలబడ్డ మనిషి.

*ప్రజాతంత్ర వారపత్రిక*

*3 ఆగస్టు 2008*

# న్యాయమూర్తులకిన్ని సదుపాయాలు న్యాయనిర్ణయానికి శ్రేయస్కరమా ?

హైకోర్టు జడ్జీలకు ఇప్పుడున్న ఖరీదయిన కార్ల స్థానంలో 8 లక్షల ఖరీదుచేసే ఓపెల్ ఆస్ట్రా కార్లు కొనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు వార్త.

ఇప్పుడు వాళ్లేం డొక్కుకార్లలో తిరగడం లేదు. ప్రీమియర్ 118 కార్లున్నాయి. వాటి తలమీద ఎర్రలైట్లు కూడ వున్నాయి. వారి మార్గానికి ఎవ్వరూ అడ్డం రాకుండా ట్రాఫిక్ పోలీసులు ఈల వేస్తూ గొడవ చేస్తూ రోడ్డు ఎప్పటికప్పుడు ఖాళీ చేస్తుంటారు. అయినప్పటికీ అతిఖరీదయిన కొత్త కార్లు కొనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

మనుషులను భౌతికంగా సంతృప్తి పరిస్తే మానసికంగా తనకు అనుకూలంగా మారతారనేది చంద్రబాబు దృఢవిశ్వాసం. పత్రికారంగంతో సహా అన్ని వ్యవస్థల మీదా ఈ నమ్మకాన్ని విజయవంతంగా ప్రయోగిస్తున్నాడు.

అతని విలువలు అవి కాబట్టి కొత్తగా తప్పుపట్టేదేమీ లేదు. కానీ తీసుకునేవాళ్లు ఈ విషయం ఎరిగి తీసుకుంటున్నారా? 'మేము చాలా ఉన్నతులం. ఇటువంటి ప్రలోభాలకు లొంగం. అందువల్ల నిర్భయంగా తీసుకుంటాం' అని ఎవరికి వారు అనుకోవచ్చు. ఈ విశ్వాసం వల్ల ఇటు వస్తులాభమూ వుంటుంది. అటు ఆత్మగౌరవమూ బలపడుతుంది.

ఇక్కడ సమస్య ఈ విశ్వాసం ఎంత వాస్తవికం అనేది కాదు. కొందరి విషయంలో ఇది వాస్తవికమైనదే కావచ్చు. కొందరి

విషయంలో కాకపోవచ్చు. ప్రస్తుత వాతావరణంలో ఏ రంగంలోనైనా ఈ విశ్వాసం వాస్తవికం కాని వాళ్ల సంఖ్యే ఎక్కువ వుండే అవకాశం వుంది – న్యాయమూర్తులతో సహా.

కానీ ఈ దానగ్రహీతల వ్యక్తిత్వాలతో నిమిత్తం లేకుండా ఇది సూత్రప్రాయంగా తప్పు. 'న్యాయం జరిగితే చాలదు. అది జరిగిన విషయం కనిపించాలి' అనేది అందరూ ఎరిగిన ఒక న్యాయ సిద్ధాంత సూత్రం. 'న్యాయ నిర్ణయం చేసేవాళ్లు నిష్పాక్షికంగా వ్యవహరిస్తారన్న విశ్వాసం చాలా అవసరం. న్యాయనిర్ణయ ప్రక్రియ అందుకు తగినట్టు వుండాలి' అని సుప్రీంకోర్టు చాలా తీర్పులలో అనింది. న్యాయమూర్తులు అవసరమైన దాన్ని మించి ప్రభుత్వం నుండి వసతులు పొందడం ఆ విశ్వాసాన్ని పోగొట్టదా? వాళ్లకు కార్లు అవసరమే, కాని అంబాసిడర్ చాలదా? 8 లక్షలు ఖరీదు చేసే కారు కావాలా? న్యాయమూర్తులకు కనీస సదుపాయాలు గల ఇళ్లు అవసరమే. కానీ మినిస్టర్ల సరసన బంజారాహిల్స్‌లోనూ కుందన్‌బాగ్‌లోనూ పెద్దపెద్ద బంగళాలు తీసుకోవడం సబబా?

మినిస్టర్లకయినా ప్రజలతో సంబంధం వుండే అవకాశం లేని విలాసవంతమైన ప్రాంతాలలో ఆడంబరంగా కట్టిన బంగళాలు కేటాయించడం ఎంత సబబన్న ప్రశ్న వేసుకోవచ్చు. వాళ్ల సంగతి అటుంచి, అనేక రకాల సామాజిక సమస్యలపైన తీర్పులు చెప్పే న్యాయమూర్తులకు ప్రజాజీవితంతో కొంతైనా సంబంధం వుండడం అవసరం. ఇప్పుడు హైకోర్టు న్యాయమూర్తులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న జీవనశైలి ఎట్లాంటిదంటే, పేదల జీవితం సంగతి పక్కన పెట్టండి, వారికి మధ్యతరగతి జీవితంతో సహితం సంబంధం లేదు.

అక్కరలేని పోలీస్ సెక్యూరిటీ ఈ జీవనశైలిలో భాగం. మన రాష్ట్రంలోని సాయుధ పోరాట సంస్థ లేవీ న్యాయమూర్తులను బెదిరించలేదు. చంపుతామనలేదు. వేరే ఎవ్వరి నుండీ వారికి ప్రమాదం లేదు. అయినప్పటికీ జడ్జీలందరికీ పోలీస్ ఎస్కార్ట్ వుంది. పోనీ వాళ్ల వెంటవుండి వాళ్లను కక్షబూనిన కక్షిదారుల నుండి కాపాడతారా అంటే అదేమీ లేదు. వాళ్లు ఇళ్ల దగ్గర వుంటారు. చేయడానికి ఏ పనీ లేని ఈ ఎస్కార్ట్ పోలీసులు ఆ పరిసరాలలో నివసించే ప్రజలను సతాయించిన ఘటనలున్నాయి. ఒక ఖరీదైన అపార్ట్‌మెంట్ బ్లాకులో నివసించే ఒక జడ్జిగారి ఎస్కార్ట్ పోలీసులు ఆ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ భార్యను వేధించిన ఉదంతం పత్రికలకెక్కింది కూడ.

జైలులోని ఖైదీలను విచారణ నిమిత్తం ఎప్పటికప్పుడు కోర్టుకు తీసుకురావడానికి చాలినంత మంది ఎస్కార్ట్ పోలీసులు లేని సంగతి, అందువల్ల నేరవిచారణలో చాలా జాప్యం జరుగుతున్న సంగతి తెలిసిందే. జైలు బయట వున్న వాళ్ల 'ఎస్కార్ట్'కే ఉన్న సిబ్బంది అంతా సరిపోతుంటే జైలు లోపల ఉన్నవాళ్లకు ఎస్కార్ట్ ఎక్కడి నుండి ఇస్తారు? ఈ ప్రశ్న వేరే ఎవ్వరికీ తోచకున్నా న్యాయమూర్తులకు తోచాలి. వాళ్లయినా 'మాకెందుకీ ఎస్కార్టు? ఖైదీలకు కల్పించండి' అని తిప్పి పంపించాలి. కానీ ఆ ఆలోచన హైకోర్టు న్యాయమూర్తులెవ్వరికీ వచ్చినట్టు లేదు.

విలువల పతనాన్ని గురించి అందరూ మాట్లాడుతుంటారు. జడ్జీలు కోర్టు లోపల బయట కూడ మాట్లాడుతుంటాడు. ఈ మాటలలో నిజాయితీ అసలే లేదని అనడం నా ఉద్దేశ్యం కాదుగానీ ఎవరికి వారు తమ జీవనశైలితోనూ, తమ నడవడికతోనూ, తమకు ప్రభుత్వంతో గానీ, విభిన్న సామాజిక వర్గాలతోగానీ వున్న సంబంధాలతోనూ నిమిత్తం లేకుండా తమ మానసిక ఔన్నత్యం వల్ల విలువలు నిలుపుకుంటున్నామనుకుంటే అది అనుమానించవలసిన విషయమే. మానసిక సంకల్పమనేది మనుషులలో వుండదనీ, భౌతిక జీవితమే అన్నిటినీ నిర్ణయిస్తుందనీ నేను సూత్రీకరించడం లేదు గానీ జీవిత అనుభవం, జీవనశైలి ఒక దిశలోనూ విలువలు ఇంకొక దిశలోనూ వుండాలంటే చాలా ప్రత్యేకమైన వ్యక్తిత్వం వుండాలి. అసాధారణమైన ఆత్మావలోకనం కావాలి. అది అందరిలోనూ వుందని నమ్మలేం.

గ్లోబలైజేషన్ మార్గంలో వేగంగా ప్రయాణించాలని ప్రయత్నిస్తున్న మన ప్రభుత్వం అన్ని విషయాలలో ఈ విధానమార్పు 'అనివార్యం' అనీ, అది ఇప్పుడు వీస్తున్నగాలి అనీ, అదే విజ్ఞత అనీ అందరినీ నమ్మించాలని గట్టిప్రయత్నం చేస్తున్నది. సమాజంలో నిర్ణయాత్మక పాత్ర నిర్వహించే అన్నివర్గాలనూ అందుకు సమ్మతించే మానసిక స్థితిలోనికి తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నది. ప్రభుత్వ చర్యల పైన పర్యవేక్షక అధికారం ఏదో ఒక మేరకు వున్న న్యాయమూర్తులు ఈ ఆలోచనా ధోరణికి అనుకూలంగా మారడం ప్రభుత్వానికి అవసరం. వారిని ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు ప్రభుత్వం సహజంగానే చేస్తుంది. న్యాయ నిర్ణయం నిర్భీతిగా నిస్సంకోచంగా చేయాలని తమను తాము తరచూ హెచ్చరించుకునే న్యాయమూర్తులు ఈ విషయం గమనిస్తున్నారా?

*నీహార్ ఆన్‌లైన్.కామ్*

*డిసెంబర్ 2000*



10.06.1952 – 08.10.2009

## మానవహక్కుల వేదిక ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1 | శివమెత్తిన సేన | జనవరి 1999 |
| 2 | ఎండమావి 2020 | మే 1999 |
| 3 | మానవ హక్కులు-1999 (బులెటిన్-1) | నవంబర్ 1999 |
| 4 | మానవ హక్కులు-2000 (బులెటిన్-2) | జూన్ 2000 |
| 5 | మానవ హక్కులు-2001 (బులెటిన్-3) | మార్చి 2001 |
| 6 | యుద్ధ సత్యాలు (బులెటిన్-4) | నవంబర్ 2001 |
| 7 | మానవ హక్కులు-2002 (బులెటిన్-5) | ఏప్రిల్ 2002 |
| 8 | గాంధీ గుజరాత్‌లో గాడ్సే రాజ్యం | జూన్ 2002 |
| 9 | ఎవరిదీ అడవి? | ఫిబ్రవరి 2003 |
| 10 | మానవ హక్కులు-2004 (బులెటిన్-6) | ఫిబ్రవరి 2004 |
| 11 | మణిపూర్ : ఎందుకింత ఆగ్రహం? | డిసెంబర్ 2004 |
| 12 | ఆరుగాలం కరువు | మే 2005 |
| 13 | మానవ హక్కులు-2005 (బులెటిన్-7) | మే 2005 |
| 14 | Death, Displacement & Deprivation: The War in Dantewara: A Report | డిసెంబర్ 2006 |
| 15 | మానవ హక్కులు-2007 (బులెటిన్-8) | మే 2007 |
| 16 | ఆదివాసీ సమాజంలో అంతర్యుద్ధం | మే 2007 |
| 17 | మానవ హక్కులు-2008 (బులెటిన్-9) | డిసెంబర్ 2008 |
| 18 | Kashmir: Will The Pain Never End? | డిసెంబర్ 2008 |
| 19 | మానవ హక్కులు-2009 (బులెటిన్-10) | జూన్ 2009 |
| 20 | సచార్ చెప్పిన సత్యాలు | జూలై 2009 |
| 21 | కంధమాల్ నుండి కరావళి దాకా: ప్రజాస్వామ్యం పైన సంఘ్ పరివార్ దాడి | అక్టోబర్ 2009 |
| 22 | హక్కుల ఉద్యమం-తాత్విక దృక్పథం, కె.బాలగోపాల్ | అక్టోబర్, 2010 |
| 23 | మా బాలగోపాల్ (బులెటిన్-11) | అక్టోబర్ 2010 |
| 24 | మానవ హక్కులు-2011 (బులెటిన్-12) | అక్టోబర్ 2011 |
| 25 | హక్కుల బాటసారి : బుర్ర రాములు రచనలు | అక్టోబర్ 2011 |
| 26 | ఆ శిక్షే ఒక నేరం, కె.బాలగోపాల్ | ఏప్రిల్,2012 |
| 27 | Of capital and other punishments, K. Balagopal | అక్టోబర్, 2012 |
| 28 | The Terrible Cost of an Inhuman Counter-Insurgency | అక్టోబర్ 2013 |

29 మానవ హక్కులు–2013 (బులెటిన్–13) అక్టోబర్ 2013
30 ముస్లిం ఐడెంటిటీ–హిందూత్వ రాజకీయాలు, కె.బాలగోపాల్ 6 డిసెంబర్ 2013
31 చుండూరు: ఒక మారణకాండ తరువాత అక్టోబర్ 2014
32 Tsunduru: An Atrocity and Its aftermath అక్టోబర్ 2014
33 నక్సలిజంపై రాజ్యం అణచివేత :
మూల్యం చెల్లిస్తున్న ఆదివాసులు అక్టోబర్ 2014
34 పాలస్తీనా ప్రజాపోరాటం, కె.బాలగోపాల్ అక్టోబర్ 2014
35 ఆదివాసులు : ఛత్తీస్‌గఢ్, కంధమాల్ పై
వ్యాసాలు, నివేదికలు, కె.బాలగోపాల్ అక్టోబర్ 2015
36 అభివృద్ధి–విధ్వంసం : భూమి, భావజాలం, కోర్టులు,
కోస్టల్ కారిడార్, కె.బాలగోపాల్ అక్టోబర్ 2015
37 విస్థాపన–విధ్వంసం, కె.బాలగోపాల్ అక్టోబర్ 2016
38 మానవహక్కులు–2015 (బులెటిన్–14) అక్టోబర్ 2015
39 విశాఖకు 7వ నెంబరు కాలుష్య హెచ్చరిక అక్టోబర్ 2016
41 సరళీకరణ–విధ్వంసం, కె.బాలగోపాల్ అక్టోబర్ 2017
40 ఎన్నికలు–ప్రజాస్వామ్యం, కె.బాలగోపాల్ అక్టోబర్ 2017
42 మానవ హక్కులు–2017 (బులెటిన్–15) అక్టోబర్ 2017
43 అణుశక్తి–విధ్వంసం, కె.బాలగోపాల్ సెప్టెంబర్ 2018
44 హిందూ మత జాతీయవాద రాజకీయాలు,
జి.శివ నాగేశ్వరరావు సెప్టెంబర్ 2018
45 కరువు–వ్యవసాయ సంబంధాలు, కె.బాలగోపాల్ అక్టోబర్ 2018
46 విజన్–విధ్వంసం, కె. బాలగోపాల్ అక్టోబర్ 2019
47 అణచివేత–అణచివేత చట్టాలు, కె. బాలగోపాల్ డిసెంబర్ 2019
48 అంతర్జాతీయం, కె. బాలగోపాల్
(చరిత్ర–వర్తమానం, ఆధిపత్యాలు–ప్రత్యామ్నాయాలు) అక్టోబర్ 2020
49 మానవహక్కులు –2019 (బులెటిన్–16) అక్టోబర్ 2020
50 మూడు వివాదస్పద వ్యవసాయ చట్టాలు ఫిబ్రవరి 2021
51 హక్కుల ఉద్యమకారిణి జయశ్రీ ఆగస్టు 2021
52 జయశ్రీ... ఇప్పుడొక జ్ఞాపకం జూలై 2022

## ఇతర ప్రచురణకర్తలు వేసిన బాలగోపాల్ పుస్తకాలు

| | | |
|---|---|---|
| 1 | Probings in the political economy of Agrarian Classes and Conflicts | 1988 |
| 2 | కల్లోల కథా చిత్రాలు | నవంబర్ 1997 |
| 3 | రాజ్యం–సంక్షేమం (ఉపన్యాసాలు) | అక్టోబర్ 2010 |
| 4 | దళిత | అక్టోబర్ 2011 |
| 5 | మనిషి మార్క్సిజం | అక్టోబర్ 2012 |
| 6 | రిజర్వేషన్లు: ప్రజాస్వామిక దృక్పథం | అక్టోబర్ 2013 |
| 7 | Leaders Beyond Media Images | డిసెంబర్ 2013 |
| 8 | ఆదివాసులు: వైద్యం, సంస్కృతి, అణచివేత | అక్టోబర్ 2015 |
| 9 | ఆదివాసులు: చట్టాలు, అభివృద్ధి | అక్టోబర్ 2016 |
| 10 | నక్సలైట్ ఉద్యమం వెలుగునీడలు | మే 2017 |

**హైదరాబాద్ బుక్ ట్రస్ట్**

| | | |
|---|---|---|
| 1 | ప్రాచీన భారతదేశ చరిత్ర: డి.డి.కోశాంబి పరిచయం | సెప్టెంబర్, 1986 |
| 2 | కల్లోల లోయ: 50 ఏళ్ల కాశ్మీర్ | జనవరి 2007 |
| 3 | మతతత్వంపై బాలగోపాల్ | అక్టోబర్ 2010 |
| 4 | రూపం–సారం: సాహిత్యంపై బాలగోపాల్ | అక్టోబర్ 2011 |
| 5 | చరిత్ర రచనపై బాలగోపాల్ | జూలై 2015 |
| 6 | సైన్సు వ్యాసాలు | సెప్టెంబర్ 2015 |
| 7 | కశ్మీర్ పై బాలగోపాల్ | అక్టోబర్, 2016 |

**దేవులపల్లి పబ్లికేషన్స్**

| | | |
|---|---|---|
| 1 | నిగాహ్–I | ఏప్రిల్ 2011 |
| 2 | నిగాహ్–II | అక్టోబర్ 2014 |

**మట్టి ముద్రణలు**

| | | |
|---|---|---|
| 1 | జలపాతాలు | జులై–2013 |
| 2 | కొన్ని తెలంగాణ వ్యాసాలు | అక్టోబర్ 2016 |

**క్రిటికల్ క్వెస్ట్**

| | | |
|---|---|---|
| 1 | Reservations: A Socio-Legal perspective | 2010 |

**నవయాన ప్రచురణ**

| | | |
|---|---|---|
| 1 | Ear to the Ground: Selected writings on class and caste | 2011 |



భారత రాజ్యాంగానికొక రాజకీయ నేపథ్యం ఉంది. సామాజిక జీవితంలోని అన్ని పార్శ్వాలనూ ఏదో ఒక మేరకు స్పృశించిన పోరాటాలు రాజ్యాంగానికి స్ఫూర్తినిచ్చాయి. ఎన్ని లోపాలతోనయినప్పటికీ ఆ స్ఫూర్తి రాజ్యాంగంలో కనిపిస్తుంది. మన న్యాయవ్యవస్థ దానికి నిండయిన అర్థం ఇవ్వడంలో విఫలమయిందనే చెప్పాలి. రాజ్యాంగ పీఠిక, ఆదేశిక సూత్రాలు దేశం గమ్యాన్ని సూచిస్తాయనీ, రాజ్యాంగంలోని హక్కులు, ప్రజాస్వామ్య వ్యవస్థ దానికి సాధనమనీ రాజ్యాంగకర్తలే అన్నారు. ఆ స్ఫూర్తితో రాజ్యాంగానికీ, చట్టాలకూ అర్థం కల్పించే న్యాయసిద్ధాంతాన్ని భారత న్యాయవ్యవస్థ అభివృద్ధి చేయలేకపోయింది. ఈ వైఫల్యాన్ని కొంత మేరకైనా అధిగమించడానికి 1980లలో జరిగిన ప్రయత్నానికి గండికొట్టడం 1990లలో మొదలయింది. 'గ్లోబలైజేషన్' ప్రభావం పెరిగే కొద్దీ ఈ తిరోగమనం కూడ బలం పుంజుకుంటున్నది.

ఇది కాకతాళీయం కాదు. 'గ్లోబలైజేషన్' పట్ల మన సమాజంలో కులమూ డబ్బూ గలవాళ్లలో అధికభాగం అనుకూలంగా ఉన్నారు. న్యాయమూర్తులు అందులో భాగమే. రాజ్యాంగానికి స్ఫూర్తినిచ్చిన సమతా సంక్షేమ ఆకాంక్షలను ఈ కోవకు చెందినవారంతా ఈ రోజొక బరువుగా భావిస్తున్నారు. ఆ బరువును ఎంత తొందరగా దించుకుంటే అంత వేగంగా దేశం 'అభివృద్ధి' వైపు ప్రయాణిస్తుందని నమ్ముతున్నారు.

**కె. బాలగోపాల్**



₹ 250/-